UNIVERSAL
LIBRARY

OU_204297

UNIVERSAL
LIBRARY

శ్రీమదాంధ్రభాగవతము.

రెండవ భాగము.

శ్రీకృష్ణాయపరబ్రహ్మణే నమః.

అఖిలకలికల్మషాపహారంబగు

శ్రీమదాభాగవతము

ఆంధ్రవచనము.

రెండవభాగము.

బ్రహ్మశ్రీ కేతవరపు-వేంకటశాస్త్రిగారిచే

బ్రకటితము.

శ్రీదేవరాజసుధీపరిశోధితము.

ఆనంద ముద్రణాలయమున ముద్రితము.

ఆర్. వేంకటేశ్వర్ అండ్ కంపెనీవారిచే

బ్రకటితము.

1924

(Copyright Registered.)

కాపీరైట్ 1913 వ సంవత్సరంలో ఆంధ్ర కేంద్ర టెక్స్ట్ బుక్ కమిటీ వారు కాపీరైట్ దార్లు. ఈ పుస్తకమును ఇండియా కాపీరైట్ చేతను సర్వ దేశీయపు కాపీరైట్ చేతను సురక్షితమైనది. ఎవరు గాని యీ పుస్తకమును సంపూర్ణముగాగాని లేక యిందొక భాగమునుగాని తమ సొంతగా ప్రచురించుటకును, మఱి యొకరి ద్వారను ప్రచురణ చేసి ప్రయోజకులకు నిచ్చుటకును, హక్కు ఇయ్యబడదు. ఇందులో గల పదములనుగాని భావములనుగాని వాక్యములను ఏమాత్రమైనను కాపీచేసినయెడల అది కాపీరైటును ఉల్లంఘించుటయే యగును. కనుక కాపీరైటును ఏవిధముగ నుల్లంఘించినవారును దానివాకు లోనగుదురని దీనిచే తెలియనగును.

శ్రీమదాంధ్రభాగవతము.

ద్వితీయభాగము.

విషయసూచిక.

	పుట.
ద్వితీయస్కంధము.	277
విదురుఁడు మైత్రేయుఁ గృష్ణాదులవృత్తాంతము లడుగుట ...	283
ఊద్ధవుఁడు విదురుఁకుఁ గృష్ణనిర్యాణమును దెప్పుట ...	289
ఊద్ధవుఁడు మధురాపురమునఁ గృష్ణుఁ డొనర్చినచర్యల నుడువుట	295
విదురమైత్రేయ సంవాదము	305
విదురుఁడు మైత్రేయుని నానావిధప్రశ్నము లడుగుట ...	336
బ్రహ్మ సృష్టిసంభవుని నుతించుట	345
నారాయణుండు బ్రహ్మకు వరంబిచ్చి యంతర్ధానమొందుట ...	354
మైత్రేయుండు విదురునకుఁ గాలపరిమాణమును దెప్పుట ...	364
మైత్రేయుండు విదురునకుఁ బ్రళయముగాదుల పరిమాణంబును దెప్పుట.	366
మైత్రేయుండు విదురునకుఁ జతుర్ముఖసృష్టులను దెలుపుట ...	370
స్వాయంభువుండు ప్రజావృద్ధి చేయుట	379
నారి వరాహావతార మెత్తుట	381
వరాహుఁడు భూమిని ప్రళయాంభోరాశిలోఁ నుద్ధరించుట ...	382
బ్రహ్మాదులు వరాహుని నుతించుట	383
మైత్రేయుఁడు విదురునకు హిరణ్యాక్షహిరణ్యకశిపులజననం బెఱింగించుట.	387
దితి సంతానాభిలాషతోఁ గశ్యపుని జేరఁబోయి ప్రార్థించుట...	388
కశ్యపుఁడు భార్యకు హితోపదేశము చేయుట	389
కశ్యపుఁడు దితికి రుద్రప్రభావమును దెలుపుట	391
సురలు బ్రహ్మతో మొఱ పెట్టుకొనుట	396
బ్రహ్మ సురలతో వైకుంఠభవనప్రభావమును దెప్పుట ...	398

పుట.

సనకాదులు వైకుంఠమును ప్రవేశించుట 401

జయవిజయులు సనకాదుల నడ్డగించుట, సనకాదులువారికి శాపమిచ్చుట. 402

సనకాదు లున్న ద్వారముచెంతకు విష్ణు వరుదెంచుట ... 408

సనకాదులు విష్ణువును నుతించుట 410

విష్ణువు బ్రాహ్మణప్రశంసచేయుట 412

హిరణ్యాక్ష హిరణ్యకశిపుల జననము 419

హిరణ్యాక్షుండు వరుణలోకంబున కేగుట 422

హిరణ్యాక్షుండు యజ్ఞవరాహము నెదుర్కొని యుద్ధముచేయుట. 424

మైత్రేయుండు విదురునికిఁ జతుర్ముఖుం డొనర్చు యక్షదిదేవతాగణ
సృష్టిని దెలుపుట 436

నారాయణుండు కర్దమునకుఁ బ్రత్యక్షమగుట 442

నారాయణుఁడు కర్దమునికి వరంబు లొసంగుట 447

స్వాయంభువమనువు కర్దమాశ్రమంబున కేగుట 450

స్వాయంభువమనువు తనకుమారి యగుదేవహూతిఁ గర్దమునకిచ్చి పెండ్లి
చేయుట 456

కర్దముండు యోగమహిమచే విమానంబు గల్పించుకొని భార్యతోఁ
గూడ విహరించుట 458

భగవంతుండు దేవహూతికిఁ గపిలాచార్యుండై యుదయించుట 468

కపిలదేవహూతి సంవాదప్రారంభము 474

కపిలుఁడు తల్లికి నాత్మస్వరూపంబును దెప్పుట 484

జీవునికిఁ గలిగినప్రకృతిసంబంధమును నిరూపించుట 487

కపిలుండు దేవహూతికి భక్తిమార్గమును తెలియఁజేయుట ... 523

కపిలుండు దేవహూతికిఁ బిండోత్పత్తిక్రమము దెలుపుట ... 535

చతుర్థస్కంధము.

కర్దమప్రజాపతిసంతతిని దెలుపుట 564

అత్రిమహామునికి బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ప్రత్యక్షమగుట ... 566.

పుట.

దక్షప్రజాపతిసంతతిని దెలుపుట 569

బహ్మాదులు నరనారాయణుల నుతించుట ... 570

ఈశ్వరునికి దక్షునకు విరోధము సంభవించినకథ... ... 572

సతీదేవి దక్షునియాగమును జూడరమ్మని శంకరునిఁ గోరుట .. 580

శంకరుఁడు సతీదేవిని దక్షునియాగవాటికకుఁ బోవలదనిచెప్పుట .. 582

సతీదేవి దక్షుఁడు చేయుచున్నయజ్ఞమును జూడఁబోవుట ... 586

సతీదేవి దక్షుని నిందించుట 590

సతీదేవి యోగాగ్నికల్పించుకొని ప్రాణంబులు విడుచుట ... 594

శంకరుఁడు తనజటను నేలనుగొట్టి వీరభద్రునిఁ బుట్టించుట... 596

మహేశ్వరుండు వీరభద్రునిచే దక్షాధ్వరధ్వంసము చేయించుట 597

వీరభద్రాదులు దక్షాధ్వరమును ధ్వంసముచేయుట. ... 598

బ్రహ్మాదులు దక్షకృతాస్తుతిరూపుఁడగు నీశ్వరుని నుతించుట... 606

శివుండు దక్షాదుల ననుగ్రహించుట 608

శంకరుని దక్షుఁడు నుతించుట 609

నారాయణుండు దక్షాధ్వరంబునకు వచ్చుట 611

పటముల పట్టిక.

క్షీరార్ణవశాయియైన శ్రీమహావిష్ణువును బ్రహ్మ స్తోత్ర
ము చేయుట 346

వరాహరూపియైన భగవంతుఁడు భూమిం సముద్రము
నుండి పైకెత్తుట 382

శ్రీవైకుంఠ వర్ణనము 398

శ్రీవైకుంఠమును నభివేశింపనీక యడ్డగించు ద్వారపాల
కులను సనకసనందనాదులు కొట్టివేయుట; శ్రీ
హరి వచ్చుట 403

వరాహరూపియైన భగవంతుఁడు హిరణ్యాక్షుఁడు ద్రవ్వు
ట; దేవతలు ఆకసమునుండి పుష్పవర్షమును
కురిపించుట 432

శ్రీమహావిష్ణువు బ్రహ్మరుద్రులు అత్రిమహాముని బ్ర
త్యక్షమగుట 566

సత్త్రయాగమునకు వచ్చిన దేవతలు ఒకొనిజూచి లేచి
నమస్కరించుట; తనకు నమస్కరింపని శివుని
జూచి దక్షుఁడు ధిక్కరించుట 573



శుభమస్తు.

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

శ్రీమదాంధ్ర భాగవతము.

తృతీయస్కంధము.

ఓశౌనకమునీంద్రా! ప్రాయోపవిష్టుండయిన రాజునకు శుకయోగీంద్రుం డిట్లనియె. 'ఓరాజా ! మంత్రకర్తయు యమాంశసంభూతుఁడునగు విదురుఁడు సకలసంపదలతోఁ దులదూఁగుతన మందిరమును విడిచి వనమునఁ బ్రవేశించి యొక్కచో మైత్రేయుఁ జూచి సద్భక్తితో నతని పాదపద్మములకు నమస్కరించి యతని యనుమతిచొప్పునఁ గూర్చుండి యతని కిట్లనియె.' అనిచెప్పుచున్నమునీంద్రుం జూచి, "అయ్యా!విదురుఁడు మైత్రేయమహాముని నెచ్చట గలిసికొనెను? మఱియు విదురమైత్రేయుల కెప్పుడు సంవాదముజరిగెను?ఇదియునుంగాక భగవదర్పితచిత్తుండయిన విదురుండు మైత్రేయునడిగిన ప్రశ్నములు సచ్చరిత్రముతోఁ దులదూఁగుచు నమితప్రయోజనదాయకములయి యుండును గాని సాధారణప్రయోజనముకలిగిననయి యుండవు.కావున వానిని నేను దప్పక వినవలసియున్నది.నాయం దనుగ్రహముంచి వచింపుమని యడిగెను. ఇట్లు నరేంద్రుఁడడిగిన ప్రశ్నమ్ము విని సంతసించి మిగుల వివేకశాలియగు యోగీంద్రుఁ డిట్లు వక్కాణించె. పూర్వము

ధృతరాష్ట్రుఁడు దుర్మార్గు లయినతనతనయుల నెంతమాత్రము శిక్షింపక, తమతండ్రియగు పాండుమహారాజు మరణించుటచే దిక్కులేక తన్నుఁ జేరవచ్చిన ధర్మరాజాదులఁ గరుణించి చేరఁదీయక,తనకుమారుని యుపదేశంబున వారల లక్కయింట్లం బ్రవేశింపఁజేసి యామందిరంబులఁ గాల్పించె. మఱియు నాఁడు పతివ్రతయగు ద్రౌపదీదేవి ధర్మిల్లను చేతఁబట్టికొని దుర్మార్గుఁడయిన దుశ్శాసనుఁడు సభామధ్యమున కీడ్చితెచ్చి కట్టువస్త్రంబుల నొలుచుచుంటచే నాపరమసాధ్వి కన్నీటిచేఁ గుచకుంకుమము తొలఁగునట్లు మిగుల దుఃఖింపుచుండఁ జూచియు నాగ్రుడ్డిరాజు తనకుమారుని వారించినాఁడు కాఁడు. తరువాతఁ గపటద్యూతంబునఁ బరాజితుండును, సత్యసంధుండు నగు ధర్మరాజు తనభార్యతోను, సోదరులతోను, వనవాసంబుచేసి, యజ్ఞాతవాసనత్సరంబు కడపి, వచ్చి "మాతండ్రిపాలిమ్మ"ని యాచింపఁ దమోగుణప్రధానుఁడగు నాధృతరాష్ట్రుం డిచ్చుటకిష్టపడలేదు. అంతటఁ బాండుతనయులు చేయునది లేక తమహితుఁడయిన శ్రీకృష్ణుని రాయబారిగఁ బంపిరి. భగవంతుఁడగు శ్రీకృష్ణుఁడు వారిమాట నతిక్రమింపలేక హస్తినాపురమునకు వచ్చి సభామధ్యమందుఁ దనలోలుకుఁబలుకులు నెలుక వానికి భీష్మాదులు సంతసించిరికాని దుష్టుఁడయినధృతరాష్ట్రుఁడు విని సంతసింపలేదు. మఱియు నతం డీకార్యమునిమిత్తమాలోచించుటకయి విదురునిఁ బిలిపించినందున నతండు ధృతరాష్ట్రుని మందిరమునకుఁ బోయెను. అంత నాగ్రుడ్డిరాజు విదురునిఁగూర్చుండు మని నియోగించి యతని కీకార్యసరణిని దెలియఁజేసి నీయభిప్రాయంబు తెలుపుమనుడు మంత్రివిదులలోను త్తముఁడగు విదురుం డిట్లనియె. "ఓరాజా! నీయుపేక్షచే నీ

కుమారులు ధర్మరాజాదుల కొనరించినయపరాధములకు లెక్క లేదుగదా! అవియన్నియుఁ బ్రాణాపాయము గలిగించునవియె. అయినను ధర్మరాజు మిగుల శాంతుఁడు కనుక వాని నన్నింటిని సహించి యించుకంతయినకోపంబులేక మాతండ్రిపాలిమ్మనియాచించుచుండ నీయకుండుట యుక్తముకాదు. కావున నతనికి రాజ్యంబు పంచి యిమ్ము. నీవట్లు పంచియెట్టనిచో నీశాసనయులపేరు విన్నంతమాత్రనే నడుమఁ ద్రొక్కఁబడిన నాగుఁబామువలెఁ గోపంబున రోజుచున్నభీముసివలన నీతనయులు చచ్చుట సిద్ధంబు. ఈవిషయముఁగూర్చి నేను వెరుకనే చెప్పియున్నాను. నీకొడుకు లెంతబలసంతులయినను దైవబలంబులేనిచో వీరందఱు గడ్డిపోచలవంటివారే యని నీ వెఱుఁగుదువుకదా? అట్టిదైవబలము మీకులేదు. కాని పాండవులకుఁ గలదు. భగవంతుఁడయిన శ్రీకృష్ణుఁడు పాండవులయందు దయగలవాఁడయి* "మమప్రాణాహి పాండవాఃʼʼ అనిపలుకుచు వారిల కెట్టియిడుమలు పొడమనీయక వర్తించుచున్నాఁడు. ఆభగవంతు ననలంబించియుండఁ బాండవులకు జయము గలుగుటకు నేమి లోపమున్నది? మఱియు శ్రీకృష్ణుఁడు బలపరాక్రమశాలులయిన యాదవులకెల్లరకు నధిపతి. ఆమహాత్ముఁడు దిగ్విజేత లని ప్రసిద్ధికెక్కినరాజులందఱికిఁ బ్రభువయి తనయాజ్ఞలో మెలంగునట్లు చేయుచున్నాఁడు. అట్టిశ్రీకృష్ణుఁడు పాండవులకు బంధువై, హితుఁడై, సహాయుఁడైయున్నాఁడు. ఇట్లు పౌరుషబలము దైవబలము గలిగినపాండవులు జయముపొందుట కెంతమాత్రను సందియము లేదు. నీకుమారు

* మమప్రాణాహి పాండవాఃఅనఁగా పాండవాఃపాండవులు, మమనాయొక్క, ప్రాణాహిప్రాణములుగదా? అని యర్థము.

నకుఁ బౌరుషబలము లేదు. దైవబలము లేదు. దైవము దయకుఁ బాత్రుఁడు కాలేదు. గాని కోపమునకుఁ బాత్రుఁడయి యున్నాఁడు. భగవద్విరోధి యగు మానవుఁడు తాఁజచ్చుటయే కాక కులమునం తను నశింపఁ జేయును. గారాబుపుత్రుఁడను భ్రాంతిచే నీచేఁబో షింపఁబడుచున్న దుర్యోధనుఁ డమర్త్యరూపమునొందిన నీపుత్రాకృతపాపపుంజ మని యెఱుంగుము. వానివలనఁ గులంబునకుఁ దప్పక హానివచ్చును. కావున దురాత్ముఁడయిన దుర్యోధనుని దూరముగాఁ దలఁపు. నీకులమును రక్షించికొనుము. అయ్యా! కన్నకుమారు నెట్లు విడువఁగలనందువేమో? అట్లూహించుట పొరపాటు * "త్యజే దేకం కులస్యార్థే" అనిచెప్పుచున్న పండితులు బుద్ధిహీనులుకారు. తమవంశక్షేమముకొఱకు దురాత్ముఁడయిన యొక్కకుమారుని విడిచిపెట్టుట యొకలోపము కాదు." అనిపలుకుచున్న విదురుని వాక్యములు విని దుర్యోధనుఁడు క్రోధంబునఁ బెదవు లదరుచుండఁ దనయొద్ద నున్నదుశ్శాసన కర్ణాదులు వినుచుండ సాధుశీలుఁ డయినవిదురునిఁ దిరస్కరించుచు నిట్లు పలికెను. "ఓయీ! దానీకుమారుఁడవయిన నిన్ను నిచ్చటికెవ్వరు పిలిచినారు? నీవంటికుటిలాత్ముఁడు లోకమందుఁ బుట్టఁడు. మాయన్న మెల్లప్పుడు కడుపునిండ మెక్కుచుఁ దిరిగి మాకేప్రతికూలముగా మాట్లాడుచు మాకషాయము గలుగుటకయి చూచుచుందువు. "తిన్నయింటికే కన్నము లు త్రవ్వు" నన్న నామెతయిక్కడఁ బనికివచ్చినది. నీ వెప్పుడును మాశత్రువులకార్యములు నెఱవేర్చుటయందుఁ బరుఁడవయియుంటచే నీవును మాకు శత్రువ

* "త్యజేదేకం కులస్యార్థే" అనఁగా-కులస్యార్థే=కులమును రక్షించుటకోఱకు, ఏకం=ఒక్కని, త్యజేత్=తప్పక విడువవలెనని యర్థము.

వే. దానీపుత్రుడవయినను మాతండ్రి యేదో గౌరవించుచున్నాఁడని యుపేక్షించుచుండగాఁగన్నులు తలకెక్కినవి. అందుచే నీవు క్రిందుమీదును జూడక నోరికివచ్చినట్లు ప్రేలుచున్నావు. నీవంటి వాఁడుండిన మాకంటఱుకు జేటుమూడుట సిద్ధంబు. కావున నీకు మీఁద నీవిచ్చట నుండ వలనుపడదు. మాపురంబు విడిచి నీకిష్టమువచ్చినచోటికిఁ బొమ్ము'' అని ఇట్లుపలికిన దుర్యోధనుని పలుకులు చెవులకు ములుకులవలె నాటినఁ గటకటంబడి, విదురుండు సజ్జనుండు కావున వచ్చిన కోపంబు నడఁచికొని, మాఱుపలుకు నిష్టపడక తనచేత నున్నధనుర్బాణంబుల విడిచి దుర్యోధనుని మాటలకు సుశ్రేణియు విచారముచెందక భగవన్మహిమసామర్థ్యము నెన్నికొనుచుఁ బురము వెడలి పోయెను. విదురుండు హస్తినాపురమునుండి తీర్థయాత్రలకై బయలువెడలుట కిదియే కారణము. అట్లు విదురుండు హస్తినాపురమును విడిచి విష్ణుమూర్తికి నివాసభూతము లయినపుణ్యక్షేత్రములఁ ద్రొక్కి పుణ్య మార్జించుకోవలెనను బుద్ధితో బయలువెడలి, పరిశుద్ధమయిన చిత్తవృత్తి గలవాఁడయి, బ్రశస్తమయిన పూవుందోఁటలచేతను, గ్రీడాపర్వతములచేతను, బొదరిండ్లచేతను, నొప్పుచున్నపురములను, నిర్మలోదక ప్రవాహములతో విలసిల్లు నదులను, భగవంతునిమూర్తులచేఁ బ్రకాశించుచున్నపుణ్యక్షేత్రములను, జూచుచు నవ్యభిచరితమగు భగవద్భక్తియోగమందుఁ బరాయణుఁడయి తిరుగుచుండెను. ఇట్లు విదురుండు భూమండలమునఁ దిరుగుచుఁ బవిత్రమయిన జీవనవృత్తి గలవాఁడయి, గానవచ్చుప్రతితీర్థంబునందును దానమాడుచుఁ గటికినేలఁ బండుకొనుచు, వల్కలాజినములను, జటలను, ధరించి యెవ్వరికిని దెలి

యఁబడక వారికిఁ బ్రీతిగలుగు వ్రతముల నాచరించుచు సభ్యం
జనాదిదేహసంస్కారముల విడిచి భరతవర్షమునం దంతటఁ గ్రు
మ్మరెను. ఇట్లు గొంతకాలంబు సన్నపిమ్మట నతఁడు, కృష్ణునిదయా
రసమువలనఁ బొందఁబడిన భూమండలమును ధర్మరా జేకాతప
త్రముగా నేలుచుండెననియు, రెండువెదుళ్లవలన జనించినయగ్ని
వలన వనమంతయు దహింపఁబడినచందంబునఁ గురుపాండవు
లకు జనించిన విరోధంబునంజేసి సమస్తరాజకులములతోఁ గూ
డఁ గురువంశము నాశనము చెందెననియు, నాలకించి మిగుల వి
చారించుచు నచ్చటనుండి పశ్చిమాభిముఖముగా సరస్వతీన
దినిగుఱించి పోయి, యచ్చట నున్నపదునొకండుతీర్థములయందు
భక్తితోఁ గ్రుంకులువెట్టుచు నాయాస్థలంబులందున్నవిష్ణువు
మందిరంబులం బ్రవేశించెను. అవి ఋషినిర్మితములును, దేవ
నిర్మితములు, నయి యుండె. ఆయాలయముల యగ్రములయం
దు విష్ణువునకుఁ బ్రధానాయుధ మయినచక్రము ప్రకాశించు
చుండెను. అందుచే వానిని జూచునప్పుడెల్ల నవి విష్ణువును స్మరిం
పఁ జేయుచుండెను. అట్టి దేవాలయములను బ్రవేశించి భక్తియు
క్తుఁడయి తనుస్మరించి విదురుం డాస్థలమును విడిచి, సకలసంపద
లతోఁ దులదూఁగుచున్న సౌరాష్ట్రదేశము చొచ్చి, యచ్చటివిశే
షము లరసి, యచ్చటనుండి మత్స్యదేశములకుఁ బోయి, వానిని
వీక్షించుచు, నట నదలి కురుజాంగలాదిదేశములం జొరఁబడి పో
వుచుఁ, గొంతకాలమునకు యమునానదీతీరమునుజేరి, యచ్చట
వాసుదేవునియనుచరుఁడును, బుద్ధిమంతుండును, బృహస్పతికి
శిష్యుండును, బరమభాగవతోత్తముఁడు, నగు నుద్ధవునిఁజూచి సం
తసముతోఁ డాయంజని యతనిఁ గౌఁగిలించుకొని తనకు బంధువు

లగు కృష్ణాదుల క్షేమాదంతము గనుఁగొనఁ దలంపుగలవాఁడయి యతని కిట్లనియె.

విదురుఁ డుద్ధవునిఁ గృష్ణాదులవృత్తాంతము లడుగుట.

ఓమిత్రమా! చిరకాలంబునకు నిన్నుఁ జూడఁగంటిని. నీదర్శన లాభముచే నమితానందమును జెందుచున్నాను. మఱియు బల రామకృష్ణులిరువురు పురాణపురుషులుకాని సామాన్యులుకారు. వాఁడు బ్రహ్మప్రార్థనమంగీకరించి భూభారమును హరింపఁగా నిం దనతరించినమహాత్ములు. వారిరువురు కుశలముతోఁ బ్రవర్తిం చుచున్నారా? మఱియు వారలు చేయవలసినకార్యము లన్ని యు ముగించి యున్నారు. వారు చేయనలసినకార్యమేదియు లేదు. వారు సుఖముగా నసుదేవునిగృహమునఁ గుశలులై యున్నా రా? వసుదేవుఁడు సకలసంభూతులలమగు మాకందఱికిఁ బ్రా ణస్నేహితుఁడు అతఁడు నాకు బావమఱఁది యని కూడఁ జెప్ప నచ్చును. అతఁడు తనతోఁబుట్టువులచుల నధికగౌరవముతోఁ జూచుచు, వారికిని వారిసుతులకు నభీష్టములగు వస్తువులనెల్ల ని చ్చుచుఁ గన్నతండ్రివలెనే యాదరించుచున్నాఁడు. అట్టిమహా నుభావుఁడగుట వసుదేవునకు సేమమా? ప్రద్యుమ్నుఁడు పూ ర్వజన్మమందు మన్మథుఁడేకదా? రుక్మిణీదేవి బ్రాహ్మణుల నా రాధించి వారియనుగ్రహముకొంది యామన్మథుని భగవంతు నివలనఁ గుమారునిగాఁ బడసినది. యాదవసైన్యములెల్ల యు ద్ధములందు నడపునాఁ డాప్రద్యుమ్నుఁడే. అతఁడు మహారథ్రే మశాలియని చెప్పఁదగినవాఁడు.అట్టివీరుఁడయిన ప్రద్యుమ్నుఁడు క్షేమముతోఁ నున్నాఁడా? మఱియు నుగ్రసేనుఁడు యాదవుల కును, వృష్ణులకును, భోజులకును, దాశార్హులకు, నధిపతి యయి

వారివారిని వారివారిధర్మములయందుఁ బ్రవర్తించునట్లు చేయుచుండును. అతనియందుఁ గృష్ణునకిఁ జెప్పలేనంతి ప్రేమమున్నది. కావునఁ నే శ్రీకృష్ణుఁడు దా నధికశక్తియుతుండయినను రాజ్యమేలుట కిష్టపడక యుగ్రసేనునకుఁ బట్టాభిషేకము చేసినాఁడు. ఉగ్రసేనుఁడుకూడ మహామహుఁడుకాని సాధారణుండు కాఁడు. అట్టియుగ్రసేనునకు సేమమా? ఓయుద్ధవా? సాంబుఁడు రథికులలోనెల్ల నగ్రేసరుఁడని చెప్పఁదగినవాఁడు.అతఁడిం చుమించుగా శ్రీకృష్ణుని కెనవచ్చునాఁడు.ఆజాంబవతీదేవి పెక్కు వ్రతముల నాచరించి పూర్వము పార్వతీదేవికిన్నపట్టియగు కుమారస్వామినిఁ గుమారునిగాఁ బడసినది. పెక్కేల?కుమారస్వామియవతారమే యీసాంబుఁడని చెప్పవచ్చును. అట్టిసాంబునకు సేమమా? శ్రీకృష్ణుని సహోదరుఁడగు నాత్యకి యసామాన్యపురుషులలో నొకఁడని చెప్పవచ్చును. అతఁడర్జునునివలన ధనుర్విద్యారహస్యములనెల్ల నేర్చినాఁడు. మఱియు నతఁడెల్లకాలమును లందు భగవంతుఁడగు కృష్ణుని సేవచేయుచు నతనిదయకుఁ బాత్రుఁడయి యతీశ్వరులచేతనైనఁ బొందశక్యముకానియుత్తమగతిని సుఖముగానే పొందఁదగియున్నాఁడు. అట్టినాత్యకిసేమముతోనున్నాఁడా?అక్రూరుఁడు భక్తాగ్రేసరులలోనొకఁడని చెప్పనెచ్చును. అతఁడు మిగుల వివేకవంతుఁడు. అతఁడు పాపరహితుఁడని చెప్పుటకు సందియమెంతమాత్రము లేదు.అతఁడు భగవంతునియందు మిగులఁ బ్రపత్తికలవాఁడు. అతఁడు విష్ణుపాదములచేఁ జనితమయిన మార్గమును జూచుటయందధికప్రేమ కలవాఁడయి తాదృశప్రేమాతిశయముచే ధైర్యరహితుండయి వర్తిలుచుండును.అట్టియక్రూరునకు సేమమా? దేవకీదేవి పరమపతివ్రతలలోనొ

కతి యని చెప్పనచ్చును. ఆమె శ్రుతి యాగగూఢార్థమును దా
ల్చినట్లుగా భగవంతునిఁ దనగర్భమందు ధరించినది. అట్టిదేనకీ
దేవి యదితివలెనే కుశలముతో నర్తిలుచున్నదా? ఓ మహా
త్మా! అనిరుద్ధుఁడు మహానుభావుఁడనియు భగవంతుఁడనియుఁ
జెప్పవచ్చును. అతఁడు మీవంటి భక్తులకోర్కుల నెఱవేర్చు
వాఁడు. అతఁడు శాస్త్రము ప్రమాణముగాఁ గలవాఁడు. అ
తని భగవంతునిచతుర్థాంశమునుగాఁ జెప్పుదురు. అతఁడు యో
గపరిశుద్ధమయిన మనస్సునకేగాని లౌకికప్రమాణములకు గో
చరుండు కాఁడు. అట్టియనిరుద్ధునకు నేమమా? శ్రీకృష్ణుఁ డెల్ల
ప్పుడు దైవముగాను, నధిపతిగాను, జలంచుచు నితరుల నా
రాధింప నొల్లక ప్రవర్తించుచున్నహృదికుఁడు, గదుఁడు, మొద
లుఁ గూడనకుమారులందఱు నేమముతోఁ నున్నారా? ఓమ
హాత్మా! పసగు భుజములతో సమానులైన కృష్ణార్జునులచే సం
పాలింపఁబడినరాజ్యంబునంతటిఁ బ్రపయత్నంబు గావించు
కొని ధర్మరాజు మోదముతోఁ బ్రజలను ధర్మము తప్పకుండఁ
బరిపాలించున్నాఁడా? మఱియు దుర్యోధనుఁడు కిరీటిసామర్థ్య
మును జూచి యతనికే విజయము కలుగుననియు నందుచే సా
మ్రాజ్యలక్ష్మియు నతనినే సొందుననియు మిగుల విచారించు
చుండువాఁడు. వాఁడనుమానించుచున్నట్లుగానే యయినదిక
దా? కృతాపరాధులయిన దుర్యోధనాదులపై రుచ్చరించినమా
త్రమననే భీముఁడు నల్లఁ ద్రాచువలె మహాకోపముతోఁ బ్ర
వర్తించుచుండువాఁడు. యుద్ధరంగమునం దతివిచిత్రముగఁ దన
గదాదండమును ద్రిప్పుచుఁ దనపాదఘాతములను భూమి సహిం
పలేక యుండునట్లు యుద్ధముచేసి కురుకుమారుల నందఱిం గడ

తేర్చినాఁడు.ఇప్పుఁడయిన నాభీముఁ డాక్రోధమును విడిచి సేమ ముతో నున్నాఁడా? తనశరసమూహముచే మాయాకిరాతవే షము ధరించినయీశ్వరుని సంతసింపఁజేసి యతనివలనఁ బాశు పతమును గొనియున్న యుగ్జనుండు తనశత్రువుల నందఱ ను జయించి కీర్తులతోఁ బ్రనర్తించుచున్నాఁడా?నకుల సహాదే వులు కుంతీదేవికి ముద్దుకుమారులు. వారు,నేత్రములు కనుఱె ప్పలచే, రక్షింపఁబడుచున్నట్లు ధర్మజభీమార్జునులచే రక్షింపఁ బడుచున్నారు. అట్టి మహానుభావులగు నకులసహాదేవులు శత్రు వులఁ జంపి గరుత్మంతుఁడు స్వర్గమునుండి యమృతమును గొనివ చ్చినట్లు శత్రుధనములను గొనివచ్చుచు నేమముతోనున్నారా? పాండుమహారా జతిరథశ్రేష్ఠుఁడని వాసిచెంది యసహాయుఁడ యి చాపంబుఁబూని పోయి నలుదిక్కులను జయించి యమితం బగు ధనంబును యశంబును జెందెను. అట్టిమహానుభావుండును తనకువల్లభుండు నగు నతఁడు ప్రాణములు విడిచిపోవుచున్న ప్పుడు కుంతీదేవియు సహగమనంబుచేయ నిశ్చయించుకొని తనపుత్త్రులు దిక్కులేనివా రగుదు రన్నతలంపుతో నా యుద్యమంబు మానివేసినది. అట్టి కుంతీదేవికి నేమమే కదా? ఓయుద్ధవా ! పరలోకమును బొందినపాండురాజుకుమారులను జక్కనిప్రేమతోఁ జేరదీసి పెంచుట ధృతరాష్ట్రుని కర్తవ్యకృత్య ము. అట్లుండ నాగ్రుడ్డిరాజు న్యాయాన్యాయంబులు పరికింపక రాజ్యం బిచ్చుట కంగీకరింపక ధర్మరాజాదులకు ద్రోహముచేసి యున్నాఁడు. ఇట్టి భ్రాతృద్రోహి యధోగతిపాలు కాక మాను నా?మఱియు నే నతనికి బాంధవుఁడను; మిత్రుఁడను. అయినను హితోపదేశముచేసితి నన్న హేతువుచేతఁ గోపించి పుత్త్రాను

సారియయి ధృతరాష్ట్రుండు నన్నుఁ బురంబునుండి వెడలఁగొట్టి నాఁడు. దుర్యోధనుఁడు దుర్మార్గుఁడు. అతనివలనఁ గులము నశించిపోవుచున్న దని యోజింపలేదు అతఁడు దుర్యోధనునిమాటలు విని వాని ననుసరించుచుండెను. అందుచేతనే యింతమట్టు వచ్చినది. అతనియుదంతమును గూర్చి మిగుల విచారించుచున్నాను. అట్లు ధృతరాష్ట్రునిచే వెడలఁగొట్టఁబడి నేను శ్రీకృష్ణుండు మానవరూపుఁడయి యుండుటచే సమస్తమానవులను భ్రమింపఁజేయుచు జగన్నియంతయై యున్నవాఁడని యెఱిఁగి యతనిదయకుఁ బాత్రుండనై యతనికి విభూతియయిన జగంబును వీక్షించుచు నాశ్చర్యములను దొలంగించుకొనుచుఁ బ్రచ్ఛన్నవేషధారినై భూమియందుఁ దిరుగుచున్నాను. నామనంబు హరియందుఁ గ్రీడించుచున్నది. దీనికేమి? ఇవి యట్లుండనిమ్ము. లోకములో రాజులకు నాభిజాత్యమువలననును, ధనమువలననును, సైన్యంబువలననును, మదం బుద్భూతం బయికన్నులఁగప్పి వేయుచుండును. అట్టి దుర్మార్గులయిన రాజులు తమసైన్యములతో భూమికిఁ మిగుల బాధ గలిగించుచుండిరి. అదియంతయు జక్కఁగా విచారించి భగవంతుఁడయిన శ్రీకృష్ణుఁడు వారినందఱిని జంపి భక్తులయినపాండవుల కష్టములఁ దొలఁగింప నిష్టము గలవాఁడై, నాఁడు సభలో దుర్యోధనుఁడు తన్నుఁ బరుసములాడినను సహించి యూరకున్నాఁడు. లేక యొక్కదుర్యోధనునె సంహరింపవలెనన్న నాదినమునసే కడతేర్చియుండును. అంతియకాని యతఁడుపేక్షించుట దుర్యోధనుని సంహరింపలేక కాదుసుమీ? అట్లయింతవఱకు భగవంతుండుపేక్షించియుండి దుర్యోధనాదులతోఁగూడఁ బెక్కండ్ర దుష్టక్షత్త్రియులం బరిమార్చి తనకోర్కి నెఱవేర్చుకొన్నాఁడు.

జగన్నియంతయగు భగవంతునికి మర్త్యుఁడయి పుట్టఁదగినంత యవసరమేమి? అని యందువేని చెప్పెదవినుము. అతనికి జన్మాదులు లేకపోవుట సత్యమే. అతఁడు దుర్మార్గుల సంహరించి సాధువుల రక్షించుటకయి జన్మమెత్తుచుండును. అతఁడు తనచే సృజింపఁబడినచరాచరప్రపంచమును గాపాడుటకయి కర్మములుచేయుచుండును. అంతియకాని భగవంతుఁడగు శ్రీకృష్ణునికిఁ గర్మాయత్తములగు జన్మకర్మములు లేవు. ఓమిత్రమా! భగవంతుండట్టివాఁడయినను, లోకములో నున్నతనభక్తుల రక్షించుటకును, తనశాసనమందు సమస్తమును నిలుపుటకును, యదువంశమం దుద్భవించినశ్రీకృష్ణమూర్తి వృత్తాంతము తెలుపు" మని యడుగుచున్న విదురుని కాయుద్ధవుఁడు శ్రీకృష్ణుని స్మరించుకొనుచుఁ బ్రత్యుత్తరమిచ్చుటకు సమర్థుఁడు కాకపోయె ననిచెప్పి శుకుఁడు పరీక్షిత్తుసకు నెండియు నిట్లనియె. ఇది ప్రథమాధ్యాయము.

ఓ పరీక్షిన్మహారాజా! యుద్ధవుఁడు విష్ణుభక్తులలో నగ్రేసరుఁడని చెప్పవచ్చును. అతఁడయిదేండ్లప్రాయముగలవాఁడయి యున్నప్పుడును పరమభక్తియుతుఁడయి శ్రీకృష్ణునికిఁ బూజలొనర్చుచుండెను. అప్పుడతనితల్లి చేరఁబోయి "నాయనా! నీవు మిక్కిలి యాఁకలిగొని యున్నావు. చలిది గుడువరమ్ము. భుజింపుము." అని యెంతనేఁడిన నవ్వాక్యంబుల లక్ష్యముచేయకయుండె. అట్లు చిన్నతనంబునుండియు శ్రీకృష్ణుని నేమఱకయున్నవాఁడు. కావున నుద్ధవుఁడు శ్రీకృష్ణుని వియోగభారంబు సహింపఁజాలక వివశుఁడయి యుండి కొంతవడికిఁ దెలివితెచ్చుకొని

యెట్లు లాశ్రీకృష్ణు నిర్యాణము చెప్పదు సని తలపోయుచు హృదయంబు పదిలపఱుచుకొని తనయధిపతియగు శ్రీకృష్ణుని ధ్యానించుకొని శరీరంబునఁ బులకలు నిండ నేత్రముల నీరుకుళించి స్నేహాతిశయముచేఁ జిత్త మార్ద్రమగుచుండఁ గన్నుంగవనుండి స్రవించుచున్న బాష్పజలధారలను దుడిచికొని యెలుంగురాల్పఁడ మెల్లమెల్లన విదురుఁగన కిట్లనియె. 'ఓవిదురా? మాకుశల మేల

ఊద్ధవుఁడు విదురునకుఁ గృష్ణనిర్యాణమును జెప్పుట.

యడిగెదవు? మాకుశలమును నే నేమనిచెప్పవాఁడను? కృష్ణుండనెడు సూర్యుం డస్తమించుటచేఁ గాలమనెడి మహాసర్పము మాగృహములయందు సంచరించుచు, సమస్తాశాస్థానవాయువులఁ బహరించినది. మాకుశల మేమనిచెప్పను. అకటకటా! ఈలోకము దురదృష్టమయినది. ఈలోకమంతటిలోను యాదవులు పరమదౌర్భాగ్యులని చెప్పనచ్చును. యాదవులందఱు కృష్ణునితోనివసించుచు నతనిఁ దమపలెనే సామాన్యమానవుఁడని తలంచుచుండిరి; కాని భగవంతుండని తెలియఁజాలరయిరి. అవును. అజ్ఞానాంధకారములో మునిఁగి యున్న యాదవులు కృష్ణుని భగవంతునిఁగా నెట్లు తెలిసికొనఁగలరు? చేపలు సముద్రమందుఁ దిరుగుచున్న నావను గని దానిని తమతోసమానమయిన జలజంతువుగానే తలంచుచుండును గాని జనులను దరింపఁజేసెడి యొకసాధనముగా నెఱుంగఁజాలవు. అట్లె యాదవులు కృష్ణుని సంసారసాగరతారకుఁడని తెలిసికొనలేరైరి. కాని యాదవులలోఁ గొందఱు బుద్ధిమంతులుమాత్రము శ్రీకృష్ణుఁడు పరమాత్మస్వరూపుఁడనియు, సామాన్యమానవుఁడు కాఁడనియుఁ, దెలిసికొని యట్టిబుద్ధితోఁ సేవించిరి. భగవంతునిమాయచే మోహితులయిన శిశుపాలాదు

లగురాజులు కృష్ణు నొకజీవునిఁగానే తలంచుచుండిరి. పరమా
త్ముఁడయిన శ్రీహరియందుఁ జిత్తమును సమర్పించినమావంటి
వారలబుద్ధి భగవన్మాయచే నావృతముకాక కృష్ణుఁడు మాన
వుఁడని భ్రమముఁ జెందకయున్నది. ఓవిదురా ? కృష్ణునియుదం
తము చెప్పమంటివి. శ్రీకృష్ణమూర్తి తపశ్శాలు రయిన మహా
త్ములకు లోనిదర్శనీయము సతీసుందరము నయిన తనయాకారము
ను జూపి యట్లస్వరూపముతోఁగూడ నంతర్ధానముఁ జెందెను. న
వ్వానే! అమహాత్మునిరూపము మఱచిసను మఱపురాదున్నది. ఆ
శరీరము మనుష్యలీలలకుఁ బనికినది. అది తనయోగబలమును లో
కమునకు వెలువరించుచుండెడిది. అది మిగుల నాశ్చర్యముగొలు
పుచుండెడిది. అది సౌందర్యసమృద్ధితోఁ గూడియుండెడిది. అతి
నిర్మలాకారము భూషణములయిన కౌస్తుభాదులకుఁగూడ భూ
షణమని చెప్పనచ్చునుగదా! అట్టియాకార మిప్పుడు కన్నుల
కుఁ గఱవయిపోయినదే! ఆమహనీయరూపము చూచుభాగ్యము
మాకిక లేదు. ధర్మరాజు రాజసూయయాగమున సభామధ్యమం
దుఁ గూర్చుండి మూఁడులోకములవారినేత్రములకుఁ బరమానం
దకరమయిన శ్రీకృష్ణమూర్తి సుస్వరూపమును జక్కఁగా వివర్శిం
చి చూచియచ్చటివారందఱు "మనుష్యసృష్టిలో బ్రహ్మదేవునిచా
తుర్యమంతయు నీతనిరూపమందుమాత్రమే యున్నద"ని యా
శ్చర్యపడఁ జొచ్చిరికదా? అట్టిరూప మిప్పుడు నామమాత్రావశే
షమైనది. ఆకృష్ణమూర్తి ప్రేమకాస్పదమయిన మందహాసములను,
విలాసములను, క్రీడలను, గరుణావలోకములను, గౌరవమునొందిన
గోపస్త్రీలందఱు నాతనిరూపమునే చూడఁ గోర్కికలవారయి
గృహపతిపుత్రాదులను మఱచిపోయి కృత్యాకృత్యవివేకశూన్యల

యి యుండిరి. అట్టి జగన్మోహనమూర్తి నెచ్చట్టనైన నెక్కాల మందయినను లేదుగదా? సత్త్వగుణప్రధానులయిన సజ్జనులు రజోగుణప్రధానులయిన దుర్మార్గులచే బాధింపఁబడు చుండుట చూచి భగవంతుండు దయాచిత్తము కలవాఁడయి, తాను జన్మకర్మాదిరహితుండయినను మహదంశసంభూతుండయి దారువులం దగ్ని జనింపఁజేసినట్లు దేవమానసశరీరనులయం దుత్పన్నుండగు చున్నను కారణ భగవంతుండు దుష్టులయిన శిశుపాలాదుల జయించి భూభార మడఁగఁ జేయ నవతారంశయుక్తుండయిన బలరామునిశక్తిఁ గూడ నను దేవుఁడంట శ్రీకృష్ణుఁడను పేర నవతరించెను. జన్మాదిరహితుండయిన భగవంతుండు నను దేవుని స్నేహమున జన్మించుటయుఁ, దగువాతి శత్రుండను దురాత్ముఁడను కంసుని భయమునఁబడ వ్రేపల్లెయందు నివసించియుండుటయుఁ, బిమ్మట నుగ్రసేనుని యందుఁ గొంతకాలముండి కాలమునవాది దురాత్ముల బాధపడఁజాలక యీపురమునుండి తెప్పించుకొనిపోవుటయు, నీ మొనలయందర్యులు నాకు మిక్కిలి దుఃఖమును గలిగించుచున్నవి. శ్రీకృష్ణుఁడు కంసుని వధించినతరువాతఁ దనతల్లిదండ్రులను సమీపించి వారలకు నమస్కరించి 'ఓతల్లీ! ఓ నాయనా! దురాత్ముఁడయిన కంసునిభయమువలన మీచెంతఁజేరి మీకుఁ దగినసుశ్రూషలు చేయఁ జాలనైతిని. అనాయపరాధము సహింపక తీఱు'దని వారిద్దఱను గడుంగడుఁ బ్రార్థించెను. ఈమాటలను స్మరించుకొనుటచే నాహృదయము మిగులఁ బరితాపము చెందుచున్నది. తాను సర్వోత్కృష్టుఁడని తనకుఁదెలిసినను వారల నంతగాఁ బ్రార్థింపవలసిన యవసరమేమి? వారల సజ్ఞానములో ముంచుటకేచుమీ? నిరతిశయమయిన వాత్సల్యాదిగుణములు గలయీపరమ

పురుషుని వియోగము మిగుల దుర్భర మయినది. అట్టివియో గభాగము నాకేకాదు. శ్రీకృష్ణుని పాదపద్మములం దున్న పరాగ మును వాసన చూచినమాత్రమున కెవనికిఁ గలుగక మానును? మఱియు నాకృష్ణమూర్తి భ్రూభంగము ననుసరించుచు యదుఁ డిల్లదుర్మార్గులను సంహరించి భూభారమును దొలఁగించును. వెక్కేల? అతఁడు తలఁచుకొన్నంతమాత్రమునఁ నే యదుఁడు శత్రువులఁ జంపి భూభారము దీర్చుచుండును. ఓమిత్రమా! ధర్మరాజు రాజసూయయాగమందు శిశుపాలుఁడు శ్రీకృష్ణుని నిందించుటయు, నా శ్రీకృష్ణునిచేఁ జంపఁబడి శిశుపాలుండు యోగీశ్వరుల కయిన బొందఁదరముగాని భగవత్సాయి ప్తిరూపఫలసిద్ధిని బొందుటయు, నీవు చూచియే యున్నావుగ దా? కావున శ్రీకృష్ణుఁడు తనశత్రువులందుసైతము వాత్సల్య ముకలిగి మోక్షము నొసంగుచుండఁగాఁ దనమిత్రులకు మోక్ష మొసఁగుచుండుటకు సందియమున్నదా? ఇట్లుండఁ బరమప్రేమతో వర్తించుచున్న శ్రీకృష్ణుని వియోగము నెవ్వరు సహింపఁగలరు? మఱియు యుద్ధమందు సమస్తమైన రాజబృం దము నేత్రానందకరుఁడయిన శ్రీకృష్ణునిఁ గన్నులారఁ గాంచుచు నర్జునుని శరములచేఁ బవిత్రత నొందిభగవంతుని పరమపదమును జెందెనుగదా? ఆమహానుభావుఁడు నిరుపమానమయిన యతిశ యము కలవాఁడు. అతఁడు సమస్తసృష్టికిఁ గారణభూతములు యిన సత్వరజస్తమోగుణములకు నధిపతి. అతఁడు పరుల కధీన ముకాని రాజ్యలక్ష్మిచే సమస్తకామములను నెఱవేర్చుకొనువాఁ డు. అతఁడు తనకుఁ బూజలను గొనివచ్చుచున్న లోకపాలురచే సేవింపఁబడుచున్న పాదపీఠముకలవాఁడు. ఓవిదురా! శ్రీకృష్ణుఁ

డిట్టిమహానుభావుఁడయినను సార్వభౌమసింహాసనమందుఁ గూర్చుండినయుగ్రసేనునిసేవ నొనర్చుచు నతనియాజ్ఞ శిరసావహించి "దేవా! అవధరింపుము" అని విజ్ఞాపనవాక్యములును, ఆ భగవంతుఁ డొనర్చిన కైంకర్యమును, మాకాశ్చర్యము గొలుపుచున్నవి. శ్రీకృష్ణుఁడు శిశువయి యున్నప్పుఁ కంసునిపంపును దలఁదాల్చి పూతన స్తనములకుఁ గాలకూటమును పూసికొని యా శ్రీకృష్ణునిఁ జంపుదుర్వేశముతోనచ్చి యచ్చట నున్న స్త్రీలు నద్దు వద్దని యాటంకపఱుచుచున్నను మాసిక కృష్ణునెత్తికొని స్తన్య మిచ్చుచుండెను. అంతఁ గృష్ణుఁడు భగవంతుఁడు గనుక స్తన్యమును ద్రావుచు దానిజీవనములు హరించెను. శిశుహత్య చేయఁబూని కొనివచ్చిన పూతన మిగుల దుర్మార్గురాలని చెప్పుటకు సందియ ముఁ లేదుగదా? అట్టిదుర్మార్గురాలయినను బూతన కృష్ణునియను గ్రహమునఁలన యశోదాదేవి పొందఁదగినపరమపదమును జెందినది. తన కపరాధము చేయువారలకుఁ గూడ మోక్షసుఖముల నిచ్చుచున్న శ్రీకృష్ణునిఁ దక్క నితరుని శరణొందుట కెవఁడు పాల్పడును? ఓయీ! ముక్తినిబొందుటకు భక్తియోగము తప్ప మఱియొకమార్గము లేదని వేదములే చెప్పుచున్నవి. ఇట్లుండ దుర్మార్గులైన శత్రువులుగూడ ముక్తిమార్గమును చెందిరనుట మిగుల నసంగతముగా నున్నది! అని యందువేమో చెప్పెద వినుము. భగవంతుండగు కృష్ణునియందుఁ గ్రోధత్వములయి యుద్ధములుచేసి ప్రాణములు విడుచుచు గరుడసంసేవగము నధిష్ఠించి చక్రాయుధము ధరించియున్న భగవంతునిఁ జూచుచు, నున్నశత్రువులందఱును, భగవద్భక్తులే యని తెలిసికొనుము. విష్ణువుశత్రువులుగూడ భక్తులతో సమానులె యగుచున్నారు. కావున వెనుక నుదా

హరింపఁబడినవేదార్థమునకు విరోధము లేదు. భగవంతుఁడగు నారాయణుండు బ్రహ్మాదుల ప్రార్థన నంగీకరించి భూభారమును హరింపఁగోరి దుష్టుఁడైనకంసుని కారాగృహములోఁ నున్న దేవకీవసుదేవులకుఁ గుమారుండయి యనతరించెను. తరువాతి దురాత్ముఁడగు కంసుఁడు చంపునేమో యన్నభీతిచేత వసుదేవుఁడు డెప్పటికిఁ దెలియకుండ నక్కుమారునిఁగొనిపోయి నందునిగృహమునఁ నందుంచెను. అంత నబ్బాలకుఁడు పదునొకండువత్సరంబులవఱకుఁ గపటవేషధరుఁడై బలరామసమేతుఁడై వ్రేపల్లెయందు విహరించెను. సింహకిశోరమువంటి చూపులుగలకృష్ణుండు గోపబాలురతోఁగూడి గోవ్రజమును, వత్సంబులను, మేతకుఁ దోలుకొనిపోయి యమునానదీతీరములందు మేపుచు, బాల్యసంబంధమైన చేష్టలను జూపుచు, నొకమాఱేడ్పుచు, నొక్కమాఱు నవ్వించు, మఱియొకమాఱు నెల్లవానినిలెఁ దిరుగుచు, బ్రవర్తించుచుండెనివాఁడు. అట్లు శ్రీకృష్ణుండు విహరించుచున్నసమయంబున దురాత్ముఁడయిన కంసుం డతనిఁ జంపుటకయి కామరూపులగు పెక్కండ్ర రక్కసుల నంపెను. అయినను బాలభానము నొందినశ్రీకృష్ణుండెంతమాత్రము భయముచెందక తన్నుఁజంపవచ్చిన రక్కసుల నందఱను బాలుండు క్రీడార్థము కల్పింపఁబడిన లక్కబొమ్మలను జెక్కలుగాఁ జేయునట్లు చక్కాడినవాఁ డెనె. మఱియొకప్పుడు కాళియహ్రదములోనున్ననీటినిద్రావి గోగోపాలురందఱు విషవేగముచే మూర్ఛచెందఁగాఁ గాంచి శ్రీకృష్ణుండు దయాస్వాంతుండై యామడుఁగునందున్న సర్పరాజును నిరోధించి యాహ్రదమునందలిజలమును విషరహితముగాఁజేసి గోగోపాలురను రక్షించెను. గొల్లలందఱు వర్షమునఁబోక్షించి యింద్రయాగంబు

చేయుచుండెడివారు. అదిచూచి శ్రీకృష్ణుండాయాగమునుమాన్పి గోగోపాలురు సంతసం బందునట్లుగా, నాయింద్రయాగధనమును వ్యయము చేయించెను. అంతట నింద్రుండు కోపించి గోగోపాలురను బాధింప ఘోరంబగుశిలావర్షంబు గురియింప నారంభించెను. అదిచూచి శ్రీకృష్ణుఁడొకపర్వతము గొడుగుగాధరించి వారిలభయమును బోఁగొట్టియింద్రునిగర్వమును సర్వనుం దొలఁగించెను. శరత్కాలమందు నిండుచందురుని కిరణములచే నత్యంతమనోహరమైన రాత్రియందు సవ్యక్తిమధురనుగా వేణుగానమును సలిపి గోపస్త్రీలను మోహింపఁజేసి వారలతోఁ గూడ విహరించెను. ఇట్టికృష్ణుని దివ్యచేష్టితంబుల నెట్లు మఱవఁగిలను? ఇది ద్వితీయాధ్యాయము.

ఉద్ధవుఁడు మథురాపురమునఁ గృష్ణుఁడొనర్చినకార్యములు నుడువుట.

"ఓవిదురా! శ్రీకృష్ణుండు వ్రేపల్లెయందుఁ జేసిన దివ్యచేష్టితంబులను సంగ్రహముగాఁ జెలిపితిని. ఇంక నతఁడు మథురాపురమునందును ద్వారకాపురమునందును నొనర్చిన దివ్యచేష్టితంబులను సంగ్రహముగా నుడివెద నాలకింపుము. ఇట్లు శ్రీకృష్ణుండు వ్రేపల్లెయందుఁ గొంతకాలమునఁకు విహరించి దుర్మార్గుఁడయిన కంసునిచేఁ బలువిధముల బాధలు పడుచున్నతనతల్లిదండ్రుల చెఱను వారించి సుఖముం గలిగింపఁదలంపుగొని వ్రేపల్లెనుండి మథురాపురమునకుఁబోయి బలరాముండు తన్ననుసరించి వచ్చుచుండ రాజమందిరంబు సమీపించి సింహాసనమునై నున్నకంసునిఁ జంపి భూమికిఁ బడఁద్రోచెను. తరువాత శ్రీకృష్ణుండు బలరామసమేతుఁడయి కాశీపురంబునకుఁ బోయి యచ్చట సాందీపని

యనెడి యుపాధ్యాయునివలన షడంగములతోఁ గూడినవేదము నవలీలనె చదివి పంచజనునియుదరమును భేదించి చనిపోయిన గురుకుమారుని బ్రదికించి కొనివచ్చి యతని కర్పించి సంతసింపఁజేసెను. పిమ్మట నాకృష్ణుండు రుక్మిణీదేవిప్రార్థన మంగీకరించి రథంబుపైఁ గూర్చుండి చని రుక్మిచేత నాహూతులయి, గర్వాంధులయి, యున్న రాజులసందఱ నవలీలఁ దిరస్కరించి యామెను గాంధర్వవివాహముచేఁ జేపట్టి ద్వారకకుఁ గొనివచ్చినాఁడు. మఱియొకప్పుడు "మదమత్తములై భయంకరములై యున్న వృషభముల నేడింటిని నడంచినట్టివానికి నాకుమారిక నిచ్చెద" నని నగ్నజిత్తు ప్రతిన చేసియుండెను. అది విని కృష్ణుండు సంతసంబుతోఁ బోయి యా వృషభంబుల నేడింటి కానర మడంచి యా రాజకుమారిని వరించి తనబలాతిశయమును జూచి యౌర్వలేక యుద్ధమునకువచ్చిన రాజాధముల నందఱను నిమేషమాత్రమున నస్త్రములవాలు గావించి జయముగొనెను. మఱియొకప్పుడు తన ప్రియురాలయిన సత్యభామకోర్కి నెఱవేర్పఁ దలంచి స్వర్గంబునకుఁ బోయి పారిజాతంబును భూలోకమునకుఁ గొనివచ్చుచు, నవివేకము చేమధ్యేమార్గమునఁ దన్ను దాఁకినయింద్రుని, దేవసైన్యములను, జయించి తెచ్చి సత్యభామకోర్కి నెఱవేర్చెను. శ్రీకృష్ణుండు యుద్ధంబున శరీరముచే నాకసమును క్రిందుచున్నట్లు వర్తులనరకాసురునిఁ జక్రముచే ఖండించి వాని తల్లియగు భూదేవిప్రార్థనచొప్పున నరకాసురుని కుమారుఁడగు రాజపుత్త్రునిఁ గొనిపోయి తండ్రిరాజ్యంబున కభిషిక్తునిఁజేసెను. తరువాత నరకాసురునిచేఁ దేఁబడిన నరదేవకన్యలందఱు కారాగృహమునుండి విడిపింపవచ్చిన యార్తబంధునిఁ గృష్ణునిఁజూచి హర్షముచే

తను, లజ్జానురాగములచేతను ప్రేరితములగు చూపులచే వరించిరి. అంతఁ గృష్ణుఁ డేకకాలమందే నానారూపియై వారల నందఱను దనభార్యలఁగా స్వీకరించి యాదరించెను. ఇట్లు వరింపఁబడినయాకన్యలకు సంతసము గలుగునట్లుగా విహరించి వారలలో నొక్కొక్కదానియందుఁ బదుగురేసి పుత్త్రులను బడసెను. తరువాతఁ గాలయవనుఁడు జరాసంధుఁడు మొదలగువారు వెక్కసైన్యములతోవచ్చి పలుపర్యాయములు తనపురమును ముట్టడింప వారల నందఱ ననలీలగాఁ బాఱఁదోలి కాలాంతరమునందుఁ దననిర్యాణమును భీమాదుల కొసంగి వారలచే జరాసంధాదులను జంపించె. మఱియు శంబరాసురుఁడు ద్వివిదుఁడు మొదలగువారి బలరామాదులచేఁ జంపించి దంతవక్త్రుఁడు బాణుఁడు పల్వలుఁడు మురాసురుఁడు మొదలగువారినెల్ల స్వయముగానే సంహరించెను. తరువాత నమ్మహాత్ముఁడు నీసోదరుల పుత్త్రులైన కురుపాండవులు రాజ్యమునకోసము పోరాడుచుండ వారలకు సహాయభూతులై వచ్చినరాజుల నందఱను సైన్యముల తోఁగూడ నొకరిచేనొకరిని జంపించి, కర్ణదుశ్శాసనశకుని వికర్ణాదులను, సంహరించి దుర్యోధనుఁడు దొడలుతెగి యుద్ధమందుఁ బడునట్లుచేసెను. ఇట్లు శ్రీకృష్ణుండు భీమార్జునాదులచేఁ బదునెనిమిదియక్షౌహిణుల సైన్యములను జంపించినను దుర్జయమయిన యాదవబలము మిగిలియున్నదను హేతువుచేఁ దృప్తిచెందక యాదవులను గూడ సంహరించినఁగాని భూభారము సంపూర్ణముగా నశింపదని తలంచి యందులకుఁ దగినయుపాయము నాలోచించుచు మధుపానమత్తులైనయాదవుల నొకరిచేనొకరిఁజంపింప సమకట్టి యప్పటికి మిన్నకుండెను. పిమ్మట నిస్సపత్నంబగు రాజ్యం

బునకు ధర్మరాజు నభిషిక్తుంజేసి వర్ణాశ్రమధర్మముల నతనికిఁ దెలియఁజేసి సంతసింపఁజేసెను. తరువాత నశ్వత్థామబాణభూతంబుచేఁ జూన సిద్ధపడియున్నయుత్తరగర్భస్థుండగుబాలుని సంరక్షించి పూరువంశము నశింపకుండఁ గాపాడెను. తరువాత ధర్మరాజుచే మూఁడశ్వమేధములఁ జేయింపఁగా ధర్మసుతుండట్లుగావించి కృష్ణుని పదపద్మముల సేవించుచుఁ దనతమ్ములైన భీమార్జులసాయమువలన భూమిని రక్షించుచు సుఖముగా నుండెను. విశ్వస్వరూపుఁడయిన శ్రీకృష్ణుఁడు శ్రౌతస్మార్తాదిధర్మముల నాచరించుచు ననంతకల్యాణగుణపూర్ణుండయి సమస్తసుఖముల ననుభవించుచు నుండెను. ఇట్లు శ్రీకృష్ణుండు కరుణావలోకనములచేతను, సుధాసదృశములయిన వాక్యములచేతను, అనిందితమయిన నడనడిచేతను, లక్ష్మికి నాశ్రయభూతిమయిన శరీరముచేతను, నీలోకమును సంతసింపఁజేయుచు, యాదవుల నంతకంటె నెక్కుడుగా నానందింపఁజేయుచు, రాత్రులయందుఁ దనభార్యల కానందముగొలుపుచు, నిట్లు బెక్కుసంవత్సరంబులు గడపి గృహాధర్మములయందు నాదరము కలవాఁడయి యుండెను. యోగఫల ప్రదుఁడైన భగవంతుని సేవించుచున్నవాఁడికే సంసారమునందు మోతపుట్టుచుండగా భగవంతునికి సంసారమునందు మోతపుట్టుట యొకయాశ్చర్యమా? ఇట్లుండఁగా భగవంతుండగు కృష్ణుని యభిప్రాయప్రకారమున యాదవకులనాశనకరమయిన యొకశాప ముజనించినది. దానిఁ జెప్పెదవినుము. ఒకనాఁడు యాదవకుమారులందఱు ద్వారకయం దాడుకొనుచు నచ్చటి నచ్చిన మునీంద్రులను బరిహసింప నమ్మునిచంద్రములు కరమ్ము గోపించి యదువంశంబంతయు వేగముగానె క్షయమునొందుఁగాత మని శపించిరి.

ఇట్లు శౌపంబు సంప్రాప్తంబయిన కొన్నిమాసములకు యాదవులందఱుఁగూడి మహానందంబుతోఁ బ్రభాసతీర్థంబునకుఁజని యందుఁ గ్రుంకులిడి దేవతర్పణంబులును బితృతర్పణంబులును గావించి సదాచారులయిన విప్రోత్తములకప్పించి సువర్ణదానము గొందఱకు, భూదానము గొందఱకు, నవనత్సలతోఁ గూడియున్న గోవులను గొందఱకుఁ గన్యాదానంబులు గొందఱకు సిచ్చి యట్లు శోడశమహాదానములచేతను వారలఁ దృప్తిఁ బొందించి యావచ్చిన బ్రాహ్మణులందఱకు షడ్రసోపేతమయిన భోజనంబులిడి తా మచ్చటఁజేసినదానభోజనాదులను భగవత్ప్రీతిగా దారవ్రాసి యాబ్రాహ్మణోత్తములందఱకు సాష్టాంగదండప్రణామము లాచరించిరి. ఇది మూఁడవయధ్యాయము.

ఇట్లు యాదవులందఱు స్నానదానాదుల నొనర్చి, యావిప్రుల ననుమతిఁ బొప్పస భుజించి, తరువాత మద్యపానముచేసి, యందువలనఁ దా మచితజ్ఞానశూన్యులై, యొకరినొకరు రథక్షేపించుకొనుచు, నుష్ణదోషమువలన విపరీతమయిన చిత్తములుగలవారయియుండి వేణుమర్దనమునలనఁ, గలిగిన యగ్నిహోత్రము వన మంతటిని దహించినట్లు వారిలలో నిరువురికి జనించినవిరోధము వారలనందఱ నుభయపక్షంబులుగా మార్చి యొకరిచే నొకరు చచ్చునట్లు చేసి సూర్యాస్తమయ మగునప్పటికి యాదవుల నశింపఁజేసినది. అంత శ్రీకృష్ణుండు తాను బూర్వమందు సంకల్పించుకొనినసంకల్పమునకు ఫలరూపమయిన యాదవకులనాశనము నవలోకించి భూభారమంతయు నాఁటితో సంపూర్ణముగాఁ దొలఁగిన దని భావించి సరస్వతీనదికిఁబోయి యందు మునుకలిడి తత్తీరం

బున నున్న యశ్వత్థపాదపము మొదటిభాగమునఁ గూర్చుండెను. శ్రీకృష్ణుఁడు మొదట నన్నుఁ దనతోఁ రావలదనియు, బదరికాశ్రమమునకుఁ బొమ్మనియు, నాజ్ఞాపించినను నాతని విడిచిపోవుట కసమర్థుండనై యిది యంతయు భగవద్విలాసమని యెఱింగి యతని వెనువెంటనే పోయితిని. ఇట్లు భగవంతు ననుసరించి పోయి యశ్వత్థపాదపము మూలమునం దుపవేశించి యసహాయుఁడయి యుండ నత్యంతము ప్రియతముఁడయిన యా శ్రీకృష్ణునిఁజూచితిని. ఆ శ్రీకృష్ణుఁడు నీలాంబుదమువంటిదేహముతోను, ప్రసన్నములయినయెఱ్ఱనిఁగోచనములతోను, బచ్చసిపట్టువస్త్రముతోను, నాల్గుభుజములతోను, బ్రకాశించుచు, నెడమతొడయందుఁ గుడిపాదమునుంచి కొని కోమలమయిన యశ్వత్థనృత్తము నూతనగాఁగొని యేదియో యాలోచించుచుఁ గర్మఫలము లేనివాఁడయి కానుపనేకకార్యత్వమగుకార్శత్వమును స్థూలత్వమును మొదలగుదోషములులేక యుండెను. ఇట్లుండఁగా నేను సమీపించి యతనిసన్నిధియందుఁ గూర్చుండియుంటిని. అప్పుడే వ్యాసమహర్షికి స్నేహితుఁడును, భాగవతాగ్రగణ్యుఁడును, గృతకృత్యుఁడు నగు మైత్రేయమహాముని లోకసంచారముచేయుచు దైవికముగా నచ్చటికేతెంచెను. ఇట్లు మైత్రేయుండు వచ్చి భగవద్దర్శనజనితమయిన సంతసముచేతను, భక్తిచేతను, నవనతిపదనుండయి భగవంతునియం దధికమయిన ప్రేమకలవాఁడయి, వినుచుండఁగా శ్రీకృష్ణుం డనురాగాన్వితమైనచూపులచే శ్రమము వాయునట్లుగాఁ జూచుచు నన్నుఁగూర్చి యిట్లు పలికెను. 'ఓ యుద్ధవా? నీవు పూర్వజన్మమునం దొకవసువవు. అప్పుడు వసువులు ప్రజాపతులు సత్రయాగముచేయ నారంభించిరి. ఆకాలమందు నీవు నాయం దధికమయినభక్తిగలవాఁడవయి నాయు

త్తమపదము నందుటకు మిగులఁ బ్రయత్నించి నన్ను నారాధించితివి. నీమనస్సులోనున్నకోర్కి నా కనగతమయినది. నీయిష్టమన్నులచేఁ బొందఁ దలవికానిదైనను నీయందు నాకు జనించిన యనుగ్రహమునఁబలన నీకుఁదప్పక యొసంగెదను. ఓయీ ! నాయనుగ్రహమునకుఁ బాత్రుఁడవగుటంబట్టియు నీలోకమునువిడిచి వైకుంఠమునకుఁ బోవుచున్నసన్ను నుత్కృష్టమైన భక్తిచేతఁ బొడగాంచుటంబట్టియు, నీకర్మజాలమంతయు నశించినది. నీ కీజన్మమే కడపటిజన్మమని తెలిసికొనుము. ఇఁక నీకుఁ బుట్టువుండదు. మఱియుఁ బద్మకల్పంబున నానాభీకమలమునందు నిషణ్ణుఁడైయుండిన బ్రహ్మకు,జననమరణాదిపరిహారకంబును, బరమానందసుఖదాయకంబునై , మహాత్ములచే భాగవత మని పిలువఁబడుచున్నమన్మహత్త్వంబుఁ జెప్పితి;అది నీకుఁ దెలియఁజేయుదు'నని పలుకుచున్నకృష్ణుని సాదరవచనంబులనాలకించి పరమపురుషుఁడయిన యతనియనుగ్రహంబునకుఁ బాత్రుండ నయిన నేను బులకితాంగుండనైదుర్ముఖమునంతయుఁ బోఁద్రోచి బద్ధాంజలినై యిట్లంటిని. "ఓదేవా ! నీపాదపద్మముల సేవించుచున్నవారికిఁ బురుషార్థముల నాల్గింటిలో దుర్లభమైనది యేది కలదు? ఓ మహాప్రభూ ! అట్లయినను నేను బురుషార్థముల నెంతమాత్రము కోరను. నీపాదసేవయం దత్యంతకుతూహలుండనైన నా కవి యిష్టములయి దోఁపలేదు. ఓ మహాత్మా ! జన్మరహితుఁడవయిన నీవు జన్మించుటయు, నిర్వ్యాపారుఁడవయిన నీవు పలుకర్మముల నాచరించుటయుఁ, గాలస్వరూపుఁడ వయిసనీవు ద్వారకాపురము నాశ్రయించి యుండుటయు, భయరహితుఁడవయిన నీవు కాలయవనాదులకు భయపడి పాఱిపోవుటయు, నాత్మారాముఁడ వయిన

నీవు వెక్కండ్ర స్త్రీలతోఁగూడి విహరించుచు, గృహస్థాశ్రమ మవలంబించుటయు, నివి యన్నియుఁ బండితుల బుద్ధినైనను జలింపఁజేయక మానునా? మఱియు నీవు కార్యాలోచనము చేయునప్పుడు నన్నుఁ బిలిచి యడుగుచుండెడి వాఁడవు. ఆనరణర హితమయి, యపరిచ్ఛిన్నమై యున్న యాత్మజ్ఞానమే రూపముగాఁ గలనీవు నన్నుఁ గార్య నిశ్చయమును నూర్చి యడుగవలసిన యవసరమేమి? నీవు మూఢునివలెఁ గార్యనిశ్చయమును గూర్చి నన్నడిగినమాటలు నాహృదయమును భ్రమింపఁజేయుచున్నవి. ఓ మహాత్మా! నాయం దనుగ్రహించి పూర్వము నీవు బ్రహ్మకుపదేశించినయథార్థజ్ఞానమును గ్రహింప నర్హుండ నగుదునేని నాకుఁ దెలియఁజెప్పుము. ఆ పరమజ్ఞానము ననలంబించి సంసారనారావారమును గడచి ముక్తిఁ జెందఁగలను" అని యిట్లు పరమభక్తితో నడుగుచున్న నన్నుఁ గరుణించి నాయందుండెడినిస్నేహభావమునుచే నందఱకుఁ దప్పక తెలియఁదగినయాది వ్యజ్ఞానమును నాకుపదేశించెను. ఇట్లు నేను భగవంతునివలన నాత్మతత్త్వము సధ్యయనముచేసి లోకములఁ బవిత్రముగాఁ జేయఁజాలిన యతనిపాదపద్మములకు నమస్కరించి సెలవుగైకొని తిరిగి ప్రదక్షిణనమస్కారము లాచరించి భగవద్విరహముచే ఖేదమునొందుచు నిచ్చటి కరుగుదెంచితిని. భగవంతునిఁ జూడఁగలిగినందుల కానందము గలుగుచుండెను. అతని నెడఁ బాసివచ్చుటచే దుఃఖము నొందుచున్నాను. ఇంక నేను భగవంతునిసెలవు ప్రకారమున నతనికిఁ బ్రియమయినబదరికావనమునుఁ గూర్చిపోయెదను. ఆబదరీవనమందే పూర్వము నరనారాయణులు తీవ్రమయిన తపం బాచరించి యావనమును బవిత్రితముగాఁ

జేసినారు. అట్టితీర్థమును జేరినచో దప్పక చిత్తము పరిశుద్ధిని జెందును. కావున నేనచ్చటికిఁ బోయెద నని పలుకుచున్న యుద్ధవుని వాక్యముల నాలకించి బంధువులయు, స్నేహితులయు, మరణము నాలకించి యాదుఃఖము దుస్సహమైనను విదురుండు జ్ఞానాతిశయముచే నాదుఃఖమును దొలఁగించుకొనెను. ఇట్లు దుఃఖమును దొలంగించుకొని విదురుండు బదరికాశ్రమమును గూర్చి పోవుచున్న యుద్ధవునిఁ జూచి భగవదనుగ్రహము కలవారిలో నుద్ధవుండు ముఖ్యుండని నిశ్చయించి యతనిఁజూచి మహాత్మా! భగవంతుఁడగు కృష్ణుండు కృపారసంబుచే నీకుఁ జెప్పిన తత్త్వజ్ఞానంబు నాకుపదేశింపఁ దగియుండునుగాన దయయుంచి యెఱిఁగింపుము.అందువలన నేను బిన్నక కృతకృత్యుండ నగుదును.లోకములో విష్ణుభక్తు లెల్లప్పుడు తమసేవకులకుఁ బ్రయోజనమును గలిగించుచుఁ జరింతురుగదా? అని యడిగినవిదురుని వాక్యంబులు విని యుద్ధవుఁడతనికిట్లనియె.“ఓవిదురా? నేను దత్త్వజ్ఞానముపదేశించునంతటివాఁడనుగాను. భగవంతుఁడును, దత్త్వదర్శియునగు మైత్రేయమహాముని తత్త్వముపదేశింపఁదగినవాఁడు, మఱియు మానవలోకమును విడిచిపెట్టుచున్న భగవంతుఁడు మైత్రేయునిఁజూచి, తీర్థసంచారము చేయుచు నిన్నడిగినవారలకుఁ దత్త్వముపదేశింపుమని యాజ్ఞాపించి యున్నాఁడు.కావున నీవతని పజ్జకేఁగి తత్త్వజ్ఞానము పడయుము' అనిచెప్పి యుద్ధవుండు విదురున కావృత్తాంతమంతయుఁ దెలియఁజేసి విదురునితోఁగూడ విశ్వశరీరకుండయిన భగవంతుని కథాసుధారసమునందు మునిఁగి కావున నే తాపములఁదొలఁగించుకొని యారాత్రి నొక్కక్షణముగాఁ గడపి యుదయంబునలేచి యమునం దానమాడి బదరి

కాశ్రమముం గూర్చిపోయెను''అని పలుకుచున్నశుకముసీంద్రుం
జూచి రా జిట్లనియె. ఓముసీంద్రా ! భగవంతుండగు కృష్ణుండు
నిర్యాణముచెందెను. మహాబలవంతు లని ప్రసిద్ధికెక్కి-నయాదవు
లండఱు నాశనము చెందిరిగదా? వారిలో ముఖ్యుండగు శ్రీకృ
ష్ణుండు సైతము తనమానవశరీరమును దిగ్రోహితముగాఁ జేసెను.
ఇట్లు తనవారండఱు మృతినొందుటఁజూచియు, నుద్ధవుం డొట్లు
బ్రదికి యున్నాఁడు? బ్రాహ్మణశాపమున కితఁడుంచుచే లోఁబడి
యుండలేదు? ఇతఁడును యాదవుఁడేకదా?'' అని యడిగినరాజుం
జూచి శుకుం డిట్లనియె. ''ఓయీ ! నీ వడిగినప్రశ్నము సముచిత
ముగా నున్నది. అవిప్రశాపము భగవత్సంకల్పరూపమేకాని వే
ఱుకాదు. సత్యసంకల్పుండగు కృష్ణుండు యాదవకులమును నశిం
పఁజేసి తాను శరీరమును దిగ్రోభావమునుబొందించుచుఁ దనలో
చానిట్లు చింతించెను.'అకటా? ఈలోకమును నేను విడిచిపోయిన
చో మదాశ్రయ మయినజ్ఞానముగూడ నశింపకమానదు.అట్టిజ్ఞా
న మిలోకమం దంత మొందకుండఁగానుద్ధవున కుపదేశించినచో
నతని నూనుకొని జ్ఞానము నిలిచియుండఁగలదు. అట్టిజ్ఞానమును
గ్రహించుట కుద్ధవుఁడే యర్హుఁడు.అతఁడుతత్త్వజ్ఞానవంతులలోఁ
బ్రధానుఁడని చెప్పవచ్చును. అతఁడు నిర్జితేంద్రియుఁడు. అతఁడు
నాతోసమానుఁడే కాని లేశమయిన నాకంటెఁ దక్కువవాఁడు
కాఁడు. అతఁడు సత్త్వాదిగుణములచేఁ బీడింపఁబడఁడు. అతనికిఁ
దత్త్వజ్ఞానముపదేశించినచో మద్విషయకమయిన జ్ఞానమును లో
కమున కుపదేశించుచుండునని తలంచి యతనిని జావునుండి త
ప్పించినాఁడు. లేనిచో నతఁడును యాదవులతోఁగూడఁ జావవ
లసినదే''అనిచెప్పి శుకుండు వెండియు నిట్లనియె.''ఓరాజేంద్రా!

పుణ్యాత్ముఁడయిన యుద్ధవుండు బదరికావనమునకుఁ బోయి జ్ఞాన యోగముచే భగవంతునిఁ జేరెను. పిమ్మట విదురుండు భగవంతుఁడయిన కృష్ణుండు లీలామాత్రమునకయి దేహము ధరించుటయు, సతం డద్భుతచర్యల నొనర్చుటయు, యోగిపరులకు ధైర్యవర్ధకమై, యధీరచిత్తు లగునవివేకులకు దుష్కరతరమై యున్న దేహత్యాగప్రకారమును, సవిస్తరముగా నుద్ధవునివలన విని నిరతిశయమయిన భగవత్ప్రేమవలన మయిమఱచినవాఁడయి మిగుల రోదనముచేసి యుపశాంతిచెంది యమునానదీతీరమునుండి బయలుదేఱి కొన్నిదినంబులకు గంగానదినిఁ జేరి క్రమక్రమముగా హరిద్వారమునకుఁ జేరి యచ్చటఁ బరమభాగవతోత్తముఁడయిన మైత్రేయునిఁ గలిసికొనెను. ఇది నాల్గవయధ్యాయము.

విదురమైత్రేయ సంవాదము.

ఇట్లు విదురుండు పరమాత్మభక్తిచే నిర్మలమయిన మనస్సు గలవాఁడై యాత్మజ్ఞానమునకు నిధియగుమైత్రేయుని హరిద్వారమునొద్ద గలిసికొని యతనికి నమస్కరించి యతనిసౌశీల్యాది మహాగుణంబులచేఁ దృప్తుండై యతని కిట్లనియె. 'ఓమహాత్మా? జనులందఱు సుఖము నపేక్షించి శ్రౌతస్మార్తాదికర్మముల నాచరించుచున్నారు. కాని యాసత్కార్యములవలన సుఖమును గాని దుఃఖశాంతినిగాని పొందుచున్నట్లు గానరాదు. మాటిమాటికి దుఃఖమునే పొందుచున్నారు. భగవంతుఁడవయిననీకుఁ దెలియనిసంగతు లుండవు గనుక నాచరింపవలసినకర్మము లేవో తెలియఁజెప్పుము. ఇదియునుంగాక దుఃఖసాగరం బనఁదగు సంసారమునందుఁ బడి మానవుండు భగవద్భక్తివిదూరుండయి యధర్మపరుండై కర్మానుగతములయిన శరీరంబులఁదాల్చుచు నతి

దుఃఖంబుల ననుభవించుచుఁ బుట్టుచుఁ జచ్చుచు నెంతకాలమున కయినను ముక్తిగానక పశుప్రాయుఁడై యున్నవానిని రక్షించు టొఱకేకదా తమవంటిమహాత్ములీలోకంబునఁ జరించుచున్నారు! ఓసాధువర్యా! భగవంతుఁడట్లారాధించిన సంతోషించును? ఎట్లు పూజించిన భగవంతుండు భక్తిచే నిర్మలమైనహృదయమందు వసించియుండును? ఏమిచేసినచో భగవంతుండు తత్త్వజ్ఞానము నిచ్చును? అట్టియుపాయ మేదయిన యున్నయెడల నాయందు దయయుంచి చెప్పుము. లోకాధిపతియయిన భగవంతుఁడు కర్మాధీనుండు కాక బ్రహ్మాదిరూపములనొంది యీప్రపంచము నేరీతి సృజించెఁ? ఎట్లు పరిపాలించెఁ? తిరుగ నీవిశ్వమంతను దనయందే లీనమగునట్లు చేసి జగద్వ్యాపారములను మాని వైకుంఠమునం డెట్లుగా శయనించెఁ? యోగీశ్వరాధిపతియగు భగవంతుఁడొక్కఁడయ్యుఁ దాను జగదాధారకుఁడై యుండియుఁ బెక్కురూపంబుల నెట్లు చాల్చుచున్నాఁడు? గోబ్రాహ్మణాదిసంరక్షణమున కై మత్స్యాద్యవతారము లెత్తి క్రీడించుచు నేయే ప్రకారంబులఁ బ్రయోజనంబుల నెఱవేర్చెఁ? పవిత్రకీర్తియయిన భగవంతుని చరిత్రము లెంతవిన్నను నాపనంబు తనివి సనదు. కావున నాయందు దయయుంచి యీచరిత్రలను దెలియఁజేయుము. ఓమహాత్మా! మఱియు లోకాధినాథుఁడయిన భగవంతుఁడు లోకపాలురతోఁ గూడి యున్నలోకములను లోకబహిర్భాగములను మహదాదితత్త్వములతోఁ గల్పించియుండుటయు, నాయాలోకములందుఁ బ్రవర్తించుచున్నసమస్తజీవకోటులభేదంబులను, దెలియఁజేయుము? కారణాంతరరహితుఁడును, విశ్వకర్తయు, నగు భగవంతుఁడు జ్ఞానేంద్రియగణమును, గర్మేంద్రియస

మూహమును, దేవమనుష్యాదిరూపంబులును, నాయూనామం బులును, ననెడి నీనిభేదము నేప్రకారముగా జేసె? ఇది యంత యుఁ దెలియఁ జేయుము. ఇంక నేనడుగనివిశేషంబులుగూడ ను న్నయెడలవర్ణింపుము. ఓయీ? సమస్తము తెలిసిననీకుఁ దిరిగివినుట తో నేమి ప్రయోజనము? అని యందువేని చెప్పెదవినుము. బ్రాహ్మ ణక్షత్రియవైశ్య లనుమూఁడుజాతులవారికిఁ దదితరులగు స్త్రీ శూద్రాదులకును, విహితములయిన వ్రతముల నన్నింటిని వ్యాసమ హాముని కృత మయినభారతముపలనఁ దెలిసికొంటిని. విష్ణుకథా మృతము లేనివియు, స్వల్పసుఖసంపాదకములు, నగు వ్రతములు వి నుటయందుఁ దృప్తి చెందితిని. ఇఁక వానిని విన నవసరము లేదు. కాని భగవత్కథామృతముపలనఁ దృప్తి వొందలే కున్నాను. మఱియు విష్ణుకథలను దఱుచుగా వినినచో నాభగవంతుఁడు వా రికర్ణబిలముపలనఁ బ్రవేశించి హృదయకమలము నధివసించి సం సారసంపాదకమయిన కోశ్యంలను ఛేదించు నట! ఇట్లు మీసత్ర ములందలిపండితులచే నుతింపఁబడుచున్నవిష్ణునికథలవలన నింత లాభము కలుగుచుండఁగా వాని నెట్టివాఁడయిన వినకయుం డునా? వినినను దృప్తిచెందునా? ఓయీ! హరికథాశ్రవణమే తాపత్రయనూపకమయిన సంసారమును ఛేదింపఁజాలియున్న చో భగవంతుఁ డయినవ్యాసమహాముని మహాభారతమందుఁ గేవలము హరిచరిత్రమునే వర్ణింపక వ్రతములనుగూర్చియు నే లచెప్పె? దీనింబట్టి యోజనప వ్రతములపలనఁగూడ నట్టిఫల ము గలుగునని యభిప్రాయమేమో? యనినచోఁ జెప్పెదవినుము. నారాయణాపరావతారుండయిన వ్యాసమహాముని భగవంతుని గుణముల వర్ణింపఁ దలంచి వర్ణాశ్రమధర్మములు, గ్రామ్యకథా

నువాదములు మొదలగునవి ముక్తిసాధనములు కావని తెలిసి యున్నను సామాన్యజనుల మనస్సులు భక్తిమార్గములోఁ బ్రవేశించునిమిత్తము చెప్పె. మఱియు సామాన్యజనులమనస్సు వేదాంతార్థమును గ్రహింపఁజాలదు. అందుచే నిట్టివ్రతధర్మాదుల నాచరించినచోఁ గ్రమక్రమముగా హృదయము నిర్మలత్వమంది జ్ఞానంబున కాకరంబగుచు వేదాంతార్థమును గ్రహింపఁగలదను నట్టియభిప్రాయముతోఁ జెప్పియున్నాఁడు. అట్లు హరికథలందుఁ జిత్తము ప్రవేశించినతోడనే వానిని వినుటయం దాసక్తి గలిగి యుందురు. అట్టివారికిఁ బ్రతిదినము హరికథాశ్రవణము చేయుట వలనఁ గ్రమక్రమముగా విరక్తి బొడముచుండును ఇట్లు సంసారమందు విరక్తిపొడమినతోడనే మానవులు శ్రీహరిపాదపద్మములను సర్వదా ధ్యానింపుచుఁ బరమసుఖముల నొందుచుందురు. హరికథాశ్రవణము సంసారమందు విరక్తి పొడమించి హరిపాదభక్తిని గలిగించి తాపత్రయమును హరించును. ఓమునీంద్రా! హరికథవలన నిట్టిలాభము కలుగుచుండఁగా నవివేకులయిన మానవు లది తెలిసికొనలేక పాపముచే హరికథావిముఖులయియుందురు. అట్టినారల యాయుర్దాయమును సూర్యుఁడు మిక్కిలి క్షీణింపఁ జేయుచుండును. ఆతెల్వితక్కువమానవులను గూర్చి మిగుల వగచుచున్నాను. మఱియుఁ దనవాక్కులను, క్రియలను, మనోవ్యాపారమును, హరివిషయముగాఁ జేసినప్పుడే యవియన్నియు సఫలములగును. లేనిచో నవియన్నియు వ్యర్థములే. తనమనోవాక్కాయకృతము లగువ్యాపారములను హరియందుఁ జేర్చునారియాయువు మిగుల నభివృద్ధి చెందుచుండును. తదితరుల యాయువు తఱుఁగుచుండును. ఓమైత్రేయమునీం

ద్రా! ఓయార్తబంధూ! ఆకారణముచేత సమస్తదుఃఖములను దొలఁగించి సుఖములు గలుగఁజేయు విష్ణుమూర్తికథలను దుమ్మెదలు పుష్పములవలన మధువును దీసినట్లు సంగ్రహించి నాకుఁదెలియఁజేయుము. మఱియు భగవంతుఁడు ప్రపంచసృష్టిస్థితిలయములను జేయునిమిత్తము లోకమున నవతరించి చేసినయమానుషకృత్యములను వివరించి వర్ణించి నన్ను సంతసింపఁజేయుము' అని యిట్లు పురుషుల మోక్షోదయముకొఱకు కడుగుచున్నవిదురుని పలుకులు విని మైత్రేయుండు మిగుల సంతసించి యావిదురునిసెంతయు గౌరవించి యిట్లుచెప్పెనని శ్రీశుకుండు రాజునకుఁజెప్పి వెండియు నిట్లనియె. 'ఓవిదురా! లోకహితమునుగూర్చి యడిగితివిగాన నీప్రశ్నము మిగుల బాగుగనున్నది. మఱియు నీవు హరికథాశ్రవణతత్పరుండవయి యడిగియున్నావు; కనుక నది నాకు మిగుల సానందము కలుగఁజేసినది. ఇదియునుంగాక వ్యాసునివీర్యంబున జనించి భగవద్భక్తుండవయి యున్ననీవు హరికథచెప్పుమని యడుగుట యొకవింతకాదు. నాయనా! అన్యసక్తముకాని మానసముచే హరినిజేపట్టినీవు సాధారణపురుషుఁడవా? మాండవ్యుని శాపమునఁజేసి వ్యాసమహామునికి సతనిభ్రాతృక్షేత్రమయిన శూద్రస్త్రీయందు జన్మించితివి. యోజింప నీవు సాక్షాద్ధర్మముండవుకావే? మఱియు నీవు పరమజ్ఞానసంపన్నుఁడవు. భగవంతుండగుశ్రీకృష్ణునికిం బ్రియతముండవు. విష్ణుభక్తులలో నగ్రేసరుఁడవు. ఓపుణ్యాత్మా! నేను దైవికంబుగాఁ గృష్ణనిర్యాణకాలమునకు సరిగా సతనిచెంతకుఁ బోయితిని. అప్పుడతఁడు నన్నుఁజేరఁబిలిచి జ్ఞానోపదేశంబుచేసి, విదురున కుపదేశింపవలయు ననినా కానతిచ్చియున్నాఁడు. దీనింబట్టి యోజింప భగవంతునికి నీ

యందున్నదయారస మింతంతయని చెప్పవశమా? కావున నతని యానతిచొప్పున నీకు విజ్ఞానం బుపదేశింతు నాలింపుము. మఱి యు భగవంతుండు యోగమాయాబలమువలనఁ బ్రపంచింపఁ జేయుచున్న సృష్టిస్థితిలయములను గూర్చి చెప్పెదను. విష్ణునిమా హాత్మ్యముగూడ వర్ణింతును. సావధానచిత్తుండవు గమ్ము. ఓయీ! చిదచిత్తులు భగవంతునికి శరీరభూత మై యుండు. ఆచిదచిత్తులకు స్థూలసూక్ష్ములను రెండవస్థలు కలవు. చిదచిత్తులు నామరూప విభాగమునకుఁ దగనంతస్థితిలో నున్నప్పుడు సూక్ష్మావస్థయనియు, అవియే నామరూపముల విభజింపఁదగినంతస్థితిలో నున్నప్పుడు స్థూలావస్థయనియుఁ జెప్పుదురు. ఇందు సూక్ష్మావస్థయే కారణావస్థయనియు, స్థూలావస్థయే కార్యావస్థయనియు నెఱుంగుము. భగవంతునికి శరీరభూతము లగుచిదచిత్తులు కార్యావస్థను బొందినపుడు నామరూపవిభాగార్హమయి యీకనఁబడుచున్న ప్రపంచమగును. ఇట్లు గానవచ్చుప్రపంచమంతయు, సృష్టికిఁ బూర్వము జీవుల కంతరాత్మయై ప్రవేశించి వారిలకు ధారకుఁడై శాసకుఁడయి నామరూపవిభాగానర్హము లగుసూక్ష్మచిదచిత్తులు శరీరముగాఁ గలభగవంతుఁడే యని తెలిసికొనుము. * ఆభగవంతుఁడే తనకు సృష్ట్యుపయుక్తసంకల్పము ప్రభవించినప్పుడు

* ఇట 'భగవా నేక ఆసేద మగ్ర ఆత్మాఽఽత్మానాం విభుః। ఆత్మేచ్ఛా నుమతావాత్మా నానా మత్యుపలక్షితః॥ అని మూలము. ఇట్లు భగవంతుఁడు తనసంకల్పము ననుసరించి మార్పు చెందుచుండుటచే నతఁడు వికారములు కల వాఁడని యెంచఁబడరాదు; ఆవికారములు శరీరసంబంధులుగాని యతనిసంబంధించినవికావు. మతియు మూలమునన్న "ఇదమ్" శబ్దముచే స్థూలచిదచిచ్ఛరీరకుఁడయిన భగవంతుఁడే చెప్పఁబడును. ఆభగవంతునికి స్థూలావస్థలేనప్పుడు సూక్ష్మచిదచిచ్ఛరీరకుఁడయి యుండు. ఆతనికే కారణత్వ మంగీకరింపఁబడు

దేవాదినానావిధనామరూపములచే శోభితమగుచున్న ప్రపంచక మగుచున్నాఁడు. మఱియు నతఁడు సంహారోపయుక్త మగు సంకల్పము గలిగియున్నప్పుడు దేవాదినానావిధనామరూపములు లేక, కావునసే సూత్రాత్మావస్థగలిగినచిదచిత్తులు శరీరము గాఁగల వాఁడయి యుండును. ఆభగవంతుఁడు జీవునివలెఁ గర్మాధీన మగు సంకోచవికాసములు గలజ్ఞానముచే వెలయువాఁడు కాఁడు. కావున నసే యతఁడు ప్రళయదశయందును సమస్తపదార్థములం జూడఁగలఁడు. అతఁడు సూత్రాత్మావస్థను బొందినచిదచిత్తులు శరీరము గాఁగలవాఁడై, కార్యజాతమును జూడక తన్ను వ్యవహారార్హనామరూపములు లేనివానినిగాఁ దలంచుచోనె. సత్తావంతమగు ప్రతిపదార్థము జూడఁగలభగవంతుని కపృథక్సిద్ధవిశేషణభూతమగు మాయయే చేతనాచేతనాత్మకమగు నుభయవిధప్రకృతి యసఁబడుచున్నది. భగవంతుఁడు సదసదాత్మకమగు మాయచేతనే తా వ్యాప్యగతదోషములు పొందకుండఁ గార్యావస్థరూపమును

యును. ఓయీ! అట్లుచెప్పినచో సృష్టికిఁ బూర్వము చిదచిత్తులుగూడఁ బ్రతీయమానము లగుచున్న విశాన "ఏక" అనుపదముచే సజాతీయవిజాతీయస్వగత భేదశూన్యమగు బ్రహ్మమే జగత్కారణమని యేల చెప్పరాదు? అనియడుగ వలనుపడదు. "అగ్రే" అనుపదముచేఁ గాలము నిర్దేశింపఁబడినదికాన విజాతీయభేదమును, "ఆత్మనామాత్మా" అని చెప్పుటచే సజాతీయభేదమును, "భగవాన్" అనుపదముచేఁ గారణత్వమున కుపయుక్తములగు సర్వజ్ఞత్వసర్వశక్తిత్వాదు లగుగుణములు గలవాఁడని చెప్పుటచేఁ దాపృశగుణములనుబట్టి స్వగతభేదమును, సంభవించుచున్నవి. కావున వెనుకఁజూపఁబడినయర్థమును జెప్పరాదు "ఏక"అనుపదమున కర్థ మేమనఁగా నామరూపవిభాగానర్హమగు దశను బొందినవాఁడనునర్థము చెప్పవలెను. ఈయభిప్రాయముతోనే "ఏక" అనుపదము ప్రయోగింపఁబడినది.

బొందిన ప్రపంచకమును నిర్మించెను. మహదాదిక్రమముగా సృష్టిని దెలివెడ వినుము. భగవంతుఁడు, కాలానుగుణ మగుశక్తి గలిగి, కావునఁనే వైషమ్యమును బొందినసత్త్వాదిగుణములచే నొప్పుచున్నమాయయందు స్వశరీరభూతమగు జీవునిఁ బ్రవేశింపఁజేసి తాను వికారములను బొందకయే సృష్టిసామర్థ్యమును సంపాదించెను. ఇట్లుసృష్టిసామర్థ్యముకలదయి కాలప్రేరితమయియున్నయవ్యక్తమువలనఁ దనకు శరీరభూతమగుప్రకృతి నొందియున్నకార్యజాతమును జీవాంతరాత్మయై వెలువరించుచు, భగవంతుఁడు మహత్తత్త్వమాయెను.(అనఁగాఁ బ్రకృతిపురుషశరీరకుఁడయినభగవంతుఁడే మహచ్ఛరీరకుఁడాయెనని తెలియునది). ఆమహత్తత్త్వము జీవాంశముతోను, సత్త్వాదిగుణములతోను, గాలముతోను, గూడి, భగవత్సంకల్పరూపమగు జ్ఞానమునకు గోచరమై, పరమాత్మస్వరూపకమయి, ప్రపంచమును సృజించుతలంపుచే రూపాంతరము నొందెను. అట్లు రూపాంతరము నొందిన మహత్తత్త్వంబువలన శరీరేంద్రియములకుఁ గర్తృరూపమగుచు, భూతేంద్రియాదిరూపముగాఁ బరిణమించుస్వభావముగల యహంకార ముదయించెను. ఆయహంకారము సాత్త్వికమనియు, రాజసమనియుఁ, దామసనునియు మూఁడువిధంబులయ్యె. వికారము నొందినసాత్త్వికాహంకారమువలన మనంబుదయించె. మఱియు దానివలననే శబ్దాదులకు నభివ్యంజకములయిదిగాదిదేవతల కధిష్ఠేయము లయినజ్ఞానేంద్రియంబులును, గర్మేంద్రియంబులును, జన్మించినవి. ఈయుభయవిధములగు నింద్రియంబులును రాజసాహంకారసహకృతమయిన సాత్త్వికాహంకారకార్యములే. మఱియు రాజసాహంకారము సాత్త్వికతామ

సముల కనుగ్రాహకమువాత్ర మేయగుటంబట్టి యనుగ్రాహక త్వమే రాజసకార్యము కాని యితరకార్యములు లేవు. తామసము భూతములకును శబ్దాదులకును గారణము. ఆతామసమువలన బ్రహ్మప్రమాపకమగుశబ్దమును, ఆశబ్దమే లక్షణముగాఁ గలయా కాశమునుబుట్టినవి.అది కాలమాయాంశయోగముచే భగవత్సం కల్పరూపమగు జ్ఞానమునకు విషయభూత మయినది. ఆయాకా శంబున నుదయించిన స్పర్శతన్మాత్రవలన వాయువుదయించె. ఆ వాయువు వికారము నొందుచు నాకాశగుణమగు శబ్దముచే సంయుతమయి, యధికబలయుతమయి, రూపతన్మాత్రను బుట్టిం చె. ఆరూపతన్మాత్రమే లోకలోచన మయి విలసిల్లు తేజస్సును గలి గించెను. వాయుగుణములగు శబ్దస్పర్శములతోఁ గూడినయా తే జస్సు భగవత్సంకల్పవిషయమై కాలమాయాంశసంబంధమునం జేసి రసతన్మాత్రను బుట్టించె. అందువలన నుదకంబు సముద్భూతం బయ్యె. శబ్దస్పర్శరూపరసగుణములతోఁ గూడినయుదకము భగ వత్సంకల్పవిషయమై కాలమాయాంశసంబంధమునం జేసి వికార ము నొందుచు గంధతన్మాత్రను బుట్టించె. ఆగంధతన్మాత్రవలన భూమి యుదయించె. ఓమహాత్మా! ఆకాశాదిభూతములందు శబ్దా దిగుణము లేకో త్తరవృద్ధిగా నుండు నని తెలిసికొనుము. అం దా కాశమునందు శబ్దమువాత్ర మేయుండును. వాయువునందు శబ్ద స్పర్శగుణము లుండును. అగ్నియందు శబ్దస్పర్శరూపగుణంబులు మూఁడుండుము. జలమందు శబ్దస్పర్శరూపరసము లనునాలుగు గుణము లుండును. భూమియందు శబ్దస్పర్శరూపరసగంధము లను నై దుగుణంబు లుండును. ఓవిదురా! కాలమాయాజీవాంశములు చిహ్నములుగాఁగలిగి ఫ విష్ణునిశరీరభూతు లయినమహాదాది దేవతలు

పరస్పరసంబంధము లేనివా రగుటంబట్టి బ్రహ్మాండమును సృజింప నసమర్థులయిచేతులు జోడించి భగవంతునికి నమస్కరించి యిట్లు స్తోత్రముచేయనారంభించిరి. *ఓభగవంతుఁడా! నీపాదపద్మములకు ననుస్కారము చేయుచున్నారము. ఓదేవా! నీపాదపద్మములు తమ్ము సేవించుచున్నవారితాపముల నపహరింప గొడుగులవంటి వికదా! మఱియు నీపాదపద్మముల నాశ్రయించియే కదా యతీశ్వరులందఱు భయంకర మయినసంసారదుఃఖమును దొలంగించుకొనుచున్నారు! ఓదేవదేవా! నీపాదపద్మములసేవ సేయనిచోఁ దాపత్రయబాధితు లగుజీవులు కొంచెమైనను సుఖముపొందలేరు. మఱియు నీపాదపంకజసేవ చేయనివారికిఁ దాపత్రయనివృత్తి కలుగనే కలుగదు. కావున నీపాదభజనము చేసి మే మందఱము తాపత్రయమును దొలంగించుకొని ముక్తినిబొందెదము. ఓయీశ్వరా! నీపాదములు నదులలో నెల్ల నుత్తమమయిన గంగానదికి నుత్పత్తిస్థానములు కదా! ఓదేవా! నీపాదనులయందుఁ బుట్టిన గంగానదియె లోకులపాపములఁ దొలఁగించుచున్నప్పుడు గంగానదికిఁ గారణభూతము లయిననీపాదపద్మములు

* ఓయీ! మహాదాదులపఁ దత్త్వములనియేనామములుగలవు. కాని దేవతలని వాడుక లేదు. కాన దేవతలని వాడుట యెటు? అనినచోఁ జెప్పెద వినుము. మహాదాదులు భగవంతుని శరీరభూతములు కాన దేవతలని పిలువవిచ్చును. ఇందులకు శ్రుతిప్రమాణమున్నది. శ్రు = హాంతాహా మిమా స్త్రిస్రోదేవతాః.— (అనఁగా, ఇమాః = ఈ, త్రిస్రః = మూడయిన, దేవతాః = కాలమాయాజీవాంశలు) అనియర్థము. కావున వెనుకటిదోషము నిరస్తమగుచున్నది. మహాదాదులు అచేతనములుగదా. భగవంతు నెట్లుస్తోత్రము చేయుఁగలవు? అని శంకింపఁబనిలేదు. పరమాకాశవర్తులైన తత్త్వాభిమానిదేవతలే తత్త్వముల నధిష్ఠించి భగవంతుని స్తోత్రము చేయుచున్నవని చెప్పుటకు వలనుపడుచున్నది.

పాపములఁ దొలంగింపఁగలవని వేఱు చెప్పవలయునా? ఓ మహానుభావా! పక్షులుగూండ్లలో జన్మించి పెక్కులు కలవయి యచ్చటనుండి వై కెగిరి తిరిగివచ్చి గూండ్లలోనే ప్రవేశించుచున్నట్లు నీ ముఖకమలమందుఁ బుట్టి, వేదములు లోకమందు వ్యాపించి, తిరుగ నీయందే పర్యవసన్నములగుచున్నవి! భవత్కారణములయిన వేదముల నవలంబనముగాఁ జేసికొని యతీశ్వరులందఱు నిర్మలమగు చిత్తముతో నెనసినిపాదములఁ బరిశీలించుచున్నారో, యట్టినీ సామర్థ్యము నెవ్వరు గొనియాడఁగలరు? ఇదిగో నీపాదముల శరణుచొచ్చుచున్నాము. మమ్ముల రక్షింపుము. మతియు, ఓ యీశ్వరా! ఆస్తిక్యబుద్ధిచేతను, శ్రుతివిహితయజ్ఞానికర్మయోగముచేతను, జ్ఞానయోగముచేతను, సనుగృహీతమగు భక్తిచేతను, వైరాగ్యబలముచేతను, సంస్కృతమయిన మనస్సునం దెవరిపదపద్మములఁ జేర్చి పండితులందఱు పూజించుచున్నారో అట్టి నీపాదపద్మముల శరణొందినమమ్మును జేరఁదీయుము. ఓభగవంతా! నీపాదపద్మములు నీభక్తులకు సంసారభయము లేకుండఁ జేసి రక్షించుచున్నవి. అట్టి నీపాదములకు నమస్కరించి ప్రపంచము సృష్టిస్థితిలయములు గావింపఁ బెక్కవతారములు ధరించియున్న నిన్నుశరణుచొచ్చుచున్నాము. కావున నమ్ముఁ గాపాడుము. ఓదేవదేవా! సంసారకూపంబునం బడి దారపుత్రాదిసంబంధము లనుపాశములచే బద్ధులై యీసర్వము నాదే యనెడిమమకారంబునకును, సమస్తము నేనే చేయుచున్నానెడి యహంకారమునకును, లోఁబడినవారయి, యున్నమానవులహృదయసీమలయం దంతరాత్మవయి యుండినను వారి కేవి యతిదూరములగుచున్న వ్రో, వారెన్ని ప్రయత్నములుచేసినను వేనిని గనలేరో, యట్టినీపాదపద్మము

లను శరణుచొచ్చుచున్నాము. మఱియు వానిని బూజించుచున్నాము. ఓ యీశ్వరా! బాహ్యేంద్రియవ్యాపారములచే నపహృతచిత్తులై మూఢాత్ములైయున్న మానవులు మీపాదపద్మములను జూడఁజాలరుగాని నీపాదారవిందములం దాత్మసమర్పణము చేయుటచే నొప్పారుశమదమాదిగుణసంపద గలవారయి సంతతము సేవించుచున్నయుత్తమశ్లోకులు వానిఁ జూడఁగలరు. ఓదేవదేవా! మీ కథామృతరసమును దమకంబునఁ ద్రావితాగివి సొక్కోనన్నతి నొంది తాపంబులను బాఱఁదోలియున్న పుణ్యాత్ములు పరమపూజ్యమయి, కాలాదుల కయినయపరిహతమయియున్నవైకుంఠలోకమును జెందుదురు. ఓమహాత్మా! మఱికొందఱు మహాత్ములు వైరాగ్యములుచేతను, జ్ఞానాతిశయముచేతను,నంతరింద్రియబహిరింద్రియములవ్యాపారములఁ జూలించిచిత్తంబులను నిర్మలంబు గావించుకొని హృత్పద్మనివాసుండవయి చిన్మయాకారత్వమునుబొంది యున్ననీదివ్యమూర్తిని హృదయమచిత్తములందుఁ జేర్చి బలిష్ఠమయిన మాయను జయించి నిన్నుఁ జెందుదురు. భవత్సేవాతిశయముచే వారల కెంతమాత్రము ప్రయాసముకలుగనేరదు.ఓదేవా! నీపదవినొందుటకు యోగీశ్వరులకు యోగాభ్యాసములవలనఁ బ్రయాసము లుండునేమోకాని నీ సేవనేయువారు సుఖతేనియు నాయాసము లేకయే నీపదమున జెందుదురు. ఓ పరమాత్మా! నీవు లోకములను సృజింపఁదలంచి పత్వాదిగుణములచేత మమ్ము ముందుగాఁ బుట్టించుటంజేసి పుట్టితిమి. కాని పరస్పరము గలియనిమే మందఱము నెంతమాత్రము బ్రహ్మాండరచనయందు సమర్థులము గాకున్నారము. మాకుఁ గారణభూతుఁడవయిన నీకు బ్రహ్మాండ

రచనారూపమయిన ప్రత్యుపకారము చేయవలసినది కాని యం తటిశక్తి మాకు లేదు. ఓదేవా! ఆయాకాలములయందు నీకు బలులను దెచ్చి యెట్లు పూజింతుమో; నీకుఁ గ్రీడాసాధనముల నంటివార మగుమేము నన్నాదిభోగ్యవస్తువుల నెట్లనుభవింతు మో; ముంగు సృజింపఁబడిన దేవాదిలోకము జ్ఞానకర్మేంద్రియ ములకు విషయములయినపదార్థములను దెచ్చి యెట్టులర్పించునో; యట్లు చేయుటకు మా కెంతమాత్రము శక్తి చాలకున్నది. ఓదే వా! నీవు పురాణపురుషుఁడవు, స్వకార్యముల మయి దేవతల మగుమా కందఱకుఁ గారణభూతుఁడవు నీవే ! నుతియుఁ గూ టస్థుఁడవు నీవే ! నుతియు నాయా దేవతలయం దంతరాత్ముఁ డవయి యున్నవాఁడవునీవే! నీవు శబ్దాదిగుణగ్రాహకము లయి న జ్ఞానకర్మేంద్రియములకుఁ గారణభూతమయిన మాయయం దు సృష్టిసామర్థ్యముగల వీర్యము నుంచి యున్నాఁడవు. అందు వలననే మేమందఱము జన్మించినవారము మేమందఱము నీ శరీరభూతుల మయి యున్నారము. కావున మాయందు దయ యుంచి జగత్కల్పనాశక్తి చాలనిమాకు మీశక్తిని దోడ్పాటు గాఁజేసి విజ్ఞానము గలిగించి రక్షింపుము. అట్లయిన మే మేకార్య ముకై పుట్టితిమో యక్కార్యమును నెఱవేర్పఁగలము.' అనె ను. * ఇదిఅయిదవ యధ్యాయము.

అది విని త్రివిక్రముఁడగు భగవంతుండు మిళితములుగామి స్వశరీరభూతములై యున్నతత్వములకు లోకరచనాసామర్థ్య

---

* ఇట ముఖ్యముగాఁ దెలియఁదగినయంశ మేమనఁగా, "శ్లో॥ పురుషేణాత్మ భూతేన వీర్యమాధత్త వీర్యవాన్। కేత స్త్వజాయాం కవిమాదధేఽజః॥" అని

ముఁలేక యుండుటచూచి వాని కట్టినామర్థ్యము కలుగుటకయి కాల మనుపేరుగలస్వీయశక్తియందుఁ బ్రవేశించి భాగకుఁడై

చెప్పటచేఁ బరమాత్మాత్మకుఁ డగుసమష్టిపురుషునిచే సృజింపఁబడినమాయయే మహాదాదుల కారంభ మగుచున్నట్లు తెలియుచున్న ది. మఱియు మహత్తత్త్వమునొదలు పృథివీతత్త్వము తుదగాఁగల యన్నియు నచేతనముయొక్క యవస్థావిశేషములే. అందు మాయ ఖండితము కాకయే ప్రదేశభేదమునుబట్టి మహద్రూపముగాఁ బరిణమించును. అట్లే మహత్తత్త్వముగూడ ఖండితము కాకయే ప్రదేశభేదమునుబట్టి యహంకారరూపముగాఁ బరిణమించు. అట్లే యహంకారాదులంచుఁగూడఁ జూచుకోవలెను. మహత్తత్త్వము తత్తత్కార్యములుగాఁ బరిణమించునప్పుడు మహత్తత్త్వమంతయు నహంకారముగాఁ బరిణమింపక, యేకదేశముచేతనే యహంకారమును బుట్టించును. ఇట్లు మహదాదులు లేక దేశముచేతనే కార్యంబులం బుట్టించుమన్నచని గ్రహింపవలెను. ఇట్లు చెప్పక సమస్తమహదాదులు నుత్తరోత్తరకార్యములుగాఁ బరిణమించు ననిచెప్పినచో మహదాదులు ప్రత్యేకముగా చిక్కిపోవుటచే ''పృథివ్యప్పు ల్ప్రలీయతే'' ఇది మొదలుకొని ''మహానవ్యక్తేలీయతే'' అనువాక్యంబులతోఁ జెప్పిన ప్రళయక్రమము పొసఁగదు. మఱియు లయమనఁగా బూర్వావస్థయందున్న ద్రవ్యమునందుఁ బ్రదేశదేశముచే నుత్తరావస్థను బొందినద్రవ్యము స్వీయావస్థను విడిచి లీన మగుటయే. ఎట్లనఁగా మహత్తత్త్వము నహంకారమును దీసికొనును. మహత్తత్త్వముయొక్క యేకదేశముచేతనే యహంకారముపుట్టినట్లు తెలియునుగదా? ఇప్పుడు పూర్వావస్థను బొందినద్రవ్యమనఁగా, మహత్తత్త్వము. తదేకదేశముచే నుత్తరకార్యమయిన యహంకారమే యుత్తరావస్థను బొందిన ద్రవ్యము. ఈయహంకారమువ్వీయావస్థను విడిచి మహత్తత్త్వమునఁగలియుటయే లయమనఁబడును. మహదాదు లేకదేశముచేతనే యుత్తరకార్యముగాఁ బరిణమించునని చెప్పనిచోఁ బూర్వోక్తలయము కుదరదు. మఱియుఁ బ్రత్యేకముగా మహదాదులస్థితి యసంభవమగుటచేఁ బంచీకరణముగూడ నుపపన్నము

మహదహంకారములు, పంచభూతములు, పంచతన్మాత్రలు, మనంబుతోఁగూడినయింద్రియదశకము నాఁబడు తత్త్వసమూహమును బ్రవేశించెను. భగవంతుఁడట్లు తత్త్వగణమును బ్రవేశించి ప్రేరణాత్మక మయినచేష్టచే విడివిడిగా నున్నయాతత్త్వగణము నేకముగాఁజేసి వానివానివ్యాపారమును దెలిపెను. అంత నీతత్త్వగణము భగవత్సంకల్పముచేఁ దమతమవ్యాపారములను దెలిసికొని భగవంతునిచే నాజ్ఞాపింపఁబడినయి తమతమయంశములచేఁ జతుర్ముఖుని సృజించినవి. భగవంతుఁడు సంకల్పజ్ఞానరూపముగా దమయందుఁ బ్రవేశించి యుండుటంబట్టి స్థావరజంగమములు కార్యరూపముగాఁ దమయందుఁగల తత్త్వస

కాదు. ఇట్లుమహత్త్వము మొదలుకొని పృథివీతత్త్వము వఱకుఁగల యవస్థలను బొందియున్న యవ్యక్తమునందుఁ బరమాత్మస్వరూపుఁడగునమష్టిపురుషుఁడు ప్రవేశించియుండుటచే నది పరమాత్మశరీరముగాఁ జెప్పనొప్పును. ఇట్లుపరమాత్మ కారణద్రవ్యమగు నవ్యక్తమును బ్రవేశించినను, గారణావస్థద్రవ్యము, కార్యావస్థద్రవ్యము, ఒక్కటియే యగుటచే "యస్యపృథివీశరీరమ్" ఇత్యాదిశ్రుతులు పపన్నము లగుచున్నవి. ఓయీ! నీవుచెప్పినది యంగీకరించినచో "యస్యావ్యక్తంశరీరమ్" అనెడివాక్యముచేతనే యవ్యక్తముకంటె భిన్నముకానిపృథివ్యాదులుగూడ భగవచ్ఛరీరమగుట నిర్ధించుచుండఁగాఁ బ్రత్యేకముగా "యస్యపృథివీశరీరమ్"-"యస్యాపశ్శరీరమ్" ఇత్యాదిశ్రుతులతో నేమిప్రయోజనము? అన్నచోఁజెప్పెద.వినుము.అవస్థకును, నవస్థావస్తువునకును భేదముకలదు. ఎట్లనఁ బృథివికిని బృథివీత్వావస్థకును భేదముగలదనుట సర్వసమ్మతము. అవస్థావస్తువులగు నవ్యక్తమహత్తత్త్వపృథివ్యాదులొక్కటియే కాన నవ్యక్తమందు భగవదను ప్రవేశము చెప్పుటచేఁ దక్కినమహత్తత్త్వాదులు గతార్థములైనను మహత్త్వపృథివీత్వాద్యవస్థలు భగవచ్ఛరీర మనిచెప్పుటకు వెనుకటిశ్రుతులు కావలసియున్నవి.

మూహాము పరస్పరము సంక్షోభవించి సమష్టిపురుషునకు గర్భరూపమయిన బ్రహ్మాండరూపముగాఁ బరిణమించినవి. సువర్ణవికారమయిన యాయండమున దేవాదిసత్త్వములతోఁ గూడియున్న సమష్టిపురుషుఁ డాయండమును పరిపాకముఁ జెందుపర్యంతకాలము నివసించియుండెను. మహాభూతముల కపత్యరూపుఁడయి, భగవత్సంకల్పమును, జీవాత్మలను, జడీయకర్మములను, జీవసంఘమునకు శరీరాదులను గల్పించుచిచ్ఛక్తిని, బొంది యున్నసమష్టిపురుషుండు తన్మును, భోక్త, విషయము, కరణము, నామూఁడువిధములుగా విభజించెను. ఆమూఁడింటిలో నొకటియగు కరణమును, జ్ఞానేంద్రియపంచకము, కర్మేంద్రియపంచకము, మనస్సు నాఁ బదునొకొండువిధములుగా విభజించెను. ఆసమష్టిపురుషునికి నీప్రకారముగా విభజించుటకుఁ దగినశక్తి యెట్లు కలిగినదో చెప్పెదను. వినుము. ఈబ్రహ్మసమస్తవ్యష్టిపదార్థములకుఁ గారణభూతమయిన పరమాత్మాంశమువలనఁ బుట్టెను. మఱియుఁ బరమాత్మ యావేశావతారమని చెప్పఁదగినవాఁడు. పరమాత్మాంశావతార మనఁదగిన యాసమష్టిపురుషునినుండియే సమస్తమయిన వ్యష్టిపదార్థజాతము పుట్టినది. మఱియు నాబ్రహ్మ స్వశరీరాంతర్గతులగుభోక్తలతోఁ గూడినవాఁడు. అతఁడే భూతములందు వర్తించుశబ్దాదివిషయములతోఁ గూడినవాఁడు. అతఁడే యింద్రియసమష్టితోఁ గూడినవాఁడు. అతఁడే జ్ఞానకర్మేంద్రియదశకము, మనస్సు, నాఁబడు నేకాదశవిధేంద్రియములు గలవాఁ'డని చెప్పి మైత్రేయుండు విదురున కిట్లనియె. 'ఓవిదురా! జగన్నియంతయగు భగవంతుండు మహదాదితత్త్వములొనరించిన విన్నపముల నాలించినవాఁడయి యింద్రియాదుల

వ్యష్టిరూపముగా విస్తరింపఁజేయుటకుఁ దనదివ్యజ్ఞానముచే "బ్రహ్మ వ్యష్టిశరీరముల వ్యష్టీంద్రియముల విభజింపఁదగిన సామర్థ్యముగలవాఁడయి యుండుఁగాక" యని సంకల్పించెను. అతఁడట్లు సంకల్పించినతోడనే సంకల్పవిషయుఁడయిన బ్రహ్మవలన వ్యష్టీంద్రియములకుఁ గొన్నిస్థానము లుత్పన్నంబులయ్యె. వానిని జెప్పెద నాలకింపుము. సనుష్టిపురుషుఁడయిన చతుర్ముఖునివలన విభక్తమయినవ్యష్టిజీవుని యాస్యరూప మయినస్థాన మేర్పడ స్వాంశమయిన వాగింద్రియముతోఁగూడ నగ్నిహోత్రుఁ డందుఁ బ్రవేశించెను. ఆవాగింద్రియముచేతనే వ్యష్టిజీవుఁడు సమస్తశబ్దజాలము నుచ్చరించుచున్నాఁడు. ఆచతుర్ముఖునివలన విభక్తమయిన వ్యష్టిజీవునితాలుస్థానమును వరుణదేవుఁడు స్వాంశభూతమయినరసనేంద్రియముతోఁగూడఁ బ్రవేశించెను. వ్యష్టిజీవుఁ డారసనేంద్రియమువలననే యామ్లతిక్తమాధుర్యాది రసములను గ్రహించుచున్నాఁడు ఆ సమష్టిపురుషునినలన విభక్తములయిన వ్యష్టిజీవుని నాసికాస్థానములను నశ్వినీసుతులు నిజాంగభూతమయిన ఘ్రాణేంద్రియముతోఁ గూడఁ బ్రవేశించిరి. వ్యష్టిజీవుఁ డాఘ్రాణేంద్రియముచేతనే సుగంధదుర్గంధాదులను గ్రహించుచున్నాఁడు. ఆ చతుర్ముఖునివలన విభక్తములయిన నేత్రస్థానముల నాదిత్యుఁడు స్వాధిష్ఠేయభూతమయిన చక్షురింద్రియముతోఁగూడఁ బ్రవేశించెను. వ్యష్టిజీవుఁ డానేత్రేంద్రియముచేతనే నీలపీతాదిరూపములను జూచుచున్నాఁడు. ఆచతుర్ముఖునివలన విభక్తమయిన చర్మస్థానములను స్వాంశమయినత్వగింద్రియముతోఁగూడ వాయువు ప్రవేశించెను. వ్యష్టిజీవుఁ డాత్వగింద్రియముచేతనే మృదుత్వకఠిన

త్వాదులను గ్రహించుచున్నాఁడు. చతుర్ముఖునివలన విభక్తములయిన కర్ణస్థానములను స్వాంశమయిన కర్ణేంద్రియముతోఁగూడ దిగ్దేవతలు ప్రవేశించిరి. వ్యష్టిజీవుఁ డాశ్రోత్రేంద్రియముచేతనే శబ్దములను వినుచున్నాఁడు. చతుర్ముఖునివలన విభక్తమయినత్వక్కానమును నోషధ్యభిమానదేవతలు స్వాంశభూతముఁ లయిరోమములతోఁగూడఁ బ్రవేశించిరి. వ్యష్టిజీవుఁ డారోమములచేతనే కండూతిని బొందుచున్నాఁడు. ఒక్కత్వగింద్రియమునకే స్థానభేదముచేఁ గండూతియు స్పర్శమునుఁ గలుగుచున్నవి. ఆ చతుర్ముఖునివలన విభక్తమయినయుపస్థేంద్రియస్థానమును బ్రజాపతి స్వాంశభూతమయి రేతోరూపమయియున్నయింద్రియముతోఁగూడఁ బ్రవేశించెను. వ్యష్టిజీవుఁ డాశ్రేతస్సుచేతనే రతిసుఖమునుబొందుచున్నాఁడు సమష్టిపురుషునివలన నేర్పడిన గుదస్థానమును మిత్రుఁడు పాయ్వింద్రియముతోఁగూడఁ బ్రవేశించెను. వ్యష్టిజీవుఁడు పాయ్వింద్రియముచేతనే పురీషమును విసుచుచున్నాఁడు. చతుర్ముఖునివలన విభక్తములయిన చేతులను గుంచనాకుంచనాకర్షణాదులకు సాధనమయినపాణీంద్రియముతోఁగూడ నింద్రుఁడు ప్రవేశించెను. వ్యష్టిజీవుఁ డాపాణీంద్రియముచేతనే జీవనమును సంపాదించుకొనుచున్నాఁడు. సమష్టిపురుషునివలన విభక్తమయినపాదములను విష్ణువు గమనమునకు సాధనమయినపాదేంద్రియముతోఁగూడఁ బ్రవేశించెను. వ్యష్టిజీవుఁ డాపాదేంద్రియముచేతనే గమనాదికార్యములను జేయుచున్నాఁడు. చతుర్ముఖునివలన విభక్తమయిన వ్యష్టిజీవునిహృదయమును జంద్రుండు స్వాంశమయిన మనస్సుతోఁగూడఁ బ్రవేశించెను. వ్యష్టిజీవుఁ డామనస్సుచేతనే సంక

ల్పవికల్పరూపమయిన క్రియలను బొందుచున్నాఁడు. మఱియు, నొక్కటియగు నంతఃకరణము వ్యాపారభేదముచేత మనస్సనియు బుద్ధియనియుఁ, జిత్తమనియు, నహంకారమనియు, నాలుగువిధంబు లయ్యెఁ. వానిలో మనస్సునకుఁ జంద్రుఁడధిదేవత. బుద్ధికి బృహస్పతి యధిదేవత. అహంకారమునకు రుద్రుఁడధిదేవత. చిత్తమునకుఁ బ్రజాపతి యధిదేవత. మఱియుఁ జతుర్ముఖునివలన విభిన్నమయిన బుద్ధిస్థానమును బ్రహ్మ, నిశ్చయాత్మకజ్ఞానము కలిగించెఁ. సామర్థ్యముతోఁ గూడఁ బ్రవేశించెను. జీవుఁడా బోధనాంశముచేఁ దెలియఁదగినవస్తువును దెలిసికొనుచున్నాఁడు. చతుర్ముఖునివలన విభక్తమయినయహంకారస్థానమును నభిమానకర్తృదేవతయగు రుద్రుండు దేహాభిమానాంశముచేఁ బ్రవేశించెను. జంతువాయభిమానముచేతనే కర్తవ్యమును జేయుచున్నాఁడు. చతుర్ముఖునివలన విభిన్నమయిన యంతఃకరణస్థానమును బ్రజాపతి సన్యగర్థమును జింతించుటయే రూపముగాఁ గల మనస్సు ప్రవేశించెను. జీవుఁడాచిత్తాంశముచే నాలోచింపఁబడిన యర్థజాలమును, లెస్సగా నాలోచనీయమగు నర్థనిషయజ్ఞానమును, జెందుచున్నాఁడు. మఱియు నావిరాట్పురుషుని శిరస్సువలన స్వర్గలోకము నాభివలన నాకాశము పాదములవలన భూలోకంబును బుట్టినవి. అందు స్వర్గలోకమును సత్త్వగుణప్రధానులగు దేవతలు పొందిరి. మఱియు రజోగుణప్రధానులయినమనుష్యాదులు రాజసకర్మములకుఁ దగినఫలమును ననుభవింప ననుకూలమయియున్న భూతలమును బొందిరి. తమోగుణస్వభావమునుగలనయి, రుద్రునకుఁ బారిషదగణములయిన భూతప్రేతపిశాచాదులు గగనము నాశ్రయించినవి. ఇమ్మట సమ

ష్టిపురుషుని ముఖమువలన వేదములును బ్రాహ్మణులు నుదయ
మందిరి. శరీరమున కుత్తమభాగమయిన ముఖమందు జన్మించిన
కారణముననే బ్రాహ్మణులు తక్కినవారికంటె నుత్తములును,
గురువులును, నైరి ముఖమువలెఁ బ్రధానులు నయిరి. తరువాత నా
విరాట్పురుషుని బాహువులవలనఁ గొంద ఱుదయించిరి. వారు
భగవంతుని పౌరుషాంశమువలనఁ బుట్టినవారయి తక్కినవర్ణము ల
వారిని జోరాదులవలనఁ గలుగునుపద్రవములనుండి (ఆపత్తుల
నుండి)రక్షించుచున్నారు. కావున వారికి క్షత్త్రియు లను పేరువచ్చి
నది. పిమ్మట నావిరాట్పురుషునియూరువులవలనఁ గొందఱు జన్మిం
చిరి. వారలకే వైశ్యు లని పేరు. వారు లోకములో నున్నవారి
కందఱికిఁ గ్రయవిక్రయకృషివ్యవహారములవలన జీవనోపాధిని
సంపాదించుచున్నారు. భగవంతునిపాదములవలన శుశ్రూషా
వృత్తిగల శూద్రులు జనించిరి. వారు తమజాతివారికి నుచి
తమయిన ద్విజశుశ్రూషచేయుచు దానిచేత భగవంతుని సంత
సింపఁ జేయుచున్నారు. ఈనాలుగు జాతులవారును స్వకులవిహి
తము లయినధర్మముల నవలంబించి శ్రద్ధచేతఁ దమచి త్తము పరి
శుద్ధిఁ జెందుకొఱకు నేవానినివలనఁ దాము వృత్తులతోఁ గూడ
జన్మించిరో యా శ్రీహరిని సర్వకాలములయందుఁ బూజించు
చుందురు. ఓవిదురా ! కాలకర్మస్వభావ మయినశక్తితోఁ
గూడికొని యున్నభగవంతునిమాయావిజృంభణము మహిమను
వర్ణింప నెవ్వఁడు సమర్థుఁడు. ఓయీ ! ఎవ్వనికిఁ దరముకా
నిచో నీవెట్లు వర్ణించుచున్నావని యందువేని చెప్పెద. వినుము.
నాకుమాత్రము హరిమహిమను వర్ణింపను శక్తిగలదా? హరి
శక్తిని సంపూర్ణముగా వర్ణింపలేను. అయినను మాగురువులవలన

విన్నంతవఱకు నీకుఁ జెప్పుచున్నాను. మతియు నాబుద్ధికి గోచర మగునంతవఱకుఁ జెప్పఁగలను. భగవంతునిమహిమను గొంతవ ర్ణించుటవలనఁ గలిగెడిలాభము హరికంటె నన్యులనామములఁ బ లుకుటచే దుష్టములయినవాక్యములను బవిత్రముచేయుటె. భ గవన్మహిమ తనకుఁ దెలిసినంతవఱకు వర్ణించుకొనిన నంతేచా లును. అంతియేకాని భగవన్మహిమఁ బూర్తిగాఁ దెలిసికొనినం గాని ఫలములేదని తలంపకుము. ప్రశస్తకీర్తిగల భగవం తునిగుణవర్ణనమే ముఖ్యఫల మని యెఱుంగుము. మతియు విద్వాంసులు విష్ణుకథలను వర్ణించుచుండగా నాకథాసుధారస ములను నాఁకొనియున్నకర్ణేంద్రియములు తృప్తిచెందునట్లుగా ద్రావుటయే ముఖ్యఫల మని యెఱుంగుము. ఓవిదురా! భగవ న్మహిమను దెలియఁజాలనివారము మేమేకాదు. విష్ణుమూర్తి నాభికమలమం దుదయించి యతనిదయకుఁ బాత్రుఁడైన సమస్త ప్రపంచము సృజింప శక్తిగలిగినబ్రహ్మ బహుసంవత్సరంబు లొన ర్చినయోగముచేఁ బరిపక్వమగు బుద్ధిచేతనైనను భగవన్మహిమ పూర్తిగఁ దెలియలేఁడు దీనికేమి? తన్నుఁబొందించుటకు మార్గ భూతంబగు వేదము లేయాత్మగాఁగల హరియే యాశ్చర్యశక్తిగలవా రికిసయిత మాశ్చర్యము గొలుపు మాయను గనుఁగొన లేనప్పు డు బ్రహ్మలసంగతి చెప్పనేల? వేదములుగూడ భగవన్మహిమను దెలిసికొనలేక మనస్సుతోఁగూడ మఱలిపోవుచున్నని వేదములు పలుకుచున్నవి. అట్టి భగవన్మహిమను మన మెట్లు తెలిసికొనఁగల ము? మనాదులును, దిక్పతులును, జతుర్ముఖుఁడు, నీశ్వరుఁడు మొదలగువా రేమహాత్మునిపాదపద్మములఁ గనుఁగొనలేరో, యట్టి

భగవంతునికి దండప్రణామము లాచరించుచున్నాను. ఇది యూ ఱువ యధ్యాయము.

అని యిటుపలుకుచున్న మైత్రేయునచనంబు లాలకించి వ్యాసపుత్త్రుఁడును, దత్త్వదర్శియునగు విదురుండు తనవాక్కులచేఁ బ్రీతిగొలుపునట్లు భగవల్లీలల వినిపించుమైత్రేయుం గాంచి యిట్లనియె. * ఓమైత్రేయా ! జ్ఞానాదిషడ్గుణ పరిపూర్ణుఁడును. జిన్నా

* ఇచ్చట విదురునివచనమువలన నీయభిప్రాయము తెల్లమగుచున్నది. భగవంతుఁడు సృష్ట్యాదికార్యములకుఁ గర్తయయ్యు జగద్రూపముగాఁ బరిణమించియున్నాఁడు. అట్లు కర్తృత్వపరిణామములు భగవంతునకు లీలచేఁ గలుగుచున్నవా ? లేక కర్మములవలనఁ గలుగుచున్నవా? కర్మములవలనఁ గలుగుచున్న వనిచెప్ప వీలునుపడదు. ఒకవేళ చెప్పినచో "అపహతపాప్మా" ఇత్యాదిసమగు శ్రుతికి విరోధము కలుగుచున్నది. కావున లీలచేతనే కర్తృత్వపరిణామాదులు కలుగుచున్నవని చెప్పవలయును. ఇట్లు నిర్వికారుఁడును నిర్గుణుండు నగుభగవంతుని జగత్కర్తృత్వము, జగదుపాదానత్వము, లీలామాత్రప్రయోజనము లని యంగీకరించినను, బరిణామాదులగు క్రియలును, గుణకార్యములగు గర్భ, జన్మ, జరా మరణాదిక్లేశములును, భగవంతు నేలపొందవు? అట్లు జీవునివలెఁ బరిణామాదులను బొందుచున్నభగవంతునికి జగత్కారణత్వమెట్లు చెప్పవచ్చును? మఱియు జగత్కారణత్వకర్తృత్వములు కలుగుట లీలకొఱకుమాత్రమే యని పలుకుచు నందుల కొకదృష్టాంతముగా సమస్తభూపాలయాధిపతియై కందుకక్రీడాదిలీలల ననుభవించుచున్నమహారాజును జెప్పుచున్నారు. కాని యీదృష్టాంతము యుక్తముకాదు. మహారాజు జ్ఞానాదిషడ్గుణముల పూర్తిలేనివాఁడు. అతఁడు సమస్తకామములను బొందనివాఁడు. సత్త్వాదిగుణంబుల కధీనుఁడు, మఱియు వికారములుగలవాఁడు. ఇఁక భగవంతుఁడో షడ్గుణపరిపూర్ణుఁడై, యవాప్తసమస్తకాముఁడయి, సత్త్వాది ప్రాకృతగుణములు లేనివాఁడయి, వికారాదులులేనివాఁడయి, యున్నాఁడు.

త్రుడును, గావున నే పరిణామాదులు లేనివాడును, మఱియు స
త్వాదిప్రాకృతగుణరహితుడును, నయియున్న భగవంతునికి గుణ
కార్యభూతము లగు క్లేశాములును, పరిణామాదులును, లీలచేత
నైనను నెట్లుగా సంభవించెడిని? ఒకవేళ సంభవించినను దత్ప్ర
యుక్తములగు దోషములు రాకుండునెట్లు? ఇట్లు గుణములును,
పరిణామాదిక్రియలును, లేనివాడై యున్న భగవంతునికి జగ
త్కారణత్వకర్తృత్వము లెట్లు పొసఁగును? మఱియు భగవం
తునికిఁ గర్తృత్వాదులు బాలురకుఁ గ్రీడావిశేషములవలె లీలా
మాత్రము లని దృష్టాంతముగాఁ జెప్పదురు. ఈదృష్టాంత మ
యుక్తము. బాలునకుఁ గ్రీడింపనలయు నన్నయుద్యమమునుఁ ద
త్కారణము గు క్రీడేచ్ఛయుఁ, గ్రీడోపకరణములుగాని, క్రీడాప్ర
వర్తకుఁడగు తనవంటియితరబాలుఁడుగాని, సంభవించినప్పుడు
కదా గలుగుచుండు? బాలకునినలెఁగాక భగవంతుఁ డవాప్తసమ
స్తకాముఁ డగుటంబట్టి యతనికిఁ గామమేలేదు. ఒకవేళఁ గా
మ మున్నదనుకొందము. అట్లయినను దనకంటె వ్యతిరిక్తమగు
క్రీడాసాధనముగాని, క్రీడాప్రవర్తకుఁ డగుమఱియొకపురుషుఁడు
గాని లేనప్పు డట్టికోర్కి యెట్లు జనించును? కాన నీదృష్టాంతము
పొసఁగదని చెప్పనలసియున్నది. ఓయీ? ప్రకృతిపురుషవిశిష్టుఁ
డయిన భగవంతునికే జగత్కర్తృత్వాదికము నంగీకరించెదము.
ఆభగవంతుఁడు గుణప్రచుర మగుమాయచేత నుపలక్షితుం
డై యీవిశ్వమును సృజించుచున్నాఁడు. ఆ మాయచేతనే ప్ర
పంచమును బొగుగాఁ బరిపాలించుచున్నాఁడు. మఱల నామాయ

ఇట్లు దృష్టాంతమునకును, దార్ష్టాంతికమునకు నింత వైషమ్యముండ నదియెట్లు సరి పడును? అని విదురుని ప్రశ్నాభిప్రాయము.

చేతనే యీవిశ్వమును దిరోహితముగాఁ జేయుచున్నాఁడు. స్వాధిష్ఠేయమగు మాయవలననే యీ సృష్ట్యాదికార్యము లొనరించుచున్నాఁడు. కావునఁ బరిణామాదిదోషములు స్వాధిష్ఠేయమగు మాయను బొందునుగాని పరబ్రహ్మమును బొందవు. అందువలన భగవంతునికి జగత్కారణత్వాదు లంగీకరించినను దోషము లేదేయన్నచోఁ జెప్పెదవినుఁడు. సృష్ట్యాదులకుఁ గారణభూతమగు నవిద్యకు భగవంతునితోఁ సంబంధము కలిగియుండుటయే యసంభవము. భగవంతుఁడు సర్వగతుఁడై యుండుటంబట్టి దీపప్రభవలెనే దేశమునవలన జ్ఞానహీనుండుకాఁడు. అతఁడు శాశ్వతుఁడు. కావున నతనిజ్ఞానము మెఱుపువలెనే కాలమునవలన నాశనము నొందదు. అతఁడు వికారములు లేనివాఁడు. కావున నతనిజ్ఞానము స్మృతివలెనే యవస్థావిశేషములవలన నాశనమొందదు. అతఁడితరుల కనుభవింపఁదగినవాఁడు. మఱియుఁదత్కాలమందుమాత్రమే పర్యవసాయికాఁడు. కావున నతనిజ్ఞానము స్వప్నమువలె స్వయముగా నంతమొందదు. భగవంతుఁడు కర్మనశ్యుండుకాఁడు. కావున జీవునిజ్ఞానమువలె నతనిజ్ఞానము ప్రకృత్యాసులచే నాశనము చెందదు. ఇట్లైనప్పటికిని, ఏప్రదేశమందైన, ఏయవస్థయందైన, దేనిచేతనైన, భగవంతునిజ్ఞానము నాశనముచెందినచో నట్టిపరమాత్మకవిద్యాసంబంధము కలదని చెప్పనచ్చు. కాని తాదృశజ్ఞానలోపము భగవంతునికి లేనప్పుడవిద్యాసంబంధమెట్లుకలుగును? భగవంతునికవిద్యాసంబంధమే లభింపనప్పుడు పరిణామాదులవిద్యాగతములనిచెప్పటయెట్లు? 'ఓయీ! భగవంతుఁడు జీవులందంతరాత్మయై ప్రవేశించి శాసించుచుండును. అట్లు భగవంతుఁడంతర్యామియై యుండుటం

బట్టి దుఃఖిత్వసంసారిత్వాదులు జీవులకే కాని పరమాత్మకు లేవు' అన్నచోఁ జెప్పెద వినుఁ. భగవంతుఁడు సమస్తమందు వ్యాపించి యుండుట నిశ్చయము. కాన జాగరస్వప్నద్యనస్థలందు జీవులు చెందుచున్నదోషములు తదంతర్యామియై యున్నపరమాత్మకుఁగూడ సంభవింపక మానవు. భగవంతుఁడు కర్మనియ్యఁడుకాఁడు. కాన తాదృశదోషములు సంభవింపవని చెప్పవలను పడదు. కర్మములు దేహసంపాదనమూలకముగాఁ గ్లేశాదులను గలిగించునా? లేక స్వతంత్రములై క్లేశాదులను గలిగించునా? అవి దేహసంపాదనమూలకముగానే క్లేశాదుల నిచ్చుచున్ననినియె చెప్పనలయును. అట్లు చెప్పక స్వతంత్రముగానే క్లేశాదులను గలిగించునని చెప్పినచో దేహసంబంధమే నిష్ప్రయోజనము కావలసినచ్చును. కావున భగవంతుఁడు కర్మవశ్యుఁడు కాకపోయినను సర్వక్షేత్రములందు నున్నాఁడనియు, జీవశరీరుఁడనియుఁ జెప్పుటచే దేహసంబంధము కలవాఁడగుట నిశ్చయము. అట్లాతఁడు స్వేచ్ఛచేతనే దేహసంబంధము కలిగించుకొన్నను, దదీయదోషములు కలుగకమానవు. పూయశోణితములలో స్వేచ్ఛచే జొచ్చినను నవి యంటుకొనకమానునా? అట్లే భగవంతుఁడు స్వేచ్ఛచేతనే జీవశరీరములందుఁ జొచ్చినను దదీయదోషములు సంభవించుట నిశ్చయము. అతఁడు కల్యాణగుణములు కలవాఁడయినను దేహసంబంధముండుటంబట్టి దోషములు కలుగకమానవు. జీవుఁడు దేహసంబంధ ముండుటవలననే కదా క్లేశాదులను జెందుచున్నాఁడు? అట్లె జీవశరీరసంబంధ మున్నచోఁ దదీయక్లేశాదులు భగవంతునేల చెందవు? ఓ మైత్రేయా? ఇట్లు నామానస మజ్ఞానసంకటముచే మిగుల బాధింపఁబడుచు

న్నది. కావున నా ప్రశ్నముల కుత్తరము లిచ్చి నామానసమును సంబంధించిన దుఃఖంబును దొలంగింపుము' అనియిట్లు విదురుం డడుగ భగవదధీనమగు చిత్తముకలవాఁడయి, తత్త్వదర్శియగుక తంబునస్మయాదులను విడిచి,యున్నమైత్రేయుం డావాక్యంబుల నాకర్ణించి విదురప్రశ్నములు సుపరిహారములగుటంబట్టి మంద హాసము చేయుచు నిట్లనియె. 'ఓయీ! చిన్మాత్రుఁడును నిర్వికా రుఁడును, నిర్గుణుఁడు నగుభగవంతునికి లీలచేతనైనను గుణసం బంధమును, బరిణామాదులును నెట్లుసంభవించుననియు, లీలచే నొకవేళఁగలిగినను, గుణపరిణామ ప్రయుక్తములగు దోషములు భగవంతుని నేల పొందవనియు నడిగితివి. సత్యమే. భగవంతుఁడు వివిధవిచిత్రానంతశక్తులు కలవాఁడు. కావున నతఁడు నిర్గుణుఁడు ను, నిర్వికారుఁడునైనను లీలచేతను చేతనాచేతనసంబంధము కలు గవచ్చును.అట్లు కలిగినను నాచేతనాచేతనప్రయుక్తము లగు దో షములు భగవంతునిఁ జెందవు. ఈశ్వరునికిఁ గృపణత్వము, ము క్తునికి బంధనము విరోధించి దోషము గలిగించునా? అట్లె భగ వంతునియాశ్చర్యశక్తి చిజ్జడసంబంధ మతనికిఁ గలిగించియుఁ జిజ్జడములందున్నదోషము లతనిఁ బొరయకుండునట్లు చేయఁగల దు. కాన విరోధము లేదు. కావున నతనికి జగత్కర్తృత్వాదు లంగీకరించుటవలన దోషము లేదు. మఱియుఁ బ్రకృతిపురుషవిశి ష్టుఁడయినభగవంతునే కారణముగా నంగీకరించుటవలన,నల్లని తంతువులచేతను, దెల్లనితంతువులచేతను, రక్తతంతువులచేతను, నేసినవస్త్రమునం దాకృష్ణత్వ, శ్వేతత్వ,రక్తత్వము లాయాతంతు వులసంయోగ మున్నచోటనే కానవచ్చుచున్నట్లును, శరీరధర్మము

లగు బాల్యయౌవనాదు లాత్మనుబొందక శరీరమునుమాత్రమే చెందుచున్నట్లును, ప్రకృతిపురుషధర్మములు ప్రకృతిపురుషులను మాత్రమే చెందునుగాని పరమాత్మను జెందవు. కావున సర్వక్షేత్రములం దంతర్యామియై యున్నను భగవంతునికి క్షేత్రగత దోషములు కలుగవు. 'ఓయీ! అపురుషార్థముల కాశ్రయమయిన దేహాదిసంబంధము భగవంతునికిఁ గలిగినను,తత్ప్రయుక్తము లగుదోషములు బొందవనిచెప్పితివి. అట్లె జీవునికిఁగూడ నపురుషార్థముల కాశ్రయమయిన దేహాదిసంబంధమున్నను దత్ప్రయుక్తదోషము లతనిఁజెందవని యేలచెప్పఁగూడదు?' అన్న-చో చెప్పెద. వినుము. జీవుఁడు భగవంతునివలె నపహతపాప్మత్వాదులు గలవాఁడయిననుఁ దత్స్వరూప మవిద్యాదులచేఁ దిరోహిత మగుచుండును. అందువలన స్వస్వరూపజ్ఞానములేక దేహమును దన్నుఁగాఁ దలంచుకొనుచుండును. మఱియుఁ గర్మవశ్యుఁడయిన జీవునికి నాత్మస్వరూపమునుమాత్రమే పురుషార్థభూతముకాని యాయాత్మయం దారోపించుకొనుచున్న దేవమనుష్యత్వాదులును, దత్ప్రయుక్తములగు శరీరచ్ఛేదనాదికమును, పురుషార్థములుకాక మృషాభూతము లగును. అట్లు స్వశరీరభూతులగు దేవమనుష్యాదులశిరంబు ఛిన్నంబగుచున్నను, నాశిరంబు ఛిన్నంబయిన దనెడిశోకమును జీవుఁడు దేహమేయాత్మస్వరూపమనెడి భ్రాంతిచేఁ బొనుభవించుచున్నాఁడు. జీవునికి నట్టిభ్రాంతి కలిగించెడిదియు నా భగవన్మాయయే యని నమ్ముము. ఇందుల కొకదృష్టాంతమును జెప్పెద.వినుము.చంద్రుండు జలంబులం బ్రతిఫలించును గాని వాస్తవముగా నచ్చటలేఁడు. అట్లయినను జలోపాధియందుండుకంపాదికము నిజచంద్రునందున్నట్లు ప్రతీయమాన

మగును. చంద్రునందు లేనికంపాదికమును జలోపాధిని బట్టి చంద్రున కున్నట్లు తెలియవచ్చుచున్నవిధముగానె *దేహసంబంధములగు శిరశ్ఛేదనాదిక మాత్మకు లేకపోయినను దేహోపాధినిబట్టి యతనికిఉన్నట్లు తోఁచుచుండును. కాని వాస్తవముగా నాత్మకట్టి దోషములులేవు. ప్రాకృతదేహముతో వర్తించుచున్నజీవునికి దేహగతిధర్మములున్న వనుట భ్రాంతిమూలక మగునట్లె, ప్రకృతిపురుషశరీరుఁడగు భగవంతునికి నాప్రకృతిపురుషగతిధర్మములు సంభవించుననుటయు భ్రాంతిమూలకమె. ఇట్లు భగవంతుఁడు జీవాంతరాత్మయై యున్నను

---

* ఇచ్చటియభిప్రాయ మేమనఁగా? జీవుఁడు కర్మవశ్యుఁడు. అతనికి నానావిధముగు నవిద్యతో సంబంధముకలదు. అందువలన స్వస్వరూపాప్రతీతి రూపముగు దేహాత్మభ్రాంతి గలుగుచుండు. ఆభ్రాంతిచేతనే శోకమోహాదులఁ జెందుచుండును. కాని వాస్తవముగా నతనికట్టివి లేవు. భగవంతుఁడవిద్యచేఁ బరోక్షితుండుకాఁడు. కాన నతనికి స్వస్వరూపజ్ఞానము కలదు. తాదృశజ్ఞానము గలవాఁడగుటచేఁ బ్రకృతిపురుషులను దన కధీనులఁగాఁ జేసికొని వర్తించుచు, నవిద్యాసంబంధమునుగాని తత్కార్యసంబంధమునుగాని పొందక వర్తించుచుండును. ఇందులకుఁ బ్రమాణము. "భూక్తభోగా పరిత్యక్తా దృష్టదోషాచ నిత్యశః। నేశ్వరస్యా శుభంధత్తే స్వమహిమ్నిస్థితస్యచ" అని తెలియఁదగినది. ఇట ముఖ్యాంశమేమన జీవేశ్వరు లుభయులకుఁ బ్రకృతిసంబంధముకలదు. కాని ప్రకృతి జీవునిఁ దనవశము కావించుకొని యశుభము నొసంగుచుండును. ఈశ్వరునికి దాను వశమయి యతనికి లీలాసాధన మగుచున్నది. ఇందులకు శ్రు॥ "అస్మాన్మాయీసృజతే విశ్వమేత త్తస్మిన్చాన్యోమాయయా సన్నిరుద్ధః" అనెడి శ్రుతిప్రమాణము. భగవంతుఁడు మాయేశ్వరుఁడయినట్లు "మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరమ్" అను శాస్త్రోక్తులవలనను దెలియవచ్చుచున్నది.

జీవగతధర్మములఁ బొరయకుండుట యనెడి కల్యాణగుణము గలిగియుండుటచేతకాక జీవగతములగు దోషములను సైతము నివర్తింపఁజేయఁగలఁడు. అడుగెట్లో చెప్పెద. వినుఁ. హేయగుణములుగల జీవుఁడు కర్మయోగానుగృహీతమగు భక్తివలన వాసుదేవకృపను సంపాదించి తత్సామర్థ్యంబున హేయగుణంబులనుండి తొలఁగుచున్నాఁడు. ఎంతటిభక్తి గలిగియుండినచో హేయగుణనివృత్తి కలుగుననఁగా ? ఎప్పుడు శబ్దాదివిషయములనుండి యింద్రియంబులు మరలి యాశ్రితబంధహరియగు పరమాత్మను బ్రత్యక్షము చేసికోఁగలఁడో యప్పుడే జీవుని హేయగుణములన్నియు నిద్రించిన వానికష్టములవలె నశించును. యోజింప నిద్రించినవానికి సుషుప్త్యవస్థయందుఁ గష్టములు నశించినను జాగ్రదవస్థయందు మరుఁడఁ గష్టముసంప్రాప్తముకావచ్చును. కాని భగవద్భక్తిగలిగినంతి భక్తగల వాఁడయి దద్దర్శన మాచరించుకొనినచో నేకాలములందును, నేయవస్థలందును గూడఁ గష్టములఁ బొందఁడు. మహాత్మా ! భగవంతునిగుణముల వర్ణించినను, అతినిసత్కథలను వినినను సమస్తకష్టములును నశించునని చెప్పుటకు సంతేనియు సందియము లేదు. భగవద్గుణముల వర్ణించి సత్కథల విన్నంతమాత్రమునఁనే సమస్తదుఃఖములు నశించుచుండఁగా, నెల్లకాలము భగవంతునిపాదపద్మపరాగము నత్యంతభక్తితో సేవించుచున్న భక్తునికష్టజాలము నశించునని వేఱుచెప్పవలయునా?' అని చెప్పుచున్న విదురునిపలుకు లాకర్ణించి మిగుల సంతసించి యతని కిట్లనియె. 'ఓ మహాత్మా ! మైత్రేయా! భగవంతుఁడెట్లు జగత్కారణుఁడగుచున్నాఁడనుసందియ మిదివఱకు నను బాధించుచుండె

డిది. కాని యిప్పుడు నీయుచితవా క్కనెసి ఖడ్గముచే నాసందేహ వృక్షము సమూలముగా ఖండింపఁబడినది. నీదయవలన నాసంది యము నివారించినది.ఇప్పుడు నామనస్సు భగవత్కథాశ్రవణము, దదీయపాదపద్మ సేవ యనెసి రెండింటియందు మిగుల నాసక్త మగుచున్నది. "ఓమైత్రేయా! శ్రీహరికి జీవాత్మలును,మాయయును, నివాసభూతమై యుండు నని నీవు చెప్పినవాక్యంబు మిగుల బాగుగనున్నది. దీనివలన భగవంతునికిఁ జిజ్జడవ్యాప్తికలదని తెలియుచున్నది. కాని మొదట శరీరగతములగు ఛేదనాదులాత్మను బొందవని చెప్పుటలో జలచంద్రుని దృష్టాంతముగాఁ జేకొంటివి ఆదృష్టాంతమునందు జలంబుల వాస్తవముగాఁ జంద్రుఁడు లేకపోవుటచే జలగతదోషములు చంద్రుని బొందనట్లు చిజ్జడములందు భగవంతుఁడు వాస్తవముగా లేఁడు కావునఁ జిచ్చిద్గతములగు దోషములు పొరయవని చెప్పనలయును. ఇట్లు చెప్పినచో జిజ్జడము లతనికి నివాసమగునెట్లు? మఱియు సీజగంబు తదాత్మకమయి ప్రతీయమానము కాలేదే; కావున నాభగవంతునికిఁ జేతనాచేతనములు వాసస్థానమగునెట్లు? అని సంశయింపఁ బనిలేదు. జగత్కారణమయినపరబ్రహ్మము జగదంతర్బహిర్భాగంబుల వెలయుచున్నది. ఇట్లుండ నీ ప్రపంచకము తన్మయత్వము కాదని యూహించుట భ్రాంతిమూలకమని చెప్పవచ్చును. మఱియుఁ జిజ్జడాత్మకమయిన ప్రపంచకమునందు భగవంతుఁడు విలసిల్లుచుండఁగాఁ జేతనాచేతనము లతనికి వాసస్థానమని చెప్పటకు సందియమేమున్నది? జలచంద్రదృష్టాంతమునుబట్టి భగవంతుఁడు చిజ్జడములందు

లేకపోవుటచేఁ దద్గతదోషము కలుగలేదని చెప్పరాదు. దృష్టాంతమందు చంద్రుఁడు వాస్తవముగా లేకపోవుటచేత దోషభాక్కు కాఁడని చెప్పుచున్నను, దార్ష్టాంతికమం దట్లు కాక భగవంతుఁడు వాస్తవముగాఁ జిజ్జడములనుండియే తనమహిమచే దోషములఁ దొలఁగించుకొనుచున్నాఁడు. కావున భగవంతునికి నివాసభూతమయిన చిజ్జడరూపప్రపంచకము బ్రహ్మమయము కాదనుట భ్రాంతిరూపమే? మఱియు దేహాదులం దాత్మప్రతీతి గూడ భ్రాంతిమూలక మనియే చెప్పవచ్చును. లోకమునందు మూఢతమఁడయిన మానవుఁడును, దనయాత్మను బరమాత్మగాఁ దెలిసికొనినవాఁడును, నీయిరువురు సుఖము ననుభవింతురు. కాని యాత్మస్వరూపము తెలియక, మూఢత్వము లేక, సంశయాస్పదుఁడయిన మానవుఁడు మిగులఁ గ్లేశముల చెందుచుండును. ఓ మునీంద్రా ! ఈశరీర మాత్మస్వరూపమయినట్లు ప్రతీయమానమగుచున్నను, నే నిప్పుడు మీపాదసేవవలన దేహ మాత్మస్వరూపముకాదని నిశ్చయించి యా దేహాత్మప్రతీతిని దొలంగించుకొంటిని. సజ్జనులరయిన మీవంటివారిసేవప్రభావ మేమని చెప్పుదును? అట్టి సజ్జనసేవ చేసినంతమాత్రమునే నిర్వికారుఁడయిన పరమాత్మపాదభక్తి జనించును. తాపత్రయము నివర్తించును. ఎచ్చట బ్రహ్మదులచే నారాయణుండు గానము చేయఁబడుచున్నాఁడో యావైకుంఠమునకుఁ దపోహీనులయిన మానవులను జేర్చుచున్నసజ్జనసేవ మిగుల దుర్లభమయినదిగదా ! సజ్జనసేవవలన నెట్టిహీనునికయిన భగవద్భక్తి జనింపకమానదు. ఓ మునీంద్రా ! భగ

వంతుఁడు వ్యష్టిసృష్టికిఁ బూర్వమింద్రియాదియుతము లగుమహా
దాదులను సృజించి యామహాదాదులనుండి జలాండసృష్టిమూ
లకముగా విరాట్పురుషుని సృజించి ప్రవేశించెననియు, నావిరా
ట్పురుషుఁడు సహస్రపాదుఁడై, సహస్రనేత్రుఁడై, సహస్రోరు
వై, సహస్రబాహువై వర్తించుచుండుననియు, నతనియందు
సమస్తలోకములు స్పష్టముగా వెలయుచున్నవనియు, బ్రాణా
పానాదు లనునామములచేఁ బదివిధములై శబ్దాదివిషయముల
తోను, జ్ఞానకర్మేంద్రియములతోను, గూడినవై, త్రిగుణాత్మక
మగుప్రాణమూవై రాడపురుషునియందు వెలయుచున్నదనియు,
నాతనివలననే నీవు చెప్పినబ్రాహ్మణాదివర్ణము లుత్పన్నము
లైనవనియు, బ్రహ్మాండమందుఁ బ్రజలు నానావిధదేహులై
పుత్రపౌత్రాది సంయుతులై యంతట వ్యాపించి వెలయుచు

న్నారనియుఁ, జెప్పితివి. ఇప్పు డాపై రాజునివిభూతులను, బ్ర
హ్మాండ మెట్లు ప్రజలచే వ్యాప్తమయినదో యదియుఁ, జక్కఁగ
వివరించిచెప్పుము. మరీచ్యాదుల కధిపతియయిన పరబ్రహ్మము
ప్రజాపతులనెట్లు సృజించెను? నుతీయు ననవిధప్రపంచము నెట్లు
సృజించెను? చతుర్ముఖసృష్టితరువాత సృష్టి యెట్లు వ్యాపించినది?
ఆప్రకారమంతయుఁ జక్కఁగ వర్ణింపుము. నుతీయు స్వాయం
భువాదిమనువులను గుఱించియు, మన్వంతరములను గుఱించి
యు, మనుమన్వంతరాధిపతుల వంశమునుగుఱించియు, వం
శానుచరితములను గుఱించియు, భూమికి నుపరిభాగమందుఁ
నధోభాగమునందు వెలయుచున్నలోకములను గుఱించియు, ఈ
యాలోకముల స్థితినిగుఱించియు, వానిపరిమాణములను భూ

లోకపరిణామమును,వివరించిచెప్పము. మఱియు, పశుపక్ష్యాదుల యు, జీవమనుష్యాదులయు,జరాయుజములయు, స్వేదజాండజము లయు, నుద్భిజ్జములయు, సృష్టివికల్పమునుగుఱించి వర్ణింపుము. రజస్తమోగుణప్రధానము లయి భగవంతుని యావేశావతార ము లనఁదగుబ్రహ్మాదులచే లోకవ్యాపారములను జేయించు చున్న సృష్టిస్థితిలయముల కాధారమగు నిష్ణుమూర్తియుదార విక్రమమును వర్ణించి చెప్పము. మఱియు బ్రాహ్మణాదివర్ణము ల యు బ్రహ్మచర్యాద్యాశ్రమములయు విభాగములను, వాని వానిలింగములను, నాచారములను, స్వభావములను, మహాము నుల వ్యాపారములను, జన్మములను, వేదముల విభాగమును, జక్కఁగ వర్ణించిచెప్పము. మఱియు యోగాదులమార్గములను, యోగముల మహిమలను, బ్రహ్మప్రత్యధర్మములను విడిపించు సాం ఖ్యయోగమార్గములను, విస్తరించి చెప్పము. వేదబాహ్యులైన పాషండుల ప్రవృత్తులను, జీవులకు సత్త్వాదిగుణాతిశయమువలనఁ గలిగెడి గతులను, ఫలములను, వర్ణింపుము. మఱియుఁ బరస్పర విరోధము లేకుండ ధర్మార్థకామమోక్షముల నాచరింపఁదగిన యుపా యము లెయ్యవి? భూపాలకులనీతివార్త లెట్టివి? దండనీతివిధమెట్టిది? శ్రుతివిహితము లయినసంధ్యావందనాది నిత్యకర్మముల విధా నము లెట్టివి ? శ్రాద్ధాదికర్మములవిధానము లెట్టివి ? మఱియు సూర్యాదిగ్రహములయు, నశ్విన్యాది నక్షత్రములయుఁ, దగితర నక్షత్రములయు గతు లెట్టివి ? ఆగ్రహనక్షత్రాదుల కాలనియ మమెంత? తపోదానాదులు, వాని నాచరించుటవలనఁ గలిగినఫ లములునెట్టివి? శ్రౌతస్మార్తాది కర్మములఫలము లెట్టివి? పరదేశ ములయందున్నవాఁ డవశ్యముచేయవలసినధర్మమేమి ? ఆపద

లందుఁ బురుషు లాచరింపవలసినధర్మ మెట్టిది? ధర్మప్రవర్తకుఁ డయినజనార్దనుఁ డెటువంటి ధర్మముచేత సంతోషించును? ఎట్టికర్మము లాచరించినచో భగవంతుం డనుగ్రహించును? దీని నిఁకార్చి సవిస్తరముగాఁ దెలియఁజేయుము. మఱియు దీనవత్సలు లైన గురువులు తమ్ము సేవించుచున్న శిష్యులకుఁ దమపుత్త్రులకుం బోలె నడుగనిరహస్యములనుగూడఁ జెప్పుదు రని వినియున్నాను. కాన నాకుఁ జెప్పుము. పృథివ్యాదితత్త్వముల ప్రళయ మెన్నివిధములు? అట్టి ప్రళయకాలములయందుఁ బరమాత్మ నెవ్వరుపాసింతురు? ఆప్రళయములయం దెవ్వరుపసంహరింపఁబడుదురు? జీవస్వరూపమును బ్రహ్మస్వరూపమును దెలియఁజేసెడిదియు, శాస్త్రజన్యమయినదియు, నగుజ్ఞాన మెట్టిది? గురుశిష్యులకుఁ బ్రయోజనభూతమయిన జ్ఞానమెట్టిది? అట్టి జ్ఞానమును సంపాదించుటకుఁ బండితులు గుడివినసాధనము లెయ్యవి? గురూపదేశము లేకుండఁ బురుషుఁడు జ్ఞాన మెట్లు సంభవించును? అందువలన భక్తి యెట్లుకలుగును? ఆభక్తివలన వైరాగ్య మెట్లుకలుగును? ఓ మైత్రేయా! భగవంతుని విచేష్టితములను లీలలను దెలిసికొనఁదలంపు గొనియున్న నాప్రశ్నముల కన్నింటికిఁ దగినట్లు ప్రత్యుత్తరము లొసంగి నన్ను సంతోషపెట్టుము. ఓమహాత్మా! నీ వొక గ్రుడ్డివానివలె నర్తించుచున్నాను. నాకు వాని నన్నిటిని దెలియఁజేసి జ్ఞానము కలిగించి మాయాతిశయముచేత నష్టమయిన నాకన్నులఁ దెఱువుము. సర్వవేదములు, యాగములు, తపోదానములు, నీ మొదలగునవి యన్నియు, జీవాత్మలకు సంసారనివృత్తి కలిగించుధర్మమును నుంతేనియుఁ జేయఁజాలవు' అని యిట్లు వలుకుచున్న విదురునిఁ జూచి మైత్రేయుండు మిగుల సంత

సించి భగవత్కథలయందుఁ బ్రేరితుఁడయి యున్నందులకు మఱియొం
త సంతసము కలవాఁడయి యతని కిట్లు చెప్పెనని చెప్పి శుకుం
డు వెండియుఁ బరీక్షిత్తున కిట్లనియె. ఇది యేడవయధ్యాయము.

—✦—

ఓ మహారాజా ! మైత్రేయుండు విదురునిఁజూచి యిట్లనియె. ఓ విదురా ! మహనీయా ! పూరువంశము లోకములోనివానవుల కెల్లరకు నుతింపఁదగినది కదా? లోకపాలాంశసంభూతుఁడవయిన నీవు పూరువంశమునందు జన్మించినవాఁడవయి కులమునకు వన్నె దెచ్చితివి. నీవు భగవద్భక్తియే ప్రధానముగాఁ గలవాఁడవు. నీవంటియోగ్యుఁడు మఱియొకఁడుండఁడు. ఆపరమపురుషునికీర్తిని నీవు మాటిమాటికి నూత్నమయినదానింగాఁ జేయుచున్నావు. నీపశ్నములకు మిగుల సంతసించితిని. లోకమందలి మానవులు స్వల్పమయిన సంసారసుఖము ననుభవించుటకుఁ బూనికొని సంసారకూపమునఁబడి గొప్పదుఃఖములను సంపాదించుకొనుచుందురు. అట్టిదుఃఖములను దొలంగించుటకు భాగవతముకంటె మించినసాధనము మఱియొకటిలేదు. ఆభాగవతమును భగవద్గుణకథల కాకరము. సమస్తవేదార్థము లందు నిమిడియున్నవి. అట్టిభాగవతమును నీకుఁ దెలియఁజెప్పెద వినుము.*ఆభాగవతమును బూర్వము వాసుదేవాఖ్యచే నొప్పుసంకర్షణుండు సనకాది

* భాగవతము రెండువిధములని భాగవతసంప్రదాయవేత్తలు చెప్పుచున్నారు. వానిలో నొకదాని భగవంతుఁడు బ్రహ్మకు, బ్రహ్మ నారదునకు, నారదుఁడు వ్యాసునకిఁ జెప్పెను. అంతి వ్యాసుఁడు దానిని విస్తరించి తనకుమారుఁడగు శుకునిచేఁ జదివించెను. ఆశుకుఁడు పరీక్షిన్మహారాజునకుఁ దెలిపెననియు నది పదునెనిమిదివేలశ్లోకముల పరిమాణము కలదనియుఁ జెప్పుచున్నారు. ఇది మొదటి

మహర్షులకుఁ జెప్పెను. కావున దీనికి నాంకర్షణభాగవతమనిపేరు కలిగినది. పూర్వము పాతాళలోకమునం దుపవిష్టుఁడును, భగవంతుఁడును, నాదిపురుషుఁడును, రజస్తమోపహృతముకాని సత్త్వముకలవాఁడు, నగుసంకర్షణుని సనకసనందనాదిమునులు నల్వురును సమీపించి చేతనాచేతనాత్మకమయిన పరిపంచకమునకు విలక్షణుఁడయినపరమాత్మతత్త్వమును దెలిసికొనఁదలంపుకలవారలయి నమస్కరించిరి. ఆసంకర్షణుండు వాసుదేవుఁడని చెప్పుదురు. అతఁడు స్వావాసమునకుఁ గారణభూతుఁడగుభగవంతుని సరోత్కర్షముచేఁ బూజించుచుండెఁ. అతఁడాత్మాభిముఖ్యమునిమిత్తము నేత్రముల నిమీలించియుఁ బండితులయభ్యుదయమునిమిత్తము కొంచెమునీలనము చేయుచుండెను. అమ్మహాత్మునికుమారికలు తమకనురూపులగు భర్తలను గోరుచు నతని నానావిధోపహారముల చేతఁ బ్రేమసహితలై పూజించుచుండిరి. అప్పుడు భాగవతశ్రేణార్థము సత్యలోకమునుండి సదా గంగామధ్యమునఁబడనే పాతాళమునకవతరించుటంజేసి తదీయజలంబులచే నార్ద్రములగు జటాకలాపములుగల సనకాదిమునీంద్రులు భగవచ్ఛాస్త్రాభిజ్ఞులై ప్రేమాతిశయముచేఁ దొట్రుపడుచున్న మాటలచే మాటిమాటికి గానముచేయుచు, సహస్రకిరీటములందు విలసిల్లురత్నశ్రేష్ఠముల

విధము. రెండవవిధ మెట్లనఁగా సంకర్షణుఁడు సనకాదులకు, సనకాదులు సాంఖ్యాయనునకు, నతఁడు పరాశరునకుఁ, బరాశరుఁడు మైత్రేయునకుఁ గ్రమంబునఁ జెప్పిరనియు దానిని మైత్రేయుండు విస్తరించి విదురునకుపదేశించెననియు నది రెండుస్కంధము లాయెననియుఁ జెప్పుదురు. ఆరెండింటిని దనగ్రంథమందుఁ గలిపి వ్యాసుఁడు ద్వాదశస్కంధాత్మకమగు పురాణమును రచించె నని చెప్పుదురు.

చేఁ బ్రకాశించుచున్న సహస్రఫణములుగల సంకర్షణుని పాదపీఠము నకు నమస్కరించుచు భాగవత ముపదేశింపఁ బ్రార్థించిరి.అంత భగవత్ప్రముఁడగు సంకర్షణుఁడు మోక్షధర్మములం దాసక్తిగల సనకాదులకుఁ దెలియఁజేసెను. అంత సనత్కుమారుఁడు శుశ్రూషారతుఁడై తన్నడుగుచున్న సాంఖ్యాయనున కుపదేశించెను. ఆ సాంఖ్యాయనుఁడు భగవద్విభూతులను జెప్పఁదలఁచి యందులకై తనయొద్ది కేతెంచినపరాశరున కెఱిఁగించెను. ఆపరాశరుఁడు బూర్వము పులస్త్యనినలనఁ బురాణసంహితాకర్త యగునట్లు వర ముపడసె. అట్టిపరాశరుండు దయాళుఁడై నాకుఁ జెప్పె.ఓవిదురా! ఆభాగవతమును శ్రద్ధాళుఁడవగు నీకుఁ జెప్పెదను వినుము. ఎప్పుడు భగవంతుఁడు తాత్కాలికజగద్వ్యాపారమునుండి విరమించి యోగనిద్ర నవలంబింపఁ దలంపుగొన్న వాఁడయి, శేషశయ్యపయి శయనించి యసహాయుఁడయి, స్వానుభవసుఖమునందుఁ బూర్ణుండయి, నిష్క్రియుండయి, కన్నుల మొగిడ్చి యుండునో యప్పుడు చేతనాచేతనరూపమయిన యీ ప్రపంచమంతయు జలావరణ చేఁ గప్పఁబడియున్నది. దారువులయం దగ్ని,రుద్ధవీర్యుండయి విలీనమయియున్నవాఁడ్క భగవంతుండు బహిర్వ్యాపారశూన్యుఁడయి యుదకమందు నివసించియున్న వాఁడయి తనయందుంచిన సమస్తచరాచరములను సృజింపఁదలంపుగలవాఁడయి, కాలశక్తిని ప్రేరణచేయుచు సలిలమందు నివసించె ఇట్లు సహస్రయుగములకాలము నిద్రించుచుఁ, గావునఁ జేయసంపాదితలోకరచనగలవాఁడై కాలశక్తిచే, భగవంతుండు పూర్వము తనయందుంచినలోకకారణభూతములయిన భూతసూక్ష్మార్థముల నవలోకించెను. ఇట్లు నారాయణుండు తనయం దున్నసూక్ష్మార్థములయందుఁ దనదృ

ష్టి నిగిడించినప్పు డానూత్నవర్గము కాలానుగతమయి వికసించిన రజోగుణముచేత స్పృశింపఁబడినదయి పద్మరూపముగాఁ బరిణ తమై భగవంతునినాభీకుహారమువలన నిర్గమించెను. ఇట్లు పర మాత్మసృష్టమయి, లోకరూపమయిన యప్పద్మకోశము తన కాంతులచే విశాలమయినజలావరణమును సూర్యునివలెఁ బ్రకాశిం పఁజేయుచు, జీవాదృష్టబోధకమయినకాలముచే ద్వారగా నుద్గ మింప నాలోకపద్మమును నాభిసరసిజమందు స్థాపించెను. అం తనప్పద్మమునుండి వేదమయుఁడు స్వయంభువునైన బ్రహ్మ యుద్భ వించెను. ఇట్లు బ్రహ్మ యుదయించి యాపద్మకర్ణికయందున్నవాఁ డై ప్రపంచమును గానక యాకసముదిక్కు తననేత్రములనుఁ బ్రసరింపఁజేసి యేమియుఁగానలేక యాకమలమధ్యమందు నాల్గు దిక్కులం బరిభ్రమించుచుండ నతనికి నాల్గుముఖములుకలిగెను. పిమ్మటఁ జతుర్ముఖుండు ప్రళయాంతమందలివాయువుచే ఘూ ర్ణిల్లుచున్నయుదకమం దావిర్భవించినకమలము నాశ్రయించి యాపద్మ మేమియో, తా నెవఁడో నిశ్చయముగాఁ దెలిసికోలేక యిట్లు చింతింప నారంభించె. "అయ్యో! ఈకమలకర్ణికయందు వర్తించుచున్న నే నెవండను? ఈయుదకములం దీయబ్జముత్పన్న మగుటకుఁ గారణంబేమి? ఈపద్మ మధిష్ఠానమం దధిష్ఠితమైయు న్నది ఆయధిష్ఠాన మేదియో తెలియరాదు. అధిష్ఠానము లేకుండ నధిష్ఠేయ ముండదు. కావున నధిష్ఠానభూతమగు వస్తువేదియయి నఁ గ్రందిభాగంబున నుండనచ్చు." అనియిట్లు బ్రహ్మ యూహించి యాలోకపద్మనాళరంధ్రములలో నుండిపోయి యంతర్గతజలము లఁ బ్రవేశించెను. అట్లు ప్రవేశించి బ్రహ్మ యాపద్మమున కధిష్ఠాన మగు వస్తువును వెదకియుఁ దదధిష్ఠానమును బొందలేకపోయెను.

ఓవిదురా! తమంబువలెనే దర్శనప్రతిబంధకమగు నాజలమం దుఁ దనకుఁ గారణభూతమగు వస్తువును వెదకుచున్న బ్రహ్మకు న్యూనదివసము, అధికదివసము, సమదివసము నాఁబడు నేమిత్ర యముతోఁగూడినదీర్ఘకాల ము (శతసంవత్సరములు) తిక్రమిం చెను, ఆత్రినేమియే, భగవంతునికి నుదర్శనరూపమయి దేహ ధారులకుఁ భయము గలిగించుచు నాయువును క్షీణింపఁజేయుచు న్నది. ఓయీ! బ్రహ్మ యాపద్మనాళమును గానలేక విసివి యచ్చటినుండి బయలువెడలి వచ్చి కర్ణికను బొంది మెల్లగా వా యువులను బంధించి, చిత్తమును విషయములనుండి మఱలించి సమాధియోగము నవలంబించి యుండెను. ఇట్లు బ్రహ్మ శతవత్స రంబులకాలము సమాధియం దుండునప్పటి కతనికి దివ్య జ్ఞానము పొడమెను. అంతట బ్రహ్మ పూర్వము జలంబుల వెద కియు నెవ్వనిఁ జూడలేకపోయెనో వాని నాజ్ఞానాతిశయముచేతఁ దనహృదయమందే కనుఁగొనెను. ఆపరమపురుషుఁడు మృణాళ మువలె ధవళకాంతులనీనుచు, ఫణము లనునాతపత్రములచే నా యతములగు మూర్ధములందు వెలయుకిరీటరత్నములకాంతి సంతానములచే నంధకారముల నడఁగించుచు యుగాంతజలమం దున్నయనంతశయ్యపై శయనించి యుండెను. మఱియు నప్పరు షుండు తాఁ దాల్చియున్నపీతాంబరము సాయంకాలాంబుదంబు చందంబున వెలయుచుండ, నతనికనకకిరీటంబు కాంచనశిఖరంబు కరణి విలసిల్ల, నతఁడు దాల్చిన ముక్తాహారంబులు కొండకాల్వ లై వఱల, నురంబునఁ బ్రకాశించుతులసీమాలలు దివ్యౌషధంబు లగతిఁ దనరార, భుజములు బొంగు వెదుళ్లను విడంబింప, పాదములు పాదపములవడువునఁ జెలంగ, మరకతాచలంబువలె రంగారు

చుండెను. మఱియు నమ్మహాత్ముండు దీర్ఘమై, విరివిగలిగి, కావున నే లోకత్రయసంగ్రాహకమై, చిత్రములు దివ్యములు నగునలం కారాంబరంబులచే శోభను సంపాదించి, యున్నదివ్యదేహముతో వెలయుచుండెను. ఆపుణ్యపురుషుండు వివిధములగు తమమనోరథంబులఁ దీర్చికొన వర్ణాశ్రమాదిధర్మములచే భజించుచున్న భక్తులకుఁ, గామధేనువువంటి వనిచెప్పుటకుఁ దగినపాదపద్మములతో వెలయుచుండెను. ఆపాదపద్మములు నఖచంద్రులకాంతిసంతానములచే వ్యాప్తములైన ప్రేళ్లనెడిపత్రములచే నొప్పుచుండెను. అమ్మహానుభావునిముఖపద్మము, భక్తజనులయార్తి దొలఁగించుమందహాసముచే సుందరమై, ప్రకాశించుపసిండికుండలములచే నలంకృతమై, యధరబింబకాంతులచే శోణాయితమై, సుందర మగునాసికచేతను, భూర్యుగ్మముచేతను, బ్రేక్షణీయంబై, యుపాసకుల సన్మానించుచున్నట్లుండెను. కదంబపుష్పకింజల్కములవంటిపచ్చనిపట్టువస్త్రము మేఖలయు నితంబమందు సొంపారుచుండెను. అమూల్యములగు సుందరభూషణములచేతను, శ్రీవత్సముచేతను, వక్షస్థలము ప్రకాశించుచుండెను. ఆపురుషుండు, విలువలేని భుజకీర్తులచేతను, రత్నశ్రేష్ఠములచేతను వ్యాప్తములగు బాహాదండములు, పన్నగరాజములచేఁ బరివేష్టితములగు స్కంధములవలెఁ దనరార, నవ్యక్తమగు మొదటిభాగము గలచందనవృక్షముచందంబున వెలయుచుండెను. మఱియు నాభగవంతుఁడు చరాచరములకు నిలయమై, సర్వశ్రేష్ఠమునకు బంధుమై, జలముచే నావరింపఁబడి, సహస్రకిరీటములు హిరణ్యశృంగములవలె నొప్పారుచుండఁ, బర్వతశ్రేష్ఠమువలెఁ బ్రకాశించుచుండెను. ఆతనికంఠభాగము, వేదములనెడిమధుకరములచే

వ్యాప్తమయి, స్వకీర్తిప్రచురమై, విలసిల్లువనమాలచే నలంకృతమైయుండెను. మఱియు నతఁడు సూర్యచంద్రాదులవ్యాపారములచేఁ దెలియఁబడకయుండెను. అతఁడు, ముల్లోకమ్ములందు స్ఫూర్తిగలవై, తద్రక్షణార్థము పరిక్రమించుచున్న చక్రాదిసాధనములచే దుష్ప్రాపుఁడై యుండెను. అట్టిభగవంతునిఁ జూచినప్పుడే లోకముల సృజింపఁ దగినజ్ఞానము గలిగియు, వ్యష్టిప్రపంచమునకుఁ గర్తయగు బ్రహ్మ, భగవంతుని నాభిసరోజమును, బ్రళయకాలవాయువును, బ్రళయకాలజలమును, దన్ను, నాకాశమునుదప్పఁ, దక్కినసృష్టిపరికారాదికమును జూడలేదు. ఇట్లు బ్రహ్మ రజోగుణయుక్తుఁడై, కావున నే ప్రజలసృజింపఁ దలంపుగొని నాభిసరోజాదిపంచకమునుమాత్రమునే చూచినందున సృష్టిప్రకారమును దెలిసికోలేక, తాదృశసృష్టిప్రకారమును జూచి సృష్టిచేయఁ బ్రయత్నించి దానిం గనుఁగొనుటకై పరమపురుషునియందు మనంబుఁ జేర్చి జగత్కారణుఁడైన భగవంతుని స్తోత్రముచేయ నారంభించెను. ఇది యెనిమిదవయధ్యాయము.

బ్రహ్మ భగవంతుని నుతించుట.

ఓ భగవంతా ! మిక్కిలి చిరకాలమునుండి సంపాదించుచున్నతపంబులపెంపుగల నాచేత నిప్పుడు తెలియఁబడితివి. షడ్గుణపరిపూర్ణుఁడ వగునీస్వరూపమును దెలియకుండుట దేహభాక్కుల కెద్దదోషమై యున్నది. ఓదేవా ! నీకంటె వ్యతిరిక్తమగు పదార్థము లేదు. కాన నీస్వరూపజ్ఞానంబు గలిగినచో సమస్తము తెలియఁబడును. నీస్వరూపజ్ఞానం బున్నవానికి జ్ఞాతవ్యమగు వస్తువే లేదు. అందువలన నన్నివిధములచేతను నీస్వరూపజ్ఞాన

మే సంపాదింపవలసినది. అజ్ఞానమే మృత్యువును దరించువానికి సాధన మగుచున్నది. ఓయీ ! దేవమనుష్యాదులు స్వతంత్రులై యుండఁగా నీకంటె వ్యతిరిక్తమగు స్వతంత్రవస్తువు లేదని యెట్లు చెప్పఁగలవు? అందువేని చెప్పెద వినుఁ. దేవాదులు స్వతంత్రులై యున్నారనుట భ్రాంతియేకాని వేఱుకాదు. అట్లయిన నానాత్వ మెట్లు కలుగుచున్నదని యడుగవచ్చు. *మాయాగుణములగు సత్వరజస్తమోగుణముల వైషమ్యమువలన నీవొక్కఁడవే బహురూపకారంబులఁ బ్రకాశించుచున్నావు. ఇట్టి నీస్వరూపము గనుఁగొనుట ముక్తిసాధన మగుచున్నది. ఇట్లు నీయవతార రహస్యజ్ఞానము కూడ మోక్షసాధనమనుటకు సందియము లేదు. దేవా! † నీవు, నిరుపాధికమై, నిత్యావిర్భావము గలిగి, యపరిచ్ఛిన్నానందరూపమై యున్న జ్ఞానము కలవాఁడవు. నీయజ్ఞాన

---

* భగవంతునికిఁ జిదచిత్తులు శరీరభూతమై యుండును గాన నతఁడు స్వశరీరప్రకృతిపురుషమూలకముగాఁ, దన కనేకక్రీడాసాధనంబుల సంపాదింపఁదలంచి ప్రకృతిపురుషసమష్టిపరంపరచే మహాభూతములపర్యంతము గలయీయీశరీరములుగాఁ దానే పరిణమించి తన్మయుఁడై పిమ్మటఁ జిదచిన్మిశ్రమై దేవాదిస్థావరాంతమగు జగంబుగా నగుచున్నాఁడు.ఇట్లు పరబ్రహ్ము జగన్మూర్తిగాఁ బరిణమించినను, దత్ప్రకారభూతమగు ప్రకృతియందున్నవికారము,లన్నియుఁ క్షేత్రజ్ఞునికిఁ గలుగుచున్న క్లేశాదులన్నియు భగవంతునిఁ జెందవు. ఆభగవంతుఁడు నిరస్తనకలదోషుఁడై యపరిచ్ఛిన్న జ్ఞానానందస్వరూపుఁడయి యుండునని తెలియఁదగినది.

† ఇందులకు మూలము "అవబోధరసోదయస్య" శశ్వన్నివృత్తతమసః" అనియున్నది. ఈవిశేషణద్వయమువలనఁ ద్రివిధము లగుచేతనములకు నచేతనములకు వ్యావృత్తి గలిగినది. ఎట్లన "అవబోధరసోదయస్య" జ్ఞానరసావిర్భావమునుగలవాఁడు భగవంతుఁ డనుటచే జ్ఞానరసములేనియచిత్తునకు వ్యావృత్తి

మొప్పుడును నివృత్తమైయే యుండును.ఏతాదృశస్వరూపము గల నీదివ్యమంగళవిగ్రహము, నూఱులసంఖ్య గల యవతారంబు లకు మూలభూతము. సకలావతారబీజమ వగునీనాభీకమల మునుండి భవదావేశావతారమ నగునే నుదయించితి. ఈ నా రూపము సర్గాదియందు నాధుపరిత్రాణమునిమిత్తము చే కొనఁబడినది.అంతియకాని జీవునివలెఁ గర్మాధీనుఁడవయి సుఖదుఃఖంబుల ననుభవింపఁగాదు. సర్వోత్కృష్టుఁడవగు నోభగవంతా! ఆనందమాత్రమై, జాతిగుణరహితమై, యుపాధిహితమగు సంకల్పరూపజ్ఞానము గలిగి, ప్రపంచకముకంటె విలక్షణమై, విశ్వకారణమై, యప్రాకృతభూతేంద్రియాత్మకమైన రూపముగలిగి యున్ననీస్వరూపముకంటె విలక్షణమగు దానిఁ గానను. ఓపరమాత్మా ! అట్టి నీస్వరూపమునే శరణుచొచ్చుచున్నాను. ఓవిశ్వమంగళప్రదా ! భవదుపాసకులమగు మావంటివారికి ధ్యానగమ్యుండవగుదువుగాని యసత్ప్రసంగములఁ జేయుచుఁ, గాపున నే నరకభాక్కులగు దేహులకు దర్శన మొసంగవు. అట్టి స్వరూపస్వభావములు గలిగి పూర్ణపాడ్గుణ్యమూర్తివయి యొప్పునీకు వందనంబు లాచరించుచున్నాను. మఱియు నెవరు వేదంబు లను మహావాయువుచేఁ దేఁబడిన నీపాదపద్మగంధము ననుభవింతురో

కలిగినది.“శశ్వచ్ఛన్నివృత్తితమసాం” సర్వదా యజ్ఞాననివృత్తి గలవాఁడనుటచే సర్వదా యజ్ఞాననివృత్తి లేదుగాన చేతనములకు వ్యావృత్తి గలిగినది.బద్ధజీవుల కజ్ఞాననివృత్తియే కలుగమిచేతను,ముక్తజీవులకు సంసారదశయం దజ్ఞానముండుటంజేసియు, నిత్యజీవులకు నజ్ఞాననివృత్తిగలుగుట భగవత్సంకల్పాధీన మగుటంజేసి సోపాధికమగుటచేతను, “శశ్వచ్ఛన్నివృత్తితమసాం” అనువిశేషణముచేఁ ద్రివిధజీవులకును వ్యావృత్తి గలిగినది.

యట్టిభక్తులహృదయాంబుజంబులనుండి, యవ్యభిచారిణి యగు భక్తిచేఁ బ్రాప్యుండవగు నీవు తొలఁగి చనక వారలకు నిత్యసన్నిహితుఁడవై మెలంగుచుందువు. ఓదేవదేవా! లోకంబునందలిమానవులందఱు సంసార మనుకూపంబునఁబడి యత్యంతావివేకులయి ప్రపంచంబునంతను శాశ్వతమయిన దని తలంచుకొని ధనములను, గృహములను, మిత్రులను, దారపుత్రాదులను, నిట్టిమఱికొన్ని సుందరవస్తువులను సంపాదించుచు, వానిలోనొకటి నశించినచో మిగుల దుఃఖంబు నొందుటయు, మఱియు నట్టివస్తువుల సంపాదింపనత్యాశకలవారగుటయుఁ బలువురిచేఁ దిరస్కారంబు నొందుటయుఁ బేరాశయు, దేహాత్మాభిమానము, మొదలగునవన్నియు నీపాదపద్మసేవ లభించునంతవఱకే చుమీ? అటుపిమ్మట సుంతేనియుఁ గష్టములుగలుగనేరదు. ఒక్కకష్టములే యనేల? భయంబులు గూడ నిన్నాశ్రయించినవారికి భయంబులన్నియు నశించినతోడనే మోక్షంబుగూడ సంప్రాప్తమగుచుండును. ఓదేవా! నీభజనంబు సకలపాపనివర్తకము. సకలభయసంహారంబు. మఱియు నీనామస్మరణంబు మోక్షదాయకంబుకదా! ఇట్లమితఫలదాయకంబులయినను నీదర్శనశ్రవణంబులకు విముఖులయి కొందఱు మందభాగ్యులు కామ్యకర్మంబులఁ బెక్కుల నాచరించుచు జ్ఞానహీనులయి యింద్రియములకుఁ బట్టువడి యమంగళంబులకుఁ దావులయి యుందురు. అందువలన వారు వాతపిత్తశ్లేష్మంబులనెడిధాతువులమూలంబునఁ జేసి యూకలియు దప్పియుఁ బొరయుచుండుదురు. పిమ్మట వా రాకలిచేతను, దప్పిచేతను, శీతోష్ణములచేతను, వర్షవాతాదిదుఃఖంబులచేతను, తీవ్రంబగు కామాగ్నిచేతను, నెడతెగనికోపంబుచేతను, బా

ధింపఁబడుచుందురు. అట్టి బుద్ధిహీనులను జూచుటచే నాచిత్తంబు కలంగిపోవుచున్నది. ఇట్లు భవదీయంబగు మాయచే మోహితులయి మాయాబలమువలన బాహ్యేంద్రియములకుఁ దోఁచుదేవమనుష్యాదిభేదమును జూచుచున్నంతకాలము దుస్తరమయిన సంసారసముద్రంబును దరింపఁజాలరు. కాని నీ స్వరూపంబు దెలిసినొనినతరువాతఁ గష్టములన్నింటిని బాయుదురు. సంసారసముద్రంబునుగూడ నవలీలఁ దరింపఁ జాలుదురు. ఓదేవా! సన్నుతింపఁగలనీవు నిష్కాములయు సర్వకాలములయందు నిన్ను భజించుచున్న భక్తులయోగపరిపూతమయిన హృదయకమలకర్ణికయం దాసీనుండవయి యుందువు ఇదియునుం గాక యోగీశ్వరులు యోగమార్గముల నవలంబించి తనుమనంబులందు నీరూపంబు నెట్లుగా భావింతురో వారియందు దయగలవాఁడవయి వారి కట్టిరూపముతోనే గానవచ్చుచుందువు. ఓదేవా! నీవు సమస్తభూతములందు నంతరాత్మవై యుండి, యీయీభూతములకు శాసకుఁడవై, ధారకుఁడవై, వెలయుచుఁ గావున వానికి సుహృత్తముఁడవై యుండి, యేభూతమునకు ద్రోహముచేసినను దదంతరా

త్మయగు భగవంతుఁడే పర్యవసన్నమగు నని తలంచి, దేహము నాత్మగా భావించుచున్న వారికి దుర్లభమగు సర్వభూతదయచేత వర్తించువారికిఁ బ్రసన్నుఁడ వగునట్లు నానావిధోపచారంబులచే నారాధితుండవయినను బద్ధకాములగు ననుకూలజనులకు మిగులఁ బ్రసన్నుండవు కావు. కావునఁ బురుషులు యాగాదులగునానావిధ శ్రౌతస్మార్తాదికర్మములచేతను, దానములచేతను, కృచ్ఛ్రాదితపంబులచేతను, వ్రతానుష్ఠానములచేతను, నిన్నే యారాధింపవలయును. అట్లుచేసిననే యాసత్క్రియలకుఁ దగిన ప్రయోజనము కలదు. స్వర్గాదిఫలాపేక్షఁ జేఁ గాకుండ నీయం దర్పితమగు యజ్ఞాదిధర్మము స్వల్పమైనను నది భగవదుపాసనమూలకముగా నిత్యపురుషార్థములకు హేతువై యెప్పటికి నాశనము చెందదు. ఓదేవా ! నీ వెల్లప్పుడు ప్రకృతివివిక్తాత్మకమగు తత్త్వజ్ఞానముచే దేవమనుష్యాదిభేదమును, దేహాత్మభ్రమరూపమైన మోహమును, దొలంగించికొనినయోగివరుల జ్ఞానమునకును, భగవదుపాసనాత్మకమగుబుద్ధికిని, విషయభూతుండవై, ప్రకృతిపురుషవిలక్షణుండవై, ప్రపంచకసృష్టిస్థితిలయము లనెడి లీలలందుఁ బ్రీతిగలిగివర్తించుచు, సర్వనియంతవై యున్ననీకు సమస్కారముం గావించెదను. ఓదేవా! నీవవాప్తసమస్తకాముండవు. కాన లీలామానవుఁడ వైనను జగద్వ్యాపారముసంభవింపకపోయినను, సంసారభయంబునఁ గంపితులగువారినను గ్రహింపఁ దలంపుచేతనే జగద్వ్యాపారము స్వీకరించుచున్నావు. నీ వవలంబించినయవతారంబులందలి గుణములను, గర్మములను ననుకరించుచున్న నామములగు, ఓదేవకీనందన! ఓదాశరథీ! ఓసర్వజ్ఞా! ఓభక్తవత్సలా! గోవర్ధనధరా! ఓకంసారాతీ ! ఓరావణాంతకా ! యనెడిపదములను బ్రాణావసానసమ

యమందుఁ బరవశులై యుండియు నెవ్వరు పఠించుచున్నారో వా రనేకజన్మములచే సంపాదించినపుణ్యసామములను బీరానఁ దొలఁగించుకొని యావరణరహితుఁడ వగునిన్నుఁ బొందుచున్నా రు. అట్లందఱికిఁ బ్రాప్యుఁడవయి, కర్మాయత్తము లగునుత్సత్త్యా దులు లేక వర్తించునిన్ను శరణు పొందుచున్నాను. దేవా ! మొదట నీ వొక్కఁడవయ్యుఁ, బ్రపంచకసృష్టిలయములకుఁ గ ర్తలగు బ్రహ్మరుద్రులుగాను, దన్మధ్యవర్తియై స్థితికిఁ గర్తయగు స్వావతారముగాను, మాఱి, యీమువ్వురును మూడుస్కంధ ములయి ప్రకాశింపఁ, బ్రకృతినుండి పరిణమించినదేవతిర్యఙ్మ నుష్యాదులు, శాఖలును, నుపశాఖలును, బత్రములును, బు ష్పములును, ఫలములును నై విలసిల్లఁ జక్కఁగ వర్ధిల్లి జగ ద్వృక్షమని యెన్నఁబడు నీకు నమస్కారంబు లొనర్తు. ఓభగ వంతా ! వేదాదిమూలమున నీ వుపదేశించినట్లు భవదారాధన రూపమును, దమనర్ణాశ్రమములకుఁ దగినదియు, క్షేమంకరం బు నగుకర్మమునందు శ్రద్ధాళువులై యున్నవారిసంసారబాధ లను వెంటనే తొలంగించి వైరాగ్యంబును గలిగించుచున్ననీపా దములకు వందనంబు లర్పించుచున్నాను. ఓ దేవా ! నీవు కాల శరీరకుండవై, యహంకారమమకారాదులచే విషయసుఖసాధనం బులందు నిరతులై భవదారాధనరూపకర్మములందు విముఖులై వర్తించుమానవాధములజీవితాశను ఛేదించుచున్నావు. అట్టి నీకు వందనమ్ము లర్పింతును. మఱియు, సకలలోకులకు వందనీయమై, రెండుపరార్ధములకాలముదనుక నిలిచియుండు సత్యలోకము నధిష్ఠించియున్నను, నేను దన్నియమిత కాలానంతరము నాలోక ము నశింపక మానదని నిశ్చయించి కాలస్వరూపుఁడ వగునీవలన

భయపడుచుందును. అట్లు భయమునుచెందుచు నిన్నె పొందఁ దలంచుకొని భవదారాధనరూపము లగుయాగంబులఁ బెక్కిం టి నొనరించి తపంబు చేయుచున్నాను. అట్లు సమస్తయాగంబు లందు నారాధ్యుండ వగునీకు నమస్కార మొనరించుచున్నాను. దేవా ! నీవు లోకోపద్రవముల వారించి లోకమర్యాదల నిలుపు టకుఁ బూనికొని,కర్మరహితుఁడవయినను,నాత్మసంకల్పముచే దే వయోనియందు వామనాదిరూపంబున నవతరించి,మానవులయం దు రామకృష్ణాదిరూపంబులను దాల్చి, తిర్యక్కులయందు మ త్స్యకూర్మవరాహాదిరూపంబుల నొంది,ధర్మసంస్థాపనము చేయు చు నీవు విషయసుఖాభిలాషలేనివాఁడవయినను నాయాయవతా రములకుఁ దగినకర్మముల నాచరించి సంతసించుచు వర్తించుచు న్నావు. అట్టినీకొఱకు నమస్కారంబులు కావింతును. నీపాదంబు లాశ్రయింతును. ప్రళయమునందు మాయాగుణంబునకుఁ జిక్కు వడక లోకంబుల నన్నింటిని నీయుదరమందు నిల్పికొనినవాఁడవ యి మిగులభయంకరంబుగా నున్నసముద్రమధ్యంబున సర్పరాజ తల్పమందు యోగనిద్రను బొందియుండి కొంతకాలంబు చన్న పిమ్మట మేల్కనియుండఁగా నీనాభికమలమువలన లోకత్రయాధి పతి నగునే నుద్భవించితిని. అట్టి పరమకారణుఁడవై, నిద్రాం తమున వికసించుచున్నపద్మంబులఁబోని నేత్రములుగల నీకు నందనంబు లర్పించెదను. ఓదేవా! నీవు సమస్తచరాచరముల యందు నంతర్యామివయి, కావుననే హితుండవై, విలసిల్లుచు, భవదీయమహామహిమచే సృష్టంబయినసమస్తప్రపంచమును సుఖంపఁ జేయుచున్నావు. ఓ నారాయణా ! నీ పిలోకంబుల నెల్ల నెట్టి విజ్ఞానమహిమచేఁ గల్పించి సుఖంపఁజేయుచున్నా

వో, యట్టివిజ్ఞానమహిమమునే సృష్టిఁజేయ సమర్థమయినప్ర జ్ఞను నా కొసంగుము. నీవు ప్రణతప్రియుండవు. కావునఁ బ్రణ తుఁడ నగునా ప్రార్థనము నెఱవేర్పక మానవు. ఓయీ ! విశ్వసృష్టినిమిత్తము సృజింపఁబడిననీవు విశ్వసృష్టికిఁ దగిన ప్రజ్ఞ నీవలయు నని ప్రార్థించుట తగ దనియందువేని చెప్పెద విను. ప్రసన్నవదనుఁడ వగునీవు నీకు శక్తిభూత యగులక్ష్మి తోఁగూడ జ్ఞానశక్త్యాదిగుణములఁ బరిత్యజింపక,యవి గల్గిన య వతారములఁ దాలిచి దేవతిర్యఙ్మనుష్యాదులందు నీచే నొనర్పఁ బడిన కర్మములను నాచిత్త మాసక్తమగునట్లు చేయుము. నీ విక్రమాతిశయముచే నొప్పి త్వద్విభూతిరూపమగుప్రపంచమును నీయాజ్ఞచే సృజించునాచిత్త మొకవేళఁ ద్వద్గుణాసక్తము కాదే మో,అందుచే నామానసంబును భవదాయత్తమగునట్లు చేయు ము.మఱియుఁ బొవనివర్తకము లగునీగుణములం దాసక్తి గలిగి సంసారహేతుభూతము లగుపుణ్యపాపముల నెట్లు విడువఁగలనో యట్టిమార్గమాలోచింపుము.నన్నుఁ గృతార్థునిఁ జేయుము. నీయ నుగ్రహముచే నీయవతారములను గుణములను ననుభవించు చు నీకుఁ గింకరుఁడనయి నీవిభూతియైయున్న ప్రపంచకమును సృజించునేను నిన్నుఁ బ్రార్థించుట యుక్తమే. ఓ మహాత్మా ! నీ యుదరమున జన్మించినపద్మమునందు భవదీయాంశంబున జన్మించిననేను నీకటాక్షంబుచేఁ జిదచిదాత్మకి మగులోకం బుల సృజింతు. అట్టి నాకు వేదవాక్కులయుచ్చారణమందు శక్తిలోపము లేకుండునట్లు ననుగ్రహింపుము. నాయందుఁ గృ పాశీలుండవయి నాకు దర్శనమిచ్చినపురాణపురుషుఁడవును, భగ వంతుండవు నగు నీవు మధురవాక్కులచే నాదుపిఖములం దొ

లఁగింపు'మని యిట్లు బ్రహ్మ నారాయణునకు నమస్కరించి, బద్ధాంజలియై యుండి నని మైత్రేయుండు విదురునకుఁ దెలియఁ జేసి వెండియు నిట్లనియె.'ఓవిదురా! ఇట్లు బ్రహ్మ పరమభక్తిసమేతుండయి యథాశక్తి వినుతించి మిన్నకుండె. అంత నాబ్రహ్మస్తోత్రంబులకు మిగుల నానందించి యాతనికోర్కులను దీర్పఁదలంచి కల్పాంతమందలిభయంకరజలముచే విషణ్ణహృదయుఁడగుట గనుంగొని తనలోకసంస్థానమువిషయమై, ఖిన్నుఁడగుటఁ దలపోసి యతనివిషాదము దొలఁగించునట్లు గంభీరవాక్కులతో నారాయణుండు బ్రహ్మకు వరంబులిచ్చి యంతర్ధానమొందుట.

నిట్లనియె. 'నీవు సృష్టిజేయువిధమును దెలుపు మని యడిగితివి. నీ వడిగినసృష్టివిధను నిదినఱకే సంపాదించి యున్నాను. ఆసృష్టివిధము నా కెట్లు దెలియు ననినచో నందుల కుపాయంబుచెప్పెద. నీవు మగుడఁ గర్మయోగమును, మద్విషయక మగునుపాసనను ననుష్ఠింపుము. ఓబ్రహ్మ ! ఆతపోవిద్యలచే, నింతకుఁ బూర్వము మత్కల్పితంబులగు లోకములను నీహృదయకమలమందుఁ జూడఁగలవు. పిమ్మట భక్తిశ్రద్ధలతోఁ గూడికొని సమస్తచరాచరములం దంతర్యామివై యున్ననన్నును, నాకు వ్యాప్యములై మఱియు శరీరభూతములై యున్న లోకములను జక్కఁగఁ జూడఁగలవు. అట్లు సర్వాత్మకుఁడును, బర బ్రహ్మము నగు నాసాక్షాత్కారమువలన నీవు మోహ మెడఁబాయఁగలవు. మఱియు * దారువులం దగ్నివలె సమస్తభూతములం దంతరాత్మనై ప్ర

---

* దారువహ్న్యదృష్టాంతముచేత, దారువులందున్న యగ్ని కాదారుగతములగుకాఠిల్యదీర్ఘత్వాదులెట్లుగా సంభవింపవో, యట్లే సమస్తచిదచిత్తులయం దంతరాత్మయైయున్నను నాచిదచిద్గతములయిన కర్మవశ్యత్వము, సృజ్యత్వము, పా

వేశించి ధారకుండనై యున్ననన్ను జూచినప్పుడే జనులు దుఃఖం బులవిడువఁగలరు. పృథివ్యాధిభూతములచేతను, జ్ఞానకర్మేంద్రియం బులచేతను, నంతఃకరణముచేతను, రహితమైనజీవాత్మను, సత్య జ్ఞానస్వరూపుఁడ నయిననాచే ధార్యునిగా నెప్పుడు తలంతురో యప్పుడే యకర్మవశ్యత్వమును బొందుదురు. ఓయీ? నీవనాది గా వచ్చుచుండిననానావిధకర్మముల ననుసరించి వెక్కండ్రఁ బ్రజలను సృజించుచున్నను నీచిత్తము నాయనుగ్రహంబువలనఁ గల్మషత్వము నొందకుండుఁగాక. మఱియు నీవు సంతతము రజో గుణప్రయుక్తుండవయి లోకసృష్టిని జేయుచుందువు. అయిననను బాపీయ మయినయారజోగుణము నాయనుగ్రహంబువలన నిన్నుఁ బాపాత్మునిగాఁ జేయనేరదు. నీమనంబు నాయందు లగ్న మయి యున్నది. కనుక నీ కట్టిదురితము లంటవు. సందియము చెందకుము. నన్ను నీవు భూతేంద్రియగుణములకు వ్యతిరిక్తుని గాఁ దెలిసికొంటివి. కావున మానవులకుఁ దెలియఁబడని నన్నుఁ దెలిసికొని యున్నావు. మఱియు నీవు పద్మనాళమును బ్రవేశించి నన్నుఁ జూడ నెంతయుఁ బ్రయత్నించి యేరూపము నుగుఱించి నీవు వెదకితివో యారూపమిప్పుడు నీకుఁ గానఁబడియె. ఈరూపమును జూడ మఱెవ్వరును శక్తులుకారు. ఓయీ! నాచ రిత్రముచే నంకిత మగునట్లు నీ వొనరించినస్తోత్రమునకును, నీవ్రు చేసినతపంబునకును, మిగుల సంతసించితిని. అందువలననే నీయం దు నాకనుగ్రహము కలిగినది. మఱియు లోకముల సృజింపఁ దలంపుగొని నన్నుఁ గల్యాణగుణప్రచురునిగాను, హేయ

ల్యత్వము, నిర్మమత్వము, శేషత్వము, శరీరత్వము మొదలగు ధర్మములు భగవంతునికిఁ జెందనేరవు.

గుణరహితునిఁగాను, స్తోత్రము చేసితివి. అందువలన మఱింత సంతసంబు చెందియున్నాను. నీకు మంగళములు కలుగుఁగాత. ఓకమలాసనా! నీ వొనరించిన స్తోత్రరాజముచే నన్ను స్తుతించుచుఁ బ్రత్యహము నన్ను భజించుచున్నమానవులకు నేను బ్రసన్నుఁడ నై యుందును. మఱియు వారలకోరికల నెఱవేర్చుచుందును. అట్టి వారలకు నిఖలయాగములచేతను, దానములచేతను, యోగాదులచేతను, సంపాదింపఁబడుచుండుఫలమెల్ల నొసంగుచుందును. కావున నోవిధాతా! జీవాత్మలకు సంతరాత్మనై ప్రియమయిన వస్తువులలోనెల్లఁ బ్రియతమముండనయి యున్ననన్ను ననిశము స్మరించుచుండుము. ఇంతకుఁబూర్వము నాలోపల నడఁగియున్నలోకములనెల్ల యథాపూర్వముగా సృజింపు' మని ప్రకృతిపురుషనియంత యగుభగవంతుఁడు జగన్నిర్మాణప్రకారమును బ్రహ్మకుఁ జెప్పి యంతర్ధానము చెందెను. ఇది తొమ్మిదవయధ్యాయము.

ఇట్లుచెప్పినవిని విదురుండు మైత్రేయుం జూచి 'మునీంద్రా! నారాయణుం డట్లు తిరోహితుం డయినపిమ్మట లోకపితామహుఁడయిన బ్రహ్మ దేహసంబంధమయినసృష్టిని, మనస్సంబంధమయిన సృష్టిని, నెన్నెన్నివిధములుగాఁ జేసెను? ఓమునీంద్రా! నే నింతకుముందు పలువిధములయినప్రశ్నముల నడిగి యున్నాను. దయయుంచి యాయాప్రశ్నముల కన్నింటికిఁ గ్రమముగాఁ దగినట్లు ప్రత్యుత్తరము లిచ్చి నాసందియములనివారింపుము.'' అని యిట్లడుగఁగా విని మైత్రేయుండు మిగుల సంతసించి తన హృదయమునందున్న విదురప్రశ్నముల కన్నింటికిఁ బ్రత్యుత్తరము లిచ్చి యుండె నని శుకుండు రాజునకుఁ జెప్పి మెండియు నిట్లని

నె.'ఓరాజా ! మైత్రేయుండు విదురుని కిట్లుచెప్పె "ఓవిదురా! భగవంతుం డగునారాయణుం డిచ్చినవరము ప్రభావంబుచే బ్రహ్మ తనమనస్సును బరమాత్మయందు స్థిరముగా నుంచి నూఱు దివ్యసంవత్సరములు భగవంతు నుద్దేశించి ఘోరం బగుతపంబు గావించెను. తరువాత నాకమలాసనుండు ప్రళయకాలమందలి వాయువుచే గంపితమయి,నిజనివాసభూతమయియున్న పద్మమును జలమునుఁ బొడఁగాంచినవాఁడయి, పరమాత్మవిషయకమయిన యుపాసనచేతను, దినదినము వృద్ధిపొందుచున్నతపస్సుచేతను, విశేష మయినవిజ్ఞానబలముగలవాఁడయి యాయుదకముతోఁ గూడి వాయువును ద్రావెను. ఇట్లూనరించినతోడనే యతఁడధిష్ఠించియున్నపద్మ మాకాశము నంటి యుండెను. అట్లాకాశము నంటియున్నపద్మముచేతఁ బూర్వకల్పమం దాపద్మమందు లీన మయియున్నలోకముల సృజించెదనని చింతించి భగవంతునిచేఁ దనకార్యమందు నియుక్తుండై, యాపద్మముఁ బ్రవేశించి చతుర్దశభువనంబులు కాఁదగినంత వైశాల్యము గలయాపద్మమును, దేవనమనుష్యాదిభోక్తృరూపముగాను, శబ్దాదిభోగ్యవస్తురూపముగాను, జ్ఞానకర్మేంద్రియకరణరూపముగాను, విభజించెను. మఱియు జీవుఁడోకసన్నివేశవిశేషము, భోక్త, భోగ్యము, భోగోపకరణము నా విభక్తమగుపద్మమే యని తెలిసికొనుము. ఓయీ ! పరమేష్ఠియుఁ, దదీయస్థానంబును, గార్యవర్గమున కంతర్గతములైయున్నవి. కాన నా బ్రహ్మయు, బ్రహ్మలోకమును, బ్రతిదినమునొనర్చు తైజసలోకసృష్టివంటిది యెందుకుఁగాదు? అన్నచోఁ జెప్పెద.వినుము. నిష్కామముగా ధర్మానుష్ఠాన మొనరించినవారికి నీపరమేష్ఠిలోకము ఫలభూతమగుచున్నది.నిష్కామధర్మములు

వారికి ముక్తియే ఫలముగాని పరమేష్ఠిగాని పరమేష్ఠిలోకముగాని ఫలము గాదనరాదు. నిష్కాములు మొదట బ్రహ్మలోకమున కేఁగి యనంతరము బ్రహ్మతోఁగూడ ముక్తిని బొందుదురు; త్రైలోక్యము కామ్యకర్మములకు ఫలరూపమగుటచే దానికిఁ బ్రతికల్పమందును సృష్టిలయములుగలవు. కాని నిష్కాములకుఁ బ్రాప్యమయిన బ్రహ్మలోకాదులకుఁ బ్రతికల్పమందును సృష్టిలయములులేవు. మఱియు బ్రహ్మలోకాదులు ద్విపరార్ధకాలమువఱకు నుండును. త్రైలోక్యమట్లుండదు. కావున బ్రహ్మలోకాదులసృష్టి త్రైలోక్యసృష్టివంటిదికాదని చెప్పియున్నా"రని మైత్రేయుండు చెప్పిన విని విదురుం డిట్లనియె". ఓయీ! ప్రళయమందుఁ గాలమున్నట్లు దెలియవచ్చుటచే నది నిత్యమని తోఁచుచున్నది. చిదచిదాత్మక ప్రపంచరూపుఁడును, నచింత్యవ్యాపారుఁడు, నగుశ్రీహరి కాలాఖ్యరూప మగుశరీరమునుగుఱించి వివరించిచెప్పము" నావుడు మైత్రేయుం డిట్లనియె. "ఓవిదురా! గుణపరిణామమగు ప్రధానమే స్వరూపముగాఁగలిగి, పృథివ్యాదిరహితుఁడై, కారణాంతరరహితుఁడై, యున్నపరమపురుషుఁ డుపాదానభూత మగు ప్రధానముతోఁ గూడినతన్ను జగద్రూపముగా లీలచే సృజించెను. ఒక్కఁ డగుభగవంతునికిఁ గార్యకారణభావ మెట్లు కలుగుచున్నది? అందువేని చెప్పెద వినుము. చిదచిద్విశిష్టుఁ డగుభగవంతుఁ డొక్కఁడైనను, దశాభేదమునుబట్టి కార్యకారణములుగా నుండవచ్చును. మృద్ద్రవ్యమునకుఁ గాలభేదమునుబట్టి పిండత్వావస్థయు, ఘటత్వావస్థయు సమకూడి, కారణభావమును, గార్యభావమును, బొందుచుండుట చూచుచున్నారము. అట్లె చిదచిద్విశిష్టుఁ డగుభగవంతునికి స్థూలావస్థయు, సూక్ష్మా



వస్థయుఁ గలిగియుండుటచేఁ గార్యకారణభావ ముపపన్న మగు చున్నది. ప్రకృతికార్యరూపమై కావున నే విశ్వాకారముగాఁ బరిణ మించి కంటికి గోచరమై యున్న యీ బ్రహ్మస్వరూపము సృష్టికిఁ బూర్వము, భగవత్సంకల్పముచేఁ బ్రకృత్యవస్థామాత్ర మేయై యుం డున ట్లుపసంహృతమైనది. అప్పుడు సమస్తప్రపంచకరూపమగు బ్రహ్మస్వరూపము, భగవంతునికి శరీరభూత మగుటచే నీశ్వరుఁడ నఁదగి యవ్యక్తరూపముగలిగినకాలముచేఁ బరిచ్ఛిన్న మగుచు న్నది. కావున సృష్టికిఁ బూర్వము సూక్ష్మచిదచిద్విశిష్ట మగుకాల ముచేఁ బరిచ్ఛిన్నమగు సత్పదార్థము మాత్రమే కలదని యె ఱుంగుము. మఱియు సృష్టిసంహారదశలందుఁ గాలానుగమ న మావశ్యకమయినది. సృష్టిదశయం దీజగఁ బెట్లు కాలపరి చ్ఛిన్న మగుచున్నదో యట్లె కార్యదశయందును జగంబు కాల పరిచ్ఛిన్న మగుచున్నది. ఇంతవఱకుఁ గాలకాల్యవస్తు సృష్టి నిగుఱించి చెప్పియున్నాను. ఇంకఁ గాలకాల్యవస్తుసృష్టిభేద ములను, బ్రళయభేదములను, జెప్పెదవినుము. సృష్టి తొమ్మిదివి ధంబులయి తనరారును. అందుఁ గొన్ని ప్రాకృతంబులనియుఁ గొన్ని వైకృతంబులనియుఁ జెప్పఁబడును. ఈతొమ్మిదివిధంబులగు సృష్టికిఁ బ్రళయంబు మూఁడువిధంబులై యుండును. ఆ ప్రళయము కాలద్రవ్యగుణములచే మూఁడువిధము లయి, కాలప్రళయము ద్రవ్యప్రళయము, గుణప్రళయము నాఁబడు నామంబులచేఁ దనరారుచుండును. అందు నీజంతువున కీకాలమందు మృతి ని యత మనునిర్ణయప్రకారమున జంతువులు పొలిసిన-చో దానికిఁ గాలప్రళయ మనిపేరు. ప్రళయము తఱిసినతఱి సంకర్షణముఖాగ్ని చే సమస్తజంతువులు నశించును. దానికి ద్రవ్యప్రళయమని

పేరు. సత్వరజస్తమోగుణములు సామ్యావస్థ నొందియుండు టకే గుణప్రళయమనిపేరు. ఆనవవిధసృష్టిలో మొదటిది మహత్తత్వసృష్టి. ఆమహత్తత్వము కాగ్యోన్ముఖుఁడయి ప్రకృతి పురుషశరీరుఁడయి యున్నపరమాత్మవలనఁ జెందిన గుణవైషమ్యమువలన జనించినది. ద్రవ్యజ్ఞానక్రియారూపంబయిన యహంకారము రెండవసృష్టి యనఁబడును. శబ్దస్పర్శరూపరసగంధములయుఁ బంచతన్మాత్రలయుఁ, బృథివ్యాదిపంచభూతములయు సృష్టి, భూతసృష్టి యనఁబడును. అది మూడవసృష్టి. త్వక్, చక్షు, శ్రోత్రి, జిహ్వా, ఘ్రాణంబు లనెడిజ్ఞానేంద్రియపంచకము, వాక్, పాణి, పాద, పా, యూపస్థ లనెడి కర్మేంద్రియపంచకమునాఁబడు నీ దశవిధేంద్రియములసృష్టి కింద్రియసృష్టి యని పేరు. అది నాల్గవసృష్టి. ఏవైకారికాహంకారమువలన మనస్సు జనించెనో యాయహంకారమువలన నయినది, యింద్రియాభిమానదేవతలసృష్టి. అది యయిదవది. ప్రభవయినచతుర్ముఖునకంతరాత్మయై యున్నభగవంతునిసంకల్పమువలనఁ గలిగినతామససృష్టి యాఱవది. ఈచెప్పినయాఱువిధములయిన సృష్టులు చతుర్ముఖశరీరకుఁ డగుటవలన రజోగుణభాక్కయినభగవంతునికి లీలార్థము లయి ప్రాకృతసృష్టులని చెప్పఁబడును. ఇంక వైకృతసర్గంబులఁ జెప్పెద నాలింపుము. పుష్పోత్పత్తి లేకుండ ఫలించుచున్నయశ్వత్థపనసముఖాదివనస్పతులును, బుష్పితంబులయి పండునంతవఱకుఁ బ్రదికియుండెడి వీరిహియవాదు లయినయోషధులు, నాగోవాణాపేక్షితంబులయిన మాలతీమల్లికాదిలతలును, ద్వక్కుమాత్రమే సారముగాఁ గలరంభావేణుకాదులును, గతినభూతములయిన మొదళ్లు కలవై శిఖావిస్తృతంబులై విలసిల్లెడిలతావిశేషము

లయినవీరుధంబులును, బుష్పనంతంబులయి పండుచుఁ జిరకాలం బువఱకు జీవించుచున్నరసాలాదినృక్షంబులును, నీచెప్పిన యూ ఱును, నవ్యక్తచైతన్యంబులయి యంతస్పర్శంబులయి స్థానరం బులని పిలువఁబడుచుఁ దనరారుచున్నవి. వీని సృష్టి యేడవది. తిర్యక్కులసృష్టి యెనిమిదవది. అది యిరువదియెనిమిదివిధము లయి యుండును. వానిని వివరించి చెప్పెద వినుము. స్వస్థానాది జ్ఞానశూన్యములయి కేవలాహారాదిజ్ఞాననిష్ఠంబులయి ఘ్రాణేం ద్రియమువలన సమస్తము తెలిసికొనునవయి, చీల్పఁబడిన డొ క్కలుకలవై యున్నవి తొమ్మిదివిధములు. అవి క్రమముగా గో వులు, మేకలు, మహిషములు, కృష్ణసారములు, సూకరములు, గవయమృగములు, నల్లచాఱలదుప్పలు, గొఱ్ఱెలు, లొట్టియలు నై యున్నయవి.చీల్పఁబడని డొక్కలుగలమృగము లాఱువిధంబు లు.అవి క్రమముగా గార్దభములు,తురంగములు.వేసడములు,గౌ రవమృగములు, శరభములు, చమరీమృగములు నై యున్నవి. ఇం క నై దేసినఖంబులుగల పశువులనుగూర్చి చెప్పెద వినుఁ.అవి పం డ్రెండువిధంబులు. అవి నరుసగా,శునకములు,జంబుకములు,తోఁ డేళ్లు, శార్దూలములు, మార్జాలములు, శశములు, నేదుఁబందు లు, సింహంబులు, వానరములు, గజములు, కూర్మములు, నుడు ములునై యున్నవి. మకరాదిజలచరములును, రాఁబులుఁగులు ను, గృధ్రములును, బకములును, డేగలును, బొలపిట్టలు, భ ల్లూకములును, మయూరములును, హంసములును, సారసప క్షులును, జక్రవాకములును, గాకములును, గుడ్లగూబలును, నీమొదలగు పక్షులునుగలిసి యేకవిధమయ్యె. ఇట్లు తిర్యక్సృష్టి యిరువది యెనిమిదివిధములు.అర్వాగ్గామలయిన మానవులసృష్టి

తిర్యక్కులవలె నానావిధంబులు కాక యేకవిధంబయియుండు. అది తొమ్మిదవసృష్టి. మానవులందఱు రజోగుణప్రధానులయి సుఖాభిలాషులయి నానావిధకర్మకారులయి యుందురు. ఈచెప్పినవి నవవిధ సర్గంబు లయి యుండును. ఇందుఁ గడపటిమూడును వైకృతసర్గంబు లనంబఱు. ఇంక దేవసర్గంబు చెప్పెద వినుము. అది యెనిమిదితెఱంగులై యుండును. విబుధపితృదేవతాసమూహ మొకవిధము. రాక్షసులు రెండవవిధము వారు. గంధర్వాప్సరసలు మూడవవిధము వారు. సిద్ధులు నాల్గవ విధము వారు. యక్షరక్షస్సు లైదవవిధము వారు. చారణు లాఱవవిధము వారు. భూతప్రేతపిశాచాదులు లేడవవిధము వారు. కిన్నరకింపురుష విద్యాధరు లెనిమిదవవిధము వారు. ఇది యే దేవసర్గం బనంబడు. ఓ విదురా! నీకు దేవసర్గసహితమై పదివిధములయిన సృష్టుల తెఱంగు లెఱింగించితిని. ఈచెప్పినదానిలో నొక్కవిశేషంబు కలదు చెప్పెద వినుము. సనత్కుమారాదులసృష్టి మొదట వైకృతంబయ్యును దేవత్వంబు కల్పించినకారణంబునఁజేసి ప్రాకృతసర్గాంతర్గతంబయ్యె. నీలలోహితుండు సనకాదులం దంతర్భూతుఁడయినను బ్రతికల్పమందును సృజింపఁబడుటంజేసి యతఁడు వైకృతసర్గంబులోఁ జేరినవాఁడేయని యెఱుంగుము. ఓవిదురా! సకలవస్తుపరిచ్ఛేదకమగు కాలస్వరూపమును జెప్పి యనంతరము, మనువులను గుఱించియు, మన్వంతరములను గుఱించియుఁ, జెప్పెద. ఓయీ! కల్పాదియందు స్వయంభువును, సృష్టికర్తయు నగుపరమాత్మ చతుర్ముఖశరీరకుఁ డగుటవలన రజోగుణసమేతుఁడై యమోఘసంకల్పము గలవాఁడై తానే తన్ను, సృజించుచున్నాఁడు. మఱియు గుణవ్యతికరాత్మక మగుబ్రహ్మాండసృష్టి

యుగపత్కాలమందె ప్రవర్తిల్లె. అది యెట్లని శంకింపఁబని లేదు. భగవంతుఁ డాశ్చర్యశక్తిసమేతుఁడై యున్నప్పుడు బ్రహ్మాండ సృష్టి యేకకాలమందే ప్రవర్తిల్లుట కేమికొదవ? నదియందు భ్రమించుచున్న యీవర్తబుద్బుదములు యుగపత్కాలమందె యుత్పన్న మ్రగుచున్నట్లు ప్రత్యక్షముగాఁ జూచుచుండలేదా ? కావున నండసృష్టివిషయమై పౌర్వాపర్య మెన్నరాదు. ఓయీ! ప్రతికల్పమందు వర్తించు నింద్రాదిదేవతలు భిన్నులా? లేక యొకకల్పమందుండువారలే మఱుఁడఁ గల్పాంతమందు నింద్రాదులగుచున్నారా? అందువేని వినుము. ఈకల్పమందుండు నింద్రాదిదేవతలే మఱియొక కల్పమందు నామాంతరములచేతను, రూపాంతరములచేతను వెలయుచు, నుందురు. ఇది పదియవయధ్యాయము.

ఓయీ! ఇఁకఁ గాలస్వరూపము నెఱింగించెద. సావధానుండవు కమ్ము. ఓ విదురా! సమస్తమయిన కార్యజాతము పరమాణువుండమువలననే పుట్టినది.ఘటపటాదులయినకార్యములఁ బరమాణువువఱకు విభజింపవచ్చును. దేనికంటెఁ జిన్నవస్తువుండదో దానికిఁ బరమాణు ననిపేరు. కార్యజాతమంతయు మొదట తా మెట్టిపరమాణుసంయోగమువలన నుద్భవించినవో ప్రళయమం దట్టిపరమాణువులలోనికి మాఱును. అవి యోగీశ్వరులకు దృశ్యంబులై గానవచ్చును. గాని సాధారణులకుఁ గానరావు. పరమాణువుకంటెఁ జిన్నవస్తు వేదియు నుండదు. విరాట్టుకంటె నధికపరిమాణముగల వస్తు వుండదు. అట్టిపరమాణువు లొకదాని కొకటిచొప్పునఁ బెక్కులు కలియుటచేతనే ఘట

మైత్రేయుండు విదురునకుఁ గాలపరిమాణమును జెప్పుట.

పటాదు లేర్పడుచున్నవి. అట్టిపరమాణువులవలననే కాలము గూడ నేర్పడినది. కాలము సూర్యగమనముచే విభజింపఁబడు చున్నది. సూర్యుఁడు పరమాణు వుండినప్రదేశము నెంతకాల ములో నతిక్రమించునో యక్కాలంబు పరమాణు వని చెప్పఁబ డును. కాలపరిమాణములలో స్వల్పతమ మయినది పరమా ణుకాలమే. అట్లు సూర్యుఁడు ద్వాదశరాశిరూపకమయిన భువన ము నతిక్రమించుట కెంతకాలముపట్టునో దానికి సంవత్సరంబని పేరు.అట్టిసంవత్సరమును మహాకాలపరిమాణమని చెప్పుదురు. మన్వంతరాదులు సంవత్సరముకంటె నెక్కువకాలమును దీసికొ నుచున్నను, నామన్వంతరాదులన్నియు సంవత్సరము లావృత్తి యగుటవలనఁ గలుగుచున్నవి. కాని మఱియొకవిధముగాఁ గలుగ లేదు. కావున సంవత్సరమునకే మహాకాలపరిమాణ మనఁదగు. రెండు పరమాణువు లొక్కయణు వగు. మూడణువుల కాలము త్రసరేణు వగును.గవాక్షములరంధ్రములనుండి వచ్చు సూర్య కిరణములందుఁ జూడఁబడుచు నాకసమునకుఁ బోవు పరాగకణ మే త్రసరేణు వని చెప్పఁబడు. సూర్యుఁ డాత్రసరేణు వున్నంత ప్రదేశము నెంతలో నతిక్రమించునో యది త్రసరేణుకాల మనఁ బడు. మూఁడుత్రసరేణువులకాల మొక్కతృటి యనఁబడును.మూ ఱుతృటులకాలం బొకవేధ యనఁబడును.మూఁడువేధలకాల మొక లవమని చెప్పఁబడును. మూఁడులవముల కాల మొకనిమేష మని చెప్పఁబడును. నిమేషత్రయం బొక్కక్షణంబగు. ఐదుక్షణము లొకకాష్ఠ యనంబడు. అట్టికాష్ఠలు పదియేనయినచో నొకలఘు వగు. అట్టిలఘువులు పదునేనైనచో నొకనాడిక యగు. రెండు

నాడిక లొకమువూర్తమయ్యె. మఱియు నట్టినాడిక లాఱేడై నచో మానవుల కొకప్రహరంబగు. దానికే యామమనియుఁ బేరుగలదు. మఱియు దినపరిమాణంబు తెలిసికొనుట కొకసాధన మున్నది చెప్పెద వినుము. పండ్రెండునఱపలములతామ్రముచే నొకపాత్రమును రచింపవలయును. నాలుగుమినుపగింజలయెత్తుగల బంగారముచే నాలుగంగుళముల నిడుపుగల యొకకణిక చేయవలయును. ఆకణికతో నప్పాత్రంబున కొక ఛిద్రంబు గల్పింపవలయు. ఆరంధ్రమునంబడి నీ రెంతకాలములో నప్పాత్రమును నించునో, యాకాలం బొకనాడికయగు. నాలుగేసియామము లయినచో మానవులకు రాత్రిందివంబు లగును. అట్టియహర్నిశంబులు పదునేను చన్నచో నొకపక్షం బగు. పక్షంబు శుక్లపక్షమనియుఁ గృష్ణపక్షమనియు రెండువిధములు.అప్పక్షంబులు రెండును జన్నచో నొక్కమాసం బగు. అట్టిమాసము పితృదేవతల కొకదినం బగు. అట్టిమాసంబులు రెండయిన మానవుల కొకఋతువగు. అట్టిఋతువులు మూడయినచో నొక్కయయనం బగు. అది దక్షిణాయనంబనియు నుత్తరాయణంబనియుం బరఁగు.అట్టి యయనంబులు రెండయినచో మానవుల కొక్కసంవత్సరంబగు. అట్టినూఱుసంవత్సరంబులు మానవులకుఁ బరమాయువయియుండును. కాలాత్మకుండయిన సూర్యుండు గ్రహతారానక్షత్రచక్రమధ్యగతుండై పరమాణువాదిగాఁగల సంవత్సరాత్మకం బయినకాలంబుచేత ద్వాదశరాశ్యాత్మకమయిన భువనకోశము నతిక్రమించుచుండును. ఈసంవత్సరము సూర్యాదులగతిభేదములచే సంవత్సరము, పరివత్సరము, ఇలావత్సరము, ఇద్వత్సరము, వత్సరము అని యయిదు విధంబు

లయ్యె. సూర్యుని గమనమునుబట్టి సంవత్సరమనియు, బృహస్పతి గతినిబట్టి పరివత్సరమనియు. సూర్యగతివిశేషమువలన నిలా వత్సరమనియుఁ, జంద్రగమనంబుబట్టి యిద్వత్సరమనియు, నక్ష త్రగతినిబట్టి వత్సరమనియు నామంబులు గలిగినవి. ఇట్టి కాల పరిమాణంబునకుఁ గారణుఁ డయినసూర్యుండు శరీరముగాఁ గల భగవంతుఁడు మానవునియాయువును వ్యయము నొందించుచుఁ గోరికలు గోరువారికి యజ్ఞాదులచే స్వర్గాదిఫలంబులఁ గల్పిం చుచు, నాకాశంబున ననవరతంబు సంచరించుచుండును. పంచ విధవత్సరాత్మకుఁడయిన యీ మహత్తునికిఁ బూజ లొనరింపు" మని మైత్రేయుండు పలికిన విని విదురుం డిట్లనియె. "ఓ మునీం ద్రా! నరపితృదేవతాదుల కాలపరిమాణమును దెలిసితివి. మూఁడులోకములకు మీఁదుగానున్న లోకములందలి వారి యాయుఃపరిమాణంబులను దెలియఁ జేయుము. కాలగతి సమ స్తము నీకుఁ దెలియును. నీవంటిమహత్తులకు యోగసాధనంబుచే సమస్తప్రపంచము కరతలామలకంబయి యుండును.నీకుఁ దెలి యనిసంగతియే లోకములో నుండదు. కాపున నాకుఁదెలియఁ జే యుమ"నిపలికినమైత్రేయుండిట్లనియె."ఓవిదురా!నీయభీష్టంబునె ఱవేర్చెదనాలింపుము.కృతయుగమనియుఁ, ద్రేతాయుగమనియు, ద్వాపరమనియుఁ, గలియుగమనియు నాలుగుయుగంబులుగలవు. అందు సంధ్యాంశంబుతోఁగూడిన కృతయుగంబు పరిమాణంబు పదాఱువేల యెనిమిదివందలదివ్యవత్సరంబులు. సంధ్యాంశము తోఁగూడిన త్రేతాయుగంబుపరిమాణము, పదునేనువేల యా ఱువందలవత్సరంబులు,సంధ్యాంశముతోఁగూడిన ద్వాపరయుగ

పరిమాణంబు, పదునాలుగువేల నాలుగువందలవత్సరంబులు.సం
ధ్యాంశసహితమనుయిన కలియుగపరిమాణము, పదుమూడువేల
రెండునందలవత్సరంబులు.ఒక యుగమునకును రెండవయుగమున
కుమధ్యమునకుండుభాగముసంధ్యాంశమనఁబడును.అట్టిసంధ్యాం
శములకు నడుమనుండుకాలము యుగమనఁబడు.అప్పుడు త్రివిధ
మయిన ధర్మము విస్తరిల్లుచు సంధ్యాంశములందుఁ దఱిగిపోవు
చుండును. మఱియు ధర్మము కృతయుగమునందు నాలుగు
పాదము గలదయి మనుజుల ననువర్తించుచుండును. త్రేతా
యుగమందు ధర్మము మూడు పాదంబు లుండును. ద్వాప
రయుగంబున రెండు పాదములు మాత్రమే ధర్మముండును.
కలియుగంబున నేకపాదం బయి యుండును. ముల్లోకంబులకు
మీఁదిభాగంబున విలసిల్లు సత్యలోకమందు బ్రహ్మ నివసించు
చుండును. ఆ బ్రహ్మకు నాలుగుయుగంబులు వేయి పర్యా
యంబులు దిరిగినచో నొక్కపవలగు. రాత్రియు నట్లె య
గు. ఆబ్రహ్మ జాగ్రదవస్థలోనున్నప్పుడు లోకములు ప్రకాశిం
చుచుండును. లేక నిద్రపోవుచుండిన సమస్తలోకంబులు విల
యంబు చెందుచుండును. బ్రహ్మకు నొక్కదినంబని పరఁగుకాల
ములోఁ బదునల్గురుమనువులు చనుచుందురు. ఒక్కొక్కమ
నువు నాయుఃపరిమాణంబు డెబ్బదియొక్కమహాయుగంబులకా
లము. అట్టిమనువులకు మధ్యమున నుండుభాగములకు మన్వంత
రము లనిపేరు. ఆమన్వంతరములయందు, మనువంశసంభూతు
లైనరాజులు, సురలు, మహామునులు, భగవదంశంబునఁ బుట్టి
పాలించుచుందురు. ఇట్లు చతుర్ముఖుండు దినదినముచేయు సృష్టి
యే దైనందినసృష్టి యనఁబడు. అది త్రిజగంబులను వర్ధించు

నది. ఆదైనందిన సృష్టియందుఁ దిర్యక్కులు, నరులు, దేవతలు, పితృదేవతలు, తమతమకర్మంబులఁ బురస్కరించుకొని పుట్టుచుందురు. నశించుచుందురు. మఱియు భగవంతుండు మన్వంతరములందుఁ బెక్కురూపంబులతో నవతరించుచుఁ బరాక్రమ మొప్పునట్లు జగంబులఁ బరిపాలించుచుండు. సరోజగర్భుండు పవలెల్ల జగంబుల సృజించుచు రాత్రియందుఁ దమో గుణాతిశయము నొంది విముక్తవ్యాపారుండయి నిద్ర చెందుచుండును. ఇట్లు బ్రహ్మ నిద్దుర చెందినంతనే మూఁడులోకములు సూర్యుఁడు చంద్రుఁడు, సమస్తము నశించును. ఎట్లనఁ గల్పాంతమునందు సంకర్షణముఖాగ్నిజ్వాలలచే మూఁడులోకములు దహింపఁబడును. ఆయగ్నిసంతాపమును సహింపలేక మహర్లోకమం దుండెడిభృగ్వాదిమునీశ్వరు లందఱు జనలోకమున కుఁ బోవుచుందురు. ఇట్లు సంకర్షణాగ్నిచే దహింపఁబడిన మూఁడులోకములను గల్పాంతమందు వినృద్ధ మయినప్రళయ కాలవాయువువలన నుద్భూతంబు లైనకల్లోలంబులచే వర్ధిల్లినసముద్రంబులు ముంచి యేకార్ణవముగాఁ జేయును. అట్టి భయంకరమయిన సముద్రమధ్యమందు సర్వరాజతల్పమున శయనించి యోగనిద్ర నవలంబించి నిమీలితాక్షుం డయి యున్న శ్రీనారాయణుండు జనలోకనివాసులయిన భృగ్వాదిమునీంద్రుల చే నుతింపఁబడుచుఁ బ్రకాశించుచుండును. ఇట్లహోరాత్రముల చే నుపలక్షితమయినకాలము గతించుచుండఁగా స్వమానము చే నూఱువత్సరంబుల పరిమితిగలబ్రహ్మయాయువు క్షయించు ను. బ్రహ్మయాయుష్కాలములో నగము పరార్ధ మనఁబడును. అందుఁ బూర్వపరార్ధ మతిక్రమించినది. రెండవపరార్ధ మిప్పుడు

ప్రవర్తించుచున్నది. ఆ పూర్వపరార్ధము మొదటిభాగమందు వేదమయుండగు బ్రహ్మ యుద్భవించుటంబట్టి యాభాగము బ్రహ్మ కల్పమని వాడఁబడుచున్నది. సాగరమధ్యమున ననంతశయనం బుపయి శయనించినభగవంతునినాభికమలమునుండి పద్మ ము ద్భవించినకాలము పద్మకల్పమని చెప్పఁబడును. కావునఁ బూర్వ పరార్ధమందుఁ బద్మకల్పము బ్రహ్మకల్పమును గణించినవి. ద్వితీ యపరార్ధంబు మొదటిభాగమున హరి నరాహావతారంబు దాల్చె ను.ఆకాలమును వారాహకల్ప మనంబఱు.ఆనరాహకల్పమే యిప్పు డు వర్తించుచున్నది. ఓవిదురా ! కాలస్వరూపుఁడును, విశ్వాత్మ కుఁడు నగుపర బ్రహ్మకుఁ బరమాణువుమొదలు పరార్ధము తుదనఅ కుఁ గలకాల మింతేనియుఁ బ్రతిబంధింపఁజాలదు. పరమాణ్వాది పరార్ధాంత మయినట్టికాల మాయీశ్వరుని లోఁబఱుచుకొనఁజా లదు. శబ్దాదివిషయములు వాగాదివ్యాపారములు ప్రాణాదివా యువులు, మనంబును పదునాఱువికారంబులతోఁ గూడికొని యొకఁడానికంటె నొకటి పదిరెట్లధిక ప్రమాణముగల భూజలతే జోవాయుగగనాహంకారమహత్తత్త్వప్రకృతులచే నావృతమయి యేఁబదికోట్లయోజనముల విస్తృతిగలిగి బ్రహ్మాండకోశంబు పొ లుచుచుండు. ఇట్టి విస్తీర్ణమయిన బ్రహ్మాండము మఱియు, నట్టివ ర్తమానములతో కొన్నియండరాసులును నేమూలప్రకృతియందుఁ బ్ర వేశించి పరమాణువులవలెఁ జూడఁబడుచున్నవో, ఆమూల ప్రకృతి పరాత్పరుండు మహోత్ముఁడు నగునీశ్వరునిశరీరంబయి యొప్పుచుండు. అట్టి పరమపురుషుని వర్ణింప నెవ్వరికయినం దర మగునే. ఇట్లచింత్యములు, నానావిధములు నగువైభవంబులతో నొప్పుమూలప్రకృతి శరీరముగాఁ గలిగియున్న పరమాత్మకుఁ

గాల మెట్లు ప్రభువుగాఁగలదు.''అనిచెప్పి వెండియుమైత్రేయుం డు విదురున కిట్లనియె. ఇది పదునొకండవయధ్యాయము.

''ఓవిదురా! కాలాహ్వాయుఁ డయిన నారాయణునిమహిమల వర్ణించి చెప్పితిని. ఇంక చతుర్ముఖసృష్టిమహిమల వర్ణించెద వినుము. పద్మాసనుండే సృష్టిప్రారంభమందు ముందుగా స్వరూపా ప్రకాశం బగుతమంబు, ''అహం'' మ్మనుదేహాభిమానబుద్ధిగలిగిన మూహాంబు, విషయసుఖాభిలాషరూపమయిన మహామోహము, విషయసుఖంబుల కంతిరాయము కలుగుటవలనఁ గ్రోధంబు జనించుచుండు. తాదృశక్రోధరూపమయిన తామిస్రము, తాదృశసుఖంబులకు నాశము కలుగగా నేనేమృతినొందితి ననెడిబుద్ధి పొడముచుండు. తాదృశబుద్ధిరూపమయిన యంధతామిస్రమున

మైత్రేయుండు విదురునకుఁ చతుర్ముఖసృష్టులను దెలుపుట.

ను నజ్ఞానపంచకమును సృజించెను. ఇట్లు చతుర్ముఖుండు ముందుగా నవిద్యాపంచకంబు సృజించి, యట్టిపాపసృష్టి గావించినందులకుఁ బశ్చాత్తాపముచెందుచుఁ బిమ్మట భగవంతుని స్మరించుటవలనఁ జిత్తంబును బూతంబు గావించుకొని యూర్ధ్వరేతస్కులును, బరమపవిత్రులును, నగుసనకసనందనసనత్కుమారసనత్సుజాతు లనుమునీంద్రుల సృజించి వారలం గాంచి ''ఓయీ! మీమీయంశంబులతోఁ బ్రజలఁబుట్టించి ప్రపంచంబును వృద్ధిగావింపుఁడు'' అని శాసింప వార లాబ్రహ్మవాక్యంబుల నెగతాళిచేయుచు బ్రహ్మనుజూచి ''మోక్షబుద్ధులము, నారాయణపరాయణులము, నగుమమ్ము పాపమయిన ప్రపంచసృష్టి చేయుఁ డందువా'' యని తూలఁబలికిన నమ్మాటలకు బ్రహ్మ దుస్సహాకోపంబు నొంది

దాని నుపశమింపఁ జేయుసమయంబున నాక్రోధ మతని బ్రూ మధ్యంబుననుండి నీలలోహితుండై యుదయించి రోదనంబుచేయుచుండె. ఇట్లు రోదనంబు చేయుచున్న యాబాలకునియభిప్రాయంబు తెలిసికొనినతఁడు తనకు నామములను స్థానములను గల్పింపుమనియె. అంత బ్రహ్మ మంచిమాటలతో వాని కిట్లనియె. "ఓకుమారా! భయసహితుండవయి బాలకునివలె రోదనంబు చేయుచున్నకతంబున నిన్ను రుద్రుండని పిలుచుచుందురు. నుతియు నీవు చంద్ర, సూర్య, వహ్ని, వాయు, సలిల, గగన, పృథివీ, ప్రాణ, తపో, హృదయేంద్రియములనెడి యేకాదశస్థానముల వాసస్థానంబులఁగాఁ జేసికొని, మన్యుఁడు, మనువు, మహాశాలుఁడు, మహింతుఁడు, శివుఁడు, ఋతధ్వజుఁడు, నురు రేతుఁడు, సభవ్రుఁడు, గాలుఁడు, వామదేవుఁడు, ధృతవ్రతుఁడు ననునామంబులచేఁ, బిలువఁబడుచు,ధీయు,వృత్తియు,నశనయు,ఉమయు, నియుత్తును,సర్పియు, నిలయు,నంబికయు,నిరావతియు,సుధయు, దక్షయు,ననెడి భార్యలతోఁగూడికొని విహరించుచుఁబ్రజల సృజింపుము.అందువలన నీవు ను బ్రజాపతి యని పిలువఁబడుదువ"ని నియమించిన భగవంతుఁడైననీలలోహితుండు విశ్వకర్త యగుపితామహుని శాసనంబు దల ధరించి సాత్వికస్వభావముచేఁ దనతోసమానులయిన ప్రజలను సృజించెను.ఇట్లు రుద్రునిచే సృజింపఁబడినరుద్రగణంబులు లెక్కకు మించినవయి లోకమును భక్షింప సమకట్టుచుండ వాని నవలోకించి 'లోకముల కుపద్రవము కలుగుచున్నద'ని నిశ్చయించి బ్రహ్మ రుద్రున కిట్లనియె. "ఓయీ! నీవుచేయుచున్నసృష్టి నీఁక చాలింపుము. నీచే సృజింపఁబడినవారందఱు నుగ్రలోచనములచే నాతోఁగూడియున్న ప్రపంచమును దహించుచున్నారు. అందు

వలనఁ జాల నష్టము కలుగుచున్నది. కావున నీకు నీవుపోయి సమస్తభూతములకు సుఖము నిచ్చుతెఱఁగు మాచరింపుము. అంగునలన నీవు యథాపూర్వకముగా సృజింపఁగలవు. లోకమున మహాత్ములు ఘోరమయినతపంబొనరించి పరంజ్యోతియు,బ్రహ్మాత్పరుండును, నచ్యుతుండు,నఖిలేశ్వరుఁడు నగువిష్ణువును గనుఁగొనుచున్నారు. కావున నీవు మహాఫలదాయకమగు తపంబొనరింపు'' నుని నియమించిన నంత నిద్దరుఁడు రుద్రగణంబులవలనఁ గలిగెడి లోకోపద్రవం బడఁగించుటకయి తపంబు సేయఁ బోయెను అనంతరము కమలాసనుండు భగవంతుని లోకరచనాసామర్థ్యముగలనాఁడయి, సృష్టిస్థాపనంచుచు సంతానవృద్ధికిఁదలఁచును, బుద్ధిమంతులును,దనతో సమానులు నయినకుమారులఁ బదుగురి సృజించెను.ఆ పదుగురిలోఁదొలుండు బ్రహ్మాయంగుష్ఠంబువలన జనించెను. వారిదుర్జడతనియూరువులనఁ బుడమెను. ఆకమలాసను నాభీకుహరంబువలనఁ బులహుండుద్భవించెను. అతనికర్ణమునుండి పులస్త్యుండు సంభవించెను. అతనిచర్మమువలన భృగుమహాముని పుడమెను. అతనిహస్తమువలనఁ గ్రతువు పుట్టె. అమ్మహాత్ముమోమువలన నంగిరసుఁడు జన్మించె అతనిప్రాణమువలన వసిష్ఠమహాముని యుత్పన్నుండయ్యె. అతనిహృదయమునుండి నురీచి యుదయమందె. అతనినయనంబులనుండి యత్రిముని సంభవించె. మఱియు నలినగర్భసదృక్షణస్తనమువలన దేనియందు నారాయణుండునో యట్టిధర్మ ముదయించె. అతనివెన్ననుండి లోకభీకరమయిన మృత్యువు సధర్మమును జనించినవి. మఱియు నతనిహృదయమువలనఁ గాముండును, కనుబొమ్మలవలనఁ గ్రోధంబును, వెదవినుండి లోభమును, నోటినుండి వాణియు, గుహ్యంబు

వలన సముద్రంబులును, పాయువువలనఁ బాపాధిష్ఠానదేవత యగు నిర్ఋతియు, నతనినీడవలనఁ గర్దమప్రజాపతియు నుద్భవించిరి. ఆకర్దముఁడే దేవహూతికి భర్తయయ్యెఁ. ఇట్లు కపిలాసనుని దేహమునుండి కొందఱును మానసంబువలనఁ గొందఱును నుద్భవించిరి ఇట్లు తనవలన ననుయమంగినవారితోనున్న సరస్వతిని జూచి మోహావివశుఁడయి మన్మథునికి యగు ననియెఁ నాలోచింపకి యీమెను గనయఁదలంచె నఁట. ఆసమయంబునఁ బ్రహ్మనిశ్చయుఁ డయియున్నతండ్రిని బ్రహ్మగాంచి మరీచి మొదలగుసుతులనుఁ బిల్చి భక్తికలవారై యతని కిట్లు బోధకలిగించిరి. "ఓజనకా! మహానుభావుఁడవనఁ బనీవి ట్లాచరించుట యుక్తముకాదు. ఇట్లు పూర్వులు చేసియుండలేదు. ఇప్పటివారు చేయుచుండలేదు. భావికాలపువారుకూడ నిట్లు లాచరింపరు నీవు కామమును నిగ్రహింపకి నీ కుదయించిన పిల్లను గోరి వరించుటకంటె వేఱుపాపమున్నదియో? ప్రజల్శాలుగాఁ జనుని నిట్టిచెట్టపని మానియశంబుకాపాడుకొనుటలయు లేనిచో మహానుభావుఁడయిన పరమేశానుఁడు యుక్తాయుక్తము లనయకతాఁగన్నకూఁతునువరించెను? అట్టివాని కిలేనివాపము మనకా సంభవించుననుచు నింకమీఁదఁబుట్టువార లందఱు నీని నిదర్శనముగాఁ జేసికొని తమకుమారికలను దామే వరింపఁ బాటుపడుచుందురు. కావున నీదుష్టకార్యమువిడువు" మని పలికి తమజనకునిఁ దాదృశాధర్మమునలన మఱలింపఁదగినవాఁడు భగవంతుండుదక్కమఱొక్కండు లేఁడని తలంచి భగవంతునుద్దేశించి, "దేవా! నామరూపముల విభజింపఁదగనంత సూక్ష్మదశ గలిగి నీయందు వర్తించుచున్న చేతనాచేతనాత్మకమయిన జగంబును సంకల్పరూపజ్ఞానంబుచే విభక్తనామరూపములు కలదాని

గాఁ జేయుచున్నావు. నీవు జగంబులకెల్లఁ గారణభూతుండవు. ధర్మపరిపాలకుండవు. కావున మాజనకుని నీయధర్మమునుండి మఱలింపుము. నీకొఱకు నమస్కారమ''ని భగవంతునిఁ బ్రార్థింపఁ దొడంగిరి. అంత బ్రహ్మ, కుమారులపలుకు లాలకించి లోలోన సిగ్గుచెందుచుఁ దనతుచ్ఛకామకభావమును విడిచివైచెను. ఆకాముకత్వమును దిక్కులన్నియు స్వీకరించుచు హిమరూపంబయిన తమంబును గలనయి ప్రవర్తించుచున్నవి. ఇట్లు బ్రహ్మ కామకత్వపరిజనంబుచే నాపాపంబును దొలంగఁజేసికొని మఱియొకప్పుడు పూర్వకల్పమందలిసృష్టిప్రకారమును మనంబులోఁ దలపోయుచుండునవసరంబున నతనినాల్గుమొగంబులనుండి ఋగ్యజుస్సామాథర్వంబులనెడినాలుగువేదములు బయలువెడలెను. మఱియు నావేదములతోఁగూడఁ జతుర్హోతృమంత్రవేద్యములైన యాగంబులు, న్యాయములు, నుపవేదములు, ధర్మనూనకు నాల్గుపాదములయినతపంబు సత్యము, దయాశౌచములు, బ్రహ్మచర్యాద్యాశ్రమములయాచారములు, జనించిన వ''ని చెప్పినమైత్రేయునిఁజూచి విదురుం డిట్లనియె. ''ఓమునీంద్రా! బ్రహ్మ తనముఖములలో నేయేముఖమువలన నేయేసృష్టిచేసినాఁడో సవిస్తరముగాఁ దెలుపవలయు'' నని ప్రార్థించిన విని మైత్రేయుండు విదురున కిట్లనియె. ''ఓయీ! విదురా ! తూర్పుననున్నముఖంబువలన ఋగ్వేదము, దక్షిణముఖంబువలన యజుర్వేదము, పశ్చిమముఖంబువలన సామవేదము, ఉత్తరముఖంబువలన నథర్వవేదము నుద్భవించినవి. గీతమంత్రస్తోత్రంబు లగుశస్త్రములును, నధ్వర్యుకర్మమయిన స్తోత్రములు, నుద్గాతృప్రయోజ్యంబులయిన సంగీతరూపమయిన స్తుతియు, బ్రహ్మకర్మమయిన ప్రాయశ్చిత్తము

ననునట్టి నాల్గును గ్రమముగా బ్రహ్మ ప్రాగాదిముఖములవలన నుద్భవించినవి. మఱియు, నాయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వవేదము, శిల్పశాస్త్రం బనఁబడుస్థాపత్యము ననునీనాలుగు క్రమముగా బ్రహ్మ ప్రాగాదిముఖంబులవలనఁ బుట్టినవి. మఱియు సర్వజ్ఞుఁ డయినబ్రహ్మ ముఖములవలనఁ బంచమవేదము లనఁబడిన యితిహాసములు పురాణంబులు బయలువెడలె. మఱియుఁ గమలాసనుండు కర్మతంత్రములను గలిగింపఁదలంచి, ఘోడశఋక్కుల లనెడిసంస్థావిశిష్టకర్మములను, జయనాగ్నిష్టోమములను,నప్తోర్యామాతిరాత్రములను,గోసవవాజపేయములను,నీనాల్గిటిని బూర్వాదిముఖములనుండి క్రమంబుగాఁ గలిగించెను. మఱియు విద్యాదానతపస్సత్యంబు లనెడి ధర్మపాదములను, బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసము లనెడియాశ్రమంబులను, నానివృత్తులతోఁగూడఁ గ్రమముగాఁ బూర్వాదిముఖంబులనుండి యుత్పాదించె. ఆయావృత్తులభేదములఁ దెల్పెద నాలింపుము. బ్రహ్మచర్యాశ్రమవృత్తులు సావిత్రమనియుఁ, బ్రాజాపత్యమనియు, బ్రాహ్మమనియు మూఁడువిధంబులు. అందు స్త్రీసంగవిరహాదిరూపమయినవృత్తి సావిత్రం బని చెప్పఁబడును. ఉపనయనము మొదలు దివసత్రయంబు గాయత్రీమంత్రమును జపించుచు నడుపునట్టివృత్తి ప్రాజాపత్య మనఁబడును. వేదగ్రహానానంతరమువఱకు వ్రతంబుల నాచరించుచు నియమ మవలంబించియుండుట బ్రాహ్మమనంబడు. ఇంక గృహస్థాశ్రమవృత్తులఁ జెప్పెద వినుఁ. అవివార్త, సంచయము, శాలీనము, ఉంఛము ననునలుతెఱంగులై యుండు. అందు నిషిద్ధముకాని కృష్యాదికము వార్త యనంబడు. యజనాదికర్మంబుల నొనరింప

యాచించి యార్జించుట సంచయ మనఁబడు. పరులయాచింపకుం డఁ జేయువృత్తి శాలీన మనఁబడును. క్షేత్రపతితశిలయినధాన్యా దుల నేఱి తెచ్చికొని జీవించుట యుంఛ మనంబడు. వానప్రస్థాశ్ర మవృత్తులు నాల్గువిధంబు లయియుండు. ఆయావృత్తిభేదముల చే ననస్థితులలో నాల్గుతెఱంగులవారలయిరి. వారిలోఁ గొం దఱు దున్నకుండఁ బండినధాన్యాదికముచే జీవనంబుచేయుదురు. వారు వైఖానసు లనంబఱుదురు. కొందఱు నూతనంబు లగుఫలా దులు లభ్యంబులయినచోఁ బూర్వమం దున్నవానిని విసర్జించు చుందురు. వారలు వాలఖిల్యు లనంబఱుదురు. తమంతఫలించి తిరుపతితంబు లగుఫలంబులఁ దినుచు జీవనంబులు సలుపుచుఁ గొందఱు వర్తింతురు. వాగలు ఫేనపు లనఁబడుదురు. వారిలో మఱికొందఱు ప్రొద్దునఁ జేలేచి ముందుగా నేదిక్కును వీక్షింతురో యాదిక్కునకేఁగి యు ఫలాదులను గొనివచ్చి జీవించుచుందురు. వార లౌదుంబరు లనఁబడుదురు. ఇంకఁ దుర్వాశ్రమన్యాయత్తులఁ దెల్పెద నాలింపుము. సన్న్యాసులలో నాలుగువిధములవా రుం దురు. ఆయావృత్తులవలననే వారిలోఁ గుటీచకులనియు, బహూ దకులనియు, హంసులనియు, నిష్క్రియులనియు నాలుగువిధము లవారయిరి. అందుఁ గొందఱు న్యాశ్రమధర్మములఁ దప్పకి యా చరింతురు. వారలు కుటీచకు లనఁబడుదురు. మఱికొందఱు కర్మ ములనుపసర్జనముగాఁ జేసికొని జ్ఞానమును బ్రధానముగాఁ జేసి కొని వర్తింతురు. వారు బహూదకు లనఁబడుదురు. మఱికొందఱు కేవలము జ్ఞానమునే యభ్యసించుచుందురు. వారు హంసలనఁబడు దురు. మఱికొందఱు ప్రవృత్తిధర్మముల విడిచి పరబ్రహ్మతత్వంబు గలిగియుందురు. వారు నిష్క్రియు లనఁబడుదురు. మఱియు నా

త్మానాత్మవివేకమును గలిగించెడి యాన్వీక్షికియు, స్వర్గాదిఫలం బుల నొసంగుకర్మములఁ దెలియఁజేయు త్రయియును, జీవనఫ లంబుల నిచ్చుచుంటకుఁ బ్రధానంబయిన కృష్యాద్యారూపం బగు వార్తయు, ద్రవ్యమును సంపాదింప సాధనభూతిం బగుదండనీతి యు ననునవి పూర్వాదిముఖంబులఁ గ్రమంబుగా నుద్భవించె. మఱియు, ఓమ్, భూర్, భువ, స్సువ యనునట్టివ్యాహృతులు యథాక్రమముగా నుద్భవించినవి. మఱియు బ్రహ్మనలననే ఛం దస్సు లుదయించినవి. వానిని వివరించెద వినుము. రోమ ములవలన నుష్ణిక్ఛందంబును, చర్మమువలన గాయత్రీఛందంబు ను, మాంసమునలనఁ ద్రిష్టుప్ఛందంబును, స్నాయువులవలన ననుష్టుప్ఛందమును, నస్థులవలన జగతీఛందంబు, మజ్జవలనఁ బంక్తి చ్ఛందంబు, ప్రాణంబువలన బృహతీఛందంబు నుదయించెను. మఱియు బ్రహ్మాజీనమువలన కకారాదిమావసానంబులగుస్పర్శము లయ్యె. దేహంబువలన నకారాదిస్వరంబు లుద్భూతంబులయ్యె. అతినింద్రియమువలన నూష్మములనిపిలువఁబడు శిషసహోక్షరం బు లుద్భవించె బ్రహ్మబలమువలన నంతిష్ఠము లనఁబడు యరలవా క్షరంబులు జనసమందె. మఱియుఁ బ్రజాపతివిహారమువలన సరి గమపధనిరూపములయిన సప్తస్వరంబులుపుట్టె. ఓవిదురా ! శబ్ద బ్రహ్మమే శరీరముగాఁగలవాఁడును, వ్యక్తావ్యక్తస్వరూపముగల వాఁడు నగుచతుర్ముఖునివలన నర్థాత్మకబ్రహ్మముకంటె నన్యమయి నదియుఁ బ్రకృతిప్రత్యయపదవాక్యాది రూపముగా విస్తృతము యినదియు,నానావిధములయిన యభిధాదిశక్తులతోఁ గూడికొని యున్న శబ్దబ్రహ్మ మిట్లుత్పన్నమయినది. తరువాత బ్రహ్మ శబ్దా త్మకమయిన శరీరముకంటె నితరమయిన శరీరమును దాల్చి

తిరిగి సృజింపఁ బూనికొని సంతానవృద్ధిచేయ శక్తిగల ఋషీశ్వరులు వెక్కురున్నను సృష్టి వృద్ధి పొందలే దని తలంచి తనలో నిట్లనుకొనియె. "అక్కటా! నేను బ్రతిదిన మత్యంత శ్రమమూని సృజించుచున్నను బ్రజావృద్ధి కాకున్నది. ఇదెంతయు నద్భుతముగా నున్నది. నే నిట్లు ప్రయత్నించుచున్నను బ్రజావృద్ధి కాకపోవుటంబట్టి యాలోచింప దైవ మిందుల కంతరాయము కల్పించి యుండవచ్చును. లేనిచో నేలనృద్ధిపొందదు?" అని యిట్లాలోచించుచున్నసమయమున నతనిశరీరము రెండువిధములుగా విభిన్నంబయి యొకమిథునం బేర్పడియె. వారు స్వాయంభువమనునయి, శతరూపయనియు వాసికెక్కిరి. అమిథునంబువలనఁ బ్రియవ్రతుఁడు, నుత్తానపాదుఁడు ననుపుత్త్రులిర్వురు జనించిరి. మఱియు నాకూతియు దేవహూతియుఁ బ్రసూతియు ననుముప్పురుకుమారికలుగూడ నుద్భవించిరి. అంత స్వాయంభువుండు తనకూఁతులలో నాకూతిని రుచికునకును, దేవహూతిని కర్దమునకును, బ్రసూతిని దక్షునకు, నిచ్చి వెండ్లిగావించె. పిమ్మట వీరలసంతతివలన జగంబంతయుఁ బరిపూర్ణంబయ్యె". అని చెప్పినమైత్రేయునిఁ జూచి విదురుండు సంతసించి భగవత్కథాశ్రవణకుతూహలుఁడై ముని నిట్లడిగె ననిచెప్పి శుకుండు వెండియు రాజున కిట్లనియె. ఇది పండ్రెండవయధ్యాయము.

"ఓమునీంద్రా! స్వాయంభువమను వుద్భవించి పత్నీసమేతుండై తరువాత నేమిచేసెను? ఆతఁడు మొదటిరాజసత్తముఁడు కావున నతనివృత్తాంతంబు వినఁ గుతూహల మగుచున్నది. మఱియు నతండు విష్ణువాశ్రయము గాఁగలవాఁడని విందుము.

అట్టి మహానుభావులచరిత్రములు విన్నచో బుట్టువు సఫలము కాకుండునా? వేదశాస్త్రము లధ్యయనము చేసినవారికిసైత ము భాగవతులగుణంబులు వినఁ దగినవియే కదా!" అని యిట్లు వినయాదిగుణసంపన్నుఁడును, భగవత్పదముల కుపధానభూ తమైన యుత్తమాంగంబు గలవాఁడు నగువిదురుం డడుగ విని మైత్రేయుండు భగవత్కథయందుఁ బ్రేరితుం డగుటకుఁ బులకి

స్వాయంభువుండు ప్రజావృద్ధిచేయుట.

తశరీరుండై యతని కిట్లనియె. స్వాయంభువమనువు భార్యతోఁ గూడ నుదయమందినపిమ్మట సపత్నీకుండయి బద్ధాంజలియయి బ్రహ్మను డాయంజని యిట్లనియె. "ఓజనకా! సమస్తభూతములకు జనకుఁడవయి, యీయాస్మత్తులకల్పించి పోషకుఁడవయి యున్నా వు. నీవు మమ్ము బుట్టించితివి. మే మీచరింపనలసినపనియేమి? దాని నాలోచించి చెప్పుము. కుమారుండు తండ్రికిఁ బ్రియంబు లయినకార్యములాచరించి యతనికి సంతసము గలిగించుచు,నత నికి సేన లొనర్చుచు వాసికెక్కుట యుచితంబు. కావున నీయభీ ష్టంబు దెలియఁ జేసిన నే నట్లాచరించి యుభయలోకములందును గీర్తిఁ జెంది నీకు సంతసము కలిగించెదను." అని యిట్లు పలుకుచున్న స్వాయంభువమనువును జూచి యిట్లనియె. "ఓరాజా! నిష్కపట మగు హృదయముతో 'జనకా! నన్నుఁ జక్కఁగ శిక్షించి యుక్త కర్మములందు నియోగింపు'మని స్వయముగానే పలికితివి. ఈవా క్యములకు నేను మిగుల సంతసించితిని. మీ కిరువురకు నమితం బగు శుభంబులు గలుగుఁగాక. ఓయీపుత్త్రికా! కుమారుఁడు తండ్రికిఁ బరిచర్య సేయుట యన నతివినయముతో తండ్రి యానతిని దలయందు ధరించి యతండు చెప్పినపనిని శక్తివంచన

లేకుండఁ జేయుచుండుటయె. అట్లయిన నీయానతి యేమనియందు వేని చెప్పెద వినుఁ. నీవు నీభార్యయందు గుణములచే నీసమానుల గుపుత్త్రులను బుట్టించి ధర్మ్యు క్తనుఁగా భూమండలమును బరిపాలింపుము. మఱియు యాగము లొనరించి యాగస్వరూపుఁడ యిన పరమపురుషు నారాధింపుము. నీ వట్లు చేయుటయే పరమ శుశ్రూషయని తెలంచెదను. నీ వట్లు చేయుటవలనఁ బరమపురుషుండు సంతసించును. అతఁడు సంతసించినఁగో సమస్తము లభించును. గాన యడలేనిఁగో శ్రమములన్నియు, స్వార్థములే. కుమారా! నన్నును లోకమును సంతసింపఁ జేయఁ. దలంపున్న యాగముల నాచరింపుము." అని చెప్పుచున్న కమలాసనునకును లుఁ విని మను విట్లనియె "ఓజనకా! నీవు చెప్పినట్లు చేసెదను. నే యాగములుచేసి భగవంతుని సంతసింపఁ జేసెదను. కాని నాకును నాశ్రితులకు నివసింపఁదగియుండు స్థలమును జూపుము. సమస్తజంతువులకు నివాసయోగ్యమయినభూమి జలమందు మునిఁగియున్నది. ఆభూమి నెట్లయిన నుద్ధరించెడియుపాయ మాలోచింపు"మని మనువుపలికినవాక్యము లాలకించి బ్రహ్మ జలమందు మునిఁగియున్న భూమి నుపలక్షించి "యీభూమిని నే నెట్లుద్ధరింతును? మొదటఁ బ్రళయకాలజలంబునంతను ద్రావితిని. పిదప భూమియుఁ జక్కఁగ స్థాపింపఁబడినది. అసంతరము ప్రజలను, దేవతలను, రాక్షసులను, పితృదేవతలను, పసులను, పక్షులను, సరీసృపములను, పర్వతములను, గజములను, పెద్దవియుఁ జిన్నవియు నగుభూతంబులను సృజించుచుంటిని. ఇట్లు నే సృజించుచుండ భూమి జలంబుల మునింగి రసాతల మంటినది. సృష్టిప్రవర్తకుఁడ నగునేను జేసెడిదేమి? ఎవనిసంకల్పమునుండి నే ను

త్పన్నుండ నైతినో యాభగవంతుండు నే నాచరింపనలసినకా
ర్యమును సంపాదించుఁగాక'' అనిచెప్పి భగవంతుండగు నారాయ
ణుని హృదయకమలంబుపఁ జేర్చి తెలుంచుచున్నసమయంబున

సూకర వరాహావతార కథ.

నాసాపుటములవలన సంగుష్ఠమాత్ర ప్రమాణంబు గలవరా
హంబు జన్మించి యాకసమునం దున్నయి, చూచువారి లాశ్చ
ర్యమునొందునట్లు క్షణములోనే యేనుఁగంతి ప్రమాణముగల
దాయెను. ఇట్లుండి ఆకసమునకు నాశ్చర్యముగ లుపుచున్నవరాహమును
బ్రహ్మ మరీచి మొదలగువారిందఱు చూచి యచ్చెరువొందుచు
''నిట్టిసృష్టి నిదివఱ కెన్నడును జూచి యుండలేదు. నాసావిపర
మునుండి యంగుష్ఠమాత్ర ప్రమాణంబు కలదయి క్షణమాత్ర
ములోపలనే గజప్రమాణమైనది. మనకియు నొకగండశిలాన
లె విలసిల్లుచున్నది. యజ్ఞస్వరూపుఁడయిన భగవంతుఁడే యి
ట్లుండయించినాఁడేమో'' యసి యాలోచించుచున్న సమ
యమున భగవంతుండగు వరాహమూర్తి నర్షకాలమేఘ
మునలె గర్జించుచు బ్రహ్మాదులు సంతసింపఁజేయుచు నాధ్వను
లచే దిక్కుల నిండించెను. ఇట్లయజ్ఞవరాహము సినాదంబు
లను విని జనలోకవాసులు దపస్సత్యలోకములం దున్నవారలు
నగు మహామునులు వేదసూక్తులచే స్తోత్రముచేసిరి. ఇట్లు వరా
హమూర్తి సమస్తమునీంద్రులు నొనరించుచున్న యాత్మగు
ణానువాదరూపమయిన స్తోత్రమును విని యానందించి మఱల
వారికి సంతోషము కలుగునట్లు ఘుర్ఘురధ్వానంబు కావించి
బుధుల యభ్యుదయముకొఱకు మదపుటేనుఁగువలె జలము
ను బ్రవేశించెను. ఇట్లు జలమును బ్రవేశించి తనవాలమును

గిరగిరఁ ద్రిప్పుచు నొక్కొక్కమా ఱాకసమున సంచరించుచుఁ దన మెడయందున్న కర్కశరోమములను గదల్చుచుఁ, గర్కశమయిన రోమములతోఁ గూడినచర్మము కలవాఁడయి, ప్రకాశించు నేత్రములు కలవాఁడయి, వాడియయిన డెక్కలచే మేఘకదంబంబులఁ దూలఁజేయుచుఁ, దన తెల్లనిదంష్ట్రాకాంతిసంతానముచే దిక్కులఁ బ్రకాశింపఁ జేయుచుఁ, దాను యజ్ఞస్వరూపుఁడగుభగవంతుఁడయినను గార్యనిర్వాహపరుండై వరాహాకృతి దాల్చియున్నవాఁడు. కావునఁ బఱుపువలె భూమియందున్న గంధంబు నాఘ్రాణించుచుఁ, దాను భయంకరమయిన దంష్ట్రలు గలవాఁడయినను గృపాపూరితనులయిన చూపులచే నునీంద్రుల వీక్షించుచు, జలముల విహరించె. వరాహమూర్తి సముద్రంబులో సంచరించుటంజేసి యది రెట్టించినధ్వని కలదయియుండెను. మఱియు నాసముద్రము నద్రపర్వతశరీరుఁడయిన వరాహమూర్తి విహారవేగములను సైరింపఁజాలక భయకంపితమయి తరంగములను జేతులఁ జోడించి తరంగభంగములవలన జనించిననినాదమునెడి మధురవాక్యములతో "ఓవరాహమూర్తీ! నను రక్షింపుము, రక్షింపుమ"ని ప్రార్థించుచున్నట్లు లుంఁగును. పిమ్మట వరాహమూర్తి ఖరతరములయిన ఖురపుటములఁ గరాఘాతమయిన సముద్రజలనివాసనము చెందునట్లు చిమ్మివేయుచుఁ జనిచని రసాతలంబు ప్రవేశించి యందు ప్రళయజలంబుల శయనించినదియు, సమస్తజీవకోటికి నాధారభూతయు, నగుభూమిని బొడఁగాంచి

వరాహమూర్తి భూమిని దనదంష్ట్రాగ్రముతో నుద్ధరించుట.

తనదంష్ట్రాగ్రంబుచేఁ బై కెత్తుచు మిగులఁ బ్రకాశించుచుండెను. ఆసమయమునఁ బరాక్రమసమగ్రుఁడును దేవకంటకుండు

నగు హిరణ్యాక్షుఁ డనురాక్షసుండు గదాపాణియయి ఘోరం
బగు సింహనాదంబు చేయుచు వరాహమూర్తిని సంహరింప వ
చ్చుచుండ నావరాహమూర్తి భయంకరముగా ధ్వనిచేయుచు
నాతోలిగక్కసుని డాసి మదపుటేనుంగును బీనుంగును జేయు
సింహంబుపగిది వాని సంహరించెను. ఇట్లు సంహరించి యూర
క్కసుని శరీరమందలి శోణితంబుచే నెఱ్ఱనై న చెక్కిళ్లుగలదయి
యాదివరాహము వ్రాదిక్రీడలచే భూమిని విదారించుటంజేసి
భూసంబంధము లగుగైరికాదులవలన నరుణితి మగుగండతుండా
గ్రములు గలగజంబుచందంబునఁ దనరారుచుండెను. ఇట్లమ్మ
హనీయుండు తమాలమువలె నీలవర్ణముగలిగి మదగజేంద్రంబు
చందంబున తెల్లనిదంష్ట్రాగ్రముచే భూమి నుద్ధరించుచు వెలయు
భగవంతుని సందర్శించి బ్రహ్మాదిసురలు బద్ధాంజలులై యనువాక

బ్రహ్మాదులు వరాహుని నుతించుట.

సదృశము లగునాక్కులచే స్తోత్రముచేయ నారంభించిరి. "ఓదే
వా! నీ వారాక్షసుని జయించితివి. అందువలన మే మందఱము
బ్రదికితిమి. వేదరూపమయిన శరీరమును ధరించియున్ననీకు న
మస్కారంబు కావించెదము. సమస్తసముద్రము లెవరికోమ
కూపములం దిమిడియున్న వ్రో, సమస్తజగంబునకుఁ గారణభూ
తుండ వగునట్టినీపాదంబులకు వందనంబు లర్పించుచున్నారము.
యజ్ఞస్వరూపుఁడవయిన నీరూపంబు దుర్జ్ఞార్గుల కెంతమాత్రము
గానరాదు. సజ్జనులకుమాత్రము గోచరం బగుచుండును. అట్టి ప
రమపవిత్రమయిన యాకారంబు గలనీ కభివందనంబులు గావిం
తుము. నీవు యజ్ఞస్వరూపుఁడవు. నీచర్మమునందు సర్వవేదం
బులు విలసిల్లు. రోమములందు బర్హిస్సులు, నేత్రములందు నా

జ్యంబు, పాదములందుఁ జాతుర్హోత్రవిలసితములగు యాగకర్మం బులు, స్రుక్కు తుండంబునందును, స్రువంబు నాసికయందును, నిడ యనుహవిర్భక్షణపాత్రం బుదరకోటరంబందు విలసిల్లుచుం డును. మఱియుఁ జమసలు కర్ణంబులయందు, పాత్రితం బను బ్రహ్మభాగపాత్రంబు ముఖమందును, గ్రహములను పాత్రవిశే షంబులు నోటియందు వెలయుచుండును. మఱియు నగ్నిహోత్ర మనుకర్మమే భక్షణ మగుచున్నది. దీక్షణీయ మనునిష్టియే నీకు జన్మము. ఉపసత్తులను నిష్టులు గ్రీవము. ప్రాయణీయము, ఉద యనీయ మనునామములతో నాచ్యుతములయందుఁ జేయుని ష్టులు నీదంష్ట్రాలు. ప్రసగ్ధ్యమా నీనాలుక. సభ్య మనుహవ్యవ హిత మగునగ్నియు, సనసభ్య మనునౌపాసనాగ్నియు నీరెండు ను నీశిరంబు. ఇష్టకాచ్ఛందనవిశేషములు నీపార్శ్వంబులు. సో మము నీరేతస్సు. ప్రాతస్సవనాదులు నీబాల్యాదిదశలు. అగ్ని ష్టోమమును, సత్యాగ్నిష్టోమమును, నుక్థ్యము, షోడశి వాజపేయ మును, అతిరాత్రమును, సప్తోర్యామమును నను నేడువిధములు యిన సంస్థలు నిస ప్తధాతువులు. బహుయజమానకములయిన సత్రయాగములు నీ యవయవసంధులు. ససోమములు, ససోమ ములు నయినయజ్ఞక్రతువులు నీవే ఓదేవా ! నీవు యజ్ఞస్వరూ పుండవు. నీవే యజ్ఞాధిపతివి. ఓదేవా! నీ వెఱిలమంత్రశరీరుండవు. మఱియు నీవాజ్యదధిద్రవ్యాధిరూపుండవు. యజ్ఞస్వరూపుండవు. భక్తివై రాగ్యములవలనను, సంతతికరణనిగ్రహంబువలనను, నిష్పా దితమగు ధ్రువానుస్మృతిరూపజ్ఞానము కలవాఁడవు. మఱియు న్యాసవిద్యాగురుండవు. అట్టినీకు నమస్కారంబు లొనరింతుము. ఓకమలనాభా ! అతిధవళమయిన నీదంష్ట్రాగ్రమునందుఁ బ్రకా

శించుచు సమస్తచరాచరములతో నొప్పుచున్నభూమి తటా
కోదరసలిలమునుండి బయలువెడలి వచ్చుచున్నమదపుటేనుఁ
గుతుండాగ్రమునందు వెలయుచుఁ బద్మసహితమై యొప్పు పద్మ
నివలెఁ బ్రకాశించుచున్నది. దంష్ట్రాగ్రమందుఁ బ్రకాశించుచు
న్న భూమండలముచే నీరూపము, మేఘుయతశృంగముతో
వెలయు కులపర్వతరాజమువలెఁ దనరారుచున్నది. ఓ దేవా!
సమస్తచరాచరంబులను నివసింపఁజేయుటకయి పాతాళమునం
టియున్న భూమిని నుద్ధరించితివి. అట్టిభూమిని జక్కఁగఁ బ్రతిష్ఠ
చేయుము. నీ వీలోకంబులకెల్ల జనకుండవు. నీకుఁ బత్నియయిన
యీభూదేవియే మాకుఁ దల్లి. కావున భూదేవీయుతుండవయిన
నీకు వందనంబు లాచరించుచున్నాము. కైకొనుము. యజ్ఞికుఁ
డరణియం దగ్నిని నుంచునట్లు భూమియందు నీతేజంబు నుంచితి
వి. గాన యిది మిగులఁ బవిత్రయయి వఱలుచుండును.ఓజగదీశా!
పాతాళము నంటియున్నభూమండలమును దంష్ట్రాగ్రముచేఁ బై
కుద్ధరించుట యొకయద్భుతకార్యముకాదు. సమస్తలోకముల
నవలీల సృజింపఁజాలిననీ కిది గొప్పకార్య మెట్లగును? నీవు నీ
మహాశక్తిచేతఁ జేయుచున్నలోకసర్గంబు నెన్నఁట కెవ్వరు శక్తు
లు? వేదస్వరూపుండవయిననీవు సముద్రమునుండి వెడలివచ్చి నీశ
రీరమును విదుర్చుటచే నీశరీరమునందున్న యుదకబిందువులు దప
స్సత్యజనలోకంబులం బడినవి. ఆయుదకబిందువుల మేము
దానమాడి యుండుటంబట్టి పవిత్రుల మయినాఁడము. ఓభగ
వంతా! ప్రపంచకముసృష్టిస్థితిలయముల నొనరించుచున్ననీ
యద్భుతచర్యల నెవ్వఁడు గనంగలండు? అట్టిచర్యలను నుతిం
ప మాకుఁ దరంబగునే? నీమాయాసముద్రమునం దీవిశ్వమం

తయు మునిఁగియున్నది. కావున మహాజ్ఞానవంతులే యందుఁ బడియున్నారు. అట్లుండ మే మేరీతి నీమాయాసముద్రమును లంఘించి నీచరణములను జక్కఁగాఁ దెలిసికోఁగలము? మాతరము కాదు. కావున దీనుల మయిసమాయందు నీకరుణాకటాక్షవీక్షణములఁ బ్రసరింపు మమ్మును లోకములను సుఖసంతులనుగాఁ జేయుము." అసియిట్లు బ్రహ్మాదులందఱు భక్తియుక్తచిత్తులై మోదంబులు చెలంగ సత్యజ్ఞానరూపామూర్తిని స్తోత్రముచేయుచుండ నమ్మహాత్ముఁడు తనఘుఱుపుటంబులచే సముద్రజలమును జిమ్మివేసి యందును భూమిని నిలిపి విశ్రాంతిఁ బొందించెను. ఇట్లుచేసి సమస్తమునీంద్రులు చూచుచుండఁగనే యానరూపామూర్తి యంతర్ధానము నొందెను. ఓవిదురా! నరూపామూర్తి భూమి నుద్ధరించిన యీ పావనకథను సద్భక్తితో నెవ్వరు విందురో, యెవ్వరుచెప్పుదురో, వారివారి హృదయములయందు నారాయణుఁడు ప్రసన్నుఁడయి యుండును. సకలపురుషార్థముల నొసంగెడి ప్రభువయిన భగవంతుండు ప్రసన్నుండయినచో దుర్లభంబయినవస్తు వేదియుండును? ఇట్లు సమస్తవస్తుపులు ప్రాప్తించుచుండఁగా మన కొరులిచ్చెడియాశీర్వాదములతో నేమి ప్రయోజనము? మఱియు నిరంతరము తన్ను సేవించుచున్న భక్తుల హృదయకమలములయందు భగవంతుండు ప్రవేశించి పాపముల నన్నింటిని దొలంగించి నిరతిశయానందదాయక మగుతనలోక మునకుఁ గొనిపోయి సుఖంపఁజేయును. ఇట్టిలాభమును గలిగించుచున్న భగవత్కథానుధారసము కర్ణము లనెడిదోసిళ్లతోఁ ద్రాగనటకు బుద్ధిమంతుండయినవాఁ డెవ్వఁడు పూనుకొనఁడు? బుద్ధిమంతులు పురుషార్థములసారమును బాగుగఁ దెలిసికొని వర

లక హరికథామృతమును భోనము చేయుచుందురు. అట్టి హరి కథలందుఁ బశుపులు దక్క మఱెవ్వరు విరక్తి చెందుదురు?" అని యిట్లు మైత్రేయుండు చెప్పిన విని నిగుఢుండు మిగుల సంత సించి యతని కిట్లనియె నని శుకుండు రాజున కెఱిఁగించి నెండి యు నిట్లనియె. ఇది పదుమూడవయధ్యాయము.

మైత్రేయుముని విదురునకు హిరణ్యాక్షహిరణ్య కశిపుల జననం బెఱిఁగించుట.

"ఓ మహారాజా! మైత్రేయుండు నర్ణించిన వరాహావతార కథను వినియుఁ గృష్ణి జెందఁజాలక సంతతము భగవత్కథా శ్రవణమందు నిరతుండగు విగుఢుండు లేచి నిలువఁబడి చేతులు జోడించి మైత్రేయుంజూచి 'మైత్రేయమునీంద్రా! భూమి నుద్ధరించుచున్న యజ్ఞవరాహమూర్తియో వరాహకల్పమందు మొదటివాఁడగు హిరణ్యాక్షుఁడను మ్లేచ్ఛాధముఁడు ఘోర ముగాఁబోరి నిహతుఁడయ్యె నని వినియున్నాను. నిజదంష్ట్రాంకురముచే భూమి నుద్ధరించుచున్నవరాహమూర్తికిని నాహిరణ్యాక్షునకును, యుద్ధము సంభవించుటకుఁ గతమేమి? ఆ వృత్తాంత మంతయు సాంతముగా వినిపింపు" మని ప్రార్థింప విదురునకు మైత్రేయుం డిట్లనియె. "ఓ వీరా! విదురా! నీవు మానవులను మృత్యుపాశమునుండి తప్పింపఁ జాలినహరి యవతారకథను జెప్పు మని యడిగితివి. ఆకారణమున నీప్రశ్నమెంతయు నాదరణీయమ యియున్నది. లోకమున హరికథాశ్రవణము మిగుల నుత్తమము. ఆ హరికథాశ్రవణముపలనఁ గేవలాయుత్తానపాదునికుమారుం డగుధ్రువుండు మృత్యువునెత్తిపైఁ గాలిడి నశ్వరముకాని యత్యు

న్నతపదము చెందెను! ఇట్టి హరికథనుగూర్చి నీవడిగినప్రశ్నము సాధుతమ మయినదని చెప్పవచ్చును. ఓవిదురా! ఈయర్థముం గూర్చి యొకయితిహాసము కలదు. అది పూర్వము దేవదేవుఁడ యినబ్రహ్మ దేవతలకుఁ జెప్పెను. దాని నేను మాగురువులనలన విని యున్నాను. దాని నీకుఁ దెలియఁజెప్పెద వినుము. దక్షునికూఁ తురయిన దితి కశ్యపప్రజాపతిని బెండ్లియాడినది. ఆమె సంతా నాభిలాషకల దయి యొకనాఁడు మన్మథపీడితహృదయయయి యసురసంధ్యవేళఁ గశ్యపునిఁ గామించెను. ఈమె యతనియొద్దకుఁ బోవునప్పటికి నాకశ్యపుఁడు నియమముతోను శ్రద్ధతోను యజ్ఞ పతియు నగ్నిశరీరకుఁడు నగుపరమపురుషునిఁ బూజించి తనహృద యమందు స్మరించుకొనుచు నగ్నిశాలయం దుపవిష్టుండయియుం

వ్యా దితి సంతానాభిలాషతోఁ గశ్యపుని జేరఁబోయి ప్రార్థించుట.

డెను. అంత దితి కశ్యపునిఁ జేరఁబోయి 'మనోహరుల్లభా! దుర్మార్గుఁడ యిన మన్మథుండు కోపారుణితలోచనుండయి విలుసమ్ములుధరించి మదపుటేనుఁ గనంటికంబమును హింసించునట్లు నీతోసంగమింప నన్ను బాధపెట్టుచున్నాఁడు.ఆబాధను నేను సహింపఁజాలక నీసన్నిధికి వచ్చితిని. నన్ను దయఁజూచి యాబాధనుండి తొలఁగింపుము. అదియునుంగాక నాసవతులందఱు భవదీయానుగ్రహంబుచే గర్భిణులై యుండఁగా నే నదిచూచుచు నెట్లు సహించియుండఁగలను? నీకు మంగళమగుఁగాక. ధర్మవేదివయిన నీవు నన్నురక్షించుట పరమకర్తవ్యము. నీవు విద్వాంసుఁడవు. నీకుఁ దెలియనియర్థంబు లోకములో నుండునా? మహానుభావుండ వయిన నీవంటివానికి సత్పురుషులార్తులగుచున్నయెడ రక్షించుటయె పరమకర్తవ్యము. మఱియు భర్తచే గౌరవింపఁబడుచున్నస్త్రీలు లోకములో

నిష్టపదార్థప్రాప్తి కలవారయి నిర్మలమయినయశంబును సంపా
దించుకొందురుకదా? భవాదృశుండగుభర్త పుత్త్రరూప
ముగా జన్మించుటవలన మాకుఁ గలుగుసన్మానమునకు మితియుం
డునా? ఇది యంతయు నీకుఁదెలియని యర్థముకాదు. మఱియు
నీయందు మాకు నెంతోయనురాగంబు గలదు. మాచిన్నతన
ములో మాతండ్రియగు దక్షుండు మన్మందఱను బిలిచి 'మీ
కనుకూలుండగుభర్త యెన్నఁడోచెప్పితిరేని నే నాతని కిచ్చి పెం
ళ్లిచేయుదు'నని పలికి మే మందఱము నిన్నేవరించియున్నట్లు తెలి
సికొని మాపదనుముగుర నీ కొసంగెను. కావున నీయం దవ్యా
జానురాగంబుతో మెలఁగుచున్ననాకోర్కి- నెఱవేర్పకుంట నీ
కెంతేనియు ధర్మముకాదు. మఱియు నోమహాత్మనూ! భవా
దృశులగువారిని గూర్చించిన యభిలషితం బెప్పుడును వ్యర్థ
ము కాఁగూడదు. కావున నన్నురక్షింపు, మని దీనయయి కామ
పీడితయయి వేఁడుకొను దితిని జూచి కశ్యపుఁ డిట్లనియె.
'ఓనుందరీ! నీవుచెప్పిన దంతయు సత్యమే. నీవు కోరినకార్యమును

కశ్యపుఁడు భార్యకు హితోపదేశముచేయుట.

నెఱవేర్చెదను. అవ్యాజప్రేమతోఁ దన్నుఁ జేరినచ్చుఁ ద్రిన
ర్గమును లభింపఁజేసెడిభార్యకోర్కి- నెవ్వఁడు దీర్పకుండఁగలఁ
డు? పురుషుండు ధర్మార్థకామము లనుపురుషార్థముల భార్య
వలననుండియే పొందుచున్నాఁడు. పురుషుఁడు సపత్నీకుఁడయి
యున్న యెడల సర్వాశ్రమవాసులను బోషింపఁగలఁడు. మఱియు
నౌక సముద్రమును దరింపఁజేయునట్లు భార్య తనభర్తను
నింద్రియవ్యసనమనెడి సముద్రమును దరింపఁజేయఁగలదు. ఇం
ద్రియముల జయించుటలో భార్య తోడుపడుచున్నది. కావునఁ

బురుషునకు భార్య యింద్రియజయమూలమున మోక్షసాధనిగూడ నగుచున్నది. శ్రేయస్కాముఁడయినభర్తకు భార్య యర్ధశరీరము. కావునఁ బ్రభుఁడగు భర్త గృహకృత్యభారంబుఁ జింతను భార్యయందుంచి తాను నిశ్చింతతోఁ బ్రజలుచున్నాఁడు. ఓనుందరీ! దుర్ధాధినాథుఁడగు రాజు దుర్మార్గులగుచోరులను లీలగా జయించినట్లు మేము నీవంటిభర్మపత్ని నాశ్రయించి, బ్రహ్మచర్యాద్యాశ్రమములకు దుర్జయులగు నింద్రియంబులను లీలగా జయించుచున్నాము. భర్త కిన్నిసిధములఁ దోడుపడుచున్న భార్యకుఁ దిరిగి యుపకారము చేసి యీమెబుణంబుదీర్చి నీపుణ్యాయువు చాలదు. జన్మాంతరములుగూడఁ జాలదనితలంచెద. మతియు భార్యబుణంబు దీర్చ భర్త సమర్థుండు కానేరఁడు. కావున నీవు నాకు సర్వవిధంబుల నుపకారము చేయుచున్నావు. నీబుణంబును దీర్చ నేను సమర్థుండనుగాను. అయినను నాచేనగు నుపకారంబు చేయుచు నిన్ను సంతసింపఁజేయుట కెంతమాత్రము సందియంబులేదు.నీవు సంతాసము నభిలషించి యిచ్చినదానవు. కావున నీకోర్కితప్పక నెఱవేర్చెదను. ఇందుల కెంతమాత్రము సందియములేదు. కాని యొక్కముహూర్తకాలము ప్రతీక్షించి యుండుము. ఈసమయము మిగుల భయంకరమయినది. ఇది భయంకరులకుఁగూడ భయంకరమయినది. ఇట్టికాలములయందు సంగమించుట కడు నిషిద్ధకర్మము. ఇది సంధ్యాసమయము. ఈ సమయమునందు రుద్రుండు భూతగణంబులతోఁగూడఁ జరించుచుండును. మతియు భూతేశ్వరుఁడయినరుద్రుండీసమయమందు సమస్తభూతములకు సుఖముగలిగించుచుఁ బ్రమథగణంబులచే సేవింపఁబడుచు వృషభవాహనాధిరూఢుండయి ప్రవర్తించుచుండును. మతియు

కశ్యపుఁడు దితికి రుద్రప్రభావమును దెలుపుట.

నీమఱఁదియగు నీశ్వరుండు శ్మశానభూమియందుఁగూర్చుండి నుడిగాడ్పులవలనఁ గలిగిన ధూళులచే ధూమ్రములయి విస్పష్టములయి యున్న జటాభరములుగలవాఁడయి భస్మావలిప్తశరీరుండయి మూఁడునేత్రములతో సర్వము నీక్షించుచుండును. అతనికిఁ గనఁబడనిస్థలము లోకంబున లేదు. బంధుత్వమాలోచింపుము. బంధువులుచూచుచుండ సంగమించుట యుచితముకాదు. మనకు నతనికి బాంధుత్వ ముండుటంబట్టి యేమియుఁ జేయఁడని యోజింపకుము. అతనికిఁ దనవారనియుఁ బెఱవారనియులేరు. అతనికి నింద నీయులుగాని, యూహింపఁదగినయులుగానిలేరు. తత్త్వదర్శులమయినను సంసారులమగు మేమువందనములను రుద్రశరీరకుఁడగు నీశ్వరుని పాదములచే నిర్వాల్యమువలె దూరముగాఁ బరిత్యజింపఁబడినదై తదను భూతమగుచుఁ దస్కరమయి యున్న యీవిభూతిని నైశ్వర్య సాధనములగు వ్రతములచేఁ బ్రార్థించుచున్నాము. శ్మశానమందుఁ బిశాచమువలె సంచరించు నశుచియగురుద్రునికి జంకనేల? అని యనరాదు. అతనిచరిత్రము నిగూఢమైనది. బుద్ధిమంతులాతని చరిత్ర యవిద్వన్నావరింపఁ గలదని చెప్పదురు. "శంకరాజ్ఞానమన్విచ్ఛే" త్తనియుండుటంబట్టి జ్ఞానార్థులుగొందఱు నాతనిచరిత్రమును గీర్తించుచుందురు. తాను జ్ఞానప్రదానమున సామ్యాతిశయములు లేనివాఁడయినను, జ్ఞానోపాయుఁడై పిశాచమువలె సంచరించుచుండును. తన్నుసేవించువారందఱు నట్లు నర్తింపవలయు ననిబోధింపఁ దానుం బిశాచచర్య నవలంబించియుండెను గాన నంతమాత్రమున నతఁడపవిత్రుఁడనుటకు వలనుపడదు. జ్ఞానార్థులకు నాతనిచరిత్ర ముపాదేయ మగుటచే వందనీయ మయినది

కాని నిందనీయముకాదు. స్వాత్మానుభవమందే నిరతి గలయతని చేష్టితమును దెలియనివారు దాని నిందించి యపహసించుచుందురు. వారందఱు వస్త్రమాల్యాద్యలంకారాదులచే శునకభోజ్యమగుశరీరము నలంకరించుచు దానినే యాత్మగాఁ దలపోయునట్టియవివేకులని యెఱుంగుము. పులస్త్యపులహాదులందఱు తాతఁడేర్పఁజేసిన మర్యాదలను భాలించుచున్నారు. ఈవిశ్వమునకు సంహర్తయగుటంజేసి యతఁడు విశ్వకారణుఁడగుచున్నాఁడు. అధిష్ఠాతయగుటంబట్టి యహంకార మతనియాజ్ఞ ననుసరించి వర్తించును. పిశాచచర్య యున్నట్లు నటించునేకాని నిజముగ నతని కదిలేదు సుమీ? అతఁడెంతఘోరదండనమయినఁ గావింపఁగలఁడు. అతని పాదపద్మములను సేవించుచు జ్ఞానవంతులమయి మే మందఱము మాయామయమగు విభూతిని నాశినపూలదండవలె దూరముగాఁ దొలఁగించుచున్నాము. మతీయు నమ్మహాత్మునిచరిత్రము లవిశ్వను భేదింపఁజాలిన నని పెద్ద లందురు. అతఁడు నిరస్తమయిన యతిశయముగలవాఁడయి వర్తించుచున్నాఁడు. అతని దయవలననే బ్రహ్మకంటె నర్వాచీనులగు సురలందఱు నున్న తపదవులఁ బొందియున్నారు. మాయాకార్యమయిన యహంకృతి యతనియాజ్ఞను శిరంబునఁదాల్చి వర్తించుచుండును. ఆమహాత్ముని లోకములోనివా రందఱు సేవించుచుందురు. అట్టిమహానుభావునిఁ గొందఱు హీనమతులు శ్మశానవాసుఁడనియు, బిచ్చమెత్తుకొనువాఁడనియు నిట్లు హాస్యముచేయుదురు.'' అని యిట్లు బోధించుచున్నపతివాక్యముల సరకుగొనక మన్మథోద్దీపితములగు నింద్రియములుగలదితి మన్మథబాధను సహింపఁజాలక వారకామినివలె గతత్రపయయి భర్తపయింబడి యాతనికట్టుపు

ట్లము నాకర్షించెను. ఇట్లు నిషిద్ధకర్మమందు నిర్బంధముచేయు చున్న భార్య నేమియు ననఁజాలక దైవమునకు మ్రొక్కి రహస్య ప్రదేశంబుచేరి దానియభీష్టంబు నెఱవేర్చెను.పిమ్మట నమ్మహాముని చయ్యన నదికిఁబోయి స్నానముచేసి,ప్రాణాయామముకావించిమూ న మవలంబించి నిర్వికారుఁడును, జ్ఞానస్వరూపుఁడును, సనాతనుఁ డునగు బ్రహ్మమును ధ్యానంబుచేయుచు, బ్రహ్మప్రతిపాదకమయిన ప్రణవమును జపింప నారంభించెను.తదుపరి దితియుఁ దానుజేసి న దుష్టకార్యమునకు సిగ్గుచెందుచు మనంబులోఁ గుందుచు నాక శ్యపునిఁ జేరఁబోయి యవనతాననయయి యిట్లు పలికెను. "ఓప్రి యవల్లభా ! నేను జేసినకార్యము మిగుల దుష్టమయినది. నీహి తోపదేశము విననందులకు నాపయిఁ గినియకుము. దయార్ద్రదృ ష్టిం బ్రసరింపఁజేయుము. మఱియు భూతపతియయిన శంకరునకు నేనపరాధము చేసియున్నాను.అందుల కతఁడు కోపించి నాగర్భ సజంతువును హింసించునేమో! అ ట్లతండు చేయకుండునట్లు లేదయిననుపాయ మాలోచింపుము. మఱియు నింద్రాదిదేవ తల కధిపతియు భూతపతియు శాంతస్వరూపుఁడును దుర్జనసంహా రుండును శ్రితజనార్తిహరుండునగు హరునకు నమస్కారంబు గా వించుచున్నాను. సతీభర్తయగు నీశ్వరుండు కటికివానికిఁ గూడ దయనీయులగు స్త్రీలమయినమాయెడ దయగలిగి నర్తించుఁగాక. మాకుఁ బ్రసన్నుండగుఁగాక". అని యిట్లు తనగర్భమందున్నపిండ మున కపాయము కలుగకుండుటకయి దేవతలకు మ్రొక్కుచు మిగులఁ బరితపించుచున్నభార్యను జూచి సంధ్యావందనాదికృత్యం బులు నెఱవేర్చుకొనినవాఁడయి కశ్యపుఁ డిట్లనియె. "ఓదురదృష్ట వంతురాలా ! నీ విట్లు పరితపించుటనలన నేమిప్రయోజనము ?

ఓసుందరీ! నీచిత్తము పరిశుద్ధినిబొంది యుండకపోవుటచేతను సంధ్యాకాలసంజనిత మయినదోషముచేతను, నాహితోపదేశము నతిక్రమించినదానవగుటచేతను, భూతపతియయిన యీశ్వరునిఁ దిరస్కరించుటచేతను, నీకుఁగలిగెడికుమారులు లోకములకమంగళకరులయి యుందురు. ఆపుత్త్రోత్థములు లోకములను స్త్రీలను దేనతిలను మానవులను మునీంద్రులను మాటిమాటికి దుఃఖింపఁజేయుచు ముల్లోకముల నాక్రమించుకొందురు. ఇట్లు వారు లోకకంటకులయి మహోత్పాతములకోపమునకుఁ బాత్రులయి దీను లయినమానవుల సంహరించుచుఁ బతివ్రతాస్త్రీలను బలాత్కరించుచు విహరించుచుండ లోకపాలకుఁడయిన భగవంతుఁడు కోపించి నరసింహనారసింహనారములను దాలిచి దేవేంద్రుఁడు పర్వతముల ఛేదించినట్లు నీసుతుల నిష్టఅను సంహరింపఁగలఁడు. ఇంతకునీమనఃపరితాపమే కారణమయియున్న"దని పలుకుచున్నకశ్యపమహాముని ని జూచి దితి యిట్లనియె. "ఓవల్లభా! నాకుమారులకు భగవంతునివలన మరణముసంభవించునని వినుట కెంతయు సంతసించుచున్నాను. అతనివలననుండియే మరణము కలుగునట్లను గ్రహింతువుగాక. బ్రాహ్మణులఁ బాపముచేఁ జచ్చుటకంటె భగవంతునిచేఁ జచ్చుట మిగులమంచిది. బ్రాహ్మణహంతులగువారు రౌరవాపులయి నరకలోకవాసులనయకయినను బాత్రులు కానేరరు. మతియు నట్టిపాపాత్ములఁ గన్నవారికిఁగూడ నరకంబులు ప్రాప్తించుట ధ్రువము"అనిపలుకుచున్నప్రియురాలిం జూచి కశ్యపుఁడిట్లనియె. 'ఓసుందరీ! నీవు తొలుదొలుతఁ బాపకార్యముచేసినను దరువాతఁ బశ్చాత్తాపము నొందుచున్నావు. మతియు విష్ణునియందు మిగుల గౌరవము గలిగి యున్నదానవు. నాయందు నీశ్వరుని

యందు సమాదరము గలిగియున్నదానవు. దురాత్ములయిన నీకు మారు లిరువురిలో నొకడయిన హిరణ్యకశిపునకు గౌరవనీయుఁడును హరిభక్తాగ్రేసరుండును,నగుపుత్రుండు పుట్టఁగలఁడు. అతని కీర్తిని భగవంతునికీర్తితోసమముగా గానము చేయుదురు. సాధువులతనిశీలము ననుసరింప కొరాదిసంయోగముచేఁ జెడ్డబంగారమునునలెఁ దమయాత్మలసుగుణములచే శుభ్రపఱుచుకోఁదురు. ఎవనియనుగ్రహమువలన లోకములు ప్రసన్నములగుచున్నవో, యీవిశ్వమంతయు నెవనిశరీరమయి పిలసిల్లుచున్నదో, యట్టిభగవంతుని నీమనునుఁడు భక్తివిశేషముచే సంతోషపెట్టఁగలఁడు. ఆపిల్లవాఁడు సుగుణములు గలవాఁడయి యుండును. పరమభాగవతోత్తముఁడని యతఁడు ఖ్యాతిఁ గాంచఁగలఁడు. అతఁడు సాధుజనులకుఁ బూజనీయుఁడు. అతఁడు నిర్మలమయిన యంతఃకరణముగలవాఁడు; హరిభక్తిపెంపుచే నతఁడు చిత్తమును బవిత్రముగాఁ జేసికొని హరిని మనంబున నిడికొని తక్కినరాజ్యసంపదల నన్నింటిని విడిచిపెట్టును. మఱియు నతఁడు సంసారాసక్తుఁడయి యుండఁడు. అతఁడు సచ్చరిత్రగలవాఁడు. అతఁడు పరులు దుర్భాషించుటచూచి తానును దుర్భాషించునంతటి కఠినాసక్తచిత్తము కలవాఁడు. అతఁడు తండ్రినలెనే లోకకంటకుఁడయియుండఁడు. మఱియు నతఁడు గ్రీష్మకాలసంతాపమును జంద్రుఁడు తనచల్లనికిరణములచే హరించి లోకమును సంతసింపఁజేసినట్లు తనతండ్రిచే మిగులఁ బరితపించియున్నలోకమును తనసుగుణసముదాయముచే సంతసింపఁ జేయఁగలఁడు. మఱియు నతఁడు తన హృదయకమలమందును బహిర్భాగములయందును విలసితకుండలాలంకృతమయిన హరిసుందరవదనమును జూడఁగలఁ' డని పలు

కుచున్నకశ్యపునివచనంబులు విని దితి తనకుమారులకు బ్రాహ్మ
ణశాపమువలనఁగాక హరినలన మరణము కలుగుటకును, బర
మభాగవతోత్తముఁడయినమనుమండు గలుగునని వినుటకును
మిగుల సంతుష్టయయి కాలము కడపుచుండెను. ఇది పదునాల్గవ
యధ్యాయము.

ఓవిదురా! ఇట్లు దితి సంతసముతోఁ గాలంబు గడపుచుఁ
గశ్యపుని సంబంధించినట్టి నీర్యంబును ధరించి తనసవతికుమారుఁ
డయినయింద్రుఁ డేమయినను దనగర్భమునకు నపాయము కలి
గించునేమోయని శంకించుచుండ నూఱుసంవత్సరంబులు గతిం
చినవి. ఆసమయంబున దితి గర్భమం దున్నతేజంబు దిక్కులం
గప్పి సూర్యచంద్రకాంతులం దిరస్కారంబు గావించెను. అంత
దేవతలు సూర్యకాంతి లేకపోవుటంబట్టి యహర్నిశాభాగంబు
దెలియనేరనివారయి బ్రహ్మయొద్దకుఁబోయి యిట్లు విన్నవించికో
సురలు బ్రహ్మతో మొఱపెట్టుకొనుట.
నిరి. 'పీచతుర్ముఖా! నీకు నంజలంబు లాచరించుచున్నాము. నీవు
త్రికాలవేదివి. కాన నీకు సంప్రాప్త మయినభయకారణంబు
నీకుఁ దెలియకపోదు. నుతియు నీవు భగవంతుని యావేశావతా
రమయియున్నావు. కావున నీవు సర్వజ్ఞుఁడవనుటకు సందియము
లేదు. ఓదేవా! నీవు వేల్పులకెల్ల వేల్పవు. లోకనాథుల కెల్ల
రకు శిరోమణివంటివాఁడవు. నీవు మాయభిప్రాయములను మా
కంటెఁ బూర్వులయభిప్రాయములను జక్కఁగ దెలిసినవాఁడవు.
నీవు జగత్కారణుఁడవు; జగన్నిర్మాణముకొఱకు రజోగుణ
ము నవలంబించిన భగవంతుండవు. నీవు మాయను బురస్కరించు
కొని సమస్తమును సృజించుచున్నావు. అట్టి మహానుభావుఁడ

వయిన నీకు వందనంబు లాచరించుచున్నాము. ఓ కమలాసనా! నీవు సమస్తజీవులను దేవమనుష్యాదిరూపములగా భావించి నిర్మించుచున్నావు. సమస్తచరాచరప్రపంచమును నీయం దుంచుకొనుచున్నావు. నీవు సమస్తకార్యకారణరూపుఁడవు. ఇట్టి నిన్నుఁ బరిపక్వములయిన యోగంబులచే నెవ్వరు భావించుచున్నారో యట్టివారలు నిర్జితపవనులై జితేంద్రియులై నీదయకుఁ బాత్రులై లోకమునఁ బరాభవము పొందకుండ వర్తించుచుందురు. ఎవని వేదాత్మకవాక్కులకు సకలజంతువులు బద్ధులై పాశబద్ధములయిన పశువులచందంబున స్వాధీనులై నీకుఁ బూజలనొనర్చుచున్నారో యట్టినీకు నమస్కారంబు కావించుచున్నారము. ఓ దేవా. అహోరాత్రవిభాగంబు లేకపోవుటచేఁ గర్మకలాపమంతయు నశించుచున్నది. అందుచే మేము మిగుల నాపన్నులమగుచున్నారము. మమ్ము దయతోఁజూచి మాకు సుఖంబు గలిగింప సమర్థుండవునీవే. ఓవిధాతా! కశ్యపునితేజంబు దితిగర్భంబునంబడి వర్ధిల్లుచు సమస్తదిశలను నంధకారబంధురంబు గావించుచు దారువునందున్న యగ్నివలెనే నిగూఢముగా నుండి పెంపు చెందుచున్నది. కావున మమ్మావిపదంబుధినుండి తరింపఁజేయుము" అని ప్రార్థించుచున్న దేవతలపలుకు లాకర్ణించి నవ్వి వేదవేద్యుఁడయిన కమలాసనుండు మధురవాక్యంబులచే వారిని సంతసింపఁజేయుచు నిట్లుపలికెను. 'ఓగీర్వాణులారా! మీ రెంతమాత్రము దుఃఖింపఁబనిలేదు. నే నొకటి చెప్పుచున్నాను. సావధానులరయి వినుండు. మీపూర్వజులును నాతనూభవులునగు సనకాదిమునీంద్రులు నల్వురు గతస్పృహులై గగనగమనముచే లోకములఁ గ్రమ్మరుచు నొకనాఁడు సర్వలోకములకును వందనీయనుఁ వై

బ్రహ్మ సురలతో వైకుంఠభువనప్రభావమును జెప్పుట.

కుంఠంబునకుఁ బోయిరి. ఆవైకుంఠమునందు నసించుచున్న వారందఱు విష్ణువుతో సనూనములయిన యాకారములు గలవారయి సిహ్నములయిన హరిని సర్వకాలములయందుఁ బూజించుచుందురు. అచ్చట వేదవేద్యుఁడును బరమపురుషుఁడును, బరమకారణభూతుఁడును, పాస్టణ్యపరిపూర్ణుఁడును నగు పరమపురుషుఁడు రజోగుణవిరహితమై, శుద్ధసత్త్వమయమై, యున్న దేహమును దాల్చి తనభక్తులను సుఖింపఁ జేయుచుండును. అచ్చట నిశ్రేయసమనునట్టిదాన మొకటి కలదు. ఆవనమును షడ్ఋతుజన్యములగు ఫలపుష్పసంపదలతోఁ జెన్నారుచుండును. అయ్యది సమస్తవాంఛలను సమకూర్చుకల్పతరువులచే మిగులఁ బ్రకాశించుచుండును. అది మూర్తిమంతమయిన మోక్షసుఖమువలె నుండును. అచ్చటివారు భార్యలతోఁగూడ విమానములనధిసించి లోకపావనమయినహరిసచ్చరిత్రములను గానము చేయుచు, మకరందసందోహమును స్రవించుపుష్పసంపదలతోఁ దులదూఁగుచున్నమాధవీలతలవికసితకుసుమముల పరిమళంబుచే హృదయంబులు సంతసింప విషయసుఖంబులకుఁ గారణభూతమయిన వాయువును దిరస్కరించుచు విహరించుచుందురు. భోగ్యవస్తువులును, భోగోపకరణములును, భోగస్థానములును దమకలవడుచున్నను వాని నాదరింపక భగవద్గుణానుభవమందే నిరతిశయాభిలాష కలిగియుందురు. ఆనిశ్రేయసవనమందుండు పక్షివిశేషములే భగవద్గుణాసక్తికలవియుండ నందలిపురుషులు భగవద్గుణాసక్తికలవారయి యుందురని వేఱె చెప్పవలయునా? మఱియు నచ్చటఁ బొవురములు, రాజహంసములు, శుకపికాదు

లు, సారసములు, మయూరములు, తిత్తిరిపక్షులు, చక్రవాకములు, మొదలగు పక్షిజాలము, లలితమధురముగా భృంగము ఝంకారము చేయుచుండ విని, తామన్నియు, "అదిగో భృంగము హరికథాగానము చేయుచున్నది. మీనినాదంబులు మాని చక్కగా వినుండ" ని పల్కుచుం దమతమధ్వనులను విడిచిపెట్టి భృంగఝంకారములనే వినుచుండును. ఆవనమందు మందారపుష్పములును, మల్లికాసుమములును, గోరంట పూవులును, నుత్పలములును, జంపకములును, బిల్వములును, నాగకేసరములును, బొన్నలును, నకుళములును, బొరిజాతసులును, మనోహరములయి సుగంధభరితములయి విలసిల్లుచున్నను భగవంతుండు వాని విడనాడి తులసిని భూషణముగా జేకొనెను. ఆపుష్పములట్లు హరిచే నిరాకృతంబులయినను నది మాత్సర్యమును విడిచి యావనంబులోనితులసిని జేరఁబోయి "నీతపంబు నిరుపమానమయినది. మేమునిమిగుల మనోహరులమైయున్నను భగవంతుని కలంకారస్ములమై యుండలేకపోతిమి. జన్మనున్న నీదేజన్మ"ని గౌరవించుచుండును. ఇందువలన స్థావరములుసైతము భగవద్గుణాసక్తి గలిగి మచ్చరంబును విడిచియున్నవని తెలియవచ్చుచున్నదికదా! ఆవైకుంఠము, భగవత్పాదభక్తినలభ్యములై వైడూర్యముల చేతను, మరకతమణుల చేతను, గాంచనముచేతను, నిర్మితములై యున్నభక్తవర్యుల విమానములచే నిండియుండును. ఆభక్తవర్యులు భార్యాసహితులై వర్తించుచున్నను, కేవలముహరియందు దృఢమనస్కులైయుందురుకాన యాపురుషులకు వారిభార్యలు విశాలకటితటములు కలవారైనను మందహాససుందరవదనములు కలవారైనను, బరిహాసాదులచేఁ గామమును గలిగింపలేరు. ఆనై

కుంఠమునం దెవరియనుగ్రహముకై యితరులు ప్రయత్నించుచున్నారో యట్టిలక్ష్మీదేవి నిజరూపధారిణియయి నూపురధ్వనుల నల్లడల నించుచు రాగాదిదోషములు లేనిదయి విలాసపద్మమును ధరించి తనరూపము స్ఫటికమయములయిన కుడ్యములందు బ్రతిఫలించి ప్రకాశించుచుండ విహరించుచు మాధవుని మందిరంబుల స్వయముగానే తుడిచి శుభ్రపఱుచుచుండును. విద్రుమరత్నరచితములగు తటములు ప్రకాశింప నిర్మలవారిపూరముచే నొప్పు దిగుడుబావులందును, క్రీడావనములందును, నామె పరిచారికాబృందముతోఁ గూడ విహరించుచుఁ, దులసీదళములచే భగవంతుని పదకమలములఁ బూజించుచు, నిర్మలమయిన నీరపరిసరమున నిలువఁబడినప్పుడు తనమొగంబు జలంబులఁ బ్రతిబింబింప నా ప్రతిబింబమును జూచి తనభర్త సుందరకుంతలములు గలిగి యున్న తనాసికతో నలరుచున్న తనముఖపద్మమును ముద్దుపెట్టుకొనుచున్నాడేమోయని భ్రమచెంది సిగ్గుపడుచుఁ బ్రవర్తించుచుండును. ఆవైకుంఠపురము కేవలము పుణ్యాత్ములకే సులభమయినదికాని పాపాత్ములు పొందలేరు. అగ్నికామాదివిషయాసక్తచిత్తులయి కావున నే, మహనీయములయిన హరిచరిత్రములవిడిచి కుత్సితకథలను వినువార లాపురమును జేరలేరు. ఆకుత్సితకథలు నిరర్థకములయిన మానవులచే శ్రుతములై, యాశ్రోతల పుణ్యములనపహరించి వారల నిరాలంబములగు నరకములందుఁ బడవేయును. లోకములో నీచులు తమయదృష్టంబువలన మానవజన్మమును బొందినను నివృత్తిధర్మసహితమగు తత్త్వజ్ఞానమును, సంపాదించుకొనలేక భగవన్మాయచే మోహితులయి భక్తిహీనులయి మానవజన్మసాధ్యమయినభగవదారాధనమును జేయక ప్రవ

ర్తించుచుండురు. అట్టియవివేకులఁ జూచుటచే నాకు మిగుల విచారము కలుగుచున్నది.అట్టివార లాలోకమును స్వప్నమందయినను జూడలేరు. కాని యేమహాత్ము లనవరతము హరిపాదకమలంబుల మనఃకమలములందుఁ జేర్చి శమదమాదిగుణములుకలవారలయి సర్వదా హరిసచ్చరిత్రములనే పరస్పరము చెప్పుకొనుచు, భక్తి పారవశ్యముచే నానందబాష్పముల రాల్చుచు, నందువలననే పులకితసర్వాంగులయి ప్రవర్తించుచున్నారో యట్టివార లవశ్యముగా వైకుంఠమునకుఁ బోవుదురు. ఓ దేవతలారా! భువనైకసుందరంబును, నపూర్వదృష్టంబును భగవంతునికి నివాసభూతంబును నయి, దేవతాశ్రేష్ఠుల వివానకాంతులచే నలరారుచు, నాశ్చర్యముగొలుపుచు నున్నవైకుంఠపురమును సనకా

సనకాదులు వైకుంఠమును బ్రవేశించుట

దిమునీంద్రులు తమయోగబలమునఁ జేఁ జేరఁబోయి మిగుల నానందించిరి. అనంతర మాసనకసనందనాదు లప్పురంబుఁ జొచ్చి యుభయపార్శ్వంబులు మనోహరము లయిన సౌధరాజంబుల చేఁ బ్రకాశించుచున్నను నారాయణదర్శనకుతూహలు లైనవారవుటంబట్టి చూడనొల్లక నవరత్నస్థగితము లయియున్నకక్ష్యల నాటింటిని దాటి పోయిపోయి యేడవకక్ష్యఁ బ్రవేశించిరి. అట్లు వారలు ప్రవేశించుడు వారి కచ్చట నిరువురు ద్వారపాలురు దృష్టిపథంబునం బడిరి. వారు కనకమయములు మణిమయములు నగు హారకేయూరాంగుళీయకాదిభూషణంబుల ధరించియుండిరి. వారలు నూతనపరిమళంబునందలిలోలత్వముచే వచ్చిన మధుకరనికరంబుచే వెలయువనమాలికల ధరించియుండిరి. వారలహస్తంబులఁ జూపఱకు భయంబుగొలుపుగదాదండంబు లొప్పుచుం

డెను. వారలు గజతుండాదండంబుల నీసడించుభావాచతుష్క-ముతో నొప్పుచుండిరి. వారలనేత్రములు కినుకచే నరుణితంబు లయియుండెను. వారలముఖములు కుటిలభ్రుకుటులచే భయంకర ముగా నుండెను. వారిద్దఱు నారాయణునికేళీమందిరద్వారంబు చెంత వర్తించుచుండిరి.అంత నాద్వారపాలురు తమ్మిం బొడగాం చుచుండ సనకాదులు నేమియు మాటలాడక సుంతేనియుఁజంకక భగవద్దర్శనకుతూహాలులయి, పంచవర్ష ప్రాయులవలెఁ గనఁబడు చు నమ్మందిరద్వారంబునఁ బడిపోవుచుండిరి. అట్లు సనకాదులు వారినడుగకుండ లోనికిఁజొచ్చుట బుద్ధిహీనతను వ్యక్తపఱుచుచు న్నదని యందురేమో?అట్లనుటకు వీలులేదు. ఆమునులు సమ స్త మందును సమదృష్టికలవారు, కావునఁనే వారు శంకారహితులై, యనివారితులై భోగంబులనెల్లఁ గ్రుమ్మరుచున్నారు. నిరంకు శులగునట్టివారికి నితరుల నడుగవలసినయవసరమేమి? అంత భ గవంతునికిఁ బ్రతికూలమగుశీలము కలయాద్వారపాలురు, దిగం బరులై, వృద్ధులైనను, నైదునత్సరముల ప్రాయముగలబాలుర వలెఁ జూపట్టుచుఁ, బరమాత్మయాథాత్మ్యమును దెలిసియున్న యామమునులంగాంచి వారలప్రభావము నెఱుంగకపరిహసించుచు,

{ జయవిజయులు సనకాదుల నడ్డగించుట, సనకాదులు వారికి శాపమిచ్చుట. }

నివారణానర్హులయినను నేత్రములచేతను వాక్కులచేతను నివా రించిరి. అంత సనకాదులు భగవంతునిద్వారపాలురచే నిరోధింపఁ బడి, దేవతలువీక్షించుచుండఁ,దాము పూజ్యతములయినను నివా రించుటవలనఁ బరిభవమునొంది, భగవద్దర్శనమునకు భంగము గలుగుటవలన నల్పక్రోధముపూని యాకినుకచే నేత్రములు

వ్యాకులత్వంబునొందుచుండ నిట్లనిరి. 'మేము పరమభక్తితో నారాయణుపాదపద్మముల భజింప వచ్చుచుండ దురాత్ములగుమీ రలెవ్వరో నిర్బంధించుచున్నారు. వెక్కుపున్నెంబుల నొనరించి మహత్తరమగు హరిభక్తికలవారయి భగవదనుగ్రహంబు వడసిన వారుకదా యీలోకంబులో నుందురు! ఇచ్చట నున్నవారందఱు హరిసదృశధర్మములు గలవారయి యుండనలయును. తాదృశధర్మములు లేనివారిం దుండఁదగరు. శ్రీహరి కిట్టివిషమస్వభావము లేదు. ఇట్లుండఁ దాదృశవిషమస్వభావము గలమీర లీలోకంబున నుండఁదగుదురా? ప్రభుశాసనంబున మిమ్ము నిరోధించితిమి. మావలన నేరము లేదని యాదురేని చెప్పెదవినుఁడు. ఈలోకమున నున్నవారు శాంతిపురుషులు. మఱియు నిట కలహములు లేవు. వాక్పారుష్యాదిదోషరహితమగు నీలోకమున మీవంటికుటిలస్వభావులు మఱికొందఱున్నచో వీఁడు ప్రవేశింపఁదగినవాఁడా, తగనివాఁడా? యన్నసందియ ముదయింపవచ్చును. అట్టికుటిలులను ప్రవేశింపనీవలదనెడు ప్రభుశాసనమును మన్నింపవచ్చును. కాని యీలోకము వాక్పారుష్యాదిదోషములు లేనిది. ఆదోషములే లేనప్పుడు తాదృశదోషములు గలవారెట్లు సంప్రాప్తులగుదురు ? అట్టివారేలేనప్పు డీశంకతోనేమి ప్రయోజనము? ఓమునులారా! మీమాటసత్యము. ఈలోకమట్టిదే. ఇందుఁ గుటిలులెవ్వరును లేరు. కాని మిమ్ములఁ బ్రవేశింపఁజేయుట భగవంతుని కిష్టములేదని తలంచి వారించితిమని యందురేని యట్లు శంకింపఁబనిలేదు. సమస్తమును గుఱ్ఱియందు ధరించినభగవంతునియందు వీఁడు ప్రవేశింపఁదగినవాఁడనియు, వీఁడు ప్రవేశింపఁదగనివాఁడనియు, నన్నెడివైషమ్య మెట్లుసంభవించును?

భగవద్వ్యతిరిక్తమగువస్తు వెచ్చట నున్నది? *కావుననే యోగి

*ఇందును మూలము-'ఆత్మైన మాత్మని నభో నభసీవ ధీరాః' ఇచ్చటఁ దెలియఁదగినయంశ మేమనఁగా; ఘటపటాద్యాకాశములు మహాకాశమందుఁ గలిసి యొక్కటియైయున్నట్లు జీవాత్మలు పరమాత్మతో సైక్యము చెందుచున్న పను నర్థము స్వీకరింపరాదు ఘటపటాద్యాకాశము లుపాధివిధూనానాంతరమందు మహాకాశముతోఁ గలిసియున్నను, ప్రదేశభేదముచే ఘటపటాద్యాకాశము లామహాకాశమునఁ బ్రత్యేకముగా నుండక తీఱుమిచే ఘటాకాశమహాకాశములకుఁ దాదాత్మ్యము సంభవింపదు. అట్లే యుపాధివిధూనన మయినపిమ్మట జీవాత్మలు పరమాత్మకు శరీరభూతులై ప్రత్యేకముగా నున్న వారగుటచే జీవాత్మపరమాత్మలకుఁ దాదాత్మ్యము సంభవింపనేరదు.మఱియు నిట ఘటాకాశదృష్టాంతము విభాగము చేయలేకపోవువిషయమునే తీసికొనవలయును.ఎట్లనఁగా నుపాధివిధూననమయినపిమ్మట వాస్తవముగా మహాకాశమండు ఘటాకాశము ప్రత్యేకముగా నున్నను మహాకాశమునుండి ఘటాకాశమును వేఱుచేయలేనట్లు, జీవాత్మలు పరమాత్మకు శరీరభూతులై వాస్తవముగా భిన్నులై యుండినను బరమాత్మనుండి వేఱుచేయలే మనువిషయమునే దృష్టాంతమును స్వీకరింపవలసి యున్నది. మఱియు వాస్తవముగా మనదేహము లాత్మలకంటెఁ బ్రత్యేకముగా నుండినను, దేహాత్మలను విభాగము చేయఁగలమా? చేయలేము. అట్లే శరీరశరీరిభావ మందియున్న జీవపరమాత్మలను వేఱుచేయుట కష్టము. ఓయీ! ఘటాకాశము మహాకాశముతోఁ గలిసినప్పు డొక్కటిగానే తెలియవచ్చుచున్నది కాని భేదమున్నట్లనుభవసిద్ధముకాదే? కావున నీచెప్పిన దెట్లు సరిపడును? అందురేని జెప్పెద వినుఁడు. ఘటాద్యాకాశములు కృత్స్నాకాశముతోను సంబంధము గలిగియుండునా? లేక ప్రదేశభేదముతో సంబంధము గలిగియుండునా? కృత్స్నాకాశముతో సంబంధము గలదన్నచో ఘటాద్యాకాశములకుఁగూడ విభుత్వ మంగీకరింపవలసివచ్చును. మహాకాశమున కల్పత్వము గూడ సంభవించును. కావునఁ బ్రదేశభేదముతోనే సంబంధము గలదని చెప్ప

వర్యులండఱును మహాకాశమునందు ఘటపటాద్యాకాశమును న
పృథక్సిద్ధముగా ననుసంధానము చేయుచున్నట్లుపరమాత్మయందు
జీవాత్మలనపృథక్సిద్ధముగాఁ జూచుచున్నారు.జీవాత్మలుపరమాత్మకు

వలయును. వేదాంతు లాకాశము నిరవయవ మని వాదించుచుందురు కాని వారి సిద్ధాంతము యుక్తమైనదికాదు. వేదాంతులందుఁగూడఁ బ్రదేశభేద మంగీకరించి పంచీకరణ ముపదేశింపఁబడుచున్నది. మఱియుఁ బ్రదేశభేద మంగీకరించుటంజేసియే యేకదేశమగు నాకాశమె వాయువుగాఁ బరిణమించుచున్నదని చెప్ప వలనుపడుచున్నది. అట్లేకదేశమగు నాకాశమె వాయువుగాఁ బరిణమింపక కృత్స్నాకాశమే వాయువుగాఁ బరిణమించినచో శ్రు.''పృథివ్యప్సు ప్రలీయతే'' ఆనుశ్రుతి మొదలుకొని శ్రు. ''మహానవ్యక్తే లీయతే''అనునంతదాఁక జెప్పిన ప్రలయక్రమము కుదురదు.ఏమనఁగా,కృత్స్నాకాశము వాయువుగాఁ బరిణమించుటచేఁ బ్రత్యేకముగా నాకాశముఁ లేదు గనుక వాయు వాకాశమందు లీనమగునని చెప్ప వలనుపడదు. అట్టిశ్రుతులకు విరోధము సంభవించుచున్నది గనుక మహాకాశము ప్రదేశభేదముచేతనే వాయువుగాఁ బరిణమించుచున్నదని చెప్పవలయును. మఱియు ''ఘటధ్వంసే ఘటాకాశోసభిన్నో నభసాయథా। బ్రహ్మణాహ్యేవ విధ్వంసే విష్ణ్వాఖ్యేన తథాపుమాన్'' అని శౌనకుండు చెప్పినవాక్యముగూడ ఘటవిభూతనానంతరమున మహాకాశమునందుఁ బ్రదేశభేదపరముచేతనున్న ఘటాకాశమును ఘటప్రయుక్తములగు నల్పత్వాది వైషమ్యములోనట్లే యుపాధివిభూతన మయిన పిమ్మట గుణాత్మకావిర్భావ మునొంది పరమాత్మకంటెఁ బ్రత్యేకముగా నున్న జీవుకి నుపాధినిమిత్తము చేఁ గల్గిన సుఖిత్వాదుఃఖిత్వాది వైషమ్యములు లేవనుటలో సామ్యము చెప్పు నిమిత్తమేయని స్వీకరింపవలయును. కావున జీవాత్మలు పరమాత్మకు శరీరభూతులనియు, నాశరీరమునకుఁ బృథక్సిద్ధమై యుండకపోవుట స్వభావ మనియు, జీవపరమాత్మల కవాంతరభేదమున్నను జ్ఞానైకాకారత్వమునుబట్టి సామ్యమున్నదనియు,నభోదృష్టాంతము పరమాత్మనుండి జీవులను విభాగము చేయలేకపోవు విషయమునసే యనియు గ్రహింపవలయును.

శరీరభూతులయి యపృథక్సిద్ధులగుటంజేసి,జీవపరమాత్మలకవాం
తరభేదమున్నను జ్ఞానైకాకారతనుబట్టి భేదము లేదు. భగవం
తుఁడిట్లు సర్వాత్మకుఁడై యుండఁగా నిట్టి వైషమ్యముండుట
యసంభవము. రాగద్వేషాదిరహితమయిన యిట్టిప్రదేశమందు
ననుకూలనేషధారులయిన మీరల్పవైషమ్యమును బురస్కరించు
కొని యన్యనివారణ మేలచేసితిరి. కావున సమాభ్యధికరహితుఁ
డైన విష్ణుమూర్తిసేవకులయ్యు మండబుద్ధులైన మీరాచరించిన
దుశ్చేష్టకుఁ దగినప్రతిక్రియ నాలోచించితిమి.*మీరీలోకమును

---

* ఓయీ! నిత్యసిద్ధులైన జయవిజయులకు శాపానుభవ మెట్లు? అనిత్యముక్తులు హేయగుణరహితులై యెల్లప్పుడును పంకోచమునొందని జ్ఞానైశ్వర్యాది గుణములు గలవారు కావున నే, శ్లో॥ "సత్యజ్ఞానక్రియైశ్వర్యభగాపరిణామ్యతా" అని చెప్పఁబడియున్నది. నీవుచెప్పిన దెట్లుసరిపడునని యందువేని జెప్పెద వినుఁడు. ఈజయవిజయులు ద్వారపాలురుగాని నీ వన్నట్లు నిత్యముక్తులుగారు. ఈజయవిజయులు సుకృతపరిపాకమువలనఁ బరిమాకాశనిలయులయిన నిత్యసిద్ధులతోఁ దుల్యమైన యాకారము గలవారయి ద్వారాధికారమును బొందియున్నారు. "భూమ్యాప స్తరశాయాచ విష్ణోరనుచరోభవ" అనుటంబట్టి భగవదనుచరత్వ మనుస్థానవిశేషమువలన లభింపవచ్చు. మఱియు వీరు నిత్యసిద్ధులే యైనచో, శ్లో॥ "నిత్యజ్ఞానక్రియైశ్వర్య" ఇత్యాదికముచేఁ జెప్పఁబడినట్లు నిత్యము నసంకుచితజ్ఞానాదులు గలవారగుటచే భగవదభిప్రాయమును దెలిసికొని సనకాదుల నిర్బంధింపకయే యుందురు. వీరలట్టి భగవదభిప్రాయము నెఱుంగరు కాన వీరు నిత్యసిద్ధులుకారు. నిత్యముక్తత్వమును బొందకుండ భగవదనుచరులై యున్నవారు శేషసుపర్ణజాతీయులు వెక్కురు కలరు. ఓయీ ! నీ వన్నట్లు జయవిజయులు నిత్యముక్తులే కానిచో శ్లో॥ "నందస్సునందోథజయో విజయః ప్రబలోబలః । కుముదః కుముదాక్షశ్చ విష్వక్సేనః పతత్రిరాట్ ॥ జయశ్చ శ్రుతదేవశ్చ పుష్పదంతోథ సాత్వతః । సర్వే నాగాయుతప్రాణా శ్చమూ

విడిచిపోయి వైషమ్యబుద్ధిచే మిగులఁ బాపీయములై కామక్రోధలోభములనెడు నంతశ్శత్రువులతో వ్యాపించియున్న లోకములంగూర్చి పొండు. మీవంటివిషమబుద్ధుల కాలోకములే నివసింపఁదగియున్నవి. కాని యిదికాదు.''అని పలికిన సనకాదులవాక్యము బ్రహ్మశాపరూపమై, యస్త్రీసమూహములచే ననివారితమయి తమ్ముఁదాఁకఁగా దాని నాలకించి హరియనుచరులగు జయవిజయులు భయాతిశయముచే మిగులఁ గంపితులై మునీంద్రుల పాదములపైఁబడి దండప్రణామము లాచరించి యిట్లు విన్నవించుకొనిరి.''ఓమునీంద్రులారా!మీవనంబులు నొచ్చునట్లు కారుకూఁతలుపలికి మహాపరాధంబుచేసిన మాకుఁ దగినశిక్షావించినారు.మీవలన సుంతేనియు నేరము లేదు.ఆతప్పిదమంతయు మా

స్తే జఘ్నురాసురీ''అని త్రివిక్రమణకాలమునఁ జెప్పఁబడినయీవాక్య మెట్లు సరిపడును? జయవిజయులను నిత్యముక్తులలో నేల పఠింపవలెను? కావున వీరు నిత్యముక్తులే కాని వేఱయినవారు కారు. నిత్యముక్తులకు శాపానుభవ మెట్లు నియందురేని జెప్పెదను. నిత్యముక్తులయిన జయవిజయులు ద్వారపాలకులయిన జయవిజయులు కారు. అట్లే కాక యీద్వారపాలురయిన జయవిజయులే నిత్యముక్తులన్నచో, సృష్ట్యాదియందే సనకాదులచే శప్తులయి భూలోకమున హిరణ్యాక్షహిరణ్యకశిపులై పుట్టి వరాహనరసింహావతారములచే వధింపఁబడి పిమ్మట రావణకుంభకర్ణులై, రామునిచే నిహతులై తిరువాత శిశుపాలదంతవక్త్రులై కృష్ణునిచే నిహతులై శాపముక్తులై వైకుంఠమునకుఁ బోయి స్వస్వరూపధారులయి యుండురని చెప్పవలయును కావునఁ గృష్ణావతారమున శాపముక్తులయిన జయవిజయులు వామనావతారమందు విష్ణువునకుఁ బారిషదులై యుండుట యెట్లు సరిపడును. కావున ద్వారపాలురయిన జయవిజయులు త్రిపాద్విభూతిపర్తులై భగవత్పరిచారులై యున్న జయవిజయులకంటె వేఱయినవారని చెప్పుట నిర్వివాదాంశమగుటచే వారికి శాపానుభవము యుక్తమే.

దే! మాపూర్వజన్మకృతమయినపాపమే మమ్మింతవఱకుఁ దెచ్చినది. కాని మీఁదమాకు శుభంబుగలుగునట్లు చేయ వేఁడుకొనుచున్నాము. మేము నీచమయినఁగులమందుదయించి కామాదిగ్రస్తులమయి మత్తులమయి సంచరించుచున్నను భగవత్కృపాసంబువలన భగవన్నామస్మరణమును విడిపింపఁజేసెఁ మోహము లేకుండునట్లు ననుగ్రహింపుఁడు. ఇదియే మాకోరెడివరము'. అని యాద్వారపాలురు సనకాదులను ప్రార్థించుచున్న యవసరంబున వీరలకుఁ బ్రవర్తిల్లిన కలహమ్మును నంతఃపురంబులో రమాదేవి

సనకాదులున్నద్వారముచెంతకు విష్ణువరుదెంచుట.

తో విహరించుచున్నహరి యాలకించి యాద్వారప్రదేశంబునకరిగి చయ్యన నరుదెంచె. అమ్మహాసీయుఁడు యోగీశ్వరులచే నన్వేషింపఁదగినపాదపద్మములు గలవాఁడును స్వభక్తులచేఁ బట్టఁబడిన ఛత్రచామరాదిరాజచిహ్నములచే నొప్పుచుండెను. అతఁడు తనభక్తుల సమాధియోగమునకు ఫలమునంటివాఁడు. మఱియు నతఁడు రాజహంసములతో సదృశములయిన చామరములమందమారుతముచేఁ జలించుచు నిండుచందురునిచందంబున నొప్పుచున్న దగుశ్వేతాతపత్రమునందు వ్రేలాడుచున్న మంచిముత్యములవలనఁ గలిగినయుదకబిందుసందోహము చే నలంకృతుఁడయి తనభక్తులకుఁ బ్రసన్నముగానుండెడి ముఖపద్మముకలవాఁడై దయాసౌకుమార్యాదిగుణంబుల కాకరం బయినయవలోకనములచే భక్తజనులహృదయంబుల హరించుచున్నవాఁడయి యుండెను. మఱియు నతఁడు తనవెడంద లోమ్మునందువెలయుచున్న శ్రీదేవికాంతులచే స్వర్గలోకమునకుఁ జూడామణివలె నున్నతనలోకమునంతను బ్రకాశింపఁజేయుచుండె

ను.అతనికటియందున్న వీతాంబరంబుపయి వెలయు కనకమేఖలయు మయినకాంచి కనువారికిఁ గనులపండువు లొనరించుచుండెను.వక్షస్థలంబున రమణీయమయి మత్తమధుకరఝంకారములు కలదై యున్న వనమాల గ్రాలుచుండెను. ముంజేతులయం దున్నకనక వలయములు చూపఱ కానందము గొలుపుచుండెను. అతఁడు తనవామహస్తమును గరుత్మంతునిస్కంధంబున నుంచి దక్షిణహస్తంబుచే సనాళమయిన పద్మమును విలాసముకై త్రిప్పుచుండెను. అతనిముఖపద్మము కర్ణంబులఁ దుఱుంగలించెడు మకరకుండలముల కాంతులచేఁ బ్రకాశించు గండస్థలంబులచేతను, సుదగ్రమగు నాసికచేతను వెలయుచుండెను. శిరంబున మణిమయంబగు కిరీటంబు కోటిచంద్రప్రకాశమయి విలసిల్లుచుండెను. అతనిభుజాంతరంబు మనోహరములగు ప్రశస్తముక్తాహారములచేతను, కౌస్తుభమాణిక్యంబుచేతను వెలయుచుండెను. అతఁడు నిరతిశయసౌందర్యము గలదాన నని గర్వించెఁజుక్కకంటె సుందరతరుఁడయి ప్రకాశించుచుండెను. మఱియు నతఁడు నాచేతను, శివునిచేతను, సమస్తదేవతాసమూహముచేతను, యోగిబృందముచేతను సంస్తనీయమయిన చారవిందములు గలవాఁడు. ఓదేవతిలారా!ఆసమును లీట్టిభగవంతుఁడు నచ్చుచుండఁగాంచియుఁ దనియలేక సంతసముచే నతనిపాదంబులకు నమస్కరించిరి. అంత నాకృష్ణమూర్తిపాదారవిందములకుఁ గింజల్కభూతములగు నంగుళులపరాగముతోఁ నెనసి తులసీమకరందమునొంది యొప్పుచున్నమందగంధవహంబు లేతెంచి నాసారంధ్రములమూలముగా లోపలికిఁబోయి యాత్మానుసంధానముచే నవికృతచిత్తులై యున్నను నాసనకాదులచిత్తము నానందపరవశముగాఁజేసి శరీరము

లఁ బులకితములుగానొనరించెను.పిమ్మట నామునులు సుందరమగు నధరబింబముచేతను, గుందపుష్పములవంటి మందహాసముచేతను, సాంపారు నతనివదనారవిందంబును వీక్షించి లబ్ధమనోరథులై, నఖరంబులనెడిపద్మరాగంబులకు నిక్కియగుపాదపద్మంబుల మాటిమాటికి వీక్షించుచు ధ్యానించిరి. అట్లు ధ్యానించి కర్మజ్ఞానయోగంబులచే సాధితమగుభక్తియోగముచే స్వస్వరూపమును ధ్యానించుపురుషుల ధ్యానమునకు విషయభూతుఁడై, నిరతిశయప్రేమకాస్పదుఁడై, నయనాభిరామమగుశరీరమును జూపించుచు, నణిమాద్యష్టసిద్ధులతో నొప్పుచున్నభగవంతు నిట్లు నుతింప

సనకాదులు విష్ణువును నుతించుట.

నారంభించిరి. 'ఓదేవా! దురాత్ములహృదయంబుల నొకవేళఁ బొందినను వారిలకు దర్శనం బొసఁగక యంతర్ధానంబు చెందుదువు. అటువంటినీరూపము మా కిప్పుడు కన్నులపండువు లొనరించుచున్నది. మఱియు నీకుమారుఁడగు చతుర్ముఖుండు వర్ణించిన స్వరూపగుణ విభూతులుగలనీ వప్పటినుండియు మాచే ధ్యానింపఁబడుచు నిప్పుడు భక్తులమయిన మాయుల్లంబులయందుఁ గర్ణద్వారమునఁ బ్రవేశించినావు. ఓభగవంతా! మహామునులు సంసారనిర్వేదమువలన నిశ్చలభక్తియోగముల నవలంబించిన విరాగులయి నిరహంకారులయి శుద్ధసత్వదేహము దాలిచి భక్తులకుఁ బ్రతిక్షణము ననురాగము కల్పించుచున్నయే నీయాత్మతత్వమును దమహృదయములయందే తెలిసికొనుచున్నారో యట్టి నీరూపము మా కిప్పుడు ప్రత్యక్షముగా నయనంబులకుపూర్వపర్వంబు లొనర్చెను. అయ్యారె ! మాయదృష్టమేమని వేరొక్కనువారము ! మేము కృతార్థులమయితిమి. భగవం

తుండ వగునీసచ్చరిత్రముల విని తమ్ముఁ గృతార్థులుగా భావించుకొనుచు నన్యము నొల్లక భవన్నామస్మరణంబుచే యుచు నీపాదంబులకు శరణంబు చొచ్చి కొందఱు మహాత్ములు పరమపురుషార్థమయిన మోక్షమునుగూడ నాదరింపకున్నారు. అట్లుండ దుర్లభమయిన నీలోకమును బొంది యవాఙ్మానసగోచరమయిన నీరూపంబును గన్నులారఁ గాంచిన మేము కృతార్థుల మయితిమని వేఱె చెప్పవలయునా? ఓదేవా! మాచిత్తంబులు తుమ్మెదలచందంబున భవత్పాదారవిందంబులందు సదా విహరించునేని, నీవాక్యంబు లనవరతంబు నిచరిత్రంబుల నుగ్గడించుచువి యగునేని, మాకర్ణరంధ్రంబులు నీసుగుణగణంబులచే సంతతము నింపఁబడునేని, మాకుఁ బూర్వార్జితపాపంబులఁ బురస్కరించుకొని యమునను నీచజన్మము సంభవింప దనుటనిక్కంబు. ఓదేవా! వేదంబులకుఁగూడ నగోచరంబగు నీమహనీయరూపంబు కనుటవలన మానేత్రము లత్యంతసుఖము నొందుచున్నవి. కయోగులకు దుర్లభగాహుండ వయిననీ కనేకవందనంబులు కావించుచున్నా'మని నమస్కరించిరి. ఇది పదునేనవయధ్యాయము.

అంత యోగమే ధర్మముగాఁగల సనకాదిమునులకుఁ బ్రత్యభివందనము కావించి కరుణించి నారాయణుండు వారల కిట్లనియె. 'ఓమునీంద్రులారా! నాద్వారపాలకులయిన జయవిజయులు మీమార్గమును నిరోధించి యవమానంబు కావించినారు. అందులకు మీరు కోపంబువహించి వారలను శపించినారు. నాపాదభక్తులయినను వారికి మీర లొనరించినశిక్ష మిగుల యుక్తముగానున్నది. వారలు దురాత్ములై తామ, మహానుభావులరయి మద్భక్తు

లరై యున్నమిమ్ముల నవమానించినారు. కావున మీ రిచ్చినశా
పమే యుక్తమని నాకుఁ దట్టినది. బ్రాహ్మణులు నాకు దైవము
వంటివారు. నాభటులు మిమ్ము నవమానించినారు. భటులుచేసి
నయపరాధము లన్నియు భర్తకుఁ జెందుచుండును. కావున
వార లొనరించినయపరాధము నాదె. ఇట్లు మీమెడల సాప
రాధినయిననన్ను మన్నింప వేఁడుచున్నాను. భృత్యులు తెల్వి
తక్కినవారలై నేరముచేసిన చో నదియెట్లు ప్రభువునుజెందును?
అని యడుగుదురే ని చెప్పవినుఁడు. లోకములో రాజభటుఁడు
పరుల కపరాధము చేసినచో నందువలన జనించినయపకీర్తి
కుప్రాదిోగములు చర్మమును బొడుచేయుచున్నట్లు రాజు
సత్కీర్తిని బొడుచేయుచుండును. కావున నానేరము నాయందుఁ
బర్యసనన్న మగుచున్నది. ఆనానేరమును మీరు మన్నింపఁబలసి
యున్నది. మతియు నిర్మలమయిన నాసత్కీర్తి విన్ననాఁడు
చండాలుఁడయినను దప్పక పూతుండగుటకు సందియములేదు.
చండాలురనుగూడఁ బవిత్రులనుగాఁ జేయు సమర్థమయిన కీర్తి
గలవాఁడ నయిననేను బ్రాహ్మణోత్తములయిన మీవంటి
మహానుభావులకుఁ బ్రతికూలవృత్తి యగుచో నాభాగ్యమున
యినను ఖండించి తీఱుదునని నమ్ముఁడు. అట్లుండఁ దురాత్ములయిన
నాభటులు మీ కపరాధము చేసినపుడు వారిని శిక్షింతు నని వే
ఱె చెప్పనలయునా ? మీవంటిబ్రాహ్మణుల సంతతము నేను సే

విష్ణువు బ్రాహ్మణప్రశంసచేయుట.

వించుచుండుటం బట్టియే లోకములఁ బవిత్రము చేయునంతటి
సామర్థ్యము నాపాదపరాగమునకుఁ గలిగినది. బ్రాహ్మణసేవం
జేసియె సమస్తలోకములపాపములం దొలఁగించునట్టిశీలము నా

కలనడిసది. బ్రాహ్మణసేనంబట్టియే యెప్పుడును బ్రహ్మాదిసుర లుపా
సనచేసియు నేమె కరుణాలవమును బొందలేరో యట్టిశ్రీమహాదేవి
నే నామెయందు విరక్తుడ నయినను నన్ను విడిచియుండదు.
ఓ మునీంద్రులారా ! యాగసమయములయందు మహీయము
లయిన యగ్నిజ్వాలలయందు యజమానునిచే వేల్వఁబడిన ఘృత
ప్లుతమయిన హవిస్సువలన నేను దృప్తినొందఁజాలను. కాని
మదర్పితములగు స్వవర్ణాశ్రమోచితకర్మఫలంబులుగలవాఁడగుట
చే దుష్టుండయిన బ్రాహ్మణునిముఖముచే భుజింపఁబడిన యొక్కొ
క్కకబళము చేతనయినను దనివి పొందుదును. మతియు నే నెల్ల
ప్పుడు ప్రతిహతముకాని యోగమాయావిభూతిచే నొప్పుచుందు
ను. అయినను బ్రాహ్మణోత్తములపాదపద్మములం దున్నపరాగ
ము నామణికిరీటమున్నగ్రమునందుఁ దాల్తును. నాపాదపద్మముల
యందుఁ బుట్టినగంగానదిని బరమపావనిగా నెంచి తనచంద్రభూ
షణముతోఁబాటుగా శిరంబునఁ దాల్చి శివుండు లోకంబులఁ
బూతములఁగాఁ జేయుచున్నాఁడు. నాపాదములం బూడమిన గం
గయే పరమపవిత్రమయిన దని చెప్పవలసివచ్చినపుడు నేను బర
మపవిత్రుఁడ నని వేఱుచెప్పవలెనా? నే నిట్లు లోకపావనుండ
నయిన ననవరతము విప్రులపాదపద్మములయందలి నీరు పావన
మయినదని భావించి తలయం దిడుకొనుచుందును. నేనే యిట్లు
బ్రాహ్మణుల గారవించుచున్నప్పుడు లోకములో నెవఁడు గార
వింపకుండఁగలఁడు ? విప్రులను నన్నుగా భావించునట్టిమానవుఁ
డొక్కఁడే నాకుఁ బ్రియతముఁడు. నాకు శరీరభూతులయిన గోవి
ప్రులను రక్షకహీనములగు నితరభూతములను బాపాత్ముఁడై సర్వ
సదృశకోపముగలవాఁడయి నాశరీరముకంటె భిన్నులయినట్లు

లెవఁడుచూచునో వాఁడు మరణమునొంది యమలోకమునకుఁ బోయినప్పు డమోముఖములగు గృధ్రములు వానినేత్ర ములను బొడిచి నాశనముచేయును. బ్రాహ్మణుఁ డేదేని కారణముచే నపకారముచేసినను సంతసమునొందుచు ననురాగాస్పదమయిన వాక్యములచే నాతని సంబోధించుచుఁ బలువిధంబులఁ బూజించుచుఁ దండ్రి కుమారునిఁ జూచునంతటిప్రేమతోఁ జూచుచుఁ బ్రనర్తించువారలు మదనుగ్రహపాత్రులని భావించుచుందును. కావున నామానసంబున నున్నభావంబు తెలియఁజాలక యవివేకులయి నా యానతి దూరముగాఁ ద్రోచి మీ కపరాధముచేసిన యీభటులకుఁ దగినశిక్ష చేసినారని నేమిగుల సంతసించుచున్నాను. మీయానతిచొప్పున వీరుపోయి భూమిలో జన్మింతురుకాని వీరు శీఘ్రకాలములోనే నాలోకమునకు మఱలివచ్చునట్లనుగ్రహింపవలయును." అని యిట్లు పలుకఁగా వేదతుల్యమయి, మనోహరమై, యమానుషమై యున్న విష్ణువువాక్యములను విని యీతనివాక్యములకుఁ దగినయర్థమును దెలిసికొనలేకపోవుటచేతను, దాము విషసదృశమగు మన్యువు చే దష్టులై యపరాధముచేసి యున్నవార లగుటచేతను మనంబులయందుఁ బరితృప్తి చెందకపోయిరి. మఱియు వారు దుర్బోధములు నర్థగంభీరములు నగునతనివాక్యములఁబట్టి నారాయణునియభిప్రాయంబు గనుఁగొనలేక మిన్నకుండి కొంతవడికి భగవంతునికిఁ దమయం దనుగ్రహమే గలదని భావించి సందేహజనకములగు వాక్యములు విన్నందులకుఁ గ్రుద్ధులై భగవంతుని దర్శించి సంభాషించి యతనికృపావలోకనములను బొందుటం జేసి పులకితాంగులయి సంతుష్టాంతరంగులయి కేల్దోయి నొసట

ఘటించి ప్రకృతిచే నారబ్ధమగు సమస్తప్రపంచకంబును బాలించుటయం దధికారమును బ్రహ్మాదుల కొసంగినహరిని గాంచి యిట్లనిరి. "ఓ దేవా! సర్వలోకాధిపతివియు, సర్వజ్ఞుఁడవునగు నీవు మమ్ముం జూచి "నన్ను నను గ్రహింపుఁడు" అని పలుకుచున్న వాక్యమున కర్థమేమియో తెలియఁజాలకున్నాము. ఓదేవా! బ్రాహ్మణులు నాకు దైవమువంటివారని పలుకుచున్నావు. లోకులందఱు బ్రాహ్మణుల గౌరవించునిమిత్తము నీవట్లు పలికిన పలుకవచ్చునుగాని సమస్తలోకముల కధిపతివయిననీకు బ్రాహ్మణులు దేవతలని చెప్పుట యెంతయు నాశ్చర్యకరముగా నున్నది. సమస్తమునకు నీవేదైవమువు. ఆత్మదైవమగు నీకు దేవత లెవరున్నారు? దేవదేవా! లోకములలో సనాతనములగు వర్ణాశ్రమధర్మములు నీనలననే కలిగినవి. ఆధర్మములను నీవే యీయీయనతారములను ధరించి రక్షించుచున్నావు. అట్టిధర్మమునకు ఫలమవు నీవే. నిన్నుఁ బొందుటకే సమస్తధర్మముల నాచరించుటకాని మఱియొకఫల మపేక్షించి కాదు. లోకములో యోగీశ్వరులందఱు నీయనుగ్రహమును సంపాదించి మహాత్ములయి మృత్యుభయమును దొలఁగించుకొనుచున్నారు. ఇట్లుండ నీకొకరియనుగ్రహము గోరుటయేల? చతుర్విధములగు పురుషార్థముల వాంఛించుమానవులయుత్తమాంగములకు నలంకారభూత మయినపాదపద్మరాగము గల యీలక్ష్మీదేవి, పుణ్యాత్ములచే నర్పింపఁబడినతులసీదామమునందుఁ జరించుచున్నతుమ్మెదకు నిజనివాసమయి వఱలునీపాదపద్మములను గోరుచు వక్షఃస్థలస్థితిని విడిచి, యోగిజనాదిసేవక సమ్మర్దనమునకైన నంగీకరించి, సవతియగు తులసితోఁగూడ నివసించుటకైన నిష్టపడి సర్వదాసేవించుచున్నదో; యీలక్ష్మీదేవిని నీవు

పరమభాగవతులయినవారిప్రసంగమం దాసక్తి గలవాఁడ వగుటచేత నాదరింపఁజాలకున్నావు. ఓభగవంతా ! నీవు బ్రాహ్మణుల పాదపద్మములందలిపరాగమే నా కాభరణ మని పలికితివి లోకములో నున్నవారికందఱకు బ్రాహ్మణమాహాత్మ్యము తెలియఁజేయుటకు నిట్లు పలికితివికాని, పరమపావనుఁడవయిన నీవెక్కఁడ? బ్రాహ్మణు లెక్కఁడ? వారిపాదపరాగము నిన్నుఁ బవిత్రునిగాఁ జేయుటెక్కఁడ? ఇదియంతయుఁ జక్కఁగ నాలోచించిన వింతగానుండకమానదు. జ్ఞానాదిగుణషట్కవిభాసితుఁడవగునో దేవా ! ధర్మస్వరూపుఁడవగు నీకుఁ దపోదానదయలు పాదత్రయమని చెప్పుదురు. ఆపాదత్రయముచేతను భూదేవతలను దేవతలను రక్షింపఁబూనికొని యందులకు విరుద్ధముగాఁ బ్రవర్తించుచు నాతపోదానాదులను నశింపఁ జేయఁబూనుచున్నదుర్మార్గుల నవతారములనెత్తి చంపి లోకమందు ధర్మమును స్థాపించుచున్నావు. అట్లే కానిచో ధర్మమీపాటికి మునుమున్ను నశింపకుండునా? లోకులు గొప్పవారివర్తనమె ప్రమాణముగాఁ జేకొందురు కాన యట్లు రక్షణీయమగు బ్రాహ్మణకులమును, బ్రభావముచేతను, బ్రియవాక్యములచేతను, నీవు రక్షింపవేని శ్రేయస్సంపాదకమయి కర్మోపాసనాత్మకమయి యున్న వేదమార్గము నశించును. నీవు లోకమందు ధర్మము నశింపకుండఁ జేయవలెనని ప్రతినపట్టినవాఁడవు. కావున శుద్ధసత్త్వగుణాశ్రయుఁడవయిన నీవు లోకక్షేమముకొఱ కవతారములనుదాల్చి ధర్మవిరోధులయినవారిని సంహరించుచున్నావు. నీప్రతినచొప్పున ధర్మమును స్థాపించుచున్నావు. ఇట్లు సర్వలోకాధిపతివయి సర్వజ్ఞుఁడవయి, సమస్తదేవదేవుఁడవయియున్న నీవు బ్రాహ్మణులకు వందనము లాచరింతువు. అంతమా

త్రమున నీ ప్రభావమున కొకకొంతకలుగునా ? కలుగదు. లోకశిక్షనిమిత్తమే యట్లు చేయుచున్నావు దేవా ! మే మొకటి విన్నవించుచున్నాము. అవధరింపుము. మే మీ జయవిజయులకు శాప మిచ్చియున్నాము. ఆశాపము వారల కర్హమయినదని యంగీకరించినను సమ్మతమే. లేక నీవు వారలకు మఱియొకవిధముగా ననుగ్రహించినను మాకు సమ్మతమే. కాని ద్వారపాలుర కుచితనృత్తియందు నర్తించుచు నిరపరాధులయి యున్నజయవిజయులను మేము శపించితిమని తలంచెదేని యీ యపరాధము గావించినందులకు మాకుఁ దగినశిక్ష విధింపుము. నియోస శిరసానహించువార మని మ్రొక్కి చేతులు జోడించియున్న సనకాదిమునుల నీక్షించి కనికరించి వారల కిట్లనియె. "ఓమునులారా! మీశాపప్రకారమున జయవిజయులు భూలోకమందు రాక్షసులయి జన్మించి నాయందు బద్ధక్రోధులయి దేవబ్రాహ్మణాదుల కపకారము చేయుచు నర్తించుచు నాచేఁ జంపఁబడి తిరిగి శీఘ్రకాలములోనే నాలోకమునకు వత్తురు. ఓ విప్రోత్తములారా! మీశాపము భవన్ముఖండనైన నాచేతనే విధింపఁబడినదని తెలిసికొం"డని పలికెను. ఇట్లు సనకాదులు నేత్రానందకరుఁడయిన భగవంతుని, నతనికి స్థానమై స్వయంప్రకాశమై యున్న వైకుంఠలోకమును, జూచి భగవంతునికి నమస్కరించి ప్రదక్షిణముచేసి యనుజ్ఞ నొంది సంతసించి విష్ణుప్రభావమును నుతించుచుఁ దమతమమార్గంబులం జనిరి. అనంతరము నారాయణుండు భృత్యులఁ బొడగాంచి యిట్లనియె. "ఓయీ మీరెంతమాత్రము భయపడకుఁడు. భూలోకంబున రాక్షసులయి జన్మింపుఁడు. మీకు శుభమగుఁగాక. బ్రాహ్మణశాపమును ద్రిప్పనంతటిశక్తి నాకు

స్మను నాకిష్టమగుటం బట్టి త్రిప్పట కంగీకరింపలేదు. మఱియు నిది లక్ష్మీదేవికిఁగూడ నిష్టమయినది. పూర్వము నేను బ్రణయకల హామును బొంది మిన్నక శయనించి యున్నయనసరంబున నలిగి నా గృహమునుండి తరలిపోయి తిరిగి కొంతవడికి నామందిరమున కు వచ్చునప్పుడు మీ రాలక్ష్మిని వారించినారు. అందుల కామె కుఁ గోపమునచ్చి శపించినది. అందుచే మీరు తప్పక భూమిలో రక్కసుల్లై జన్మింపుఁడు. అట్లు నాకు విరోధులై పుట్టి మీరు దేవతలకును లోకములకు, నపాయముచేయుచుండ నే నవతారా ములను దాల్చి మిమ్ములఁ జంపెద. మీరు స్వల్పకాలములోనే నా లోకమును బొందఁగలరు'' అనిపలికి నారాయణుండు వినూ తన శ్రేణిభూషణముగాఁ గలిగి నిరతిశయసౌందర్యమగు తనమందిర మును లక్ష్మితోఁ బ్రవేశించెను. ఆజయవిజయు లిరువురు బ్రాహ్మ ణశాపమువలన ప్రభావము నశించినవా రయి వైకుంఠలోక మునుండి భూలోకమునకు వచ్చినారు. ఓ దేవతలారా! ఆజయ విజయులు వైకుంఠమునుండి క్రిందఁబడుచుండఁగా వినూనాగ్ర ములందు సంచరించుమహామహులందఱు వారలనుస్థితిని జూచి విచారపరీతులై హాహాకారములం జేసిరి. ఆద్వారపా లురిరువురు కశ్యపుని తేజస్సును బొంది దితిజఠరమును బ్రవేశించినా రు. వారితేజమే లోకంబుల వ్యాపించుచున్నది. కాని కొంతకాల ములోనే భగవంతుఁడు వారితేజస్సును హరించి మీతేజస్సు స్థాపింపఁగలఁడు. ఓ దేవతలారా! మఱియుఁ బ్రపంచమునకు సృష్టిస్థితిలయములుఁ గల్పించుచుఁ, ద్రిలోకాధిపతియై, యోగీ శ్వరాదులకయిన దురత్యయమగు మాయగల యాపరమేశ్వరుఁ డు కాలము సంప్రాప్తించునప్పుడు వారలఁ జంపి మనకు క్షేమ

ముగలిగింపక మానఁడు. అట్టిదానింగూర్చి మనము విచారింప నేల? అనెను. ఇది పదునాఱవయధ్యాయము.

హిరణ్యాక్షహిరణ్యకశిపులజననము.

అని యిట్లు పలికిన బ్రహ్మవాక్యములవలన వ్యసనకారణమును జక్కఁగాఁ దెలిసికొని దేవతలు సంతియముంబొసి బ్రహ్మలోకమునుండి మఱలి తమలోకము నొందిరి. ఓవిదురా! అంతదనుక "దుష్టులయిలోకములఁ బీడించుకుమార్గులఁ గందు" అన్న భర్తవాక్యముల నాలకించి దేవతలవలనఁ దనకుమారులకుఁ జావు వచ్చుట సిద్ధంబని పరితపించుచునూఱుసంవత్సరంబులు నిండినతోడనే యిద్దఱు గుమారులంబడసెను. వారు పుట్టినసమయంబున నసంఖ్యాకంబులును లోకభయావహములునగు మహోత్పాతంబులు భూమ్యంతరిక్షములందుఁ గానవచ్చె. పర్వతములతోఁగూడ భూమి గిరగిరం దిరుగ నారంభించెను. దిక్కులన్నియుఁ బ్రజ్వరిల్లఁజొచ్చెను. చుక్కలు తెగిపడెను. ఎల్లయెడల పిడుగులవర్షముగురిసె. లోకమున కుపద్రవకరములయిన తోఁకచుక్కలు గోచరంబులయ్యె. ఆసమయంబున మహావాయువు గఠినస్పర్శగలిగి ధాట్యాకర్షనులఁ జేయుచు వృక్షరాజముల నవలీలఁ గూల్చుచుఁ, దనచే నుద్ధూతంబయి పైకెగసినధూళులే ధ్వజముగాఁ గలవాఁడై విజృంభించి యెల్లెడల భయంకరముగా వీవ నారంభించెను. కిన్నులకు మిఱుమిట్లు గొలుపు మెఱుపులతో నొప్పుచున్న మేఘంబు లంబరంబున వ్యాపించి యుండుటచే జగమ్మంతయు నంధకారబంధురమగుచుండెను. ఆసమయమున సముద్రములు తరంగము లనుచేతులచే గుండె బాదుకొనుచు దుఃఖించుచున్నవా యనునట్లు భయంకరముగా ధ్వనిచే

సె. వాపీకూపతటాకాములన్నియు క్షోభించె. రాహుగ్రస్తములయిన సూర్యచంద్రకుండలములు పరివేషములు గలవయ్యెఁ. ఆకాలమందలి మేఘముల గర్జనలకుఁ బర్వతములు ప్రతిధ్వనులిచ్చెఁ. జంబుకంబులును, గుడ్లగూబలును గ్రామముల మధ్యమున సంచరించుచు భయంకరముగు నిష్ఠుకల నోళ్లనుండి క్రక్కుచు సమంగళముగా ధ్వనిచేయ నారంభించె. కుక్కలు మూతులను జైకెత్తి పాటపాడుచున్నట్లు మొఱుఁగఁజొచ్చెను. గాడిదలు వాడియగు ఖురపుటములచే భూమిని ద్రవ్వుచు ఖాతాకార ధ్వనుల గావించుచు మందమందలుగ నేర్పడి సరభసంబుగాఁ బర్వి యుండెను. ఆకాలమం దుత్పన్నము లగుచున్న ధ్వనులకు భయపడి పక్షికులములన్నియు వికారముగా ధ్వనులుచేయుచుఁ దమగూండ్లను విడిచి యుగాంతసమునకు నెగసిపోయెను. గొల్లపల్లెలయందు సరణ్యములయందుఁ బశువులు మూత్రపురీషముల విడువఁజొచ్చెఁ. ఆవులన్నియు భయముచెంది పాలకుబదులుగా రక్తము నొసంగఁ దొడఁగెను. మేఘంబు లెల్లయెడల రక్తవర్షముల వర్షించె. దేవాలయములయం దుండుదేవతాప్రతిమలన్నియు గొప్పజలంబును విడువఁజొచ్చెఁ. వాయువు విఱుపకయే కొన్ని వృక్షములు నేలఁబడఁ జొచ్చెను. శుభగ్రహములను క్రూరగ్రహములు పీడించె. నుల్కయు నాగ్రహములన్నియు వక్రగతిచేఁ గిరుగుచు నన్యోన్యము యుద్ధముసేసెను. ఇట్టిమహోత్పాతములను వీక్షించి భావివిదులయిన మునీశ్వరు లందఱు మిగుల భయపడిరి. కాని బ్రహ్మపుత్త్రులయిన మరీచ్యాదులు జ్ఞానసంపన్నులగుటచే భయపడలేదు. లోకములయందలి వారందఱు లోకములకు మహోపద్రవము రాక మానదని తలంచుచుండిరి. ఇట్లుండ దితికు

మాకు లీనువుగు పూర్వజన్మసిద్ధమయిన పౌరుషముతోఁ గూడినొని యుక్కుసంటిశరీరము కలవారయి దినదినమును బర్వుములవలె వర్ధిల్లుచుండిరి. వారు తమకిరీటము లాసనమును దాఁకించుచు కేయూరాదిభూషణములకాంతులచే దిక్కులను గప్పుచుఁ గటిస్థలములందున్న మేఖలలు సూర్యుని మించి ప్రకాశించునట్లు చేయుచు నడచుచున్నప్పుడు భూమి తమ బరువు నోర్వలేక కంపించునట్లు చేసి నర్తించుచుండిరి. అంతట కశ్యపుఁడు దితికిఁ గర్భాధానం జూచి * తన దేహమునుండి ముందుగాఁ బుట్టినబాలునికి హిరణ్యకశిపుఁడనియు దితి దేహమునుండి ముందుగా వెలువడినబాలునికి హిరణ్యాక్షుఁడనియు నామకరణము చేసెను. పిమ్మట హిరణ్యకశిపుఁడు తనబాహుబలముచేతను బ్రహ్మ యిచ్చినవరములచేతను దనకు మృత్యువు లేదని నిశ్చయించి లోకములను లోకపాలురను స్త్రీలను దిననిశము కావించుకొనెను. వానితమ్ముఁడయిన హిరణ్యాక్షుఁడు, తనయన్నయగు హిరణ్యకశిపునకు సంతసముగూర్చుచు దేవతలను జయించుచుండెను. అంత హిరణ్యాక్షుఁడొకనాఁడు యుద్ధకుతూహలుండయి తనకు సముఁడయిన వీరునితోఁ యుద్ధ

---

* ఇచ్చటఁ గశ్యపునకు ముందుపుట్టినవానికి హిరణ్యకశిపుఁడనియు దితికి ముందుపుట్టినవానికి హిరణ్యాక్షుఁడనియు నామకరణము చేసెననుటకుఁ దాత్పర్య మేమనఁ బురుషవీర్యము స్త్రీగర్భకోశవైపరీత్యముచే రెండు భాగములయి ప్రవేశించునప్పుడు కవలవాండ్రు బుట్టుచుందురు. మొయ్య మొదటఁ ప్రవేశించినవీర్యము శిశువయి తెరువాతఁ బుట్టుచుండును. వెనుక ప్రవేశించిన వీర్యము శిశువయి మొదటఁ బుట్టును. ఇచ్చట కశ్యపునుండి మొదటఁబయలుదేఱిన వీర్యము హిరణ్యకశిపుఁడయ్యె. కశ్యపునుండి వెనుకబయలుదేరినవీర్యముశిశువయి దితియొక్కగర్భమునుండి ముందుగా వెలువడెను. అపిల్లఁడు హిరణ్యాక్షుఁడయ్యె.

ముచేయఁగోరి భూమండలమును వెదకి కానక స్వర్గపురం బునకుఁ బోయెను. అంత దేవతలు దుర్జయమయిన బలము గలవాఁడై వైజయంతి యనెడుపుష్పమాలికఁ జే నలంకృతుండై స్వబలగర్వితుండై, నిర్భయుండై బంగరపుటందెలు ధ్వని చేయు చుండ, నిచ్చుచున్న హిరణ్యాక్షునిఁ జూచి మిగుల భయము చెంది గరుడునికి భయపడిపన్నాములవలె నందందుఁ గొందులఁ దూఱి దాఁగియుండిరి. ఇట్లు తనకు భయపడి పర్విడుచున్న దేవతలను బొగమబీనులఁగా నెంచి యందుఁ గలను మఱియుఁ గిర్వి తుండయి భయంకరమగు సింహనాదము చేసెను. ఇట్లు భయంక రముగా ధ్వనిచేయుచు నిష్టమునిచ్చినట్లు క్రీడించుచు, స్వర్గపుర మునుఁ బయలు వెడలి నడిపుటేనుఁగుచందంబున సంబుధిని బ్రవేశించెను. అంతట వరుణుని సైనికు లాతనిఁజూచి, మిగుల భయ మునొందియతనితేజంబుచే దిరోహితులై దు ఖితచిత్తులై య దృశ్యులైరి. అదిచగాచి హిరణ్యాక్షుండు నిరాటంకంబుగా సము ద్రమందుఁ బెక్కు సంవత్సరంబులు విహరించి వాయువుచే నుద్భూతములయిన గొప్పతరంగములను నయోమయమగు తన గదాదండముచే గొట్టుచుఁ బోయిపోయి వరుణునికి రాజధాని

హిరణ్యాక్షుండు వరుణలోకంబున కేగుట

యగు విభావరీపురమును జొచ్చెను. ఇట్లాగక్కసుండు వరుణుని రాజధానిం బ్రవేశించి లోకపాలకుఁడును యాదోగణముల కధి నాథుండు నగు వరుణునిఁ జూచి మందహాసంబు గావించుచు నీచు నినలె నతనికి నమస్కరించి "ఓలోకపాలా! నాకు యుద్ధభిక్ష పెట్టుము. నీవు లోకపాలుఁడవు. మహోద్ధతసంపన్నుఁడవు. మఱియు నీవు పూర్వమందు దేవదానవుల జయించి రాజసూయయాగ

మొనరించిన వీరుండవఁట. కావున నాతోయుద్ధముచేసి సంతసిం పఁజేయు"మని పల్కెను. అంత నసాంపతి యగువరుణుండు దురా త్ముఁడును, గర్వితుఁడు నగురాక్షసునివాక్యంబులు విని యందువ లనఁ జనకుఁ గలుగుచున్నకోపమును శాంతింపఁజేసికొని యిట్లని యె. "ఓయీ దానవరాజా! నేను బూర్వ మట్లు చేసినవీరుండనే కాని యిప్పుడు యుద్ధమునుండి విరమించియున్నాను. నీతో నేను యుద్ధముచేయఁ జాలను. కాని నీకుఁ దగినవీరుని గనఁబఱిచెదను.అతఁ డు మహాబలసంపన్నుఁడు, యుద్ధప్రియుఁడు. అతఁడు నీవంటివీరులను జూచిన చో ముగుల సంతసించుచుండును. అపరిమితపురుషునికంటె నన్యుఁ డొక్కఁడుండు నీతోఁ బోరఁజాలఁడు.నీవతనిపాలికిఁబోయి నచో యుద్ధభిక్షఁ జేసి నిన్ను సంతసింపఁ జేయఁగలవాఁడు. అమ్మహా త్ముఁడు వైకుంఠపురమునం దుండును. అతఁడు మీవంటిదురాత్మ లను సంహరింపఁ బెక్కులనతారంబులఁ దాల్చుచుండును. నీ వచ్చ టికిఁబోయినచో నావిష్ణువు నిన్ను రణరంగంబున గూల్చి నీమాం సంబునఁ గుక్కలకు విందుచేయకమానఁడు. కావున నచ్చటికి గమంబునఁ జనుము" అనిపల్కుచున్నమునినిపలుకులకు సంత సించి రణరంగమునందు హరిని జంపి నాభుజబలంబును వెల్లడి చే యుదు నని పలుకుచు వైకుంఠపురాభిముఖుండయి పోవుచుండె. ఇది బదునేడవయధ్యాయము.

ఆసమయంబున నారదుండు గగనమార్గంబున నెచ్చటికోపో వుచు నారాక్షసవీరున కెదురయి, "ఓయీ! దానవవీరా! గదా దండము కేల నమర్చి యెచ్చటికిఁ బోవుచున్నావు"నావుడు రా క్షసుండు నారదుంగాంచి యిట్లనియె."మునీంద్రా! వైకుంఠమునం

దు విష్ణుమూర్తి యున్నాడఁట ! వానిం బరికించి యుద్ధముచేయుట కయి పోవుచున్నాను" అనిపల్కి వీని నారదుండిట్లనియె. 'ఓయీ! నీప్రయత్నము నిష్ప్రయోజనము. నీవు వైకుంఠమునకుఁ బోయిన లాభము లేదు.నీ వనుకొనినవిష్ణువు తనలోఁ గొంచినలేఁడు.పాతాళమందున్నాఁడు.పోవశక్తియున్నచో భూతాళమునకుఁ బో'మ్మని పల్కివిని దానవవీరుండు మిగుల సంతసించి సరభసగమనముతో రసాతలమునకుఁ బోయి గిరిసదృశమయిన యాకారముతో నొప్పుచు నిజదంష్ట్రాగ్రముచే భూతలమును బయికెత్తుచుఁ దన యెఱ్ఱనిసయనంబులకాంతిచే నాదానవుని తేజంబు నపహరించుచు నున్నయాహారినిఁజూచి " యరణ్యములందుఁ జూడఁదగిన వరాహమిక్కడ నేలయుండె" నని తనలోఁదాను నవ్వుకొనుచు సమీపించి యతని కిట్లనియె. 'ఓరీ! ఠుమ్మీ! ఆభూతలమున కెట్టయుండనిమ్ము. రమ్ము. ఇటురమ్ము. నాతోయుద్ధముచేయుము. ఈభూమి పాతాళలోకవాసుల నిమిత్తము బ్రహ్మచే నీఁబడినది. మఱియు నీ భూమి నాకువశమయి వర్తించును. ఇట్లుండఁగా నేఁ జూచుచుం డఁగనే దొంగతనమునఁగొనిపోఁ జూచుచున్నావా? నీవింతకాలము వఱకు మాయాబలమును గైకొని మావంశమందుఁ బుట్టినవారి నెల్ల జయించుచున్నావు. ఇదిగో ! చూడుము. ఇప్పుడే గదాదండముచే నిన్నుఁ జంపి మాబంధువులయు, స్నేహితులయుఁ, గన్నీళ్లను దుడిచెదను. ఇదిగో! ఇప్పుడే నిన్నుఁ జంపెదను. నాగదాఘాతమువలన నీవుచచ్చినతోడనే ని న్నింతదనుక నాశ్రయించి బలుల నర్పించుదేవతలును, ఋషులును, నానాశ్రయులై చచ్చెదరు.'అనిపలుకుచున్నదుష్టరాక్షసుని వచనతోమరములచేమిగులఁ

బీడింపఁబడి సహింపలేక యూవరాహమూర్తి తనవంపుస్వ్రక్కువం దు మిగుల భయపడుచు నున్నభూదేవితో మఱఁ బొదితయయి భీ తినొందుచున్న మూతంగితోఁ గూడియున్న మూతంగవరమువలెఁ బ్రకాశించుచు నాజలమధ్యమునుండి బయలు వెడలి వచ్చుచుం డెను. ఇట్లుదక ములనుండి బయలు వెడలివచ్చుచున్ననరాహా మూర్తిని గజేంద్రము ననుసరించుచున్న సుహూగ్రాహమువలె ననుసరించినవాఁడయి హిరణ్యాక్షుండు కోరపండ్లు భయంకరములై చూపట్ల గంభీరవాక్యములతో నిట్లనియె "ఓరీ! దురాత్మా! నీకు సిగ్గులేదా? లోకములోనివారు నలుగురు నిందింతురని యయి నను వెఱువవేమి? అవును. నిందాభయము లేనివానికి గర్హితకృ త్యముండదు. కాన నీవు పలాయితుఁడవగుటయు న్యమే!" అని పలుకుచున్న రాక్షసునిపలుకు లాలకించి కోపోద్దీపితమూర్తుఁడయి నీటి యుపరిభాగమందు భూతలమును నిలిపి దానిమందుఁ దన యూధాధిశక్తి నుంచెను. అదిచూచి మిగుల నానందించి బ్రహ్మ యభినందించుచుండఁ దేవతలు హిరణ్యాక్షుఁడు చూచుచుండఁ గాఁ బుష్పవర్షము గురియించిరి. ఇట్లు దేవతలచే నుతింపఁ బడుచు భగవంతుండు గనకకేయూరాదిభూషణములకాంతు లాకసము నింపుచుఁ, గాంచనమయ మగుకవచముగలిగి, మిగుల బలిష్ఠ మగుగదాదండమును గేల నమర్చి మర్మస్థానంబు నాటున ట్లు దురుక్తులాడుచు వెన్నంటివచ్చుచున్నహిరణ్యాక్షునిఁ జూచి మందహాసముచేయుచు నిట్లనియె. "ఓరీ! దురాత్మా! నన్నుఁజూచి వనగోచరమృగమనియూ యధిక్షేపించుచున్నావు? అవును, సత్య మే! నే నడవిమృగమనే? నీవంటిశఠకములను వెదకి చంపు నిమిత్తము నేను మృగమనైతి. ఓరీ! దురాత్మా! వృథా

కాఱుకూతలు కూయుటవలన నేమిలాభము ? వీరులయినవా రెప్పుడు నిట్టిగర్వాలాపముల నాడరు. మృత్యుపాశబద్ధుడ నయిన నీవు నిన్నుఁ బొగడుకొనిన వీరులు మెచ్చరు. ఈప్రల్ల దంబులు నీకులు పల్కఁబలసినవగునా ? మఱియు నీవు "పాతా ళవాసులకు బ్రహ్మ యిచ్చినభూమిని నీవు హరించుచున్నా" వని పల్కినావు. పాతాళవాసుల నిచ్చేపమయినభూమిని మేము హరిం చుచున్నామా? మేము లజ్జలేనివారమా? నీకు భయపడి మేము పాఱిపోవుచున్నామా ? బలవంతుఁడవయిన నీతోఁ విరోధమువ హించి మే మెచ్చటికిఁ బోఁగలము. మాఁ నీతోయుద్ధముచేయు నంతటిబలము లేకపోయినను లేనిబలమును దెచ్చికొని నీతో యుద్ధముచేసెదము. పదాతులలోఁ నగ్రేసరుఁడవయిన నీవుగూడ నూరకుండక నాకుఁ బరాభవము జనింప యట్లొనర్పుము. యట్లొ నర్పుము. యట్లొనర్పుము. మఱియు నన్నుజంపి నీవన్నహితులదుఃఖ మును దుడిచెదవని ప్రతిజ్ఞ పలికితివి.నీవు మగవాఁడవయిన నన్నుఁ జంపి నీప్రతిజ్ఞ నెఱవేర్చుకొనుము. చేసినప్రతిజ్ఞను నెఱవేర్పలేని పురుషుఁడు గౌరవహీనుఁడనఁబడును." అని యిట్లుపలుకుచున్న హరిపలుకులు ములుకులనలెఁ జెవులకు నాటిన నద్దానవాధిపతి తోఁకద్రొక్కిన సర్పరాజునలెఁ జెలఁగి కన్నులనుండి నిప్పులు కురుప లుగా రాలఁజూచుచుఁ గ్రుద్ధుండయి నిట్టూర్పుపుచ్చుచుఁ, గోపం బున నింద్రియములుచలింప సమీపించి సరభసముగాఁ దనగదా దండముచే హరినిగొట్టెను. భగవంతుఁడగు నావరాహమూర్తి హి రణ్యాక్షుఁ డురమందుఁ బ్రహరించిన గదాఘాతమును, యోగసి ద్ధుఁడు మృత్యువును దప్పించుకొనునట్లు తిర్యగ్గమనుఁడై తప్పించి కొనియె. అంతఁ గ్రమ్మఱ గదాదండంబును మాటిమాటికిఁ ద్రిప్ప

చున్న యాహిరణ్యాక్షునిఁ జూచి యాభగవంతుఁడు కోపపూరిత మానసుండయి దష్టాధరుండయి శత్రువును సమీపించి తనగదా దండమునుత్తోఁ గుడిపార్శ్వంబునఁ గొట్టఁగా గదాయుద్ధమందుఁ గుశలుఁడయిన యాదైత్యుఁడు డాఁబెబ్బను తనగదచే దప్పించుకొ నెను. ఓవిదురా! ఇట్లాహరియు హిరణ్యాక్షుండు నొండొంఁగుల జయింపఁ దలంపుగలవారయి భయంకరమయిన గదలతో నొకరి నొకరు కొట్టుకొనుచుండిరి. మఱియు నాహరి దానవు లిసువురు భయంకరమయినగదలతో మొత్తినొనుచు నాతఁడెనులనుండి స్రవించుచున్న రక్తము నాహరిఁజింపుటవలన రెట్టించిన కట్టలుక కలవారయి భూతలమునిమిత్తము వెక్కుటీతులగా గదాయుద్ధ ముచేయుచు మత్తస్మృతభంబులచందంబునఁ బ్రకాశించిరి. ఆస మయమున స్వసంకల్పముచే నారాహశరీరము దాల్చియున్న యజ్ఞమూర్తికిని నాహిరణ్యాక్షునికిని బ్రతిజ్ఞాతయుద్ధంబు గనుఁగొనఁ గమలాసనుండు మరీచ్యాదులతోఁ గూడ నచ్చటి కేతెంచెను. ఇట్లు బ్రహ్మ కనుమానసన్నిధితోఁగూడ దగ్గఱనుండి భగవంతుని గదాప్రహారములయం బ్రతీకారి మొనర్చుచున్న వాఁడును, యసహ్య పరాక్రమము కలవాఁడును, భయరహితుఁడును, మదోద్ధతుఁడును, నైనరక్కసుని వీక్షించి యాదివరాహరూపము నొందినవారాయ ణున కిట్లనియె. "దేవా! ఈరక్కసుండు మిగుల దురాత్ముఁడు. నీకు శరణాగతులయిన గోబ్రాహ్మణాదులను నిరపరాధులయిన భూతములను నిష్కరుణుఁడయి చంపుచున్నాఁడు. తన్నుఁజూచి పరుగిడువారి ధనప్రాణములను గొనునట్టినీచుఁడు. మఱియు నావ లన వరంబులఁబొంది మిగుల మదించి యున్నాఁడు. వీఁడు యుద్ధప్రి యుఁడయి తగినవీరునకై యెల్ల ప్పుడుఁ దిరుగుచుండును. వీఁడు లో

కములకు ముల్లువంటివాఁడు.వీఁడు మిగుల మాయావి.లోకముల లో వీని నెదుర్కొనువీరుఁ డెవ్వఁడునులేఁడు. వీఁడు మిగులకావర ముచే నొప్పుచున్నాఁడు.వీఁడు క్రూరులలో నగ్రేసరుఁడు. వీనితో నింత సేపు యుద్ధముచేయుట పాపముతో బొలకుఁడాడుకొనుటనలె నే ప్రాణాపాయకరమని తెలియుము. ఇంక సాయంకాలముగూడ నాసన్నమగుచున్నది. రాత్రియందు రాక్షసులకు బలము హెచ్చ గును. కావున నీవు నీమాయాబలము నాశ్రయించి సాయంకా లముసకుఁ బూర్వమే సంహరింపుము. లేనిచో వీనినిజంపఁ దుస్సా ధ్యమగును. వీఁడు శాంబరమాయ నవలంబించినచో వీని నెదు ర్కొనుట కెవ్వరును సమర్థులుకారు. జాగరూకుఁడవయి వీఁడు స్వమాయాబలము నొందకమున్నే సంహరించి దేవతలకు జయ ము కలిగింపుము. ఇప్పు డభిజిత్తను పేరుగల మధ్యాహ్నకాల మేతెంచినది. వీనిని జంపుట కిది తగినసమయము. నీసేవకుల మయిన మాక్షేమముకొఱకు దుర్జయుఁడయినను వీనిఁజంపుము. వీనికిఁ బ్రోఁగాలము సమీపించినది. వీనికిఁ జావు తండ్రియగు కశ్య పుఁడే విధించియున్నాఁడు. యుద్ధమందు నీవిక్రమ మెల్లరు విను తింప వీనితోఁ బోరాడి లోకములకు సుఖము కలిగింపుము' అనె ను. ఇది బదునెనిమిదవయధ్యాయము.

ఇట్లు నిర్దుష్టముగాను,మధురముగాను,బలికిన బ్రహ్మవాక్యము లు విని నారాయణుఁడు కాలస్వరూపుఁడ నయి'సర్వమును సంహ రించు నాకుశత్రుభయమును గల్పించుచున్నాఁడ'ని మందహాస ముచేసి ప్రేమసహితమగు కటాక్షముచే నతనివాక్కులను మన్నిం చెను.అట్లద్దేవుఁడు దేవతాభీష్టము నెఱవేర్చఁదలంచి తనయెదుట

మపుపుటెనుంగువలె నిర్భయుఁడయి సంచరించుచున్న హిరణ్యాక్షునిఁజూచి సమీపించి తనగదాదండముతో దవుడపయిఁ గొట్టెను. అది రాక్షసుండుచూచి తనపైకి వచ్చుచున్న గదను మధ్యమార్గమున నే తనగదాదండముతోనేయ నదియటనుండి జారి ధ్వసించుచుఁ గ్రిందఁబడియె. అందునలన భగవంతుండు నిరాయుధుండయ్యె. అదిచూచి దేవతలు హాహాకారంబులు చేసిరి. హిరణ్యాక్షుఁడు హరి నిరాయుధుఁడయి యుండుటను జూచియు, హరిని సులభముగాఁ జంపఁదగినసమయము తన కలవడినను, "యుద్ధమందు నిరాయుధుని జంపఁగూడ"దను ధర్మబుద్ధితో హరిని బాధింప నిష్టపడలేదు. అంత విష్ణుమూర్తి తనచేతిలో నున్నగద భగ్నమగుటయు, నదిచూచి దేవతలు భయంబున హాహాకారంబులు చేయుటయు జూచి, నిరాయుధుఁడయియున్నతన్ను బాధింపకపోయినందులకు రాక్షసునిధర్మబుద్ధికి మిగుల సంతసించెను. ఇట్లు సంతసించి తనచక్రము నొక్కమాఱు స్మరింపఁగావచ్చి తనహస్తమందు నిలిచెను. అంత హరి యాచక్రమును ధరించుటను దేవతలు చూచి మిగుల సంతసించి చక్రప్రభావ మెఱిఁగియున్న వారగుటచేత "ఈచక్రమున రాక్షసుని జయింపుము. రాక్షసుని జయింపుము" అనెడి వాక్యంబులు గగనభాగంబును గప్పచుండెను. అంత రక్కసులమేటి హరి చక్రాయుధుఁడయి యుండుటం జూచి క్రోధాతిశయముచే భ్రుకుటీభీమ్రుఁడయి, నిట్టూర్పుపుచ్చి భయంకరములయిన దంష్ట్రలచే నొప్పుచుఁ గన్నులనుండి నిప్పులఁ గుప్పలుగాఁ గురియుచుఁ బెనవి గొఱుకుచు నందువలన రెట్టించినకట్టలుక కలవాఁడయి హరిని సమీపించి "ఈదెబ్బతోఁ జచ్చితివ"ని పల్కుచుఁ దనగదాదండముతో మొత్తెను. యజ్ఞ

వరాహావతారమెత్తియున్న భగవంతుఁ డావచ్చుచున్నగదను మా ర్గమధ్యమందే తనయెడమపాదముతోఁ దన్ని దానిని దునుమాడి యది చూచుచున్న రాక్షసుని క్రోధమును రెట్టింపఁజేసెను. ఇట్లుచేసి, "ఓరీ! దానవాధమా! నీగదను దీసికొని యుద్ధమునకుఁ బ్రయత్నింపుము. ఊరకుండకుము. తప్పక నీవే జయమును బొందఁగలవు. లెమ్ము. అనుమానింపకుము" అని పలుకుచున్న హరి వాక్యంబులు విని కరమ్మలిగి యారాక్షసుండు గదాదండము సారించి దానితో వరాహునిఁ గొట్టి బిగ్గరగా సింహనాదము చేసెను. అంత భగవంతుండు తనవైకి వచ్చుచున్న రాక్షసునిగదా దండమును గరుత్మంతుఁడు నాగుఁబాము నొడిసిపట్టుకొనినట్లు లీలగాఁ బట్టికొనెను. ఇట్లాగదాదండమును బట్టుకొని రక్కసునిఁ జూచి "ఇదిగోఁ దీసికొనుము. ఈగదను ధరించి యుద్ధము చేయుము" అని యాగదాదండము నీఁబోఁగా హతతేజస్కుఁడయిన యాదానవుఁ డాగదాదండము నందికొన నిష్టపడలేదు; కాని తీవ్రమగు నగ్నిహోత్రమువలె భయంకరమయిన త్రిశూలంబు నొకదానిని గైకొని హరిపయిఁ బ్రయోగింప నది నభచారకర్మంబు మహావిద్యోపాసకుఁడగు బ్రాహ్మణునిఁ జెందలేనట్లు వరాహమూర్తిని జెంద భయపడుచు మందముగా వచ్చుచుండె. అంత నుద్దీప్తమగుకాంతిపుంజముతో నాకాశమధ్యమందుఁ బ్రకాశించుచున్నయాశూలమును జూచి నారాయణుం డతిరయంబునఁ దనచక్రంబుచే నమృతహరణకాలమందుఁ దనవజ్రంబుచే వజ్రాయుధమును గారవింపఁదలంచి గరుత్మంతుఁడు విడిచిన పక్షింబును ద్రుంచినట్లు ద్రుంప దేవతల జయజయధ్వనులు రక్కసుల యాహాకారంబులతోఁగూడ నిర్గమించెను. ఇట్లు తన

శూలము హతమగుటచూచి హిరణ్యాక్షుం డతికోపంబు నూని హరిని సమీపించి సింహనాదంబు చేయుచు నాతనివక్షఃస్థలంబు నఁ బిడికిటిం బొడిచి యంతర్ధానము చెందెను. ఓవిదురా! ఇట్లు రాక్షసునిచేఁ గొట్టఁబడినను నారాయణుండు పుష్పదామాఘాతంబునకు లక్ష్యముచేయని మదపుటేనుంగుభంగి నాదెబ్బను సరకుగొనకుండెను. రాక్షసుఁ డట్లంతర్ధానముఁ జెంది యాశ్చర్యశక్తులకు నాయకుఁడగు హరివిషయమయి బహువిధములయిన మాయల సృజించెను. ఆమాయలను జూచి లోకులందఱు తప్పక లోకప్రళయ మనుచు తలంచిరి. ఆసమయమున రాక్షససృష్టమయిన మాయాబలంబుచే భయంకరమైన వాయువు విజృంభించి భూపరాగంబు నల్లడల నొందించి లోకంబును దమిరావృతంబుగఁ జేసి వీవఁ దొడంగెను. నలుదిక్కులనుండి యంత్రములచేఁ బ్రయోగింపఁబడుచున్నట్లు పాషాణవర్షము కురియుచుండెను. ఆకాశము కాంతి దక్కియుండెను. విద్యుత్సహితములయిన మేఘకదంబంబు లాకసమును గప్పి లోకములు బెగడుపడ గర్జించుచుఁ జీమును రక్తమును మూత్రపురీషములను గేశములను నెమ్ములను వర్షింపఁ దొడంగెను. పలువిధములయిన యాయుధములఁ బ్రయోగించు పర్వతంబులెల్లను గాన నయ్యెఁ. దిగంబరలును ముక్తకేశులును శూలధారిణులును నగు వెక్కుండ్రు రాక్షసస్త్రీలు కనఁబడఁజొచ్చిరి. మఱియు హింసాశీలురయిన యక్షులును, రక్షస్సులును జతురంగబలంబుతో నల్లడలఁబర్వి 'చంపుము కొట్టుము' అని యొకరినొకరు పురికొల్పికొనుచుఁ దిరుగుచున్నట్లు నేత్రగోచరమాయెను. అంత నారాయణుండు చూచి లోకభయంకరములగు నాసురమాయల నంతముఁ బొందించుటకయి తనకుఁ

ప్రియతరమయిన చక్రాయుధమును ప్రయోగించెను. అదిచూచి
దితి తనప్రియుండును త్రికాలవేదియు నగు కశ్యపబ్రహ్మ చెప్పిన
వాక్యముచొప్పునఁ దనకుమారుండు హరిచేఁ జచ్చుట సిద్ధంబని
నిశ్చయించి భయంబున హృదయము గంపింప స్తనములు రక్త
ము స్రవింపఁ జేయుచుండెను. అనంతరము కాంచనాక్షుండు తన
మాయాబలం బొహరి నేమియుఁ జేయలేకపోవుట చూచి మొ
క్కఁ బోనిబంటుతెనమ్మున హరిని సమీపించి తనబొమ్మయుగళం
బు సాఁచి పుండరీకాక్షునినఱుంబున వజ్రఘాతంబులతో సమా
నములయిన పిడికిటిపోటులం బొడుచుచుండెను. అంత నారాయ
ణుం డుగ్రుండయి దేవేంద్రుఁడు వృత్రాసురుని గొట్టినట్లు తనహ
స్తంబున వానికిక్ష్మను గొట్టెను. అందులకు నారక్కసుండు
సహింపలేక భూమిపయిం బడి నిమీలితనేత్రుండయి గాలిచే నేల
గూలిన వృక్షంబుపగిది గూలెను. ఇట్లు నారాయణునిచే వధింపఁ
బడి కాంతిదక్కి భయంకరదంష్ట్రలు గలిగి పెదవి గఱచికొని నేలఁ
బడియున్నహిరణ్యాక్షుం జూచి బ్రహ్మాదిదేవత లానందకందళితచి
త్తులయి నారాయణుని సమీపించుచు నిట్లు పల్కిరి. "అయ్యా రే!
ఇదిమిగుల వింతగా నున్నది. భగవంతుచేఁ జచ్చుపుణ్యాత్ముండు దు
ర్లభుండుగదా? యోగీశ్వరులందఱు సంసారనివృత్తులయి యోగ
మార్గముల నవలంబించి యెనని పాదపద్మముల రహస్యముగా భజిం
తురో యాభగవంతుని పాదపద్మము చేతనే యారక్కసుండు స్రు
క్కెను. మఱియు భగవంతునిముఖమును జూచుచుఁ దనువువిడి
చెను. వీనిపుణ్య మెంతని కొనియాడఁగలము! ఇంతకు నీహిరణ్యా
క్షుహిరణ్యకశిపులు బ్రాహ్మణశాపమువలన రాక్షసులయి జన్మం
చిరికాని వీరు భగవంతుని ద్వారపాలురేకదా! వీరు మఱుఁడఁ

గతివయజన్మములలోఁ దమస్థానమును బొందఁగలరు. వీరు పుణ్యాత్ములని వేఱఁ చెప్పవలయునా? అని యూరక్కసునిపుణ్యమును బేర్కొనుచు హరిని సమీపించి యిట్లనిరి. 'ఓదేవా! నీవు కేవలము సత్వగుణుండవే యయినను లోకరక్షణమునిమిత్తము స్వేచ్ఛా పాత్తశరీరుండ వయితివి. అట్టి నీకు నమస్కారము. నీవు సకలయూగస్వరూపుఁడవు యూగఫలప్రదుఁడవు. అట్టినీకు నమస్కారంబులు నాచరించుచున్నారము. మఱియు లోకములకు ముల్లువంటివాఁడగు నీరక్కసుండు చచ్చెను. నీపాదభక్తిచే మేము సుఖవంతులమయి యుందుము" అని యిట్లసహ్యవిక్రమముగల రాక్షసునిఁ జక్కాడి వరాహావతారమెత్తిననారాయణుండు కృతకృత్యుండయి బ్రహ్మాదులచే నుతింపఁబడుచు వారలసంస్తవంబులకు లోమిగుల ముద మందుచు వారిలఁ గృపాకటాక్షవీక్షణములచేఁ జూచి మన్నింపుచు వైకుంఠమునకుఁ బోయెను. ఓవిదురా! భగవంతుని యవతారచరిత్రమును దురాత్ముఁడయిన హిరణ్యాక్షుని యుద్ధమందు లీలగాఁజంపినచరిత్రమును నీకుఁ దెలిపితిని. అని యిట్లు మైత్రేయుండు చెప్పినభగవత్కథ నాలించి విదురుండెంతయు స్వాంతంబున సంతసంబొందె నని శుకుండు రాజునకుఁజెప్పి వెండియు నిట్లనియె. మఱియు లోకములోఁ మహాత్ములును, మహాయశస్కులును, బుణ్యాత్ములు, నగువారిచారిత్రములు విన్నప్పుడే హృదయ మమందానందము నొందుచున్నప్పుడు భగవంతుని యద్భుతచారిత్రము వినినప్పుడు హృదయ మమితానందము నొందు నని వేఱఁ చెప్పవలయునా? ఇటయునుంగాక తొల్లి గజేంద్రుఁడు దైవికంబుగా నక్రముచేఁ బట్టువడి వేయివత్సరంబులు దానితో యుద్ధంబు గావించి తుదకుఁ బోరాడ నశక్తుండయి భార్యా

నమేతుఁడయి భగవంతునిఁ బ్రార్థింప వారలకుయ్యాలించి చక్రధారియై సరభసంబున నేతెంచి నక్రమును సంహరించి గజేంద్రునిఁ గాపాడెను. దిక్కులేనిమానవులచే మంచియుపాయంబులచే నారాధనీయుండును, దుష్టులకు దర్శనమొసంగనివాఁడును, శరణాగతవత్సలుండును, నగుభగవంతుని సేవించుటకును, నాతనిసచ్చరిత్రముల నాలకించుటకును గృతఘ్నుండుదక్క నెవ్వఁడు మానఁగలండు? లోకములో నున్నవారందఱు సేవింపకమానరు. మఱియు భగవంతుండు జగంబు గాపాడుటకయి వరాహావతారమెత్తి హిరణ్యాక్షుని లీలమెయి సంహరించినకథను నెవరువిందురో, నెవ్వరు చదువుదురో, నెవ్వరుకీర్తింతురో, వారు బ్రహ్మహత్యాదిపాపములనుండియు విడువఁబడుదురు. ఈచరిత్రంబు విన్నవారు ధనమును యశంబును, నాయుర్దాయంబును, యుద్ధములందు శౌర్యవర్ధనమునుబొంది తుదను వైకుంఠమును బొందుదురు'. అనియిట్లు శుకుండు పరీక్షిత్తునకుఁ దెలియఁజెప్పెనని సూతుండుచెప్ప విని మిగుల సంతసించి శౌనకుండు సూతునిఁజూచి యిట్లనియె. ఇది పందొమ్మిదవయధ్యాయము.

"ఓసూతా! సమస్థితిని బొందినభూమి నధిష్ఠించినతరువాత స్వాయంభువమనువు తక్కువజన్ములవారికి ధర్మార్థకామమోక్షరూపపురుషార్థము సాధింపఁ బన్నినయుపాయము లెన్నివిధములు? లోకసంగ్రహార్థమై తానవలంబించిన మర్యాదలేవి? మఱియు, విదురుఁడు నిరతిశయమయిన భగవద్భక్తి కలవాఁడు. అతఁడు విష్ణునిదయారసమునకుఁ బాత్రుండు. భగవంతుఁడయిన హరియందు బద్ధద్వేషులయినవారనియు, శ్రీహరివాక్యంబుల వా

రు వెడచెవులఁ బెట్టినారనియు దుర్యోధనాదియుతుఁడగు ధృత రాష్ట్రుని విడిచెను. ఆవిదురుఁడు భగవంతుఁడగు వ్యాసమహాము నికి జన్మించెను. సర్వవిధములచేత మిగుల గొప్పవాఁడు. సామా న్యుఁడు కాఁడు. అతఁడు సర్వాత్ముఁడయిన భగవంతుని యాశ్రి తుఁడు. సర్వమున కతనినే నమ్ముకొని సేవించుచునుండెను. అ ట్టిమహానుభావుఁడయిన విదురుండు గంగాదిపుణ్యనదులయందుఁ గృతావగాహుండయి యపగతపాతకుండయి కుశావర్తమను పు ణ్యతీర్థమునందు మైత్రేయునిఁ గలిసికొని నమస్కరించి యేమేమి యడిగెను? భాగవతోత్తములయిన విదురమైత్రేయులు ప్రసం గింప నారంభించినచో భగవంతుని పాదంబులవలనఁబుట్టి పావ నివర్తకములగు గంగాజలములవలె లోకపావనములయిన భగవ త్కథలు నిర్గమించుచుండును గదా! కావునఁ గీర్తనీయుఁడును, ను దారచరిత్రుఁడు నగుభగవంతునికథలను వాకుఁ దెలియఁజేయు ము. నీకు మంగళంబులు గలుగుఁగాక. భగవంతుసత్కథలనెడి యమృతముద్రావి రసజ్ఞుఁడగువాఁడెవఁడు తృప్తిఁజెందు? అట్టిహా రికథామృతమును ద్రావుచుఁ దృప్తిచెందువాఁడుండనేయుండఁ డు." అని కుతూహలుండయి యడుగుచున్న శౌనకుం జూచి భగవ దర్పితచిత్తుఁడగు సూతుం డిట్లనియె. "మునీంద్రా! నీవడిగిన ట్లి రాజ డుగ శుకుండు రాజున కిట్లుచెప్పె. ఓరాజేంద్రా! నారాయణుండు వరాహావతారమెత్తి రసాతలమునుండి భూమి నుద్ధరించి హిర ణ్యాక్షుని సంహరించి వైకుంఠమును బొందినకథను మైత్రేయునివ లన విని విదురుండు సంతోషభరితస్వాంతుండయి మైత్రేయునిఁ జూచి 'మునీంద్రా! చతుర్ముఖుండు ప్రజలను బుట్టించుటకయి మరీ చ్యాదిప్రజాపతుల సృజించెననికదా చెప్పియున్నావు! ఆప్రజా

పతులను సృజించినపిమ్మట బ్రహ్మ యేమిచేసెను? నీ వతీంద్రియమగు స్వరూపముఁగూడ నెఱుఁగుదువు. కాన నాకుఁ జెప్పుము. మరీచిమొదలగువారును స్వాయంభువమనువును బ్రహ్మశాసనమువలన విశ్వము నెట్లు సృజించిరి. మఱియు వారలు సృష్ట్యాదికర్మములయందు స్వతంత్రులుకదా? అట్టివారలు భార్యాసమేతులయి సృజించినారా? లేక భార్యానిరపేక్షులై సృజించినారా? వీనినిగఁతించి విస్తరించి నాకుఁ జెప్పు"మని యడుగుచున్నవిదురునిఁ జూచి మైత్రేయుండు సర్గాదిభేదములఁ జెప్పెద నాలింపు మనిచెప్పి యిట్లనియె.

మైత్రేయుండు విదురునికిఁ జతుర్ముఖుం డొనర్చు యత్నోదితదేవతాగణసృష్టిని దెలుపుట.

ఓవిదురా ! అచింత్యప్రభావుఁడయిన యీశ్వరుండు కాలమువలనఁ గార్యోన్ముఖుఁడయి యుండఁగాఁ దనకు శరీరభూతమయి గుణత్రయాత్మకమయియున్న ప్రకృతివలన మహత్తత్త్వముదయించెను. రజస్సత్త్వప్రధానమయి భగవత్ప్రేరితమయి భూతేంద్రియసూక్ష్మాత్మకమయియున్న యీమహత్తత్త్వమువలనఁ బంచమహాభూతములును, దన్మాత్రలును, జ్ఞానేంద్రియకర్మేంద్రియములును, నుద్భవించినవి. ఆభూతాదులు పరస్పరము కలియనివగుటచే భూతసంబంధమగు నండమును సృజింప నసమర్థములయి దైవయోగమువలన నేకీభవించి బ్రహ్మాండమును బుట్టించినవి. ఆయండ మధిష్ఠాతయగు చేతనము లేనిదయి సలిలమందుఁ జిరకాలమువఱకు వసించియుండెను. ఆయండకోశమందు భగవంతుండు వేయిసంవత్సరములధివసించెను. అట్లు శయనించియున్న భగవంతునినాభివలన సహస్రసూర్యప్రకాశమగుపద్మ ముద్భవించెను. ఆపద్మమే సమస్తజీవరాసులకు నివాసభూతము. ఆపద్మమువలన బ్రహ్మ స్వయముగాఁ

బుట్టెను. ఆ బ్రహ్మ భగవంతుని సంకల్పజ్ఞానమునకు విషయుఁడయి నామరూపాత్మకమయిన యీ ప్రపంచమును యథాపూర్వముగా సృజించెను, మఱియు నా బ్రహ్మ ముందుగాఁ దమోగుణమును బురస్కరించుకొని తామిస్రము, నంధతామిస్రము, తమము, మోహము, మహాతమము నాఁబడు నవిద్యాపంచకమును సృజించెను. ఆయవిద్యాపంచకములో నొకటియుఁ దమోమయము నగు నాస్వభావమును విడిచిపెట్టెను. అట్లు బ్రహ్మవిడిచినదానివలన యక్షరక్షస్సు లుదయించి యీకాయమును దమకు క్షుత్పిపాసలఁ గలిగించురాత్రినిగా గ్రహించిరి. ఇట్లాయక్షరక్షస్సులు, క్షుత్పిపాసాకులులయి యీచతుర్ముఖుని భక్షింప సమకట్టిన నాచతుర్ముఖుండు భయముచెందిఓరీ నేను మీజనకుండను. నన్ను మీరు భక్షించుట యుక్తముకాదు. మీరందఱు నాకుఁ బుత్రులరు. మీ రిట్టిక్రూరకర్మమునకుఁ బూనుకొనుట ధర్ముకాదు. మఱియు మీలోఁగొందఱు నన్నురక్షింపవలదనియుఁ గొందఱు భక్షింపవలదనియుఁ బల్కినారు. కావున మీరు క్రమముగా రాక్షసులనియు యక్షులనియుఁ బ్రసిద్ధికెక్కుదురు. అనిపల్కెను. మొదటనిట్టి తమస్స్వభావులయిన యక్షరాక్షసాదుల సృజించి బ్రహ్మ ఛాయాప్రతియోగిని యగుతేజస్సును బొంది ప్రాజ్ముఖుఁడయి దేవతల సృజించెను.అనంతరమా బ్రహ్మప్రభామయంబగునాస్వభావంబు చాలించె.అదియహోరూపంబయి దేవతలకాశ్రయమయ్యె. తరువాత బ్రహ్మజఘనప్రదేశమువలన మిగులఁ గామాసక్తులయిన యసురుల సృజించె.అంత వారు కామాతురులయి మైథునాభిలాషులయి యాబ్రహ్మను సమీపించిరఁట!అంత బ్రహ్మ నిర్లజ్జులయి మైథునాభిలాషచేఁ దన్ను డాయవచ్చుచున్న యసురులనుజూచి నవ్వు

చు, వారిదుష్టచేష్టలకుఁ గోపితుండయి చేయునది లేక పర్విడిపోయి భక్తార్తిహరుఁడై భక్తుల ననుగ్రహించునిమిత్తము వారివారిబుద్ధి కనురూపముగా దర్శనమిచ్చు నారాయణుని సమీపించి నమస్కరించి యిట్లనియె. "ఓ దేవా ! లోకములకుఁ బ్రాప్తమయిన యాపదలఁ దొలఁగించునట్టివాఁడవీవె ? అట్లు నిన్నాశ్రయింపని దురాత్ములకుఁ గష్టముల నిచ్చెడువాఁడవును నీవే? కావున నాపన్నుండనయిన నన్నురక్షింపుము. భవదీయాజ్ఞానుసారంబుగ నీప్రజాసమూహమును సృజింప వారు దుర్మార్గులై బల్మిని నన్ను రమింపరాఁగా భయపడి యిందుఁ బర్విడి వచ్చితిని." అనిపల్కిన బ్రహ్మవాక్యంబుల విని స్పష్టముగాఁ బరాభిప్రాయము నెఱిఁగిననారాయణుఁడు కనికరించి బ్రహ్మను జూచి యీస్వభావంబును విసర్జింపుమనుడు నతఁడట్లుకావించె. బ్రహ్మ యట్లు విసర్జించినస్వభావంబు సాయంకాలసంధ్య యయ్యె. అంత రాక్షసులు స్త్రీరూపముగాఁ గల్పితమగు సంధ్యను జూచిరి. ఇట్లుచూచి యవ్యక్తమధురముగా ధ్వనిచేయుచున్ననూపురములుగల పాదములచేతను,మదవిహ్వలములయిన లోచనములచేతను, రత్నమయంబగు కాంచివలనను, బ్రకాశించెడికూలమువలనను విలసిల్లునితంబబింబముచేతను, బరస్పర మొరసికొను నుత్తుంగ స్తనద్వయముచేతను, మల్లెల నిరసించుదంతపంక్తిచేతను,సంపెంగను ధిక్కరించునాసికచేతను, మందహాసముచే విలసిల్లు చూపులచేతను, నల్లని ముంగురులచేతను, మిగులఁ బ్రకాశించుచుఁ జూపఱకు మోహము గలిగించుచు సిగ్గుచేఁ దనశరీరమును డాచుకొనుచు, మెలఁగుచున్న స్త్రీగాఁ దలంచుకొని యనురులందఱును గామమోహితులై దానిం గూర్చి యిట్లు పలుక నారంభించిరి.అయ్యారె! దీనిసుందరాకారము

ను, దీనిలావణ్యాతిశయమును, దీనినవయౌవనమును గోరుచున్న మాలో నొకరినైన వరింపకపోవుచున్నదేమి? అని యిట్లు తలపోయుచు దానిని సత్కరించి ప్రణయముమీరనఁ గుబుద్ధులై యిట్లడిగిరి."ఓలలనామణీ! నీవు దేవతవా? లేక మనుష్యస్త్రీవా? లేక మఱియొక జాతిదానవా? ఓసుశ్రోణి! నీ వెవ్వరికుమారికవు? ఇక్కడ నీ వభిలషించుపదార్థ మేమున్నది? నీవు నీసౌందర్యమునెడు నమూల్యవస్తువును గ్రయార్హముగానుంచి, యీవస్తువును గొన శక్తిచాలనిదార్భాగ్యవంతు లగుమమ్మును, బాధించుచున్నావు.నీ వేజాతి స్త్రీవయిన నేమి? మా భాగ్యవశమున నీసందర్శనము లభించినది. నీవు కందుకక్రీడచే నిన్ను వీక్షించుచున్న మా చిత్తంబుల హరించుచున్నావు. ఓసుందరీ! ఎగిరి క్రిందఁబడుచున్న కందుకమును గరతలముచేఁ దూలించుచున్న దానవగుటచే నీపాదపద్మములొక్కయెడను నిలువఁజాలకున్నవి. బలిసినస్తనద్వయమువలన భీతిచెంది కృశించి నీమధ్యము మిగులఁ గష్టపడుచున్నది. నీదృష్టిమందముగాఁ బ్రసరించుచున్నది. విడిపోయి జీరాడుచున్న నీసుందరకేశకలాపమును బంధింపుము." అనియిట్లు రాక్షసులు మోహావిష్టులయి సాయంసంధ్యను భామినిగాఁ దలంచికొనుచు నాసంధ్యను బట్టుకొనిరి. అది చూచి సరసిజాననుఁడు మిగులసంతసముచెందెను.అనంతరము బ్రహ్మ యభిప్రాయవిశేషముచే గంభీరముగా నవ్వి తన్ను నాఘ్రాణించుకొనుచుఁ గాంతిచేత గంధర్వులను నచ్చరలను బుట్టించి యాస్వభావమును విసర్జించెను. అది కాంతిబహుళమయిన ప్రాక్సంధ్యయయ్యెను. దానిని విశ్వావసువు మొదలగు గంధర్వాప్సరోగణంబు చేకొనియె. పిమ్మట బ్రహ్మ నిద్రారూపంబయినస్వభావంబుదాల్చి పిశాచ

గుహ్యకులను సృజించి వారందఱు ముక్తకేశులయి, దిగంబరులయి యుండఁజూచి నేత్రముల నిమీలించి దానిని విసర్జింపఁగ దాని వారలు కైకొనిరి. వార లట్లు జృంభణాఖ్యముగు స్వభావమును దాల్చినవా రగుటచేత దానిచే భూతములందు నిద్రయు నింద్రియవిరసత్వమును జూడఁబడుచున్నది. అనంతరము బ్రహ్మ బలవంతునిగాఁ దలంచుచు సాధ్యగణములను, పితృదేవతలను ననభిముఖుండయి సృజించెను. అంత సాధ్యులు పితృదేవతలును, బలరూపకాయంబులను బొందిరి. అందువలననే సంతానవృద్ధి నపేక్షించువారును, బలము నపేక్షించువారును వారలను బూజించుచుందురు. అనంతరము బ్రహ్మ తిరోధానశక్తి నవలంబించి విద్యాధరులను సిద్ధులను సృజించెను. ఇట్లు సృజించి వారలకుఁ దిరోధానశక్తిరూపమయిన యాస్వభావము నర్పించెను. కావునను వారలు తిరోధానశక్తిప్రధానులయిరి. పిమ్మట బ్రహ్మ తనప్రతిబింబమును జూచుచుఁ గిన్నరకింపురుషాదుల సృజించెను. అట్లు సృజించి వారలకుఁ బ్రతిబింబరూపమయినదాని నొసంగినదానిని వార లవలంబించిరి. కావున వారు బింబప్రతిబింబముల కున్నంతయభిమానమును వహించి ద్వంద్వములుగా వర్తించుచు, నా బ్రహ్మను బ్రాతఃకాలములయందు గానము చేయుచుందురు. తరువాత బ్రహ్మ సౌకుమార్యముగల దేహమును ధరించి శయనించి తనసృష్టి వృద్ధి కాకపోవుటకు మిగులఁ జింతించుచుఁ, గొంతవడికిఁ గోపము తెచ్చికొని బహుచింతారూపమయిన యాశరీరమును విడిచెను. అందువలన జాతినకేశము లహిశ్రేష్ఠములయ్యె. పిమ్మట నుపసర్పించుచున్నయా దేహమువలన నతివేగముగల నాగము లుద్భవించినవి. అనంతరము కమలాస

నుండు తన్నుఁ గృతకృత్యునిగా భావించి తనమనస్సువలనఁ బ్రజల సృజింపఁజాలినమనువులను సృజించి వారలకుఁ బురుషాకారమయిన దేహము నొసంగెను. అంత వార లాశరీరమును గ్రహించి బ్రహ్మవలెనే పురుషాకారదేహవిశిష్టు లయిరి. అంత వారలను జూచి మొదట సృష్టింపఁబడిన వారందఱు బ్రహ్మను సమీపించి 'దేవా ! నీ వెనరించిన యీపురుషసృష్టి మిగుల బాగుగ నున్నది. మోక్షసాధకములయిన కర్మములన్నియుఁ బురుషులే యాచరింపవలసియున్నవి. కావున మా కట్టి పౌరుషదేహ మర్పించినచో దానితో భోగజాత మనుభవించియుందుము. నీసృష్టి మిక్కిలి బాగుగ నున్న'దని నుతించిరి. అనంతరము బ్రహ్మ జితేంద్రియుఁడయి సమాధియోగము నవలంబించి ఋషిగణంబుల సృజించె. ఆఋషుల కందఱకుఁ దనశరీరంబులోని యొక్కొక్క భాగ మొక్కొక్కనికి నర్పించెను. ఆశరీరభాగములు తపోవిద్యాసమాధిరూపములు కావున వారందఱు నణిమాద్యష్టసిద్ధులు గలవారలయి విషయములకు విముఖులయి ప్రవర్తించుచున్నారని" మైత్రేయుండు విదురున కెఱిఁగించిన నతండు పరమానందభరితుండయి గోవిందుని చరణారవిందంబుల డెందంబునం దలంచుకొనుచు మైత్రేయునుఁజూచి యిట్లనియె. ఇది యిరువదవయధ్యాయము.

"ఓ మునీంద్రా ! స్వాయంభువమనువువంశంబు సత్పురుషులందఱిచే వర్ణింపఁదగినది. ఆస్వాయంభువవంశమందు మైథున క్రియవలనఁ బ్రజావృద్ధి యెట్లాయెనో తెలియఁజెప్పుము? స్వాయంభువమనువు కుమారులయిన ప్రియవ్రతుఁడు నుత్తానపాదుఁడును సప్తద్వీపయుతమయిన భూమిని ధర్మ మతిక్రమింపకుం

డ నెట్లుగాఁ బరిపాలించినారు? అతనికుమారికయయిన దేవ
హూతి కర్దమునికి భార్యయయ్యె ననిచెప్పితివి? మహాయోగియు
సంసారవిరక్తుఁడు నయినయాకర్దముఁ డెట్లుగా దేవహూతిని బెం
డ్లియాడెను? అమ్మహాముని దేవహూతియందు నెందఱిపుత్త్రులం
బడసెను? మఱియుఁ జతుర్ముఖునికుమారుఁడయిన దక్షుఁడు మ
నుపుత్త్రియయిన ప్రసూతిని బెండ్లియాడి ప్రజాసృష్టి నెట్లుగా వివ
ర్ధించెను?" అని యడుగుచున్నవిదురుని ప్రశ్నముల నాలకించి సం
తసించి యతని కిట్లనియె. బ్రహ్మదేవుఁడు ప్రజాపతుల సృజించిప్రజా
సృష్టి వృద్ధిచేయుఁడని నారలతోఁ జెప్పెనని యిదివఱలోనే చెప్పి
యున్నానుగదా? ఆప్రజాపతులలోఁ గర్దముండు తనతండ్రి చెప్పి
నట్లు చేయఁ దలంపు గలవాఁడయి సరస్వతీనదిచెంతకుఁబోయి భ
గవంతు నుద్దేశించి పదివేలవత్సరంబులు ఘోరంబగుతపంబు నా
చరించెను. ఇట్లు కర్దముఁడు ఫలాపేక్ష లేకుండ వర్ణాశ్రమముల కు
చితముగాఁ జేయఁబడు భగవదారాధనచేతను, భగవదుపాసనచే
తను, వరప్రదుఁడగు భగవంతుని సేవించె.అంత భగవంతుండగు
నారాయణుం డతనితపంబునకు సంతోషించి పంచోపనిషద్వే

నారాయణుండు కర్దమునకుఁ బ్రత్యక్షమగుట.

ద్యమయి, సౌకుమార్యాద్యనంతకల్యాణగుణములుగల దివ్యమం
గళాకృతితో నతనికిఁ బ్రత్యక్షమాయెను.ఆ నారాయణుఁడు పర
మపావనుండు. అతఁడు కోటిసూర్యప్రకాశముకలవాఁడు. అతఁ
డు పద్మములచేతను గలువలచేతఁ గూర్పఁబడిన మాలికలు
వాఁడు. అతనిముఖపద్మము భృంగసదృశమయిన ముంగురుల
చేరంగారుచుండెను. అతనికట్టుపుట్టము మిగులఁ గాంతికలదయి
చూపఱకుఁగనులపండువు లొనరించుచుండెను. అతనిశిరంబువఁ

గిరీటము చంద్రసంకాశమయి వెలయుచుండెను. అతనికర్ణయు గళంబున మణిమయములయిన మకరకుండలములు ప్రకాశించు చుండెను. అతనిభాహుత్రయమునను గ్రమముగాఁ జక్రము, శంఖము, గదాదండము, విలసిల్లుచుండెను. అతని నాల్గవకరంబు నఁ దెల్లఁగలువ యనుక్రీడాసాధనము ప్రకాశించుచుండెను. కరుణారసపూరితములగు నతనిచూపులు మిగుల మనోహర ముగా నుండెను. అతనిపాదపద్మములు గరుత్మంతుని యంసభా గమునఁ బ్రకాశించుచుండెను. అతనివక్షస్థలము శ్రీవత్సకౌ స్తుభములచే నలరుచుండె. ఇట్టి దివ్యమంగళాకారుండయి నారా యణుండు గగనమందుండఁగాఁ బ్రీతిస్వభావుఁడగు కర్దముండు సూచి తనకోర్కి సఫలమయినందులకు మిగుల సంతసించి బద్ధాం జలియయి మధురవాక్యములతో నతని కిట్లనియె. ఓభగవంతా ! ఓవందనీయా ! నీసందర్శనమువలన నానేత్రములకు తపఃఫలం బు లభించినది. మఱియు భవదీయసందర్శనముగూర్చి ప్రయ త్నించి యోగముల నవలంబించి యోగీశ్వరు లనేకజన్మములచేఁ బొందుచున్నారు. అట్టి నీసందర్శనము నాకింత సులభముగా లభించుట నాయదృష్టంబకాదె ? లోకములోఁ గొందఱు మాన వులు నీమాయాపాశములకు లోఁబడి నష్టబుద్ధులయి సంసారన ముద్రమును దరింపఁజేయఁజాలిననీపాదపద్మమనుమహానావను గామలేశముకొఱకయి యుపాసించుచున్నారు. నీవు నిరతిశ య పురుషార్థమగుమోక్షము నిచ్చుచుండఁగా దాని నపేక్షింపక యల్పములయిన విషయసుఖములఁ గోరుకొనుచుందురు. ఇంతయ వివేకు లుందురా? నేనిట్లు లోకులను నిందించుచున్నాను. కాని నే నును మూఢబుద్ధినయి నిరతిశయానందసముద్రమవయిన నిన్నుఁ

బొందియు సుఖలేశమునే యపేక్షించుచున్నాను. ముక్తిదాయకుఁడవయిన నీయనుగ్రహము గలిగినప్పుడు ముక్తికాంతను గోర నిష్టపడక గుణవయోరూపములచే నాకనుకూలురాలయి గృహాస్థాశ్రమసౌఖ్యముల వర్ధించునట్టి కాంతాలలామ నిమ్మని కోరుచున్నాను. నే నెంత దుష్టాంతఃకరణుండనో చూడుము. నావంటి కామకుండు లోకమందు మఱియొకఁ డుండునా? ఆ స్వల్పఫలము నపేక్షించియే సమస్తపురుషార్థములను సమకూర్చునట్టియుఁ గల్పవృక్షముతో సదృశమయిన నీపాదమూలమును జేరితిని. ఓదేవా! వేదాత్మకమయిన నీవాక్యరజ్జువుచే లోకులు బద్ధులయి సంసారాభిలాషులయి, త్రివర్గఫలములనే యధికముగా మగించుచుఁ బశువులవలెఁ దిరుగుచుందురు. నేను నట్టి సాంసారికులయిన లోకుల నాశ్రయించితిని. ఓదేవా! కాలస్వరూపుఁడవయిన నీకుఁ బూజ లొనర్చుచుందును. ఈ సాంసారికులగు లోకుల ననుసరింప నాకిష్టము లేకపోయినను మాజన కాజ్ఞ దాఁటి వలనుపడదు. నే నేమిసేయుదును. కాలస్వరూపుఁడవయిన నీవు నిరర్థజన్ములయిన సంసారులయాయువును క్షయింపఁ జేయుదువఁట! నేను నట్టి సంసారులనే యనుసరింపనున్నాను. కావున నాయందు దయయుంచి నాయాయువును క్షయమును బొందింపకుండుటకై నీకీపూజ లొనర్చుచున్నాను. నేను భవదీయాజ్ఞ మీఱకుండుటకయి సంసారము నవలంబించుచున్నాను. కాని కామసుఖంబు లనుభవింపఁదలంచి కాదు. ఆకారణంబుననయినను నాయందు దయ యుంచి నా యాయువును దఱిగింపకుము. ఓయీ! నీయాయువును క్షయింపఁ జేయ నాకేమి శక్తియున్నది? అని యందువేని చెప్పెద వినుము. కాలచక్రము

నీచేతిలో నున్నది. అది యధికమాసముతోఁ గూడి పదుమూడుమాసము లనునరములుకలది. ఆచక్రము మున్నూటయఱు వదిమూడుదినంబు లను పర్వంబులు కలది. అది ఋతుషట్కమనెడి నేమి కలది. అయ్యది చాతుర్మాస్యత్రయమనునాభితో నొప్పుచుండును. అయ్యది ఋణములు లవములు ననెడి పత్రములు గలది. అట్టికాలచక్రము కాలాత్మకమగు మహావేగము కలదయి యుత్తరంబయిన బ్రహ్మంబునందు సదా తిరుగుచుండును. ఆచక్రమే సమస్తజీవుల యాయువును గ్రసించుచుండును. అట్టి చక్రము నీచేతిలో నున్నప్పుడు జీవుల యాయువు నెచ్చించుటకుఁ దఱిఁగించుటకు నీకేశక్తి గలదు గాని మతియెవ్వరికిఁ గలదు? కావున నన్ను దయఁజూచి రక్షింపుము. వెనుకటికాలచక్రంబుచే నీవు కామాభిభూతులయి పశుప్రాయులయినవారి యాయువుల హరించుచుందువు కాని మూఢులయిన సంసారులను, వారి ననుసరించినవారిని జేరక భవదీయసత్కథలను నమృతరసమును ద్రావి విసర్జితదేహధర్ములయినవారలయాయువు నెంతమాత్రము హరింపఁజాలవు. అదికారణంబున నన్ను సాధారణసాంసారికు నిగతిఁ జూడక యనుగ్రహించి రక్షింపుము. నన్నట్లు దయఁజూతువనియే కాలచక్రశరీరుఁడవై యాశ్రితకల్పవృక్షమవగు నీపాదమూలమును జేరితిని. ఓయీ! బ్రహ్మరుద్రాదులుండఁగా వారల నందఱిని విడిచి నన్నుఁ జేరెదవేల? అందువేని చెప్పెదను విను. ఓదేవా! సృష్టికిఁ బూర్వమందు నామరూపవిభాగములఁ జేయఁదగనంతస్థూలదశలోనున్న చిదచిత్తులును గాలమును శరీరముగాఁగల * నీ వొక్కఁడవేయుంటివి. పిమ్మట నీవు నామరూపముల

* ఓయీ! సృష్టికిఁ బూర్వమందుఁ బ్రకృతిపురుషశరీరుఁడయిన పరమపు

విభాగింపఁగాఁ దగినంత స్థూలావస్థనుబొందిన చిదచిత్తులచేఁ బ్ర కాశించుచుఁ బ్రపంచకంబును సృజింపఁ దలఁచి,స్వరూపమువలన ను, స్వభావమువలనను, నీకంటె నెక్కుడుభేదము గలిగినదయ్యు, స్వశరీరభూతమగు ప్రకృతిని బురస్కరించికొని, స్వశక్తిచేతనే తంతువుల సృజించుచుఁ దిరుగ నుపసంహారముచేయుచు వర్తించు సాలెపురుగుచందంబున, నీవును స్వశక్తిచేతనే యాత్మయందు లోకమును సృజించుచుఁ, బాలించుచు, సంహరించుచు, నున్నా

ఱషుఁ డొక్కఁడేయున్నాఁడనియు, నతఁడు తనయందే సమస్తప్రపంచమును సృజించుచున్నాఁడనియుఁ జెప్పితివి. ఇందువలన భగవంతుఁ డొక్కఁడే జగం బున కుపాదానకారణమును నిమిత్తకారణము నగుచున్నట్లు తెలియవచ్చుచు న్నది. ఇది యనుభవసిద్ధముగాలేదు. లోకములో నొకకార్యమున కుపాదా నకారణ మొకవస్తువగుచున్నది. నిమిత్తకారణము మఱియొకవస్తు వగుచున్న ది. కుమ్మరి కుండలను జేయుచున్నాఁడు.ఆకుండలకుఁ గుమ్మరి నిమిత్తకారణము గాఁగా, మన్ను పాదానకారణ మగుచున్నది.అంతియెకాని నిమిత్తోపాదా నకారణత్వములు కేవలము మంటియందుగాని కేవలము కులాలునియందుఁగాని లేవు. అట్లుండ భగవంతుని కొక్కనికే నిమిత్తోపాదానకారణత్వము లంగీక రించుట యెట్లని '' అందువేని చెప్పెదవినుము. ఇక్కడఁ గులాలదృష్టాంతము భగవంతునికి సరిఁదు. కులాలుఁడు సర్వశక్తులు లేనివాఁడు కావున వాఁడు నిమిత్తకారణమేకాని యుపాదానముకాఁడు.మృత్తు జడమగుటచే నుపాదా నమేకాని నిమిత్తముకాదు. భగవంతుఁడట్లుగాక "పరాస్యశక్తి ర్వివిధైవ శ్రూయతే"అనిచెప్పినట్లు సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వాదులగు ననంతకల్యాణగుణ ములు గలవాఁడగుటచే నామరూపవిభాగానర్హసూక్ష్మచిదచిద్వస్తుత్వరూప గుణముచే నుపాదాన మగుచున్నాఁడు.ప్రకృతిపురుషకాలములకు నియంతయ గుచున్నాఁడు. కావునఁ దాదృశనియంతృరూపగుణముచే నిమిత్తకారణ మగు చున్నాఁడు. అందువలన భగవంతున కుభయవిధకారణత్వ మంగీకరింపవచ్చు.

వు. అందువలన నీవేజగత్కారణమవు. కారణపదార్థమే ధ్యానార్హమయినదని పెద్దలు చెప్పుటను విని నేను బ్రహ్మాదులను విడిచి జగత్కారణమవయిన నిన్నును ధ్యానించుచుఁ బెండ్లాడ నభిలషించి నీపాదమూలమును జేరితిని. ఓభగవంతా! నీవు స్వసంకల్పముచే నహంకారమును ముందుగ సృజించి, దానివలన, శబ్దాదితన్మాత్రలను, వానివలన భూతములను సృజించితివి. భూతసృష్టికహంకారము కారణమగుటచే మావంటిజీవులందఱును దానికి వశ్యులై నీపరమపదము నభిలషింపక యిట్లితుచ్ఛసుఖము లనుభవింపఁగోరుచున్నారు. ఇట్లు నేను భవత్పరమపదము నభిలషింపకపోయినను, బ్రకాశించుతులసీమాలగల నీయాశ్చర్యవిగ్రహమును చూచినప్పుడె నీపదము నొందింపఁదగినయనుగ్రహంబునకుఁ బాత్రుండనైతిని. కావున నీ వట్టియనుగ్రహంబుచేఁ గోరకున్నను నాకు నీపదప్రాప్తి గలిగింపకమానవు. ఓ పరమపురుషా! మావంటివారి ననుగ్రహింపఁ బాటుపడుచు, స్వాత్మానుభవముచే జగద్వ్యాపారరూప ప్రయోజనంబునం దపేక్ష లేనివాఁడవయ్యు స్వసంకల్పముచేతనే జగద్వ్యాపారంబుల నెఱవేర్చుచు, నీయారాధనను స్వల్పముగాఁ జేసినను నట్టిపురుషునికోర్కులఁ దీర్చుచు,వందనీయమగు పాదారవిందంబులు గలిగియున్న నీకు వందనంబులు గావించుచున్నాను.''అని సత్యముగాఁ బలుకుచున్నకర్దమ ప్రజాపతిని వీక్షించి గరుత్మంతునిస్కంధమందుఁ బ్రకాశించుచున్న నారాయణమూర్తి ప్రేమాతిశయముచేతను,మందహాసముచేతను, విలాసములఁజెందియున్న కనుబొమలు గలవాఁడయి

నారాయణుఁడు కర్దమునికి వరంబు లొసంగుట.

తేనెలొలుకుచున్న కులుకుపలుకులచేఁ గర్దముని కిట్లనియె. "ఓము

నీంద్రా!సుందరకన్యాప్రార్థికయి పరమనిష్ఠాగరిష్ఠుండవయి శమదమాదిసుగుణసంపన్నుండవయి నన్నుఁగూర్చి ఘోరతపంబు చేసితివి. నన్ను సంతసింపఁజేసితివి. నీతపంబునకు మెచ్చితిని. నీయభిప్రాయంబంతయు నాకవగతంబయినది. నీయభిప్రాయము వింతకుముందే సంఘటించితిని. ఓమహానీయా! నాయారాధన మొకానొకప్పుడును నిష్ఫలంబుకాదు.సామాన్యులొనర్చిన యారాధనముగూడ నిష్ఫలము కాదని చెప్పనలసియున్నప్పుడు నియతేంద్రియులు, నిష్ఠాగరిష్ఠులునగు మీవంటివార లొనర్చిన యారాధనము న్యర్థముకాదని వేఱచెప్పనలయునా! బ్రహ్మకుమారుఁడగు స్వాయంభువుండను చక్రవర్తికలఁడు. అతఁడు మంగళాచారములచేఁ బ్రఖ్యాతిచెందియున్నాఁడు. అతఁడు బ్రహ్మావర్తమందు నివసించి సప్తసముద్రమధ్యగతమగు భూమండలమును బరిపాలించుచున్నాఁడు. అతనికి శతరూపయను నామముగలభార్యయు దేవహూతియను నొకకుమారీరత్నముం గలరు. ఆతని కూఁతురగు దేవహూతి లోకంబునఁగల సౌందర్యవతులలోను త్తమురాలని చెప్పవచ్చును. ఆమెగుణములు నిరుపమానములు. ఆమె సత్ప్రవర్తనను జూచి పెద్దలుకూడ నేర్చికొనవలసియున్నది.ఆమె యిప్పుడు వివాహార్హయయి యున్నది.వివాహార్హయగు కుమారికఁజూచి స్వాయంభువుండు తగిన వరునికర్పింపవలయు ననియాలోచించుచున్నాఁడు. ఆతఁడు నీగుణగణంబులును నీప్రభావమును విని నీకుఁ దనకుమారిక నర్పింపఁదలంపుతో శేపటిదినముభార్యాపుత్రికలతోఁగూడికొని నీయాశ్రమమునకు వచ్చి నీకర్పింపఁగలండు. ఇందులకెంతమాత్రము సందియములేదు. ఆసుందరకన్యక నిన్నుం బరిణయమాడి చిరకాలము

నుండి భోగానక్తుడవయిన నీతోఁగూడి చిరకాలమునుండి యను భవింపవలసినకామముల నన్నియును క్షణమాత్రములోనే యను భవింపఁగలదు. ఆమెతోఁ గ్రీడించుచుఁ గాలమంతయు నవలీలఁ గడపఁగలవు? ఆమెయందు నీకుఁ దొమ్మండ్రుపుత్త్రికలు గలుగుదురు. ఆపుత్త్రికలను మరీచ్యాదులు పరిగ్రహించి వారలయందు వారు వెక్కండ్రంబుత్త్రులఁ బడయఁగలరు. ఓమునీంద్రా ! నీవు మదాజ్ఞానుసారముగా సమస్తకార్యములను నెఱవేర్చి యాకర్మకలాపము నాయం దుంచి మదీయభక్తిపరుండవయి పిమ్మట నన్నుఁ బొందఁగలవు. జితేంద్రియుఁడ వయిననీవు సమస్తప్రాణులయందు దయాళుండవయి యందఱికి నభయప్రదానం బొనరించుచు, నాత్మజ్ఞానపరుండవయి నాయందు సమస్తచరాచరరూపమయినజగత్తును నందులకు విలక్షణుఁడనయ్యు నందంతరాత్మనై ధారకుఁడనయి శాసకుఁడనై యున్ననన్నును జూడఁగలవు! నేను నాయంశాంశముచే నీ భార్యయగు దేవహూతియం దవతరించి యామెకుఁ బ్రకృతిపురుషేశ్వరవిభాగమును దెలియఁజేయునట్టి సంహిత నుపదేశింతును." అని యిట్లు కర్దమునికి వరంబు లొసఁగి యింద్రియజన్యజ్ఞానము నధఃకరించినభగవంతుఁడు బిందుసరోవరతీరమందలి కర్దమాశ్రమంబును విడిచి కర్దముఁడు చూచుచుండ సమస్తయోగీశ్వరులచేతను నుతింపఁబడుచు మార్గమధ్యమందు సమస్తదేవతలు నొనరించుస్తోత్రముల నాలకించుచు, గరుడవాహనారూఢుండయి వైకుంఠమునకుఁ బోయెను. అనంతరము కర్దముండు భగవంతుండు నిర్దేశించినకాలమున స్వాయంభువమనువు త్పన్న వచ్చుననితలంచి యాతనిరాకకయి బిందుసరోవరమునొద్ద వేచియుండెను. అంత స్వాయంభువమనువు కన

కమయాలంకారములచే నలంకృతమగు రథంబుపయిఁగూర్చుండి భార్యాపుత్రికలనందుగూర్చుండఁబెట్టికొని భూమండలమునంతను గలయఁ ద్రిమ్మరుచు భగవంతుఁడు నిర్దేశించినదినమందే యాకర్దమునియాశ్రమంబునకు వచ్చెను. ఆతనియాశ్రమము మిగుల

స్వాయంభువమనువు కర్దమాశ్రమంబున కేఁగుట.

మనోహరముగా నుండెను. మఱియుఁ గర్దమప్రజాపతియందున్న దయాతిరేకమునలన భగవంతునికన్నులనుండి యానందబాష్పములు బయలువెడలి యచ్చటిసరస్సులోఁ బడెను. ఆకారణంబునఁ జే యానసరస్సు బిందుసరోవరం బని ప్రసిద్ధికాంచినది. ఆ బిందుసరోవరమును సరస్వతీనది చుట్టుకొని యున్నది. అది చూపఱకుఁ బుణ్యమునొసంగును. అది, యమృతతుల్యములయి రోగప్రదములుకాని నిర్మలజలముచే నలరుచుండెను. మహర్షులు ప్రతిదినము నచ్చటకు వచ్చి సంధ్యావందనాదినిత్యకృత్యముల నెఱవేర్చుకొనుచుందురు. కర్దమాశ్రమమట్టిసరోవరంబున కాశ్రయమయి ప్రకాశించుచుండె. అందున్నవనపంక్తులు, మధురముగా ధ్వనిచేయుచు, మిగులఁ బవిత్రములయియున్నపక్షినికరములచేనిండి, షడ్ఋతువులందు నుత్పన్నములగు పుష్పఫలాదులచే నలరుచుండెను.అందుమదించినపక్షులరుతము లంతటను విలసిల్లుచుండెను. గండుతుమ్మెద లందు ఝంకారములొనర్చుచుఁ ద్రిమ్మరుచుండెను. మత్తమయూరము లనెకనటులనాట్యము,లందెల్లయెడలఁ జెలంగుచుండెను.అందుఁ గోకిలలు మృదుమధురస్వరములతోఁ బరస్పరముం బిలుచుకొనుచుండెను. ఆయాశ్రమము కదంబవృక్షములచేతను, నెమ్మిచెట్లచేతను,నశోకతరువులచేతను, వకుళమహీరుహములచేతను, నలంకృతమయి మనోహరముగా

నుండెను. అందుఁ గన్నెలేడిపిల్లలును, నీటికోళ్లును, రాజహంస లును, సారసపక్షులును, చక్రవాకములును, జక్కోరములును, మధురముగా ధ్వనిచేయుచు విహరించుచుండెను. ఆవనమందు, లేళ్లును, వనసూకరములును, నేఁదుఁబందులును, గవయమృగములును, మతంగములును, బ్లవంగములును, గోపుచ్ఛములనెడి మర్కటవిశేషములును, సింహములును, శరభంగులును, గస్తూరీమృగములును, మిక్కుటమగుసంతసముతో నడయాడుచుండెను. ఇట్లనేకవిధములచేఁ జూపఱకు సంతసము గొలుపుకర్దమప్రజాపతియాశ్రమము నాస్వాయంభువమనువు ప్రవేశించి యనుచరసమేతుఁడయి పోయిపోయి యగ్నిహోత్రంబుల నిర్వర్తించికొని సుఖంబుగా నచ్చట నానీనుండయియున్న కర్దమునిఁ బొడగాంచెను. ఆమునీంద్రుండు మూర్తీభవించినతపంబువలెఁ బ్రకాశించుచుండెను. అతఁడు నిరశనుండయి చిరకాలము తపం బాచరించినను భగవదనుగ్రహమువలన మిక్కిలి కృశించియుండక యతండువలికిన వచనామృతరసము ద్రావినవాఁడగుటచేఁ గ్రమముగా బలియుచుండెను. అతనినేత్రములు పద్మపత్రములను బోలుచుండెను. అతనికటిప్రదేశమున నారచీర రంగారుచుండెను. అమ్మునీంద్రుండు నివుఱుగప్పిన నిప్పుచందమునను, మెఱుఁగుపెట్టనిరత్నంబువిధంబునను వెలయుచుండెను. ఇట్లు వెలయుచున్నయమ్మునీంద్రునిఁజూచి సంతసించి స్వాయంభువమనువు పర్ణశాలను సమీపించి యాతనిపాదపద్మముల కభివందనములు సలిపెను. అంతఁ గర్దముండు తనకు నమస్కరించినస్వాయంభువునకుఁ బ్రతివందనము గావించి తత్కాలోచితమగుపూజలచే నాతని సత్కరించెను. అట్లు కర్దమునివలనఁ బ్రతిపూజఁ గైకొని మానియై స్వాయంభు

వుం డుచితాసనమునఁ గూర్చుండియుండఁ గర్దముఁడు భగవదా
దేశమును స్మరించుకొనుచు,మధురవాక్యములచే నతనికిట్లనియె.
'ఓసార్వభౌమా ! విష్ణువుపాలకత్వశక్తి నీయందుండుటంబట్టి నీవు
భూమండలమునందుఁ బరిభ్రమించుచు దుష్టులశిక్షించుచు శిష్టుల
రక్షించుచున్నావు. ని న్నంతశక్తిమంతునిగాఁ జేసినవాఁడు నారా
యణుండేకదా ? జగత్పరిపాలనావసరము వచ్చినప్పుడు సూర్య
చంద్రులయు, నింద్రాగ్నివాయువులయు, యమవరుణులయు
రూపంబులనొందుచు నిర్మలాత్ముఁడయియున్నమహాత్మునకు నేను
సర్వదా యభివందనములు చేయుచున్నాను. మఱియు మణిగణస్థ
గితమయినరథమందుఁ గూర్చుండి శత్రువులకు భయముగొలు
పఁజాలు కోదండమునుధరించి టంకారము గావించి చోరులహృ
దయముల నవియింపుచు, నీసేనాసమూహముల పాదతాడన
ములు భూమండలమును జలింపఁజేయ నెల్లయెడలఁ బరిభ్రమిం
చుచు, సూర్యునివలెఁ బ్రకాశించుచు, భగవత్కల్పితములయిన
వర్ణాశ్రమధర్మములను బరిపాలించుచు, లోకమునందలిప్రజలకుఁ
జోరాదిబాధలు కలుగకుండఁ గన్నకుమారులరీతిం బొడగాంచి
పాలించుచున్నావు. నీ విట్టిపనికిఁ బూనుకొనని చో లోకమంత
యుఁ గేవల మర్థకామపరాయణు లగుదుష్టుల యధర్మముచేత
భగవద్రచితములగు మర్యాదలు చెడిపోవును. ధర్మము మును
ముట్ట నశించును. అట్లు ధర్మపాలనానక్తుఁడవయిన నీవు నాయా
శ్రమంబునకు రాఁబనియేమి? నీవేమియడిగినను నందులకు నేను
నిష్కపటహృదయనుతో నంగీకరించి నీయభీష్టము నెఱవేర్చెద
ను. అనియిట్లు కర్దముండుపలుక నతఁ డొనర్చిన యాత్మస్తవం

బునకు సిగ్గుపడుచు మహానుభావుడయి నివృత్తిధర్మనిష్ఠుడయిన యమ్మని కిట్లనియె. ఇది యిరువదియొకండవ యధ్యాయము.

"ఓ మహాత్మా! వేదమయుడయి చతుర్ముఖశరీరకుడగు పరమాత్మ తనముఖమువలన విషయసుఖములయం దాసక్తులు కాక దపోయోగాదుల కాకరు లగుమీవంటిమహాత్ములను వేద రక్షణముకయి సృజించినాడుకదా? పిమ్మట వేదమార్గముల నాయామర్యాదలలో నుంచుటకును, మీవంటిమహాత్ములకు దుష్టుల వలన బాధలు గలుగకుండ రక్షించుటకును, జతురాననుండు క్షత్రియులమగు మమ్మును దనబాహుసహస్రమునుండి సృజించినాడు. కావున బ్రహ్మకు బ్రహ్మకులము హృదయమనియు క్షత్రికుల మంగమనియుఁ జెప్పదురు. వేదముల రక్షించుటకు మిమ్మును, మిమ్ముల రక్షించుటకు క్షత్రియులమయిన మమ్మును, సృజించియుండుటంబట్టి మనము మనకు విహితములయినకార్యముల నొనరించుచుండ మనల నుభయులను గార్యకారణాత్మకుడయిన నారాయణుండు రక్షించుచుండును. మీసందర్శనంబువలననే నా సంశయములన్నియు దూరముగాఁ దొలంగినవి. నా పూర్వపుణ్యాతిశేకమువలన దుష్టులకు దర్శనమొనంగనినీ సందర్శనము చేయఁగంటిని. నీపదపద్మముల యందలిపరాగమును దలయం దిడుకొనఁజాలితి. మఱియు నాపుణ్యాతిశేకముచే మీవంటిమహాత్ముల యనుశాసనాదిరూపమగు ననుగ్రహంబునకుఁ బాత్రుండనయితి. మనోహరములగు నీ మధురవాక్యములను వినఁ గలిగితిని. నాకుమారికయందున్న ప్రేమాతిశయముచే నా మెకుఁదగినభర్త లభించునో లభింపఁడో

యని మిగుల వగలఁబొగులుచు నీనుండనయిన నేను విన్నవించు కొనునర్థమును గృపచేత నాకర్ణింతువుకాక. ఈ కన్యాలలాను ప్రియవ్రతోత్తానపాదుల తోఁబుట్టుపడుచు. ఈమె నాప్రియపుత్రిక. ఈమె ప్రాయముచేతను, సౌందర్యముచేతను, సద్గుణములచేతను దన కనుకూలుఁడగు భర్తగావలయునని కోరుచున్నది. ఈమె నారదునివలన నీసద్గుణములను నీప్రభావమును, సౌందర్యమును, నీవిద్యాతిశయమును విని నిన్నుఁదక్క మఱియొకని పెండ్లాడ నని నిశ్చయించుకొన్నది. ఓ మునీంద్రా! గృహాస్థకర్మములయందు నీ కిది సర్వవిధముల నుపయోగించును; నీకర్పింపవలె నన్నతలంపుతోఁ దెచ్చితిని; కాన యీ కన్యాలలామను భార్యగాఁ బరిగ్రహింపుము. దైవికముగాఁ బ్రాప్తమయినవస్తువును ముక్తసంగుఁడయిన యోగియయినను దీసికొనకుండుట యుచితముకాదు. అట్లుండఁ గామాభిలాషగలవాఁడు స్వయంప్రాప్త మగువస్తువును దీసికొనకుండుట యుక్తముకాదని వేఱె చెప్పవలయునా? ఇదియునుంగాక దైవికముగాఁ బ్రాప్తమయినవస్తువును దిరస్కరించి పిమ్మట నట్టివస్తువునిమిత్తము కృపణుల యాచించిన వానికీర్తి గొప్పదయినను ద్వరలో క్షీణించును. పరాధీనముచే గౌరవముగూడ నాశనమొందును. నేను నీవు వివాహప్రయత్నము కలవాఁడవయి యున్నావని విని నాకుమారి నర్పింపవలెనని వచ్చితిని. కావున నీమెను నీధర్మపత్నిగాఁ జేకొనుము." అని వేఁడుచున్న మనువుపలుకు లాలకించి మునీంద్రుం డెంతయు స్వాంతమున సంతసించి యతని కిట్లనియె. "ఓ రాజచంద్రా! ఇదివఱలో నెవనికిని వాగ్దత్తకాని నీకుమారికను వరించుట కెంతమాత్రము సందియములేదు. వరించుచున్నాను.

మాయిరువురిదాంపత్యము మిగులఁ దగియుండును. సృష్టిలో మొట్టమొదటిదగు బ్రాహ్మణవివాహవిధి ప్రవర్తిల్లఁగాక. మఱి యుఁ గేవలము లక్ష్మీదేవితోఁ దులదూఁగుచున్ననీకుమారికను బెండ్లాడ నిష్టపడని యవివేకి లోకమందుండునా? ఒకప్పుడు మేడమీఁదిభాగమున కాలనూపురములు గల్లుమనఁ గందుకక్రీడ సలుపుచుండుటచే నేత్రములు చలింప వెలయుచున్న సౌందర్యరాశియునగు నీకుమారిని జూచి విమానారూఢుండయి గగనమార్గమునఁ బోవుచున్నవిశ్వావసు వనుగంధర్వరాజు మోహించి క్రిందఁబడెను. దేవతలకుఁగూడ మోహము కలిగించునటై భర్తను బ్రార్థించుచు, లక్ష్మీకటాక్షము లేనిమానవులచేఁ జూడఁబడనిటై, మహోత్సుడగు నుత్తానపాదునకుఁ జెల్లెలయి, స్త్రీలలో నుత్తమురాలై యున్ననీకన్యాలాభ మెవ్వఁడు వరింపకపోవును? ఆకారణమున నీమెను భార్యగా వరింతును. గాని యొక్కనియ మేర్పఱుపవలసియున్నది. నీకుమారికకు సంతానము కలుగుపర్యంతము నామెతో గృహస్థధర్మముల నడపుదును. ఆమెకు సంతానము గలిగినపిమ్మట నీకుమారిని విడిచి, నివృత్తిధర్మపరుండనయి భగవంతునిచేఁ జెప్పఁబడిన సాత్వికధర్మముల నాచరింప సమకట్టుదును. ఈసమయము నాబుద్ధికృతముకాదు. దేవమనుష్యాది భేదములచే విచిత్రమగుప్రపంచమెవనివలన నుత్పన్నమగుచున్నదో యాప్రపంచమెవనియందు లయమగుచున్నదో, యెవఁడు దానియంతర్భాగమునుజొచ్చి శాసకుఁడయి ధారకుఁడయి వెలయుచున్నాఁడో, బ్రహ్మాదుల కధిపతియగు నాభగవంతునివలననే యిది యేర్పఱుపఁబడినది. కావున నీసమయముభయులచేత నంగీకరింపవలసియున్నది." అని యిట్లు

కర్దముండు పలికి భగవంతుని చిత్తమందుఁ దలంచుకొనుచు మందహాసముచే దేవహూతిమానసమును మోహమున ముంచెను. ఇట్లు పలికినకర్దమునివాక్యముల నాలకించి యందుల కంగీకరించి భార్యాసమేతుఁడయి తనకుమారికను గుణగణసంపన్నుండగు కర్దమున కర్పించి వివాహ మొనరించెను. అనంతరము

స్వాయంభువమనువు తనకుమారి యగుదేవహూతిఁ గర్దమునికిచ్చి పెండ్లిచేయుట.

మనుభార్య యగుశతరూప కూఁతునకు నల్లునకు ననేకములయిన యలంకారములను, గ్రీడోపకరణములను, బహుమానములగా నర్పించి సంతోషము కలిగించెను. ఇట్లు స్వాయంభువుండు తనకుమార్తను సదృశుఁడగుకర్దమున కర్పించుటంబట్టి యమితాసందుండై తనముదులపట్టిని గౌగిలించుకొని పుత్రికావిరహమును సహింపలేక బాష్పములను విడుచుచు నాబాష్పజలముచేఁ గుమారికఁ దాన మూడించుచు నెట్టకేలకు మనంబును దృఢపఱుచుకొని కర్దమునియొద్ద సెలవుకైకొని కూఁతునకు బుద్ధులుచెప్పి భార్యాపరివారసమేతుఁడయి యరదంబు నధిరోహించి తనపురంబునకుఁ బోవుచుండెను. స్వాయంభువుండట్లు పోవుచు నాసరస్వతీనదీతీరముల రెండింటియందు నివసించియున్నమునీంద్రులను, వారల యాశ్రమంబులను బొడఁగాంచుచు, నామున్యాశ్రమములం దున్నపుష్పఫలసంపదల కచ్చెరువొందుచు,నిజపురాభిముఖుండయి చనుచున్నయవసరంబునఁ దన పురజనులందఱు మిగుల సంతసించి సంగీతములతోను, స్తుతిపాఠములతోను,మంగళధ్వనులతోను,నెదురేగిరి.అంత నారాజు తన ప్రజలొసఁగెడిపూజల నందికొనుచు బర్హిష్మతీనామముగల తన

పురంబుసొచ్చెను.ఓవిదురా!ఆపురమునకు బర్హిష్మతి యనునామం బుగలుగుటకుఁ గారణంబు దెలిపెదవిను.పూర్వము నారాయణుండు భూమినుద్ధరించుటకయి వరాహావతారముందాల్చినప్పుడు తన దేహమును జూడింపనతనిరోమములు కొన్ని యచ్చటఁ బడినవి. ఆపడినరోమములు హరితవర్ణములయి కుశకాశములయి సంభవించినవి. ఆదర్భలను, రెల్లును సంగ్రహించి మునులందఱు యూగవిరోధులయినరక్కసులను దిరస్కరించి యూగంబుల హరిప్రీతిగా నొనరించిరి. పిమ్మట మరుభూమిఁ గుశకాశరూపమయిన బర్హిస్సును సంపాదించి యజ్ఞస్వరూపుండయి నారాయణప్రీతిగా నాస్థలంబునఁ బెక్కుజన్నంబు లొనర్చెను. ఆబర్హిస్సులచే నిండియుండి యూగార్హమయి యున్నయాస్థలంబున నొక్కపురంబు ప్రబలెను. ఆపురమునే బర్హిష్మతి యని పిలుచుచుందురు. స్వాయంభువమనువు సమస్తసంపదలతోఁ దులమూఁగు నప్పురంబును బ్రవేశించి తాత్రయరహితమయిన తనభవనంబు సొచ్చి, భార్యాపుత్త్రులతోఁ గూడికొని వర్ణాశ్రమప్రయుక్తమగు భగవదారాధనరూపధనమునకు భంగముగలుగకుండ సమస్తసుఖముల ననుభవించుచు, దేవతామిథునములచే నుతింపఁబడు నిర్మలకీర్తికలవాఁడయి, తానుత్కృష్టుఁడయినను భగవద్భక్తి విడనాడక ప్రతిప్రాతఃకాలములయందు శ్రీహరిసత్కథలను భక్తితో నాలకింపుచుఁ, గాలముగడపెను. స్వాయంభువుఁ డిట్లనుభవించుకామభోగములు కొంచెమైనను నతని వశపఱుచుకొనలేకపోయినవి. మఱియు నాస్వాయంభువుండు సర్వకాలములయందు హరికథాశ్రవణముచేయుచుఁ జాపత్రయమును దొలంగించి డెబ్బదియొకమహాయుగముల కాలపరిమాణముగల తన యంతరము

(స్వాయంభువమన్వంతరము) లో నొకజామయినను వృథాచే యకుండ రాజ్యంబుం బరిపాలించెను. ఆ స్వాయంభువమన్వంత రములో శరీరసంబంధములగు రోగములుగాని మనోవ్యాధులు గాని శీతోష్ణవాతాదులవలనఁ గలిగిన బాధలుకాని శత్రుచోర భయములుగాని లేనివారయి మానవులందఱు మిగుల సుఖము గాఁ గాలంబు గడపిరి. ఓయీ! సంతతము భగవద్భక్తిసంప న్నులయి యున్నయామానవులను బాధలెట్లు చెనకఁగలవు. ఆమ నువు రాజయినను మునీంద్రులకంటె నధికమయినజ్ఞానాతిశ యముకలవాఁడయి యొక్కొకప్పుడు మునీంద్రులును మానవు లును తనకడకు వచ్చి యడుగ వారలకు వర్ణాశ్రమధర్మములను మోక్షసాధనము లగుధర్మములను దెలుపుచుండెడివాఁడు. ఓ విదురా! మొదటిరాజయిన మనువర్ణనీయచరిత్రము నీకు వర్ణించిచెప్పితి. ఇఁక నతనియపత్యమగు దేవహూతీయుత్కర్షను వినుమనిపలికి మెండియు నిట్లనియె. ఇది యిరువదిరెండవ యధ్యా యము.

{కర్దముండు యోగమహిమచే విమానంబు గల్పించుకొని భార్యతోఁగూడ విహరించుట.}

ఓరాజా! మైత్రేయుండు విదురుని కిట్లు తెలిపె. 'ఓవిదురా! స్వా యంభువమనువు తనకూఁతును గర్దమునకిచ్చి వివాహముగావించి తగినహారతాదులనొసంగి తనపురంబునకుఁ జన్నపిమ్మట నక్కన్యా మణి, సుశీలనుకలిగి తనభర్తహృద్గతాభిప్రాయము నెఱింగినదై పార్వతీదేవి పరమేశ్వరునకుఁ బరిచర్యచేసినచందంబున నమ్మహాము నిని బరిచరించెను. మఱియు నమ్మగువ ముమ్మరమ్మగు నమ్మకముచే తను, దనపవిత్రత్వముచేతను, నుదారంబగుగారవంబుచేతను,

నధికమగు నింద్రియనిగ్రహముచేతను, హితాహితములయిన వి షయముల వినవలె నన్నతలంపుచేతను, స్నేహాతిశయముచేతను, మృదుమధురవచనరచనలచేతను, సంయుతయై, కామమును, కాపట్యమును, నిషిద్ధకార్యములను, గర్వమును, లోభమును, ద్వేషమును, విసర్జించి,తనభర్త నియమించినకార్యముల నప్రమత్తతతోఁ జేయుచు మహాతేజశ్శాలియయినతనభర్తను మిగుల సంతసింపఁజేసెను. ఇట్టులాకాంతామణి తనవలననుండి యపత్య మనుఫలమును బొందవలెనని యభిలాషతోఁ బరగుచు పరిచర్య చేయుటంబట్టి మిగులఁ గృశించియున్నయామెంజూచి కర్దముఁడు దయారసమును వెడలగ్రక్కుచు గద్గదము లగునవచనములతో నిట్లనియె. 'ఓసుందరీ! నీవు చేసినపరిచర్యకును, నిరుపమానమయి నభక్తికిని మిగుల సంతసించితిని. మఱియు నీవు నాకుఁ బరిచర్య చేయనవలె నన్నతలంపుతో ననవరతము నాచెప్పినపనుల నొనరించుచు ప్రాణులకు మిక్కిలి ప్రియమయినను శ్లాఘ్యమైన నీమృదు కోమలాంగమును నానిమిత్తము గృశింపఁజేసితివి.తనప్రియునినిమిత్తమయి తనశరీరము నాశింపనియు త్తమురాలినిదివఱకు నేఁజూచి యెఱుఁగను. అట్టియు త్తమురాలవయిన నీసుగుణములనెన్న నాతరముకాదు. నీవు నాకెట్టిలోపములు కలుగకుండఁ బరిచర్యచేసిన కతమున నేనును మదీయవర్ణాశ్రమధర్మములకు విహితములయిన కర్మముల సమాధిని, భగవదుపాసనను, జ్ఞానయోగమును, సంపాదించి, హరిని సంతసింపఁజేసి మఱియు భగవదనుగ్రహమును బొందితిని. అందువలన మనకుఁ గోరినభోగ్యపదార్థములు, శోకభయరహితములగు భోగ్యస్థానములును సంభవింపఁగలవు. నన్ననవరతము సేవించినందులకు నీకు దివ్యదృష్టి నిచ్చుచున్నాను. భగ

వంతునిపూర్ణానుగ్రహమును మనయందుండ మనకింకలోపమేది? కావునఁ జక్రవర్తులచే ననుభవింపఁదగియుండి నీపాతివ్రత్యధర్మ ముపలననే సమకూరి సామాన్యులకుఁ బొంద నలవికాకయున్న భోగముల ననుభవింపుము" అని యిట్లు పరమకృపారసభరితుం డయి యమ్మునివరుండు పలుక విస్మయాసుందరీలలామ తపోయో గములయందు నతని కున్ననిరుపమానప్రభావమును, జ్ఞానాతిశ యమును బొడగని మనోవ్యథల నన్నింటిం దొలఁగఁద్రోచి వ్రీడా వలోకనములచేతను, మందహాసముచేతను, సుందరమయినవద నారవిందముకలవయి, వినయప్రేమములఁ బ్రకటించుచున్నము ద్దుమాటలతోఁ దనభర్త కిట్లనియె. "ఓ మునీంద్రా! సఫలముల యినయోగప్రభావముగల నీవు నాకు వల్లభుఁడవయి యుండఁ గా దుర్లభమయినవస్తువు లోకమందుండునని నేఁ దలంపను. ఆ విషయము నాకుఁ జక్కఁగాఁ దెలియును. నీవు సంతానప్రాప్తి యగునంతవఱకుమాత్రమే నన్నుఁ గూడియుంటకుఁ బ్రతినచేసి తివి. స్త్రీలకు భర్తవలన సపత్న్యలాభమును బొందుటకంటె నె క్కుడులాభము మఱియొకటిలేదు. మఱియు నీకొక్కటిఁ దెలిపెద నాలింపుము. నేను మిగులఁ గామపీడితనగుటచే నిట్లు కృశించి యున్నాను. సంభోగాభిలాష నన్ను మిక్కిలి బాధించుచున్నది. నాయాయభిలాషము తీర్పవలయును. కావున నందులకుఁ దగినట్టి మందిరములును భోగ్యపదార్థములును సంపాదింపుము." అనియి ట్లు పలుకుచున్న ప్రియురాలిపలుకుల నాలించి యామెయభీష్టము నెఱింగినవాఁడయి కామగమనముగల యొకవిమానమును యో గమాయాసామర్థ్యమువలనఁ గల్పించెను. ఆవిమానము సమ స్తవరముల నిచ్చుటకు సమర్థమయి యుండె. ఎల్లవిధముల

యిన రత్నములకు నిలయమైయుండెఁ. అందలి సకలసంపద లు త్తరోత్తరాభివృద్ధి గలిగి నిండియుండెఁ. అయ్యది మణిమయము లయిన స్తంభముతోఁ దులదూఁగుచుఁ జూపఱకుఁ గనుపండువులు చేయుచుండెను. అది దేవతాసంబంధములయిన పరికరములతోఁ సంయుతమై యుండెను. అయ్యది సర్వకాలములయందు సుఖము కలిగింపఁజాలియుండెను. అయ్యది యబ్బురంబు గొలుపు పట్టువస్త్రపతాకములతోఁ నలంకరింపఁబడియుండెను. మఱియు నామినూనము మాలారచనకుఁ దగినపుష్పములతోను, నందుండి ధ్వనిచేయుభృంగంబులతోను వెలయు వూలదండలచే నలంకరింపఁబడెను. అది తెలిపట్టుచీరలచేతను, సాధారణపుపట్టువస్త్రములచేతను, దదతిరిక్తములగు మఱికొన్నివస్త్రములచేతను మిక్కిలి ప్రకాశించుచుండెను. తదుపరిభాగమునందున్న గృహములు వేఱువేఱుగాఁ గల్పితములగు శయ్యలచేతను, బర్యంకంబులచేతను, దాళవృంతములచేతను, నర్వాసనములచేతను, మనోహరములయి యుండెను. దానిగోడలం దచ్చటచ్చట శిల్పపుఁ బనులు వెలయుచుండె. అచ్చటచ్చట నింద్రనీలమణిమయము లగు ప్రదేశములందు, విద్రుమస్థగితము లగువేదికలు రంగారుచుండెను. ద్వారములు విద్రుమమయము లగుగడపలచేతను, వజ్రమయము లగుకవాటములచేతను; ప్రకాశించుచుండెను. మఱియు నింద్రనీలమణిమయములగు ద్వారశిఖరములందుఁ గనకకుంభము లమర్పఁబడెను. అచ్చటచ్చట వజ్రఖచితములగు గోడలందుఁ బద్మరాగరత్నములు పొందింపఁబడెను. విచిత్రము లగు వితానములచేతను, హేమమయములయి, కావుననే యమూల్యములయి యున్నబంగారుబహిర్ద్వారములచేతను, నది

యొప్పుచుండెను. అందమర్వఁబడినకృత్రిమహంసలను, గృత్రిమములగు పావురములనుజూచి, సజాతీయములుగా భావించుచు ధ్వనిచేయు హంసపారావతముల నినాదంబులు చెలంగుచుండెను. అయ్యది యథానుఖముగాఁ గల్పితములగు, క్రీడాప్రదేశములచేతను, శయనగృహములచేతను,నుపభోగనిలయములచేతను, గృహబహిర్భాగములచేతను, బ్రాకారబహిర్భాగములచేతను మిగులఁ బ్రకాశించుచుండెను. ఇట్టి విమానరాజమును బొడగాంచియు మిగుల సంతసింపని తనప్రియురాలియభిప్రాయమును సర్వభూతాభిప్రాయములఁ దెలిసికొనుకర్దముండు దెలిసికొని యామె కిట్లనియె. 'సుందరీ! నీయభిప్రాయము నాకవగతమయినది. నీ వీహ్రదమునందుఁ దానమాడుము. ఈహ్రదము భగవంతునియానందబాష్పసందోహముచేఁ గల్పింపఁబడినది. ఈహ్రదము మనుష్యులసమస్తవాంఛలను నెఱవేర్పఁజాలును. కావున నిందుఁ గ్రుంకులిడి విమానమెక్కినచో నీయభీష్టము నెఱవేఱఁగలదు. సందియములేదు. అట్లు చేయుమని పలికిన తనభర్తపలుకులు విని కువలయమువంటినేత్రములుగల దేవహూతి మలినవస్త్రమును,వేణీభూతమయిన కేశపాశమును, మలపంకసంచన్నము లగుస్తనములును, గలశరీరమునుదాల్చిపోయి నిర్మలమయిన సరస్వతీనది కంతరితమైయున్న బిందుసరోవరమును బ్రవేశించెను. ఇట్లాదేవహూతి యాహ్రదంబులో మునిఁగి చొచ్చునప్పటికిఁ గొన్నివందిరములును నావందిరములయందు విహరించుచు నుత్పలమువంటిదేహగంధముగలిగి లేఁబ్రాయముతోఁ దనరు వేగురు స్త్రీలును గానవచ్చిరి.వారలను జూచి దేవహూతి యచ్చెరువు పడుచుండఁగా నాస్త్రీలందఱు నామె

నుజూచి సరభసంబుగలేచి సమీపించి చేతులుజోడించి, "ఓతల్లీ! మేమందఱము నీసేవకురాండ్రము. నీచెప్పినపనులను జేయుటకయి యిక్కడ వేచియున్నాము. ఏమిచేయవలయునో సెలవిమ్ము చేసెదము. అని యిట్లు పలుకుచు నా స్త్రీ లామెను గొనిపోయి శ్రేష్ఠతమమయిన నుగంధితైలముచేఁ దలంటి తానమాడించి నిర్మలములయిన దుకూలములను గట్టనిచ్చిరి. మఱియు నామెకుఁ బ్రియములయి సుందరతమములయి ప్రకాశించుభూషణములనిచ్చి చక్కఁగ నలంకరించి షడ్రసోపేతమయిన యన్నమును సుధారసమువంటిపానమును నొసంగిరి. ఇట్లు దేవహూతి యలంకరించికొని యద్దముచేతఁ గీలించి నిర్మలమయిన వసనములచేతను విచిత్రములయినపూసరులచేతను, దీప్తిమంతములయిన యలంకారములచేతను, మధురముగా ధ్వనిచేయుచున్ననూపురములచేతను, నానేకములయిన చిఱుగంటలచేఁదులదూఁగుచుఁదనకటిప్రదేశము నలంకరించియున్న మేఖలచేతను, నుహార్హములయిన ముత్యాలహారములచేతను, గుంకుమాది మంగళద్రవ్యములచేతను, మిక్కిలి ప్రకాశించుచు సొగసైన భ్రూలతలతోను సుందరదంతరాజితోను, మృదులమయిన క్రేగంటిచూపులతోను, బద్మములఁ దిరస్కరించులోచనములతోను, తుమ్మెదలను మించు నల్లనినెఱికురులతోను వెలయు వదనారవిందమున బొలుపారుచు మలరహితమై, మంగళాకరమయి, కన్యకలచే బహూకృతమయి యొప్పు తనసుందరదేహమును బొడగాంచి తన ప్రియవల్లభుఁడయిన కర్దమప్రజాపతిని దలంచెను. అంత నమ్మహామని స్త్రీలచేఁ బరివృతుండయి వచ్చి యామెచెంత నుపవేశించెను. ఇట్లు దేవహూతి స్త్రీసహస్రముతోఁగూడియున్న

తనయెదుట వర్తించు భర్తను బొడగాంచి యతనియోగము సీమనుగూర్చి మిగుల నబ్బురపడఁజొచ్చెను. అంత నప్రతిమ ప్రభావుఁడగు గర్దముండు వివాహముకంటె ముందున్న రూప మువంటి రూపముతో వెలయుచు ప్రానృతములయి, రుచిరము లయి, యున్న స్తనములుగల దేవహూతినిజూచి మిగుల సంతసించి కామాదులను జయించినవాఁడయిననుఁ, మిక్కిలి మోహమును జెందెను. ఇట్లు మోహావిష్టుఁడై కర్దముండు తనభార్యవలనను దక్కుఁగల స్త్రీసహస్రములవలనను శుశ్రూష కయికొనుచు నావి మానము నధిష్ఠించి యాకాశమునందుఁ దారాగణములతోఁ బ్రకాశించుచు నాకాశస్థుఁడయియున్న చంద్రునివలెఁ బ్రకా శించెను. ఇట్లాకర్దముండాలలనతోఁ గూడికొని గగనమందు సంచరించుచు నష్టదిక్పాలకులకు విహరణీయములును, మలయ మారుతప్రసారమువలనఁ గామోద్దీపకములును, గంగానదీపాత మువలనఁ గర్ణరసాయనములయిన నినాదములు గల కులపర్వత గుహాలయందును, మానససరోవరమునందును, వైస్రంభకము, స్వరసనము, నందకము, పుష్పభద్రకము, చైత్రరథము నాఁబ డు దేవోద్యానములందును, సిద్ధులచే నుతింపఁబడుచుఁ గుబేరు నివలెఁ గ్రీడించెను. మఱియు నమ్మహామునిని మహనీయమయి కామగమనము గలిగియున్న విమానముపయి నధివసించి వా యువువలెను సకలప్రదేశములయందు నప్రతిహతుండై నమ స్తలోకములయందును సంచరింపఁదొడంగెను. తాపత్రయ నా శనకరమగు భగవంతునిపాదముల నాశ్రయించి పరిపూతమన స్కులయిన పురుషులకుఁ బ్రాప్తముకానివస్తు వేదికలదు? ఇట్లా శ్చర్యమయుఁడయిన యమ్మునీశ్వరుం డప్రతిహతగమనుండయి

ద్వీపవర్షాదిభేదములచే వెలయు భూగోళంబునంతను దనభార్య కుఁ జూపి స్వాశ్రమమునకు వచ్చి కామపీడితయయియున్న తన భార్యను మిగుల రమింపఁజేయుచు, బెక్కుసంవత్సరములను నిమిసమాత్రంబునఁ బుచ్చుచుండెను. ఆదేవహూతియు నిరతి శయసుఖమును గలిగించుచు సురతవర్ధకమయిన శయ్యయందు భర్తతోఁగూడి విహరించుచు, నెంతకాలము గతించినదో తెలియఁజాలకపోయె. యోగప్రభావము నవలంబించి క్రీడించుచున్న యామునిదంపతు లిట్లు బెక్కుసంవత్సరములను, బుచ్చిరి. అంతటికాలమును వారు సుఖాతిశయముచే నిమిసముగా భావించిరి. అప్పు డాకర్దముండు తనవీర్యమును దొమ్మిదివిధము లుగాఁజేసి తనభార్యయందుఁ బ్రవేశింపఁజేసెను. అంత నామె యు భర్తవలన వీర్యమును గ్రహించి తత్కాలమందే తొమ్మం డ్రుగురఁ బుత్రికలను గనెను. ఆపుట్టినపిల్లలందఱు నధికసౌం దర్యసంతుకాండ్రయి రక్తోత్పలమువంటి సుగంధము గలవారయి యుండిరి. ఇట్లు తనకు సంతానప్రాప్తి కలిగినపిమ్మట దేవహూతి, తన్నెడఁబాసి పోవఁదలంచిన తనభర్తను బొడఁగాంచి మితి మీఱినట్టివిచారము తన్ను బాధింప నాబాధను సహింపలేక మాటిమాటికిఁ గన్నుంగవనుండి బయలు వెడలివచ్చు కన్నీ టిని లోలో నరికట్టుచు, లోవల ననంతమగుదుఃఖము బాధిం చుచున్నను బైకి రానిమందహాసమును దెచ్చుకొనుచు, కాలిబొ ట్టన వ్రేలితో భూమిని గీయుచు, మృదుమధురములయిన వాక్యములతోఁ దనభర్తకిట్లనియె 'ఓప్రియవల్లభా! నీవు నాకుఁ బ్రతినచేసిన ప్రకారమున సర్వమును నెఱవేర్చితివి. నాయభీష్టములు నెఱవేఱినవి. నాయందు నీకు దయారసమున్నచో నీసేవ

కురాలనయిన నా కభయప్రదాన మొసంగుము. ఈజన్మించిన పుత్త్రికలఁ దగినవారి కొసంగి వివాహములొనర్చి వారల నంపివేసి, పిమ్మట నీవు నీ కభిమతమయినస్థలంబున కరుగుము. మఱియు నీవు న న్నెడఁబాసిపోయిన చో నా కమితంబగుదుఃఖము జనింపక మానదు అట్టి దుఃఖమును దొలఁగింపఁజేయఁ జాలెడునొక పుత్త్రుని ప్రసాదింపుము. ఇంతవఱకు సంసారసుఖము లనుభవించుచుఁ గాలము కడపితిని. ఇంక నాకు సంసారసుఖాభిలాష తీరినది. ఇంతకుఁ బూర్వము నే నింతేనియుఁ బరమాత్మ నుపాసించి యుండలేదు. మహానుభావుఁడవయిన నీతో నింతకాలము విహరించియు సంసారసుఖముల కాసించితినిగాని యాత్మజ్ఞానమును గుఱించి ప్రయత్నింపలేదు. అందులకు మిగుల వగచుచున్నాను. ఆత్మజ్ఞానము నుంతేనియు లేనిన న్నుఁ గరుణించి యందులకుఁ దగినయుపాయ మేదయిన నున్నయెడల దయచేసి నన్నుఁ గృతార్థురాలినిగాఁ జేయుము. అభయము దయచేయుము. మఱియు నోమహాత్మా! సజ్జననహవాసము సద్గతికారణమంచును, దుర్జననహవాసము దుర్గతికిఁ గారణమంచును బెద్దలు చెప్పుట లాలించి సత్పురుషశ్రేష్ఠుఁడవయిన నీసాంగత్యముతో నింతకాలము గడపితిని. కావున నాకు సద్గతి గలుగుననియె తలంచెద. ప్రాణిసంగమమువలన నేకదా లోకులకుఁ బుణ్యపాపములు సంభవించుచుండును. కావున సాధువయిన నీ సాంగత్యమువలన నాకు సద్గతి లభింపకమానదు. మఱియు నీలోకమం దొనర్చినకర్మము ధర్మముకొఱకుఁగాని జ్ఞానయోగముకొఱకుఁగాని సమర్థముకాదు. అట్టివానిని సంపాదింప సమర్థముకానిచో నట్టి కర్మములు చేయుట వ్యర్థమే. మఱియు భగవద్భక్తిని సంపాదింపఁజా

లినధర్మమును,జ్ఞానమును సంపాదింపనిమరుఁడు జీవన్మృతుఁ డను టకు సందియములేదు. కాన యిదివఱకు నేఁ జేసినకృత్యము లన్ని యు వ్యర్థములయినవే. మహాత్ముండవయిననీస్నేహము గలిగియుండి యు భగవంతుని సంతోషింపఁ జేయఁజాలిన ధర్మజ్ఞానముల సం పాదింపలేకపోయితి.నీయనుగ్రహమువలన ముక్తిఁజెందినఁ జెందఁ గలనుగాని లేనిచో నాపుట్టువంతయు వ్యర్థమనవచ్చును. నేను నిశ్చయముగా భగవన్మాయచే వంచింపఁబడితిని. లేనిచో ముక్తి ప్రదుఁడవయిన నిన్నుఁ బొందియు ముక్తిచెందలేక పోవుదునా? ఇది యిరువదిమూఁడవ యధ్యాయము.

అనియిట్లు దీనాతిదీనముగాఁ బలుకుచున్న మనుపుత్రియగు దేవహూతిని గాంచి కర్దముండు దయాళువయి, భగవంతునివాక్య మును స్మరించుకొనుచు నిట్లనియె. 'ఓపరమసాధ్వీ!ఓపవిత్రప్రవ ర్తనురాలా!నీవిట్లు మనంబున నెవ్వగఁ జెందకుము.నిరతిశయ గుణవంతుఁడగు భగవంతుఁడు స్వల్పకాలములోనే నీకుఁ గుమా రుండయి జన్మించును. నీవిచారములన్నియు గట్టెక్కును. విచా రింపఁబనిలేదు. నీవు పరమభక్తియుతురాలవయి బహిరింద్రి యములను, నంతరింద్రియములను, జయించి, పాతివ్రత్యమునకుఁ దగిన తపంబుచేతను, ధనదానాదులచేతను శ్రద్ధతో సర్వదా యీశ్వరుని భజింపుచుండుము. అందులకు భగవంతుండు సం తసించి యమితంబగు దయారసము కలవాఁడయి, నాకీర్తిని లోకమందు వెల్లడించుచు నీగర్భమునుండి జనించి తత్త్వ జ్ఞాన ముపదేశించి నీహృదయమందలి సందేహగ్రంథుల,నన్నిం టిని ఛేదింపఁగలఁడు.'' అనెను. తనప్రాణేశ్వరునిని దేశముఁ

ప్పున దేవహూతి భక్తిశ్రద్ధలతో నజ్ఞాననివర్తకుఁడును, పర మపురుషుఁడునగు నారాయణుని నెంతయుఁ బూజించెను. ఇట్లు చాలఁగాల మతిక్రమించినపిమ్మట భగవంతుఁడు కర్దమవీర్యమును బొంది దారువునం దగ్ని యుత్పన్నించినట్లు దేవహూతిగర్భము నుండి కపిలుండయి యుదయించెను.

భగవంతుండు దేవహూతికిఁ గపిలాచార్యుండై యుదయించుట.

ఆసమయమున గగనమందు దేవదుందుభులు మ్రోరసెను. మేఘములు వర్షించెను. గంధర్వులమితానందులై గానముచేసిరి. అచ్చరలనంతంబగుసంతసమున నృత్యములుచేసిరి. దేవతలు జయజయధ్వనులుచేసితమయానందమును వెలిఁబుచ్చుచుఁ బుష్పవర్షంబులు గురియించిరి. దిక్కులు మిగుల నిర్మలములయి ప్రకాశించెను. మఱియు సమస్తనదులును, సమస్తజనులమానసములును నిర్మలములైయొప్పెను. అట్టిసమయమున బ్రహ్మమరీచ్యాదిమునులతోఁ గూడికొని సరస్వతీనదీసుట్టుకొనియున్న కర్దమాశ్రమమునకు వచ్చి, భగవంతుండు ప్రకృత్యాదితత్త్వములనిశ్చయమును లోకులకుఁ దెలుపఁదలంపుతోఁ దన్నువిడిచి వేఱుగనుండనిదై ఒకప్పుడును సంకోచము నొందని జ్ఞానమగలవాఁడయి, దేవహూతికిఁ జిన్మాత్రకుమారుండయి జన్మించెనని తెలిసికొని నిర్మలాంతఃకరణుండయి భగవచ్చరిత్రమును నుతించుచుఁ గావునఁ జేసకలేంద్రియములు సంతృప్తిచెందుచుండ నా నానంద బాష్పము లనుసముద్రమందుఁ దొప్పదోఁగుచుఁ గర్దమదేవహూతులను బొడగాంచి కర్దమున కిట్లనియె. 'కుమారా ! కర్దమా ! నిష్కపటమగు ప్రేమాతిశయముగలవాఁడవై నావాక్యమును మన్నించి ప్రవర్తించితివి. కాన నేను మిగుల

సంతసించితిని. నీవు పితృభక్తి చక్కనెఱిఁగితివి. పితృవాక్య మునం దుత్తమగౌరవము నుంచితివి. కుమారులు జనకునియా నతి యొప్పునఁ బ్రవర్తించిరిచో నందులకు వారలకుఁ గల్గునానంద మింతంతని చెప్పవలనుపడునా ? ఈ నీకుమారికలు మిగుల మంచివారు, సౌందర్యవతులు, మంగళప్రదలు. వీరలను మరీచ్యాదిమునుల కిచ్చి వివాహము చేసితివేని వీరు తమ పుత్ర పౌత్రాదులచే సృష్టిని వర్ధింపఁగలరు. కావున నీపు త్రికలను వారలకిచ్చి, లోకమునఁ గీర్తివంతుఁడవయి నెగ డుము. మఱియు జగత్కారణుఁడయిన భగవంతుండు సర్వ భూతములకు సకలాభీష్టముల నెఱవేర్చుటయంను నిధినలె నొప్ప చున్న దేహము నవలంబించి యాత్మసంకల్పముచే నీకుఁ బు త్రుండై జన్మించియున్నాఁడని తెలిసికొని యిచ్చటికి వచ్చితి'నని కర్దమునితోఁ జెప్పి దేవహూతితో 'జీవపరమాత్మతత్త్వజ్ఞానము నుపదేశించి తనసేవచేయు భక్తుల పుణ్యపాపరూపకర్మములను నశింపఁ జేయుటకై పుండరీకాక్షుండును, బద్మరేఖాంకితపాదుండు ను నగు భగవంతుండు నీకు సుతుండై సంభవించెను. అమ్మహాత్ముం డు నీహృదయములో నున్న సర్వసంశయములను దొలఁగించి లో కమున సంచరింపంగలండు. ఇతఁడు యోగికులముల కధీశ్వరుం డయి సాంఖ్య (తత్త్వ) శాస్త్రమున నాచార్యుండై లోకంబునఁ గపిలాచార్యుండని పిలువఁబడుచు నీసతీకీర్తిని మిగుల వ్యాపింపఁ జేయఁగలఁడు.' అనియిట్లు చతుర్ముఖనుండు కర్దమదేవహూతుల కు సంతసముకలిగించి హంసనధిష్ఠించి నారదునితోను సనకాదు లతోను దనలోకంబునకుఁ బోయెను. ఇట్లు బ్రహ్మ తనలోకము న కేఁగినపిమ్మటఁ గర్దముండు తనకుమారికలను మరీచ్యాదిమునుల

కర్పించెను. అందు మరీచికిఁ గలయను కన్యకను, నత్రిమహాము నికి ననసూయను, నంగిరసునికి శ్రద్ధ యనుపు త్రికను, బులస్త్యు నకు హవిర్భువును, బులహునికి గతియను తనయను, క్రతువు నకుఁ క్రియయను కూఁతును, భృగుమహాముసికి ఖ్యాతియను త నూజను, వసిష్ఠుని కరుంధతిని, నథర్వణునికి బహుయాగవర్ధని యగు శాంతి నొసంగి వివాహములుకావించి భార్యాసమేతుల యిన మరీచ్యాదుల నధికముగా గారవించెను. ఓవిదురా! అనం తరము మరీచ్యాదిమునులందఱు భార్యాసహితులై కర్దమదేవ హూతుల యనుజ్ఞవడసి తమతమయాశ్రమంబులకుఁ జనిరి. అనంతరము కర్దముండు జ్ఞానశక్త్యాదిగుణంబులు గలవాఁడ యి తనకుఁ గుమారుఁడయి యున్నకపిలాచార్యుని రహస్యప్రదేశ మునకుఁ గొనిపోయి నమస్కరించి యిట్లనియె. 'మహాత్మా! తమ తమపాపకర్మములచే మిగుల బాధల ననుభవించుచు సంసారసాగ రంబున మునింగి తేలుచున్నవారలయి యున్నమానవులకు దేవ తలు బెద్దకాలంబునకుఁగాని ప్రసన్నులు కారుకదా? మఱియు యతీశ్వరులును బెక్కుజన్మములనుండి సంపాదించి తెచ్చుకొను చున్నజ్ఞానాతిశయముంబట్టి రాగాదిరహితులయి నిర్మలాంతఃక రణములం దేనీస్వరూపమును బొడగాంచుటకు యత్నించుచు న్నారో యట్టిమహానుభావుండవయిన నీవు "అయ్యో! మహత్తుఁ డనైన నే నెట్లుగా సామాన్యులయిఱ్ఱియందుఁ బుట్టుదు" నని యోజింపక సామాన్యులమయిన మమ్ము నుద్ధరించుటకయి యిట్లు పొడమితివి. నీవుతక్కినవారలకు దుర్లభుఁడవయినను భక్తు లకు మిక్కిలి సులభుఁడవని చెప్పుట కెంతమాత్రము సందియము లేదు. అట్లేకానిచో మాయింట నేలపుట్టుదువు? ఓభగవంతా!

పూర్వము నీవుపలికినవాక్యమును సత్యముగాఁ జేయుటకును, మా వంటిభక్తులకు జ్ఞానాభివృద్ధి కలిగించుటకును నీ విట్లు నాగృహమునం దుదయించితివి. నీవు నిష్కర్ముఁడవుగనుకఁ గర్మమును బురస్కరించికొనివచ్చెడి దేహాదులు నీకుఁ గలుగవు. అందువలన నీకిష్ట మయినజన్మ మెత్తవచ్చును. నీవట్లు స్వతంత్రుఁడవయినను. నీకభిమతనుయినశరీరముం దాల్చక నీభక్తుల కభిమతమయిన దేహమును ధరించుచుందువు. దీనింబట్టి యోజింప భక్తులందు నీకెంతప్రేమమున్నదో యెవ్వరుచెప్పఁగలరు? లోకములోని పండితులంగూడ ప్రకృతిపురుషులయథార్థత్వమును దెలిసికొనఁదలంచి నీపాదముల కభివందించుచున్నారు. అట్టిమహాత్ములచే నుతింపఁబడుచు సకలైశ్వర్యపూర్ణుఁడవయి, జ్ఞానాదిగుణములతోఁ దులదూఁగుచున్ననిన్ను నమస్కరించి శరణుజొచ్చుచున్నాను. ఓదేవా! నీవు మాయాతీతుఁడవయినను మాయయె శరీరముగాఁగలవాఁడవు. నీవు కాలస్వరూపుఁడవు మహచ్ఛరీరకుండవునీవే? మతీయు జీవశరీరకుండవు. సర్వజ్ఞుఁడవు. జ్ఞానశక్త్యాదిగుణంబులచే లోకములకుఁ బాలకుండవయి సమస్తభువనంబులను నీయందె యిమిడ్చికొనుచున్నాఁడవు. నీవు స్వాధీనమయిన సర్వశక్తులు కలవాఁడవు. ఇట్టి యనంతకల్యాణగుణములు కలిగి కపిలాచార్యుఁడవని ప్రసిద్ధికెక్కిన నీపాదముల కభివందనము లర్పించుచున్నాను. ఓమహాత్మా! నిన్నుఁ బుత్రునిగాఁ బడయుటవలన ఋణత్రయమువలన విముక్తుండనయితిని. మతీయు సంసారబంధములఁ దెగఁద్రెంచియున్నాను. కావున శోకవర్జితుండనై నన్యాసాశ్రమమును స్వీకరించి నిన్నే హృదయకమలమందు నివసింపఁజేసి భజించెదను". అని భక్తిసంయుతుండయి పలికినకర్దమునిఁజూచి భగవంతుం

డిట్లనియె. 'ఓమునీంద్రా! పూర్వము నీయెదుటఁ జేసిన ప్రతిజ్ఞ సత్యమునుగాఁ జేయుటకయి నీకుఁ గుమారుండనయి జన్మించితిని. లోకములోఁ బెక్కండ్రు దేహమునే యాత్మనుగా భావించుచున్నారు. అది మిగులఁ బొరపాటు. అందువలన మోక్షమందుఁ దలంపుగలవారి కందఱికిఁ బ్రకృతికంటె భిన్నులయిన జీవాత్మపరమాత్మల యథార్థత్వమును దెలియఁజేయుటకును, ప్రకృతి, పురుషుఁడు, ఈశ్వరుఁడు, అనెడి యథార్థజ్ఞానమును దెలియఁజేసెడి తత్త్వములను, స్పష్టముగాఁ దెలియునట్లు చేయుటకును, 'బ్రహ్మాత్మసందర్శనము చేయించుటకు నిట్లు జన్మించితినిగాని, నా పనికయి జన్మింపలేదు. ఆత్మతత్త్వము మిక్కిలి సూక్ష్మమయి నదగుటచేఁ దెలియుటకు వలనుపడునది కాదు. అట్టియాత్మతత్త్వమును బూర్వ ముపదేశించితినిగాని చిరకాలమయి యుండుటఁజేసి యది నష్టమయినది. అట్టి యాత్మతత్త్వమును మఱుడ స్థాపించుటకే యీజన్మమని తెలిసికొనుము. ఓమునీంద్రా! నీకు నెలవిచ్చుచున్నాను. నీ కిష్టమయినస్థలమునకుఁ బొమ్ము. నీవైన రించెడికర్మములన్నియును నాయధీనములుగాఁ జేసి సామాన్యులకు జయింపఁదరముకాని మృత్యువును జయించి మత్ప్రాప్తిరూపమగు మోక్షమునకు విరోధులైన ప్రాచీనకర్మవాసనలను నిరసించుకొఱకు నన్ను భజింపుము. మద్భక్తియుతుండవయి వర్తించినచో సర్వము సఫలమగును. నీ కట్టిభక్తి యలవడినచో నీవు దుఃఖములనన్నింటిని దొలఁగించికొని సమస్తజీవులయందు నంతరాత్మనై స్వయంప్రకాశకుఁడనై సర్వభూతములహృదయకుహరముల యందు శయనించియున్ననన్నుఁ బొందఁగలవు. మఱియు మాతల్లియయిన దేవహూతికి సకలకర్మవినాశకమయిన యాత్మవిద్య

నుపదేశించెదను. అందువలన నా మెయి భయమును బాసి సంసారసాగరమును దరింపఁగలదు.' అని యిట్లుపలికిన కపిలాచార్యుని వాక్యములను విని సంతసించి ప్రదక్షిణనమస్కారములు గావించి పుత్త్రుని వీడ్కొని వనంబునకుఁ జనియె. అట్లుచని యాకర్దముండు మౌనవ్రతము నవలంబించి పరమాత్మనే శరణముగాఁ దలంచుచు, గృహస్థాశ్రమకర్మముల నన్నింటిని విడిచి నిస్సంగుఁడై యొక్కచోనివసింపక భూమండలమునందెల్లఁ ద్రిమ్మరఁజొచ్చెను. మఱియు నాకర్దముండు దనచిత్తమును చిదచిద్విలక్షణుఁడును, కల్యాణగుణోపేతుఁడును, హేయగుణములు లేనివాఁడును, నగు పరబ్రహ్మమునందుఁ గీలొక్కలిపి నిశ్చలమయినదానిగాఁజేసి దేహాదులందున్నయభిమానమును విడిచి యహంకారమమకారమును దొలఁగించుకొని, శీతోష్ణాదులయిన ద్వంద్వముల సరకుగొనక సర్వభూతములందును సమదృష్టిగలవాఁడయి ప్రకృతికంటె విలక్షణుఁడగు పరబ్రహ్మమును, సాక్షాత్కరింపఁజేసికొని ప్రత్యగాత్మయందు శాంతబుద్ధిగలవాఁడయి తరంగములులేని సముద్రునివలె * షడూర్మ్ములు లేనివాఁడయి జీవాత్మల కంతరాత్మయయి యొప్పుచు, భగవంతుఁడయిన వాసుదేవునియందున్న భక్తివిశేషముచే నాత్మజ్ఞానమును బొంది సకలబంధవిముక్తుఁడయి సర్వభూతములయందును భగవంతుఁడు నిలసిల్లుచున్నట్లు దెలిసికొని రాగాదిరహితమయిన మనస్కులవాఁడయి ముక్తిఁ జెందెను. ఇది యిరువదినాల్గవ యధ్యాయము.

---

* ఆఁకలి, దప్పి, దుఃఖము, మోహము, ముదుసలితనము, మృత్యువు అను నీయాఱు ఊర్మ్ములనఁబడును.

కపిలదేవహూతి సంవాదప్రారంభము.

అని చెప్పినవిని శౌనకుండు సూతున కిట్లనియె. ఓ మహాసీ యా ! భగవంతుఁ డాత్మమాయ నవలంబించి తత్త్వసంఖ్యానము చేయుటకును, మానవుల కాత్మమార్గమును దెలియఁ జేయుట కును, జన్మకర్మాదులు లేనివాఁడయినను, గపిలాచార్యుండయి జ న్మించెనని చెప్పితివి. యోగిశ్రేష్ఠుఁడయిన కపిలాచార్యుని కీర్తి మంతమయిన చారిత్రము నెంతవిన్నను మాకుఁ దృప్తికలుగదు. స్వచ్ఛందమయిన దేహముగల కపిలాచార్యుం డాత్మమాయా గుణముచే నెట్లు ప్రవర్తించెనో యా ప్రవర్తనలను మాకుఁ దెలియఁజెప్పుమని యడిగిన విని సూతుండు శౌనకాదుల కిట్లని యె. 'ఓ మునీంద్రులారా ! వ్యాసమిత్రుఁడయిన మైత్రేయుండు తత్త్వనిరూపణమందుఁ బ్రేరితుండై విదురుంగాంచి పలికెను. ఓ విదురా ! తనతండ్రియగు కర్దముండు తపోవనంబున కరిగినపిమ్మ టఁ గపిలాచార్యుండు తనతల్లికిఁ బ్రియంబు చేయఁ దలంపు గల వాఁడయి యాబిందుసరోవరతీరమునందు నివసించియుండెను. అంత దేవహూతి కర్మాదిరహితుఁడును, దత్త్వమార్గదర్శియు నగు తనకుమారునిఁజూచి బ్రహ్మవాక్యములను దలంచికొని యిట్లని యె. 'ఓ దేవా! ఇంద్రియములంబట్టియే నే నజ్ఞానకూపంబునం బడి తిని. న న్నజ్ఞానములో ముంచినట్టి ప్రకృతిపరిణామరూపముల యిన యింద్రియములతృప్తి చేతనే మిగుల దుఃఖమును బొం దుచున్నాను. దుష్పారమైన యజ్ఞానతమము పారమును బొం దింపఁజాలినవాఁడవు నీవే! నీకంటె నన్యులులేరు. నీవే నాకు ది వ్యలోచనమ వయితివి. ఇదివఱ కెన్నియోజన్మముల నెత్తితిని. కా ని యొక్కప్పుడు నా కిట్టి దివ్యలోచనము కలుగలేదు. నేఁడు కలిగి

నది. కావున నీకు నాకు నిదియే కడపటిజన్మమని తలంచెదను. చీకటుల నడగింప సూర్యుఁ డుదయించినట్లు నాయజ్ఞానమును దొలఁగించుటకుఁ బరమపురుషుఁడవును, లోకాధీశ్వరుఁడవును, భగవంతుఁడవు నగు నీవు నా కుదయించితివి. కావున నాయ వివేకమును దొలఁగించుటకు నీవర్హుండవు. నుతియు నీసంకల్ప మువలన నుప్పవించిన యహంకారమమకారములను దొలఁగిం పఁ దగినవాఁడవు. అదికారణమున సంసారవృక్షమును ఛేదిం చుటకు గొడ్డలివంటివాఁడవును, సమస్తయోగులకును శర ణ్యుఁడవు నగు నీపాదముల శరణుచొచ్చుచున్నాను. నీవు తత్త్వ విదుఁడ వగుటచేఁ బ్రకృతిపురుషవిభాగముచేయ సమర్థుండవు. కావున నట్టిజ్ఞానమును నాకుఁ దెలియఁజేయుము". అని యిట్లు పలుకుచున్న తల్లివాక్యంబుల నాలించి యామె యభిప్రాయ మును గ్రహించి మందహాసముచే ముఖారవిందముప్రకాశింపఁ గపిలాచార్యుండు మనస్సుచే నమస్కరించి మోక్షోపాయ మును దెలియఁ జేయనెంచి యిట్లనియె. " ఓజననీ ! ఎల్లవా రికిని దత్త్వజ్ఞానము మోక్షసాధనమని నామతము. ఆ యాత్మజ్ఞా నయోగము సుఖదుఃఖములను మొదలంట నశింపఁ జేయక మా నదు. అట్టి యాత్మజ్ఞానమును బూర్వము వినఁ దలంపుగొనియు న్నమునీంద్రులకు వివరించి చెప్పియున్నాను. దానినే యం గములతోఁగూడ నీకుఁ దెలియఁజేసెద నాలింపుము. ఓతల్లీ ! విష యములయందు సక్తమయిన మానసము బంధమునకుఁ గా రణమగుచున్నది. భగవంతునియందు సక్తమయినచిత్తము ము క్తికొఱకుఁ గారణమగుచున్నది. కావున మనస్సే బంధమోక్ష ములకుఁ గారణమని యెఱుంగుము. ప్రకృతికంటె భిన్నమయిన

పరమాత్మ జ్ఞానస్వరూపమును దెలియఁదగిన మనస్స్వరూపమును జెప్పెదను వినుము. * ఆత్మపదార్థముకాని దేహాదులం దాత్మయను నభిమానము గలుగుచుండు. అట్లు తనదికాని వస్తువునందుఁ దనదనెడి యభిమానము గలుగుచుండు. ఆ యభిమానద్వయమే యహంమమాభిమానము లనంబడు. ఈ యభిమానములనుండియే కామలోభాదులు జనించు. వానినలననే పుణ్యపాపంబు లుద్భవించు. అట్టి పుణ్యపాపములు ఫలాభిలాష లేని యీశ్వరారాధనరూపమగు వర్ణాశ్రమ ధర్మములచేఁ దొలంగుచుండును. కావునఁ బనంబు పరిశుద్ధమై కనుకనేయింద్రియ జన్యంబులగు సుఖదుఃఖంబులచేఁ దిరస్కరింపఁబడక, యెల్లప్పుడు నేకరూపముగా నుండును. అట్టి మనంబుగల పురుషుండు జ్ఞానముచేతను, వైరాగ్యముచేతను, సంయుక్తమై భక్తిసమేతమై యొప్పుమానసముచేఁ బ్రకృతికార్యములగు శరీరములకంటెను, నింద్రియంబులకంటెను, మనంబుకంటెను, ప్రాణంబులకంటెను, స్వరూపస్వభావములచే మిక్కిలి విలక్షణమై, ప్రకృతిపరిణామవిశేషములగు దేవత్వ మనుష్యత్వాద్యాకారములు లేక, జ్ఞానముంబట్టి యేకరూపమైనది కాన భేదము లేక, యణుపరిమాణము కలదగుటచే నాయుధంబులచే ఛేదింపఁబడక, యగ్నిచే దహింపఁబడక, దీపము తేజస్స్వరూపమయి, తేజోగుణము గలదై స్వయముగాఁ బ్రకాశించునట్లు జ్ఞానస్వరూపమయి, జ్ఞానగుణముకలదయి స్వయంప్రకాశమై యొప్పుచు నిర్వ్యాపారమై యున్న ప్రత్యగాత్మను, సమస్తప్రాణికోటిని

* ఇందులకు-శ్లో॥ "అనాత్మన్యాత్మబుద్ధిర్యా అస్వేస్వమితియామతిః।
అవిద్యాతరుసంభూతం నీజమేతద్ద్వయాస్థితమ్" అనునది ప్రమాణము.

సంసారమునం బడఁ ద్రోయఁజాలిన బలము లేనిమాయను జూడఁగ లఁడు. ఓతల్లీ! ఆత్మస్వరూపమును దెలిఁయఁజాలిన మనస్స్వరూపము, నట్టిమాత్మగూఢాత్మ్యము నీకుఁ జెప్పితిని. కాని ప్రకృతికంటె విలక్షణమయినదని చెప్పినంతమాత్రమున నాత్మస్వరూపమును గ్రహింపఁజాలరు. జీవాత్మస్వాభావికస్వరూపము పరమాత్మశరీరమై యుండుటయేకాన పరమాత్మశరీరభూతమగు జీవాత్మస్వరూపమును దెలియఁగోరినచో బరమాత్మను దెలిసికొనుట యావశ్యకము. బ్రాహ్మణత్వాది జాతులను గాని నలుపు, పసుపు మొదలగు గుణములనుగాని, ప్రత్యేకముగాఁ బ్రత్యక్షము చేసికోలేరు. అట్టిజాతులను గుణములను, దెలిసికొనఁ దలంచినచో దదాశ్రయములయిన బ్రాహ్మణాదివ్యక్తులను, నెఱ్ఱనివియుఁ, బచ్చనివియు నగు వస్తువులను ముందుగా సాక్షాత్కారము గావించుకొనవలయు. అట్లయిన జాతిగుణాదులు ప్రత్యక్షములగును. అట్లె జీవాత్మస్వరూపము తదాశ్రయమగు పరమాత్మవలననేకాని ప్రత్యేకముగా లభింపదు. దానిఁ దెలిసికోఁదలంచినజీవాత్మశరీరముగాఁ గల పరమాత్మను దెలిసికొనవలయు. పరమాత్మను దెలిసికొనినఁ బరమాత్మశరీరమగు పత్యగాత్మస్వరూపము తెలిసికొనఁగలరు. కావునఁ బ్రకృతికంటె విలక్షణమయిన ప్రత్యగాత్మను దెలిసికొనుటకు బ్రహ్మసాక్షాత్కార మావశ్యకము. బ్రహ్మసాక్షాత్కారమున కుపాయ మేమని యడిగెదవేని చెప్పెద. జీవాత్మలకంతరాత్మయై యొప్ప భగవంతునియం దుంచిన * భక్తియే బ్రహ్మమువలె

* ఈ చెప్పటవలన విధివిహితములగు వర్ణాశ్రమధర్మములను ఫలాపేక్షలే కుండ నొనరించి యందువలనఁ గామాదిదోషములను దొలంగించుకొని నిర్మలాం

పాపములఁ దొలంగించుకొనుట మొదలగు నెనిమిదిగుణములను గలుగునట్లు జేసికొన యోగులకుఁ బ్రధానసాధనము. ఇంతకంటె ననన్యాపేక్షమగు నుపాయము మఱియొకటి లేదు. ఓతల్లీ! అట్టిభక్తి యుపయించుటకుఁ బ్రధానమగు నివృత్తిధర్మములం దభిరుచి గలుగుటకు సత్సంగతియే ముఖ్యకారణమని తెలియుము.దుష్టములగు నింద్రియవిషయములం దత్యాసక్తి జీవాత్మకు దృఢమగు పాశబంధనమే యని పండితులందురు.సాధుసంగతియందట్టియాసక్తియుండిన నది యపవర్గమగు మోక్షద్వారమే. అట్టిసాధువు లెవ్వరని యడిగినఁ జెప్పెద. మూర్ఖులవిషయమై కూడ భూమివలె మిగుల నోర్చుగలిగి, స్వప్రయోజనాపేక్ష లేకయే పరుల దుఃఖములను నిరాకరింపఁ దలంచుచుఁ, గనుకనే సను స్తప్రాణులకును మిత్రులయి వర్తించుచుఁ,గావునసే యెపరిశోధింపక మఱియు శమదయాదిగుణ సంపన్నులయి, పరులకార్యములను సాధించువారై, సాధుస్వభావమే యలంకారమునుగా ధరించి వర్తించువారలే సాధువు లనంబడుదురు.మఱియు,నాయారాధనకు విరోధులయిన ప్రవృత్తిధర్మములను, నాభజనకు విరోధులయిన స్వజనమును విడిచి యన్యవస్తువులందుఁ బ్రవేశింపని యంతఃకరణముచే నాయందు భక్తిగలవారును సాధువులే. ఇంతేకాక తమచిత్తములను నాయందు నిలిపి సంతుష్టులై నాసత్కథలను వినుచుఁ, బరులకుఁ దెలియుఁజెప్పుచు, నాధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము నాఁబడుతాపముల

తఃకరణుఁడై తాదృశాంతఃకరణముచే బ్రహ్మశరీరభూతమగు ప్రత్యగాత్మయాథాత్మ్యము తెలియువలయును గాన యట్టిపరమాత్మను సాక్షాత్కారము చేసికొనఁ దద్భక్తియే సాధనమని తెలియుమన్నది.

పాలఁబడక వర్తించువారలును సాధువులే. ఓసాధ్వీమణీ! సమస్తవిషయసంగములను విసర్జించి వర్తించుసాధువు లింద్రియార్థప్రసంగమువలనఁ గలిగి యనాదులయిన పుణ్యపాప రూపదోషములను హరించువారలు కావున నీవట్టిసాధుసంగమును దప్పక ప్రార్థింపఁదగినది. సాధుప్రసంగమువలన నివృత్తిధర్మములం దభిరుచి యెట్లుకలుగునని సందియపడ నవసరములేదు. సాధుప్రసంగమువలన నిత్యాసంకుచితజ్ఞానముచే సమస్తమును సాహిత్యకరింపఁజేయు నాకథలు హృదయమునకును, గర్ణములకును, నమృతమువలె రుచికరములయి ప్రవర్తించును. అట్టికథలను వినుటవలన మోక్షమునకు ద్వారభూతమగు గురుసదనమందు శ్రద్ధయు, నతనిసన్నిధియందు భగవత్కథలను సర్వదా వినుచుండుటవలన నివృత్తిధర్మములును గలుగును. ఇట్లు సత్సంగతి మొదలగువానింబట్టి భగవత్ప్రీతిరూపభక్తి యుద్భవించును. సృష్ట్యాదివ్యాపారములను జింతింపఁజేయు నాభక్తివలననే దృష్టములగు నిహలోకఫలములందును, శ్రుతములగు పరలోకఫలములందును విరక్తిచెంది పురుషుఁడు ఫలాపేక్షలేని కర్మయోగ జ్ఞానయోగంబులవలనఁ జిత్తమున కేకరూపత్వమును సంపాదించు భక్తియోగసాధనముల వివేకము, విమోకము, అభ్యాసము మొదలగువానిచే మనోనియమనమందుఁ బ్రయాదరహితుఁడై యత్నము చేయుచుండును. సత్వాదిగుణముల పరిణామరూపములయి నిషిద్ధములైయున్న యన్నాదుల ననుభవింపకుండుటచేతను, వైరాగ్యముచే నతిశయించిన జ్ఞానయోగముచేతను, ఫలాపేక్షలేని కర్మయోగముచేతను, నాయందు సమర్పితమయిన భక్తియోగమువలనఁ బురుషుఁడు ప్రత్యగాత్మయే శరీరముగాఁ

గలనన్నఁ బొందును." అని పలుకుచున్న కుమారునిఁజూచి దేవ హూతి యిట్లనియె. 'నాయనా ! ముక్తిసాధనకుఁ దగిన భక్తిస్వ రూప మెట్టిది? నా కెట్టిభక్తి యుచితమైనది? తాపత్రయముచే నాతురురాలయిన నే నెట్టిదాని ననలంబించినచో నిర్విఘ్నముగా నిరతిశయసుఖమగు నీపదము నందఁగలను? అట్టిదానిని దెలుపు ము. ఓ యానందస్వరూపా! లక్ష్యరూపుఁడవగు నీయఁదు భౌణ రూపముగాఁ బ్రయోగింపఁదగిన యోగం బెటువంటిది. దానికి నంగము లెన్ని? ఆయంగములవలనఁ బరమాత్మతత్త్వ మెట్లుకలు గుచున్నది? నాయడిగిన ప్రశ్నంబులకు సదుత్తరంబుల నొసంగి నాబుద్ధిమాంద్యమును వదలింపుము. నేనబలను, నే నొరులుపదే శించు నుత్కృష్టసంగతుల గ్రహింపఁదగినంత బుద్ధిగలదాననుగా ను. మఱియు నాధ్యాత్మికవిషయములు నిగుల దురవగాహము లని వినియుందును. అవి దురవగాహములయినను నీబుద్ధిచాతు ర్యముచే సులభముగాఁ జేసి నాకుఁ దెలియఁజెప్పి నన్నుఁ దరింపఁ జేయుము' అనియడుగ విని కపిలుండు భక్తియోగాదులఁ దెలిసి కొననున్న తల్లితలంపు దెలిసికొని ఆమెయందుఁ దా నుత్పన్నుఁ డగుటంబట్టి మాతృస్నేహము కలవాఁడయ్యెను. తత్త్వసంఖ్యా నముచే నాత్మస్వరూపమును బ్రకాశింపఁజేయు భక్తియోగము తెలుప నిశ్చయించి తల్లికిఁ గుమారుండయిన కపిలుం డిట్ల నియె. 'ఓజననీ! భక్తియనఁగా నెట్టిదని యడిగితివి. సత్త్వమయుఁ డయిన భగవంతునియందు నిర్మిమిత్తముగా స్థిరపడినట్టి జ్ఞానేం ద్రియములయు, గర్మేంద్రియములయు, నేకాగ్రమయిన మనస్సం బంధమైనదియు, నగు వ్యాపారమునకే భక్తియనిపేరు. ఆభక్తి కైవల్యాదులఁ గలిగించుటంబట్టి, మిగుల గరిష్ఠమైనది. ఆభక్తి

సమస్తకర్మవాసనలను భుక్తపదార్థమును జఠరాగ్ని నశింపఁజేసినవిధమున క్షీణకాలములోనే నశింపఁజేయఁగలదు. అట్టిభక్తిమార్గము నవలంబించినవారు, నాపాదపద్మభజనయం దాసక్తులై సర్వేంద్రియవ్యాపారములను నాయందుఁ బొందుపఱిచి కల్యాణగుణప్రకాశకములగు నాసచ్చరిత్రములను సర్వదా యాలకించి పరస్పరము నుతించికొనుచు, గౌరవించుచున్నవారలయి *సాధర్మ్యరూపముక్తినిగూడ నిష్టపడరు. తల్లీ! భక్తియంతయు తత్కృష్టమయినదని తెలిసికొమ్ము. మఱియు సత్పురుషులు నుండరములగు నక్ష్మిలోచనాదులు గలిగి యిష్టవస్తువుల నిచ్చుచునున్న నాదివ్యమంగళశరీరములను గాంచి ధ్యానించుచు, నాయారూపముల నొందినప్పుడు నాపలికినవాక్యంబులఁ బరస్పరము చెప్పికొని యమితానందము చెందుదురు. వారు దర్శనీయములయిన నాదివ్యరూపములచేతను, కరుణావలోకనములచేతను, మృదుమధురములయిన వాక్యరచనములచేతను, దమయాత్మలు హరింపఁబడుటంజేసి ముక్తినిగోరకున్నను భగవద్భక్తి, ప్రారబ్ధకర్మము నశించినపిమ్మట, †నర్చిరాదికమయిన గమనమును బొందించి మదీయమాయచే సృజింపఁబడిన బ్రహ్మలోకపర్యంతంబుగల భూతిని, ననిమాద్యష్టాంగయోగమును, బొంద నిష్టపడనీయక నిరతిశయానందదాయకమయిన నాలోకమును జెందునట్లు చేయును. అంతి

---

* సాధర్మ్యరూపముక్తియనఁగా భగవంతునితో సమానమైన ధర్మములు గలిగియుండుటయే.

† ఈలోకమునుండి పైలోకముల కేఁగువారికి ధూమాదిగతియనియు, అర్చిరాదిగతియనియు, రెండువిధములుకలవు. ఈగతులస్వరూపము ద్వితీయస్కంధంబున రూపింపఁబడెను.

యకాని నిత్యములు కానివియు, సామాన్యసుఖములు గలవి యునగు స్వర్గాదిలోకములయందుండ నిష్టపడనీదు; స్వర్గాది లోకములవలెనే వైకుంఠముగూడ నశించునని తలంపకుము. * శాంతస్వరూపమయిన నాలోకమునందు నన్ను భజించుచున్న వా రెప్పుడు నాశనముచెందరు; ఒకప్పుడును భక్తిహీనులయి యుండరు. కాన నాకాలచక్రము వారిని నెంతమాత్రము నశింపఁజేయలేదు. నాలోకములో వసించువారి కందఱికి నేను గుమారునివలెఁ బ్రేమాస్పదుఁడనై మిత్రునివలె విశ్వాసపాత్రుఁడనై గురువువలెనె హితోపదేష్టనై, దైవమువలెఁ, బూజనీయుండనై యుందును. మఱియు నిహపరలోకములు నీచములని తెలిసికొని యూరెండులోకములయం దుండఁదగిన దేహాదుల నిష్టపడక పుత్రికళత్రాదులయందును, ధనములయందును, గృహములయందును, దేహమందును నభిమానము విడిచి యితరవిషయాసక్తులుగాక యన్యప్రయోజనములేని భక్తిచే నన్ను సంతతము భజించువారలను నేను సంసారసాగరమును

---

* ఇట భగవంతుఁడగు కపిలుని యభిప్రాయము ప్రతిదినమును వర్ణాశ్రమధర్మములఁ బ్రవర్తింపఁజేయుటచే సంభూతమయిన మదుపాసనచేతను, మదారాధనమును సలుపుటచేతను నేను సంతసించి, సర్వవిధములచేతను నన్నుపాసించుభక్తులను నిరతిశయానందరూపమగు నాపదమును బొందించి వారికి మఱుడ జన్మమును గలుగనీయనని యన్నట్లు తెలియుచున్నది. ఇందులకు భగవద్గీత. శ్లో॥ "మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్। నాప్నువన్తి మహాత్మాన స్సంసిద్ధిం పరమాంగతాః ॥ ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోర్జున । మాముపేత్యతు కౌన్తేయ పునర్జన్మ నవిద్యతే॥" ఇందువలన బ్రహ్మలోకాదులకుఁ బోయినవారికిఁ బునర్జన్మమున్నదికాని వైకుంఠము నొందినవారికిఁ బునర్జన్మము లేనట్లు స్పష్టమగుచున్నది

దాఁటించి నాలోకమునకుఁ గొనిపోయి సుఖంపఁ జేయుచుందును. ఇంక వారలకుఁ దిరిగి పుట్టువుండదని నమ్ముము. మఱియు సమస్త చేతనాచేతనముల కంతరాత్మనై, నియంతనై, భగవంతుండనై యున్నన న్నాశ్రయించిన వారి కెట్టిభయము కలుగనేరదు. నన్నుఁగాక యితరుల సేవించినవారికి గర్భజన్మజరామరణాది దుఃఖములు నివర్తింపవు. నేను బ్రహ్మవఱకు గల సమస్త దేవతలను నాయాజ్ఞలయందుఁ బ్రవర్తింపఁజేయుచున్నాను. నాయాజ్ఞ నతిక్రమించువాఁడుండఁడు. నాకు వాయువు మిగులభయపడుచుఁ బ్రసారణరూపమయిన వ్యాపారమందు సర్వదా ప్రవర్తించుచుండును. నేను సూర్యుని, లోకములకు వెలుతురును వేఁడిమిని గలిగించునిమిత్తము నియమించితిని. అందువలన నతఁడా వ్యాపారములనే తప్పక చేయుచుండును. నాయనుమతిచేతనే యింద్రుండు లోకమునిమిత్తము వర్షించుచుండును. అగ్ని సర్వమును దహించుచుండును. మృత్యువుకూడ నాకు భయపడి తిరుగుచుండును. ఇట్లునేను సర్వనియామకుఁడనగుటంబట్టి యోగీశ్వరులందఱు వైరాగ్యయుక్తమయిన భక్తిమార్గము నవలంబించి క్షేమముపొందుటకయి నాపాదమూలములఁ జేరుదురు. అట్టివారలకెందువలననుభయములేదు. మహత్తరమయిన భక్తిమార్గము చే నిర్మలమయిన తమచిత్తమును నాయందు స్థిరముగా జేర్చుటయే ప్రకృతిమండలంబున వర్తించు బద్ధజీవులకు నతిశయమైన పరమపురుషార్థమని తలపోయుచుండుము. ఇది యిరువదియైదవ యధ్యాయము.

"ఓతల్లీ! నీకు భక్తిమార్గమును దెల్లము గావించితిని. ఇఁక నీకుఁ దత్త్వలక్షణ మెఱిఁగింతు వినుము. ఆతత్త్వమును జక్కఁగఁ దెలిసినవాఁడు సత్త్వాదిగుణకార్యములగు పుణ్యపాపముల నుండి విముక్తుఁ డగుచున్నాఁడు. మఱియు జ్ఞానము బ్రహ్మసాక్షాత్కార ము కలిగించును. అది మోక్షమునకు సాధనమయినది. అది హృద యమందున్న యజ్ఞానమును దొలంగించును. అట్టిజ్ఞానమునుగూడ నీకుఁ దెలియఁజేయుదును. ఓజననీ! తత్త్వలక్షణమును, జ్ఞానల

కపిలుఁడు తల్లికి నాత్మస్వరూపంబును జెప్పుట.

క్షణమును, జెప్పుటకుఁ బూర్వము, ప్రకృతికంటె విలక్షణమయిన యాత్మస్వరూపమును దెలియఁబఱిచెద. నావధానచిత్తవయి యుండుము. * దీపాదులు తేజోరూపములయి ప్రకాశించుచుఁ దన్నుండి వేఱుచేయ వలనుపడనిప్రభచే నితరవస్తుజాలంబును బ్రకాశింపఁజేయుచుండును. మఱియు స్వధర్మభూతమగు ప్రభ నపేక్షింపకయే వెలుంగుచుండును. అట్లె జీవాత్మయుఁ, దనకు ధర్మభూతమగు జ్ఞానంబుచే నన్యవస్తుజాతంబునెల్లను బ్రకాశిం

* ఇట్టిదీపాదులకు నాత్మకుఁగల భేదమేమన, దీపాదులు తమ్మును, నితరమును, నితరులనిమిత్తమే ప్రకాశింపఁజేయును. ఆత్మ తన్నును,నితరులను దననిమిత్తమే ప్రకాశింపఁజేయుచుండును. దీపము స్వధర్మభూతమగుప్రభచే నితరులను దదపేక్ష లేకుండ స్వాత్మను బ్రకాశింపఁజేయును అట్లె యాత్మయు ధర్మభూతజ్ఞానముచే నితరులనుఁ దదపేక్షలేకుండ ధర్మిజ్ఞానముచే స్వాత్మను బ్రకాశింపఁజేయును. ఈదీపదృష్టాంతముచే నాత్మ జ్ఞానస్వరూపము,జ్ఞానగుణకము, నై యొప్పుచున్నదని తెలియుచున్నది. మఱియు నాత్మ తననిమిత్తమే ప్రకాశించెడిదగుటచే, దీపాదులవలె జడముకాదనియుఁ దెలియవచ్చుచున్నది. ప్రత్యగ్ధామత్వమనఁగాఁ దన్ను నితరులను దననిమిత్తము ప్రకాశింపంజేయుటయని యెఱుంగునది.

పఁజేయుచు,స్వధర్మభూతమగు జ్ఞాన మపేక్షింపక స్వయముగా నే ప్రకాశించుండును. మఱియు జీవాత్మ తాను ప్రకాశించుచు సమస్తమును దనకొఱకే ప్రకాశింపఁ జేయుచుండును. దీపాదులట్లుకాక తన్నును నితరులను నితరులనిమిత్తమే ప్రకాశింపఁ జేయుచున్నవి. అందువలన, దీపాదిదృష్టాంతంబువలన నాత్మకుఁ బ్రాప్తమగు జడత్వము వారించుచున్నది. మఱియు ఆత్మ ప్రకృతిపరిణామరూపములయిన మనశ్శరీరేంద్రియప్రాణాదుల కంటెఁ బరుఁడయి యొప్పుచుండును. అతఁడు మాయాజన్యములయిన సత్త్వాదిగుణములు లేనివాఁడు. ఇట్లతఁడు నిర్గుణుఁడై యొప్పుచున్నను శరీరాంతర్యామియై వానిని ధరించుచున్నాఁడు. అతనిస్వరూపముచేతనే బ్రహ్మ మొదలు స్తంబపర్యంతముగల స్థూలసూక్ష్మరూపములచే నొప్పుప్రపంచము వ్యాప్తమయినది. ఇందువలన బ్రహ్మాదిశరీరములు వ్యాప్యములనియు నాత్మ వ్యాపకుఁడనియుఁ దేటపడుచున్నదిగదా. ఆత్మ వ్యాపకుఁడగుటవలనను, నిరతిశయసూక్ష్ముఁడగుటవలనను, ననాదియగుటవలనను, దేహాదులకంటె విలక్షణుఁడగుటవలనను, దేహాద్యుపాధులచేఁ గలిగెడి చావుగాని జన్మముగాని యతనికిఁ గలుగదు. ఓయీ! నేను స్థూలరూపుఁడను, నేను దేవుఁడను, నేను మనుష్యుఁడను, ననుచుఁ జెప్పవలసివచ్చినప్పుడు దేహాత్మలకభేదమే గోచరమగుచుండుటంబట్టి దేహాదులతోఁగూడ నాత్మకు జననమరణాదు లెందుకు సంభవింప వని యడిగినచోఁ దెలివెద నాలింపుము. పుణ్యపాపకర్మనిమిత్తములయిన స్థూలత్వాదిదేహధర్మములు పరమాత్మయందారోపించుకొనుటంజేసియట్టిప్రతీతికలుగుచున్నది. కాని యతనికి జననమరణాదులులేవు.మఱియు మానవుండు స్వప్నమందు నద్భు

తమయిన పదార్థములను జూచుచున్నాఁడు. పిమ్మట స్వప్నదృష్టం బులగు పదార్థములు నాశనము చెందినప్పుడు నాస్వప్నద్రష్టకు నాశనము లేదు. ఇది యందఱికిఁ దెలిసినవిషయమేకదా? అట్లు దే హాదులు జననమరణాదులు కలిగియున్నను దేహాదిసంబంధము వలన నవి యాత్మ కెంతమాత్రము కలుగనేరవు. ఇట్టియాత్మకు మాయాసంసర్గ మెట్లు కలిగినదో చెప్పెద వినుము. * జగదాది

---

* పురుషుఁడు జీవుఁడనియు, నీశ్వరుఁడనియు రెండువిధములయి యుండును. ప్రకృతియు నావరణశక్తియనియు, విక్షేపణశక్తి యనియు రెండువిధంబులు. అందు జీవుఁడు ప్రకృతిని దెలిసికోలేక తద్వశుండయి సంసారంబునం బడును. ఈశ్వరుండు ప్రకృతి నెఱింగినవాఁడై కావున నే తద్వశుండు కాక విక్షేపణశక్తిచే సృష్ట్యాదివ్యాపారములను జక్కఁ దిద్దుచుండును అందుఁ బ్రకృతినెఱుంగక సంసారంబునఁబడినవాఁ డావరణశక్తిచేఁ దిరోహితుఁడగుచుండు ననిచెప్పి-శ్లో॥ "సఏషప్రకృతింసూత్త్రాం దైవీంగుణ మయీంవిభుః । యదృచ్ఛ యైవోపగతా మభ్యపద్యత లీలయా" యను శ్లోకముచేఁ గొందఱాత్మకుఁ బ్రకృతిసంబంధంబును జెప్పుచున్నాఁడని వ్యాఖ్యానముచేయుచున్నారు. కాని యది యనంగతము. ఆత్మస్వప్రకాశస్వరూపుఁడని యంగీకరించుచున్నారు. అవిద్యకు విరోధియగు స్వప్రకాశముగలయాత్మ కవిద్యాసంబంధంబు గలుగుట యే దుస్తరము. ఆత్మ ప్రకాశరూపమయినది. అవిద్య చీకటివంటిది. ప్రకాశమునకుఁ జీకటిసంబంధ మెప్పుడయినను గలుగునా? కలుగదు.అట్లై,యాత్మకవిద్యా సంబంధము కలుగుట యసంభవము. అట్టిసంబంధమే యసంభవ మగుచుండ "నేను బ్రకృతి స్వరూపుఁడ" నని యనుకొనుట యెట్లు? అదిలేనప్పుడు సంసారపతన మెట్లు? కావున నిది సముచితముకాదు. "ఓయీ! సృష్ట్యాది వ్యాపారము లీలారూపమగుచున్నది. కాన యట్టిలీల సంపాదించుకొనుట కావరణశక్తిచేఁ దిరోహితుఁడయి మోహము చెందుచున్నాఁడు. కావున సంసారపతనము సంభవించున"ని యందుకేని యట్లన వీలులేదు. "లీలాసంపాదన

జీవునికిఁ గలిగినప్రకృతిసంబంధమును నిరూపించుట

యందుఁ బ్రకృతి నిరతిశయ సూక్ష్మదశను బొంది, కావునఁనే నా

ముకై యావరణశక్తిచేఁ దిరోహితుఁడయి భ్రాంతి చెందుచున్నాఁడని చెప్పుచున్నారు''. అనఁగా నేమి యర్థము? లీలవలన భ్రాంతికలుగుచున్నదని చెప్పుదురా? లేక భ్రాంతివలన లీలకలుగుచున్నదని చెప్పుదురా? లేక భ్రాంతియే లీలయని చెప్పుదురా? వానిలో లీలవలన భ్రాంతి కలుగుచున్నదని చెప్ప వలనుపడదు. లీలచేతను దనకు భ్రాంతి సంపాదించుకొనుటయే యనుపపన్న మగుచున్నది. మఱియు, నీశ్వరుఁడు బ్రహ్మ॥ ''బహుస్యాం ప్రజాయేయ'' యని సంకల్పించుకొని లీలారూపమయినసృష్ట్యాదివ్యాపారమునుజేయుచున్నాఁడు. కాని భ్రాంతుఁడనగుదునని సంకల్పించికొని సృజింపలేదు. ''ఇంతియకాక లోకములో నేను భ్రాంతిపాందెదనని'' భ్రాంతి చెందుట యెచ్చటను జూచితిమా! కావున లీలచేత భ్రాంతిసంపాదన మసంభవము. మఱియు లీలార్థము సృష్ట్యాదివ్యాపారము చేయునట్టి యీశ్వరుఁడు సర్వజ్ఞుఁడా? లేక యజ్ఞుఁడా? సర్వజ్ఞుఁడని యందురేని, అతనికి సమస్తము తెలి యుటంజేసి కావున సంసారము తనకనర్థకరమని తెలిసికొని తాదృశసంసారమును బ్రవర్తింపఁజేయనేచేయఁడు. అతఁడజ్ఞుఁడు కావునఁ దెలియమిచేసంసారమును బ్రవర్తింపఁజేయుచున్నాఁడందురేనినీశ్వరునకుసర్వజ్ఞత్వముఁ దెలియఁజేయుశ్రుతులకువిరోధముకలుగుచున్నది. ''ఓయీ! యీశ్వరుఁడు సర్వజ్ఞుఁడనియే చెప్పదుము సృష్ట్యాదులొనరించుటవలనఁ దన కనర్థము సంప్రాప్తముగునని యతనికిఁ దెలియు. జ్ఞాననిష్పత్తిచే సంప్రాప్తమగు ననర్థములఁ దొలఁగించుకొనవచ్చుననిజగంబులసృజించిన సృజింపవచ్చునే!'' యని యందురేని యట్లు చెప్పఁబలనుపడదు. ఈశ్వరునికి లోకసృష్ట్యాదియగు వ్యాపారము లీలామాత్రమని యంగీకరింపక తీఱదు. అది యన్నిమతములవారు నంగీకరించిరి. నీవు చెప్పినట్లు జగత్సృష్టి స్వానర్థపరిహారము నిమిత్తమన్నచో, లీలామాత్రమనుట యెట్లు పొసఁగును? అనర్థపరిహారరూపమగు ప్రయోజనముండఁగా లీలార్థమెట్లగు? రోగపీడితునకు నౌషధముకొనివచ్చుట లీలార్థమగునా? కాదు. కావున లోకసృష్ట్యాదులు లీలార్థమని యంగీకరించుటచేతనకు నచ్చెడియనర్థములఁ దొలంగించుకొన

మరూపముల విభజింప నర్హము కాకయుండును. అది విష్ణువు నకు లీలలను సంపాదించునదికావున జీవునికిఁ దత్సంబంధము సహజముకాకపోయినను యథేచ్ఛముగానే సంప్రాప్తమగుచుండును.

వచ్చునని చెప్పవీలులేకపోవుటచేతను, సర్వజ్ఞుఁడగు నీశ్వరుండు తన కనర్థము కలిగించు సంసారమును, బ్రవర్తింపఁజేయనివాఁడగుటచేతను, లీలచేత భ్రాంతి సంపాదన మనంభవము. అందువలన లీలవలన భ్రాంతికలుగుచున్నదని చెప్పవలనుపడదు. భ్రాంతివలన లీల కలుగుచున్నదనయుఁ జెప్పరాదు. అట్లుచెప్పినచో లీలారూపకమయిన "బహుస్యాం" మనుసంకల్పము లీలారూపకముకాక భ్రాంతిమూలకమయి యుండవలయు. కాని ఈశ్వరున కీసంకల్పంబు నకుఁ బూర్వము భ్రాంతియేలేదు. కావున నిది యసంభవమే. లీలయనఁగా భ్రాంతియనియు చెప్పెదమన్న నట్లుచెప్పరాదు. అట్లేచెప్పినచో భ్రాత్యాది వికారములచేఁ గలుగు భ్రమలన్నియు లీలలే కావలసివచ్చును. కావున లీలారూపమగు సృష్ట్యాదివ్యాపారమును జక్కఁజేసికొనుట కావరణశక్తిచేఁ దిరోహితుఁడయి భ్రాంతుఁడగుచున్నాఁడని చెప్పరాదు. ఈశ్వరుఁడు తాను భ్రాంతిచెందక లీలచేతను బరులను మోహింపఁజేయుచున్నాఁడనియుఁ జెప్పరాదు. నీమతమందు జీవేశ్వరుల కైక్యమంగీకరింపఁబడుటచేతను నీశ్వరునికి భ్రాంతిలేదని చెప్పుటచేతను, భ్రాంత్యాదులవలనఁ దనకంటె నితరులను జూచుటయె యసంభవము. ఒకవేళఁ బరదర్శనము సంభవించినను నతని కాజీవులతనికంటె భిన్నులు కారనెడి జ్ఞానముకలిగియుండును.మఱియు నీమతమందు నిర్విశేష సన్మాత్రుఁడగు పరబ్రహ్మ నిర్విశేషుఁడుగాన లీల సంభవింపనే సంభవింపదు. ఈశ్వరుఁడు సర్వజ్ఞుఁడును సంసారరహితుఁడును, జీవులను దనకంటె నన్యులనుగాఁ జూడనివాఁడునుగాన నతనికి జననమరణాదులను గలిగించు నరకపతనాదివ్యాపారంబు లీలామాత్రముకాదు కావున నీశ్లోకముచే జీవునికి సంసారప్రకారమును జెప్పరాదు. మఱేమి చెప్పవలయు ననఁగా సకలహేయాంబులను నిరసించు ననంతకల్యాణగుణంబుల కాకరుఁడయిన

అది సత్త్వాదిగుణ ప్రచురమయినది. అట్టి మాయను నిరతిశయ సూక్ష్ముఁడగుటవలన సర్వాంతర్వ్యాపకుఁడగు ప్రత్యగాత్మ చూచె ను.ఓయీ!యథేచ్ఛముగాఁగలిగిన భగవంతునిసంకల్పముచే జీవు నకుఁ బ్రకృతిసంబంధము కలిగినఁ గలుగవచ్చును. కానికర్తృత్వా దిక మెట్లు వచ్చినదని యందువేని చెప్పెద. విను. దేవమనుష్యాది రూపములచే బహువిధములవారయినను బ్రకృతిపరిణామత్వ మునుబట్టి యేకరూపులయిన ప్రజలను సత్త్వాదిగుణములచేఁ గార్య దశయందు సృజించుచున్నప్రకృతిని బొడగాంచి జ్ఞానమును గప్పి పుచ్చునదగు దానియందుఁ దా ననెఱిఁబుద్ధిని గలిగించుకొనెను. ఇట్లు ప్రకృతిచేఁ దనస్వరూపము కప్పఁబడియుంటఁ జే జీవుఁడు స్వ స్వరూపమును మఱచి ప్రకృతిగుణము లొనర్చుచున్నకర్మముల కర్తృత్వమును దనయం దారోపించుకొనుచున్నాఁడు. కావున జీవునకు సాంసారిక ప్రవృత్తులందుఁ గర్తృత్వము గుణత్రయము వలనఁ గలిగినదేకాని స్వరూపప్రయుక్తమయినదికాదు. వాస్త వముగా జీవుఁడు సంసారబంధములేనివాఁడు. అతనికి గమనాగ మనాదులయిన సాంసారిక ప్రవృత్తులందుఁ గర్తృత్వము లేదు. అతఁడు కర్మనశించుఁడుకాఁడు. అతఁడు జ్ఞానగుణము కలవాఁడు. మఱియు జ్ఞానస్వరూపుఁడు. ఓతల్లీ ! కావున జీవస్వరూపము జ్ఞాన గుణముకలిగి జ్ఞానస్వరూపమయి పాపనివృత్తిచేసికొనుట మొద లగు నెనిమిదిగుణములు కలిగి ప్రకృతిరహితమైయున్నదియే యని

యీశ్వరునకు లీలాసాధనమై తన్నియామ్యమైయున్న మాయనే, వాస్తవముగా నీశ్వరునకు లీలారూపమయిన జగత్సృష్ట్యాదివ్యాపారమును నిర్వర్తించునిమిత్త మై యతనికి శరీరభూతుఁడయి తిద్విలక్షణుఁడయియున్న ప్రత్యగాత్మకు మా యాసంబంధ మిశ్లోకముచేఁ జెప్పఁబడినదని గ్రహింపవలయును.

గ్రహింపుము. * ఓజననీ! భోగసాధనభూతములయిన క్రియల క

* ఇచటఁ దెలియఁదగినయంశ మేమనఁగా! మొదట జీవాత్మలు సంకుచితముకాక యపరిచ్ఛిన్నమై నిర్మలమైయున్న జ్ఞానమే స్వరూపముగాఁ గలవా రయినను గర్మరూపయగు నవిద్యచే నావృతులై యుండురుకాన యాయాకర్మముల కనుగూపమగు జ్ఞానసంకోచమును బొందుచు, బ్రహ్మాదిమొదలు స్తంబపర్యంతము గల వివిధవిచిత్రదేహంబుల బ్రవేశించి యాయాదేహముల కనుగుణమగు జ్ఞానప్రసారము కలవారయి, యాయాదేహంబులం దభిమానంబుగలిగి, వాని కుచితములగు కర్మముల నాచరించుచు, వాని కుచితములగు సుఖదుఃఖంబుల ననుభవించుచు, సంసారప్రవాహంబును బొందుచున్నారు. ఓయీ! ఆత్మ, జ్ఞానస్వరూపుఁడనియు స్వయంప్రకాశుఁడనియుఁ జెప్పియున్నావుకదా! అట్టి జీవునికి దేవాదిస్వరూపములు దాత్మాభిమాన మున్నదనిచెప్పినచో స్వరూపప్రకాశమునకు దిరోధాన మవశ్యము నంగీకరింపవలసియున్నది. అట్లు స్వరూపప్రకాశమునకుఁ దిరోధానము చెప్పనిచో నాత్మయందు మఱియొకయాకారము నారోపించుకొనుటయే యసంగతము కావలసివచ్చును. అట్లు స్వరూపప్రకాశతిరోధాన మంగీకరించినచో స్వరూపనాశప్రసంగము కలుగుచున్నది. కాన యిది యెట్లు సరిపడుననియందువేని చెప్పెదవిను. మాయతమం దాత్మజ్ఞానస్వరూపుఁడనియు, జ్ఞానగుణము గలవాఁడనియుఁగూడ నొప్పియున్నారము. ఆత్మధర్మభూతజ్ఞాన మగుచున్నాఁడు; మఱియు ధర్మభూతజ్ఞాను కలవాఁడు నగుచున్నాఁడు. కావున ధర్మభూతజ్ఞానమునకే తిరోధాన మంగీకరించెదము కాని స్వరూపజ్ఞానమున కంగీకరింపము. పటమునందలి యెఱుపురంగు నశించినను బటము నశింపనివిధమున ధర్మభూతజ్ఞాను కప్పఁబడినంతమాత్రమున స్వరూపనాశన ముకలుగదు. ఓయీ! ధర్మభూతజ్ఞానమునకైనను దిరోధాన మవశ్య మంగీకరింతురుకదా? ఇఁక దిరోధానమనఁగా గర్మరూపమగు నవిద్యచే బ్రకాశోత్పత్తికిఁ బ్రతిబంధమనియర్థము చెప్పదురా? లేక స్వతస్సిద్ధముగానున్న ప్రకాశము నివర్తించుటయే యనియర్థము చెప్పదురా? మైని జెప్పినపక్షములలో దేని నంగీకరించినను నిత్యమని యంగీకరించినధర్మభూతజ్ఞానము నశింపవలసి

న్నింటికిని బురుషుని కధిష్ఠానభూతమయి శరీరాకారముగాఁ బరి

వచ్చుచున్నది యని చెప్పవలనుపడదు. ఇచటఁ దిరోధానపదమునకు మీరు చెప్పిన ట్లర్థము చెప్పము. ఆత్మకు ధర్మభూతమగుజ్ఞానము స్వాభావిక మైనదయి నను గర్మసంబంధముచే నంకోచమును వికాసంబును బొందుచున్నదని చెప్పెదము. ఇప్పుడు జ్ఞానముయొక్క సంకోచవికాసములు కర్మాధీనము లగుటంజేసియు, నేను దేవుఁడను, నేను మనుష్యుఁడను నానెడిభ్రమ యాత్మ నపేక్షించియుండుటంజేసియు, స్వయంప్రకాశరూపమగు ధర్మిస్వరూప మైన భ్రమ కధిష్ఠానమై యొప్పుచుండును. ఆత్మ, శుక్త్యాదులవలె జడపదార్థము కాదు, కనుక నిందువిషయమయి మఱియొక జ్ఞానము నపేక్షింప నవసరములేదు. కాని భ్రమకు విరోధులై యాత్మయందుండు నిత్యత్వాదిధర్మములుమాత్రము జ్ఞానాంతరవేద్యములే. తాదృశ నిత్యత్వాదిధర్మములను దెలుపునట్టి జ్ఞానమునకుఁ దిరోధానము గలిగిన చో నాత్మయందు దేవాదిభ్రాంతి కలుగుచుండును. జ్ఞానతిరోధానములేనిచో స్వస్వరూపజ్ఞానము కలుగుచుండును. ఇట జ్ఞానతిరోధానమనఁగా ధర్మభూత జ్ఞానమునకు ధర్మమగు ప్రసారాఖ్యరూపప్రకాశమయొక్క నివృత్తి యని యర్థము. ధర్మభూతజ్ఞానమందుండు ప్రసారాఖ్యధర్మము నివర్తించుటయే సంకోచమనియు, తాదృశ ప్రసారాఖ్య ధర్మముండుటయే వికాసమనియును నర్థముచెప్పెదము. ఆత్మయందుండు నిత్యత్వాది ధర్మములను దెలుపునట్టి జ్ఞానముయొక్క ప్రసారాభావము సంకోచమనియుఁ దాదృశ జ్ఞానప్రసరమే వికాసమనియు నంగీకరించుటచే, నాప్రసరము లేనప్పుడు దేవాదిభ్రమ కలుగుచుండుననియు, నాప్రసరమున్నప్పుడు స్వరూపజ్ఞానము కలుగుచుండుననియు, జ్ఞానప్రసరమునకే తిరోధాన మంగీకరించుటచే ధర్మిభూతజ్ఞానము ధర్మభూతజ్ఞానము నిత్యమనియుఁ దెల్లమగుచున్నది. కావున మామతమందు స్వరూపనాశప్రసక్తి లేదు. జ్ఞానము నిత్యమనుటయు స్థిరపడినది. ఇట్లు ధర్మిభూతజ్ఞానమును, ధర్మభూతజ్ఞానము నొప్పి ధర్మభూతజ్ఞానమునకు ధర్మమగు ప్రసరమునకుఁ దిరోధాన మంగీకరింపక, కేవలము జ్ఞానస్వరూపమే యాత్మయనెడి యద్వైతులమతమందు జ్ఞానస్వరూపమునకుఁ దిరోధాన మంగీకరించినప్పుడు స్వరూపనాశప్రసక్తిగలు

ణమించియున్నప్రకృతియే కారణమని చెప్పుదురు. శరీరము నధి

గికమానదు, ఓయీ! ధర్మిభూతజ్ఞానమనియు, ధర్మభూతజ్ఞానమనియు నాఁబడు జ్ఞానద్వయము నాశ్రయించి ధర్మభూతజ్ఞానమునకు ధర్మిభూతజ్ఞాన మాశ్రయమగు చున్నదని చెప్పుచున్నారు. జ్ఞానము జ్ఞానాంతరము నాశ్రయించియుండుట యెచ్చటను జూడలేదేయని యడుగవచ్చును. జ్ఞానము జ్ఞానాంతరము నాశ్రయింప దనుట యనుభవసిద్ధమా, లేక శ్రుతిసిద్ధమా? అనుభవసిద్ధమన వీలులేదు. జ్ఞాన మెప్పుడు నొకానొకదాని ధర్మమైనట్లే తోఁచుచున్నదికాని స్వతంత్రవస్తువైనట్లు గానరాదు. స్వతంత్రవస్తువు కానప్పుడది దేనికైన నాశ్రయింపవలసియుండును మఱియు జ్ఞాన మాత్మకంటె నితరపదార్థముల నాశ్రయించియుండదు. మామత మందు ధర్మభూతజ్ఞానమొకటి ప్రత్యేకముగా నంగీకరించియున్నాము. కాన ధర్మభూతజ్ఞానమునకు ధర్మిభూతజ్ఞాన మాశ్రయమగుచున్నదని చెప్ప వీలగుచున్నది. కాని ధర్మభూతజ్ఞానము నంగీకరింపక మీమతస్థుం డాత్మ జ్ఞానస్వరూపుఁడనిమాత్రము స్వీకరించుటచే నాత్మకూడ నొకదానికి ధర్మమయి యుండవలసివచ్చును కావున మేము చెప్పినట్లు ధర్మభూతజ్ఞానమును గూడ సంగీకరింపవలయును. లేక శ్రుతిసిద్ధమని యందురేని శ్రుతులు జ్ఞానము జ్ఞానాంతరము నాశ్రయింపవచ్చుననియే చెప్పుచున్నవికాని యట్లుండరాదని చెప్పలేదు. శ్రు॥ "కర్తా బోద్ధావిజ్ఞానాత్మా" అనఁగా విజ్ఞానస్వరూపుఁడగు నాత్మ కర్తృత్వాశ్రయుఁడును బోధృత్వాశ్రయుఁడు నగుచున్నాఁడని యర్థము. ఇట జ్ఞానస్వరూపుఁడగు నాత్మ జ్ఞానాశ్రయుఁడగుచున్నట్లు చెప్పఁబడుచున్నదికాని జ్ఞానము జ్ఞానాంతరము నాశ్రయింపవచ్చును. అన్నివిధముల నాలోచింప ధర్మిభూతజ్ఞానము ధర్మభూతజ్ఞానమును దప్పక యంగీకరింప వలయును. ఓయీ! "ప్రకృతేః పుమాన్। కర్మసుక్రియమాణేషు గుణైరాత్మనిమన్యతే" అని చెప్పఁబడియున్నది. అనఁగా ప్రకృతిగుణములగు సత్త్వాదిగుణములచేఁ గర్మములు జేయఁబడుచుండఁగా బురుషుఁడు గుణములకర్తృత్వమును దనయందారోపించుకొనుచున్నాఁడు. మఱియు నధ్యాత్మశాస్త్రములం దాత్మ కర్తకాఁడనియుఁ ప్రకృతిగుణములే కర్తలనియుఁ జెప్పఁబడుచున్నది. కఠవల్లియందు. శ్రు॥ "నజాయతే నమ్రియతే"

స్థింపఁజేసికొనును యత్నమునందునూత్రమే కర్తృత్వమును, మ

అని చెప్పఁబడియున్నది. అనఁగా నాత్మోపుట్టునాఁడుకాఁడు. చచ్చువాఁడు కాఁడు. అనియర్థము. ఈచెప్పుటచే జననజరామరణాదిధర్మములు ప్రకృతివే కాని యాత్మవికావని స్పష్టమగుచున్నది. ఇంతియకాక హననాదిక్రియలందుఁ గూడ నాత్మకుఁ గర్తృత్వము నిషేధింపఁబడుచున్నది. హననాదిక్రియలయందాత్మకుఁ గర్తృత్వము లేదన్నందులకు బ్రమాణము. "హంతాచేన్మన్యతే హంతుం హతశ్చేన్మన్యతేహతం। ఉభౌతౌ నవిజానీతో నాయంహంతి నహన్యతే" ఇందువలన నాత్మను జచ్చినవానిగాఁ దలంచినవార లాత్మపదార్థము నెఱుంగరనుతాత్పర్యము తెల్లమగుచున్నది. ఇదియే భగవద్గీతయందుఁగూడ స్పష్టముగాఁ జెప్పఁబడినది ఎట్లన- శ్లో॥"ప్రకృతేః క్రియమాణాని గుణైఃకర్మాణినిత్యశఃఅహంకారవిమూఢాత్మా కర్తాహమితిమన్యతే॥ నాన్యం గుణేభ్యఃకర్తారం యథాద్రష్టానుపశ్యతి । కార్యకారణకర్తృత్వే హేతుఃప్రకృతిరుచ్యతే । పురుషస్సుఖదుఃఖానాం భోక్తృత్వేహేతురుచ్యతే" అనఁగాఁ బ్రకృతిసంబంధులగసత్త్వాదిగుణము లెల్లప్పుడును గర్మంబుల నొనరించుచుండఁగా నహంకారముచే వ్యామోహము చెందినవాఁడయి యాత్మ తానే కర్తయని తలంచుచున్నాఁడు. కానిగుణములకంటె భిన్నుఁడగు కర్తగాఁదలఁపరాదు. సమస్తక్రియలకును గారణమును గర్తయుం బ్రకృతియనియే యెఱుంగవలయును. పురుషుఁడు సుఖదుఃఖంబుల ననుభవించుటకే హేతువగుచున్నాఁడని తాత్పర్యము. ఈచెప్పుటంబట్టియుఁ బ్రకృతికే కర్తృత్వమున్నట్లును బురుషుఁడే భోక్తయగుచున్నట్లును దెల్లమగుచున్నది. కాని యాచెప్పినదానికిని "కర్తారశాస్త్రార్థవత్త్వాత్" అను నధికరణమునకు విరోధము సంభవించుచున్నది. కర్తృధికరణమునం దాత్మయె కర్తయనియు గుణములు కర్తకావనియుఁ జెప్పఁబడినది. అట్లుచెప్పినచో శాస్త్రములు చరితార్థములుకావు. ఎట్లనఁగా "యజేతస్వర్గకామః" స్వర్గము నపేక్షించువాఁడు యజ్ఞముచేయవలెనని యర్థము. "ముముక్షుర్బ్రహ్మోపాసీత" ముక్తి నపేక్షించువాఁడు పరబ్రహ్మనుపాసింపవలయుననని యర్థము. ఇట్టివిధివాక్యములందు యజ్ఞాదిక్రియలయందును వానివలన సంప్రాప్తంబగు ఫలం

ఆయుఁ దన కధిష్ఠానమయిన శరీరముగాఁ బరిణమించిన ప్రకృతి

బుల ననుభవించుటయందును నాత్మయు కర్తగా నంగీకరింపఁబడుచున్నది. మఱి యు నెవఁడు యజ్ఞము కావించునో వాఁడే స్వర్గఫల మనుభవింపవలయును. ఎవఁడు పరబ్రహ్మము నుపాసించునో వాఁడే ముక్తి చెందవలయునుగాని యొకఁడు చేసినకర్మముల ఫలమును మఱియొకఁ డనుభవించుట యనుభవవిరుద్ధము. విధి నిషేధంబులం దాత్మను గర్తగా నంగీకరించినచే చరితార్థము లగునుగాని లేనిచో వ్యర్థములే. మఱియు ''శాస్త్రిఫలం ప్రయోక్తరి'' అనఁగా శాస్త్రాదుల లెస్సగా నాచరించినవానికే తత్ఫలము చెందవలయునని చెప్పఁబడుచున్నది. కొన్నింటియం దాత్మ కర్తకాఁడనియు, గుణములే కర్తలనియుఁ జెప్పఁబడుచున్నది. మఱికొన్నింటియం దాత్మయే కర్తయని చెప్పఁబడుచున్నదికదా? ఈవిరోధము నెట్లు పరిహరింపవలయునని పూర్వపక్షము. దీనికి సిద్ధాంత మేమనఁగా కర్తృధికరణమునం దాత్మకు శరీరమున కధిష్ఠాతయై యుండుటలోనే కర్తృత్వ మంగీకరింపఁబడుచున్నది. ''హంతాచే న్మన్యతే'' ''నజాయతే మ్రియతే'' ఇత్యాదిస్థలంబులం దాత్మ నిత్యుఁడు కనుక నతనికి జననమరణాదులు లేవనుటయు చెప్పఁబడుచున్నది. ''ప్రకృతేః క్రియమాణాని'' అను భగవద్గీతయందు జీవునికి సాంసారికప్రవృత్తులయందుఁ గర్తృత్వ మంగీకరించుచున్నను, నది సత్త్వరజస్తమోగుణములసంపర్కమువలనఁ గలిగినదికాని స్వరూపప్రయుక్తమైనది కాదు. ఈయంశము గీతలలోనే మఱియొకస్థలమందు స్పష్టముగఁ జెప్పఁబడుచున్నది. ''కారణం గుణసంగోస్య సదసద్యోనిజన్మసు'' అనఁగా సాంసారికప్రవృత్తులందు జీవునికిఁ గలుగుచున్న కర్తృత్వము సత్త్వాదిగుణకృతమయినది. కావున నీచెప్పటవలన ఫలితార్థ మేమనఁగా, జీవునికిఁ దన కధిష్ఠానభూతమగు శరీరమునధిష్ఠించుటలోమాత్రమే కర్తృత్వము గలుగుచున్నది. సాంసారికవ్యాపారములం దితనికి గుణసంబంధంబువలననే కర్తృత్వము సంభవించుచున్నది. కాని స్వరూపప్రయుక్తమయినది కాదు. కావున, వెనుకఁజూపఁబడిన యధికరణవిరోధము తొలంగుచున్నది. ఇట్లు సాంసారిక ప్రవృత్తులయందుఁ గర్తృత్వము ప్రకృతి సంబంధమువల

యొనర్చుచుండిన కర్మములకు ఫలరూపములగు సుఖదుఃఖం బుల భోక్తృత్వమ్మును బురుషునికిఁ గలుగుచున్నవి. అని చెప్పుచున్న కపిలాచార్యుని వాక్యంబులు విని దేవహూతి యిట్లనియె. "ఓపురుషోత్తమా ! కార్యావస్థకుఁ బూర్వమం దు జగత్కారణములయి నామరూపవిభాగమునకుఁ దగనంత సూక్ష్మదశను బొందినవగుటచే భగవంతునికి శరీరమైయున్న ప్రకృతిపురుషుల కార్యభేదములను దెలియఁజేయుము. మ ఱియుఁ గారణభూతులయిన పిత్రాదులును, గార్యభూతులయి న పుత్రాదులును ప్రకృతిపురుషాత్మకు లయినవారే కావున వారిలక్షణంబులును దెలుపవలయును." అని యడుగ దేవ హూతికిఁ గపిలుం డిట్లనియె. 'జననీ ! ప్రకృతిపురుషుల కా ర్యావస్థలను దెలుపుటకుఁ బూర్వము ప్రకృతి కారణ కార్యావస్థ లను సంగ్రహముగాఁ దెలిపెద నాలింపుము. కారణావస్థయందుఁ బృథివ్యాది విశేషములులేక కావునచే నామరూపములవిభజింప ననర్హమయి సత్త్వరజస్తమోగుణరూపమయి యుండును. అది కా రణావస్థయందుండు ప్రకృతిస్వరూపమని తెలియుము. ఆ ప్రకృ తియే కార్యావస్థయందుఁ బృథివ్యాదివిశేషములతోఁ గూడినద యి మహత్తత్త్వము మొదలు పృథివివఱకుఁ గల కారణములు గాను బ్రహ్మమొదలు తృణమువఱకుఁ గల కార్యములుగాను బరిణమించుచున్నది. జ్ఞానకర్మేంద్రియంబులును, బంచభూత

నచే కలిగినది కాని స్వరూపప్రయుక్తమయినది కాదన్న యర్థమునే తెలియ పఱుచుచు శరీరాధిష్ఠాతృరూపక కర్తృత్వము కలవాఁడు కావునచే, యాత్మ సాంసారికప్రవృత్తులందుఁగూడఁ దత్ప్రవృత్తికి ఫలములగు సుఖదుఃఖంబుల ననుభవించుచున్నాఁడనునర్థమును దెలియఁజేయుచున్నాఁడు.

ములును,బంచతన్మాత్రములును,నంతఃకరణచతుష్టయమును గలి
సి చతుర్వింశతితత్త్వము లయ్యెఁ. ఈతత్త్వసమూహము ప్రకృ
తికార్యసమూహమని చెప్పుదురు. మఱియు సత్త్వాదిగుణరూ
పమగు ప్రకృతికిఁ గార్యభూతములగు పృథివ్యాదులే శరీరము
గాఁ గలుగు పరబ్రహ్మయవస్థావిశేషమే యీతత్త్వసమూహము
ని యెఱుంగుము. కాల మిరువదియైదవ తత్త్వమని కొందఱుం
దురు. కాని మఱికొందఱు కాలమనఁగాఁ బ్రపంచకముయొక్క
సృష్టిస్థితిలయములు కావించుచున్న పరమపురుషునిసామర్థ్యమే
కాని తత్త్వములలోని దొకటి కాదని పల్కిరి. కాని కాలము
ను గుఱించి నేనట్లు తలంపను. అనాత్మయయిన దేహాదులయం
దు నాత్మయనెడి యభిమానముచే మోహితుండై స్వస్వరూ
పమును మఱచియున్న జీవుఁడును, నామరూపాగివిశేషములేని
దయి సంహారదశయందు సత్త్వరజస్తమోగుణముల సామ్యా
వస్థకలదయియున్న ప్రకృతియు, ప్రపంచరూపముగాఁ బరిణ
మించుటయనెడి వ్యాపారము లేఁ భగవంతునివలనఁ గలుగుచున్న
వియో యాభగవంతుఁడే కాలస్వరూపుఁడని యెఱుంగుము.
నీకుఁ బ్రకృతిపురుషకాలముల స్వరూపమును జెప్పితిని. అందుఁ
బ్రకృతి పృథివ్యాదిభూతరూపము నొందినది. కావున నది యెల్ల
రకుఁ దెలియవచ్చుచున్నది. కాని పురుషకాలములకుఁ బ్రకృతికి
వలె స్థూలరూపపరిమాణములేదు. కావున వానిని రెండింటిని
యుక్తిచేతఁ గనుఁగొనవలయును. కాని ప్రత్యక్షముగాఁ గాన
లేము.మఱియుఁ బృథివ్యాదులవలనఁ గలిగిన సమస్తభూతముల
లోపలఁ బురుషరూపముతోఁ బ్రవేశించి రాగద్వేషసుఖదుఃఖా
దుల కాశ్రయుఁడై యెవఁడు వెలుంగుచున్నాఁడో, యట్టి

భూతజాతము బహిర్భాగములందుఁ గాలరూపము గలవాఁడయి యెవఁడు ప్రకాశించుచున్నాఁడో, అట్టివాఁడు భగవంతుఁడే. కావునఁ బురుషకాలములు భగవత్స్వరూపములని చెప్పవచ్చును. ఓజనసీ! నీ కిప్పుడు భగవంతుఁడు ప్రకృతిపురుషరూపశరీరము కలవాఁడని చెప్పితిని. ఇంక సృష్టిక్రమమును జెప్పెదను. అవధరింపుము. ఆపరమపురుషుఁడు దైవసంకల్పమువలన గుణములు వ్యత్యస్తమైనట్టి ప్రకృతియందు నహదాది ప్రపంచమును సృజింపఁదగినసామర్థ్యము నుంచెను. అంత నాప్రకృతి కాంతిచేఁ బూర్ణమైన మహత్తత్త్వమును బుట్టించినది. జగత్కారణుఁడును నిర్వికారుఁడునగు భగవంతుఁడు ప్రళయకాలమందుఁ దనయం దిమిడియున్న సమస్తప్రపంచమును వెల్లడిపఱుపఁ దలంపుగలవాఁడయి యట్లుచేయుచు జీవాత్మలకు జ్ఞానసంకోచము కలిగించుతమోగుణమును దిరస్కరించెను. అట్లు తమోగుణమును దిరస్కరించుటచే సత్త్వగుణంబుగలదయి, కావుననే స్వచ్ఛమై భగవంతునిఁ బొందఁదగినదై యేది వాసుదేవనామముగలవ్యూహముచే నధిష్ఠితమగుచున్నదో, * యేది యంతఃకరణభేదమగు చిత్తమున కనుగ్రాహకమగుచున్నదో యట్టి యవ్యక్తమే మహత్తత్త్వముగాఁ బరిణమించినది. ఓయీ!

---

*ఇందులకు మూలము "వాసుదేవాఖ్యంచిత్తం" అనియున్నది. ఇటఁ జిత్తానుగ్రాహకుఁడును, చిత్తమున కధిష్ఠాతయు నగువాసుదేవునకును, వాసుదేవున కనుగ్రాహ్యమును నధిష్ఠేయమును నగుచిత్తమునకు నభేదమనుబుద్ధితో నిది చెప్పఁబడినది. అంతియకాని సాత్త్వికాహంకారమునకుఁ గార్యమయిన యంతఃకరణభేదమగుచిత్తము వాసుదేవునిచే నధిష్ఠితమైయున్నదని, మహదాత్మకమయి యున్నదనికాని, దీనిచేఁ జెప్పుటలేదు. "చిత్తంచైత్యస్తతోభవ" అని ముందుచిత్తము

అవ్యక్తముచే నంతఃకరణ మెప్పు డనుగృహీతమై చిత్తమని చెప్పఁబడుచున్నదని యడుగుదువేని వినుము. జలము స్వభావసిద్ధమైన స్వచ్ఛత్వముకలిగి నురుఁగు, కెరటములు మొదలగునవి లేక ప్రతిబింబగ్రహణమునకు సమర్థమయినట్లు లెప్పుడు మనస్సు వికారాదులు లేక, కావునఁ జే శాంతమయి భగవద్రూపమును గ్రహింపఁ దగినంత స్వచ్ఛతకలిగియుండునో యప్పుడే మన స్సవ్యక్తమున కనుగృహీతమగుచున్నదని యెఱుంగుము. భగవంతుని సంకల్పజ్ఞానముచేఁ జోదితమయిన మహత్తత్త్వము వికారము నొందుట వలన సహంకార ముత్పన్నమయ్యె. అది రాజసమనియుఁ దామస

క్షేత్రజ్ఞుని కధిష్ఠానమగునని చెప్పఁబోవుటవలన వాసుదేవాధిష్ఠితత్వమని చెప్పరాదు. మఱియు మహత్తత్త్వమువలన జనించిన యహంకారమునకుఁ గార్యమయిన చిత్తము మహత్తత్త్వమైయుండుటకూడ నసంభవము. కారణము కార్యమందుండునేకాని కార్యము కారణముండదుకదా! ఒకవేళఁ గార్యము కారణమందుండునని చెప్పుటయు నంగీకరింపదగియుండుఁగాని సంభవింపనేరదు. ఇది సృష్టిప్రకరణము. దాని నెట్లంగీకరింపవలనుపడును? "మహదాత్మక" మని మూలమునఁ జెప్పుటచేత నంతఃకరణభేదమగు చిత్తము మహత్తత్త్వమున కనుగ్రాహ్యమనియు నూహింప వలనుపడదు. "మహోన్వై బుద్ధిలక్షణ" యనిచెప్పుటచే మహత్తత్త్వము బుద్ధికే యనుగ్రాహ్యముకాని చిత్తమునకుఁ గాదు. చిత్తము, బుద్ధియు, నంతఃకరణభేదములే కాన చిత్తశబ్దముచే బుద్ధియని వివిక్షచేసినను వలనుపడదు. "బుద్ధేర్గిరాంపతి" యని చెప్పఁబోవుటచే బుద్ధి గీష్పతి కధిష్ఠానము కాని వాసుదేవున కధిష్ఠాన మైయుండుట యనుచితము. కావున నిటఁ దమోగుణరహితమై సత్త్వగుణము కలదయిన యవ్యక్తమే వాసుదేవునిచే నధిష్ఠితమయి మహత్తత్త్వముగాఁ బరిణమించినదని యర్థము స్వీకరింపవలయు. మఱియు నవ్యక్తమున కధిష్ఠాతయగు వాసుదేవుఁడే మహత్తత్త్వమునకుఁగూడ నధిష్ఠాత యని చెప్పదురు.

మనియు, సాత్వికమనియుఁ ద్రివిధంబయి రజోగుణోద్రేకము కలిగి యుద్భవించెను. ఆత్రివిధంబగు నహంకారంబువలననే మనస్సు, నింద్రియదశకము, పృథివ్యాదిభూతములును, గంధాదితన్మాత్రలును నుద్భవించె. వేయిపడగలు గలయనంతుఁడు సంకర్షణుఁడనుపేరు కలవాఁడయి యీయహంకారము నధిష్ఠించె. అందువలన నది * సంకర్షణవ్యూహమని పిలువఁబడుచు భూతేంద్రియాదులకుఁ గారణమయినదయి యున్నదని చెప్పుదురు. ఓజనమీ! ఇంక నహంకారలక్షణంబులను, తనకుఁ గార్యభూతమగు నంతఃకరణ భేదాహంకారమున కనుగ్రాహకత్వమును, దెలిపెదను. వినుము. కర్తృత్వము, కరణత్వము, కార్యత్వము, సీమూఁడునుగాని, ప్రకాశకత్వము, విక్షిప్తత్వము, మూఢత్వము, నీమూఁడునుగాని యహంకారమునకు లక్షణంబులగు. వికారమును బొందిన సాత్వికాహంకారమువలన మనస్తత్త్వముదయించె. ఆమనస్సు దేహోత్పాదులొక్కటియే యనెడిసంకల్పమును, ననేకవిధములఁగాఁ జింతించుట యనెడి వికల్పమును గలిగి వర్తించుచుండును. † మనస్తత్త్వమునకుఁ గారణమగు సాత్వికాహం

---

* ఇది భగవంతుని నాలుగువ్యూహములలోను నొకటి. అది సంకర్షణునిచే నధిష్ఠిత మగుచుండును.

† ఇందులకు మూలము. "వైకారికాద్వికుర్వాణా న్మనస్తత్త్వమజాయత। యత్సంకల్పవికల్పాభ్యాం వర్తతే కామసంభవః" ఇట సామాన్యముగా సందర్భమునుబట్టి మనమున కధిష్ఠాత ప్రద్యుమ్నుఁడని యర్థము వచ్చుచున్నది. కాని యట్లుచెప్పరాదు. "మనసశ్చంద్రమాజ్ఞాత" అని యుండుటచే మనస్సున కధిష్ఠాత చంద్రుఁడని తెల్లమగుచున్నది. కాన మనఃకారణమగు సాత్వికాహంకారమునకే ప్రద్యుమ్నుఁడధిష్ఠాత యని తెలియఁదగినది. మఱియు మనస్సు సాత్వికాహంకారజన్యమైనను "లోభః ప్రవృత్తిరారంభః కర్మణామశమఃస్పృహా।

కారమును ప్రద్యుమ్నుఁడధిష్ఠించియుండును. కాన యది ప్రద్యుమ్నవ్యూహమని చెప్పఁబడుచున్నది. * ఇంద్రియముల కధిష్ఠాతయు, శరత్కాలమందుండు నల్లఁగలువవలె శ్యామలకాంతి గలవాఁడును, ఋషులచే లెస్సగా నారాధనీయుఁడు నగుననిరుద్ధుఁడు తైజసాహంకారము నధిష్ఠించియుండును. కావున నది యనిరుద్ధవ్యూహమని పరఁగుచున్నది. ఓయీ ! తైజసాహంకారమువలన నింద్రియములకుఁ గలుగుననుగ్రహ మెట్టిదియని యందువేని చెప్పెద. వికారమునొందిన తైజసాహంకారమువలన జ్ఞానస్వరూపమును గలిగించు సామర్థ్య ముదయించినది. అదియే యింద్రియములకుఁ జేసిన యనుగ్రహము. సామాన్యముగా ద్రవ్యమని తెలిసికొనెడి జ్ఞానము, వికల్పజ్ఞానము, శంఖమందున్న తెల్లఁదనమును బచ్చఁదనమునుగా భావించినట్లు ధర్మ్యమందున్నధర్మమును ధర్మాంతరమని తలపింపఁజేయు నన్యథాజ్ఞానమును, ముత్తెపుఁజిప్పముక్కను జూచి రజతమని యనుకొన్నట్లు లోకధర్మిని మఱియొకధర్మినిగాఁ దలంపఁజేయు విపరీతజ్ఞానమును, ప్రమాణరూపమగు జ్ఞానము, ననుభూతవస్తువులగుఱించి కలుగుజ్ఞాన

రజస్తోనని'' యనియుండుటచే స్పృహాదులు రజఃకార్యములగుటఁబలనను, ప్రవర్తనాత్మకమగు క్రియాశక్తితోఁ గూడినదగుటఁబలనను రాజసాహంకారమునే దాని కనుగ్రాహకముగా గ్రహింపఁబలయును. ఇట్లు తామసాహంకారకార్యములగు నాకాశాదులకుఁగూడఁ గార్యజననము విషయమై రాజసాహంకారమే యనుగ్రాహకమని యెఱుంగఁబలయును.

* ఇట ననిరుద్ధుఁడింద్రియములకుఁ బ్రత్యక్షముగా నధిష్ఠాతకాకపోయినను నింద్రియముల! కనుగ్రాహకమగు తైజసాహంకారమున కధిష్ఠాతయగుచున్నాఁడు కావున నింద్రియములకుఁగూడ నధిష్ఠాత కాఁబచ్చును.

ము, నిద్ర, మొదలగునవి బుద్ధికి వృత్తులవలనఁ గలిగినలక్షణంబు లని యెఱుంగుము. తైజసాహంకారజన్యమగు బుద్ధితత్త్వ మింద్రియానుగ్రాహక మగుటచేఁ దైజసాహంకారము గూడ నింద్రియానుగ్రాహక మనుట స్పష్టమగుచున్నది. *కర్మేంద్రియం బులు జ్ఞానేంద్రియంబులు నాఁబడు నుభయవిధంబులును రాజ సాహంకారానుగృహీత మగు సాత్త్వికాహంకారంబువలనఁ గలి గినవేయని తెలిసికొనవలయు. అందుఁ గర్మేంద్రియగణమునకు గమనాగమనాదిక్రియాగూప మగుశక్తియు జ్ఞానేంద్రియ వర్గమునకుఁ బ్రకాశనరూపశక్తియుఁ గలవు. ఇంక భూతాదిప్ర పంచసృష్టిని దెలిపెద వినుము. భగవద్వీర్యమువలనఁ బ్రేరితం బయి వికారము చెందియున్న తామసాహంకారంబువలన శబ్ద తన్మాత్ర ముదయించెను. దానివలన నాకాశంబు గలిగె. దాని నిగ్రహించునది కర్ణేంద్రియము. అందు శబ్దము వేదములవలనఁ దెలియఁబడు భగవంతునికి లక్షణంబును, నర్థాశ్రయంబునయి

---

*ఇందులకు మూలము. "తైజసానీంద్రియాణ్యేవ" అనఁగా నుభయవిధేం ద్రియంబులును దైజసాహంకారమువలననే జనించినవని యర్థము వచ్చుచున్నది. ఓయీ! పూర్వము తైజసాహంకారము ఇంద్రియంబుల కనుగ్రాహకమగుచున్న దని చెప్పఁబడినది. ఇప్పుడింద్రియములన్నియుఁ దైజసంబువలననే జన్మించినవని చెప్పుచున్నా వదియెట్లు సరిపడును. అనుశంక నివారించుటకయి "తైజసానీ న్ద్రియాణి" అనుచోట తైజసాని యనుపదమునకు రాజసాహంకారానుగృహీ తమగు సాత్త్వికాహంకారమువలనఁ గలిగినవని యర్థము చెప్పవలెను. ఇట్లు చెప్పి నచోఁ బూర్వము తైజస మింద్రియములకు జ్ఞానస్వరూపజననసామర్థ్యము కలి గించుటలోనను గ్రహము చూపుచున్నది. ఇప్పుడు ఇంద్రియముల గలిగించుటలో సాత్త్వికాహంకారమునకుఁ దోడగుచున్నదనియుఁ స్పష్టమగుచున్నదికాన పూ ర్వాపరవిరోధములేదు.

శ్రోత్రకు జ్ఞానజనకంబయ్యె. మఱియు నాకాశంబునకు శబ్దతన్మాత్ర గలిగియుండుట లక్షణంబని పండితులు పలుకుదురు. ఆయాకాశం బు సమస్తభూతంబులకును వెలుపలను, లోపలను, నవకాశమి చ్చుచు, నాత్మకుఁ బ్రాణంబులకు నింద్రియంబులకు నాధారం బయి యుండు. శబ్దతన్మాత్రము లక్షణంబుగాఁ గలయాకాశ ము కాలగతివలన వికారమును జెంది స్పర్శతన్మాత్రను బుట్టించె. ఆస్పర్శతన్మాత్రవలన వాయు వుదయించె. ఆస్పర్శమును గ్ర హించునది త్వగింద్రియము. స్పర్శతన్మాత్రకు మృదుత్వము కఠిన త్వము శైత్యోష్ణత్వములు వీనిస్పర్శత్వమే లక్షణంబనియందురు. వాయువునకు స్పర్శగుణము గలిగి యుండుట లక్షణంబుం జెప్ప దురు. మఱియు వాయువునకుఁ జలనత్వము ద్రవ్యములఁ బర స్పరము విభాగించుటయుఁ దిరిగి కలుపుటయు, ద్రవ్యములను, శబ్దంబులను, దూరమునుండి గొనివచ్చి వానిలో సుగంధరూప మయిన ద్రవ్యముచే ఘ్రాణేంద్రియంబును శబ్దముచే శ్రోత్రేం ద్రియంబును దనుపుచుండుటయు సకలేంద్రియములకు నాధా రమగుటయు, మొదలగు కర్మలక్షణంబులుకలవు. స్పర్శతన్మాత్ర గల వాయువు దైవప్రేరితంబయి వికారంబుచెంది రూపతన్మా త్రనుబుట్టించె. ఆరూపంబువలనఁ దేజం బుదయించె. నేత్రేంద్రి యము రూపగ్రాహకంబయ్యె. రూపతన్మాత్రమునకు ద్రవ్యమును ద్రవ్యాంతరమునుండి వేఱుపఱుచుట, ద్రవ్యము నాశ్రయించి యుండుట, వ్యక్తిని మఱొకవ్యక్తినుండి వేఱుపఱుచుటయును తేజస్సున కసాధారణగుణమై యుండుట మొదలగునవి. తేజ స్సునకుఁ బ్రకాశము, తండులాదికమును బచనముకావించుట యు, క్షుత్పిపాసలమూలంబున నన్నపానంబులగొనుట, శైత్య

మును దొలఁగించుటయు, శోషణమును, కార్యములు. రూప తన్మాత్రమయిన తేజస్సు కాలగతిచే వికృతినొంది రసతన్మాత్ర ను బుట్టించె. ఆరసతన్మాత్రమువలన నుదకము జనించె. రస నేంద్రియంబు తాఁగృహీరసగ్రాహకం బగుచుండును. ఆరసత న్మాత్రవివిధములయినను భూతసంపర్కమువలనఁ దియ్యఁదనము, పుల్లఁదనము, వెగటు మొదలగుభేదములను జెందినది. మఱియుఁ దడుపుటయు, మన్ను మొదలగువానిని పిండముగాఁ గావించుట యుఁ, దృప్తికలిగించుటయు, జీవనము నిచ్చుటయుఁ, బిపాసాదు లను దొలఁగించుటయు, మెత్తఁదనము గలదానిగాఁ జేయుట కూ పాదులనుండి తోడుచున్నను మగుడ గలుగుచుండుట, జల మునకుఁ గార్యములు. రసతన్మాత్రమగు నుదకము కాలగతివలన వికారమునొంది గంధతన్మాత్రమును బుట్టించెను. ఆగంధతన్మా త్రమువలనఁ బుడమిజనించెను. ఘ్రాణేంద్రియము తదీయగంధ మును గ్రహించునదయ్యె. మఱియు గంధ మొక్కటియేయయిన ను ద్రవ్యసంపర్కమువలన దుర్గంధ సుగంధ మిశ్రగంధాదు లనెడి పెక్కుభేదంబులను జెందినది. మఱియు ఘటాదులను బు ట్టించుటయు సమస్తచరాచరంబులకు నాధారమయియుండుట యు, ధాన్యాదులను గలిగించుటయు నాయాదేశములందుండు ప్రాణుల యాకారవిశేషమునకుఁ గారణమగుటయు భూమికిఁ గార్యములు. మఱియు గగనమున కసాధారణగుణ మగుశబ్ద మును గ్రహించునది శ్రోత్రమనఁబడు వాయువున కసా ధారణగుణమయిన స్పర్శంబును గ్రహించునది త్వగింద్రియ మనఁబడు. తేజంబున కసాధారణగుణమయిన రూపంబును గ్ర హించునది చక్షురింద్రియము నాఁబడు. జలంబున కసాధా

తణగుణమయిన రసమును గ్రహించునది రసనేంద్రియమనఁబడు. భూమికసాధారణగుణంబయిన గంధంబును గ్రహించునది ఘ్రాణమనఁబడు. ఆకాశాదులకు ధర్మములగు శబ్దాదులితరములగు వాయ్వాదులందుఁగూడఁ జూడఁబడుచున్నవి. కాన యాకాశాదులందుండు గుణములన్నియుఁ బృథివియందుఁ జూపట్టుచున్నవి. ఇట్లు మహత్తత్త్వము, అహంకారము, పృథివి, జలము, తేజస్సు, వాయువు, గగనము, నను నేడు నుదయించినను బరస్పరము మిళితంబులు కాని కారణంబున భోగాయతనంబగు పురుషునిఁ, గల్పింప సమర్థంబులు కాకయుండఁగాఁ బుణ్యాపరరూపమగు నదృష్టముతోను, సత్త్వాదిగుణములతోను, గాలాదులతోను బేతుండై జగత్కారణుండును, సర్వనియామకుండును నగు నీశ్వరుం డామహదాదితత్త్వములను బ్రవేశించెను. ఇట్లు భగవంతుండు మహదాదితత్త్వములను బ్రవేశింపఁగా మహదాదులన్నియు మిళితములయి ధ్వనినుండి విరాట్పురుషుఁ డుదయించునో చేతనరహితమగునట్టి యండమును గలిగించె. మఱియు నాయండము బహిర్భాగములయందుఁ బ్రధానముచేఁ గప్పఁబడినవియు, నొకదానికంటె నొకటి పదిమడుఁగుల యాధిక్యనుకలవియు నగు పృథివ్యాదికములయిన యావరణములచే నావృతంబయియుండును. మఱియు నాయండమునందె సమస్తదేవమనుష్యాదిరూపమయిన లోకము పుట్టును. అదియే భగవంతునిరూపమని పలుకుదురు ఇట్టి హిరణ్మయాండము మహదాదులవలనఁ గల్పింపఁబడి చిరకాలము జలమందు నివసించియుండెను. అట్లు జలములో నివసించియున్న యాయండములోనుండి ప్రవృత్తి కున్ముఖుఁడయిలేచి మహనుభావుఁడును జగత్కారణుండు నగునారాయణుండు చతు

ర్ముఖు నావేశించి సమష్టిభూతుఁడగు చతుర్ముఖునిశరీరమందుండు నింద్రియగణమును వ్యష్టిరూపముగా నానేకవిధములుగా నొనర్చెను. అట్లింద్రియములు నేర్పడుటలో ముందుగా నాచతుర్ముఖుని సమష్టిముఖమువలన వ్యష్టిముఖ మేర్పడినది. పిమ్మట వాగింద్రియము కలిగినది. ఆ వాగింద్రియముతోనే యధిష్ఠానదేవతయగు వహ్ని యేర్పడెను. తరువాత నతనివలన ఘ్రాణేంద్రియవాసయోగ్యంబులయిన నాసాకుహరము లుత్పన్నంబులయ్యె. ఆనాసాకుహరములవలన వ్యష్టిఘ్రాణేంద్రియ మేర్పడెను. అందువలనఁ దదధిష్ఠానదేవతయగు వాయు వేర్పడియెను. పిమ్మట సమష్టిపురుషుని చక్షుర్గోళములనుండి వ్యష్టిపురుషుని చక్షుర్గోళంబు లుదయించినవి. ఆచక్షుర్బలవలనఁ జక్షురింద్రియ మేర్పడియె. ఆయింద్రియమువలన సూర్యుం డేర్పడి తదధిష్ఠానదేవతయయ్యె. పిమ్మట సమష్టిపురుషుని కర్ణములవలన వ్యష్టికర్ణము లుదయించినవి. పురుషునివలనఁ గర్ణేంద్రియ మేర్పడియె. అందువలనఁ దదధిష్ఠానదేవతలగు దిక్కులేర్పడినవి. తరువాతఁ ద్వగింద్రియము నివసింపఁదగిన రోమాదు లుదయించినవి. వానివలనఁ ద్వగింద్రియము కలిగినది. అందువలన నోషధు లేర్పడి తదధిష్ఠానదేవతలయ్యె. అనంతర ముపస్థేంద్రియమున కధిష్ఠానమయిన శిశ్న ముదయించెను. అందువలన నుపస్థేంద్రియ ముదయించెను. దానివలనఁ దదధిష్ఠానదేవతలగు నుదకము లేర్పడినవి. తరువాతఁ బాయ్వింద్రియమున కధిష్ఠానమయిన గుదము జనించినది. అందువలనఁ బాయ్వింద్రియ ముత్పన్నంబయ్యె. ఆయింద్రియమువలన లోకభయంకరుఁడగు మృత్యువుదయించి తదధిష్ఠానదేవతయయ్యె. అనంతరమునఁ బాణీంద్రియాధిష్ఠాన మేర్పడెను. అందు బల

మను పేరుగల పాణీంద్రియ మేర్పడియె. అందువలన నింద్రుఁ డుదయించి తదధిష్ఠానదేవతయయ్యెను. తరువాతఁ బాదము లుదయించినవి. అందువలన గతి యను పేరుగల పాదేంద్రియ ముద్భవించినది. అందువలన నుపేంద్రుఁ డుదయించి తదధిష్ఠాతయయ్యె. పిమ్మట నధిష్ఠానరూపములయిన నాడు లుదయించినవి. అందువలన రక్తము జన్మించెను. దానివలన నధిష్ఠానదేవతలయిన నదు లుత్పన్నంబులయ్యెను. తరువాత నుదరమనెడి యధిష్ఠానము కలిగెను. అందువలన శుక్లోపాన లుదయించె. వాని వలన నధిష్ఠాతయగు సముద్ర ముదయించెను. తరువాత హృదయము పుండరీకాకారమయి యేర్పడెను. అందువలన మన స్సేర్పడెను. దానివలనఁ జంద్రుఁ డేర్పడి తదధిష్ఠానదేవతయయ్యె. ఆహృదయాధిష్ఠానమువలననే బుద్ధిరూపమయిన యింద్రియ మేర్పడినది. బ్రహ్మ దాని కధిపతియయ్యె. అందువలననే యహంకార ముదయించె. ఆ యహంకారమునకు రుద్రుం డధిపతియయ్యె. ఆ హృదయమువలననే చిత్తమేర్పడె క్షేత్రజ్ఞుఁడు దాని కధిష్ఠాత యయ్యెను. ఇట్లు విరాట్పురుషునివలన నింద్రియసమూహమును దదధిష్ఠానదేవతలు నేర్పడినను, క్షేత్రజ్ఞునిఁ బ్రవృత్తి ప్రవర్తకునిగాఁ జేయ సమర్థములు కానివయ్యెను. ఆకారణంబున నధిష్ఠానదేవతలాయాయధిష్ఠానములను గ్రమముగాఁ బ్రవేశించెను. అందు వహ్ని వాగింద్రియముతోఁగూడి ముఖమును బ్రవేశించె. అందువలన విరాట్కార్యంబగు వ్యష్టిశరీరజాతం బుత్పన్నంబు కాదయ్యె. పిమ్మట వాయువు ఘ్రాణేంద్రియముతోఁగూడి నాసికావివరంబులఁ బ్రవేశించెను. సూర్యుఁడు చక్షురింద్రియముతోఁ గూడఁ జక్షుర్గోళకములను బ్రవేశించెను. దిక్కులు కర్ణేంద్రియము

ముతోఁగూడఁ గర్ణగోళములఁ బ్రవేశించెను. అధిష్ఠానదేవత లయిన యోషధులు త్వగింద్రియముతోఁగూడ రోమములనొం దినను విరాట్కార్యంబు వ్యర్థంబయ్యె. తరువాత నుదకంబు లుప స్థేంద్రియముతోఁగూడ శిశ్నమును బొందియును వృథాభూతం బయ్యె. మృత్యు వపానేంద్రియముతోఁగూడ గుదమును బ్రవే శించె; కాని కార్యంబు విఫలంబయ్యె. విష్ణువు గతీంద్రియము తోఁ బాదములనొందినను, నింద్రుఁడు బలేంద్రియముతోఁ గూడ హస్తంబులఁ బ్రవేశించినను, నదులు రక్తముతోఁగూడ నాడీపుంజమును బ్రవేశించినను, సముద్రము తుత్పిపాసలతోఁ గూడ నుదరమును బ్రవేశించినను, విరాట్పురుషుని వ్యష్టిశరీర జాతకార్యంబు సఫలంబు కాదయ్యె. ఇక్కార్యంబు నెఱవేర్చుట కయి చంద్రుండు మనస్సుతోఁగూడి హృదయగోళమును బ్రవే శించినను, బ్రహ్మ బుద్ధీంద్రియముతోఁగూడి హృదయమును బ్ర వేశించినను, రుద్రుఁడహంకారముతోఁ బ్రవేశించినను విఫలం బయ్యె. కాని యెప్పుడు క్షేత్రజ్ఞుఁడు చిత్తముతోఁగూడ హృద యమును బ్రవేశించెనో యప్పుడే విరాట్కార్యభూతమయిన పురుషుఁడు సలిలకార్యమయిన బ్రహ్మాండమును బ్రవేశించి ప్రనృత్తిసమర్థుండయ్యె. ఓతల్లీ! సమస్తేంద్రియంబులు తత్తదధి ష్ఠానదేవతలతోఁగూడ నధిష్ఠానములను బ్రవేశించినను క్షేత్ర జ్ఞుఁడు చిత్తముతో హృదయమును బ్రవేశించునంతకాలము ప్రాణాదులు తమబలముచేనిద్రచెందినవారిని లేమనట్లు చేయ లేనివిధమున సనుర్థంబులు కావయ్యె. కావున నోజనసీ! పరిశుద్ధ స్వరూపుఁడయిన జీవుని శరీరబుద్ధీంద్రియాదులకంటె వేఱు గాఁజేసి తత్త్వజ్ఞానవివేచన శీలమయిన బుద్ధిని భక్తిమార్గమం

దుఁ బ్రవేశింపఁజేసి చక్కఁగాఁ బరబ్రహ్మమును ధ్యానింపవల యును. ప్రకృతిపురుషుల వేఱ్వేఱ నిగ్రహించినవారు మోక్షము నొందుదురు. ప్రకృతిసంబంధంబునంజేసి సంసారబంధంబు సంభవించుచుండునని కపిలాచార్యుండు తల్లికిఁ దెలియఁజెప్పి వెండియు నిట్లనియె. ఇది యిరువదియాఱవయధ్యాయము.

ఓజననీ ! జీవుఁ డిట్లు ప్రకృతికల్పితమయిన దేహము నధినసించియున్నను, వచ్చుట, పోవుట మొదలగు బాహ్యములగు వ్యాపారములకాశ్రయుఁడు కాకపోవుటచేతను, సత్త్వాదిగుణసంబంధము లేనివాఁడగుటచేతను, నవికారుఁ డగుటచేతను, జలములోఁ బ్రతిబింబించిన సూర్యునికి దజ్జలసంబంధులగు కంపాదులు కలుగని విధమున సత్త్వాదిగుణములవలనఁ గలిగినదోషంబు లా జీవుని కంటఁజాలవు. ఇట్టి యాత్మకు దేవమనుష్యాదిదేహసంబంధ మెట్లు కలుగుచున్నదో సాంసారిక ప్రవృత్తులందుఁ గర్తృత్వ మెట్లు లభించుచున్నదో, సుఖదుఃఖానుభవ మెట్లు కలుగుచున్నదో చెప్పెద వినుము. అట్లు ప్రకృతివిలక్షణుఁడయినను, నాత్మ, యహంకారముచే మోహితుఁడయి దేహాత్మాభిమానము గలవాఁడయి యెప్పుడు ప్రకృతిగుణములయిన శబ్దాదులయుం దాసక్తి గలిగి తానె కర్తయని యనుకొనుచున్నాఁడో యప్పుడే యట్టియభిమానముచేఁ గర్మాధీనుండయి కర్మాయత్తములయిన సుఖదుఃఖముల ననుభవించుచు, ప్రకృతిసంబంధమువలనఁ జేసికొన్నపుణ్యపాపకర్మములను బురస్కరించుకొని యుత్తమాధమమధ్యములయిన దేవ,పశు,పక్షి, నర, యోనులం దుద్భవించుచు, సంసారపదవిని బొందుచున్నాఁడు. ఓయీ ! దేవాద్యాకారము లాత్మకు

స్వాభావికాకారములు కానప్పుడు వానివలన నేమియనర్థము సంభవించు నందువేని చెప్పెద. వినుము. స్వప్నశరీరము లాత్మ కాకారములు కాకపోయినను వానివలనఁ గలిగిన సుఖదుఃఖరూపానర్థములను జెందుచున్నవిధముగ నాత్మకు దేవమనుష్యాద్యాకారములు స్వాభావికములు కాకపోయినను శబ్దాదివిషయచింతనమే తప్పక చేయుచుండుటచేత సంసారరూపానర్థము సంప్రాప్తమగుచున్నది. విషయాసక్తతయే యిట్టి యనర్థములను గలిగించుచుండును గాన ముందుగ మనోనియమనమును జేసికొనవలెను. మఱియుఁ బండితుఁడు నిరంతరాయమగు భక్తియోగముచేతను, వైరాగ్యముచేతను శబ్దాదివిషయములందుఁ బ్రసక్తమగుమనంబును వశంబు గావించుకొనవలెను. ఇట్లు చేసినచో సంసారబంధము నివర్తించును. మఱియు మనోనియమనవిషయమగు త్వరతోఁ గూడినవాఁడై నాయందుంచిన పితృమాతృభావముచేతను, సత్యవచనముచేతను, మత్కథాశ్రవణముచేతను, సమస్తమును బ్రకృతిపురుషశరీరకుఁడగు భగవంతుని రూపముగా నెంచుటచేతను, శబ్దాదివిషయములందభిలాషలేకుండుటచేతను, బ్రహ్మచర్యముచేతను, మితభాషిత్వముచేతను, భక్తియోగమునుగల్గించువానిలో బలవత్తరమగుస్వధర్మముచేతను భక్తియోగము నభ్యసించుచుండవలయును. మఱియు దైవికముగా సంప్రాప్తమగు నన్నాదులను భుజించుచు, భోజనాదులందుసైతము భగవత్పరిశీలనమునే చేయుచు, రహస్యప్రదేశమందుండ నభిలాషగలవాఁడై, భయాదులను విడిచి, భయజనకములగు భూతములనుండిసైతము మైత్రి నపేక్షించుచు, సమస్తభూతములందుఁ గరుణాళువయి, శ్రేష్ఠమగు మనస్సుగలిగి భార్యమొద

లగు ననుబంధంబులతోఁగూడిన యీదేహాదుల యందహంకారమును మమకారమును, నించక యాథాత్మ్యమును జూపించు ప్రకృతిపురుషజ్ఞానముచే మనస్సంబంధులగు సంకల్పవికల్పాదులను దొలంగించుకొని భగవస్వ్యతిరిక్తమగు దానిని జూడ నొల్లక ప్రకృతికంటె విలక్షణుఁడయిన యాత్మను సందర్శించి సూర్యాధిష్ఠితమగు చక్షురింద్రియముచే నధిష్ఠాతయగు నాదిత్యునిఁ జూచుచున్నట్లు పరమాత్మాధిష్ఠితమగు ప్రత్యగాత్మచేఁ బరమాత్మను సాక్షాత్కరించుకొనవలెను. అట్లు చేసినయనంతరము ప్రారబ్ధావసానమందు దేవాదిశరీరముల నెడఁబాసి యెల్లప్పుడును సంకోచమునొందని జ్ఞానమే స్వరూపముగాఁ గలిగి ప్రత్యగాత్మకు సర్వవిధములచేతను బంధువయి దేహాదులనుగూడఁ బ్రకాశింపఁజేయుచు, సర్వాంతర్యామియై స్వసమాభ్యధికరహితుఁడగు పరమాత్మను బొందుచున్నాఁడు. ఓయీ! ప్రకృతికంటె విలక్షణుఁడగునాత్మను జూచుచునే తదంతర్యామియగు పరమాత్మను గాంచి యాపరమాత్మను బొందుచున్నాఁడని చెప్పితివి. కాని యింద్రియాతీతమయి నిరతిశయసూక్ష్మమయియున్న యాత్మస్వరూప మెట్టిదిగా దర్శనయోగ్యమగుననియందువేని, యట్లు సందియమంద నవసరము లేదు. ఆత్మ దేహేంద్రియాదులకంటె విలక్షణుఁడై జాగ్రదాద్యవస్థలందుఁ బ్రత్యక్షీభూతుఁడగుచున్నాఁడు.*తృణము మొదలగువానిం బ్రకా

* దీనిఫలితార్థ మేమనఁగా నాదిత్యుఁడుకాని ప్రతిబింబాదులం దాదిత్యుఁడనెడి భ్రాంతియు వాస్తవాదిత్యునియందలి యాదిత్యబుద్ధియు, నాదిత్యునకు ధర్మభూతమగు కాంతిచేతనే గలుగుచున్నది. అట్లే యాత్మపదార్థముకాని దేహాదులం దాత్మబుద్ధియు సత్యమగు నాత్మయం దాత్మప్రతిపత్తియు నాత్మధర్మభూతమగు జ్ఞానముచేతనే కలుగుచున్నది.

శింపఁజేయు సూర్యకాంతిచేతనే జలస్థమగు సూర్యప్రతిబింబము
ను జూచుచున్నాము. మఱియు జలమందు సూర్యప్రతిబింబమును
బ్రకాశింపఁజేసిన సూర్యకాంతిచేతనే యాకాశమందున్న సత్య
సూర్యుండు చూడఁబడుచున్నాఁడు. అట్లు భూతములు నింద్రియ
ములు, మనస్సు స్వరూపముగాఁ గలిగి త్రివిధాహంకార
మను పేరుగల ప్రకృతిపరిణామవిశేషము స్వధర్మభూతమగు
జ్ఞానములచేతనే యాత్మన్యతిరిక్తమగునదియైనను నాత్మస్వరూప
ముగానే గ్రహింపఁబడుచున్నది. మఱియు తనకుఁ బ్రభాభూ
తమగు జ్ఞానముచేతను నిర్వికారమగు జ్ఞానమేస్వరూపముగాఁ
గలయా యాత్మయు గ్రహింపఁబడుచున్నాఁడు. కావున నాత్మ
కు ధర్మభూతమగు జ్ఞానముచేతనే యాత్మప్రత్యక్షము కలుగవ
చ్చును. ఓజననీ ! ఇంద్రియాదులు జాగరూకము కాకయు
న్నప్పుడుకూడ నాత్మావభాసము కలుగుచుండును. నిద్రచేతను
భూతసూక్ష్ములు, నింద్రియములు, మనస్సు, బుద్ధి మొదల
గునవి తమతమకార్యంబులు నెఱనేర్వ సమర్థములు కాకయుం
డును. అప్పుడాత్మ దేహమందు నిద్రారహితుఁడయి దేహాత్మాభి
మానము లేక వర్తిల్లుచుఁ దనధనము నశింపఁగాఁ దనకే నాశము
కలిగినట్లు లాతురుఁడయినవానిచందంబున సుషుప్తియందు దేహా
త్మాభిమానరూపమగు నహంకారమునకు విషయము నశించు
టచే నహంకారము నశించినదగుచుండఁగా నాత్మయే నష్టమయి
నట్లు తలంచుచుఁ బ్రకృతికంటె వివిక్తమగు నాత్మస్వరూపము
ను దెలియఁగోరి సుషుప్తియం దాత్మవృత్తిని బరామర్శించుకొని
పంచభూతసముదాయమున కవస్థాపకమయి దేహప్రవృత్తికి
హేతుభూతమయియున్న ప్రకృతికంటె వివిక్తమగు ప్రత్యగాత్మ

స్వరూపమును బొందుచున్నాఁడు. * కావున జాగ్రదవస్థయం
దును, స్వప్నావస్థయందును, సుషుప్తియందునుగూడ నాత్మావ

---

* ఓయీ! సుషుప్తియం దాత్మావిభాసము కలుగుచున్నట్లు చెప్పుచున్నా
వు. జాగ్రదవస్థయందును స్వప్నమందును నాత్మావభానముండునుగాని సుషి
ప్తియందున్నట్లు తోఁపదు. కావున నే శ్రు. "నాహం ఖల్వయమేవం సంప్రత్యా
త్మానం జానాత్యయమహమస్మి" అనుశ్రుతిగూడ నీయర్థమునే సూచించుచు
న్నది. అని ప్రశ్నింపఁగూడదు. సుషుప్తియం దహమర్థమగు నాత్మకంటె వివి
క్తములయిన బ్రాహ్మణత్వాది ధర్మములకు స్ఫుటప్రతిభానములేకపోయినను మే
ల్కొనునంతపర్యంతము "అహమహం" అని యేకరీతిగా నాత్మకు స్ఫురణ
మున్నదికాని లేకపోలేదు. కావున నే మనుజుఁడు నిద్రించి లేచి యిట్లనుకొ
నుచున్నాఁడు. శ్రు. "సుఖమహమస్వాప్సం నకించిదవేదిషం మామప్యహం
నజ్ఞాతవాన్" అనఁగా నేను సుఖముగా నిద్రించితిని. కొంచెమేనియు నెఱుం
గను. నేను నన్నునుగూడఁ దెలిసికోఁజాలనైతి. ఈయనుకొనుటంబట్టి యా
త్మకు సుషుప్తియందు సుఖత్వము జ్ఞాతృత్వము కలిగియున్నట్లు తెలియవచ్చు
చున్నది. ఓయీ! "ఏతావంతం కాలం నకించిదహమజ్ఞాసిషం" అనఁగా నీసుషు
ప్తియం దున్నంతకాలము కొంచెమేని నేనెఱుంగను" అని యనుకొనుటకలదు.
దీనియొజింప సుషుప్తియం దేమియు జ్ఞానములేదని యర్థమువచ్చుచున్నదే యని
యడుగరాదు. ఆయవస్థయం దాత్మపదార్థమున కనుపృత్తి కలుగుచుండుటచేఁ
దెలిసికోఁదగినవిషయము నిషేధింపఁబడుచున్నది. మఱియు నట్లై, "మామప్య
హం నజ్ఞాతవాన్" "నన్ను నేనెఱుంగను" అనుటచే బ్రబోధసమయమందుఁ
గలుగుచున్నట్లు బ్రాహ్మణత్వాది ధర్మములచే విశిష్టుఁడగునన్ను నేనెఱుంగనని
యర్థముకాని కేవలస్వరూపము నెఱుంగనని యర్థముకాదు. "నాహంఖల్వయ"
మను శ్రుతియందుఁగూడ బ్రాహ్మణత్వాదిధర్మములు తెలియకపోవుటచేఁ దా
దృశధర్మయుక్తుఁడగువాని నెఱుంగక పోవచ్చునుగాని స్వరూపము నెఱుంగ
కపోఁడు. కావున సుషుప్తియందునైత మాత్మస్ఫురణ మున్నది.

భాసము విశదతరమై కలుగుచున్నది. అనిచెప్పుచున్న కపిలునిఁగాంచి దేవహూతి యిట్లనియె. "ఓపురుషవరేణ్యా! ప్రకృతిపురుషులు నిత్యులగుటవలనను, బరస్పరము దృఢతరమగుసంబంధముగలవా రగుటవలనను, వారి కెప్పుడును వేఱువేఱుగా నుండుట సంభవింపనేరదు. అట్లుండఁ బ్రకృతి పురుషుని విడిచి యెట్లుండును? పృథివికిని గంధమునకు నెప్పఁడయిన బృథగవస్థానము కలుగునా? జలమునకును జలమున కపృథక్సిద్ధమగు రసమునకుఁ బృథగ్భావము సంభవించునా? సంభవింపనేరదు. అట్లె ప్రకృతికిని పురుషునికిని బృథగ్భావము కలుగనేరదు. మఱియు సంసారసంబంధులైన గమనాగమనాది ప్రవృత్తులందు స్వాభావికకర్తృత్వము లేనిపురుషునికిఁ గర్మరూపబంధము ప్రకృతిసంబంధమువలన నేకదా గలుగుచున్నది. పురుషుని కట్టి కర్మబంధము కలిగించు ప్రకృతియుఁ, బ్రకృతిగుణములగు సత్వాదులును, విద్యమానము లగుచుండఁగా నా ప్రకృతిగుణములనుండి యాత్మకు విముక్తికలుగుట యెట్లు? ఒకవేళఁ దత్త్వజ్ఞానమువలనఁ బ్రకృతి యాత్మను విడుచునని చెప్పుదువేని యది నిరూపడదు. ఒకప్పుడు తత్త్వావమర్శచే సంసారరూపభయము సామాన్యముగాఁ దొలంగినను, దాదృశసంసారభయము గలిగించు ప్రకృతిసంబంధము నివర్తింపకపోవుటచే మఱుఁడ నది కలుగుచునేయుండును.' అని యడిగిన దేవహూతికిఁ గపిలుం డిట్లనియె? 'ఓజననీ! నీవాక్యము యథార్థము. నీప్రశ్నములు సముచితములు కాని ఫలాభిసంధిరహితమగు స్వధర్మముచేతను, విశుద్ధమగు నంతఃకరణముచేతను, మత్కథాశ్రవణముచే సంవర్ధితమై యంతరాయములచేఁ జలింపని ప్రకృతిపురుషయాథాత్మ్య

మును దెలుపు జ్ఞానముచేతను, బలీయమగు వైరాగ్యము చేతను, దేహశోషణాది రూపమగు తపంబులతోఁ గూడిన యోగములచేతను, నుత్కృష్టమగు చిత్తైకాగ్రత్వముచేతను సంవర్ధితమై యొప్పుచున్న మద్భక్తిచేత రాత్రిందివములు పీడితమయి యాత్మప్రతిబంధకర మగుప్రకృతి మెల్లమెల్లగా నివర్తించును. ఓతల్లీ! అగ్నిని దిరోధానము కావించు నరణియగ్నిచేఁ దహింపఁబడుచున్నట్లు లాత్మను గప్పిపుచ్చు ప్రకృతి యాత్మజ్ఞానముచేతనే నివర్తించుచున్నది. అట్లు నివర్తించినచోఁ బ్రకృతి పురుషునికి సంసారబంధము గలిగింపఁజాలదని తెలిసికొనుము. భుక్తభోగయు నిత్యము గాన వచ్చుచున్న దోషములు గలదియు, గావునసే విడువఁబడినదియు నగుప్రకృతి కర్మవశ్యుఁడుకాక యపహతపాప్మత్వము మొదలగు నష్టగుణములు గలిగి వర్తించునాత్మకు సంసారము నెప్పుడును గలిగింపనేరదు. ఓతల్లీ! నిద్రించినవానికి స్వప్నము స్వశిరశ్ఛేదనాదికములగు వెక్కనర్థములు గలిగించును. మేల్కనియున్నపు నికాస్వప్న మనర్థములఁ గలిగింపనేరదు. అట్లె యజ్ఞునికిఁ బ్రకృతి సంసారరూపానర్థములఁ గలిగించునుగాని ప్రకృతిపురుషేశ్వరతత్త్వమును బాగుగ గ్రహించి నాయందుఁ దనమానసంబును నిలిపి యాత్మానుభవపరుఁడయి యున్నజ్ఞానికిఁ బ్రకృతి యొకప్పుడయినను సంసారబంధము కల్పింపనేరదు. మఱియు నాత్మారాముఁడయి బహుజన్మముల కాలముచే దత్త్వమును బురుషార్థములను దెలిసికొని బ్రహ్మలోకపర్యంతము కలుగు లోకములఁ బొంద నపేక్షింపక నిరతిశయప్రీతిరూపనగు మద్భక్తికలవాఁడయి, భగవంతుఁడనగు నాసాక్షాత్కారముచే సమస్తసంశయములను దొలంగిఁ

చుకొనినయోగి, ప్రారబ్ధకర్మమునశించినప్పు డేస్థానమునుబొందితిరుగ జన్మంబునకు రాఁడో నిరతిశయపురుషార్థరూపమగునట్టి నాస్థాన మును మదీయానుగ్రహముచేఁ బొందఁగలఁడు. ఓజనయిత్రీ! భక్తియోగమందు సిద్ధుఁడగు పురుషునిచిత్తము యోగసాధ్యము లయి సంసారమును నివర్తింపలేక యాశ్చర్యకరములయి యున్నయణిమాదిసిద్ధులం దెప్పుడు సక్తముకాదో యప్పుడే నిరతిశ యమగు మత్పదమును జేరఁగలఁడు. ఇది యిరువదియేడవ యధ్యాయము.

'ఓ జననీ! భక్తియోగముచే మనంబును నిర్మలంబు గావించుకొని శ్రేయస్సు బొందుచున్నాఁడు. కావున నట్టిభక్తియోగ మును ససాధకముగ తెలియఁజేసెదమతియు యోగమార్గంబుల నుపదేశింతును వినుము. యోగముల నభ్యసించువారు ముందుగ వివేకసాధనసప్తకంబును సంపాదింపవలసి యున్నది. వానిని వివరించెదను వినుము. స్వశక్తిచే నిష్కామమనఁగా స్వవర్ణాశ్ర మోచితధర్మముల నాచరింపవలయును. ప్రతిషిద్ధకార్యముల నుండి మరలవలయును. దైవవశమువలనఁ దనకుఁ బ్రాప్తమగు నన్నాదులచే సంతసించుచుండవలఁయును. పరమభాగవతుల యిన పుణ్యులను బూజించుచుండవలయును. ధర్మార్థకామము ల నపేక్షింపకుండవలెను. మోక్షుమం దిష్టముకలిగి యుండ వలయును. ఓజననీ సాధనసప్తకాంతర్భూతమగు క్రియలను జెప్పితి. ఆసాధనసప్తకములో నేడవది వివేకము. దానిం దెలి పెదను వినుము. జాతిచేతను, నాశ్రయముచేతను, నిమిత్త ముచేతను, దుష్టము లగువానినుండి వేఱయి సాత్వికముల

యిన యన్నాదులను దినుచు, నట్టియన్నమును మితముగా ననుభవించుచు, మఱియు జాతిచేతను దుష్టములగు కలం జాదులను, నాశ్రయముచే దుష్టములయిన చండాలాది ద్రవ్యమును, గేశాదినిమిత్తములచే దుష్టము లయినవానిని దినక కేవలము పవిత్రమయినదానినే భుజింపవలయును. ఇదియే వివేకము. ఒరులను హింసింప కుండుటయు దొంగిలింప కుండుటయు, సత్యము పలుకుటయు, దేహయాత్రానులకుఁ గావలసినంతమాత్రమే ధనసంగ్రహము చేయుటయు, నింద్రియముల జయించుటయుఁ, గృచ్ఛ్రచాంద్రాయణాది తపంబుల నొనర్చుటయు, వేదాధ్యయనము చేయుటయు, భగవంతునిఁ బూజించుటయు, నీచెప్పఁబడినవి వివేకాది సప్తకములో నంత ర్భూతములయినను విస్తరార్థము చెప్పితిని. ఇఁక నానానాద్యంగములఁ దెలిపెద వినుము. సర్వకాలములయందు మౌనియయి యొకచోట స్థిరముగానుండి మెల్లమెల్లగాఁ బ్రాణవాయువులను వశముకావించుకొని ఇంద్రియములనన్నింటిని శబ్దాది విషయములనుండి మఱలించి మనస్సుతోఁగూడ హృదయమందుఁ జేర్చి చిత్తమును నింద్రియాదులను, మూలాధారాది స్థానములలో నొకదానియందుంచి భగవంతుం డొనర్చిన యద్భుతచరిత్రములను స్మరించుచు మనస్సు నాత్మతో నేకీభవింపఁ జేయవలయును. మఱియుఁ బైని చెప్పిన స్వధర్మములెల్ల నాచరించుటవలన మనంబు దుష్టమార్గంబును జొరకుండునట్లుచేసి జితప్రాణుఁడయి యొందరలేనివాఁడై మంచిమార్గమందుఁ బ్రవేశింపఁజేయవలయును. పిమ్మట నట్టివాఁడు జితాసనుండై పరిశుద్ధ

మైన ప్రదేశమునందు దర్భాసనమునుంచి * స్వస్తికాసనముచే శరీరమును దిన్నగాఁజేసి, ఓంకారము నభ్యసించుచుండవలయును. తరువాతఁ బూరకకుంభకరేచకములనెడి ప్రాణాయామములచేతఁ జిత్తము స్థిరమై యీఁకనెప్పటికిఁ జంచలత్వమునొందకుండునట్లు ప్రాణములను జక్కఁగాఁ బరిశోధింపవలయును. ఇట్లు ప్రాణములను నిరోధించియున్న యోగిమనస్సు శీఘ్రకాలములోనే తప్తమయిన బంగారము నిర్మలమయిన చందము నన నిర్మలమగును.ఇట్లు చేసినవాఁడు ప్రాణాయామముల చేత వాతపిత్తాదిదోషములను దొలంగించుకొనును. ధారణాదులచేఁ బాపములను దహింపఁజేసికొనును. ఇంద్రియప్రత్యాహారముచేత విషయసంబంధములను నశింపఁజేసికొనును. ధ్యానముచేఁ క్లేశాదులను దహింపఁజేసికొనును. ఇట్లు ప్రాణాయామాదులచేత నిర్మలమయిన తనమనస్సును భగవంతునందుఁ జేర్చి నాసాగ్రమందేదృష్టికలవాఁడై భగవద్విగ్రహమును ధ్యానము చేయవలయును. నిర్మలమయిన ముఖపద్మముతోను,బద్మపత్రముల బురుడించు నరుణనేత్రములతోను, నల్లఁగలువవలె శ్యామలవర్ణముతోను బ్రకాశించుచు,శంఖచక్రాదిసాధనంబులధరించి, పద్మకింజల్కమువలె నలరుచున్న పీతాంబరము కటిసీమయందొప్పార, శ్రీవత్సమనెడి లాంఛనము రమునందు రంగారఁ, గాస్తుభాలంకృతమయిన గళము మిగుల నలరారుచుండ,మత్తమధుకరములచేనిండియున్న వనమాలయు ముక్తాహారకంకణాదులయినయలంకారములును వెలుంగఁ గాంచనమయమయిన మేఖల

* స్వస్తికాసనము=తొడలయొక్కయుఁ బిక్కలయొక్కయు నడుమ తన పాదములను జొనిపి శరీరమును దిన్నగా నిక్కింప స్వస్తికాసన మనఁబడును.

చే విభూషితుండయి సమస్తయోగిబృందములకు వందితుండయి, దర్శనీయుండయి, మహానందదాయకుఁడై, శాంతస్వరూపుఁడై, భక్తరక్షణమం దత్యాసక్తికలిగి, నుతింపఁదగిన కీర్తిపుంజ ముచేఁ జెలంగియున్న నారాయణుని సంతతము ధ్యానముచే యుచు, నడుచునప్పుడుకాని నిద్రించునప్పుడుకాని కూర్చుండి నప్పుడుకాని తననిర్మలహృదయకుహరమునం దరవిందాక్షునిఁ గనుఁగొనుచుఁ, బ్రవర్తింపవలయు. అందువలన నలవడినమనస్సు నారాయణునివిడిచి యన్యమునందుఁ బ్రవేశింపనేరదు. ఇట్లు భగవంతునిసర్వావయవములందు సక్తమయిన తనచిత్తమును భగవంతునియొక్క యొకొక్కయవయవమునందు లగ్నము చేయవలయును. ఆక్రమమును జెప్పెదను వినుము. చక్రశంఖ యవాదిరేఖలచే నొప్పుచు నుత్తుంగములును రక్తములునగు నఖముల కాంతిసంతానముచే భక్తులహృదయకుహరంబులనుండు నజ్ఞానమను చీఁకటిని దొలంగఁద్రోయుచు వేనియం దుద్భవించిన గంగానది శిరంబునందాల్చి యీశ్వరుండు పవిత్రుండయ్యెనో యేవి పాపశైలములకు వజ్రాయుధములో యట్టినారాయణుని పాదారవిందములను ధ్యానముచేయుచుండవలెను. పిమ్మట లోకమాతయు సమస్తలోకములకుఁ బూజనీయయు నగు శ్రీలక్ష్మీదేవి యేభగవంతుని జానువులను దనతొడలందు నిడుకొని కరపల్లవములచే సేవయొనర్చుచుఁ గృతార్థురాలయ్యెనో యట్టిభగవంతునిజానువులను భక్తితో ధ్యానముచేయవలయును. అనంతరము గరుత్మంతునిస్కంధములయందుఁ బ్రకాశించుచు బలమునకు స్థానభూతములయి యతసీకుసుమసమానములయిన యూరువులను ధ్యానముచేయవలయును. తరువాత

కాంచనమయమయినకాంతిచే నుదంచితమై పాదములపర్యంత
ము జీరాడు పీతాంబరముచే సుందరమయియున్న భగవంతుని
నితంబబింబమును హృదయమందుంపవలెను.పిమ్మట నేభగవంతు
ని నాభీకుహరము లోకముల కాధారమైయున్నదో దేనివలనఁ
జతుర్ముఖబ్రహ్మకుఁ గారణభూతమును సకలలోకాత్మకమునగు
పద్మ ముదయించెనో యట్టి నాభీకుహరమును దనహృదయ
కుహరంబునఁ జొనిపి స్మరింపవలయును. పిమ్మట మరకత
మణిశ్రేష్ఠములవలె నొప్పుచు ముక్తాలహారములకాంతులచే
గౌరములయిన భగవంతుని స్తనముల ధ్యానింపవలయు. తరు
వాత లక్ష్మికి నివాసభూతమయి శ్రీవత్సముచేతను బొలుపా
రుచు ధ్యానించువారి నయనముల కానందము కలిగించు నారా
యణుని వక్షస్థలమును ధ్యానింపవలయును. తరువాతఁ గౌ
స్తుభాద్యలంకారములతో నలరుచున్నట్టి భగవంతునికంఠ
మును స్మరించుచుండవలెను. పూర్వము పాలసంద్రము మ
థించుకాలమునఁ గూర్మావతారముదాల్చి పర్వతమును ధరిం
చుచుండుటచే నాపర్వతపరివర్తనములచేఁ బ్రకాశించునట్టి యం
గదాద్యాభరణంబులు కలిగి లోకపాలకులవలె నొప్పుచున్న
నారాయణుని బాహువులను భజింపవలయును. ఇట్లు భగవదవ
యవములను నంస్మరించుచు, నతనియాయుధములను స్మరిం
పవలయును. సమస్తరాక్షసచక్రంబునకు భయమును గలిగిం
చునదియు సహస్రధారలు కలదియునగు చక్రంబును దలంప
వలయును. పిమ్మట భగవంతుని కరసరోరుహమందున్న రాజ
హంసమువలెఁ దెల్లనికాంతులచే మనోహరమయిన శంఖము
ను, సమస్తదుష్టుల రక్తముచే సిక్తమయినదియు భగవత్ప్రీతి

దాయినియు నగు భగవంతుని కైమోదకిని, భగవంతుని కంఠమందుఁ బ్రకాశించుచున్నదియు మధుకరముల ఝుంకార ధ్వనులు కలదియునగు వనమాలను జీవునికి నధిష్ఠానదేవతవ లె నొప్పు కాస్తుభరత్నమును స్మరింపవలయును. పిమ్మట భక్తా నుగ్రహమునిమిత్తము దాల్పఁబడి మకరకుండలకాంతిసంతా నము చే మండితములయిన గండస్థలంబులు నాసికయు గలిగి యుల్లసిలు భ్రూలతలచే నొప్పుచు మత్తమధుకరబృందము వలె నల్లనికుంతలములతో నలరుచు స్వీయకాంతిచేతను మధు కరములచేతను బ్రకాశించుచు రెండుగండుమీల కాశ్రయము గుపద్మమును ధిక్కరించు భగవంతునివదనమును ధ్యానింపవలె. తరువాత భక్తజనుల కభయప్రదానంబు నొసంగుచుండెడి పాణిపల్లవములను దలంపవలయును. పిమ్మట భయంకరమయిన తాపత్రయమును నశింపఁజేయఁజాలినవియు, భగవంతునిచేఁ బ్రసరింపఁజేయఁబడుచున్నవియు, మందహాసములచే ద్విగుణిత ములయినవియు, నగు భగవంతుని కరుణావలోకనంబులను ధ్యా నము చేయవలయును. మఱియు సమస్తభక్తజనుల దుఃఖ సాగరముల హరించు మందహాసమును, నిర్జితేంద్రియులయిన మునులను, సమస్తలోకమును మోహమున ముంపువున్మథునకు మోహముకలిగింప నాత్మమాయచే బరిగృహీతమగు భ్రూ మండలమును, ప్రవాళమువంటి యధరకాంతులచే నరుణా యితమయిన భగవంతుని దంతకుందపంక్తిని విశదీకరించు భగ వంతుని ప్రహసితమును, భగవదర్పితమనస్కుఁడయి స్మరింప వలయు. హృదయకుహరమునందు ధ్యానింపఁబడుచున్నవిష్ణు మూర్తియందు భక్తిగలిగి యతనియందే చిత్తము నర్పించి

భగవద్వ్యతిరిక్తమగువస్తు వున్నదని విశ్వసింపరాదు. ఇట్లు భగవంతుని సుందరరూపమును సంస్మరింపుచు, భగవంతు నందలి ప్రేమాతిశయముచేఁ బొరలి పొరలివచ్చుచున్న యానం దబాష్పబిందుసందోహామువలన నభిషిక్తుండై యందువలన ను ద్భూతంబులయిన పులకాంకురంబులు శరీరమంతటను నిండు చుండఁ జిత్తాపహారియగు భగవంతునియందుఁ దనచిత్తమును జేర్పఁగలఁడు. పొగ లేనిదీపశిఖవిధమున శబ్దాదివిషయములం దగు లమిచే నిర్మలమయిన మనస్సు, భగవద్విగ్రహ చింతనంబును విడిచి యెప్పుడు బాహ్యవ్యాపారములను వదలుటచే సుఖించుచు న్నదో, యప్పుడు తాను బరమాత్మయందుఁ బ్రత్యక్సంబంధ ముకలిగి దేవాది భేదరహితుఁడయి యున్న యాత్మను దేహాత్మాభి మానమును స్వతంత్రాభిమానమును విడిచినవాఁడయి పరమా త్మకు శరీరభూతమగునట్లుగాఁ జింతింపనలయును. ఓజననీ! భక్తి యోగమును సవిస్తరముగా నీకుఁ దెలిపితిని. ఇఁక దాదృశ భక్తివలనఁ గలుగులాభమును జెప్పెద వినుము. పురుషుండు ప్రా రబ్ధము నశించునంతవఱకు ననుసరించుచున్న మనోవ్యాపార రూపమయినభక్తిచే పరమాత్మస్వరూపమును సాక్షాత్కరిం చుకొని, సుఖదుఃఖముల నతిక్రమించినగుణాష్టకరూపమ హిమయందున్నవాఁడయి తనయాత్మయందు సుఖదుఃఖముల కు హేతువగు దేహాత్మాభిమానాదికము కర్మాధీనమయి ప్ర కృతిపరిణామరూపమయిన దేహసంబంధమున కధీనమయినదని చూచుచున్నాఁడు. ప్రారబ్ధమున్నంతకాల మనువర్తనముగలిగి పరమాత్మసాక్షాత్కారమువలన స్వస్వరూపము నెఱిఁగినవాఁ డు నిరతిశయానంద బ్రహ్మస్వరూపమును దచ్ఛరీరుఁడయిన ప్ర

త్యగాత్మను దెలిసికొని యానందసముద్రమున మునింగి, యీశ్వ రసంకల్పమువలన నపగతమయిన నశ్వరదేహమును కల్లు ద్రా వినవాఁడు తన్మదాంధుఁడయి కట్టుపుట్టమును జూడనివిధమునఁ జూడక వర్తించుచుండు. ఈశ్వరసంకల్పరూపమగు పుణ్యాపు ణ్యముల కధీనమయిన దేహము దనకు నిమిత్తభూతమగు కర్మ మెంతకాలము నశింపక యుండునో యంతకాలము నిద్రి యప్రాణసహితమయి యాకర్మానసానమునకయి ప్రతీక్షించు చుండు. అట్లు ప్రతీక్షించిన మహాత్ముఁడు గుణాష్టకముతోఁగూడిన యాత్మస్వరూపమును బొంది ప్రారబ్ధావసానమందు ముక్తిచెంది స్వప్నపదార్థములవలె ననిత్యములయిన చారపుత్త్రాదులతోఁగూ డియున్న దేహము నింకఁ బొందఁడు.లోకములో మానవుఁ డత్యం తప్రియుఁడయిన పుత్రునికంటెను ధనమునకంటెను మిత్రునికంటె నువేఱయినవాఁడై యున్నట్లు ప్రతీయమానుం డగుచున్నాఁడు. అట్లె తనకుఁ బ్రియమైన దగుటచేతను, నాత్మయగుటచేతను, దనకభిన్నమగుటచేతను నభిమత మగుశరీరాదులకంటెను బ్ర త్యగాత్మ వేఱగుచున్నాఁడు. కొఱివికంటెను మిడుఁగురులకం టెను ధూమముకంటె నగ్ని వేఱగుచున్నది. అట్లు యాత్మ యూ త్మయనియే తలంచుకొనుచున్న దేహాదులకంటె వేఱగుచున్నాఁ డు. మఱియు నెనుకటిదృష్టాంతములవలె భూతములు, నింద్రి యములు నంతఃకరణము స్వరూపముగాఁ గల్గుప్రకృతికంటె ను క్షేత్రజ్ఞునికంటెను నాప్రకృతి పురుషులలోఁ బ్రవేశించి ధా రకుఁడయి సర్వజ్ఞుఁడయి పాండ్యముతో నొప్పుచు సాక్షాద్బ్ర హ్మపదవాచ్యుఁడయిన భగవంతుఁడు పృథక్కృతుఁడేయని తల పోయుము. దేవాదిచతుర్విధశరీరములందుఁ బ్రవేశించి ధారకుఁ

డయియున్న జీవాత్మలను జ్ఞానైకాకారత్వాదులచే నేకస్వరూపులనుగాఁ జూచుచు నట్లె యాత్మయందు ధార్యములయి యున్న దేవాదిచతుర్విధభూతములను గర్మాధీనమయివచ్చు నవాంతరభేదములను విడిచి ప్రకృతిపరిణామరూపము లగుటచే నేకరూపము లేయని చూడవలయును. మఱియు నాజీవులు పరమాత్మకత్వమును జూడవలయును. ఓజననీ! తనకుఁ గారణభూతము లగుతృణనుసంధును, దారువునం దున్నయగ్ని యొక్కటైనను కారణములైన తృణదారువులందున్న నీర్ఘత్వకుటిలత్వాదిధర్మములచేఁ గలుగు వైషమ్యమువలన నానావిధములయినట్లు తోఁచుచున్నది అట్లె ప్రకృతియందునున్న ప్రత్యగాత్మయు దేవాదికృతభేదముచే నానావిధములయి తోఁచుచున్నాఁడు. కాని జ్ఞానైకాకారతనుబట్టి జీవులంద ఱొకరూపులేయని యెఱుంగవలెను. విష్ణుసంబంధినియై కార్యకారణరూపముగానున్నదై దురత్యయమైయున్న ప్రకృతిని భక్తియోగముచేఁ దిరోధానము గావించుకొని గుణాష్టకముతోఁ గూడినరూపమును బొంది మఱుఁడ సంసారబంధమునుబొందఁడు. ఇది యిరువదియెనిమిదవయధ్యాయము.

అని చెప్పినకపిలాచార్యుంజూచి దేవహూతి యిట్లనియె. "ఓ మహాత్మా! మహదాదిత్వంబులకును, బ్రకృతికిని, బురుషునకును, బరస్పరలక్షణంబులను, దదీయస్వరూపంబులను దెలియఁ జెప్పితివి. ఇఁకమీఁద నీచెప్పినప్రకారమున సాంఖ్యమం దేప్రకారముగాఁ జెప్పఁబడినదో తెలియఁ జేయుము. మఱియు బురుషుం

డు భక్తియోగంబునం జేసి సమస్తలోకవిరక్తుం డగునట్టియో

గంబును; బ్రాణులకు సంసారం బనేకవిధములయి వర్తించును గావున నాయావిధంబులను దెలియఁజేయుము. ఓదేవా! నీవు, సమస్తమానవుల నజ్ఞానమనెడి యంధకారమున మునిఁగి వర్తించుచున్న వారలయి నిద్రపోవుచుండఁగా వారలను మేలుకొలుప యోగభాస్కరుండవయి యవతరించినావు. నీదయవలన నాయవివేకము చాలవఱకు మరలినది. ఈనాయడిగిన ప్రశ్నములకును త్తరంబులనిచ్చి సంశయనులంబాపి తరింపఁజేయుము" అని పలుకుచున్న దేవహూతికిఁ గపిలాచార్యుం డిట్లనియె. తల్లీ! లోకములోని పురుషస్వభావంబులంబట్టి భక్తియోగము నాత్వికంబనియు, రాజసంబనియుఁ, దామసంబనియు మూఁడు తెఱంగులయ్యెఁ. అందుఁ దామసభక్తియోగంబు దెలిపెదవినుము. హింసనుగాని, దంభమునుగాని మచ్చరమునుగాని వీనిలో రెంటినిగాని మూఁడింటినిగాని యవలంబించి వర్తించుచుఁ, గ్రోధపరీతుండై భేదబుద్ధిగలవాఁడయి నాయందు భక్తిభావమును గనుపఱుచువాఁడు, తామసభక్తుఁ డనఁబడు. శబ్దాదివిషయలాభములనుగాని కీర్తినిగాని యైశ్వర్యమునుగాని యపేక్షించి బృథగ్భావముకలవాఁడై, నన్నుఁ బూజించువాఁడు రాజసభక్తుండనంబడు. మఱియుఁ దనపాపకర్మములను నశింపఁజేసికొనఁగోరి సమస్తమును బ్రహ్మస్వరూపముగా నెఱింగి "మానవుఁడై జన్మించినవాఁడు భగవంతుని బూజించుట విహితకృత్యమ"ని తలంచుచు భక్తితో నన్నుఁ బూజించువాఁడు సాత్వికభక్తుఁ డనఁబడును. అట్టి భక్తుఁడు సర్వగుణాశ్రయుఁడనయిన నాసచ్చరిత్రముల వినుటచే సముద్రమందు నిరాటంకంబుగాఁ బ్రవేశించు గంగా ప్రవాహమువలె నొప్పి యితరవస్తువున్నదనునన్మకము లేక ఫలా

ద్యుపాధిరహితయయి ప్రీతిపూర్వనుండుఁ గల యనుస్మరణపూర్వకమగు మనోవృత్తియే భక్తియోగస్వరూపమని యెఱుంగుము. అందులోఁ బరమేశ్వరుండనయిన నాయాదుర్నిమిత్తకమయిన భక్తికలవాఁడయి ప్రవర్తించినచో నట్టినాభక్తులకు నిష్కామమయిన భక్తియోగము సాయుజ్య, సాలోక్య, సామీప్య, సారూప్య, ముక్తులకు సాధనంబులయి యుండును. నిర్గుణభక్తులు నాసేవనుదక్క-సాలోక్యాదిముక్తుల నపేక్షింపరు, ఇట్లుండ సాంసారికఫలముల నపేక్షింపరని వేఱుచెప్పవలయునా ? అట్లు సాలోక్యాదిముక్తులున్నను వానినివిడిచి నిష్కాముఁడై నాపదభజనంబు సేవించువాఁడితరకార్యములయందు మానసమును జొనుపకయుండిన నాత్యంతికభక్తుఁడనఁబడును. అట్టిభక్తియోగ మాత్యంతిక మనఁబడును. అట్టియాత్యంతికభక్తియోగ మనలంబించి యేవాఁడు సత్వాదిగుణముల నతిక్రమించి మత్స్వరూపమును జెందునోవాఁడాత్యంతికభక్తుఁడనఁబడును. మఱియు ఫలాపేక్ష లేకుండఁదనవిహితకృత్యముల నాచరించుటయు భక్త్యంగములలో బలవత్తరమయి, ప్రశస్తమయియున్న పంచరాత్రోక్తపూజాయోగమును నడపుటయు, నానివాసస్థానమయిన వైకుంఠమును జూచుటయు, నన్నుఁ బూజించుటయు, స్పృశించుటయు, స్తోత్రముచేయుటయు, నుతించుటయు, సమస్తభూతములు నాస్వరూపములేయని తలంచుటయు, ధైర్యవంతమగు వైరాగ్యము గలిగియుండుటయుఁ, దనకంటె నధికులగువారిని గౌరవించుటయు, దీనులయందు దయగలిగి యుండుటయు, దనతోసమానులగువారితోఁ సఖ్యముచేయుటయు, యమనియమాదులయిన యోగముల నభ్యసించుటయును, వేదాంతశాస్త్రములను సర్వదా నాల

కించుటయు, నానామమును సంస్మరించుటయు, మనోవాక్కా-యశుద్ధిగా సాధుసేవ చేయుటయు, నిరహంకారుడయి నర్చించుటయు, నివియన్నియు భక్తి కంగములని తెలియుము. నీచెప్పినగుణములన్నియుఁ గలిగి మద్ధర్మానుష్ఠానమును జేయునట్టి మానవు చిత్తము నిర్మలమగును. మఱియు వేగముగా నాపదమును ప్రయత్నము లేకయే పొందుచున్నాఁడు. పుష్పములందుండు పరిమళము వాయువు నొంది యప్రయత్నముగానే వచ్చి ఘ్రాణేంద్రియమును బొందుచున్నట్లు యోగముల నభ్యసించువానిమానస మప్రయత్నముచేతనే పరబ్రహ్మమైననన్నుఁబొందుచున్నది. ఈ చెప్పినవి సాత్వికభక్తియోగములు. ఇఁక తామసభక్తియోగములను దెల్పెద నాలింపుము. సమస్తభూతములయందు నంతరాత్మరూపుఁడనై యున్న నన్నుఁ దెలిసికొనక నన్నుఁ బూజింప నారంభింతురు. మఱియు భూతములయందు నివసించియున్న నన్నుఁ దెలిసికొనక పూజించువాఁడు భస్మమునందుఁ చేసినహోమమువలె వ్యర్థమని తలపోయుము. దేహగేహాదులయం దభిమానము కలవాఁడై యితరభూతములయందున్న నాతో విరోధించుచు నాపూజాదులయందు భేదబుద్ధి కలవాఁడయి, యున్నవానిచిత్త మెప్పటికిని శాంతత్వమును బొందలేదు. ఓతల్లీ ! కొండంతలేసి పదార్థములచేఁ బూజించినను భూతసమూహముల కవమానము చేయువారలనుగూర్చి నేను సంతసింపను. వానిపూజలన్నియు వ్యర్థములేయని తెలిసికొనుము. కావునఁ దనహృదయమందును, సర్వభూతములయందును, నున్న నన్నుఁ దెలిసికొనునంతవఱకు స్వధర్మముల నాచరించుచుఁ దనహృదయపద్మమునందుఁ బూజిం

చుకొనుచుండవలయును. సమస్తభూతములను దన్నును గొం చెమైన భేదబుద్ధితోఁ జూచినను వాఁడు మృత్యుభయము నధిక ముగాఁ జెందుచుండును. మఱియు ఘోరంబులగు నరకంబు లం బడును. కావున మున్నుండు సర్వభూతములయందు నున్న నన్ను మైత్రితోఁ జూచి యభేదబుద్ధి కనఁబఱుచుచు, దానము, గారవము మొదలగువానిచే బూజింపవలయును.భూతముల తార తమ్యమును దెలిసెదవినుము. చేతనములు చేతనరహితములగు పృథివ్యాదులకంటె నుత్తమమయినవి. స్పర్శనజ్ఞానంబు గలిగి ప్రాణనంతములయి వర్ధించు వృక్షాదులకంటె రసజ్ఞానము గలి గి వర్ధించు మత్స్యాదులు శ్రేష్ఠములు. వానికంటె పరిమళ మును దెలిసికొనునట్టి మధుకరాదు లుత్తమములు.ఆ మధుకరా దులకంటె శబ్దవేదులయిన సర్పాదు లుత్తమములు. అట్టి సర్పా దులకంటె రూపములను దెలిసికొనఁ జాలినట్టి కాకాదు లుత్త మములు. వానికంటె రెండువైపులను దంతములు గలవి యు త్తమములు. వానికంటెఁ జతుష్పాజ్జంతువు లుత్తమములు. వా నికంటె ద్విపాజ్జంతువు లనఁబడు మనుష్యాదు లుత్తమములు. వారలలో బ్రాహ్మణాది నాల్గువర్ణములవారు నుత్తములు. వారిలో బ్రాహ్మణు లుత్తములు. వారికంటె వేదములను జదివిన వాఁ డుత్తముఁడు. వానికంటె వేదార్థమును బాగుగ నెఱిఁగిన వాఁ డుత్తముఁడు. వానికంటె సందియముల నన్నింటిని దొలం గింపఁజాలినవాఁడగు మీమాంసకుం డుత్తముఁడు. వానికం టెఁ దనకు విహితములయిన కృత్యముల నాచరించినవాఁ డుత్త ముఁడు. వానికంటె ముక్తసంగుఁడు శ్రేష్ఠుండు. నిష్కాముఁడ యి ముక్తసంగుఁ డయినవానికంటెఁ దాఁ జేసినకర్మకలాపము

ను దనయాత్మను నా కర్పించినవాఁడు త్తముఁడు. ఓతల్లీ ! శేషి యు నంతర్యామియునగు నాయందుఁ దనయాత్మను నిలిపి తాఁ జేసిన కర్మకలాపము నా కర్పించి సర్వభూతముల కాత్మనై క్రి యాప్రవర్తకుఁడనై యున్న నాయందుఁ బనులందలి కర్తృత్వ మంతయు నుంచుటవలనఁ దనయందుఁ గర్త్రభిమాన ముంచు కొనక జేతనాచేతనాత్మక మగు ప్రపంచము బ్రహ్మాత్మక మయి నదను జ్ఞానముగల భక్తునికంటె నధికుఁడయినవాఁడు లోకము లో నుండఁడని తెలిసికొనుము. మఱియు మానవుఁడు నిర హంకారుఁడును నిర్గర్వుఁడునై సమస్త చరాచరములయందు భగవత్కలయున్నది యని భావించి మనస్సుచేత సర్వభూతము లకు నమస్కరింపవలయును. అదియె సమదర్శన మనఁబడును. ఓజననీ ! భగవదుపాసనాత్మక మగు భక్తియోగమును, బ్రకృ తికంటె వేఱయి బ్రహ్మశరీరకుఁడయియున్న ప్రత్యగాత్మను దె లుపు జ్ఞానయోగమును నీకుఁ దెలిపితిని. పండితుఁడీరెండింటిలో నొకదానిని జేకొని పరమపురుషునిఁ జేరవలయును. ప్రాణి లోకంబునకుఁ గలిగెడి వివిధములయిన సంసారబంధములఁ దె లిసెద వినుము. ప్రకృతిపురుషులకంటె నీశ్వరసంకల్పముకంటె నదృష్టమునకంటెను విలక్షణమై, యున్న కాలము భగవదూ ర్తి పమునిచెప్పుచున్నారు. అట్టి భగవదూర్తిపమయినకాలమే రూప విశేషములకుఁ గారణమయి మహదాదిభూతములకుఁగూడఁ బరిణామమును గలిగించుచు భేదబుద్ధులకు భయమును గలిగిం చుచున్నది. కాలస్వరూపుఁడయిన భగవంతుఁడు సమస్తభూ తములయందుఁ బ్రవేశించి భూతములచేత మఱికొన్నిభూతము లను జంపుచున్నారు. ఆకాలరూపియె విష్ణువని పిలువఁబడు

చున్నాఁడు. అతఁడు బ్రహ్మాదిదేవతలకుఁగూడ నధిపతియై ప్రవర్తించుచున్నాఁడు. అతనికి లోకములో నొకఁడు శత్రువు లేఁడు. మిత్రుఁడులేఁడు. అందఱు సమానులేకాని లోకములోఁ బ్రభుత్వులై వర్తించు మూఢజనులయందు ద్వేషము నవలంబించి చంపుచుండును. అతనియాజ్ఞకు సమస్తభూతములును భయపడును. అతనికి భయపడి యతనినియోగమును శిరసావహించి వాయువు సర్వకాలములయందు వీచుచుండును. సూర్యుఁడల్లప్పుడుఁ బ్రకాశించుచు లోకములకు వెలుఁతురును వేఁడిమిని నిచ్చుచుండును. పర్జన్యుండు వర్షించును. నక్షత్రసమూహములన్నియుఁ బ్రకాశించుచున్నవి. సమస్తజాతులగు చెట్లు, తీవెలుమొదలగునవి యాయాకాలములయందుఁ బూచుచు, ఫలించుచునుండును. నదులన్నియు స్రవించుచుండును. సముద్రము తనమేరనుమీఱి రానొల్లదు. అగ్ని ప్రజ్వలించును. భూమి సమస్తగిరిసమూహముతోను గదలక వర్తించును. ఆకాశము సమస్తజంతువులకు నవకాశమిచ్చుచున్నది. మహత్తత్వము పృథివ్యాద్యావరణములతోఁ గూడియున్న స్వదేహమును విస్తరింపఁ జేయుచున్నది. రజస్తమోగుణాభిమానులయిన బ్రహ్మాదిదేవతలందఱు నతనియాజ్ఞను దల నిడికొని ప్రతియుగమునందు జగత్సృష్టిని జేయుచున్నారు. మఱియుఁ గాలస్వరూపియయిన భగవంతుండు, జననమరణాదిరహితుండై వర్తించుచు జనకాదులచేఁ బుత్త్రులను బుట్టించుచు,మృత్యువుచే వారలను జంపించుచు,నంటియు నంటనిచందంబునఁ బ్రవర్తించుచుండును. ఇది యిరువది తొమ్మిదవయధ్యాయము.

ఓతల్లీ ! ప్రాణులయొక్క సంసారక్రమములను దెలియఁజె
ప్పెదను వినుము. భగవదుపాసమగు కాలముచే సమస్తప్రాణు
ల యాయువులు హరింపఁబడుచున్నను, దమ్ము తోలఁగఁద్రోయు
చున్న వాయుప్రబలమును నుబ్బులసమూహ మెఱుఁగనివిధంబు
నఁ బ్రాణు లాకాలమునకుఁగల జనము నెఱుఁగఁజాలరు. మఱియుఁ
బ్రాణికోటి సుఖము నభిలషించి యందులకుఁ గారణములయినప
దార్థముల నతిప్రయాసముచే సంపాదించుకొనుచుండఁ గాలాత్మ
కుఁడయిన భగవంతుఁడు వానినెల్ల నశింపఁ జేయుచుండును. అం
దువలనఁ బ్రాణులు తమకు సుఖకారణములయినవస్తువులు నాశ
నమందినవని తలంచి యేడ్చుచుందురు. మఱియును ప్రాణులకు
దారపుత్త్రాదులు, ధనములు, గృహములు, మొదలగునవి
యన్నియు నశించునవే కాని నిత్యములు కావు. అట్లయినను మా
నవు లవివేకముచే వాని నన్నింటిని నిత్యములుగా నెంచుచుందు
రు. ఆకారణమున వెనుకటివస్తువులలో నేదైన నశించినచో
మితిలేనిదుఃఖము నొందుచుందురు. ఇందులకుఁ గారణము దే
హాదులనిత్యములయినను నిత్యవస్తువులనుగాఁ దలంచుటయే
యని తెలిసికొనుము. ప్రాణులు దేవమనుష్యాదిజన్మములను
నిజకర్మకారణంబున నెత్తుచుందురు. అట్లు పుట్టి సుంతేనియు
సుఖ మనుభవింపఁజాలరు. సుఖములేని యిట్టిజన్మములతో లా
భ మేమికలదని విరాగమునయినను జెందరు. నరకము లనుభవిం
చుట మిగులఁ గష్టములని యందఱికిని దెలిసిన విషయమే
కదా? ప్రాణి లట్టినరకములోనున్నను భగవంతునిచే మోహి
తులయి, యచ్చట నీఁబడుచున్న యాహారాదులవలనఁ గొంచె
ము సుఖము కలవారయినందున నా నరకమందుండు దేహముల

నైన విడువనిష్టపడరు. అట్టి నరకసంబంధియగుశరీరమునే విడువ నిష్టపడ రనునప్పుడు దేవమనుష్యాదిశరీరములను విడువఁజాలరని వేఱ చెప్పవలయునా? మఱియు జీవులు తమదేహములను, భార్యలను, పుత్రాదిబాంధవులను, ధనములను, గృహములను, జూచికొని తాను మిగుల నుత్కృష్టుఁడని తలంచుకొనుచుండురు. ప్రాణులు తమభార్యాపుత్రాదులను బోషింప సమకట్టియహర్నిశమును బాటుపడుచు, నాయుష్కాలములయందుఁ దమకుఁ బ్రాప్తములగుచున్న శరీరములకు నచ్చుకప్పములనోర్చి దుష్టచిత్తులయి పెక్కులగు దురితకార్యముల నాచరించుచుఁ బ్రవర్తించుచుండురు. అకటా! నశ్వరములయిన వానింగూర్చి పాటుపడుచు దుఃఖముల ననుభవింపఁ జేయు పాపకార్యముల నార్జించుకొనుచున్నామే? వీనిని విడువవలయునని తలంపక వర్తించుచున్న వారలను మూఢులని చెప్పటకు సందియమున్నదా? వారు, వ్యభిచారిణులయి వర్తించు స్త్రీలసంభోగాది రహస్యకృత్యములకును, దనకుమారులు పలుకుచున్న ముద్దుమూటలకుఁ దమచిత్తముల నధీనములగాఁజేసి మిగుల నవివేకవృత్తితో సంచరింతురు. మఱియు గృహస్థులు దుఃఖమే ప్రధానముగాఁగల గృహములయందు సంచరించుచు, దమచేతనైన కర్మముల నాచరించి దుఃఖములను గొంచెము నివర్తించుకొనుచుఁ, దాను సుఖవంతులయి వఱలుచున్నట్లు తలంచుకొనుచుండురు. ప్రాణులు చేయుంబనుల్లు బహుక్రూరకృత్యముల నాచరించి సమస్తభూతములకును, బాధగలిగించి ద్రవ్యంబును గొనివచ్చి దారసుతాదులను బోషించుచు వారిలు తినఁగా మిగిలినదానిని దా మనుభవించుచు, నిట్లు తమశరీరము సంతను వారికయి యుపయోగించి పిమ్మట నధోలోకములకుఁ

పోవుచున్నారు. మతియుఁ దమభార్యాపుత్త్రాదులను పోషింపఁ దగినంత ధనమును సంపాదింప నారంభించి జీవనోపాయము దైవముచే నిహతముకాఁగాఁ బేరాసగలవారయి యసమర్థులై పరులద్రవ్యము నాశించి యపహరింపఁ బూనుకొనుచుందురు. అట్లు పరులద్రవ్యముల నపహరించి కుటుంబభరణమం దశక్తుఁడయి కుటిలబుద్ధియై మందభాగ్యుఁడై వృథాప్రయాసముఁ బడుచు, చింతతోనే తనజీవితకాలమునంతను బుచ్చుచు, నెట్టిసత్కార్యమునైన నాచరింపలేక, రిత్తవిచారంబు పెట్టికొని తనయింట వసించుచుండు. అప్పుడు తమదారసుతాదులు వానినిఁ దమ్ము పోషింప సమర్థుండు కాఁడనియెఱింగి, సేద్యగాఁడు పనిచేయలేనంత ముదుసలియైయున్న వృషభమునెడ రోతనొందునట్లు, "వీఁడెందులకుఁ బనికిరాఁడు. తిని కూర్చుండుటతప్ప మఱేమియుఁ జేయలేఁడు. ఇట్టివాఁడు బ్రదికి మమ్ము బాధించుచుండుటకంటెఁ జచ్చుటయే మంచిద"ని నిష్ఠురవాక్యములను బలుకుచుఁ దిరస్కరించుచుందురు. అట్లు దారపుత్త్రాదులు నిష్ఠురవాక్యములచే నొప్పించుచున్నను, విరక్తిచెంద నిష్టపడక, పూర్వము తాను సంపాదించినధనాదులచే దారపుత్త్రాదులవమానించుచుఁ బెట్టుచున్నయన్నాదులను శునకమువలెఁ దిని జీవించుచు, ముదుసలితనము శరీరపాటవమును నపహరింపఁ దిన్నపదార్థము నతిగించునంతటి జఠరాగ్నిలేమిచే నల్పాహారియై, శ్లేష్మముచే నావరింపఁబడిన ప్రేవులుకలవాఁడై కాసశ్వాసాదిరోగములచే మిగుల నాయాసపడుచు,మాటలాడ శక్తిలేక కంఠమునందే ఘురఘురశబ్దమును జేయుచుండు. మతియుఁ దాను మంచమున శయనించియేడ్చుచుఁ దన్నుఁ బరివేష్టించియున్న బంధువులచేఁ బిలువఁబడి

యుఁ గాలపాశవశుఁడగుట ప్రత్యుత్తర మీఁజాలఁడు. ఓజననీ! ప్రాణులకుంగల యీ నవనవజరావస్థ లిట్లు దుఃఖబహుళములయి యుండును. ఇట్లు కుటుంబభరణమందు వ్యాపృతుండై యొక సత్కార్యమయిన నాచరింపలేక యజితేంద్రియుఁడయి, తన వారు విలపించుచుండఁ జచ్చును. అప్పుడు యమభటులువచ్చి కాలపాశములచేఁ గట్టఁగా వాఁడు భయముచెంది మూత్ర పురీషములను బుచ్చుచుండు. అంత యమభటులు వానిని* యాతనాదేహమునందుఁ బ్రవేశింపఁజేసి యపరాధిని రాజభటులు గొనిపోయినచందంబున నీఱ్ఱుకొనిపోవుచుఁ జాలదూరము పోయి పోయి మధ్యమార్గమందు యమభటు లర్పించుచున్న దెబ్బ లకు సైఁపలేక గడగడనడఁకుచు, నొక్కొక్కచోఁ గుక్క లచేఁ గఱువఁబడి యీ బాధల ననుభవించుచు, దా నార్జించిన పాపముల నన్నింటిని దలంచుకొని మిక్కిలి పశ్చాత్తాపపడుచుం డును. మఱియు విశ్రాంతిస్థానములును జలమును లేనిమార్గమున నాకలిచేతను, దప్పిచేతను, మిగుల బాధపడుచు, సూర్యాగ్నుల వేఁడిమిచేఁ దపింపఁబడుచు, కొరడాదెబ్బలను, దినుచు, నడుపశక్తి లేనివాఁడయిన నతికష్టముచే నడుచుచుండును. ఇట్లు వాఁడు పాపిష్ఠమార్గమున నొక్కొక్కచోటఁ బడుచు లేచుచు మూర్ఛి ల్లుచు బలుబాము లనుభవించుచు యమలోకమునకుఁ దీసికొని పోఁబడును. మఱియు యమలోక మిచ్చటికిఁ దొంబదితొమ్మిది వేల యోజనములదూరము దుండును. అంతదూరమున్నను బ్రాణి పాపాత్ముఁడై నచో మూఁడు ముహూర్తములకాలములోఁ

* పరలోకములందుఁ బుణ్యపాపంబుల ననుభవించుటకయి మరణానంతర మున జీవులు గైకొను శరీరమునకే యాతనాశరీరమనిపేరు.

గాని రెండు ముహూర్తములకాలములోఁగాని కొనిపోఁబడును. ఆయమలోకమందుఁ బాపాత్ము లనుభవించుచున్న బాధలకు మితిలేదు. కొఱివులచే వానిశరీరమును గప్పి ప్రజ్వలింపఁజేయుదురు.తనశరీరమాంసమును గత్తులతోఁ జేదించి తనకుఁ దినుటకై యిత్తురు. కుక్కలచేతను, గృధ్రములచేతను గఱపించి వానిశరీరములో నున్నప్రేవులను బైకి నూడలాగింతురు. తేళ్లచేతను, బాములచేతను బాధింతురు. ముక్కముక్కలుగా ఖండింతురు. ఏనుఁగులచేఁ ద్రొక్కింతురు. పర్వతములపయి కెక్కించి క్రిందికిఁ దిరుగఁద్రోతురు. నూతులలోముంచి యడుగున నుండనిత్తురు. మఱియుఁ బామిస్రము, అంధతామిస్రము మొదలగు రౌరవాదినరకములందోసి మిగుల బాధింతురు. ఇట్లు స్త్రీలుగాని పురుషులుగాని యీతనాదేహములనుబొంది మిగుల బాధింపఁబడుచుందురు. ఓతల్లీ ! స్వర్గనరకము లీలోకమందె కలవందురు. నరకబాధలుకూడ నీలోకమునఁ గలవు. ఓతల్లీ ! కుటుంబపోషణమునిమిత్తమై పాటుపడుచున్నవారలంతమునఁ దనదేహమును, గుటుంబమును విడిచి నరకలోకమునకుఁబోయి కుటుంబపోషణ ఫలమునుమాత్రమే యనుభవించుచుందురు. మఱియు భూతములకు ద్రోహముచేసి సంపాదించిన ధనమువలన పోషింపఁబడిన దేహము నిచట విడిచి పాపమునే దారిబత్తెమునుగాఁగొని నరకమార్గమును బొందుదురు. వారలు తాము చేసికొన్నపాపముల నన్నియుఁ దామే యనుభవింపవలయును. మఱియుఁ గేవలము కుటుంబభరణమువలనఁ గలిగిన పాపము దైవప్రాపితముకాఁగా నష్టధనునివలె నాతురుఁడయి నరకమందు దాని ననుభవించును. కొంచెమేనియు ధర్మముచే

యక కుటుంభరణాసక్తుఁడగువాఁ డంధతామిస్ర మనునరకము ననుభవించు. ఇట్లు పాపముల నార్జించుకొని చచ్చి యాలోక మున సమస్తపాపము లనుభవించి పవిత్రుండయి తిరిగి భూలోక మునకువచ్చి నరుఁడైపుట్టుచున్నాఁడు" అనిచెప్పి కపిలాచార్యుండు తిరిగి తల్లికిట్లనియె. ఇది ముప్పదవ యధ్యాయము.

కపిలుఁడు దేవహూతికిఁ బిండోత్పత్తిక్రమము తెలుపుట

తల్లీ! యీ వనమందును, జరావస్థయందును, జచ్చినతరు వాతను గలుగుచున్న దుఃఖములను దెలియఁజెప్పితిని. ఇంకఁ బ్రాణులు తల్లిగర్భనుందున్నప్పు డనుభవించుచున్న కష్టముల నుగుతించి చెప్పెద నాలింపుము. * జీవుఁడు భగవంతుని యాజ్ఞ

---

* ఓయీ! "పునరప్యాప్రజేచ్ఛుచిః" అని చెప్పఁబడినది. అనఁగాఁ గర్మములు పూర్ణముగా ననుభవింపఁబడుటచేఁ బవిత్రుఁడయి యీలోకము నకు వచ్చునని యర్థము మఱియు "కర్మణాదైవనేత్రేణ" ఈశ్వరుఁడేర్పాటు జేసిన తనపూర్వకర్మము చేఁ దియుగఁ బుట్టుచున్నాఁడని చెప్పుచున్నారు. వీనికి సకలకర్మములు ననుభవింపఁబడియుండ దైవము వీనికిఁ దిరుగ కర్మము నెట్లు తేఁగలఁడు. శ్రుతులుకూడ సమస్తకర్మఫలములు ననుభూతములయినట్లు చెప్పఁబడుచున్నవి. శ్రు. "యావత్సంపాతముషిత్వా దైవతి మేవాధ్వానం పునర్నివర్తంతే" అనఁగాఁ గర్మమున్నంతికాల మచట నివసించి మఱలుదురని తాత్పర్యము. అట్లే మఱియొక శ్రుతి. "ప్రాప్యాంతంకర్మణస్తస్య యత్కించేహకరోత్యయం। తస్మాల్లోకాత్పునరేత్యస్మై లోకాయకర్మణఃే" అనియున్నది. కావున సకలకర్మఫలము ననుభవించి శుచిత్వమును బొందినవాఁడు తిరిగి యిచ్చటికివచ్చుననుట విపరీతముగా నున్నది. అయియందుఁ జేసి చెప్పెద వినుఁడు. అనుభవి పఁబడనిదియు, నకృతప్రాయశ్చిత్తములైన కర్మములు కర్మాంతరఫల మనుభవించుటవలన నశింపవు. కాన దా నాకర్మములను బురస్కరించుకొని రావ

ప్రకారము తిరిగి మానవశరీరము దాల్చ యత్నించి యొకపురు షు నాశ్రయించి పిమ్మట నతనితేజస్సికణము నాశ్రయించి స్త్రీగ ర్భగోళమందుఁ బ్రవేశించి యొకరాత్రియంతయు రక్తమిశ్ర మయియుండు. అది యైదునినములకు గుండ్రనియపి పది దినంబులకు రేగుఁబండంతదియై కొంచెము కఠినమయిన దయియుండును. తరువాత నది యొకమాంసపుముద్దయగును.

చ్చు. తా ననుభవించిన కర్మమునుగూర్చియే వానికి శుచిత్వము కలుగుచున్నది కాని సర్వకర్మఫలములు ననుభూతములగుటచే శుచిత్వముకలుగలేదు కావున దా ననుభవింపనికర్మములఁ బురస్కరించుచు మగఁడనీలోకమునకు రావచ్చును. ఇట్లనుటకుఁ బ్రమాణము శ్రుతిస్మృతులకలవు. శ్రు. "యఇహ రమణీయచరణా అభ్యాశోహయు త్తే రమణీయాం యోని మాపద్యేరన్ బ్రాహ్మణయోనిం క్షత్ర యోనిం వైశ్యయోనింవా, అథయఇహ కపూయచరణా అభ్యాశోహయు త్తే రమణీయాం యోని మాపద్యేరన్ శ్వయోనిం సూకరయోనిం చండాలయోనిం వా" అనఁగా నెవరీలోకమునఁ బుణ్యకర్మములాచరింతురో వారు బ్రాహ్మణులై కాని క్షత్రియులైకాని వైశ్యులై కాని పుట్టుచుందురు. ఎవరీలోకమునఁ బాపక ర్మములాచరింతురో వారు కుక్కలైకాని పందులైకాని చండాలురయికాని పుట్టుదురని తాత్పర్యము. ఈయర్థము విషయమయి స్మృతియుఁగూడ గలదు. "వర్ణాశ్రమాశ్చస్వకర్మనిష్ఠాః ప్రేత్యకర్మఫలమనుభూయ తతశ్శేషేణ విశిష్టదేశ జాతికులరూపాయుశ్శ్రుతప్రజ్ఞావిత్తసుఖమేధసో జన్మప్రతిపద్యంతే విప్వం చో విపరీతానశ్నంతి తథాతత్పరివృత్తౌ కర్మఫలశేషేణ జాతింరూపంవర్ణం" అనఁగా వర్ణాశ్రమోచితకర్మనిష్ఠులు మరణించి కర్మఫల మనుభవించుచు మిగిలిన కర్మమనుభవింపఁ బ్రవృత్తులై తత్తత్కర్మానుసారముగా సుదేశములందు మంచి జాతులందు మంచికులమందు రూపవంతులై ధనవంతులై యాయుష్మంతులై సుప్రవర్తనులై సుఖవంతులై మేధావంతులై పుట్టుచున్నారని తాత్పర్యము. కావున దైవప్రేరితములగు కర్మాంతరములను బురస్కరించుకొనిజన్మింపఁజచ్చును.

ఒక్కమాస మగునప్పటికి శిరస్సేర్పడును. రెండుమాసములకు గరచరణాద్యవయవవిభాగ మేర్పడును. మూడవమాసమునం దు నఖరోమాదులును, లింగమును ఛిద్రములును కలుగును. నాల్గవమాసమందు సప్తధాతువులు నుదయించును. అయిదవ మాసమునందు నాకలియు దప్పియు జనించును. ఆఱవమాసము న జరాయువుచే బరివేష్టింపఁబడి తల్లికుడిపార్శ్వమునందు వర్తించును. అది మొదలు కుక్షిస్థజంతువు తల్లితినుచున్నయన్నపానాదులచే నర్ధింపఁబడుచు సూక్ష్మజంతువులచేఁ బరీతమయి మూత్రపురీషాదులుగల గర్భకోశమునందు శయనించుచుండును. అచ్చట వర్తించుచు ఊర్ధితములగు సూక్ష్మజంతువులచేఁ గఱవఁబడుచుఁ దాను సుకుమారాంగుఁడై యుండుటవలన నాకాటుల బాధలకోర్వలేక మాటిమాటికి మూర్ఛచెందుచుండును. మఱియుఁ దనతల్లి, కారపువస్తువులుగాని పులుసువస్తువులుకాని చేఁదువస్తువులుకాని మఱి దుస్సహవస్తువులనుగాని తినినచో నాయారసములచేత మిక్కిలి సంతాపమును జెందుచుండును. మఱివిచేఁ బరీతుఁడయి తనశిరస్సును గుక్షియందుఁ జేర్చికొని మెడను వంకరగానుంచుకొని, ప్రేవులచే నావృతుండై కదలుటకయినఁ దగినంత యవకాశములేక పంజరమందున్న పక్షివలె వర్తించుచుండును. అప్పుడు దైవవశమువలన నతఁడు పూర్వకర్మజ్ఞానము గలవాఁడై తనకర్మములను స్మరించుకొనుచుఁ బశ్చాత్తాపమును జెంది నిట్టూర్పుపుచ్చుచుఁ, గొంచెమైనను సుఖములేక వర్తించును. పిమ్మట నేడవమాసమునందు సుఖదుఃఖాదిజ్ఞానములు కలిగి ప్రసూతివాయువులచే మిగులఁ గంపితుండయి, యోనిదరమల మందు జనించిన పురుగుచందంబు నొక్కచోట నుండఁజాలక

తిరుగుచుండును. అంత నాజీవుండు మగుడ గర్భవాసముచేయుట కు భీతుండై బంధనంబులవంటి సప్తధాతువులచేతబద్ధుండై, దీన వదనుండయి, యెవనియనుమతిచొప్పున తా నీగర్భమందు వసిం చెనో యాభగవంతునికి నమస్కరించుచు, జేతులు జోడించి దుర్ణాతిశయముచే గొంతుక రాల్పడ నిట్లనును. "ఓపరమపురుషా! సమస్తభువనములను రక్షించుటకయి వెక్కురూపములఁదాల్చి వర్తించుచు దుర్మార్గుడనగు నాకనురూపముగ నిట్టిగతినిగల్పించిన నీపాదపద్మములను శరణుపొందుచున్నాను. దేవా? నీపాదమూ లముచేరినవాని కెందువలనను భయము కలుగనేరదు కదా? పూర్వమిట్టిజ్ఞానము కలవాఁడనై నీపాదముల నాశ్రయింపకపోవు టచేతనే యిట్టిగతి సంప్రాప్తమయినది. మఱియుఁ దల్లిదేహము నందు భూతేంద్రియరూపముగాఁ బరిణతమయిన మాయను బుర స్కరించికొని కర్మరూపమయినయవిద్యాతిశయముచే స్వస్వరూ పజ్ఞానము లేక, వర్తించుజీవునివలె నీవు మాయాసహచరుండవ యి వర్తించుచున్నను నామాయాగుణములను గలిగించుకొనక జరామరణాదివికారములులేక సంకుచితముకాని జ్ఞానస్వరూప ము కలవాఁడవయి యున్ననీపాదముల కభివందనము లాచరించు చున్నాను.* పంచభూతములచేఁ గల్పితమయిన దేహమందు వర్తిం చుచున్న నావలెను, నీవుగూడ శరీరాదులచేత నావృతుండవయిన

---

*ఓయీ! కర్మవశ్యుఁడగు జీవునికివలె భగవంతునికి నశుచిదేహసంబంధము న్నను దద్గతదోషములు భగవంతునికిఁ జెందవనిచెప్పితివి అదియెట్లుసరిపడును? భగవంతుఁడు జీవునివలెఁ గర్మవశ్యుఁడు గాకపోయినను నానావిధములగు న శుచిదేహములతోఁ సంబంధమున్నప్పుడు జీవునికివలెఁ బరమాత్మకుఁగూడ దో షములు ప్రాప్తము కావలసినదే. జీవుఁడు కర్మవశ్యుఁడయియుండుటచే శరీర

ను దదీయదోషములను గొంచెమయినను బొందవు. నీవు సమస్త

సంబంధము గలుగుచున్నది. భగవంతుఁడు కర్మవశ్యుఁడుకాఁడు కనుక జీవునికి వలెఁ దదీయదోషములు కలుగవని యందువేని అదిసరికాదు. బురదలో నొకరి ప్రేరణచే దుమికినను దనంతటఁ దానే దుమికినను బురద యంటుకొనకమానునా? అట్లే యశుచిదేహసంబంధము కర్మవశమునఁ గలిగినను స్వేచ్ఛచేఁ గలిగించుకొన్నను దదీయదోషములు బొరయకమానవు. కావున భగవంతునికి నానావిధములగు నశుచిదేహముల సంబంధమున్నచో జీవునికివలె దోషములు రాకమానునా? కావున భగవంతుఁడు జగత్కారణుఁడును సర్వజ్ఞత్వాది గుణములుకలవాఁడును సైనను, శ్రు. "యఃపృథివ్యాంతిష్ఠన్" "యఆత్మనితిష్ఠన్" "యోరేతసితిష్ఠన్" ఇత్యాది శ్రుతులందుఁ జెప్పఁబడినవిధముగా నాయాయశుచివస్తువులందున్నప్పు డాయావస్తుదోషంబులు గలుగుట నిశ్చయము. ఇట్లుండ జీవుఁడు భగవంతుని కేలనమస్కరింపవలె? నందువేని చెప్పెదవినుము. జీవుఁడు కర్మవశ్యుఁ డగుటవలన నతనికి నానాకర్ముల కనుగుణములగు వస్తువులనంబంధమును, నాయావస్తుసంబంధమువలనఁగలిగిన యపురుషార్థములుతప్పవు. కాని పరబ్రహ్మ కర్మవశ్యుఁడు కాకపోవుటవలన నతని కట్టివస్తుసంబంధము లీలామాత్రముగాఁ బరిణమించుచున్నది. స్వేచ్ఛచే నియమనము చేయుచున్నను వస్తుస్వభావాధీనమగు నపురుషార్థము చెందక మానదని యనరాదు. భగవంతుఁడు దాదృశదోషములకు విరోధి. చీఁకట్లకు విరోధియగు సూర్యుఁడు తానై చీఁకటిలోఁ జొచ్చినను నాచీఁకటు లాతనిఁ జేరలేనివిధమున దోష ప్రతిభటుఁడుకాన భగవంతుఁడు దోషసంబంధము కలిగించుకొనినను నతనిఁ బొందలేవు. మఱియు నచిద్వస్తు వెప్పుడును స్వభావమువలన నపురుషార్థము కాదు. అట్టియచిద్వస్తువు కర్మవశ్యులకు కర్మస్వభావానుగుణ్యముంబట్టియు దైవసంకల్పముంబట్టియు దేశకాలభేదము చేతను బురుషభేదము చేతను దుఃఖముకొఁతను సుఖముకొఁతను గూడ నగుచున్నది. కావున దేహసంబంధము కర్మవశ్యుఁడగు జీవునికిఁ దత్కర్మానుగుణములగు నపురుషార్థములఁ గల్పించుచున్నది. అదియె దోషప్రతిభటుఁడయిన భగవంతునికి లీలారూపమగు

మును నియమించువాఁడవు. నీ స్వరూప మెప్పుడును బుణ్యపాప కర్మములచే సంకోచమునొందదు. మఱియు నీవు సర్వజ్ఞుఁడవు. నీవు ప్రకృతిపురుషులకంటె వ్యతిరిక్తుఁడవయి యొప్పుచున్నావు. నీవు పరమపురుషుండవు. అట్టి నీపాదపద్మముల కభివందనము లాచరించుచున్నాను. ఓయీ ! నమస్కరించినంతమాత్రమున సంసారము నివర్తించునా యని సంశయింపఁబనిలేదు. ఓ భగవంతా? జీవుఁడు నీమాయచే మోహితుండై సత్త్వాదిగుణ నిమిత్తములయిన బంధనసాధనములతో వెలయుచున్న సంసారమునం బడి చరించుచు, నందు జనించినశ్రమచే జ్ఞానమును గోల్పోయి యెన్నఁటికి నట్లు సంసారచక్రమందు జననమరణము లొందుచుండు. అట్టివాఁడు మఱుఁడ స్వస్వరూపము జెందుటకు నీయనుగ్రహముకంటె మఱియొకయుపాయ మేదికలదు? ఓ భగవంతా? తాను బంధనమును దప్పించుకొని యితరుల బంధనమును దప్పింపవలయునని పండితులందురు కాన నీవే జ్ఞానప్రదానముచేసి సంసారమును విడిపింపఁగలవుగాని బ్రహ్మాదులట్లు చేయలేరు. నీవు త్రికాలజ్ఞానసంపన్నుండవు. సమస్తచరాచ

చున్నది. ఒక్కవస్తువు దేశకాలపురుషభేదముచే సుఖదుఃఖములకొఱకు చున్నదనుటకుఁ బ్రమాణము. శ్లో॥ "నరకస్వర్గసంజ్ఞౌవై పాపపుణ్యే ద్విజోత్తమ। పస్యైకమేవదుఃఖాయ సుఖాయేశ్వాగమాయచ। కోపాయచయతస్తస్తా ద్వస్తువస్తాత్మకంయతః। తదేవప్రీతయే భూత్వా పునర్దుఃఖాయజాయతే। తదేవకోపాయయతః ప్రసాదాయచ జాయతే। తస్మాద్దుఃఖాత్మకంనాస్తి నచ కిఞ్చిత్సుఖాత్మక" అని చెప్పఁబడినది. కావున జీవుఁడు కర్మవశ్యుఁడు. భగవంతుఁడట్లుకాదు. జీవుఁడు హేయార్థుఁడు భగవంతుఁడు హేయప్రతిభటుఁడు. కావున జీవపరమాత్మలకు వైషమ్యమున్నది. కాన జీవునికి నమస్కార్యుఁడే.

రములయందును నంతర్యామివయి యలరుచున్నావు. జీవాంతరాత్మవయి వఱలుచున్న నీజ్ఞాన మెన్నఁడును సంకోచమునొందదు. నీవు బ్రహ్మాదులకుఁగూడ నధిపతివయి చరించుచున్నావు. తాపత్రయము తొలఁగుటకయి యట్టినీకు నమస్కరించుచున్నాను. తాపత్రయ నివారణచేయుము. ఓ మహనీయా ! నీ యనుమతి చొప్పున వచ్చి యీగర్భగోళమందు వసించి యిందున్న క్రిమికీటాదులచేఁ బలుబాధలనుబడుచు జఠరాగ్నిచేఁ దప్తుఁడనగుచు, నీగర్భకోశమునుండి వెలువడుటకుఁ బ్రయత్నించి యవధికూసనములను లెక్కించుచు, వర్తించుచున్నాను. దయాసముద్రుఁడవయిననీ వెన్నఁడు నన్నుఁ బైకిఁ దొలంగింతువోకదా! ఓదేవా? నన్నీకూపమునుండి యుద్ధరింపుము. ఓదేవదేవా? నీవు నిరుపమానుఁడవు. దయానిధి యయిన నీవు పదిమాసములవయస్సుగలవాఁడనయినను నాకు నిట్టిజ్ఞానము కలిగించితివి. నీపుచేసిన యుపకారమునకు నీవే సంతసింపుము. మహోపకారివగు నీకు నమస్కారముతప్ప నేమియుపకారము చేయఁగలను ? ఏదియుఁజేయలేను. ఇదిగో నమస్కారముచేయుచున్నాను. దీనినే గొప్పప్రత్యుపకారముగా భావించి నన్నీబాధనుండి తొలంగింపుము. పరమపురుషునిచే నధిష్ఠితమై, జీవుని కర్మములవలన సంప్రాప్తమయియున్న శరీరమందు ఖన్నుఁడయియుండి నప్తవిధములగు త్వక్కులచే వేష్టితమగు దేహమును ధరించి శమదమాదియుక్తుఁడయిన యోగి యీశ్వరదత్తమగు నుపాసనాత్మకబుద్ధిచే నిన్నుఁ జూచుచున్నాఁడు. అట్లే నేనును నంతర్బహిర్యాగములందుఁ బ్రతీయమానుఁడ వగుచు యోగపరిశుద్ధ చిత్తముచే గృహీతుండవయి యున్న నిన్ను భగ

వంతుఁడవగు నీచే నర్పితమగుబుద్ధిచే సాత్మీకరింపఁ జేసికొం దును. ఓదేవా! ఈగర్భనరకము నాకు మిక్కిలి బాధలు కలి గించుచున్నను దివ్యజ్ఞానముగలవాఁడ నగుటచేఁ బైకివచ్చుట కిష్టము లేదు. ఈకూపమును గడచి పైకివచ్చినచో నీమాయ న న్నావరించి యీవిజ్ఞానమునంతయుఁ బోవునట్లు చేయును. అందువలన నేను దేహాద్యభిమానము కలవాఁడనయి సంసార చక్రమునంబడి తిరిగి పుట్టుచు చచ్చుచు వర్తింపవలసి వచ్చుచు న్నది. కావున నన్నీగర్భకుహరమునుండి తెప్పించి యంతకంటె నధికభయంకరమగు సంసారకూపంబునఁ బడవేయక నా కీ జ్ఞానముండునట్లు చేయుము. దానివలన నీమాయ నతిక్రమించి వేగముగా నీకూపమును జూడఁగలను. సర్వభూతహితుండవ యిన నీవు గర్భనరకమునుండి తప్పించినట్లుగానే దయాకరుండ వయి సంసారకూపమునుండికూడఁ దప్పించి రక్షింపుము. గర్భ వాసనారూపమయిన దుఃఖము నాకు రాకుండఁ గాపాడుము. నీపాదపద్మముల నాశ్రయించినవారి కెట్టిలోపములు నుండఁగూ డునా? అని యిట్లు గర్భగోళమందుండి యపారమయిన దుఃఖ ము లనుభవించుచు భగవంతునిఁ బ్రార్థించుచు దశమాస పరిమితుఁడయి యున్నజీవునిఁ బ్రసూతివాయువులు ప్రసవము కొఱకుఁ బ్రేరణచేయును. ఆవాయువుచేత జీవుఁడు స్వస్థానము వలననుండి కదలి శిరస్సును క్రిందుగాఁ జేసికొని గర్భమందున్న ప్పటి జ్ఞానమునంతను గోల్పోయి యతికష్టముచేఁ దల్లియు దరమునుండి బయలువెడలివచ్చును. ఇట్లు వెడలివచ్చి రక్తసిక్త గాత్రుండయి భూమిపయింబడి చిన్నపురుగువలెను గదలుచు మెఁ దలుచు నజ్ఞానావృతుండయి మిక్కిలి రోదనముచేయును. వాఁ

డట్లు రోదనముచేయుచుండ నాశిశునభిప్రాయ మెఱుఁగఁజాలక పాలనిమిత్త మేర్పినప్పు డుదరవ్యథచే నేడ్చుచున్నాఁడని చేఁదురక ముసిచ్చుచు, నుదరవ్యథచేఁ బీడితుఁడగునప్పుడు పాలకోస మేడ్చుచున్నాఁడని స్తన్య మొసంగుచునుందురు. అందువలన మతీంత బాధగలవాఁడయి నాశిశువు దోమలు నల్లులు మొదలగువానిచేఁ గల్మషమైయొప్పు మంచముపై శయనింపఁ జేయఁబడి యవయవ ములకండూతిని దొలంగించుకొనుటకుఁగాని కూర్చుండుటకుఁ గాని నడుచుటకుఁగాని యసమర్థుండై, రోదనముఁ జేయుచుండును. ఇట్లు పలుబాము లనుభవించుచు శైశవావస్థ నతిక్రమించి యజ్ఞానమునకును గోపాదులకును నాకరమయి వర్తించును. పిమ్మటఁ గ్రోధాదులు శరీరముతోఁగూడ బెరుఁగుచు, వానిని గాముకుని గాఁ జేసి వానిజీవనములనుగూడఁ బాయునట్లు చేయును. పంచ భూతములచేఁ గల్పితమయిన దేహమునందు వసించి జీవుఁడు నిన్ను విడువకుండయి యహంకార మమకారములతోఁ గూడి వర్తించుచు, సర్వము నేనే చేయుచున్నాననియు, సర్వము నాదే యనియు బుద్ధికలవాఁడై, కుమతియై వర్తించును. మతీయు నా ప్రాణి యేకర్మముల నాచరించిన సంసారము తనకుఁ బ్రాప్తమ గునో యట్టికర్మములనే యాచరించుచు, మాటిమాటికిఁ బుట్టు చుఁ జచ్చుచు మగుడ దుఃఖావహమగు దేహమునే పొందుచుం డును. భార్యాపుత్రాదుల పోషణకయి వెక్కులగు నసత్కార్య ముల నాచరించుచు,నరకకూపమునఁ బడును. మతీయు దారపు త్రాదుల సాంగత్యమును జేసినచో, సత్యము, శౌచము, దయ, మౌనవ్రతము, బుద్ధియు, శ్రీ, లజ్జ, కీర్తి, యోర్పు, శమదమాదు లు మొదలగు గుణములన్నియు నాశనమును బొందకమానవు.

ఇట్టినప్పను కలిగించువారలతోఁ బండితుఁడయినవాఁడు సాంగత్య
ము చేయఁగూడదు. మఱియు స్త్రీలు క్రీడామృగములవంటివా
రు. వారు క్రీడామృగములు వేఁటకానిహృదయముల నాకర్షిం
చినవిధమున మానవుల మానసమును హరించుచుందురు. విష
యవాంఛారహితలుకాక దేహాత్మబుద్ధిగలిగి మూఢులయియున్న
స్త్రీలయెడ మెలఁకువగలిగి వర్తింపవలయును.లోకమున స్త్రీ సాం
గత్యమువలనఁ బుగుష్మునికి సంసారబంధము సంభవించినట్లు
మఱియొకదానివలనఁ గలుగనేరదు. స్త్రీసాంగత్యమువలన మ
హానర్థములు సంభవింపకమానవు. ఇందుల కొక్కయితిహాసము
కలదు చెప్పెదను వినుము. తనకూఁతురయినసరస్వతి మృగియై
వర్తించుచుండ నదిచూచి బ్రహ్మ, దానిసౌందర్యమున కోటువడి
వివశాంగుఁడై సిగ్గువిడిచి తాను నొక్కఁజింకయై మృగరూపియై
యున్న తనకూఁతు ననుసరింప మొదలుపెట్టె. చూడు మట్టిమహా
నీయునికిఁగూడ నెట్టిదుర్బుద్ధి కలిగినదో? స్త్రీసాంగత్యము పురు
షుల మానసములను నినుపవస్తువుల నాకర్షింప నయస్కాంత
మువంటిదని తలపోయుము. ఆబ్రహ్మచే సృజింపఁబడిన మరీచ్యా
ది మహామునులయినను స్త్రీసాంగత్యమును విడుచునఁటెటి బు
ద్ధిగలవారు కాలేకపోయిరి. మహామహులయిన బ్రహ్మసుతులే కా
మమోహితులై స్త్రీలవలలలోఁ జిక్కుచున్నప్పుడు వారలకంటెఁ
దక్కువప్రభావముగలవా రెట్లుగా దానిని విసర్జింపఁగలరు?సృష్టి
లోనెల్ల స్త్రీసాంగత్యమును దొలఁగఁద్రోసినమహాత్ముఁడొక్క
నారాయణముని.అతఁడుకాక మఱియొకఁడులేడు.ఓతల్లీ!స్త్రీరూ
పమయియున్న నామాయామహిమమునుజూడుము.ఆస్త్రీవ్యక్తి
తనభ్రూవిక్షేపముచేతనే దిగ్విజేతలగుశూరులనుసైతము స్వాధీ

నము చేసికొనును. నాసేవనముచే నాత్మజ్ఞానముపడసి భక్తియో గఫలమగు నాపదమును గోరువాఁ డొకప్పుడును స్త్రీసంగమును జేయరాదు. లేనిచో నెంతటిజ్ఞానవంతుఁడైనను దప్పక మోహి తుండయి చెడి యందువలన నింద్యకార్యములనాచరించి ఘోరత రంబులగు నరకంబులంబడును. శుక్రోపాదిమిషలచే భగవన్మిర్మి తయగు నే స్త్రీరూపమాయ తొలఁగుచున్నదో యామాయను ద న కనర్థములు కలిగించుదానిగాను తృణావృతకూపములనుగాను జూడవలయును. అట్టికూపములు తృణముచే నావృతంబులయి యుండి చూపటకు స్థలబుద్ధిని గలిగించి తనగర్భమందు వేసికొనిన ట్లే స్త్రీలుకూడఁ దమవిలాసములచేఁ బురుషులకు సుఖబుద్ధిని గ లిగించి తమమాయలలోఁ ద్రోసి యనర్థము కలిగించుచుందురు. కావున స్త్రీలను జయించుట మిగుల గొప్పకార్యము. స్త్రీసాం గత్యము విడిచిన మహనీయుఁడు నామాయాసంబంధమును విడి చినవాఁడనియె తలంపుము. అట్టివాఁడు క్రమముగా మోక్షప దము నందఁగలఁడు. పురుషరూపంబునొందిన జీవుండు సంతతము స్త్రీని దలంచుచు నంతకాలమందుఁ గళేబరంబువిడిచి స్త్రీరూప మును జెందును. అట్లే స్త్రీరూపంబునొందిన జీవుండును మన్మా యచేఁ బురుషరూపంబు నొందును. మఱియు వేఁటకాండ్రసంగీ తము మొదట మృగముల కానందదాయకమయినను దరువాత బంధకారణం బయినతెఱంగునఁ, దనకు ధనాదులనిచ్చి పోషించు భర్త మొదట సంతోషము కలిగించువాఁడయినను బిమ్మటఁ ద నకు బంధకారణముండగను. విత్తాదులనిచ్చి సంతసింపఁజేయు పతిని దైవవశమువలనఁ బ్రాప్తమగు మృత్యువునుగాఁ దలంపవలయుం గావున మోక్షమం దిచ్ఛగల స్త్రీలుగూడఁ బురుషసంగమును,

విసర్జింపవలయును. ఓతల్లీ ! జీవుఁడు గర్భవసం దున్నదిమొదలు కొని యీవనాంతమువఱకు ననుభవించుచున్న కష్టములను దెలి యఁజేసితి. జరామరణాది కష్టములనుగుఱించి పూర్వమందె తెలి యఁబఱిచితి. ఇంక నిత్యమైన యాత్మకు జననమరణాదు లెట్లుగాఁ బ్రాప్తము లగుచున్న వ్వో, ప్రాప్తములయినను వాని స్వరూ పము లెట్టివియో, యనుభవమువలనఁ బుణ్యాపాపక్షయమగు చుండఁగా నొకశరీరమునుండి శరీరాంతరమున కాత్మ యెట్లు పో వుచున్నదియో, శరీరాంతరమునకుఁబోవుట సంభవించినను బ్రా క్తనములగు భూతసూక్ష్ములతోఁ గూడియె పోవునా ? లేక వానిని విడిచియేపోవునా ? యిట్టి యాశంకలన్నియుఁ దొలంగు నట్లు లుపదేశించెద విను. జీవుఁడు తన కభిన్నమయినదని యభి మతమగు భూతేంద్రియ మనోరూపకమయిన సూక్ష్మదేహము చేత సూక్ష్మపరిణామరూపమగు స్థూలశరీరమునుండి తాదృశ స్థూలదేహాంతరమునకు ననుసరించిపోవుచుఁ బూర్వమున స్థూల దేహముచే సంపాదింపఁబడిన కర్మఫలముల ననుభవించుచు మ గుడ ను త్తరజన్మమున కారంభకములగు కర్మములను సంతత మొనరించుచుండును. జీవుఁడీదృశసూక్ష్మదేహముతోఁ దేహము నుండి దేహాంతరమునకుఁ బోవుట యెట్లు తెలిసికొనఁబడును ? అని శంకింపఁబనిలేదు. జీవత్వాభిమానముగల భూతేంద్రియా త్మకమగు సూక్ష్మదేహము జీవాత్మ ననుసరించి పోవుచుండును. అభ్యుపగతములగు ప్రారబ్ధకర్మములు భోగమువలన నశించినను దక్కినకర్మములు నశింపవు. కావునఁ గర్మములకు సమాప్తి గలు గనేరదు. నిత్యమగు నాత్మకు జననమరణములు దేహద్వారక ములేకాని స్వభావసిద్ధమయినవిలేవు. స్థూలదేహమును విడిచి

సూక్ష్మావస్థను బొందుటయే జీవునికి మరణమనియు సూక్ష్మావస్థను విడిచి స్థూలావస్థనుబొందుటయె జననమనియు భావింపఁబడుచున్నది. జననమరణస్వరూపము లెట్టివియో తెలిపెదను.* పృథివ్యాది

---

* "తదేతదక్షయం నిత్యం జగత్ స్థాణ్వనుజంగమమ్ । ప్రకృతిం పురుషంచైవ విద్ధ్యనాదీ ఉభావపి" అని ప్రకృతిపురుషులు ఉభయులును నిత్యులని చెప్పఁబడుచున్నది. కాన యట్టివాని కుత్పత్తివినాశములు సంభవింపవేరవు. అత్యపరిణామము నొందనివాఁడగుటచే స్వాభావికముగా నుత్పత్త్యాదులు లతినికి సంభవింపకపోయినను బ్రకృతిద్వారకము లగునవి సంభవించుచుండుచున్నవి. ప్రకృతికి స్వభావసిద్ధములగు నుత్పత్త్యాదులు కలవు. అట్లు కలిగియున్నను ద్రవ్యము నిత్యమని యంగీకరించుటచే బ్రకృతి నిత్యమైనదనియె గ్రహింపవలయును. అట్లయిన నుత్పత్తివినాశాదు లెట్లుకలుగుచున్నవని యందురేని యుత్పత్తివినాశాదులు ద్రవ్యముయొక్క యవస్థావిశేషములేకాని వేఱయినవికావు. తంతువులు మొదలగు ద్రవ్యములు తామునశింపకయే రచనావిశేషయుక్తములయి పటాదులగుచున్నవి. మఱియు నాపటమందుఁ దంతుసంతానవిశేషముకంటె నతిరిక్తపదార్థమున్నట్లు తోఁపలేదు. ఇంతియకాక తంతురచనావిశేషమే పటమగుచున్న దన్నంతమాత్రమునే సరిపోవుచుండఁగా నచ్చట ద్రవ్యాంతరమయినట్లు కల్పించుట యయుక్తము. ఉత్పత్తివినాశాదులు ద్రవ్యముయొక్క యవస్థావిశేషములనియే గ్రహింపవలయును. ఉత్పత్తియనెడి యవస్థనుబొందిన ద్రవ్యమునకు దద్విరుద్ధావస్థను మఱియొకదానిని బొందుటయె వినాశమనఁబడుచున్నది. అవస్థాంతరమును బొందుటయె యుత్పత్తియనఁబడును. మన్ను పిండముగాను ఘటముగాను గపాలముగాను, జూర్ణముగాను మాఱుట స్వభావసిద్ధమని యందఱికిఁ దెలిసినవిషయమె. అందు బిండత్వాదులగు నెక్కువస్థలు గానవచ్చుచున్నవి. చూర్ణావస్థను బొందియున్నద్రవ్యము తత్తరావస్థను బొందుటయె వినాశమనియు నుత్తరావస్థ ప్రాప్తియె యుత్పత్తియనియు స్పష్టమగుచున్నది. కావునఁ బురుషునివలెఁ బ్రకృతియు నిత్యమనియు దానియుత్పత్తివినాశములనఁగా ద్రవ్యముయొక్క యవస్థావిశేషములేయనియుఁ దెలియునది.

ద్రవ్యములని తెలియవచ్చుచున్న దేహ మాత్మాభిమానమునకు విషయమయి యది నూత్నావస్థనొందుటయె మరణమనియు, నహమ్మనెడి యభిమానముచే ద్రవ్యదర్శనము కలుగుటయె దేహమున కుత్పత్తియనియుఁ దెలియఁబడినది. తిమిరాదులచే దృష్టి యుపహతమయినప్పుడు గోచరవస్తువున్నను జక్షువుచూడలేదు. కావున నింద్రియగోళకమునకు దర్శనయోగ్యత లేనట్లు స్పష్టమగుచున్నది. ఈరీతినే శోభనదృష్టిగల పురుషునియాత్మ సావధానమై యుండనప్పుడు నేత్రము తెఱవఁబడినను ద్రవ్యమును జూడలేదు. కావునఁ జక్షురింద్రియమునకుఁగూడ దర్శనయోగ్యతలేనట్లు తెల్లమగుచున్నది. కాన చేతనమే ద్రవ్యము చూడగలదుకాని కేవల మింద్రియము చూడలేదు. ఇంద్రియము చూడలేకపోయిననుచూచుటలో నాత్మకు సాధనమగుచున్నది. అందువలన నేత్రమునకును జేతనమునకును గరణత్వకరణిత్వరూపమగు సంబంధయోగ్యతకలదు. ఈ చెప్పటచే నింద్రియమాత్మ కానట్లు తెలియవచ్చుచున్నది.అట్లె దేహముగూడ నాత్మస్వరూపముకాదని గ్రహింపవలయును. జన్మజరామరణాదులుగల దేహమాత్మకాదు కనుక దేహమునకు మరణాదులు సంభవించినపుడు భయపడక పుత్రాదులు నశించినపుడు దుఃఖింపక పుత్రాదులు పుట్టినపుడు సంతసింపక సుఖదుఃఖములను సమముగాఁ జూచుకొనుచుఁ బ్రకృతివిలక్షణమగు నాత్మస్వరూపమును దెలిసికొని దేహమందును గేహమందును దారపుత్రాదులందును నాసక్తివిడిచి యీలోకంబునఁ జరింపవలయును. మఱియు నబాధితమగు శాస్త్రజన్యజ్ఞానముగలిగి ప్రకృతికంటె నాత్మ వేఱయిన యనెడి జ్ఞానముచేతను బ్రహ్మాతిరిక్తమగువస్తువునందలివై రాగ్యము

చేతనుగూడ భగవదుపాసనాత్మకబుద్ధివలన మాయావిరచిత మగు లోకమందును దేహాదులం దాస్థవిడిచి నివృత్తిధర్మముల నాచరింపవలయును. ఇది ముప్పదియొకఁడవయధ్యాయము.

ఓతల్లీ! గృహమేధి గృహమందు నివసించుచు గృహస్థాశ్రమ మున కనుగుణములగు ధర్మముల ననుష్ఠించుచు,నర్థకామములను బొందనుచుఁ దఱుచుగా నాప్రవృత్తిధర్మములనే పాలించును. ఇట్లు కేవలము గృహస్థాశ్రమధర్మముల నాచరించువాఁడు విషయాసక్తిచే మూఢుఁడయి కావునఁనే భగవద్ధర్మములకు విముఖుఁడయి ప్రవృత్తిధర్మములందలి శ్రద్ధచే యాగములచే దేవతలను బూజించుచు, శ్రాద్ధాదులచేఁ బితృదేవతల సంతసింపఁ జేయుచుండును. మఱియు సంతతము పితృదేవతలకొఱకును దేవతలకొఱకును వ్రతములఁ జేయుచుండును. ఇట్లు యాగాదుల నొనరించినవాఁడు చంద్రలోకమునకుఁబోయి భగవంతుఁడు శేషశాయియై యున్నప్పుడు గృహమేధులు పొందిన లోకములు నశించునుగావున మఱుఁడ నీలోకమునకు నత్తురు. కాని యెవరు జితేంద్రియులయి వర్ణాశ్రమధర్మముల నర్థకామముల నిమిత్త ముపయోగింపక దుష్టసంగమును విడిచి వర్ణాశ్రమోచితకర్మములను నాకర్పణముచేసి శమదమాదియుతులై స్వధర్మానుష్ఠానముచే నిర్మలచిత్తులై నివృత్తిధర్మములం దాసక్తి గలిగి యహంకారమమకారనర్జితులై స్వధర్మజన్య మయిననిర్మలచిత్తముచే * నర్చిరాదిగతిచేఁ

---

*జీవు లూర్ధ్వలోకముల కేఁగుటకు ధూమాదిగతియనియు నర్చిరాదిగతియనియు రెండుగలవు. ధూమము, రాత్రి, కృష్ణపక్షము, దక్షిణాయనము, షణ్మా

బరమపురుషుఁడును, విశ్వమునకు బంధమోక్షములను గలిగింపు వాఁడును, విశ్వమునకు సృష్టిస్థితిలయములు కల్పించువాఁడును, సర్వజ్ఞుఁడును, బరాత్పరుఁడు నగుననున్నఁ బొందుదురో వారు తిరుగఁ బుట్టుకకుఁ గారు. ఇది పరబ్రహ్మమును నుపాసించినవారికిఁ గలిగెడి గతి. చతుర్ముఖాదులను గొందఱు నుపాసింతురు. అట్టివారలు మరణానంతరమున సత్యలోకమునకుఁబోయి రెండుపరార్ధముల కాలమువఱకు నచ్చట నివసించియుందురు. భగవంతుం డిప్పుడు పృథ్వ్యాది భూతపంచకముతోడను మానసేంద్రియాదులతోడను శబ్దాది తన్మాత్రములతోడను గూడియున్న లోకంబును, బ్రకృతియందు లీనంబుచేయఁదలంచి సమస్తలోకములను సంహరించునో యప్పుడు జితేంద్రియులై పరబ్రహ్మముకంటె నితరములగు నైశ్వర్యములందు వైరాగ్యముఁ జెంది దేహాత్మాభిమానమువదలి తనలోకమందున్న యోగులతోఁగూడఁ జతుర్ముఖుండు పరమపురుషు నొందును. ముక్తిఁ జెందుటకు నిట్టిమార్గములు కలవు. కావున ఓతిల్లీ ! సర్వభూతముల హృదయారవిందములయందు నివసించినవాఁడును శ్రుతప్రభావుఁడును నగు పరమపురుషుని శరణుఁ జెందుము. పరమపదము చెందుటకు మఱికొన్ని మార్గములున్నను పరమపదము నొందుటకు భక్తిమార్గముకంటె మిగుల సులభమగుమార్గము లేదు. ఆ మార్గమునే నీవనుసరించి సర్వం

నను పితృలోకము, ఆకాశము చంద్రుఁడు. వీరిద్వారకముగాఁ బోయి యాకాశము, వాయువు, భూమను, మేఘము వీనిద్వారకముగా మరల నీలోకమున కవతరింతురు. శుక్లపక్షము అర్చిరాదిగతియన అర్చిస్సు, పగలు, ఉత్తరాయణము, సంవత్సరము, వాయువు, సూర్యుఁడు, చంద్రుఁడు,విద్యుత్తు,వరుణుఁడు, ఇంద్రుఁడు, బ్రహ్మ, వీరిద్వారకముగాఁ బోవుట.

తర్యామివయిన భగవంతుని భజించుచుండుము. ఓతల్లీ! ఎవరయిన సాభిమానులయి వర్తించినవారు తప్పక సంసారబంధంబులను బొందుదురు. సమస్తచరాచరలోకమును సృజింపఁ జాలినంతశక్తికల బ్రహ్మయంయినను, సాభిమానుఁడయి వర్తించినచో సంసారము నొందక మానఁడు.ఆబ్రహ్మయు భేదదృష్టితోను నభిమానముతోను నిస్సంగకర్మముల నాచరించుటవలన యోగప్రవర్తకులగు సనకాదులతోఁ గూడ సూక్ష్మచిదచిద్విశిష్టుఁడగు భగవంతునియందు లీనతఁ జెంది మఱుఁడ సృష్టిదశయందుఁ బూర్వమువలెనే పుట్టుచుండును.పారమేష్ఠ్యమగు నైశ్వర్యముగూడఁ గర్మాయత్తమేకావున దానిననుభవించి పరమపురుషునిఁ జెంది మఱుఁడు బుట్టుచున్నారు.ఓజననీ ! నిష్కామకర్మలే సాభిమానులైనప్పుడు సంసారమునొందుచున్నారని చెప్పవలసియుండఁగా సకామకర్మలగువారు సాభిమానులయినచో సంసారమునొందుదురని వేఱు చెప్పవలయునా? పారమేష్ఠ్యాదులగు నైశ్వర్యములందు నాసక్తులై తత్సాధనములగు కర్మలందు శ్రద్ధగలిగి కామ్యములగు నిత్యకర్మములను సైతము స్వర్గాద్యపేక్షతోఁ జేయుచుందురు.మఱియు వారిమనస్సు రజోగుణముచే వ్యాకులతఁ జెందుటచేఁ గామాసక్తులై కావునసే యింద్రియములను జయింపలేక గార్హస్థ్యసుఖంబులనే కోరుచుఁ బ్రతిదినమును బితృదేవతలను బూజించుచుందురు. వారు నిరతిశయమగు కీర్తిగలిగి యుపాసనాత్మకజ్ఞానమునకు విషయుఁడయిన భగవంతునికథలకు విముఖులయి ధర్మార్థకామపరాయణులయి యుందురు.మఱియు నానీచులు హరికథాశ్రవణమునకు సంతసింపక సూకరాదులు పురీషమునకు సంతసించినట్లన్యకథలకు సంతసించుచుందురు.అట్టివారు తప్పక దైవమా

తులని చెప్పవలసియున్నది. ఇఁక వారి కెట్టిగతి ప్రాప్తమగునో యెఱిఁగించెద. వారు ధూమాదిమార్గముచేఁ బిత్రులోకమునకుఁ బోయి మఱలఁ దమపుత్త్రాదులకుఁ బుట్టుచుందురు. అట్లు జనించి శ్మశానాంతమువఱకు గలసంస్కారములను బొంది మఱలఁ బర లోకమునకుఁబోవ ననుభవముచే సుకృతాదులు క్షీణింపఁగా నచ్చటిదేవతలు వారి నచ్చటినుండి క్రిందికిఁ ద్రోసివేయుదురు. అప్పుడు వారు వివశులై మరల నీలోకమును బొందుదురు. ఓజననీ! సకామకర్మలగతి యిట్లుండును. కావున నీవు భగవంతుని జ్ఞానశక్త్యాదులగు గుణములే యాశ్రయముగాఁ గలభక్తిచేఁ బరమాకాశాధిపతియై దేవతలకు నారాధ్యములగు పదపద్మ ములు గలిగియున్న భగవంతునే సమస్తమునకు నమ్మికొని సేవింపుము. ఇట్లు భగవంతుఁడగు వాసుదేవునం దుంచినభక్తి యోగాత్మకజ్ఞానమె వేగముగా వైరాగ్యమును జనింపఁజే యును. ఆజ్ఞానమే బ్రహ్మసాక్షాత్కారము కలిగించునది. భక్తియోగాత్మకజ్ఞాన మెప్పుడు బ్రహ్మసాక్షాత్కారము కలిగించునని యందువేని చెప్పెద వినుము. ఎప్పుడుపాసకు నిచిత్త మనుకూలములును ప్రతికూలములు నగు శబ్దాదివిష యములను బొంది వికారము చెందనిదై ప్రియాప్రియరూప వైషమ్యమును గ్రహింపదో యెప్పుడుచిత్తము శబ్దాదివిషయసంగ మును విడిచి ద్వేష్యములనియు నద్వేష్యములనియు విషమభావ మునుబొందక సమస్తమును బ్రహ్మాత్మకముగానే యనుసంధాన ముచేయుచు, శుభాశ్రయమగుపదము నారోహించునో, యప్పు డు తానశుభచిత్తముచే భగవంతుని సాక్షాత్కరింపఁ జేసికొనుచు న్నాఁడు. ఈ విశ్వమంతయు బ్రహ్మాత్మక మెట్లగునని సందేహిం

పరాదు. పరమాత్మాది శబ్దములచేఁ జెప్పఁబడుచు జ్ఞానమాత్ర మే స్వరూపముగాఁ గలిగి యున్న భగవంతుఁ డొక్కఁడే పృథి వ్యాదిపంచభూతములచేఁ గల్పితములగు దేహములుగల దేవ మనుష్యాదులగాఁ బ్రతీయమానుఁ డగుచున్నాఁడు. కావున సమ స్తవిశ్వము బ్రహ్మాత్మకమే. యోగులు సాంగయుక్తమగు భక్తి యోగముచే నిరతిశయసుఖమును బరమపురుషార్థమగు గుణా ష్టకప్రాప్తిని ప్రకృతిసంబంధాభావమును బొందుదురు. భక్తి యోగమునకు నిష్టప్రాప్తియు ననిష్టనివృత్తియు ఫలములని యెఱుఁగుము. పృథివ్యాదిసంబంధము పరమాత్మకుఁ గలిగిన ట్లె జీవునికిఁగూడఁ గలదు. కాని యందొక్కవిశేషముకలదు. సత్త్వా దిగుణరహితుఁడును జ్ఞానస్వరూపుఁడునగు జీవుఁడు పరప్రకాశక ములగు నింద్రియములచే శబ్దాదిధర్మములుగల పంచభూతము లచే నారబ్ధమగు దేవాదిరూపములచేతను భ్రాంతిగలవాఁ డగు చున్నాఁడు. పరమాత్మ సర్వజ్ఞుఁడుకాన యతని కట్టిభ్రాంతి లేదు. ఓజననీ! మహత్తత్త్వ మహంకారమయి యది సాత్త్వికాదిభేదము లచేఁ ద్రివిధంబయి యదియే భూతరూపమున నైదువిధములయి, యదియే యింద్రియరూపమున నేకాదశవిధంబు లయ్యె. తాద్దృశతత్త్వాత్మకమగు నీయండమును బ్రహ్మయు నెవనివల ననుండి యుత్పన్నతఁజెందిరో యాతనికి సమస్తప్రపంచమును శరీరమయి యుండుట పరమార్థము. ఈవిశ్వమంతయు భగవదా త్మకమగుటను విరక్తుఁడును నిస్సంగుఁడును దృఢచిత్తుఁడునగు యోగి శ్రద్ధాభక్తులచేతను, వైరాగ్యముచేతను లెస్సగాఁ దెలిసి కొనును. ఓజననీ! దేనిచేఁ బ్రకృతిపురుషేశ్వరులతత్త్వము తె లియఁబడునో బ్రహ్మదర్శనోపాయమయిన యాజ్ఞానము నుపదే

శించితిని. అట్లు భగవదుపాసనరూపమగు జ్ఞానయోగమును పరాత్వాదిగుణ రహితమై మద్విషయమై యున్న భక్తియోగమును, జెప్పితిని. ఈరెండింటికిని భగవచ్ఛబ్దవాచ్యుఁడగు పరమపురుషుఁడే ప్రయోజనమనియుం జెప్పితిని. ఓయీ! జ్ఞానభక్తియోగములకు భగవంతుఁడొక్కఁడే స్రాష్టుఁడనుట యెట్లని శంకింపరాదు. క్షీరాదిపదార్థ మొక్కటియైనను జక్షురింద్రియమునకు శ్వేతాదిగుణములచేతను రసనేంద్రియమునకు మాధుర్యాదిగుణములచేతను, ఘ్రాణేంద్రియమునకు సౌరభ్యాదిగుణములచేతను, విషయమగుచున్నట్లు భగవంతుఁడొక్కఁడే యాగమార్గభేదములచే నారాధ్యుఁడయి స్రష్టుఁడగుచున్నాఁడు. మఱియుఁ బాంచరాత్రమందుఁ జెప్పఁబడిన పూజాకలాపములచేతను, వేదపూర్వభాగమునఁ బ్రతిపాదితములగు యాగములచేతను, దానములచేతను, దపంబులచేతను, వేదాధ్యయనంబుచేతను, వేదార్థము నవనుర్ఝించుటచేతను, శమదమములచేతను, కర్మములను నిష్కామముగా నాచరించుటలచేతను, సాంగయుక్తమగు భక్తియోగముచేతను, ప్రకృతికంటె విలక్షణమగు నాత్మతత్త్వమును దెలుపు జ్ఞానయోగముచేతను, *సకామనిష్కామములేలక్షణముగాఁ గలుగు ధర్మములచేతను, నాత్మతత్త్వముచేతను, దృఢమగు వైరాగ్యము

---

* ఓయీ! సకామధర్మములచేఁ బొందఁబడునవి స్వర్గాదిలోకములుకాని భగవంతుఁడుకాఁడె యని సంశయపడ నవసరములేదు. శ్లో॥ "ఆసంహినర్వయ జ్ఞానాం భోక్తాచప్రభురేవచ। యోయోయాంయాం తనుంభక్త శ్శ్రద్ధయార్చి తుమిచ్ఛతి। తస్యతస్యాచలాంశ్రద్ధాం తామేవవిధధామ్యహం। సతయాశ్రద్ధ యాయుక్తస్తస్యారాధనమీహతే। లభతేచ తతశ్కామా న్మయైవవిహితాన్ హితాన్। అంతవత్తుఫలంతేషాం తద్భవత్యల్పమేధసామ్" అని చెప్పఁబడి యున్నది కాన యాగదులచే నింద్రాదుల నారాధించినను నింద్రాది

చేతను, నీమొదలగు క్రియలచేత మంగళగుణుఁడును హేయగు ణరహితుఁడును స్వప్రకాశుఁడును నగు భగవంతుఁడొక్కఁడే పొం దఁబడుచున్నాఁడు. ఓ జననీ! తామసమనియు, రాజసమనియు, సా త్వికమనియు, నైర్గుణ్యరూపమనియుఁ బరఁగు చతుర్విధభ క్తి యోగంబులను నీకుఁ దెలిపితిని. సమస్తజంతువులకు నంతము పొం దించుచు నవ్యక్తగతియై యొప్పు కాలస్వరూపమును జెప్పితిని. జీవాత్మ వేనియందుఁ బ్రవేశించి తనయాథాత్మ్యమును దెలిసికొ నలేఁడో యవిద్యాఖ్య కర్మనిర్మితములగు నా సంసారగతు లాత్మకుఁ గలవు. వానిని నీకుఁ బూర్వమే తెలిపితిని. ఓజననీ ! నీ కుపదేశించిన యీవేదాంతార్థములను నధికారులకేకాని య నధికారుల కుపదేశింపరాదు. అనధికారుల నెఱింగించెదను. వినుము. పరులకు భయము కలిగించువారును, ధూర్తులును, మూర్ఖులును, దురాచారులును, డాంబికులును, విషయాసక్తులును, గృహాస్థాశ్రమాసక్తులును, నాకు భక్తులు కానివారును, నాభక్తులకు శత్రువులయినవారును, నీవేదాంతార్థము నుపదేశముఁ బొంది నర్హులుకారు. శుశ్రూషాభిలాషులును, శమదమాదిసంపన్నులును, సదాచారనిష్ఠులును, సమస్తప్రియవస్తువులలో నన్నే ప్రియతమునిగ భావించువారును, నిర్మత్సరులును, భూతమైత్రిగలవారును నిందుల కధికారులు. ఓజననీ ! ఈవేదాంతార్థమును మహాశ్రద్ధతో వినుపురుషుఁడు పరుల కుపదేశించుపురుషుఁడును మదుపా

రూపముల దాల్చి స్వర్గాదిఫలముల నిచ్చువాఁడు భగవంతుఁడేయని తెలిసికొనవలెను. అందు మతిభ్రమకలదు. యాగాదులచే నింద్రాదిరూపుఁడగు భగవంతుఁడారాధితుఁడయి సాంతమగుఫలము నొసంగును. భక్తి జ్ఞానయోగములచే నారాధితుఁడయి నిరతిశయమోక్షఫలము నొసంగును.

సననిష్ఠుఁడయి ముక్తిని బొందుచున్నారు. ఇది ముప్పదిరెండవ యధ్యాయము.

ఓవిదురా! కపిలాచార్యుండు చేసిన జ్ఞానబోధముచే సమస్త బంధములను ద్రెంచుకొని దేవహూతి ప్రకృతిపురుషేశ్వరజ్ఞానముచేసు ప్రసిద్ధులగు యోగుల కాశ్రయుఁడగు భగవంతునకు నమస్కరించియిట్లు స్తోత్రముచేసెను.'ఓ దేవదేవా! నీనాభికమలమునుండి సమస్తలోకములను సృజింపఁదగినంతశక్తిగలబ్రహ్మయుదయించెను. అట్టులయినను, భూతేంద్రియమనోమయమయి, చిదచిద్రూపమయిన లోకసమూహము జఠరములో ధరించి, సమస్తమునకు బీజరూపమయిన నీస్వరూపమును జూడలేక బ్రహ్మ మనస్సుచే ధ్యానించెను. అట్టి మహనీయుఁడవయిన నిన్నుఁ గొనియాడ నాతరంబగునే? ఓమహాత్మా! మఱియు నీవు నిరీహుఁడవై నిర్వ్యాపారుఁడవయి యున్నను లీలకోసము గుణత్రయము నవలంబించి బ్రహ్మాదిరూపములయం దనుప్రవేశించి సత్యసంకల్పుఁడవయి సంకల్పమాత్రముచేతనే సృష్ట్యాదిలీలలఁ జేయుచున్నావు.సంకల్పమాత్రముచే స్వర్గాదిలీలల నెట్లుచేయఁగలిగెవని సందేహింప నవసరము లేదు.ఓ దేవా? నీవనంతశక్తివి. అట్టి నీకేదికొఱంత? నీశక్తులిట్టివని యెవ్వరునెఱుంగరు. ఓ దేవదేవా? నీవు యుగాంతమునందు నీప్రపంచమునంతను నీయందు లీనము కావించుకొని బాలుండవయి, వటపత్రములపయి శయనించి కాలిబొట్టనవ్రేలిని సర్వదా రుచిచూచుచుఁ జూపఱకు మోహమును గలిగించుచున్నావు.అట్లు పరమపురుషుండవై, సర్వనియంతవై,జగత్కారణుండవై, యొప్పుచున్నను నీవు నాగ

ర్భమందు జన్మించి మమ్మును గృతార్థులను గావించితివి. మాయ
దృష్ట మేమనిచెప్పఁగలను? నాయనా! పాపాత్ముల నశింపఁజేయుట
కును భక్తులరక్షించుటకును నిదివఱకు వరాహాద్యవతారములు
ధరించినట్లు లోకమున కాత్మతత్త్వము బోధింప నాగర్భమునజన్మిం
చితివి. మఱియు నీ వీయవతారమెత్తుటవలన సమస్తపాపములు న
శించినవి. తత్త్వశాస్త్రము లోకమందు స్థిరమయినది. ఓభగవం
తా? నీ నామము భజించినను, నీసత్కథలను విన్నను, నీస్వరూప
మునుధ్యానించినను, శ్వపచాదినీచులకుఁగూడ ముక్తికలుగుచున్న
ప్పుడు నిన్నుఁదనయొనిగాఁబడసి నీస్వరూపమును గన్నులారఁ గాం
చినమాకు నీయనుగ్రహమువలన ముక్తిగలుగునని వేఱెచెప్పవల
యునా? మఱియు మరణకాలమందు నీనామమును స్మరించిన
చో వాఁడు శ్వపచుఁడయినను గొప్పవాఁడేచుమీ? మఱియుఁ
దపంబులయినను జేసియుండుటయు యాగాదులయినను జేసి
యుండుటయుఁ బుణ్యక్షేత్రములయందుఁ దిరుగుచుండుట
యు వేదాంగములతోఁగూడ వేదములనైన నధ్యయనముచేసి
యుండుటయు లేక భగవంతుని మిక్కిలి భక్తితో నారాధిం
చుటయు వీని నన్నింటిని మహాత్ములొనర్చుట యంత్యకాలమున
నీ నామస్మరణ లభించు నిమిత్తమేకదా? కావున నీనామ ప్ర
భావమును వర్ణింప మాతరముకాదు. మఱియు నీవు సమస్తజీవుల
కు నంతరాత్మవై వెలయుచున్నావు. నీవు పరమపురుషుండవు. సమ
స్తయోగిబృందములచేతను వందనీయుండవు. నీవు సమస్తమున
కధిపతివయిన నారాయణుఁడవు. మఱియు వేదగర్భుఁడవు. అట్టి
నీపాదపద్మములకు సంతతము వందనము లాచరించుచున్నానని
నుతింపఁగా నామె స్తుతివాక్యముల నాలకించి మిగుల సంతసించి

కపిలుండు గంభీర వాక్యములతోఁ దల్లికిట్లనియె. "ఓతల్లీ ! నా చెప్పిన సులభమయిన భక్తిమార్గము ననుసరింపుము. నీ వట్లు చేసితివేని యవలీల ముక్తిని బొందఁగలవు. ఇందులకు సంశయ ములేదు. ఇది నామతము. ఇది పెక్కండ్రగు బ్రహ్మవాదుల చే ననుష్ఠింపఁబడియున్నది. ఈమార్గము నవలంబించినవారికి సంసారభయములేదు. మృత్యువులేదు. మోక్షము కరతలామ లకమువంటిదని తెలిసికొనుము. దానివిషయమయి నీవు జాగ రూకురాలవు కమ్ము" అని కపిలుఁ డిట్లు జ్ఞానమార్గము నుపదే శించి బ్రహ్మవాదిని యగునామె యనుమతిని బడసి యభీష్టము గాఁ బోయెను. అంత దేవహూతి తనకుమారుం డుపదేశించిన తత్త్వమార్గమును జోఁగొని సరస్వతీనది కలంకారభూతమయిన తన యాశ్రమమునందు సమాహితచిత్తయై కుటిలమయిన కేశపా శమును జటలుగా బంధించి నల్కలములను ధరించి భయంకరం బులగు తపంబులచేఁ గృశించినశరీరముతో వర్తింపఁదొడఁగెను. మఱియు నాదేవహూతి విరక్తి చెంది తనభర్తచే తపోయోగంబుల సంపాదింపఁబడి దేవతలకు సైతము కోరఁదగియున్న గృహస్థాశ్ర మవస్తువుల నన్నింటి విడిచె. ఇదియునుగాక మందిరములను మురుఁగువలెఁ దెల్లని శయ్యాసమూహమును, పరిశుభ్రములై సువర్ణమయములై వెలయు నాసనములను, బరికరములను మహా కనకమయములయి సుఖస్పర్శముగల యాస్తరణములను, నలం కారార్థముగ మరకతాది మాణిక్యములుగల స్ఫటికమయకు డ్యములచేతను లలనారత్నములచేతను బ్రకాశించు గోడలుగల మేడలను, కుసుమితములగు మంచారాదిసురవృక్షములచే రమ్య మయి మధురధ్వనులను జేయువిహంగమద్వంద్వములచే నిండి,

గానముచేయు మత్తమధుకరములచేఁ బొలుపారి, దేనిని ప్రవే శించినతన్నును గిన్నరాదులు గానముచేసిరో యట్టియుద్యాన వనమును, దేనియందుఁగర్దముండు తన్నుఁబలాలనసేసెనో యుత్ప లగంధిని యునఁబడు నాదిగుడుబావిని, దేవతాస్త్రీల కభీష్టతమము లయిన యాసమస్తవస్తువులను విడిచి పుత్రవియోగమును సహిం పలేనిదయి వెలవెలపోవు వదనముతోనుండెను. మఱియు భర్త యగు కర్దముఁడు సన్యసించి వనమునకుఁ బోవుటచేతను, బుత్రుఁ డు తన్ను విడిచిపోవుటచేతను దాను దత్త్వజ్ఞానసంపన్నురాలయి నను బతిపుత్రవియోగము సహింపలేక వత్సలయగుగోవు గతిం చిన వత్సనిమిత్తము నగచినట్లు కుమారునిఁగూర్చి మిగుల దుఃఖిం చెను. తరువాత నామెపుత్రుఁడగు కపిలుని సంతతమును ధ్యా నించుచు నిస్పృహురాలయి గృహమందుఁ గొంతకాలముండెను. పిదప దేవహూతి దనకుమారుఁడగు కపిలుచేఁ జెప్పఁబడి ధ్యాన యోగ్యమయి ప్రసన్నములగు వదనాద్యనయవములుగల భగ వంతుని సమస్తావయవములను బ్రత్యేకముగాఁ దలంచుటచేత ను, బ్రహ్మప్రాప్తికి హేతువై జ్ఞానయోగకర్మయోగంబులచే తను వైరాగ్యముచేతను ననుగృహీతమగు భక్తియోగముచేత ను, నిర్మలనుగు మనంబుచేతను, సర్వజ్ఞుఁడును, నశేనాదులగు షడూర్మ్ములు లేనివాఁడును నగు పరమపురుషుని ధ్యానముచేయు చు, జీవాత్మల కాధారభూతుఁడగు పరబ్రహ్మమునందు మనం బును నిశ్చలముగా నిలిపి ప్రకృతిసంబంధమును విడిచినదగుటచే శీతోష్ణాదిక్లేశాదుల నెడఁబాసి పరమాత్మానుభవరూపమగు నా నంద మనుభవించుచుఁ బ్రతిదినమును బ్రకృతివిలక్షణుఁడగు ప్ర త్యగాత్మశరీరుఁడయిన పరమాత్మయందుఁ జిత్తమును నిలిపినదగు

టచేఁ బ్రకృతిగుణకార్యములగు దేహాత్మాభిమానాదిభ్రమలను దొలంగించుకొని నిద్రనుండి లేచినపురుషుఁడు కలలో గాంచిన పదార్థములను స్మరింపనివిధమున దనదేహమును స్మరింపదాయె. ఇట్లామె శరీరము పోషణాదులు లేకపోయినను మనఃపీడాదులు లేకపోవుటచేఁ గృశింపక, యభ్యంజనాదులు లేకపోవుటంబట్టి మలయుక్తమయ్యును, నధూమమగు నగ్నిహోత్రమువలెఁ బ్రకాశించెను. ఆమె భగవదనుభవజనితమగు నానందసముద్రంబునఁ దొప్పదోఁగినదగుటచేఁ దపోయోగప్రచురమై జీరాడుకేశపాశముగలిగి దైవరక్షితమయిన తనదేహము దిగంబరమయి నను దెలిసికొనలేకపోయెను. ఓవిదురా! ఇట్లు దేవహూతి కపిలోక్తమార్గము ననుసరించి నిరతిశయానందరూపుఁడగు భగవంతునిఁ బొందెను. ఓయీ! ఆదేవహూతి సిద్ధిచెందిన పుణ్యక్షేత్రము ముల్లోకములందును బ్రఖ్యాతిగాంచెను. మఱియు నది నామముచే సిద్ధాశ్రమమని ప్రసిద్ధిచెందెను. ఆమె మానవదేహము యోగాదులచే మానవధర్మములను విడిచినదయి సిద్ధాదులచే సేవింపఁబడుచు సకలసిద్ధుల నొసంగుచున్న నదీశ్రేష్ఠయయ్యెను. కపిలమహాముని యుఁ దల్లి నట్లాజ్ఞాపించి యామె యనుమతిఁ జెంది యాళొనదిక్కును గూర్చిపోయెను. అట్లుపోయి సిద్ధులచేతను, గంధర్వులచేతను, జారణులచేతను, మునులచేతను, నచ్ఛరలచేతను నుతింపఁబడుచు సముద్రుఁ డిచ్చినస్థలమును నివాసస్థానముగాఁ జేసికొనియె. మఱియు నతఁడు సాంఖ్యప్రవర్తకులగు యోగులచే నన్నుతుఁడయి ముల్లోకములనేమమునిమిత్తము స్వయముగా యోగమవలంబించియుండెను. "ఓపాపరహితా! విదురా! నీవడిగిన కపిల దేవహూతుల సంవాదరూపమగు పావన

కథను వినిపించితిని. ఓమహాత్మా ! కపిలుసిచే నిగదితమయి రహస్యతమమయి యున్నయాత్మయోగము వినినవాఁడును, చెప్పినవాఁడును భక్తియోగ మలవరించుకొని భగవంతునియందు మనంబును నిలిపి యతని పాదమూలమును జేరుచున్నాఁడని మైత్రేయుండు విదురునకుఁ జెప్పెనని శుకుండు రాజున కెఱింగించెనని సూతుఁడు శౌనకాదులకు దెలియఁజెప్పె. ఇది ముప్పదిమూఁడవ యధ్యాయము.

తృతీయస్కంధము సమాప్తము.

శ్రీకృష్ణార్పణమస్తు.



శుభమస్తు.

శ్రీమదాంధ్రవచనభాగవతము.

చతుర్థస్కంధము.

మైత్రేయుండు విదురుంజూచి యిట్లనియె. "ఓవిదురా! మనువునకు శతరూపయందు మువ్వురుపుత్త్రికలు జన్మించిరి. వారు క్రమముగ నాకూతియనియు, దేవహూతియనియుఁ, బ్రసూతియనియుఁ బ్రసిద్ధికెక్కిరి. అంత స్వాయంభువమనువు శతరూపయనుమతినిఁ బడసి తాను బుత్త్రివంతుఁడయ్యును జెక్కుపుత్త్రిలు గావలయు ననుతలంపునఁ *బుత్త్రికాధర్మము నాశ్రయించి యాకూతినిరుచికిచ్చి వివాహముచేసెను. అంత రుచి బ్రాహ్మణధర్మముల నాచరించుటవలనఁ గలిగినతేజోవిశేషముచే నొప్పుచు భార్యాసమేతుఁడై గురుతరమగు సమాధిచే నారాయణు

---

* పుత్త్రికాధర్మమనఁగా-శ్లో॥అభ్రాతృకాం ప్రదాస్యామి తుభ్యం కన్యామలంకృతామ్।అస్యాంయోజాయతే పుత్త్ర స్సమేపుత్త్రోభవిష్యతి'' అనఁగా ఓయీ! నాకుఁ బుత్రసంతానములేదు. ఈపుత్త్రికను నీకిచ్చుచున్నాను ఈమెకుఁ బుత్త్రుఁడు జనించినచో నే నాతనిఁబుత్త్రునిగా స్వీకరింతును. అని వాఁడు బంధనపూర్వకముగాఁ జేసిన కన్యాదానము పుత్త్రికాధర్మమనఁబడును. ఇటమనువు తనకుఁ బుత్త్రులున్నను బహుపుత్త్రిలు కావలయునని కోరినాఁడు కాన పుత్త్రికాధర్మమవలంబించినను దోషములేదు.

నారాధించి తదనుగ్రహంబుచెంది, యజ్ఞస్వరూపుఁడగు నతని యజ్ఞుఁడను కుమారునిగాను,విష్ణువు నెల్లప్పుడును విడువకవర్తించు చున్నలక్ష్మిని దక్షిణ నాఁబడుకుమారినిగాను బొందెను. అంత స్వాయంభువుండు సంతోషయుక్తుండయి వచ్చి నారాయణాంశ సంభూతుఁడయి కావుననే విస్తారమగు తేజస్సుగల పౌత్రునిఁ గ్రతువును, దనయింటికిఁ గొనిపోయెను. రుచిముని దక్షిణను పుత్రునివలెఁ జూచి పాలించుచుండెను. వివాహార్హయై వతిని గోరుచున్న దక్షిణను గ్రతువు పెండ్లియాడెను. పిమ్మటఁ దనయందుఁ బ్రీతిగలయామెయందుఁ దానును ప్రీతిగలవాఁడయి పన్నిద్దఱు పుత్రులను బుట్టించెను. వారు తోషుండనియుఁ, బ్రతోషుండనియు, సంతోషుఁడనియు, భద్రుండనియు, శాంతియనియు, నిడస్పతియనియు, నిధ్రుఁడనియు, గవియనియు, విభువనియు, ఎహ్నియనియు, నుదేవ్రుఁడనియు, రోచనుఁడనియుఁ బిలువఁబడుదురు. పరస్పరము ప్రేమగల తలిదండ్రులవలనఁ గల్గినవారుగాన తుషితులనం బరఁగిరి. మఱియుఁ దుషితు లనుదేవతలును, మరీచ్యాది మహాములునులును, నారాయణాంశసంభూతుండగు యజ్ఞుండును, మహాబలులై మనుపుత్త్రిలగు ప్రియవ్రతోత్తానపాదులును, వారివారి సంతతివారును లోకధర్మములు సెడకుండ స్వాయంభువమన్వంతరకాలమును బరిపాలించిరి. మఱియు దేవహూతిని గర్దమునకిచ్చుటయు, వారల సంతానాభివృద్ధియు, భగవంతుండు గపిలుండై యుదయించుటయు వినిపించియున్నాను. కాన నది నీకు శ్రుతప్రాయమే. పిమ్మట స్వాయంభువమనువు తన మూఁడవపుత్త్రికయగు ప్రసూతిని బ్రహ్మపుత్త్రుఁడయిన దక్ష ప్రజాపతికి నొసంగె. ఆ ప్రసూతిదక్ష ప్రజాపతుల సంతతిచే

మూఁడులోకంబులు నిండినవి.మఱియుఁ గర్దమప్రజాపతి పుత్త్రికలను మరీచ్యాది బ్రహ్మర్షులు వెండ్లియాడిరని చెప్పియున్నాను. ముందుగాఁ వారల సంతానక్రమమును జెప్పెద నాలింపుము. కర్దమపుత్త్రికలలోఁ గల యనుకన్యామణిని మరీచి వరించె. ఆమరీచికిఁ గళయందుఁ గశ్యపుఁడను కుమారుఁడును బూర్ణముఁడను కుమారుఁడును బుట్టిరి. వారివలనఁ బుట్టినప్రజాపరంపర

కర్దమప్రజాపతిసంతతిని దెలుపుట.

చే భువనమంతయుఁ బూర్ణమాయె. అందుఁ బూర్ణముఁడు భువనవ్యాపకుండగు విరజుఁ డనుకుమారునిఁ గనియెను. మఱియు దేవకుల్య యనుకుమారికను గాంచెను. ఆదేవకుల్య పూర్వజన్మమందు హరిపాదసంభూతయై పరమపూతయై ముల్లోకములందు వ్యాపృతయై యొప్పఁ గంగానదియై. మఱియుఁ గర్దమపుత్త్రికలలో రెండవదాని నత్రిమహాముని వరించెనని చెప్పితిని. ఆయత్రిమహామునికి ననసూయయందు దత్తాత్రేయుఁడు,దుర్వాసుఁడు, చంద్రుఁడు ననుమువ్వురుపుత్త్రులుపుట్టిరి. అందు * నారా

---

* ఇందులకు మూలము. "ఆత్మేశబ్రహ్మసంభవాఁ" అనియున్నది. అనఁగా హరిహరబ్రహ్మలయొక్క యభివ్యక్తికలవారి ననియర్థము. ఇట "ఆత్మశబ్దముచే "తవాన్తరాత్మామచ" ఇత్యాదికమగు శ్రుతులచే విష్ణువునకుఁ బరమాత్మత్వమును, శివబ్రహ్మలకు జీవత్వమును బ్రసిద్ధమయియున్నట్లు సూచింపఁబడుచున్నది. ఓయీ! సర్వాంతర్యామియగు పరమాత్మ జీవునిమూలముగాఁ దనజ్ఞానశక్త్యాదిగుణములలో నొకదాని వెల్లడించి యంశావతార మందుట యుచితముగానుండునుగాని పరమాత్మ కంశభూతులై యణుస్వరూపులై జీవవిశేషులయిన బ్రహ్మరుద్రులు మఱియొకజీవునియం దనుప్రవేశమనెడి యంశావతారము నొందుటయెట్లు? అనియందువేని చెప్పెదవినుము. శ్లో॥ "అవిద్యాకర్మసంజ్ఞా

యంశాంశమువలన దత్తాత్రేయుండును, రుద్రాంశమువలన దుర్వాసుండును, బ్రహ్మాంశమువలన సోముండును దయించిరి". అని నుడువుచున్న మైత్రేయుంగాంచి విదురుం డిట్లనియె. "ఓమహానీయా? సృష్టిస్థితిలయముల కాధారులయి వెలయుచున్న బ్రహ్మవిష్ణుమహేశ్వరు లేమికారణమున నత్రిమహాముని గృహమునఁ బుట్టినారు? వా రేమేమి కార్యములఁ జేయనెంచి యట్లు లుబ్ధవించినారు? ఆయువంతమంతయుఁ దెలియఁ జేయుము" అని యడిగిన విదురునకు మైత్రేయుం డిట్లనియె. "ఓవిదురా? నీ ప్రశ్నమునకు త్తరము నిచ్చుచున్నాను. ఆలింపుము. బ్రహ్మ యత్రిని గాంచి తపశ్చరించి సంతానమునుగాంచు మనవ్యుఁడు, నతం డట్లయని యతనియనుమతి వడసి భార్యాసమేతుండై ఋక్షు మనుపేరు గల కులపర్వతమునకుఁ బోయెను. నిర్వింధ్యానదీజలము లంతటను ధ్వనిగావించుచున్న యాకాననమందు నొకయూర్ధ్వశ్రమమును గల్పించుకొని జటావల్కలంబులు ధరించి, యేకపాదంబున

న్యా తృతీయాశక్తిరిష్యతే । యయా క్షేత్రజ్ఞశక్తిస్సా వేష్టితా నృపసర్వదా। సంసారతాపా నఖిలా నవాప్నో త్యతిసంతతాన్ । కామాదిరోహితత్వాచ్చ శక్తిః క్షేత్రజ్ఞ సంజ్ఞితా। సర్వభూతేషు భూపాల తారతమ్యేనవ. ర్తతే"ఇత్యాదికముచేఁ జెప్పఁబడినట్లు జీవునికి ధర్మభూతజ్ఞాన మవిద్యచేఁ దిరోహితమయి మిగులవ్యాసముగలదై వర్తించును. అప్పుడు పరమాత్మప్రసాదమునఁబలన నవిద్యారూపమగు నావరణము తొలఁగినతోడనే ధర్మభూతజ్ఞానము సంకోచములేకుండఁ బ్రసరించును. కావునఁ బ్రస్తుతమున బ్రహ్మరుద్రులు జీవులయినను బరమపురుషానుగ్రహమును సంపాదించుకొని యజ్ఞానమును నివర్తించుకొన్నవారగుటచే మనకంటె నధికమగు జ్ఞానప్రసారముకలవారు. అందుచే వారు ధర్మభూతజ్ఞానముచే దుర్వాసునియందును, జంద్రునియందును ననుప్రవేశించుటకుఁ దగియుండుటచేబ్రహ్మరుద్రులంశావతారమునొందుట యుపపన్నమగుచున్నది

నిలిచి వాయుమాత్ర భక్షకుండై, భగవంతుండు తనకుఁ గు మారుండయి పొడముఁగాక యనిరోరుచు, ఘోరాతిఘోరంబై సాటిలేనితపం బాచరింపం దొడంగె. ఇట్లు శతదివ్యవత్సరముల కాలము చనునప్పటికి నాయత్రిమహాముని మూర్ధమునుండి తపోవహ్ని బయలువెడలి యూర్ధ్వలోకముల దహింప సమకట్టె. అంత త్రిమూర్తులుగాంచి తా నిఁక నుపేక్షించిన లోకములు దగ్ధములగుట నిక్కంబని తలంచి, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు మొదలగు సమస్తబృందారకబృందంబులు తమ

{ అత్రిమహాముని కి బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ప్రత్యక్షమగుట. }

కీర్తుల నుతించుచుండ నత్రిమునియాశ్రమంబున కరుదెంచిరి. అంత నత్రిముని తనయాశ్రమంబునకు వచ్చి హంససుపర్ణవృషభంబులపై వధిరోహించి తమతమచిహ్నముల ధరించి, సమస్త గీర్వాణులచే నుతింపఁబడుచునున్న బ్రహ్మవిష్ణుమహేశ్వరులం బొడగాంచి సమస్తప్రపంచమునకుఁ గారణభూతులయి మందహాసములచేతను, గరుణావలోకనములచేతను, సుందరవదనారవిందములు గలిగియున్న యా దేవోత్తముల పాదమూలంబులకు నమస్కారంబు గావించి చేతులుజోడించి దుస్సహమయిన త్రిమూర్తుల తేజంబు చూడఁజాలక ముకుళితనేత్రుండై, తదీయ పాదకమలంబుల మనంబున సంస్మరించుచు, మృదుమధురవాక్కుల తోనిట్లు నుతింపఁగడంగె. "ఓ మహనీయులారా! మీరు లోకమును సృజింప భరింప హరింపఁ దలంపుచే మాయాగుణములయిన రజస్సత్త్వతమోగుణంబుల నాశ్రయించి బ్రహ్మయనియు, వానుదేవుఁడనియు, శివుఁడనియు వేర్వేఱ పిలువఁబడుచున్నారు.

అట్టి మహామహు లయినమీపాదకమలముల కభివందనము లాచరించుచున్నాను. మీరుమువ్వురు దుస్సహతేజస్సులతో వఱలుచున్నారు. మీ ముగ్గురియందు నాచే బిలువఁబడిన మహానీయుఁ డెవ్వఁడు? మీరేచెప్పుడు. మఱియు నే నందఱిలో నుత్కృష్టుఁడగు భగవంతుఁడు నాకుఁ బుత్రుఁడుకావలె ననియెంచి మనంబునఁదలంచి యొక్కరినేపిలువఁగా మీరు మువ్వురు నేతెంచినారు. మానవుల మనస్సునకుఁగూడ దూరమగు మీరిప్పుడిచ్చటి కేలవచ్చితిరి. అట్లు వచ్చుటకుఁ గారణమేమి?" అని భక్తివినమితగాత్రుఁడై యడుగుచున్న మునిపుంగవుం జూచి దేవతలిట్లనిరి. "ఓ మునీంద్రా! నీసంకల్పమెట్లో యట్లేయగుఁగాక;నీవు సత్యసంకల్పుఁడవు. నీవే జగదీశ్వరతత్వమును ధ్యానము చేసితి వ్రో యాతత్వము మేమే. మేము మువ్వురమే.అయినను జక్కఁ నాలోచింప మేము మువ్వురము నేకమైయుందుము. అందువల న నీ వ్రొక్కని భిలిచినను మువ్వుర మరుదెంచినారము. నీమాన సమునందలికోర్కి మా కవగతమయినది. మాయంశంబులచే నీకు ముగ్గురుపుత్త్రులు పుట్టఁగలరు. వారు మువ్వురు లోకముల లో మిగులఁ బ్రఖ్యాతిని వహించి తమతమకీర్తులను సుగుణముల ను వెలువరింపఁగలరు. ఇందుల కెంతమాత్రము సందియము లేదు" అని యత్రిముని యభీష్టము నెఱవేర్చి యాము నిదంపతులచేఁ బూజితులై తమతమ నివాసంబుల కరిగిరి. అత్రియు, ననసూయయు దేవత లేఁగినపిమ్మట మిగుల నానందభరితులై యున్న యవసరంబున బ్రహ్మాంశమువలనఁ జంద్రుండును నారాయణాంశమువలన దత్తాత్రేయుండును, శంకరాంశమువలన దుర్వాసుండు నుదయించిరి. మఱియు నంగిరసునకు

శ్రద్ధయను కన్యక నొసంగెనని చెప్పియుంటిని. ఆమునిచంద్రు నకు శ్రద్ధయందు సినీవాలి, కుహువు, రాక, యనుమతి యనునల్వురు కుమారిక లుదయమందిరి. మఱియు నంగిరసునకు బృహస్పతియు నుచథ్యుండు నను నిర్వురుపుత్త్రులు గలిగిరి. వా రిరువురు స్వారోచిషమన్వంతరమునఁ బ్రఖ్యాతిఁ గాంచిరి. పుల స్త్యుఁడు కర్దముని నాల్గనకుమారికయగు హవిర్భుక్కును బెండ్లి యాడి యామెయందు, నగస్త్యమునీంద్రుని, విశ్రవసుని గని యె. ఆవిశ్రవసునకు నిలబిల యను కన్యకయందుఁ గుబేరుం డు దయించి యత్యధిపతియయ్యెను. మఱియు విశ్రవసునికి రెండవ భార్యయగు కేకసియందు రావణ కుంభకర్ణ విభీషణు లుదయిం చిరి. మఱియుఁ బులహుండు గర్దమునిని యైదవకూఁతురగుగతి యను సుందరియందుఁ, గర్మశ్రేష్ఠుండు వరీయాంసుండు, సహి ష్ణుండు ననుమువ్వురుపుత్త్రి లుదయించిరి. క్రతువను ప్రజాప తి కర్దముని యాఱవకూఁతురగు క్రియ యను కన్యకయందు బ్ర హ్మతేజస్కులై యొప్పుచున్న వాలఖిల్యాదిమహామునుల నఱు వదివేవురం గాంచెను. మఱియు వసిష్ఠుండు కర్దమునినవమపు త్రికయగు నరుంధతిని వరించి యామెయందుఁ, జిత్రకేతుండు, సుకోచి, విరజుండు, మిత్రుండు, నుల్బణుండు, వసుభృద్యానుం డు, ద్యుమంతుఁడు ననునేఁగురుపుత్త్రులం గనెను. మఱియు నతనికి రెండవభార్యయందు శక్తిముఖపుత్త్రి లుదయించిరి.మఱి యు నధర్వుండు కర్దమునియట్లనుపుత్త్రియగు శాంతిను వరించి యామెయందు, ధృతవ్రతుఁడు, దధ్యంచుఁడు, నశ్వశిరుఁడు ననుమువ్వురుపుత్త్రిలఁగాంచె.మహాత్ముఁడగు భృగువునకు ఖ్యాతి యనుపత్నియందు ధాతయు విధాతయు ననునిర్వురుతనయులుగలి

గిరి. మఱియు భగవత్పదపరాయణయగు శ్రీ యనుకన్యక యు ద్భవించెను. అధాతృవిధాతృలు మేరువను ముసీంద్రుని కుమా రికలగు నాయతిని నియతిని బెండ్లియాడి, వారియందుఁ గ్రమ ముగా మృకండుఁడు,ప్రాణుఁడు నను తనయులను బడసిరి. అందు మృకండునకు మార్కండేయుఁడు. ప్రాణునకు వేదశిరుఁడు ననుపుత్త్రులు పుట్టిరి. ఆవేదశిరునకు శుక్రుఁ డుదయించె. ఇట్లు కర్ద మకుమారికలయందుఁ బుట్టిన సంతానపరంపరచే లోకంబెల్లయుఁ బరిపూర్ణంబయ్యె. ఓవిదురా ? ఈ కర్దమసంతతి ప్రకారంబు విన్నవాఁడు సమస్త పాపవిముక్తుఁ డగు. ఇంక దక్షుని వంశానుక్రమమును దెలిపెద నాలింపుము. ఓవిదు

దక్షప్రజాపతిసంతతిని దెలుపుట.

రా ! మనుపుత్త్రికయయిన ప్రసూతిని దక్షుఁడు భార్యగా వరిం చియున్నాఁడని చెప్పియుంటిని. ఆదక్షప్రజాపతికిఁ బ్రసూతి యందుఁ బదాఱుగురుతనయలు గలిగిరి. ఇట్లుదయించిన కన్య కలలో శ్రద్ధయు, మైత్రియు,దయయు, శాంతియుఁ, దుష్టియుఁ, బుష్టియు, క్రియయు, నున్నతియు, బుద్ధియు, మేధయుఁ, దితిహ్రీ యు, హ్రీయు, మూర్తియు ననునా ంబులుగల పదుమువ్వు రు కన్యకలను, ధర్మున కొసంగెను. మఱియు దక్షుండు, మఱియొ కకన్యక నగ్నికర్పించెను. మఱియొకకన్యకను బిత్రులకును, గడ పటికూఁతును సంసారనివర్తకుండగు నీశ్వరునకు నర్పించె. పిమ్మట యాధర్మునకు, శ్రద్ధనలన శ్రుతమును, మైత్రివలనఁ బ్రసాదం బును, దయవలన భయంబును, శాంతివలన సుఖంబును, దుష్టి వలన ముదంబును, బుష్టివలన స్మయంబును, క్రియవలన యో గంబును, నున్నతివలన దర్పంబును, బుద్ధివలన నర్థంబు, మేధ

తలన స్మృతియుఁ, దితిసుతులన ద్వేషంబును, హ్రీవలనఁ బ్రళయంబు గలిగెను. ఇందుఁజెప్పఁబడిన శ్రుతప్రసాదాదులు తత్తదభిమానిదేవతలని యెఱుంగునది. మఱియు ధర్మునకుఁ బదుమూఢభార్యయగు మూర్తివలన నరనారాయణులను నిర్వురుపుత్త్రులుపుట్టిరి. వారలిరువురు నుదయించుకాలమందు ననుకూలమయిన మందమారుతము ప్రసరించెను. దిశాముఖములన్నియు నిర్మలములాయెను. సమస్తలోకములు నానందముతోఁ వర్తిల్లె. నదులును సముద్రములును ప్రసన్నములై ప్రకాశించెను. దేవదుందుభులు మ్రోసెను. గంధర్వులు గానముచేసిరి. అసంఖ్యాకులగునచ్ఛరలు నాట్యములు సలిపిరి. సమస్తబృందారకులును గగనమందుండి పుష్పవర్షము లమితముగా గురియించిరి. మునీంద్రులందఱు నధికానందంబుచెంది నుతులొనర్చిరి. వారలుదయించినదిన

బ్రహ్మాదులు నరనారాయణుల నుతించుట.

ము పరమమంగళమయి వెలసెను. ఆసమయంబున బ్రహ్మాదిదేవతలమ్మహాత్ములకడ కరుదెంచి యిట్లునుతించిరి. "ఓమహాత్ములారా? మీరు నారాయణాంశసంభూతులరు. మిమ్ము రెండురూపములలోఁ వర్తిల్లెడు భగవంతుఁడని యెఱుంగుదుము. అట్టి యోభగవంతా! ఆకాశమునందు నలుపు, తెలుపు మొదలగు రంగుభేదములున్నట్లు నీయాత్మయందు మాయచే దేవమనుష్యాదిభేదములుగల యీ విశ్వమంతయుఁ జేయఁబడియె. ఇట్లు మాయచే రచింపఁబడిన ప్రపంచస్వరూపమును, దేవాదివిలక్షణమయిన బ్రహ్మస్వరూపమును జీవాత్మస్వరూపమును దెలియఁజేయుటకై నీవు ధర్మునియింటఁ బుట్టితివి. అట్టి పరమపురుషుఁడవయిన నీపాదపద్మములకభినందనము నలుపుచున్నాము.

మఱియు నోదేవా! నీసంకల్పంబువలననే లోకమునకు బంధ మోక్షములు కలుగుచున్నవి. నీవు జ్ఞానైకవేద్యుఁడవు. వివిధ విచిత్రశక్తిమంతుండవు. ప్రపంచకముయొక్క *సృష్టిస్థితిలయము లుప్రవర్తించునిమిత్తము సృష్టింపఁబడిన మమ్మును గరుణారిస పూరితములు, నగవిందసదృశములునగు విలోకనములచేఁ గనుఁ గొనుము' అని యిట్లు దేవతాబృందములచే నుతింపఁబడుచు నరనారాయణులు గంధమాదనపర్వతముం గూర్చిపోయిరి. ఓ విదురా! ఆనరనారాయణమునులే భూభారమును వారింపఁగోరి ద్వాపరమునందుఁ గృష్ణార్జునులై యవతరించిరి. మఱియు దక్షుం డు తనకుమారికయగు స్వాహాదేవిని బావకునకిచ్చి పెండ్లిచేసె నని చెప్పితిని.ఆయగ్ని యీ స్వాహాదేవియందు హుతభోజనుల యినవారును, బావకుండును, బవమానుండును, శుచియు ననునామంబులు గలవారునగు మువ్వురుపుత్త్రులం బడసెను. వార లే త్రేతాగ్న్యభిమానిదేవతలని పిలువఁబడుదురు. వారివలన నలువదియైదువిధంబులుగల యగ్ని లుత్పన్నంబులయ్యె. అవి యే పితృపితామహయుక్తంబులై నలువదితొమ్మిదివిధములుగల వయ్యె. ఆయాయగ్నుల నామంబులచేతనే బ్రహ్మవాదులు యా గాదులయందు నగ్నిదేవతాకములయిన యిష్టులం జేయుచుం దురు. ఆయగ్ని లగ్నిష్వాత్తులు,బర్హిషదులు, సోమ్యులు, పితరు లు, నాజ్యపులు, సాగ్నులు, నిరగ్నులు ననునేడు తెఱంగులయి యుందురు. మఱియుఁ బితరులకు స్వధ యను కన్యకయందు

---

* ఇట స్థితిపదము పాలనాధికారమం దుంపఁబడినవారును భగవదంశసం భూతులునునగు నింద్రాదిదిక్పాలకుల నుద్దేశించి చెప్పఁబడెను. కాని విష్ణువు నుద్దేశించి చెప్పఁబడలేదు.

వయున, ధారుణి యను నిర్వురుపుత్త్రికలు కలిగిరి. ఆయిరువురు కన్యలు సంసారంబునొల్లక బ్రహ్మచారిణులయి పరఁగిరి. దక్షుని కడపటికూఁతురయిన సతీదేవి శంకరుని ననవరతముగొల్చుచుండియు, గుణశీలములచే నాత్మసదృశుఁడగు తనయునిఁ బడయలేక పోయెను. అనంతరము బాలికయగు సతి తండ్రిచే నవమానిం పఁబడి యోగాగ్నికల్పించికొని యందుఁ దనదేహమును బూర్ణాహుతిగావించె." అని చెప్పుచున్న మైత్రేయుంగాంచి విదురుండిట్లనియె. ఇది ప్రథమాధ్యాయము.

ఈశ్వరునకి దక్షునకు విరోధము సంభవించినకథ.

"ఓమునీంద్రా! సర్వసముఁడయి ప్రవర్తిల్లు నీశ్వరునకును దక్షునకు విరోధమెట్లు సంభవించినది? మఱియు దుహిత్రైనత్సలుఁడయిన దక్షుఁడు కుమారిక నేలతిరస్కరించెను? ఈశ్వరుండు లోకంబుల కధిపతి; స్థానగములకుఁగూడ జ్ఞానముకలిగింప సమర్థుండు. అతఁడు వైరములేనివాఁడై, శాంతవిగ్రహుండయి, యాత్మారాముండై, సమస్తజగదారాధ్యుండై యొప్పుచుండును. అట్టిమహానుభావునితో దక్షుఁ డేలకలహించెను? ఓమహాత్మా! వారిరువురు కిలహించిన వృత్తాంతమును నాకలహమువలన సతీదేవి మరణించినవిధమును సవిస్తరముగాఁ దెలియఁజేయుము." అని యడిగిన విదురుంజూచి మైత్రేయుండిట్లనియె. "ఓవిదురా? ఆయుదంతముచెప్పెద నాలింపుము. పూర్వమున మరీచ్యాదులయిన ప్రజాపతులు సత్రయాగమును జేయుచుండిరి. ఆయజ్ఞమును జూచుటకయి మహామునులును, దేవతలును, నగ్న్యభిమానదేవతలును వచ్చిరి. ఆసమయమున సూర్యునివలెఁ బ్రకాశించుచుఁ,

దనకాంతిపుంజముచే లోకమును జీకటిలేకుండునట్లు గావించుచు, నాసభామధ్యమున కరుదెంచుచు,నున్న దక్షప్రజాపతినిజూచి బ్రహ్మయు నీశ్వరుండును దక్కఁ దక్కిన సభాసదులందఱును స్వస్థానములనుండి లేచి గౌరవించిరి.ఇట్లు సభాసదులచే గౌరవింపఁబడుచు,దక్షుండు లోకగురువగు బ్రహ్మను సమీపించి నమస్కారములం గావించి యతనియనుజ్ఞవడసి యుపవేశించెను. అనంతరము దక్షుఁడు ప్రత్యుత్థానాదులచేఁ దన్ను గౌరవింపక తనకంటె ముందుగ గూర్చుండియుండిన శంకరునిఁజూచి కోపము నాఁవఁజాలక కన్నులచే నిప్పులఁ గుప్పలుగాఁ గురియుచు నిట్లనియె. "ఓమునీంద్రులారా! ఓదేవతలారా! నే నొక్కమాట వచించుచున్నాను. సావధానులరై వినుఁడు. నేను సజ్జనప్రవర్తనను గుఱించి చక్కఁగాఁ జెప్పచున్నాను. అంతియకాని తెల్వితక్కువచేఁగాని మచ్చరమువలనఁగాని చెప్పలేదు. ఈరుద్రుఁడు త్రపారహితుఁడు. హీనులలో హీనతముఁడని చెప్పవలసియున్నది.వీఁడు లోకపాలకుఁడని పేరుపెట్టికొని యాలోకపాలపదమును జెఱచినాఁడు. వీఁడు స్వవిహితధర్మము నెఱుంగనిమూర్ఖుఁడు. మఱియు వీఁడు సత్పురుషులాచరించుచున్నమార్గము నవలంబింపక చరించుచున్నాఁడు. నాకుమారికయగు సతీదేవిని వరించియుండుటచే వీఁడునాకు శిష్యప్రాయుఁడు.వీఁడు పరమయోగ్యునివలెవచ్చి నాపిల్లను నగ్నిసాక్షిగాఁ బెండ్లియాడెను. అకటా! ఇట్టిదుష్టుఁడని తెలిసినచో వీనికి నాముద్దుకూఁతు నర్పింతునా? మర్కటలోచనుఁడై కురూపియై యున్న వీఁడు మృగవిశాలనేత్రయై సౌందర్యవతియై యున్నకూఁతునువరించి నమస్కారమోగ్యుఁడనగు నాకు నమస్కరించుట లేదుగదా.వాక్కులచేతనైనను గౌరవింపఁడాయెను.

* విహితకృత్యములను బరిత్యజించి కావునసే యపరిశుద్ధుఁడై, దురహంకారియై ధర్మమర్యాదల నతిక్రమించియున్నవీనికి నేను సద్గుణురాలగు నాకూఁతును శూద్రునకు నిర్దిష్టమగు శ్రుతినొసం గినట్లు లొసంగితిని. ఎంత తెలివితక్కువకార్య మాచరించితిని !

---

* ఇట రుద్రనిందాపరమగు గ్రంథమును గొందఱు స్తోత్రపరముగా వ్యాఖ్యానము చేయుచున్నారు. ఎట్లన, శ్లో॥ "లుప్తక్రియాయాశుచయే మానినే భిన్నసేతవే" అనుచోట, లుప్తక్రియాయ = ఈశ్వరుఁడు పరబ్రహ్మస్వరూపుఁడు కాన క్రియాకలాపము విడిచినవాఁడు, ఆశుచయే = ఎవనికంటె శుచియగుపదార్థము లోకమందులేదో యట్టివానికొఱకు, మానినే = అహంకారములేనివానికొఱకు, అభిన్నసేతవే = మర్యాదల నతిక్రమింపనివానికి, అని వ్యాఖ్యానము చేయుచున్నారు. మఱియు నీశ్వరునిశ్మశానవాసాదికమంతయు విడంబన మాత్రమని మూలములో "ఉన్మత్తవత్ = వెఱ్ఱివానివలె" అని చెప్పటచే దక్షుఁడు కూడ శ్మశాననివాసాదికము విడంబన మని తెలిసికొనియున్నట్లు స్పష్టమగు చున్నది. శ్లో॥ "శివాపదేశోహ్యశివో మత్తోమత్తజనప్రియః । పతిఃప్రమథభూతానాం తమోమాత్రాత్మకాత్మనామ్ । తస్మాఉన్మాదనాదాయ నష్టశౌచాయ దుర్హృదే। దత్తాబతమయాసాధ్వీ చోదితఃపరమేష్ఠినా"॥ ఈశ్లోకములకును, బదములను వేఱువిధముగ విభజించిరి. అశివః = ఎవనికంటె మంగళప్రదుఁడు లోకమునసుండఁడో వాఁడు, అమత్తః = మత్తుఁడుకాఁడు, అమత్తజనప్రియః = అమత్తజన = మత్తులుకానివారికి, ప్రియః = ప్రియుఁడైనవాఁడు, తమోమాత్రాత్మకాత్మనాం, ప్రమథాదిభూతానాంపతిః = అనఁగా నీశ్వరుఁడు భక్తవత్సలుఁడు కావునఁ బ్రమథులు తామసులయినవారిదోషమును దొలంగించి రక్షించువాఁడు, నష్టశౌచః - నష్ట = అపరిశుద్ధులకుఁగూడ, శౌచం = పరిశుభ్రత్వమునిచ్చువాఁడు, దుర్హృదే = దుష్టులందుహృదయముగలవాఁడు - అనఁగా దుష్టులు సైత మనుగ్రహింపఁదగినవారనెడి బుద్ధిగలవాఁడమట. ఇట్టివానికి, మయా, సాధ్వి, దత్తా = నాచే నాకుమారిక నొసంగఁబడినది. బత = ఎంతసంతోషదాయక

మఱియు వీఁడు శ్మశానభూములయందు సంచరించుచుండును. వీనిపరిచారకులు భూతములు పిశాచములు. నల్లకాటియందున్న భస్మమే వీనికి గంధతుల్యమై యొప్పుచుండును. పుట్టెలచాలే వీనికి హారములయియుండును. ఎముకలే యలంకారములు.

మగుకార్యము.అని యిట్లువ్యాఖ్యానముచేయుచున్నారు. కాని యీయర్థము దక్షునకభిప్రేతమయినదా? లేక యీభాగవతగ్రంథకారునకా, లేక యితరులకా? ఇట దక్షునభిప్రేతమని చెప్పరాదు. "సాధూనాంబ్రువతోవృత్తం శాజ్ఞానాన్న చమత్పరాత్" అని దక్షుఁడు వాస్తవార్థమునే చెప్పుచున్నానని యారంభించి "లోకపాలానాం యశోఘ్నోనిరపత్రపః" అనియు, "యేన స్తబ్ధేనదూషితః" అనియు, "ఏషమేశిష్యతాంప్రాప్తః" అనియు నిందించుచున్న దక్షుని కీశ్వరునిఁ బ్రశంసచేయ నిష్టముండునా? ప్రకరణమునుబట్టి యాలోచించినను రుద్రుని నిందింపవలెనన్న తలంపెకాని వేఱుతలంపుండదు. కావునఁ "దక్షోగిరీశాయ విసృజ్యశాపం తస్మాద్వినిష్క్రమ్యవివృద్ధమన్యుః । జగామ" అని చెప్పఁబోవు గ్రంథముగూడ నంగతమగుచున్నది. ఈయర్థము పురాణకర్తకుఁగూడ నభిమతముకాదు. ఏమన, నీపురాణము వేదాంతార్థస్వరూపమే కావునను, "అనఘ మాతపాస్తావా అహమస్మి" "నారాయణాద్రుద్రోజాయతే" ఇత్యాదులను వేదాంతములందు రుద్రునకుఁ గర్మవశ్యత్వము గార్యత్వము నున్నట్లు వినఁబడుచున్నది కావునను, దద్విరుద్ధముగా నర్థమువచ్చినట్లు గ్రంథమునఁ గూర్చుటతగదు. కావునఁ, "సద్యోజాయతతన్మన్యుఃకుమారో నీలలోహితః। సవైరురోదదేవానాం పూర్వజోభగవానజః । నామానికురుమేధాతఃస్థానాని చజగత్పతే" అని రుద్రుఁడు కర్మములకు వశుఁడైయుండుటయు, జన్మించి ప్రార్థించి చతుర్ముఖునిచేఁ జేయఁబడిన నామస్థానములను స్వీకరించుటయు, గ్రంథమందుఁ జెప్పఁబడినది. ఇతరుల కీయర్థమభిమతమనిచెప్పరాదు. పెఱవా రాగ్రహగ్రస్తులయి యీశ్వరుని కాధిక్యముచూపవలయునని యుందురు. కావున వానినంగీకరింపరాదు. మఱియు "శంకరుఁడు పరబ్రహ్మము కావునఁ గర్మవశ్యుఁడు

వీఁడు వేలాడుచున్న కేశపాశముకలవాఁడై వల్లకాటియందు నత్తునివలె సంచరించుచుండును. వీఁడెల్లప్పుడు దిగంబరుండై భయంకరముగ ధ్వనులుచేయుచుఁ దిరుగుచుండును. దిగంబరుండై వర్తించుటకు మనంబునన్నైన సిగ్గుజనింపదు కాఁబోలును. వీఁడు మిగులగర్వించి క్రిందుమీఁదు నరయకయున్నాఁడు. వీనిని జనులందఱు శివుండని పిలుచుచుంటురుకాని యీనామము వీనికిఁ దెచ్చిపెట్టినట్టులున్నది. చక్కఁగ నాలోచించిచూడుఁడు. శివుఁడని పిలువఁదగినగుణ మొక్కటియైన కలదేమో? వీఁడు కేవలము తమస్స్వరూపుఁడు. సత్త్వగుణ మింతేనియు గానరాదు. తాను మదించినవాఁడు. కాన వీఁడు మదించి వర్తిల్లుజనులకుఁ బ్రియతముండు. ప్రమథులని పిలువఁబడు భూతములకు రాజు. వీఁడాచారహీనుఁడు. దుష్టచిత్తుఁడు. ఇట్టి దురాత్మునకు ముద్దులు మూటగట్టు నోరెఱుఁగని పసిపిల్లను గట్టిపెట్టి పాప మాపిల్ల

కాఁడని చెప్పుటయు యుక్తముకాదు. రామకృష్ణాదులు పరబ్రహ్మస్వరూపులైనను గర్భకూన్యులైనట్లు చెప్పఁబడలేదు. పరబ్రహ్మస్వరూపుఁడగువాఁడు క్రియాలోపము నొందియునుండవచ్చు. అందు నిదొక హేతువుగాఁ దలంపరాదు. మూలమున "అమానినే" "అభిన్నానేతవే" అని పదవిభాగము గ్రంథకర్తకభిమతముకాదు. లేక యట్లంగీకరించినచో "సద్భిరాచరితః పంథాయేన స్తబ్ధేనదూషితః" అనిచెప్పిన గ్రంథమునకును దీనికిని విరోధము సంభవించుచున్నది. తామసులయిననుఁ బ్రమథులనోమములను దొలంగించి రక్షించువాఁడని చెప్పుటయుఁ దగదు. "తానహాంద్విషతఃక్రూరాన్సంసారేషు నరాధమాన్। క్షిపామ్యజస్రమశుభా నాసురీష్వేవయోనిషు। ఆసురీంయోనిమాపన్నా మూఢాజన్మనిజన్మని। మామప్రాప్యైవకౌంతేయ తతోయాంత్యధమాంగతిం" తామసులు కోపపాత్రులగుచున్నట్లు గీతలలో చెప్పఁబడుచున్నది. కావున నిట్టియర్థమును స్వీకరింపరాదు.

గొంతుకను దెగియుఁదెగనికత్తితో ఖండించితి. అక్కటా! ఇప్పు డెంతనిందించుకొన్నను లాభమేమి." అని యిట్లుపలికి యుదాసీనుఁడై కూర్చుండియున్న శంకరునిశపింప సమకట్టి క్రుద్ధుండై జలంబుగొని యాచమనంబుచేసి మఱియు నిట్లనియె. "ఓసభాసదులారా! దురాత్ముండైన యీశ్వరుం డిది మొదలు గొని దేవతోద్దేశ్యముగా నర్పింపఁబడుచున్న హవిస్సులయం దింద్రాదిదేవతలతోఁబాటుగ భాగంబు లేకుండుఁగాక. మఱి యు వీఁడు దేవతాగణములలో నధముఁడు. అట్టివానికి హవిర్భా గంబుగొన నెట్లు లభ్యుండగును." అనిశపించి సభాసదులందఱిచేత నిషేధింపఁబడినవాఁడగుటచే రెట్టించినకట్టలుక కలవాఁడయి సభామధ్యమున నుండనొల్లక తననివాసంబునకరిగె. ఇట్లు దక్షుం డు పలికిన గర్హితవాక్యంబులన్నియువినియు నీశ్వరుం డింకేనియు నలుగక యూరకుండె. అనంతరము దక్షుఁడు శాపమిచ్చిపోవుట నుపలక్షించి శంకరుని పరిచారకుఁడగు నందీశ్వరుండు తనప్ర భువు శపింపుండగుటకుఁ గరమ్మలిగి, దక్షుఁ డిచ్చినశాపమున కానం దించిన బ్రాహ్మణులకును, దక్షునకు నిట్లు శాపంబిచ్చె. "ఓసభాసదు లారా! ఈదక్షుండు మానవశరీరమే శ్రేష్ఠంబని తలంచి నిరప రాధుఁడును, లోకపూజ్యుఁడును భగవదంశావతారుండును నగు నీశ్వరుని కపరాధంబు గావించె. కావున నీదురాత్ముఁడు ప్రకృ తిపురుషేశ్వరవిషయమగు జ్ఞానములేనివాఁడయి చరించుఁగాక. మఱియు వీఁడు మాయాగుణధర్మములతో నిండియున్న నివా సంబుల వర్తించుచు, తుచ్ఛములయిన సాంసారికసుఖముల నాసించుచు, నర్థవాదంబులయిన వేదంబులచే నష్టబుద్ధియై యల్ప సుఖదములగు కర్మతంత్రంబుల విస్తృతముగాఁ జేయుచు, వర్తిం

చుఁగాక. మఱియు వీఁడు నశ్వరములయిన దేహాదులను నాత్మ గా భావించుచు, జీవాత్మ పరమాత్మ విషయమైన జ్ఞానమును నశింపఁజేసికొని పశుప్రాయుండై స్త్రీసంగమాభిలాష కలవాఁ డయి జ్ఞానవిహీనమయిన పశువువలె వర్తించుచున్నాఁడు. కాన నచిరకాలములోనే మేషముఖుండగుఁగాక. మఱియు మ హాత్ముఁడయిన యీశ్వరునికి శాపమొసంగినదఱునిపఁ మవ లంబించిన మూఢులందఱు జ్ఞానరహితులై సంసారకూపంబునఁ దిరుగుచు, జననమరణాదిదుఃఖములపాలయి వర్తింతురుగాక. అదియునుంగాక యర్థవాదములయిన వేదములయందు నిరూపిం పఁబడు స్వర్గాదిసుఖముల నభిలషించి కర్మాసక్తు లగుదురుగాక. మఱియు దారసుతాదులపోషణంబులకై విద్య లభ్యసించుచు, ధనదేహేంద్రియములయందుఁ బ్రీతిగలిగి యాచకులయి వర్తిం తురుగాక" అని యిట్లు నందికేశ్వరుండు బ్రాహ్మణజనంబుల శపిం చుట నాలకించి సభామధ్యముననున్న భృగుమహాముని కోపోద్దీ పితమానసుండై నందికేశ్వరునకుఁ బ్రతిశాప మీఁ దలంచి యిట్లనియె. "సభాసదులారా? ఈనందికేశ్వరుండు నిష్కారణం బుగా బ్రాహ్మణజనంబుల శపించినాఁడు. కావున నతండు శాపా ర్హుండు. కావున నెవ్వరు కేవలము శంకరు ననుసరించి వర్తిం తురో? వారిననుసరించి యెవ్వారలు వర్తింతురో? వారందఱు వేదవిరుద్ధకర్మముల నాచరించుచుఁ బాషండులయి వర్తింతురు గాక. మఱియు వారలు నష్టశౌచులై దురాచారులయి మూ ఢబుద్ధులై జటాభస్మధారులయి వర్ణాశ్రమధర్మముల నతిక్రమిం చి చరింతురుగాక. వేదమే సకలవర్ణాశ్రమములకును సుఖకరమ యినమార్గము. అది యాద్యంతములు లేనిది. దానిని బూర్వ

లగు మానులును, మఱికొందఱును నాచరించిరి. జనార్దనుఁ డా వేదము ప్రమాణముగాఁగలవాఁడు. అది నిరతిశయమగు శ్రేయ స్సాధనములఁ దెలిపెడిదగుటచే సర్వోత్కృష్టమయినది. అది యపౌరుషేయము. అది సజ్జనులు చేకొనుమార్గము. అట్టివేదమును నిందించియున్నారు. కావున నేనియందుఁ దామసులయిన మీకు రుద్రుఁడు ద్వైవమో యట్టిపాషండధర్మముల నాచరించుచునుండుఁ"డని భృగువు పలుకఁగా విని యీశ్వరుండు వివమనస్కుఁడై యనుచరబృందసమేతుఁడై యజ్ఞశాలనుండి బయలువెడలిపోయెను. పిమ్మట మఱీచ్యాదులు లోకపూజ్యుండయిన హరిప్రీతికై నేయిపత్సరంబులు సత్రమును నిర్వర్తించి గంగాయమునాసం గమస్థలంబున నవభృథం బాచరించి తదనుతమనివాసంబులకరిగిరి. ఇది రెండవయధ్యాయము.

ఓవిదురా? అంత బామాతయయిన యీశ్వరునకును, మా మయయిన దక్షునకు వివోధము గ్రమంబుగా వృద్ధిపొందుచుం డఁగాఁ జిరకాలం బతిక్రాంతంబయ్యె. ఆకాలమందు బ్రహ్మ దక్షు నకు సర్వప్రజాపతులప్రభుత్వం బొసంగె. అందువలన దక్షునకుఁ గలిగిన గర్వంబునకు మేరలేదయ్యె. ఇట్లు దక్షుం డమితంబగు గ ర్వంబుతోఁ వర్తిల్లుచు గర్వాతిశయముచేతను, శంకరునందున్న కోపముచేతను చానాచరించినయాగములందు హవిర్భాగంబుల కై యీశ్వరుం డాహూతుండు కాఁడయ్యె. ఇట్లు దక్షుండు శం కరునిఁబిలువక బ్రహ్మనిష్ఠులయిన మహాత్ములను దిరస్కరించి వా జపేయ మనెడియాగం బాచరించి పిమ్మట బృహస్పతి సవనమును జేయఁ బ్రారంభించెను. ఆయజ్ఞమును జూచుటకయి మహాత్మ

లయిన బ్రహ్మర్షులు, దేవర్షులు, దేవతలు సాలంకృతలగు వారి వారిభార్యలతోఁ గూడికొని మహానందంబుతోవచ్చి యాగశాల నలంకరించిరి. అంతట నాకాశమందు మహానందంబుతో సంచరించుచు దక్షుఁడు చేయుచున్న యజ్ఞమును నుతించుచుఁ బోవుచుండ నీశ్వరునిభార్యయగు సతీదేవి యీమాటల నాలకించి యున్నిద్రిక్షులనుండియుఁ దనగృహమునసమీపముగాఁ బోవుచున్న దేవతాస్త్రీలనుజూచి, తనతండ్రి నెఱవేర్చుచున్న యాగోత్సవమును జూడ వేడుకపడుచు శంకరునిపాలికిఁబోయి నమస్కరించి

సతీదేవిదక్షునియాగమును జూడరమ్మనిశంకరునిఁగోరుట.

మృదుమధురభాషలతో నిట్లనియె. "ఓ హృదయవల్లభా ? నీ మామయగు దక్షుండు మహానిష్ఠతో యాగము నాచరించుచున్నట్లు వినియున్నాను. అయ్యజ్ఞమును జూచుటకయి దేవతలందఱుఁ దమతమభార్యలతోఁగూడి మహాసంతోషంబుతోఁ బోవుచున్నారు. కావున మనముగూడ నాసవనంబు చూడఁబోవుదము రమ్ము. మఱియు నాతోఁబుట్టువులందఱు తమతమభర్తలతోఁ దల్లిదండ్రులను,హితులాంధ్రను, యాగమును, జూచుటకయి తప్పక వచ్చియుందురు. మనముగూడ నచటికిఁబోయి వారినందఱఁ గన్నులారఁ గాంచి యాగ మనుగునంతనఱకునుండి యాగాంతమున మాతండ్రియెసంగు వస్త్రాభరణాదులయిన కానుకలను బడయఁగోరుచున్నాను. ఓ ప్రాణవల్లభా ? భర్తృసమ్మతలై యున్న తోఁబుట్టువులను, మాతల్లితోఁబుట్టువులను నన్నుఁజూడ వేడుకపడుచున్న తల్లిని, మహాముసీంద్రులచే నెత్తఁబడుచున్న యూపస్తంభమునుఁ జూడవలెనని కోర్కిపుట్టి బాధించుచున్నది. ఓ దేవా ? పరమాత్మస్వరూపుఁ

డయిన నారాయణునిచే నాత్మమాయామూలకంబుగ నిర్మింపఁబడిన గుణత్రయాత్మకంబయిన ప్రపంచకం బాశ్చర్యకరంబగుటకు సందియంబులేదు. అయినను దత్త్వవిదుండనయిన నీకుసుంతేనియు నాశ్చర్యంబు కలుగదు. కాని తత్త్వజ్ఞానము తెలియనిదాన నగుటచేతను, జంచలస్వభావముకలదాన నగుటచేతను నాశ్చర్యకరంబులగు పదార్థములఁ జూడ వేడుకపడుచున్నాను. మఱియు నాజన్మభూమినిజూచి వెద్దకాలంబుకావచ్చినది. కావున నొకమాఱు పోయి చూచివత్తము రమ్ము. అదియునుంగాక నాజనకునకు బంధువులు కానివారయినను, లోకములో స్త్రీలందఱు మందమందలుగాఁ దనుప్రియులతోఁ గూడికొని కలహంసవలెఁ దెల్లనైన విమానములపయి నధివసించి యత్యంతసంతోషముతో గగనమార్గమునఁ బోవుచున్నారు. బాంధవులు కానివారే యధికమగువేడుకతోఁ బోవుచున్నప్పుడు నాపుట్టినింటికి వెళ్లుటకు నాకుఁగలిగెడివేడుక యెంతయుండునో యోజింపుము. మఱియుఁ దండ్రిగృహంబునఁ గాఁబోవునుత్సవంబును విని చూడఁ బోవకుండ నెవఁతె యూరకుండఁగలదు. ఒకవేళ నీవు"మీజనకుండు మనలఁ బిలువలేదే యెట్లు పోగలుగుదు"మని ప్రశ్నింతువేని చెప్పెదవినుము. అట్లుసందియపడ నవసరములేదు. పితృగృహంబునకును, మిత్రునిమందిరమునకును, గురునిలయంబునకును, భర్తృనివాసంబునకును బిలువఁబడకయేపోవచ్చునని వెద్దలందురు. ఓ దేవా! కారుణికాంతరంగుండవయిన నీవు నావాంఛిత మీడేర్పఁదగుదువు. మఱియు నాయందధికమయిన దయగలవాఁడవనుటకు సందియములేదు. నేనట్లు నీయపారకృపారసంబునకుఁ బాత్రురాలనుగానిచో భవదీయంబగు నర్ధశరీరము

నందు దాల్తువా? అట్టిదయాళుండవు. కావునఁనే నావరము నెఱ వేర్పవలయునని ప్రార్థించుచున్నాను. నాయందుఁ దొల్లింటి యనుగ్రహముంచి పోదమురమ్ము."అని వేఁడుచున్న సతీదేవివాక్యంబుల నాలకించి పూర్వము తన్ను దక్షుఁడాడిన పరుసములను స్మరించికొని యీమెకు శంకరుం డిట్లనియె. "ఓ ప్రియురాలా? నీచెప్పిన వాక్యంబులన్నియు సత్యములే. బంధుగృహంబుల కనాహూతులైనను బోవచ్చునన్న వాక్యము సర్వసమ్మతమైనదే. కాని యీబంధువులు పరస్పరము పరుషభాషణములనుబాణములచే శరీరంబులు గాయంబులు గావించుకొన్నచో నీవన్నట్లు

{శంకరుఁడు సతీదేవిని దక్షునియాగవాటికకుఁ బోవలదనిచెప్పుట.}

బంధువులయిండ్లకేఁగరు. మఱియు నింకొకటి చెప్పెద నాలింపుము. విద్యాతపంబులు, విత్తము, వయస్సు, కులరూపంబులు నను నీయీయైదును సుజనులకు గుణంబులయియుండు ఆ చెప్పిన యీయైగుణములు దుర్జనులయెడ దోషహేతువులయి కానవచ్చుచుండును. కాన మీతండ్రి విద్యాతపంబులు మొదలుగాఁగల గుణంబులుగలవాఁడై నను దుష్టమనస్కుండయిన కారణంబున నాగుణంబులు దోషంబులుగాఁ బరిణమించినవి. అందువలన గర్వాతిశయము కలవాఁడయి మహాత్ములను తిరస్కరించుచున్నాఁడు. మఱియు గర్వాతిశయముచే మీతండ్రికిఁ దారతమ్యజ్ఞానము కొంచెమైనను లేదు. అందుచే నెవ్వరి నేరీతి నాదరింపవలెనో యతనికి సుంతేనియుఁ దెలియదు. తనకంటె నధికులను సయితము గడ్డిపోచవలెఁ జూచుచుండును. ఇట్లు దుర్గుణభూయిష్ఠుఁడును, గర్వితుండునగు మీతండ్రిగృహంబునకు బంధుగృ

హంబని తలంచి పోవుట యెంతయు నుచితంబుకాదు. ఒక చోఁ బోయినచో వారు కుటిలబుద్ధులయి రూక్షవీక్షణంబులఁ జూచుచుఁ గౌరవింపరు. వారు గౌరవింపక యవమానించిన సయిఁపవలయునని యందువేమో, యందులకు సమాధానముచెప్పెద వినుము. ఎట్టికష్టములన్నైనను నోర్వవచ్చునుగాని, యవమాన పురస్సరంబులగు బంధువులవచనముల నోర్చుట కష్టము. మఱియు యుద్ధమునందు శత్రువుల బాణభూతంబులనుబొంది శరీరములను గాయంబులుఁ గావించుకొనినను, దనమందిరంబునకుఁ బోయి చికిత్సచేసికొని రాత్రియందు సుఖనిద్ర చెందఁగలఁడు. కాని బంధువుల దుర్వాక్యములచే నభిహతుండయినవాఁ డా గాయంబుల మాన్పుకొనలేఁడు. మఱియు దానికి మందు లేనే లేదు. మానవుఁ డట్టిగాయంబులబాధ నోర్వఁజాలక కృశించి కృశించి మృతుండగును. మీతండ్రి నిందించి బ్రహ్మసభలోఁ దిరస్కరించినవాఁడయి నన్నుఁ బిలుపకయె యాగంబులు చేసికొనుచుండ నెట్టులాతనియాగంబు చూడఁగడంగఁదును. కాన నేను వచ్చుట యుచితకృత్యంబుకాదు. పోనిమ్ము. మా తండ్రి నిను నిందించెనుగాన నీవు రాకుండుటయు క్తమె. నన్నే మియు నిందింపలేదే నేఁబోవుట కేమయిన యడ్డంకికలదా? యని యడిగెదవేని చెప్పెదను వినుము. ప్రాజాపత్యాధికారరూపమయిన గర్వముగల దక్షునికి నీయం దధికమయిన ప్రేమముండిన నుండవచ్చు. మఱియు లోకములో జననీజనకులకుఁ గడఁబుట్టువారియం దధికమయిన ప్రేమముండుట సహజముకాన దక్షునికిఁ దక్కినకుమారికలయందున్న ప్రేమకంటె నీయం దధికమగుప్రేమ యుండునని నిక్కంబుగా వక్కాణింపఁగలను. కాని

నీవు నీతండ్రికిఁ బరమవిరోధినై న నాకు భార్యవయి న న్నాశ్ర యించియున్నావు. ఆకారణముచే నిన్నునై న నాదరించి గౌరవిం చుననినాకుఁ దోఁపదు. పోనిమ్ము. దక్షుఁడు పూజనీయుఁడు గదా? అట్టివానిని నీవేల తిరస్కరించితి? అందుచేతనే ని న్నా తఁడు తిరస్కరించుచున్నాఁడు. ఇంతకు వైరకారణము నీచేసిన తిరస్కారమేయని యందువేని చెప్పెద నాలింపుము. లోకము లోఁ గొందఱుమూఢులు పుణ్యాతిశయముచేతను యశంబుచే తను మహాప్రసిద్ధిగలిగి వర్తించు మహాత్ముల యున్నతపదవి నొందవలెనని ప్రయత్నించుచు నందులకు సమర్థులు కాక దంద హ్యమానమయిన హృదయముచే నాతురులయి దూషించుచు మహాత్ములను ద్వేషించుచుందురు. మహాత్ములతో సామ్యమును బొందలేకపోవుటచే ద్వేషించుచుందురు. అట్లైకానిచో లోకాధీ శుఁడయిన నారాయణునితో రాక్షసు లెందులకు ద్వేషించుచుం దురు? ఆలోచింపుము. అందువలన దక్షునిదుష్ప్రవర్తనమే యిం దులకుఁ గారణముకాని మఱియొకటికాదు. అట్లుకాదు. నీకు దక్షుఁ డు పూజనీయుండు. అట్టివానికి నీవు నమస్కారాదిగౌరవము చే యకుండుటయే కారణమందువేని చెప్పెదవినుము. సుందరీ! ప్రాజ్ఞు లిరువురు కలసినప్పుడు మనోవాక్కాయములచేఁ బరస్పరము నమస్కారముచేయుట యుచితకృత్యము. అట్లుకాక ప్రాజ్ఞుఁడు నజ్ఞుఁడు నొకచోటఁజేరినచో నజ్ఞునకు నమస్కరించుట తగవు కాదు. మఱియుఁ బ్రాజ్ఞుండు దేహాభిమాని యగువానికి నమ స్కరింపక పరమపురుషున కాచరింపవలయును. కావున నేను దేహాభిమానియగు మీతండ్రికి వందనము లాచరింపక నిత్యుం డును, నంతర్యామియునగు పరమపురుషునకు నమస్కరించితిని.

అంతర్యామికైనను గరణత్రయముచేతను నమస్కరింపక యెట్టిమనస్సుచే నమస్కారము చేయవలయునని యందువేని చెప్పెద. రజస్తమోగుణములులేక కేవలము సత్త్వగుణముగలిగిన మనస్సు వసుదేవశబ్దముచేఁ జెప్పఁబడును. అట్టిచిత్తమందు వాసుదేవుఁడు ప్రతీయమానుఁడగుచున్నాఁడు. భగవంతునికి వాసభూతమగుటవలన వసుదేవశబ్దముకలిగినది. అట్టిచిత్తమున భగవంతుఁ డింద్రియాంతరములకు గోచరుండుకాక కేవలచిత్తమునకే గ్రాహ్యుఁడగును.అందుచేనతఁడు చిత్తముచేతనే నమస్కృతుఁడాయెను.అట్లు నేను జేసియుండుట దేవాభిమానియయిన దక్షుండుకానక నన్ను ద్వేషించెను.నాతో బద్ధవిరోధముగలదక్షుని నే నెట్లుచూడ నేఁగుదును ? నావచనంబు లతిక్రమించి పోదువేని నీకుఁ బరాభవంబు సంప్రాప్తమగుటనిక్కంబు. బంధుకృతావమానంబుకంటెఁ జావు మేలగుననుట నీవెఱుంగనిదికాదు. ఓలలనామణీ ! చెప్పవలసిన దేదియో నీకుఁ జెప్పితిని. నీకుఁజూడఁ బోవలయునను కోర్కియున్నయెడ నీవరుగవచ్చును. కాని నేనురానొల్ల. పిమ్మట నీయిష్టంబ"నిపలికి యూరకుండెను. ఇది మూడవయధ్యాయము.

అంత సతీదేవి తనమనంబున నిట్లుతలపోసె."అక్కటా! నేనచ్చటి కరుగుట యాతనికిఇష్టమున్నట్లుతోఁపదు. ఒకచో నేనచ్చటికిఁబోయినప్పుడు మాతండ్రి దుష్టబుద్ధికలవాఁడై నన్నవమానించినచో దుఃఖపరీతస్వాంతనై యిచ్చటికే రావలయును. నేను బతియాజ్ఞ మీఱిపోయి యచ్చటఁ దండ్రిచే నవమానితనై తిరిగియిట వచ్చినప్పుడు భర్తయేమిచేయునో" అని తలపోయుచు నాక

వంక బంధుదర్శనకుతూహాలతయు రెండవవంక భర్తవలనిభయ
మును దుల్యబలంబులై చెఱియొక ప్రక్కకు లాగుచుండ నేమి
చేయుటకు సాహసింపఁ జాలకయుండె. ఇట్లుసతీదేవి కొంతవఱకు
మిన్నకుండి తుదకు బంధుస్నేహము బలీయమయి యామెమ
నంబును దనవంక కాకర్షించెను. అంతట బంధుదర్శననిరోధము
గలిగినందులకు మిగులదుఃఖించుచుఁ గన్నీరుమున్నీరయి పాఱు
చుండ నెలుఁగెత్తి కొంతసేపు వాపోయి సర్వసముఁడయి యొప్పు
చున్న యాశంకరునిపై కోపముపహించి కోపాతిశయముచే
నంగకములు కంపించుచుండఁ దీవ్రములయిన చూపులచే శంక
రునిఁ జూచెను.ఇట్లు కొంతసేపుచూచి వేఁడినిట్టూర్పుపుచ్చి మూ
ఢురాలయిన యాసతీదేవి శోకరోషములు మనంబునఁ బెనఁ
గొనఁ బ్రేమాతిశయముచేఁ దనకు నర్ధశరీర మిచ్చినవాఁడును
దనకు సర్వవిధముల నాధారుఁడును నగు శంకరుని విడిచి జనక
గృహంబునకుఁ బయనంబయిపోయెను. ఇట్లుసతీదేవి యతిత్వరిత

సతీదేవి దక్షుఁడుచేయున్న యజ్ఞమును జూడఁబోవుట.

గమనము నవలంబించిపోవుచుండ రుద్రానుచరులు రుద్రుఁడు
వెడలనందులకును, నసహ్యులరాలై తమరాణికాలినడక నరుగు
చున్నందులకు డెందములఁ గొందలపాటుచెంది యామెకుఁ బ్రియ
ములయిన కందుకములను,లీలాపద్మములను, చిలుకలు,గోరువం
కలు మొదలగు క్రీడాపక్షులను, బూవులదండలును, ధవళాతపత్ర
మును,కస్తూరి,పచ్చకర్పూరము మొదలగు పరిమళద్రవ్యంబులను
బట్టికొని దుందుభులను శంఖములను వేణువులను వాయించుచు
వడివడిగా నడచి యామెను సమీపించి భూషణములచే నామెఁ న
లంకరించి వృషభవాహనారూఢంజేసి దక్షుఁడుచేయుచున్న య

జ్ఞమునుజూడఁగోరి తదీయమార్గానుసారులయి పోవుచుండిరి. * ఇట్లు సతీదేవి వృషభవాహనారూఢయయి సంఖ్యాతీతులయిన రు

---

*ఓయీ! పరబ్రహ్మమగు విష్ణువు సర్వోత్తముఁడనియు, జగత్కారణుఁడనియు, సుపాసింపఁదగినవాఁడనియు, మోక్షప్రదుఁడనియుఁ జెప్పెడి వేదాంతార్థములఁ బ్రకటించునట్టి యీపురాణమునందు నచ్చటచ్చట రుద్రాదులు జీవవిశేషులనియు, జననాదులు గలవారనియుఁ, గర్మవశ్యులనియుఁ జెప్పుచు, మఱుఁడ, "సమస్తాత్మనిముక్తవైరకే" "బ్రహ్మాదయోయేమూర్ధభిర్ధృతశ్చరణావసృష్టం" "నాహంనయజ్ఞోనచయూయమన్యే యేదేవభాజోముననయశ్చతత్త్వం। విదుఃప్రమాణంబలవీర్యయోర్వా" "త్వమేవభగవన్నేతచ్ఛివశక్త్యోస్స్వరూపయోః। విశ్వంసృజసిపాస్యత్సి క్రీడాన్నూర్ణపదోయథా। అహంబ్రహ్మేచశర్వశ్చ జగతఃకారణంపరమ్। త్రయాణామేకభావానాం యోనపశ్యతివైవిదామ్" ఇత్యాదిస్థలములయందుఁ, పార్వతియు, బ్రహ్మయు, విష్ణువును జెప్పుచున్నవచనములందు రుద్రుఁడు సర్వోత్తముఁడనియు, జగత్కారణుఁడనియు, సుపాసింపఁదగినవాఁడనియు, విరుద్ధార్థములను జెప్పుచున్న వ్యాసుండెట్లులు విశ్వసింపఁదగినవాఁడు. ఆతనివాక్య మెట్లు ప్రమాణముగాఁ జేకొనవచ్చును.అనిశంకింపఁబనిలేదు ఈపురాణమునందుఁ బరస్పరవిరోధముగా నెచ్చటను బ్రతిపాదించియుండలేదు. ఒకవేళ నెచ్చటనైన రుద్రాదుల యాధిక్యము చెప్పినట్లు ప్రతీయమానమైనచో, నాయాస్థలములందు రుద్రాదిజీవులు శరీరముగాఁ గలపరమాత్మనుద్దేశించి చెప్పఁబడినదని గ్రహింపవలయును. లేక రుద్రాదులు భగవంతుని యాజ్ఞావశులేకనుక భగవద్దృష్టిచే జెప్పినను జెప్పవచ్చును. లేక వ్యాసభగవానుఁడు పూర్వముజరిగిన వృత్తాంతములనే యీపురాణమునఁ జెప్పుటవలన నచ్చటచ్చటఁ గథలయందు భవాని మొదలగువారు చెప్పినవాక్యములనె కూర్చియుండును. అచ్చట భవాని మొదలగువారు తమభక్త్యధికతయముచే శివుడు పరబ్రహ్మయనియుఁ బ్రశంసనీయుఁడనియుఁ జెప్పియుండుట. ఆవాక్యములనే యథాశ్రుతముగా నిందుఁజేర్చియుండవచ్చును. అందుచే నిదొక

ద్రానుచరులు తన్నుఁ గొల్చుచుండఁ బోయిపోయి సమస్తమునిబృందములచేతను, బృందారకులచేతను, బూజితమయి, వేదఘో

విరోధముగాఁ బరిగణింపరాదు. ఓయీ! "యద్వ్యష్టకరంనామగిరేరితంనృణాంసకృత్ప్రసంగాదఘమాశుహంతి।పవిత్రకీర్తిం" "యేమూర్ధభిర్ధృతశ్చరణావనృష్టమ్" ఈమొదలగు వచనములచే రుద్రాదులు పరబ్రహ్మస్వరూపులౌటంబట్టి యుపాసింపఁదగినవారని ప్రతీయమాన మగుచున్నదని శంకింపరాదు. కొన్నికొన్ని సాత్వికతంత్రములలోఁ గూడ "నాన్యందేవంనమస్కుర్యా న్నాన్యందేవనిరీక్షయేత్ । నాన్యంప్రసాదమాహోహ్నా న్నాన్యదాయతనం విశేత్" మతియొకదైవమును జూడరాదు ఇతరదేవునికి నమస్కారము చేయరాదు. ఇతరదేవాలయమును ప్రవేశింపరాదు. అని యితరదేవతానమస్కారాదికమునిషేధింపఁబడుచున్నది. ఇట్లే యచ్చటచ్చట నితరదేవతలను దద్భక్తులను నిందింపఁబడుచున్నారు. కావునఁ బురాణమునకు సాత్వికతంత్రమునకు విరోధము సంభవించుచున్నది. అ ని ఁ హింపఁబడినదిలేదు. బ్రహ్మను నుపాసించుటకు సద్వారకమనియు, అద్వారకమనియు రెండువిధంబులుగలవు. సద్వారకమనఁగా రజోగుణాత్మకుఁడగు బ్రహ్మయు, తమోగుణాత్మకుఁడగు రుద్రుఁడు మొదలగుజీవులే శరీరముగాఁగలపరమాత్మను నుపాసించుటయే. అద్వారకమనఁగాఁ గేవలము శుద్ధసత్వము కలవాఁడై స్వేచ్ఛచేతనే దివ్యమంగళవిగ్రహాములను స్వీకరించుచు, నిఖిలదోషములను నిరసించుచు, ననంతకల్యాణగుణములు కలవాఁడయి యున్న నారాయణుని నుపాసకులయిమ్మనుచొప్పున వాసుదేవ సంకర్షణాదులని భేదముచే నుపాసించుట. సద్వారకమగు నుపాసన మాయాఫలములను గోరుచున్నవారిచేఁ జేయఁదగినది.అద్వారకమగు నుపాసనము మోక్షునందుఁ గోర్కికలవారిచెతనే చేయఁదగినది. ఈవిషయము శ్లో॥ "యోయోయాంయాంతనుంభక్త శ్శ్రద్ధయార్చితు మిచ్ఛతి"అనువచనముచేతను, "అనన్యాశ్చింతయంతోమాం" అనువచనముచేతను స్పష్టముగాఁ జెప్పఁబడినది. ఈపురాణమునసే ప్రథమస్కంధమున "రజస్తమఃప్రకృతయ స్సమశీలాభ్యజం

షలచేనిండి, కుశాజినములచేతను, మృత్కాంచనమయములయి న పాత్రవిశేషములచేతను, హోమద్రవ్యములచేతను దనరారుచున్న యజ్ఞశాలను బూడఁగాంచి యధికమయిన సంతసమువహించి ప్రవేశించెను. అట్లు వచ్చుచునున్న సతీదేవినిజూచి దక్షునివలని భయముచే నెవ్వరు నామె నాదరించినవారలుకారు. దక్షుఁ డామె వైపు చూడనయినఁ జూడలేదు. కాని ప్రేమాశ్రువులుగురియ సోదరులును దల్లియు వచ్చి యామెను సంతసముచే నాలింగనము చేసికొనిరి. తల్లియు నాలింగనము కావించుకొని మాతృవాత్సల్యమును వెడలఁబోసెను. పిమ్మట సతీదేవిదండ్రియగు దక్షుండు తన్నాదరింపమికి న్మూదయంబునఁ గలంగుచుఁ దల్లితోఁ బుట్టువులచేతను, దనజనసీసోదరులచేతను బ్రేమపురస్సరముగా నర్చింపఁబడినదయినను బూజను స్వీకరించుటకు నిష్టపడలేదు. మఱియు దక్షుండు లోకారాధ్యుఁడయిన తనభర్తనవమానించి యజ్ఞము చేయుచుండుటయుఁ, దన్నుఁ జేనియు గౌరవింపకుండుటయు, మనంబున నాలోచించి సతీదేవి కోపావిష్టమానసయై

తివై । పితృభూతప్రజేశాదీ[క్ష్] శ్రియైశ్వర్యప్రజేప్సయా'' అని చెప్పఁబడినది. అట్లే ద్వితీయస్కంధమున ''అకామస్సర్వకామోవా మోక్షకామ ఉదారధీః। తీవ్రేణభక్తియోగేన యజేతపురుషంపరమ్' అనిచెప్పఁబడెను. ఈయర్థమునుబట్టియుండుగూడఁ జెప్పఁబడును. కావున మోక్షేచ్ఛకలవారు పరదేవతలందు వ్యభిచరింపనియుపాసనమునే చేయవలసియుంటచే వారు తమభక్తి వ్యభిచరింపకుండుటకై యుపాసించు దైవమునకంటె నితరదైవములను జూడరాదనియు నమస్కరింపఁగూడదనియు దేవతాంతరభజనము నిషేధింపఁబడినది అంతియకాని సర్వదేవతలను బరబ్రహ్మముగా ననుసంధానముచేసి కొలిచియుండుట దేనికిని విరుద్ధముగానుండదు. కావున సాత్వతపురాణములకు విరోధము లేదని తెలియఁ దగినది.

కన్నులనుండి నిప్పుకలు కుప్పలుకుప్పలుగాఁ గురియ రోషాకులిత లోచనములచే లోకములను దహించునట్లు చూచుచు, రుద్ర విద్వేషియు, గర్వాంధుఁడనగు దక్షునివధింతుమను రుద్రాను చరులను బ్రయత్నింప వలదని వారించుచు, కోపాతిశయముచే నుపవ్యక్తములుకాని వాక్కులతోఁ దండ్రికిట్లనియె. "లోకముల లోఁ బరమాత్మను నిరతిశయప్రేమముతోఁజూచుచున్నశంకరుని

సతీదేవి దక్షుని నిందించుట.

కిఁ బ్రాణులలోఁ బ్రియులు కొందఱు,నప్రియులు కొందఱు లేరు. సర్వాంతరాత్మయగు పరమాత్మను నిరతిశయమగు ప్రీతిరూప మయిన భక్తిచే భజించునతనికి సమస్తము బ్రహ్మాత్మకముగానె చూచుటచే 'వీఁడుప్రియుఁడు వీఁడుకాఁడు' అను విభాగము లేదు. అమ్మహాత్మునికిఁ బ్రాణికోటియంతయు సమానమె. అట్టి సర్వస ముఁడయినరుద్రుని నీవుదక్కఁదిరస్కరించినవాఁడుండఁడు.మఱి యు నీవంటిదురాత్ములు పరులసద్గుణములయందు దోషముల నా రోపింతురు. కొందఱుఁ జిన్నవాని బెద్దలుగాఁజేసి చెప్పెదరు. మ హాత్ములు పరులయందు గుణదోషములున్నను గుణములమాత్ర మే తీసికొని దోషంబులు విడిచిపెట్టుదురు. మఱికొందఱు పరుల దోషములనయినను గుణములగా భావింతురు. అట్టిమహాత్ముల లో నొకరుఁడగు నీశ్వరునికి నీవపరాధము గావించితివి. అవును. శవప్రాయమగు శరీరమునే యాత్మగాభావించు నీవంటికుత్సితు ల సూయతో, మహాత్ముని నిందించుట యొకయాశ్చర్యము కాదు. లోకములో మహాత్ముల పాదధూళులచే నిరస్తప్రభావులయిన కుజనులు మహాత్ములయాధిక్యమును సహింపలేక మాత్సర్యగు ణోపేతులయి మహాత్ముల నిందించుట సహజము. అట్లే నీవును

జగదారాధ్యుఁడయిన శంకరుని మహామహిమచేఁ దిరస్కృత ప్రభావుండవయి చేయునది లేక కుజనవృత్తి నవలంబించి మహాత్ముఁడయిన శివుని సద్గుణంబులను, మహామహిమమును సహింపలేక నిందించితివి. అకటా! నీ ప్రవర్తనము చూచినచో నాకు మిగుల విచారము పొడముచున్నది. ఆమహాత్ముని "శివ" యను నామమును బ్రసంగవశమున నోటఁబలికినను మానవుల పాప జాలంబు పటాపంచలై తొలంగును. అతిక్రమింపరానిశాసనము గల మంగళనామకుఁడయిన యాశంకరునితో నమంగళుండవయిన నీవు ద్వేషించితివి. అక్కటా! ఎంతపనిచేసితివి. మతీయు బ్రహ్మానందరసమును మకరందమును గోరుమహాత్ములు తమచిత్తద్విశేషంబులచే నీశ్వరుని పాదపద్మముల సేవించుచుందురు. అతని పాదపద్మయుగళమును స్మరించిన యాచకులకోర్కు లన్నియుఁ దత్కాలమందె సఫలములగును. అట్టి మహానుభావుఁడయి విశ్వబంధువయిన శంకరునియందు నీవపరాధంబు గావించితివి. ఇది నీబుద్ధిహీనతను లోకమునకు వెలువరింపక మానదు. మతీయు నీశ్వరుఁడు పరేతభూమియందు వసించి, నస్థిభూషణుఁడయి జటాభారము ధరించి, భస్మమును ధరించి పిశాచములతోఁ గూడఁ జరించుచున్నాఁడని నీవు నిందించితివికాని బ్రహ్మాదిసురలెంతమాత్రము నట్లు నిందింపక తత్పాదపద్మపరాగమును శిరంబుచే ధరించుచున్నారు. ధర్మపరిపాలకుఁడయిన యీశ్వరుని దురాత్ముఁడు నిరంకుశుఁడై నిందించుచుండినచో నానింద్యావాక్యములు విన్నట్టి సుజనుండు వెంటనే కత్తిదీసికొని యాదురాత్ముని జిహ్వాను మొదలంటఁ 'గోయవలయును. అట్టి దుర్జనశిక్షయందు సమర్థుఁడుకానిచోఁ దానువెంటనే ప్రాణంబులు విడువ

వఱుపును. అందులకు సమర్థుండు కాఁడేని చెవులు చేతులతో మూసికొనుచు నా ప్రదేశమునుండి బయలువెడలి పోనలయును. నీవు దురాత్ముఁడవు శంకరు నిందించితివి. అట్టిమహాత్ముని నిందించినట్టినీజిహ్వ మొదలంటఁ గోసితీఱవలయును. కాని యందులకునాకుసామర్థ్యములేదు. మఱియు నీశ్వరధిక్కారముచేసిన నీతనువువలన నుత్పన్నమగు నీశరీరము ధరించి వర్తింపఁజాలను. కావున మూఢుఁడజ్ఞానవశమున నింద్యమయిన యన్నంబు దిని మిమ్మటుఁ బలివి వహించి తా భక్షించినయన్నమును గ్రక్కి పవిత్రుఁడయినచందమున నేనును నాపూర్వకర్మవశమున దురాత్ముండవయిన నీతనయనై జన్మించి తుచ్ఛమై నిందాపాత్రమై యున్న యీశరీరంబును విడిచి పవిత్రుఁడనయ్యెద. మఱియు వేదోక్తములయిన కర్మముల నాచరింపనివాఁడును, శ్మశానవాటి యందుఁ జరించువాఁడునగు నమంగళవిగ్రహుండయిన రుద్రుని నిందించిన తప్పేమి? అని శంకింపఁబనిలేదు. దేవతల కాకాశగమనంబును, మానవులకు భూతలగమనంబును స్వాభావికంబులయి యొప్పుచందమునఁ బ్రవృత్తిలక్షణమయినకర్మము రాగకారణంబనియు, నివృత్తిలక్షణరూపమయిన కర్మము వైరాగ్యకారణంబనియు వేదములు నిర్వచించుచున్నయవి. ప్రవృత్తిలక్షణములయిన కర్మములు సంసారులకు విహితములయినట్లు నివృత్తిలక్షణరూపములయినకర్మము లాత్మారాములయిన యోగిజనంబులకు విహితములు. కావున నట్టియోగిజనంబులు విధినిషేధరూపములయిన వేదములను, తద్విహితములయిన కర్మములు, ననుసరించిన యనుసరింపవచ్చు మానిన మానవచ్చు. అంతియకాని వానిని విడుచుటవలనఁ బ్రత్యవాయంబు గలుగదు.

వారలకు విహితములు నివృత్తిలక్షణరూపములయిన కర్మములే. ఇట్లుండఁ దనకు విహితములైన కృత్యములయందు నాదరంబు గలిగివర్తించు నీశ్వరునిఁ గ్రియాశూన్యుండని నిందించుట మహాపాతకంబు. మఱియు నివృత్తిలక్షణరూపములయిన కర్మములందు సక్తులమైన మావంటివారికి సంకల్పమాత్రంబున సంభవించుచున్న యణిమాద్యష్టసిద్ధులు ప్రవృత్తిలక్షణకర్మసక్తులయిన మీవంటివారికి లభింపనేరవు. ఒకవేళఁ బ్రవృత్తిరూపములగు కర్మములందాసక్తులయిన మావంటివారికి లభించునట్టి పదవులు నివృత్తికర్మాసక్తులకు మాత్రము లభించునా? యని ప్రశ్నింతువేని చెప్పెదవినుము. మీరు ప్రవృత్తికర్మాసక్తులయి సంపాదించినసిద్ధులు కుత్సితములయిన యాగాన్నములను భుజించువారలచేమాత్రమె నుతింపఁబడుచుండును. మఱియు నాసిద్ధులు సాధారణములయిన వికాని యుత్తమములు కావు. అట్టియుత్తమసిద్ధులు నివృత్తికర్మాసక్తులయిన మావంటివారలకుమాత్రమే లభించును. మాకుత్తమములయిన సిద్ధులే ప్రాప్తములగుచుండఁగా సాధారణసిద్ధులతో నేమి ప్రయోజనము? ఏమియులేదు. కావున సాధారణసిద్ధులు గలనీవధికసంపన్నుండవని మనంబున గర్వింపకుము. అణిమాదులయిన యుత్తమ సిద్ధులు గలయీశ్వరుని భస్మాస్థిధారణుండనియు నిరుపేదయనియుఁ దిరస్కరింపరాదు. మఱియు నట్టి మహానుభావుఁ డయినయీశ్వరుని నిందించిన నీకుమారిక ననుపించుకొనుటకు మనంబున సిగ్గు వొడముచుండెను. మహాత్ముల కపరాధము కావించినవారిదేహము కాల్పనా? మఱియు నీశ్వరుండు పరిహాసవాక్యము లాడునప్పుడు దక్షుని నూభవని పల్కినచో నాయవమానము నేనెట్లు సహింపఁగ

లుగుదును? అట్టియవమానమును సహించుటకంటెఁ జచ్చుట యె మేలుకాదా? కావున శవప్రాయమగు నీశరీరము విసర్జించుట మిగులయుక్తము." అనియిట్లు సతీదేవి దక్షుని నిందించి యుత్తరదిక్కునుబొంది మనస్సును నిరోధించి, స్థండిలమందు

సతీదేవి యోగాగ్నికల్పించుకొని ప్రాణంబులు విడుచుట

విస్తృతములయిన కుశలయందుఁగూర్చుండి యాచమనముచేసి పచ్చవస్త్రమును ధరించి, నేత్రములను నిమీలించి యోగమార్గముచేఁ బ్రాణంబుల విడువ నిశ్చయించె. అట్లుచేసి నిర్దుష్టురాలయి, శ్రమరహితయై, ప్రాణాపానవాయువుల నాయాస్థానంబులనుండి కదలించి నాభిస్థానమందుండు సమానముతోఁ సమకూర్చి పిమ్మట నుదానవాయువు నెగయించి యాయుదానవాయువును గంఠద్వారముగుండ లలాటమునొందించి శివుని పాదారవిందముల ధ్యానించుచుఁ, దనభర్తనుదక్కఁ నన్యంబును గాన నపేక్షింపక, మహాదేవునియంకస్థలంబున వసించి గౌరవమునందు చున్నదేహమును దండ్రియందలి వైరముచే భస్మీకరింపఁదలంచి యంగములయం దనిలాగ్నిధారణను ధరించెను. అందువలన యోగాగ్ని బయలువెడల, భర్తృపాదకమలధ్యానమున మత్తయై వర్తించుచున్నసతీదేవి పవిత్రమయినదేహమును భస్మము కావించెను. అంత సురశ్రేష్ఠుఁడయిన యీశ్వరునిభార్యయగు సతీదేవి దురాత్ముఁడయిన దక్షునిచే నవమానింపఁబడినదై యోగాగ్నిచే దేహము విడిచినదనెడి వాక్యములు హాహాకారములు భూమ్యాకాశంబులఁ గవ్వెను. మఱియు నెల్ల వారలును గుములుగాఁగూడి "అకటా!" యీదక్షునిచేర్జన్య మేమని చెప్పఁగలవారము. ఈదక్షుఁడు చరాచరవిశ్వమునంతను

గడుప్రేమతో నాదరింపవలసినది. అట్లుండఁగాఁ గడుపునపుట్టిన పిల్లను ప్రేమింపక తిరస్కరించినాఁడు. ఆమె దుష్టురాలేమో, యందువలనఁ దిరస్కరించియుండునని సుదేహింప నవసరము లేదు. ఆమహాత్మురాలిగుణములు, సత్ప్రవర్తనము, సుదారచిత్తము లోకమునం దెవరికిఁ గొనియాడఁదగినవికావు? అట్టియో గ్యురాలై తనతనూభవమైయున్న సతీదేవి నవమానించుట చేతను, భగవదాత్మకుఁడగు రుద్రుని ద్వేషించుటవలనను బ్రాహ్మణాధముఁడగు దక్షుఁడు దుష్కర్తిని నరకమును దప్పక పొందును."అని మాటలాడుకొనుచున్న సమయమున, సతీదేవికి సహాయభూతులయివచ్చిన రుద్రపార్షదులు సతీదేవి మరణము నుగాంచి దుఃఖముచెంది యచ్చటనున్నవారినందఱిని జంప యత్నించి తమతమాయుధంబులు హస్తములందుఁదాల్చి యుద్ధ మునకు సమకట్టిరి. ఆసమయమున వారలప్రయత్నమునుగాంచి భృగుమహాముని మహాకోపపూరితహృదయుండై, యింకనూ రకుండుట యుచితంబుకాదనితలంచి యాగసంహారకులను జంపు నిమిత్తము, దక్షిణాగ్నియం దభిచారహోమము కావించెను. అంతటఁ దపంబున సోమునిఁబొందిన ఋభునామకులగు దేవత లు వేలకొలఁది నుదయించి యజ్ఞశాలయందున్న కొఱవుల నాయుధములనుగాఁ గావించుకొని, యుద్ధసన్నద్ధులయియున్న రుద్రానుచరులను మర్దించి నలుదిక్కులకుఁ జెదరఁగొట్టిరి. ఇది నాల్గవయధ్యాయము.

అంతట నీశ్వరుండు నారదునివలనఁ దనభార్య యపమానిత యయి యోగాగ్నిచే భస్మీభూతయగుటయుఁ, దనయనుచరులు

ఋభునామక దేవతలచేతఁ బరాజితులగుటయు విన నతనిమనం
బున ననివార్యమగుకోపం బుదయించెను. అంతఁ గ్రమక్రమం
బున గ్రోధాగ్ని రవుల్కొని ప్రజ్వరిల్ల సహింపఁజాలక పెదవిగఱి
చుకొని విద్యుల్లతలవలెఁ బ్రకాశించునట్టి తనజటాభారములో

శంకరుఁడు తనజటను నేలనుగొట్టి వీరభద్రుని బుట్టించుట.

నున్న యొకజటనుద్రెంపి గంభీరనుగు సింహనాదము గావించుచు
భూమియందుఁగొట్టెను. అంత నజ్జటయందు సహస్రబాహుండు
ను, కాలమేఘచ్ఛాయను నిరసించు దేహకాంతిగలవాఁడును,
భయంకరములయిన కోఱపండ్లుకలవాఁడును, నాకాశమునంటు
చున్న దేహముగలవాఁడును, సూర్యునివలెఁ బ్రకాశించుచున్న
మూఁడునేత్రములుకలవాఁడును, వహ్నిసదృశములయిన కేశము
లుగలవాఁడును, కపాలమాలకలవాఁడునగు వీరభద్రుండు లోక
భయంకరంబుగా నుదయించి యీశ్వరునిచెంతకేగి సాష్టాంగ
దండప్రణామంబు గావించి వేయిచేతులను నొసట ఘటించి నా
చేయవలసినకార్యమును దెలుపుమనవుడు నతనికి రుద్రుం డిట్లని
యె. "ఓయీ! వీరభద్రా! నీవు నాప్రమథగణంబులకెల్ల నాథుండ
వై పోయి దక్షునియధ్వరంబును ధ్వంసముగావింపుము. బ్రాహ్మణ
తేజ మజేయమనిసందియపడననసరములేదు. నాయంశమువలన
సముద్భూతుండవయిన నీకెందు నెదురుండదు. పొమ్ము" అని
యిట్లు కోపావిష్టుండయిన రుద్రునిచే నాజ్ఞాపింపఁబడి తండ్రికిఁ
బ్రదక్షిణముచేసి నిరాటంకమగు వేగముచే బలిష్ఠుల తేజోబల
ములను దాను దనయనుచరులును సహింపఁగలరని తలంచెను.
అంత వీరభద్రుండు సింహనాదములు చేయుపార్శ్వదులచేఁ బరి
వేష్టింపఁబడి మిగుల భయంకరముగా ధ్వనిచేసి మృత్యువు నంత

ము నొందింపఁజాలు శూలమును ధరించి తన యలంకారము లు ధ్వనిచేయఁగా సైన్యఘోషంబులచే దిక్కులు నిండింపుచు, భూమిని గదలించుచు నధికమయిన యురవడితో దక్షాధ్వర భూమి కభిముఖుఁడై పోవుచుండె. అంత నచ్చట సభాసదు

లును, దక్షుఁడును, ఋత్విజులును, బ్రాహ్మణులును వారిభార్య లును నుత్తరదిక్కునుండి వచ్చుచున్న ధూళిపుంజమునుగాంచి చీఁకట్లని మొదట భావించుకొని యవి చీఁకట్లుకానని నిశ్చయిం చి ధూళీపటలంబుగా నెఱింగి, "యక్కటా! ఇట్టి ధూళిపటలం బు బయలుదేఱుటకుఁ గారణంబేమి? ఇవి వాయువులవలన నెగ యఁగొట్టఁబడిన ధూళులని భావించుటకు నిప్పుడు వాయువులు వీఁపలేదు. కావున నిది సమీరోద్ధూతధూళులయి యుండవు. కాని యీధూళులు చోరాదులవలనఁ గలిగినవేమో యన ప్రాచీనబర్హి రాజ్యమేలుచుండఁగాఁ జోరబాధ లెట్లు సంభవిం చును? గోగణధూళులేమో? యన నందుల కిది దగినసమయ ముకాదు. కల్పావసానమగుటచే నిట్లు ధూళులు బయలు వెడ లినవేమో?" యని తలపోయఁజొచ్చిరి. అంతఁ బ్రసూతిమొదల గు భూసురకాంతలు భయచిత్తలయి దక్షుఁడు తనకుమారికయ యిన సతీదేవికి నపకారముచేసి పాప మార్జించియున్నాఁడు. ఆపాపమే యిట్లు విపాకముచెందినది. పాపకర్మంబులు తత్ఫలం బు కుడుపకుండఁబోవునా? మఱియు సతీదేవికి నపకృతి యొన రించి యామెకుఁ బ్రియుండయిన రుద్రునకుఁ గోపము జనింపఁ జేసెను. ఆరుద్రుఁడన సామాన్యుఁడా? ఆతని మహామహిమను వర్ణింపనెవ్వరితరంబు? అతఁడు ప్రళయకాలమునందు నిశితమయి

న త్రిశూలాగ్రమునఁ జంపిన దిగ్గజములను గ్రుచ్చి యాయుధ ములతోఁగూడిన చేతులను మీఁదికెత్తి ధ్వజములవలెఁ బ్రకా శింపఁజేయుచు, భయంకరమయిన మేఘగర్జనమువలె సింహనా దంబులొనర్చి దిక్కులనన్నింటిని భేదించుచు నంతసముచే నృత్య ముచేయును. మఱియు మిక్కిలి భీకరమయిన దంష్ట్రాగ్రములచే నక్షత్రసమూహములనన్నింటిని నేల రాల్చుచు, సూర్యకాంతివ లె దుర్నిరీక్ష్యములయిన ప్రభాపుంజంబుల నంతట వ్యాపింపఁ జేయుచు, సకల చరాచర ప్రపంచమును సంహరించును. అట్లు సంహరింపఁ గారణభూతుఁడయినరుద్రుని మానసంబునఁ గ్రోధం బుపుట్టించిన బ్రహ్మకయినను మంగళంబులు గలుగునా? అట్లుం డఁ దక్కినవారలసంగతి చెప్పవలయునా?" అని యిట్లు వారు ప్రసంగించుచుండఁగా, స్థిరచిత్తుఁడయినను దక్షునకు భయావహ ములయిన యనేకదుర్నిమిత్తంబులు భూమ్యాకాశంబులఁ గాన వచ్చెఁ. ఆసమయంబున రుద్రానుచరులు నానావిధములయిన యాయుధంబులనుధరించి నానావిధవికృతాకారులయి, యజ్ఞశా

వీరభద్రాదులు దక్షాధ్వరమును ధ్వంసముచేయుట.

ల సొత్తెంచి యందందుఁ బరువులిడుచు, గొందఱు ప్రాగ్వంశం బును భగ్నముకావించిరి. మఱికొందఱు పత్నీశాలను భగ్నము కావించిరి. మఱికొందఱు యజ్ఞశాలామండపంబును దునుమాడి రి. ఒకకొంద ఱాగ్నీధ్రశాలను దహించిరి. కొందఱు భోజనశాల నగ్నికి నాహుతికావించిరి. కొందఱు యజ్ఞపాత్రములను జెక్క లుగావించిరి. కొందఱు హోమకుండములను జల్లార్చిరి. కొంద ఱు కుండములయందు మూత్రముకావించిరి. కొందఱు యజ్ఞ వేదికలను జెఱిచిరి. కొందఱు మునులను బాధించిరి. కొందఱు

మునిపత్నులను భయపఱిచిరి. కొందఱు వలాయితులగుచున్న దేవతలను వెంటఁ దఱిమిరి. అందు మణిమంతుఁడు భృగుమహా ముని బంధించెను. వీరభద్రుఁడు దక్షప్రజాపతిని, జండీశుఁడు సూర్యుని, నందీశ్వరుఁడు భగాఖ్యుఁడయిన దేవుని బంధించిరి. రుద్రపార్షదులచేఁ బాషాణవ్రాతంబులచే నొప్పింపఁబడి ఋత్విజులును దేవతలును సహింపలేక నలుదిక్కులకుఁ బరిఁడఁజొచ్చిరి. ఆసమయంబున మణిమంతుఁడు భృగుమహాముని శ్మశ్రువులు చేతఁ బట్టుకొని పూర్వము శంకరునిఁ బరిహసించినందువలనఁ గలిగిన కోపాగ్ని చల్లారునట్లు లూఁకఁ బెఱికెను. పిమ్మట వీరభద్రుఁడు కోపాతిశయముచే భగునిఁబట్టుకొని పూర్వము దక్షుఁ డీశ్వరుని నిందించుచున్నప్పు డతఁడు కనుసన్న చేసినందున నాతనికన్నుల నూడఁదీసెను. మఱియుఁ బూర్వము సూర్యుఁడు దక్షుఁ డీశ్వరుని నిందించుచున్నప్పుడు పండ్లు బయలుపడునట్లు నవ్వినందున నాతనిపండ్లూడఁగొట్టెను. పిమ్మట వీరభద్రుండు దక్షుని క్రిందఁ బడఁద్రోచి వక్షంబుత్రొక్కి ఖడ్గంబుచే శిరంబు ఖండింప నెన్ని వ్రేటులువేసినను ఛేదింపలేక శస్త్రాస్త్రములచే నెంతగొట్టినను జర్మమూడి రాకుండుటకు మిగుల నాశ్చర్యము చెందెను.ఇట్లు వీరభద్రుండు దక్షునిఁ జంప నుపాయంబులు వెదకుచుఁ దుద కతని యాగీయపశువువలెఁ జంప నిశ్చయించి ముందుగ గొంతుపిసికి ప్రాణంబులఁ బోఁగొట్టి శిరంబు ఛేదించెను. అట్లు లోకభీకరంబుగ విహరించి వీరభద్రుండు చేసినపని కెంతయు సంతసించి భూతంబులు నుతింపఁదొడంగె. అప్పుడు బ్రాహ్మణులందఱు పరిభూతులై శాపంబునీయఁదొడంగిరి. ఇట్లు వీరభద్రుండు దక్షుని యాగంబు ధ్వంసంబుకావించి దక్షునిశిరంబును దక్షిణాగ్ని

యందు హోమముచేసి తనకార్యము నెఱవేఱినందులకు సంత సించుచు సైన్యసమేతుండై కైలాసమునకుఁబోయెను. ఇది యైదవయధ్యాయము.

అంత దేవగణములు వీరభద్రాదులచే జయింపఁబడి భ యపడి శూలాద్యాయుధంబులచే ఛిన్నగాత్రులై తమ కధిపతి యైన బ్రహ్మయొద్దకుఁ బోయి నమస్కరించి జరిగినవృత్తాంత మంతయు విన్నవించిరి. 'ఓవిధాతా! దక్షాధ్వరము ధ్వంసమగున నియు, దేవతలు మునులు రుద్రానుచరులచేఁ దాడితులగుదురని యు నీవృత్తాంతమంతయు మునుమున్న తెలిసికొనియున్నవా రగుటచే నారాయణుండును, బ్రహ్మయు, దక్షాధ్వరంబు చూడ రారయిరి' అని యంతటదేవతలమొఱ నాలకించి బ్రహ్మ వారల కి ట్లనియె. "ఓయీ? మహామహిముఁడయిన యీశ్వరునికి శ్రేయ స్కామము లెవ్వరు నపరాధము చేయఁబూనుకొనరు. మఱియు నట్టివారితో విరోధముచేసినవారికిని క్షేమము గలుగదు. మీరం దఱు పాపాత్ములరని వచింపవలసి యున్నది. లేనిచో మహాదే వుఁడును, యాగభాగార్హుఁడు నగు నీశ్వరునికి యజ్ఞభాగంబు లేకుండఁ జేయుదురా? కావున మీరందఱ యొప్పుడయిన బుద్ధి తెచ్చుకొని యా యీశ్వరుని పాదకమలములపయిఁబడి యా తనియనుగ్రహమును సంపాదింపుఁడు. రుద్రుఁడన సామాన్య దేవునిఁగా భావింపకుఁడు. ఆమహామహుఁడు బొమముడి వెట్టినం తమాత్రముననే దిక్పాలసహితమయిన లోకమంతయు నశింప క మానదు. అతనికి మేమునయిత మొక్కొక్కప్పుడు భయ పడుచుందుము. అట్టిమహానుభావుండగు శంకరుండు దక్షుఁ డా

డిన పరుషవాక్యములచే మిగులఁ గలంకు చెందియున్నాఁడు. ప్రస్తుతము భార్యావియోగముచే నుతింత కలఁక చెందియున్నాఁడు. కావున నిప్పుడు మీరందఱుపోయి శంకరుని పాదములపైఁబడి మృదుమధురవాక్యములచే నాతనినిఁ బ్రసన్ననిగాఁ జేయుఁడు. మే మాతనిదరికిఁ బోవ్రుటకు భయపడుచున్నాము. నీవే యెట్లయినఁబోయి ప్రసన్ననిఁజేయుమందు రేని చెప్పెదవినుఁడు. అతనిఁ జూచినయందఱికి భయమే యుత్పన్నంబగుచుండు. అట్టి హాత్ముని తత్వమును, బలవీర్యములు, నిట్టివనివచింప నేను దగమ్ము ఇంద్రుండు వచింపలేఁడు; మీ రెఱుఁగనే యెఱుఁగరు. ముసీశ్వరులయిన నాతనితత్త్వము నెఱుంగఁజాలరు. తక్కినవార లెఱుఁగరని వేఱె చెప్పవలయునా? భగవంతుని యావేశావతారమైనట్టి రుద్రునిఁ బ్రసన్ననిగాఁ జేయ నెవ్వరితరంబు? కాన మాకెవ్వరికి వశముకాదు. మీరలే యాతనిపాదములకు నమస్కరించి యాతనియనుగ్రహము సంపాదింపవలసియున్నది. అయినను నేను గూడవచ్చెదరండు." అని బ్రహ్మ పలికి ప్రజాపతులతోను, మరాసీకములతోను గలిసి యాశంకరునికి నివాసభూతమయిన కైలాసమున కేగిరి. ఇట్లు బ్రహ్మాదిసురలు పోయిపోయి కైలాసంబును గన్నులార గాంచిరి. ఆకైలాసము సంతతము శివపంచాక్షర్యాదిమంత్రములను జపించి సిద్ధులయి దేవత్వమును బొందియున్న మహాత్ముల చేతను, కిన్నరగంధర్వుల చేతను, నచ్చరల చేతను సేవింపఁబడుచున్నది. గైరికాదిధాతువుల చేఁ జిత్రితమై రత్నమయములయి, పలువిధములగు లతల చేతను, జొంపములచేతను, నలంకరింపఁబడి, నానావిధములగు మృగసమూహముల చే సంయుతమై స్వచ్ఛమయిన నదీప్రవాహముల చేతను,

మనోహరములగు గుహలచేతను, సానువులచేతను సుందరముల గుదానిశిఖరములందు సిద్ధస్త్రీలు భర్తలతోఁగూడ విహరించు చుండిరి. ఆగిరియందు మయూరములు కేకాధ్వనులు చేయు చుండెను. మదించిన తుమ్మెదలు ఝంకారములు చేయుచుండెను. ఆగిరి మధురమగు కంఠధ్వని గలిగిన పికములయు, నితరపక్షులయు మధురధ్వనులచే కల్పవృక్షములశాఖలనెడి బాహువులచేఁ బక్షిజాలములను బిలుచుచున్నట్లు లుండెను. ఆది, నడగొండవలె నున్నగజంబులసంచారముచే సంచారము చేయుచున్నట్లు లుండెను. అది తనయందుఁ బ్రవహించుచున్న నదులధ్వనులచే మాటలాడుచున్నట్లు లుండెను. మఱియు నది మందారము మొదలగువృక్షములచేఁ బ్రకాశించు చుండెను; పారిజాతములచేతను, సరళవృక్షములచేతను విలసిల్లుచుండెను. అది తమాలవృక్షములచేతను, మద్దిచెట్లచేతను, దాడిచెట్లచేత ను, గోవిదారములచేతను, దెల్లమద్దిచెట్లచేతను, మావిచెట్లచే తను, గడిమిచెట్లచేతను, బున్నాగములచేతను, జంపకములచేత ను వెలయుచుండెను. అందుఁ బాటలవృక్షములు, నశోకములు ను, బొగడలును, గోరింటలును గలవు. ఆగిరిరాజమందు బంగా రపువన్నెగల పద్మములును, మల్లెలును, మాధవీలతిలును, బన లును, మెడిచెట్లును, రావి, జువ్వి, మఱ్ఱి, మొదలగుతరువులు ను, భూజపత్రవృక్షములు, పలువిధములగు నోషధులును, బోక లు, రాజపూగములు, నేరేళ్లు, ఖర్జూరములు, నంబాళవృక్ష ములు, దియ్యమావిళ్లును, వెదురుపొదలును, బొంగువెదుళ్లును నింక నితరములగు వృక్షజాతులును గలవు. మఱియు నటఁ దెల్ల గలువలు, నల్లఁగలువలు, నెఱ్ఱిగలువలును, బద్మములును, దా

మర లతలందు మధురముగా ధ్వనిచేయు పక్షిబృందంబులును గలవు. మఱియు నటఁ, గోతులును, వరాహములును, సింగములును, నెలుగులును, నేదుఁబందులును, గవయములును, శరభములును, బులులును, లేళ్లును, గాఱుదున్నలును, గోకర్ణమృగములును, నూర్ణామృగములును, నేకపదములును, నశ్వముఖములు నగు మృగములును, గస్తూరీమృగములును గలవు. అది రంభావృక్షములచే నావృతములగు బద్మాకరతీరములచేఁ బ్రకాశించుచుఁ, దానమాడినంతమాత్రమునఁ బుణ్యము గలిగించు జలములుగల గంగానదిచే విలసిల్లుచుండెను, ఇట్టి కైలాసమునుజూచి దేవతలు నిగుల నచ్చెరువొందిరి. మఱియు నచ్చట లోకాతిశాయియగు నలకాపురమును సౌగంధికవనమును బొడఁగాంచి నిగుల నానందము చెందిరి. ఆపురమునకు వెలుపట నంద, యలకనంద, యను రెండునదులు ప్రవహించుచుండును. ఆనదులు విష్ణుమూర్తి పాదాంభోజసంపర్కముచే నిగులఁ బవిత్రత చెందియున్నవి. దేవతలు విమానములపై నధిరోహించి విహరించి యలఁతచెందినప్పు డచ్చటికివచ్చి విహారశ్రమ పాయునట్లు భర్తలతోఁగూడ జలక్రీడ సలుపుచుందురు. అట్లు దేవతాస్త్రీలు జలక్రీడలు సలుపుటచే వారల శరీరములనంటుకొన్న హరిద్రకుంకుమాదులు కరఁగి యానదియందుఁ గలియుటచే నజ్జలము పీతవర్ణముకలదై యుండును. ఆయలకాపురము స్త్రీకదంబములతో వెలుగొందుచు, విద్యుల్లతలచేఁ బొలుపారు మేఘబృందమువలె నలరుచుండును. ఇట్టి యలకాపురమును, నదులను, సౌగంధికవనమును నతిక్రమించి, కొంతదూరముపోయి మనోహరములయిన తరుబృందంబులతో నిండి మధురముల

యిన పికశారికాదుల మధురరుతములచేఁ ముఖరితమగుచు, మద గజములచే నున్మూలింపఁబడిన తరుబృందములచే నలంకృతమై, పుణ్యజనుల మనోహరములయిన విహారములుకలదై, నవరత్న నిర్మితములయిన సోపానపరంపరలచే నుల్లసితమై, యొప్పుచున్న యుద్యానవనమును గాంచి తదీయరామణీయకంబున కచ్చెరువ డుచు నచ్చటిసమీపమునన్న వటవృక్షమును గాంచిరి. ఆవట వృక్షము శతయోజనముల పొడవుకలదై, డెబ్బదియైదు యోజ నముల పొడవుగల శాఖలచే నలుదిక్కులకు వ్యాపించినదై, నానావిధములయిన పక్షుల కులాయములు లేక సాంద్రతమ చ్ఛాయాదాయకంబయి ప్రకాశించుచుండె. మహాయోగనిష్ఠు లగు పురుషుల కాధారంబయి, ముముక్షువులకు స్థానంబయి యున్న యా వటతరువుమూలంబున నధివసించి శాంతవిగ్రహు లును మహాసిద్ధులునగు సునందాదులచే నుపాసితుండగుచు, నసూయ లేక, శాంతుండయి, సాపరాధులయినను దేవ తలయందు దయాళువై, గుహ్యకులకుఁ బతియును, తనస్నేహి తుఁడును నగుకుబేరునిచే సేవితుండై, జ్ఞానకర్మయోగంబులతో నలరుమార్గ మవలంబించి సమస్తలోకములకును మంగళంబులు గావింప మదినూహింపుచు, సంధ్యాకాలమేఘంబులఁ బురు డించు మైపూఁతకలవాఁడై, తాపసుల యభీష్టంబుల నెఱవేర్చు చు, చంద్రరేఖాధారియై, దండజటాజినంబులఁ దాల్చి దర్భాసనా సీనుండై, తన్నడుగుచున్న నారదుని ప్రశ్నములకు సాధువులు విని సంతసించున ట్లుత్తరంబులిచ్చుచు, వామపాదమును గుడి తొడపై నిడికొని యెడమబాహువునందు నెడమబాహువునుంచి, దక్షిణహస్తము మించేతియం దక్షమాలనుధరించి, మహనీయ

మయిన *తర్కముద్ర ననలంబించి, బ్రహ్మానందరసాస్వాదుండై సమాధియోగము నవలంబించియున్న యోగిశ్రేష్ఠుండయిన

---

* తర్కముద్రయనఁగా శ్లో॥ తర్జన్యంగుష్ఠయోర్మధ్యే మిథస్సంయోజ్య చాంగుళీ। ప్రసార్యబోధనం ప్రాహుస్తర్కముద్రేతిమాంత్రికాః॥ అర్థము. చూపుడువ్రేలియొక్కయు నంగుష్ఠముయొక్కయు మధ్యభాగములను గలిపి తక్కినవ్రేళ్లను ప్రసారించుట తర్కముద్రయనఁబడును.

ఓయీ! రుద్రుఁడు జీవవిశేషుఁడుకాని భగవంతుఁడుకాఁడు. అట్లుండ నతఁడు సమస్తప్రపంచమునకు నాత్మయగుటయు, జగత్తతనికి శరీరమగుటయు నెట్లు? అతికష్టముచే సడిసంభవించినను శరీరవాచకపదమునకు శరీరివాచకముతో సామానాధికరణ్య మంగీకరించుటయెట్లు? అని శంకింపఁబనిలేదు. ఇట జీవవిశేషుఁడయినరుద్రుఁడాత్మయయి యుండుననియుఁ, బ్రపంచమతనికి శరీరమనియుఁ జెప్పలేదు. బ్రహ్మవిదులు ప్రసంగించునప్పుడు "నేను" "నీవు" అనుశబ్దములును, "నేను" "నీవు" అనెడి బుద్ధులును, వారియంతరాత్మయై యున్న పరబ్రహ్మమునందుఁ బర్యవసన్నములగుచుండు. ఈయర్థమే. "తద్ధ్యేతత్పశ్యన్నృషిర్వామదేవః ప్రతిపేదే, అహంమనురభవం సూర్యశ్చాహమ్మీవాగ్ నృషిర్విప్రశాస్మి। త్వంవా అహమస్మి భగవోదేవతే అహంద్యౌరహమస్మి భగవోదేవతే తద్యోఽహం యోసావసావహం।అహం హరిస్సర్వమిదం జనార్దనః" ఇత్యాదులగు వేదవాక్యములందుఁ బ్రతీయమానమగుచున్నది. మఱియు నిక్కడ స్తోత్రముచేయుచున్న బ్రహ్మ బ్రహ్మవిదులలో శ్రేష్ఠుఁడు కావున నతనిచే బ్రయోగింపఁబడిన "నేను" "నీవు" అనుశబ్దములును దదభిప్రాయములును బ్రహ్మయందుఁ బర్యవసించుచుండును. ఇటరుద్రుఁడు భగవంతునికి శరీరమగుచున్నాఁడుకాన శరీరవాచియగు రుద్రశబ్దమునకు నతనియం దంతరాత్మయై శరీరియైయున్న బ్రహ్మశబ్దమునకును సామానాధికరణ్యము చెప్పుకొనవలెను. మఱియు నిట రుద్రశబ్దమున కర్థము రుద్రుఁడు శరీరముగాఁగల పరబ్రహ్మమని గ్రహించి రుద్రునికిఁ జేయుస్తోత్రములు తన్నిష్ఠమగు పరబ్రహ్మమునకే చెల్లునని గ్రహింపవలయును.

యీశ్వరునిగాంచి లోకపాలాదిదేవతలు బద్ధాంజలులై యత
ని కభిఁవందనములు చేసిరి. అంత నీశ్వరుండు వచ్చుచున్న బ్ర
హ్మనుగాంచి యతండు హరివలెనే తనకు వందనీయుఁడు కావున
సరభసంబునలేచి యెదురుసని నమస్కరించెను. అనంతరము
శంకరునిం బరివేష్టించియున్న సిద్ధులందఱును బ్రహ్మకు నమస్క
రించిరి. అప్పుడు బ్రహ్మ శంకరాదులచే గౌరవింపఁబడి యుచితా
సనమునఁ గూర్చుండి శంకరున కిట్లనియె.

బ్రహ్మాదులు దక్షిణామూర్తిరూపుఁడగు నీశ్వరుని స్తుతించుట.

ఓ శంకరా! నీవు చిద్రూపకము నచిద్రూపకమునగు ప్రపం
చకమునకుఁ గారణబీజభూతములయి యున్న త్రిగుణాత్మక
యగు ప్రకృతికంటెను, జీవునికంటెను విలక్షణుఁడవు, సమ స్త
కల్యాణగుణస్వరూపుఁడగుటచే నేకరూపుఁడైన నారాయణుని
యావేశావతారమవని యెఱుంగుదును. అట్టి భగవంతుని యా
వేశావతారమవుకనుకనే నీవు చిదచిదాత్మక ప్రపంచస్వరూ
పుఁడవయి సాలెపురుగువలెఁ బ్రపంచమును సృజించుచున్నావు.
రక్షించుచున్నావు. తిరిగి లయమును బొందించుచున్నావు. మ
ఱియు నీవు ధర్మముల నన్నింటి నాయామమర్యాదలయందు నిలు
పుచున్నావు. బ్రాహ్మణాదులందఱు తత్తద్వర్ణాశ్రమములకు
విహితములయిన కృత్యము లొనరించి వర్తించుట నీవలననే
కదా? నీ వట్టియాజ్ఞ యీయని చో వార లట్లాచరింపకయే
యుందురు. మఱియు నీవు లోకమునందు మంగళకర్మము
లాచరించువారికి మంగళముల నొసంగుచుందువు. అట్టివార
లకు నీవు స్వర్గాదిసుఖములను మోక్షము నొసంగుచుందు
వు అమంగళములయిన కర్మముల నాచరించినవారికి నీవె

ప్పు డెట్టిసుఖమును గలుగనీయక నరకముల సంభవింపఁ జేయు దువు. ఓదేవా? నీ పాదారవిందములందుఁ దమచిత్తంబులం బొందుపఱిచి, సమస్తభూతములను బరమాత్మయందు వేఱు గాఁ దలంపక, వర్తించుమహాత్ములందు నీకు మూర్ఖులయందు వలెనే క్రోధంబు జనింపదు. నిరుపమానమయిన కరుణారసంబు గలవాఁడవు. కనుక నీవు భేదబుద్ధులై దుష్టమైనచిత్తములు కలవారలై దుర్భాషలనెడి బాణములచేఁ బరుల మర్మస్థానము లను భేదించుచు దైవమువలనఁ జావుకలిగియున్న వారియెడ లనుగూడఁ బ్రేమయుతుండవయి వర్తించుట యుక్తము. మఱియు లోకములో సాధువు లెవ్వరో యసాధువు లెవ్వరో చక్కఁగ నోజించి వారలయందు దయారసము చిలుకఁదగిన వాఁడవు. కొందఱు లోకములో సాధువులైనను, నారాయణు నిమాయచే మోహితులై దుష్టచిత్తులై భేదబుద్ధి గలవారల యి యున్నచో నట్టి యపరాధులు నీకు దయనీయులు. వారలు మాయామోహితచిత్తులు కావున దుష్టకార్యంబు లాచరించి యుందురు. కానిచో వార లట్టికర్మంబు లాచరించియుండరు. కావున సాపరాధులైనను సాధుజనుల ననుగ్రహింప సమర్థుం డవు. ఓదేవా? యజ్ఞభాగార్హుండ వయిననీకు యజ్ఞభాగంబు నీయకుండుట యింతేనియు యుక్తముగాదు. లోకప్రధానుఁడ వయిననీ కట్టి యపరాధము చేసియుండుటచేతనే దక్షునియజ్ఞ ము నెఱవేఱినదికాదు. కావున నీవు దక్షాదుల ననుగ్రహించి యీదక్షుని యాగంబును బునరుద్ధారంబుగావించి యతని బ్రతికింపుము. మఱియు నీ యనుచరులచే భగుని నేత్రంబు లూడఁబెఱికఁబడియె ! వాని నిప్పింపుము. సూర్యునిదంతము లూ

ఱగొట్టఁబడియె. వానిఁ దిరుగ వచ్చునట్లు చేయుము. భృగునిశ్మశ్రువు లాకర్షింపఁబడియె. వాని మరల మొలచునట్లు చేయుము. ఋత్విజులందఱు మర్దింపఁబడి భగ్నాంగులైరి. కావున వారల ననుగ్రహించి సంపూర్ణాంగులఁగాఁ గావింపుము. దేవఋత్విక్సమూహమునకు నారోగ్యంబు ప్రసాదింపుము. యాగపరిపూర్తికి హేతుభూతమయిన నీయాగభాగంబు నీ కగుఁగాక' అనెను. ఇది యూఁబవయధ్యాయము.

అని యిట్లు చతురాననుఁడు సంస్తుతింప నీశ్వరుఁడు మంద హాసముచేయుచు, బ్రహ్మకిట్లనియె. 'ఓ కమలాసనా! నీవన్నమాట సత్యమే. నేను హరిమాయచే మోహితులైన వారొనరించిన యపరాధములను నపరాధములనుగాఁ బరిగణింపను. మఱియు దుష్టులను ఖండించుటయు, సుజనులను రక్షించుటయు ధర్మము. కావున దుష్టాత్ములను దగునట్లు శిక్షించుచుందును. నీవాక్యము

శివుఁడు దక్షాదుల ననుగ్రహించుట.

ప్రకారమున నడుచుట నాకుఁ గర్తవ్యంబు. కావున దక్షాదుల ననుగ్రహించెద. దక్షునిశిరంబు దగ్ధమైయున్నది. అందువలన నతనికి మేషముఖం బగుఁగాక. భగుఁడు యజ్ఞసంబంధమయిన భాగమును మిత్రునినేత్రంబులచేఁ జూచుఁగాక, సూర్యునికి దంతములు మగుడ నుద్భవించుఁగాక. తక్కిన దేవతలందఱు నాకుఁ దిరిగి యజ్ఞభాగంబుల నర్పించిరి. కావున వారలు సర్వాంగులై వర్తింతురు. ఖండితాంగులైన ఋత్విజులందఱు సూర్యకిరణములచేతను, దేవవైద్యులగు నశ్వినీదేవతలచేతను నుత్పన్నావయవులై వర్తింతురు. భృగునిశ్మశ్రువు లున్నూలిం

పఁబడినవి. కాన నిఁకమీఁద నతఁడుమేషశ్మశ్రువులు కలవాఁడై తిరుగుఁగాక'అని యిట్లు శివుండు పలుక విని నను స్తభూతంబులు ను మిగుల సంతసించి " మేలుమేలు " అన్న వాక్యంబు లంతటం బల్వెను. పిమ్మట నీశ్వరుండు దేవేంద్రాది సురలును, సార చాదిమహామునులును, జతురాననుండును దన్ను వెంబడించి వచ్చుచుండఁగాఁ దాను దక్షాధ్వరప్రదేశంబున కభిముఖుఁడై పోయె. అంత శంకరుని శాసనంబుచొప్పున దేవతలును, మును లు, ఋత్విజులు మొదలగువారందఱు సంపూర్ణాంగులై ప్రకా శించిరి. ఆసమయంబున దక్షుండు మేషముఖుండై నిద్రచెందిన వాఁడు లేచినవిధంబున లేచి కళ్లెదుటఁ బ్రకాశించుచున్న శంక రునిం గాంచె. అట్లు కన్నంతమాత్రమునఁగలుషవంతమై యున్న దక్షునిచిత్తము శరత్కాలమందలి సరస్సునలె నతినిర్మలమయి యొప్పె.అంత దక్షునికి నీశ్వరునియందున్న ద్వేషమంతయు నశిం చినందునఁ బూర్వ మీశ్వరధిక్కారము చేసినందులకు మిగుల విచారించి శంకరుని నుతింపఁదలంచి తా నొనర్చిన యవమానం బుచే నశించిన తనయనుంగుకూఁతుకై మిగుల విలపించి యా మెయం దున్నయనురాగాతిశయముచేఁ గన్నులనుండి వెడలి వచ్చుచున్న బాష్పము నతికష్టముచే నిరోధించి దుఃఖము నాపి కొని, హృదయంబు పడిలపఱుచుకొని ప్రేమాతిరేకవిహ్వల మయిన మానసము కలవాఁడయి శంకరు నిట్లు వినుతింపఁదొ

శంకరుని దక్షుఁడునుతించుట

డంగె."ఓదేవా!నీ కపరాధము కావించినందులకు నీవుచేసిన దం డనమునకు మిగుల సంతసించితి. ఆదండన నాపాలిట రక్షణయే కాని దండనకాదు. అందులకు నేను మిగుల సంతసించుచున్నా

ను. నీవును, నారాయణుండును బ్రహ్మహత్యలైన దుర్మార్గులనై నను నుపేక్షింపక మంచిమార్గంబునకుఁ గొనివత్తురని చెప్ప నొప్పనప్పుడు చెడుమార్గము నవలంబించుచున్నవారిని మంచి మార్గమునందుఁ బ్రవేశ పెట్టుదురని వేఱె చెప్పవలయునా? అం దువలన దురాత్ముండనై నీతో ద్వేషించి దుష్టపథంబు త్రొక్కు చున్న నన్ను గ్రక్కున సన్మార్గప్రవిష్టుఁ గావించితివి. మఱియు మీ రిరువురును బ్రహ్మయు నాదియందు లోకోపకారము నిమిత్త ము వరవిద్యాతపోవ్రతములచే నొప్పునట్టి బ్రాహ్మణుల సృజించి వారలను దద్వర్ణోచిత ధర్మముల నాచరించునట్లు చేయుచు, వారల కాపదలు ప్రాప్తించునప్పుడు వానిని దొలంగించుచుఁ, బశుపాలకుఁడు సాపరాధములయిన గోవులను శిక్షించుచు, మర లవానిని ఘాసాదికముచే మన్నించుచుండునట్లు సాపరాధులయిన వారిని శిక్షించి మంచిమార్గమందుఁ బ్రవేశింపఁజేసి కాపాడు చుండుమరు. కావున నే నీవు నాఁడు బ్రహ్మసభయందుఁ దత్త్వజ్ఞా నము నెఱుంగనట్టి నేను సిన్నఁ దృణీకరించి దుర్భాషలనెడి బా ణపరంపరచే నొప్పించి పూజ్యతముఁడ వయిన నిన్ను నిందించి తిని. తన్నిందాజనితపాపము నన్నధోలోకములకుఁ ద్రోయుచుం డ దయార్ద్రహృదయుండ వగునీవు నాచేసినయపరాధమును మ ఱచిపోయిరక్షించితివి. ఉత్తమచారిత్రుండవయిన నీకు వందనము లు గావించుచుందును.నన్నుఁబరిపూర్ణదయారసంబుతోఁ గనుఁ గొనుము." అని యిట్లు దక్షుఁడు శంకరుని నుతించి యతని ద యారసంబునకుఁ గుదురై బ్రహ్మ యనుమతినిబడసి ఋత్విక్కు లతోను, నుపాధ్యాయులతోను గూడి తిరిగి యాగము నొన రింపఁ బ్రారంభించెను. అట్లు దక్షుఁడు వెండియుఁ గ్రతువు నా

రంభించి నిర్వర్తించుచుండఁ గొందఱు బ్రాహ్మణోత్తము లా యాగము నిరంతరాయంబుగాఁ బరిసమాప్తి పొందుటకుఁగాను, విష్ణుదేవతాకమైన పురోడాశమును సిద్ధము కావించిరి. అంత దక్షుండు భక్తిసమేతచిత్తుండై యాపురోడాశమునుగొని యధ్వర్యుండయిన భృగుమహాముని తోఁగూడి నారాయణమూర్తి నుద్దేశించి హోమము కావించెను. ఆసమయంబున నారాయణుండు తనకాంతిసంతానములచే దశదిశల నావరించుచుఁ, దేజశ్శాలియగు గరుత్మంతునిపై నధివసించి, భానుబింబసదృశమైన కిరీటముచేతను, సువర్ణమయమయిన సూత్రముచేతను, మధుకరంబుల నిరసించు నెఱికురులచేతను, మకరకుండలములచేతను,సుందరమగు వదనారవిందముతోఁ, హస్తములయందు శంఖము చక్రము, పద్మము, బాణములు, చాపములు మొదలగు సాధనంబుల ధరించినవాఁడై, శ్రీవత్సనవమాలలచే వక్షస్థలంబు ప్రకాశింపఁ గొందఱు రాజహంసములవలె నొప్పారు విజామరలఁ బట్టి వీచుచుండఁ, గొందఱు నిండుచందురునిచందంబున నందమైన యాతపత్రంబునుబట్టి వెంటవచ్చుచుండఁ గరుణావలోకనములచే లోకమునెల్ల సంతసింపఁ జేయుచు, దక్షుని యజ్ఞవాటిక నావిర్భవించెను.

నారాయణుండు దక్షాధ్వరంబునకు వచ్చుట.

అట్లు వచ్చిననారాయణమూర్తిని గాంచి సురబృందంబులును, మునిబృందంబులును జయ్యనలేచి యతనిపాదారవిందంబుల కభివందనము లాచరించిరి. పిమ్మట వారందఱును నారాయణుని కాంతిసంతానముచేఁ దిరస్కృతమయిన దేహకాంతికలవారై నిటలఘటితకరతలులై నిలువంబడిరి. ఇట్లు కొంతవడి

నూరకుండి బ్రహ్మాదిదేవతలందఱును భగవంతుని ప్రసన్నవిగ్ర
హమును బొడఁగాంచి తమతమ మానసంబులకుఁ దోఁచినట్లు
నుతింపఁదొడఁగిరి. అందు దక్షుండు ముందుగాఁ బూజాద్రవ్యం
బులఁగొని లోకనాయకుఁడును, యజ్ఞస్వరూపుఁడును, సునందనం
దాదులగు నిత్యసూరులచేఁ బరివృతుండును, నగు నారాయణున
కర్పించి యిట్లు నుతింపఁదొడఁగె. 'ఓదేవా! నీవు స్వస్వరూప
ము నొందియున్నప్పుడు మాయను దిరస్కరించి రాగాదులయిన
మనోవృత్తులను దొలఁగించికొని విముక్తుండవై, యద్వితీయుం
డవై, సంసారభయనివర్తకుండవై యుందువు. మఱియు నీవు
మాయను బురస్కరించికొని లీలామానుషరూపంబుల నంగీక
రించుచు, స్వతంత్రుండవయ్యును, మాయాపరతంత్రుండవైన
ట్లును, రాగాదులు లేనివాఁడవయ్యు, రాగాదియుక్తులైన రాను
కృష్ణాదులుగాఁ గానవచ్చుచుందువు. నీవు లోకంబులకెల్ల నీశ్వ
రుండవు.| బ్రహ్మరుద్రాదులయిన సురలందఱును నీమాయావిభూ
తు లగుటంబట్టి వారు లోకమునకుఁ బ్రభవులుకారు. మఱియు
బ్రహ్మాదులందఱును జరాచరాదిజంతువులును భవద్రూపంబులే.
జగంబున భవద్వ్యతిరిక్తంబయినవస్తు మఱియొక్కండుగానరాదు. అట్టినీకు వందనంబు లాచరించుచున్నాను. నన్నుఁ గరుణింపు'
మని మ్రొక్కి దక్షుం డూరకుండె. అంత ఋత్విజులందఱు నా
విష్ణువు నిట్లునుతించిరి. 'ఓదేవోత్తమా! ఓపుణ్యపరహితా!
మేము నందికేశ్వరశాపపీడితులమైన కారణంబునఁ గర్మముల
యందు దురాగ్రహచిత్తులమై వర్తించుచు నీయాథార్థ్యము నె
ఱుంగఁజాలము. త్రిగుణానుసారముగా వేదప్రతిపాదితములగు
ధర్మములుగల యాగాదికర్మము లాచరించుచుండుము. ఆయ

జ్ఞాదికర్మములయం దింద్రాదిదేవతారూపములఁ బొంది వర్తించువాఁడవు నీవేయని, మామనంబుల ధ్యానించి నమస్కరించుచుందు' మని పల్కి నమస్కారంబులు గావించిరి. అంత సభాసదులందఱు నారాయణుని యడుగుఁదమ్ములకు మ్రొక్కి యిట్లు నుతించిరి. "ఓభువనశరణ్యా! ఓక్షేమంకరా! మేము సంసారమనెడి మార్గంబునంబడి తిరుగుచున్నారము. ఈ సంసారమార్గమందు విశ్రాంతి నొసంగునట్టి యొక్కసృష్టిమైనను గానరాదు; భయంకరమయిన కష్టములనెడి దుర్గమస్థానంబులతో నొప్పుచుండును ఈసంసారమార్గమందు వర్తించువారిని మృత్యువను భయంకరపన్నగం బొకటి దఱుముచుండును. మన్మథుఁడను తస్కరుండు చిరకాలమునుండి సంపాదించికొని తెచ్చికొనుచున్న జ్ఞానధనమును దొంగలించుచుండును. దుర్గిఖములనెడి దావాగ్నిజ్వాలలు శరీరమును దహించుచుండును. మఱియుఁ బూర్వార్జితపాపకర్మములనెడి శార్దూలములు పొదలచాటునఁ బొంచియుండి మ్రింగుటకుఁ జూచుచున్నవి. ఆశలనెడి మృగతృష్ణలు మాకు భ్రాంతిని గలిగించి మామనంబులఁ దమవంక కాకర్షించుకొనుచుండును. దుర్జనులనెడి క్రూరమృగంబు లడుగడుగునకు బాధించుచుండును. అఖిలద్వంద్వంబులనెడిగర్తలు మిక్కుటంబుగా నున్నందున నడుచుట మిగుల దుస్సాధంబయియున్నది. ఇట్టి కష్టములతో నిండిన సంసారమార్గమున వర్తించుచున్న మాకుఁ గల్పవృక్షమూలమువలె విశ్రాంతిదాయకము లయిననీపాదపద్మముల నాశ్రయించుట మా కెప్పుడు లభించునోకదా! ఓదేవా! మమ్ము ననుగ్రహించి యీబాధలనుండి తొలంగించి రక్షింపవేఁడుచున్నాము. నీపాదంబుల కిదె నమస్కారంబు గావిం

చుచున్నారము.|"అనినుతించి యూరకుండిగి. అంత శ్రేమంకరుం డయినశంకరుండు నారాయణునకు నమస్కరించి యిట్లునుతిం పదొండంగె. "ఓదేవా! నీపాదంబులకు వందనము లాచరించు చున్నాను. సమస్తయోగిబృందములచే వందనీయములయిన నీపా దారవిందములను డెందమున సంస్మరించుచుందును.ఓభగవంతా! సర్వదా నీచరణకమలధ్యానంబుతోో నున్న నన్నుఁజూచి మూ ఢులు కొందఱు "వీడు దురాచారుడనియు, గర్మశూన్యుఁ డనియు, నమంగళుడనియు నిందించుచుందురు. అట్లు వారు నిం దించినను నేమనంబున సుంతేనియుఁ గలఁతఁ జెందక సంతతంబు నిన్నే స్మరించుచుందును." అనిపలికి యూరకుండె. అంత భృగు మహాముని నారాయణునిపాదంబుల కభివందనంబులు గావించి యిట్లనియె. "ఓదేవా! బ్రహ్మాది జీవులుఁడఱు నీమాయచేఁ దిర స్కృతులై యాత్మజ్ఞానము లేనివారలై, తమనికార్యములయిన జన్మజరామరణాదులతోో నిండియున్న సంసారమందుఁ బ్రవర్తిం చుచున్నారు. కాని యంతరాత్మవై జీవులయం దెల్లప్పుడు నివ సించుచున్న నీస్వరూపమును దెలియఁజాలరు. అట్టిబ్రహ్మాదులే భవదీయమాయామోహితులయి నీస్వరూపమును దెలిసికోలేన ప్పుడు మావంటియల్పులా తెలిసికొనఁగలరు? నీ కిదిగో నమ స్కారములఁ గావించుచున్నాను. నీవు ప్రణతార్తిహరుఁడవు కావునఁ బ్రణతుఁడనైన నాబాధలను దొలంగింపుము. మా నంటినదల ననుగ్రహింపు"మని నుతించి యూరకుండె. అనంతర ము కమలాసనుండు నారాయణున కిట్లనియె. "ఓభగవంతా! నీ పాదంబులకు వందనము లాచరించుచున్నాను. ఓమహానుభా వా! నీరూపము వాఙ్మానసగోచరమే యయిన నీజీవపదార్థభేద

మును గ్రహించుచున్న చక్షురాదీంద్రియములచేత సాక్షాత్కారము చేసికొనలేరు. అట్లుకనుఁగొనలేమికిఁ గారణమేమియో తెల్పెదను. అవధరింపుము. ఇంద్రియములకును, శబ్దాదివిషయములకునుఁ గారణభూతుండవును, సత్త్వాదిసద్గుణంబులకును నిలయభూతుండవు సగుసీవు మాయాపరిణామరూపములయిన దేహములకంటెను, నాదేహాదిసంబంధము గలిగి వర్తించు జీవకోటులకంటెను మిక్కిలి విలక్షణుండవయి వర్తించుచున్నావు. ఆకారణంబువలనఁజేసి నీస్వరూపంబు ప్రాకృతంబుకాదు అప్రాకృతమయిన నీస్వరూపమును ప్రాకృతమైన చక్షురాదీంద్రియంబుల మెట్టుగా గ్రహింపఁగలదు ? కావున నీస్వరూపంబు నెఱుఁగఁజాలనిమాయందను గ్రహించి నీస్వస్వరూపంబును గనుపఱుపునట్లుచేసి మమ్మును గృతార్థులం గావింపుము". అని కులాసనుండు నుతించి యూరకుండ నింద్రుండు మెల్లమెల్లన నారాయణునకు కేఁగుదెంచి నమస్కరించి యిట్లనియె. "ఓసర్వేశ్వరా! నీనిశ్చేగమనంబు లోకమునకెల్ల సుఖముఁ గలిగించుచున్నది. ఆనీస్వరూపమును జూచినంతమాత్రమునఁనే నామనస్సునేత్రములు నమితానందము నొందుచున్నవి. ఆయుగయుగములం దవతరించి దురాత్ములయిన దానవసమూహమును సంహరించి భక్తసంతోషణము చేయుచున్నసీకు గష్టములనఁగా దీర్ఘములయియున్న యెనిమిదిబాహువులు కలిగియుండుట యెంతయుఁ దగియున్నది." అనియిట్లుపలికి మిన్నకుండ నంత మునిపత్నులందఱు నేతెంచి నారాయణునకు మ్రొక్కియిట్లనిరి. "ఓదేవా! ఈయజ్ఞములు భవదారాధనరూపములేకదా! ఇట్టియజ్ఞము పూర్వకాలమున బ్రహ్మచే సృజింపఁబడినది. అట్టియజ్ఞము దక్షుఁ

డుచేయుటకుఁ బ్రారంభించేఁగాని శంకరుం డాగ్రహంబున దాని ధ్వంసముకావించె. పవిత్రమయియుండుయాగశాల శవములచే నిండి శ్మశానమువలె నపవిత్రమయియున్నది. ఈయపవిత్రభూమిని భావనములయిన నీచూపులచేఁజూచి పవిత్రీకరింపుము." అని నుతించి యూరకుండఁగా నంత ఋషీశ్వరులరుదెంచి నమస్కరించి యిట్లనిరి. "ఓదేవా! లోకములఁ బండితులు తాఁజేసికొన్న పుణ్యపాపకర్మములను గానుభవింపనిలయునని చెప్పుచుందురు. ఇట్లుండ నీవు పుణ్యపాపరూపములగు సజాతీయకర్మముల నాచరించుచున్నను, వత్ఫల మనుభవింపలేదు. ఇది మిగులఁ జిత్రముగాఁ గన్పడుచున్నది. మఱియు బ్రహ్మాది సురలందఱు నే లక్ష్మీదేవి యనుగ్రహమును బడయుటకై సంతత మారాధించియుఁ దదనుగ్రహము నొందలేకున్నారో యాలక్ష్మీదేవి నీయనుగ్రహమును సంపాదింప మిగులఁ బ్రయత్నించుచున్నదై నిన్ననవరత మనుసరించుచున్నదై యుండియు నీయనుగ్రహముం బడయఁజాలకయున్నది. దేవా! బ్రహ్మాదిసేవితయగులక్ష్మీదేవి నీయనుగ్రహము సంపాదింప లేకున్నప్పుడు మావంటివారలసుగతి ప్రత్యేకముగా నుడువనేల? అట్టిసర్వసద్గుణపరిపూర్ణుడవయిననీకు నమస్కారంబు లర్పించుచున్నా" మని విరమించిరి. అంత సిద్ధులరుదెంచి భగవంతుని యడుగుఁదమ్ములకు మ్రొక్కిక్ యిట్లనిరి. "ఓదీనబంధూ! ఓకరుణాసింధూ! మాచిత్తములనెడు మదపుటేనుఁగులు సంసారమనెడి యరణ్యములయందు విహరించుచు నచ్చట నాధ్యాత్మికాది తాపత్రయమనెడి దావాగ్నిచే బాధింపఁబడి యాబాధ నోర్వలేక నీసత్కథయనెడి యమృతనదియందు నోలలాడుచు నాబాధలను దొలం

గించుకొనుచు నందుండి పైకి రాలేకున్నవి. నీకథామృతము నే మని వర్ణింపఁగలుగుదుము? త్వత్కథాసక్తుఁడయినవాఁడు ముక్తుఁడవలె నపరిమితానందమును జెందును."అనిపలికి యూరకుండిరి. అనంతరము దక్షునిభార్యయగు ప్రసూతి చేతులుజోడించి దేవునకి నమస్కరించి యిట్లనియె. "ఓదేవా! మాయాగసీమకు నీవరు దెంచుట మాపూర్వపుణ్యాంబును వెలువరింపక మానదు. మేము చిరకాలము కృతార్థులమయితిమి. శవములచేనిండి యపవిత్రమయిన మాయజ్ఞవాటికి నీరాకచే బవిత్రమయినది. మాయందనుగ్రహాంగించుటకు వేఁడుచున్నాము. ఓలోకాధీశా! నీవులేని చో యజ్ఞము శిరోహీనమయిన శరీరమువలె సుంతేనియుఁ బ్రకాశింపదు. కావున నీవు లక్ష్మీసహితుండవయినచ్చి మమ్ము రక్షింపుము."అనిపలికి విరమించె. అంత లోకపాలురరుదెంచి కరుణాలవాలుఁడగు నాశ్రీలోలునకు నమస్కరించి యిట్లనిరి."దేవా! వాఙ్మానసగోచరుండవు కాకపోయినను నీవు మాలోచనములకు గోచరమ్మయేయుందువు. కాని దేహాత్మాభిమాను లేకారణమున శరీరము నాత్మగాఁదలంచుచున్నాఁడో యది మాయానామకమగు నీవిచిత్రశక్తియే. అనాత్మయయినదేహాదులం దాత్మభ్రమకలుగుటగూడ నాకారణము భగవన్మాయయేకదా! మఱియు నీమాయ తనకంటెను బురుషునికంటెను విలక్షణుఁడవయిన నిన్నును బంచభూతోపలక్షితుఁడై యుండు జీవునిగాఁ జూపును. అట్లు నీమాయ మాకు భ్రమకలిగించుచుండ నీస్వరూపము నెట్లుగాఁ గనుఁగొందుము? అట్టిమాయ నతిక్రమించినఁగాని నీస్వరూపమరయలేము. మాయంపు దయయుంచి మమ్ము మాయాతీతులనుగాఁ జేసితివేని యప్పుడు నీదివ్యనుందరవిగ్రహముంగని నంత

సంబును, సౌఖ్యంబును బొందుదు"మని నుతించి యూరకుండిరి. అంతయోగీశ్వరు లరుదెంచి స్వామిపాదకమలముల కభినందనంబు లుచేసియిట్లనిరి."ఓమహానీయా! ఈచిదచిదాత్మకమయిన ప్రపంచమంతయు నీకు శరీరీభూతముకదా? శరీరిభూతమయిన ప్రపంచముకంటె నతిరిక్తుడవయినయీయం దేపురుషుడు తన్నుఁ బృథగ్భూతునిగాఁ జూడకతాను బరమాత్మశరీరిభూతుఁ డయినట్లును, దచ్ఛరీరమునకంటె వేఱుగా నుండనట్లును భావించుచుండునో, అట్టితత్త్వదర్శియగు పురుషునికంటె నీకుఁబ్రియతరుఁడు లోకమందులేఁడు. వానినెంతయుఁ బ్రేమతో నాదరించుచు దువ్వు. ఓవత్సలా! లోకమందుఁ గొందఱు బుద్ధిమంతులు తమ్ముఁ బృథగ్భూతులనుగాఁ జూచికొని భృత్యస్వామిభావము ననలంబించి యసామాన్యమయిన భక్తిని వెల్లడించుచు నిన్నుఁ జేరనచ్చుచుందురు. అట్టివారలను నీవు కరుణారసదృష్టితో నాదరింతువు. మఱియు ననుగ్రహింతువు. ఓదేవా! నీవు ప్రపంచకమునకు సృష్టిస్థితిలయములను గావించుకొఱకు దేవాదిరూపములచే బహువిధములుగాఁ బరిణమించిన మాయవలనఁ గల్పితములయిన జీవరాసులయందఁ దంతరాత్మవై ప్రవేశించియున్న నీకు వందనములను గావింతుము" అని నుతించిరి. అంత వేదపురుషుఁ డిట్లనియె "ఓదేవాదిదేవా! నీవు ధర్మాదిపురుషార్థములకుఁ గారణభూతుఁడవు. హేయగుణరహితుఁడవు. అనంతములయిన కల్యాణగుణములు గలవాఁడవు. నీయందు విలసిల్లుచున్న కల్యాణగుణముల యవధిని నేనే యెఱుంగను తక్కినవారల సంగతి చెప్పనేల? అట్టి మహాత్ముఁడవయిన నీపాదారవిందముల కభివందనములను గావింతుము" అంత నగ్నిహోత్రుఁడు నారా

యణుని సమీపించి నమస్కరించి యిట్లనియె. "ఓజగన్నాథా! నాయందున్న *క్షేజంబంతయు నీ వొసంగినదేకదా! నీయాజ్ఞను బుష్పదామంబుచందంబునం దలయందిడికొని యాగకర్తలచే నింద్రాదులనుగూర్చి ప్రేల్చిన హోమద్రవ్యంబులఁ గొనిపోయి వారలకిర్పించుచుందును. †పంచవిధములయిన మంత్రములచేఁ జక్కఁగఁ బూజింపఁబడువాఁడవును, ‡ పంచవిధాగ్నిరూపుఁడ నయి వర్తించువాఁడవును, యజ్ఞస్వరూపుఁడవు నగునీకు వందనము లాచరించెదను" అని యగ్నినుతించి మిన్నకుండె. అనంతరము బృందారకు లమందానందముతో హరిని సమీపించి నమస్కరించి యిట్లనిరి. "ఓలక్ష్మీనాథా! కల్పాంతమందు సమస్తభువనములను నీయుదరమం దిమిడ్చికొని ప్రళయకాలపయోనిధియందుఁ బ్రకాశించు భుజగేంద్రతల్పమునై శయనించి యూర్ధ్వలోకవాసులమహత్తులచే నుతింపఁబడుచు యోగనిద్రనవలంబించియుండుదువు. అట్టి పరబ్రహ్మమనగు నీ దివ్యసుందరవిగ్రహమును నేఁడు కన్నులారఁ గాంచఁగలిగితిమి. మేము కృతార్థులమయితిమి." అని యూరకుండ గంధర్వులగుఁదెంచి

---

* ఇట అగ్నికేకాక సూర్యాదులకుఁగూడ భగవంతుఁడే తాదృశకాంతి నిచ్చెనని యెఱుంగునది. అందులకుశ్రుతి. 'నతత్రభాతిసూర్యోన చంద్రతారకం నేమావిద్యుతోభాంతికుతోఽయమగ్నిః' 'తమేవభాంతమనుభాతిసర్వం తస్య భాసా సర్వమిదంప్రభాతి' అని యున్నది.

† పంచవిధమంత్రములు—ఆశ్రావయ, అస్తుశ్రౌషట్, యజ, యేయజామహే, వషట్, ఈమంత్రము నుచ్చరించుచు హోమముచేయుదురు.

‡ పంచవిధాగ్నులు—గార్హపత్యము, ఆవహనీయము, దక్షిణము, సభ్యావసథ్యములు.

నారాయణుని చరణకమలంబులకు నమస్కరించి యిట్లనిరి "ఓ జగదీశా! దేవతలు, మరీచ్యాదిమహామునులును, బ్రహ్మేంద్రాదులును, నీయంశంబులవలనను, నంశాంశంబులవలనను జనించుచున్నారు. ఈప్రపంచకము నీకుఁ గ్రీడాపరికరముల నుంచుకొనుపెట్టెవంటిది. ప్రపంచకమనెడి క్రీడాకరండమునందున్న జంతువులనెడి యాటవస్తువులచేఁ గ్రీడించుచుందువు. అట్టి నిరుపమానశక్తివయిన నీపాదముల కభివందనములను గావించెదము." అని నుతించి మిన్నకుండిరి. పిమ్మట విద్యాధరు లేతెంచి యిట్లనిరి. "ఓభగవంతా! నీమాయాబలముచే మానవదేహమును బొంది యహంకార మమకారములచే దేహాదులయందభిమానము కలవాఁడై, సంసారబాధితుండైనను, వేదమర్యాదలఁ జక్రమించి ప్రవర్తించునట్టి దారపుత్రాదులచేఁ దిరస్కృతుండైనను, ప్రకృతిపరిణామరూపములయిన శబ్దాదులం దాసక్తుండైనను, నీకథామృతమును గర్ణపుటములచేఁ ద్రావినచో, వాఁడహంకారాదులను విడిచి ముక్తుఁడయి తీఱును. మోహనివర్తనము గావించి ముక్తిగలిగించునది నీకథామృతము తక్క మఱియొకటిలేదు. ఇట్లు కథామృతముచే సంసారసాగరమును నివర్తింపఁజేసెడినీ కభివందనములను గావించుచున్నాము." అని నుతించి భగవద్రూపంబును ధ్యానించుచున్న యవసరంబున బ్రహ్మణు లేతెంచి యిట్లనిరి. "ఓదేవా! నీవు క్రతుస్వరూపుఁడవు. నీవే పురోడాశాదికమవు. నీవే హోమద్రవ్యముల భస్మముచేయుచున్న పావకుండవు. యాగసాధనము లనఁబడు పరికరమంతయు నీస్వరూపమే. సదస్సులు ఋత్విజులు నీస్వరూపులే. మఱియు దంపతీస్వరూపములనొంది వారొనంగుచున్న క్రతుభాగ

ములను నీవే యింద్రాదిదేవతారూపములనొంది స్వీకరించు చున్నాఁడవు. పూర్వకాలమునఁ బాతాళమునంటియున్న భూతలమును నీవు సూకరావతారముదాల్చి మదగజము తనతుండాగ్రముచేఁ దామరలతెను జలమునుండి యుద్ధరించునట్లుగా నీదంష్ట్రాగ్రముచే భూదేవి నుద్ధరించితివి. నీ వట్లు చేయనిచో యాగార్హమయినస్థలమే లభింపకపోవును. ఓ వేదస్వరూపుఁడా! యాగమవు, హోతవు, కర్తవు, భోక్తవు, యాగపరికరమవు, నీవే. నీకంఁటె నన్యమైనదిలేదు. ఓదేవా? భవదారాధనమయిన యాగకర్మమంతయుఁ బరిభ్రష్టమయినది. నీ నామము నొక్కమాఱు ధ్యానించి నంతమాత్రముననే యజ్ఞవిఘ్నములన్నియు నాశనముపొందునని వినియున్నాము.అట్లయినను నీవు స్వస్వరూపముతో వచ్చినచో నీరూపమును గన్నులారఁ గాంచి కృతార్థులము కావలెనని తలంచి నీయాగమమును గోరితిమి. యజ్ఞవిఘ్నములన్నియు నశించినవి. యాగాంతరాయముల నశింపఁజేయు నీపాదపద్మములకు నమస్కృతులను గావించుచున్నాము." అని యిట్లునుతించుచుండఁగాఁ గర్మకుశలుఁడైన దక్షుండు వెండియు యాగము నారంభించి రుద్రభాగపురస్సరముగాను నిర్వర్తించెను. ఇట్లు రుద్రభాగ పురస్సరముగాఁజేసిన యాగమును జూచి సర్వభాగ భోక్తయైనను దనభాగముచేతనే సంతసించి నారాయణుండు దక్షున కిట్లనియె. * ఓ బ్రాహ్మణశ్రేష్ఠా!

---

* ఇందులకు మూలము. శ్లో॥ "అహంబ్రహ్మాచ శర్వశ్చ జగతః కారణంపరం । ఆత్మేశ్వర ఉపద్రష్టా స్వయందృగవిశేషణః" అనియున్నది. ఇట బ్రహ్మరుద్రులనుగూడ జగత్తునకుఁ గారణభూతు లన్నంతమాత్రమున వారికి సర్వజ్ఞత్వాదులుగాని సర్వశక్తిత్వాదులుగాని కలవని భావింపరాదు. వారలు

సను స్తహేయములను నిరసించి యనంతకల్యాణగుణములు గలిగి

విష్ణువుచే సృజింపఁబడి యతఁ డొసంగినజ్ఞానముచేతనే సృష్టిప్రళయములను జేయుచున్నారు. ఈయర్థము "అహంబ్రహ్మోచ శర్వశ్చ జగతఃకారణం పరం" అనుదానివలనఁ దెలియఁబడుచున్నది. ఈయర్థము శ్రు॥ "అనేనజీవేనాత్మనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" అనఁగా జీవాత్మరూపమునఁ బ్రవేశించి నామరూపములను జేయుచున్నాను. "యోబ్రహ్మాణం విదధాతిపూర్వం యోవై వేదాంశ్చ ప్రహిణోతితస్మై" అనఁగా నెవఁడు బ్రహ్మనుసృజించి వేదముల నతనికుపదేశించెనో, ఇత్యాదిశ్రుతులచేతను, స్మృతి "ఏతద్విభూతయోశ్చైవ ప్రసాదక్రోధసంభవౌ । మదాదర్శిత పంథానౌ సృష్టిసంహారకారకౌ । సృష్టింతతఃకరిష్యామి త్వామావిశ్యప్రజాపతే" ఇత్యాది స్మృతులచేతను గూడ స్పష్టమగుచున్నది. ఓయీ! పాలకరూపమగు నధికారమును బట్టి విష్ణువైట్లు జగంబునకుఁ గారణమగుచున్నాఁడో, యట్లె బ్రహ్మరుద్రులు గూడ సృష్టిలయాధికారములచే జగంబునకుఁ గారణములగుచుండ సమస్తప్రపంచమునకును నేవలను నారాయణుఁడొక్కఁడే కారణమనుటెట్లు? ఒక్కనారాయణునకేకాక చక్కినవారికిఁగూడఁ గారణత్వమున్నట్లు శ్రుతులవలనఁగూడ దెలియవచ్చుచున్నది. "బ్రాహ్మణోవై సర్వా దేవతాఃవ" "నకిరింద్రత్వదుత్తరఃవ" "అగ్నిస్సర్వాదేవతాఃవ" "ఏకఏవరుద్రఃవ" "సోమఃపవతేజనితామతీనాం జనితాపృథివ్యాఃజనితాగ్నేర్జనితా సూర్యస్య జనితేంద్రస్య జనితోతవిష్ణోఃవ" "ఆపోవాఇదగ్ంసర్వం" ఇత్యాదిశ్రుతులచే బ్రాహ్మణులు, రుద్రుఁడును, నింద్రుఁడును, నగ్నియునుగూడ సమాభ్యధికరహేతులయినట్లు లక్కఁడక్కఁడఁ బ్రతీతిగలుగుచున్నది. ఇట్లుండ నారాయణుఁడే సర్వోత్తముఁడనియు జగత్కారణమనియు నుడువుటయెట్లు? అని శంకింపఁబనిలేదు. నీవుచెప్పిన ట్లచ్చటచ్చట బ్రాహ్మణాదులు ప్రత్యేకముగాఁ గారణులగుచున్నట్లును వారు తమతోసమానులుగాని తమకంటె నధికులుగాని లేరని ప్రతీతిగలుగుచున్నను జగత్కారణత్వాదు లంగీకరింపరాదు. బ్రాహ్మణాగ్నీంద్రాదులకంటెఁ బరుఁడగు

మీపంటివారిచే నుతింపఁబడుచు, నందఱికంటె నధికుండనై యు

పరమాత్మయంచుమాత్రమే జగత్కారణత్వాదులున్నట్లు తెలియవచ్చుచున్నది. కావున నే వేదాంతభాగములందు సృష్టినిగూర్చికాని ప్రళయమునుగూర్చికాని చెప్పుచున్నప్పుడు స్వరూపముచేతను గుణములచేతను నేబ్రహ్మము సర్వముకంటె గొప్పదియో యాబ్రహ్మమే సృష్టిస్థితిలయములకు సముదాయకారణమని తలంచియే సూత్రకారుండు "జన్మాద్యస్యయతః" అనిచెప్పియున్నాఁడు. అనఁగా ప్రపంచముయొక్క సృష్టిస్థితిలయము లెవనివలనఁ గలుగుచున్నవియో యాబ్రహ్మమును దెలియవలయునని చెప్పెను. కావున నిట్టి కారణవాక్యములందొక్క నారాయణునికే కారణత్వాదులంగీకరింపఁబడుచున్నవికాని తక్కినవారి కంగీకరింపలేదు. మఱియు సృష్టిప్రళయములను బ్రహ్మరుద్రులు చేయుచున్నట్లు కానవచ్చుచున్నను బ్రహ్మరుద్రశబ్దంబులును వారలు శరీరముగాఁ గల నారాయణునియందె పర్యవసానము లగుచున్నవి. ఇంతియకాక సృష్ట్యాదులకుఁ బ్రత్యేకముగా బ్రహ్మరుద్రుల నంగీకరింపక వారలు శరీరముగాఁగల నారాయణుఁడే యంగీకరించినట్లు-శ్రు॥ "యతోవాఇమానిభూతానిజాయంతే" "యేనజాతానివర్ధంతి యత్ప్రయంత్యభిసంవిశంతి తద్బ్రహ్మేతి" అని శ్రుతిచెప్పుచున్నది. ఎట్లనగా, ఎవనివలన నీభూతములు గలుగుచున్నవో, ఎవనివలనఁ బెరుఁగుచున్నవియో, ఎవనివలన నశించుచున్నవియో, ఎవనిఁ బ్రవేశించుచున్నవియో, యట్టిబ్రహ్మమును దెలిసికొమ్మని యర్థము చెప్పవలసియున్నది. ఇచ్చట నన్నివాక్యములందును గల యచ్ఛబ్దంబులకు నన్నింటికి నొక్కతచ్ఛబ్దముతోనే సంబంధముకాని ప్రత్యేకముగా (అనఁగా నెవనివలన నీభూతములుగలుగుచున్నవియో యాబ్రహ్మమును, ఎవనివలనఁ బెరుఁగుచున్నవియో యాబ్రహ్మమును, ఎవనివలన లయమును బొందుచున్నవియో యాబ్రహ్మమునని) తచ్ఛబ్దంబులతో సంబంధము చెప్పియుండలేదు. కావున నారాయణునికే సముదాయకారణత్వము కలదుకాని బ్రహ్మరుద్రులకు లేదు. ఓయీ! 'అహంబ్రహ్మేచశర్వశ్చ జగతశ్కారణంపరం' అని బ్రహ్మరుద్రులుగూడ జగత్కారణులని చెప్పఁబడు

న్న నేనును, నేను వారలందు నంతరాత్మగాఁ బ్రవేశించుటచేత

చుండ నారాయణుఁడే కారణమని యెట్లు చెప్పెదవు? అని శంకింపకుము. లోకములో నొకరాజు సేనానాయకుఁడు యుద్ధముచేసి జయముగొన్నచో నది రాజునకే చెల్లును. ఓడినచో నాయోధులమియు రాజునకే చెల్లును. అట్లె బ్రహ్మరుద్రులు నారాయణునాజ్ఞను శిరసావహించి సృష్టిలయంబులఁ జేయుచుండుటచే సృష్టిలయక ర్తృత్వము లాబ్రహ్మరుద్రుల కధీశుఁడగు నారాయణునకే చెల్లును. ఓయీ! "జన్మాద్యస్యయతః" అనుసూత్రములో సృష్టిక ర్తృత్వ కలవాఁడనియు, స్థితిక ర్తృత్వము కలవాఁడనియు, లయక ర్తృత్వము కలవాఁడనియు బ్రత్యేకముగా లక్షణములుచెప్పుటచే నాలక్షణములకు లక్ష్యమయిన కారణవస్తువుకూడ నానావిధమై యేలకాదు? అని యనరాదు. జన్మాదిసూత్రములో "యతోవాఇమాని" అను శ్రుత్యర్థమును బురస్కరించుకొని సృష్టి స్థితిప్రళయక ర్తృత్వము కలవాఁడు బ్రహ్మమని సముదాయమునకే లక్ష మంగీకరింపవలయునుగాని యొకొక్కదానికి లక్షణత్వ మంగీకరింపరాదు. ఒకొక్కదానికే లక్షణత్వ మెంపఁగొనినచో నొక్కసృష్టిక ర్తృత్వమున లక్షణముగాఁజెప్పిన జాలుచుండఁగా దక్కిన స్థితిలయములనుగూడ "జన్మాది" యను సూత్రములో గ్రహించుటయే వ్యర్థముకాపచ్చును. కావున సృష్టి స్థితిలయ సముదాయకారణత్వమే బ్రహ్మమునకు లక్షణమని యెఱుంగుఁది. ఓయీ! సముదాయమునకు లక్షణత్వ మేలచెప్పవలయును? కేవలము సృష్టిక ర్తృత్వము బ్రహ్మమునకు లక్షణమని చెప్పినను జాలును. మఱియు గంధముగల పదార్థ మెల్లను భూమియని చెప్పినప్పు డాగంధగుణము జలాదులందుఁగూడఁ జొప్పడినచో జలాదులం దీలక్షణము లేకుండునిమిత్తము మఱియొకవిశేషణము వేసికొనవలసియుండును. అంతియకాని జలాదులందుగంధములేనప్పుడు వేఱొక విశేషణమును జేర్చుట వ్యర్థమేకదా? అట్లె ప్రస్తుతము సృష్టిక ర్తృత్వము బ్రహ్మమునకు లక్షణమని చెప్పినప్పు డాసృష్టిక ర్తృత్వము మఱియొకరీయందుఁ గూడఁ జొప్పడినచో నాలక్షణ మట్టిస్థలంబులఁ బట్టకుండుటకై స్థితిక ర్తృత్వ

ను, నాచేత సృజింపఁబడిన వారగుటచేతను, సృష్టి ప్రళయము

ముతోఁగూడిన సృష్టికర్తృత్వములక్షణమనిచెప్పవలయుండును. కానిజగ
దుత్పత్తికి నిమిత్తకారణము నుపాదానకారణమునగుపస్తువుమాత్రమే కటిలేదు.
కావునసృష్టికర్తృత్వమనిచెప్పటచేతనేలక్షణము వ్యభిచరింపకుండనుండఁగా
నిత్తువిశేషణముల చేర్చుట వ్యర్థమేకదా. అట్లయిన "జన్మాది" యనుసూత్ర
మున సముదాయమునకు లక్షణముఁజెప్పుటవ్యర్థము. కావునఁబ్రత్యేకముగానే
పూర్వోక్తములఁ జెప్పవలయును. అట్లుచేసినచో లక్షణము నానావిధమగును
గాన లక్ష్యమగుకారణవస్తువుగూడనానావిధములుగావలసివచ్చును. అనియడి
గెదవేనిచెప్పెదవినుము. జన్మాదిసూత్రమునసృష్టికర్తృత్వముబ్రహ్మమునకు
లక్షణమని చెప్పిననుజాలును. అయినను "యతోవాఇమాని" అనుశ్రుతి నను
సరించిసముదాయమునకేలక్షణమంగీకరింపఁబడినది. ఇంతియకాకయొకలక్ష
ణముచెప్పినప్పుడుదానికిలక్ష్యమగుపదార్థమెట్టిదియోయెఱిగియుండవలెను.
తట్టిపదార్థము మఱియొకటి గలదనుశంకగూడలేకుండవలయును. "గంధము
గలపదార్థమంతయుఁ బృథివికిఁ జేరినదే" యని చెప్పినప్పు డీలక్షణమునకు
లక్ష్యమగుపృథివీపదార్థమెట్టిదియోయెఱిగియుండవలెను. గంధముగలదిపృథి
వియేకాక జలాదులుగూడఁగలవను శంకలేకయుండవలెను. ఇట్లులక్ష్యాకార
పృథివీజ్ఞానమును లక్ష్యముకానిజలాదివిషయకజ్ఞానమునాఁబడునీరెండునులేని
చో లక్ష్యాకారనిశ్చయము గలుగనేరదు. అట్లె జన్మాదిసూత్రములోఁ సము
దాయమునకు లక్షణముచెప్పక ప్రత్యేకముగాలక్షణముచెప్పినచోలక్ష్యాకార
జ్ఞానమును గలుగదు. విపరీతజ్ఞానశంకయుఁ దొలఁగదు. ఎట్లన, సృష్టికర్తృ
త్వము బ్రహ్మమునకు లక్షణమన్నచో సృష్టికరణత్వముచెప్పఁబడినను, స్థి
త్యాదికారణము చెప్పఁబడకపోవుటచే స్థిత్యాదులకుఁ దగినసర్వజ్ఞత్వము
అనంతశక్తిత్వము మొదలగు గుణములు బ్రహ్మమునం దున్నట్లుదెలియరాదు
అట్లు తెలియనిచోసృష్టికారణముఁడగుబ్రహ్మముకంటెస్థితిలయకారణమయిన
మిక్కిలి గొప్పపదార్థము మఱియొకటి గలిగియుండునని సందేహముకలుగక

లఁ జేయుటకుఁదగినజ్ఞానమును నావలనఁ బొందుచున్న వారగు టచేతను, నాకుఁ బ్రయోజ్యులైన బ్రహ్మరుద్రులును, నీచరా చరవిశ్వమును రక్షింపను సృజియింపను హరింపనుకారణము నాయమ్మ, మఱియు నేను నాయందు లీనులయి యున్నజీవులకెల్ల

మానదు. అట్టిసందేహము కలుగుచున్నచో నిరతిశయమగు గొప్పతనము కేవలము సృష్టికారణమగు బ్రహ్మమునం దెట్లు గలుగును? అట్టి నిరతిశయమగు గొప్పతనము సృష్టికాలమునందు లేనిచో నాకారణమెట్లు గానుపాసింపఁదగి యుండును? కావున జన్మాదిసూత్రమునసృష్టిస్థితిలయక ర్తృత్వము బ్రహ్మము నకు లక్షణమని యంగీకరింపవలెను. అట్లుచేసినచో బ్రహ్మమునందుసృష్ట్యాదు లకుఁ దగిన సర్వజ్ఞత్వాదిగుణము గలిగియుండు. అట్లున్నచో బ్రహ్మముఁ నిరతి శయమగు గొప్పతనము కలదగును. కానబ్రహ్మముకంటెనిరతిశయమగుగొప్ప తనముగల పదార్థము వేఱొకటిగలదనెడి విపరీతజ్ఞానమునశించి బ్రహ్మమేనిరతి శయమగు గొప్పతనముగల పదార్థమను నిశ్చయజ్ఞానము గలుగును. కానబ్ర హ్మమే యుపాసనకి నుపాసింపఁదగినదని తెలియుచున్నది. ఇంతియకాక ము క్తిలక్షణములలోఁ జేరియేయుండును కాన ముక్తియన్నను,లయమన్ననునొ క్కటెయని స్ఫురించుచున్నది. జన్మాదిసూత్రమునలయక ర్తృత్వము బ్రహ్మము నకుఁ జెప్పినచో లయములోఁ జేరియున్న ముక్తినొసంగఁజాలనివాఁడగును. ఎవఁడు మోక్షము నిచ్చువాఁడో వానినే యుపాసించి పొందవలయునుగాన సృష్టి కారణమగు బ్రహ్మము మోక్షమునీయఁజాలనిదగుటచేనుపాసింపఁదగినది కాదని తెలియుచున్నది. కావున జన్మాదిసూత్రమున సృష్టికారణత్వము మాత్రమె బ్రహ్మమునకు లక్షణముచెప్పినఁజాలియున్ననునిరతిశయమగుగొప్ప తనము గలదని చెప్పుటకును మోక్షప్రదత్వము గలదనిచెప్పుటకును. సముదా యమునకే కారణత్వమంగీకరింపవలసియున్ననుఇప్పుడుసముదాయమునకేలక్ష ణత్వ మంగీకరించుటచే నాలక్షణమునకు లక్ష్యముగూడనేకవస్తువేయని తెలి యుచున్నది. కాన నిదే తగియున్నది.